# ఆది దేవ్
# (ప్రజాపిత బ్రహ్మా
# జీవిత కథ)

విషయ సూచిక

సంపాదకుని పీఠిక
పరిచయము - ఒక అద్భుత జీవిత కథ
ముందుమాట

భాగము 1 - భగవంతుని భాగ్యశాలి రథము
భాగము 2 - మహోన్నత వ్యక్తిత్వము
భాగము 3 - యజ్ఞములో జీవితము
భాగము 4 - కుమార్తెల విజయము
భాగము 5 - భగవంతుని మహావాక్యాలు
ముగింపు

# సంపాదకుని పీఠిక

నేను ఈ మధ్యనే ఒక ఆధ్యాత్మిక సత్సంగంలో పాల్గొన్నాను. సత్యతపై ఏకాధికారాన్ని చాటుకోవడం మతాలకున్న నీచగుణం అని ఒకరు తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. "దారులు వేరైనా గమ్యం ఒక్కటే" అంటూ, ప్రస్తుతం లోకసహజంగా మారిన అభిప్రాయాన్ని అతను పునరుద్ఘాటించారు. నిజానికి, ప్రేక్షకులలో ఎంతోమంది తమ సమ్మతిని తెలుపుతూ తలలూపారు, కానీ మరి కొంతమంది ప్రతికూలమైన అభిప్రాయాన్ని విని బాధపడుతూ సభ నుండి లేచి వెళ్ళిపోయారు. "దారులు వేరైనా గమ్యం ఒక్కటే" అన్న మాట సర్వమత సామరస్యం ఉట్టిపడేదిగా కనిపించినా, ఈ భావము నిజానికి సంకుచిత దృష్టికోణం కలది. జనసమ్మతమైన ఈ భావములోగల కొన్ని ప్రమాదాలను మీకు తెలియజేయడానికి నేను సాహసిస్తున్నాను. నేనిలా ఎందుకు చెప్తున్నానంటే ఆది దేవ్ అను ఈ పుస్తకాన్ని అర్థం చేసుకోవాలంటే ఇటువంటి చిక్కులను అర్థం చేసుకోవడం అవసరం కనుక.

ఒక ఉదాహరణతో నన్ను వివరించనివ్వండి. మీరు ఒక కారులో ప్రయాణిస్తున్నారనుకోండి. ఎరుపు లైటు అంటే ఆగు అనా లేక వెళ్ళు అనా అని మీరు మీ తోటి ప్రయాణికులతో చర్చిస్తుంటే, మరో కూడలి వచ్చేసరికల్లా సరైన జవాబు తెలియడంపై మీ జీవితం ఆధారపడి ఉందని మీకు వెంటనే అర్థమవుతుంది. వీటిల్లో ఒక్కటే సరైన జవాబు అని కూడా మీకు తెలుసు.

ఎరుపు అంటే 'వెళ్ళు' అని ఒక ప్రయాణికుడు వాదిస్తే మరో ప్రయాణికుడు దాన్ని ఖండిస్తూ ఎరుపు అంటే 'నెమ్మది చెయ్యడం' మాత్రమే అని వాదిస్తూ ఉంటే, ఇద్దరిదీ తప్పు అయ్యుండచ్చు, ఇద్దరిదీ సరైన జవాబు కాకపోవచ్చు అని మీరు ఊహించగలరు. మొత్తానికి ఎరుపు అంటే ఆగాలి అన్న వివరణ మీ వద్ద ఉంది. సరైన జవాబు తెలిసినా కానీ మీరు వారి వాదనలను ఓపికగా వింటారు – వారనుకున్నదే సరైనదని, అలాగే చెయ్యాలని వారు ఏ ఆధారంతో అంటున్నారో తెలుసుకోవాలని ఓపికగా వింటారు: ఎందుకంటే వాటి నిజమైన వివరణల ప్రభావం మీ జీవితాలపై ఉంటుంది కాబట్టి.

ఐనా కానీ మీరు, సహనం ఉంది కదా అని అందరి మేలు కోరి మీ అభిప్రాయాలను మీలోనే అణచుకోలేరు కదా. మీరు తోటి ప్రయాణికులకు మీ సలహాను ఇస్తారు – కూడలి దగ్గర ముందుగా కారును ఆపి వచ్చే పొయ్యే కార్లను గమనిద్దాం: ఎరుపు ఉన్నప్పుడు వెళ్ళే కార్లు మరో వాటితో గుద్దుకుంటున్నాయా లేక పోలీసుల చలానా కడుతున్నాయా? ఏ నిర్ణయం క్షేమము అని మీకనిపిస్తుంది? వెంటనే అయినా లేక కొంత సమయము తర్వాత అయినా ఒక తెలివైన నిర్ణయం తీసుకోవడానికి కావలసిన సమాచారాన్ని మీరు సంపాదించగలుగుతారు.

సాధారణమైన ఆధ్యాత్మిక ప్రశ్నల గురించి ఆలోచిస్తున్నప్పుడు, ముఖ్యంగా ఆది దేవ్ చదివేటప్పుడు పాఠకుడు ఇటువంటి మనోస్థితిని స్వీకరించాలని కోరుకుంటున్నాను.

మన ఎదురుగా ఉన్న ముఖ్యమైన ఆధ్యాత్మిక విషయాలకు సమాధానం తెలుసుకునే అన్వేషణలో మన పరిస్థితి కారులోని ప్రయాణికులతో సమానంగా ఉందని చెప్పవచ్చు :

- 'పరమాత్మ' అనేవాడు అసలు ఉన్నాడా, లేడా?
- ఒకవేళ భగవంతుడే ఉంటే, అతనికి/ఆమెకు ఒక వ్యక్తిగత రూపమంటూ ఉందా లేక కేవలం సర్వవ్యాపకమైన శక్తి మాత్రమేనా?
- మానవమాత్రులు ఆత్మను నిక్షిప్తం చేసుకున్న వ్యక్తులా లేక కేవలం చైతన్యం ఉన్న జడ అస్తిత్వములా?
- కాలము రేఖా క్రమమైనదా లేక చక్ర క్రమము కలదా, పూర్వ నిశ్చితమైనదా లేక పరివర్తన చెందేదా?
- ఒకవేళ మనం ఆత్మలమైతే, మనం పునర్జన్మలు తీసుకుంటామా లేక కేవలం ఒక్క జీవిత కాలాన్ని మాత్రమే అనుభవిస్తామా?

- కర్మ సిద్ధాంతము (క్రియ-ప్రతిక్రియ) ప్రకారం ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు కర్మ ఫలితాన్ని అనుభవిస్తారా లేక అసలు ఈ ప్రపంచమే అసత్యమైనదా, హఠాత్తుగా సంభవించినదా?
- తప్పొప్పులను నిర్దేశించేందుకు ఒక పరిపూర్ణ విలువల కొలబద్ద ఏమైనా ఉన్నదా?
- మానవుడు పరిపూర్ణతను సాధించుట సంభవమేనా, సంభవమైతే అందుకు ఒక స్పష్టమైన మార్గమేమైనా ఉందా?

ఈ ప్రశ్నలకు, వీటికి సంబంధించిన ప్రశ్నలకు ఒక వ్యక్తి ఇచ్చే జవాబులను బట్టి అతడు తన జీవితాన్ని గడిపే విధానమును, జీవితము అందించే ప్రతి అనుభవాన్ని ఎలా స్వీకరిస్తున్నాడు అన్నదానిని నిర్ధారించవచ్చు. సరైన జవాబు తెలుసుకోవడం అత్యంత ప్రాముఖ్యము అని వివేకము చెప్తుంది.

ఒకే ప్రశ్నకు రెండు పరస్పర విరుద్ధమైన జవాబులు సరైనవిగా ఉండటం అసంభవం. 'ఐనా కానీ, అది తర్కము మాత్రమే ఎందుకంటే జవాబు తెలుసుకోవటం అన్న విషయమే లేదు. జ్ఞానమునకు మించి అంతా ఆచారానికి, నమ్మకానికి సంబంధించిన విషయము' అని ప్రజలు జవాబిస్తారు.

మనము చేస్తున్న దానికన్నా మనకు తెలిసినది ఎక్కువ. ఇటువంటి సమస్యలకు మానవుని వివేకమును విరివిగా ఉపయోగించినప్పుడు ఎంతో దూరాలకు చేరుకోవచ్చు; అదృష్టం కలిసొచ్చినప్పుడు ఆ వివేకమునకు అనుభవంతోపాటు దివ్య జ్ఞానము కూడా తోడవుతుంది. ఉదాహరణకు, విలువలకు సంబంధించి, ఇంచుమించు ప్రతి ఒక్కరూ, ప్రతి ధర్మమువారూ శాంతిని, సహనాన్ని సుగుణాలుగా ఒప్పుకుంటారు. ప్రజలు వీటిని పాటించనంత మాత్రాన ఆ సుగుణములలోని సత్యత మారదు, వాటిపై ఉన్న విలువ మారదు. అంతేకాక, అన్ని సమాజములకు, నీతి శాస్త్ర సిద్ధాంతములకు ఎటువంటి అభ్యంతరము లేని ఇటువంటి ప్రవర్తనలను మనం పూర్తిగా సంగ్రహించవచ్చు. ఉదాహరణకు, కోపము, బహిరంగ విధ్వంసకారిగా మారితే అది సర్వత్రా నిషిద్ధము. ఒక ధార్మిక వ్యక్తి ఇటువంటి ప్రవృత్తివలన తనకుగానీ ఇతరులకుగానీ నష్టము కలగకముందే తన ఆవేశాన్ని ఆలోచనా పరిధిలోనే భస్మము చేసుకోవటానికి కృషి చేస్తాడు. లోభము, అహంకారము, కామము, సోమరితనము, అసూయ, ద్వేషమువంటి ఇతర దుర్గుణాలకు కూడా ఇదే వర్తిస్తుంది. ప్రేమ, ప్రశాంతత, దయ, సహకారము, నిజాయితి, అణకువ, విశ్వాసము సర్వ సమ్మతమైన సద్గుణాలు. ఇతరుల సావాసంలో మనము మెచ్చేవి, మనలో ధారణ చేసుకోవాలని కృషి చేసేది ఈ సద్గుణాలనే.

కొంత వ్యత్యాసము ఉన్నా, ప్రతి ప్రశ్నకు సంబంధించి ఒక స్పష్టమైన నిరూపణ ఉంది. ఉదాహరణకు, మనము ఆత్మలమా కాదా అన్న ప్రశ్నను తీసుకుంటే, దేహాతీత అనుభవాల నుండి, ధ్యాన స్థితులలో కలిగిన ఆత్మ జ్ఞానంనుండి, గత జన్మల స్మృతులు కలిగిన చిన్న పిల్లల సంఘటనలనుండి, అంతేకాక ఆ ప్రశ్నలోనే ఉన్న తర్క గుణమునుండి (అనగా, శాస్త్రజ్ఞులు కూడా వివేకమును పూర్తిగా భౌతికపరంగా అన్వయింపలేము అని ఒప్పుకుంటున్నారు) ఎన్నో నిదర్శనాలు ఆత్మ తత్వాన్ని నిరూపిస్తున్నాయి. కొంతమంది వైజ్ఞానికులు ఆత్మను నమ్మకపోయినా, వారు ఆ నమ్మకాన్ని వైద్యపరంగా ఉపయోగించకపోగా ఆత్మ ఉనికి అసత్యము అని నిరూపించలేకపోవడం గమనార్హం. నేటి వైజ్ఞానిక విధానము ఎంతవరకు చేరుకున్నదంటే, పూర్తిగా భౌతికపరమైన న్యూరోఫిజియాలజిస్టులు కూడా మనసును కేవలం నాడీమండల వ్యవస్థతో మాత్రమే వివరించడం అసంభవం అని ఒప్పుకుంటున్నారు.

డెకార్టస్ వంటి శాస్త్రజ్ఞులు, భారతదేశ ప్రాచీన ఋషులు ఆత్మ స్వరూపాన్ని తార్కికంగా వివరించడానికి ప్రయత్నించారు. నిరాకారి అయిన ఆత్మ, కేవలం అతి సూక్ష్మమైన బిందువు మాత్రమే. ఆత్మ ఒక మెరిసే ప్రకాశము. అయినా కానీ అది దానిలో ప్రతి అనుభవాన్ని భద్రపరుచుకోగలదు. ప్రాచీన ఈజిప్టువాసులు, పైథాగరస్ మతస్థులు, ఎస్సెనులు, సెయింట్ అగస్టైన్‌తో సహా పూర్వ క్రైస్తవులు ఇందుకు సమ్మతులు. భారతదేశపు మహా జ్ఞానులైన రామానుజాచారి మరియు మధ్వాచారులను ఇందులో లెక్కించవచ్చు. మృత్యువుదాకా వెళ్ళి తిరిగి వచ్చిన ఎంతోమంది సామాన్య జనుల

అనుభవం కూడా ఇదే.

ఈ సిద్ధాంతాల అనుసారంగా, పరమాత్మ అనేవారు ఒకవేళ ఉంటే, వారికి కూడా ఇటువంటి రూపమే ఉండి ఉండాలి. పరమాత్ముని ఉనికిని కొన్ని శతాబ్దాలుగా వైజ్ఞానికులు ఎన్నో అద్భుత నిదర్శనాలతో నిరూపిస్తూ వచ్చారు. సెయింట్ ఏన్సలమ్ ఇచ్చిన తర్క భేద వాదన ఇందుకు ఉదాహరణ (ఇప్పటికీ ఎందరో వైజ్ఞానికులు దీనిని ప్రామాణికమైనదిగా భావిస్తున్నారు), కానీ ఇవి ఏవీ మనిషికున్న పూర్వ నమ్మకాలను మార్చలేకపోయాయి. తర్కానికి అతీతంగా, ఏది ఏమైనా, అనుభవం అనే పాఠం ఉండనే ఉంది. ఎంతోమంది "అంతర్లీనమైన సంధానము" ద్వారా పరివర్తన చెందారు. దీనినే పరమాత్మునితో బుద్ధిని జోడించడము (దీనినే కొందరు టెలిపతి అని అంటారు) అని అనవచ్చు. ఇదే రాజయోగము. సర్వ ధర్మాలకు పునాది ఇదే. విజ్ఞానపరంగా, పాఠకుడు తనకు తానే శోధన జరపవచ్చు. అతడు తన ఆలోచనా తరంగాలను పరమాత్ముని వైపుకు పంపి ఉత్కృష్టమైన అనుగ్రహం కొరకు, సన్నిహిత ముఖాముఖి కొరకు వేచి ఉండవచ్చు. ఇటువంటి అనుభవాల ఆధారంగానే దీనిని వ్రాయడం జరిగింది.

భగవంతునితో తమకున్న సంబంధం గురించి ప్రజలు గందరగోళం పడ్డప్పుడు వారు కష్టాలను కొని తెచ్చుకుంటారు. ఇది ఆలోచించాల్సిన విషయము. ఈ రోజు ప్రపంచం మొత్తం కష్టాల వైపు ఉంది. పరమాత్ముని తత్త్వము గురించి మనం గందరగోళంగా ఉన్నామేమో అని ఆలోచించనవసరం లేదంటారా? ఎందుకంటే అధిక సంఖ్యలో ప్రజలు భగవంతుడి గురించి – అసలు లేడు అనయినా అనుకుంటారు లేదా అతడు సర్వవ్యాపి అనయినా అనుకుంటారు. సర్వవ్యాపి అని అనుకుంటే, తార్కికంగా ఆలోచిస్తే మళ్ళీ అతడు లేడు అన్న భావనే వస్తుంది. భగవంతుడి గురించిన గందరగోళ అభిప్రాయాలకు ఇదే కారణమని భావించడం సముచితం. ఒకవేళ భగవంతుడే ఉన్నట్లయితే, అతడే స్వయంగా ఈ స్థూల ప్రపంచంలోకి దిగి వచ్చి ఈ గందరగోళాన్ని తీర్చాలి కదా! ఒకవేళ మన దగ్గర సరైన సమాధానాలు ఉన్నట్లయితే అతడు దిగి రావలసిన అవసరమే లేదు. ప్రస్తుతం విస్తృతంగా వ్యాపించి ఉన్న నమ్మకాలకు, భగవంతుడిచ్చే శిక్షణలకు ఎంతో తేడా ఉంది. ఆ శిక్షణలే నైతిక మరియు ఆధ్యాత్మిక క్షేత్రాలలో ఎప్పటికీ నిలిచి ఉంటాయి. దేవతలవంటి సత్ప్రవర్తన కలిగి ఉండాలని, తన విద్యార్థుల జీవితం పరివర్తన కావాలని భగవంతుడు ఆశిస్తారు. ఉత్తమ గురువు వద్ద అభ్యసించిన ఇటువంటి మానవమాత్రులు ఈ ప్రపంచ పునరుద్ధరణకు నిమిత్తులవుతారు.

ఇటువంటి చారిత్రాత్మక ఘట్టానికి చెందిన మొదటి అంశమే ఈ ఆది దేవ్ కథ. విశాలహృదయంతో దీనిని చదవండి. భువిపై భగవంతుని ప్రస్తుత కర్తవ్యాల గురించిన వాస్తవాలు ఈ పుస్తకంలో వ్రాయబడ్డాయి. దీనికి సంబంధించి మీరు తీసుకునే నిర్ణయాలు మీ జీవితంలోనే అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకోవచ్చు.

ఆర్. షబో

1982

# పరిచయము

## ఒక అద్భుత జీవిత కథ

ఈ పుస్తకంలోని అంతర్భాగాలలో ఒక విశిష్టమైన జీవిత కథ అల్లుకుని ఉంది. ఇది పూర్తిగా హృదయానికి సంబంధించిన కథ. నిర్ద్వందమైన మహత్వాన్ని సరళంగా చాటిచెప్పే కథ ఇది. దీనిని జాగ్రత్తగా చదవండి. మీరు చదవబోయే ఈ కథ నిజానికి ఇద్దరి జీవిత కథ, ఎందుకంటే ప్రజాపిత బ్రహ్మ(ప్రజలకు తండ్రి)గా పేరు సంపాదించిన ఒక సామాన్యుని శరీరంలో ఉన్నది ఒక్క ఆత్మ కాదు, రెండు. ఈ సాకార ప్రపంచంలోకి విశ్వ పిత అయిన పరమాత్మ అవతరించిన గాథ ఇది.

ఇది చదువుతున్నప్పుడు కొంతమంది ఆశ్చర్యపోవచ్చు, మరి కొంత మంది పరిహసించవచ్చు; అసలు భగవంతుడు ఎవరు, అతని అవతరణ ఎందుకు జరుగుతుంది, ఎప్పుడు జరుగుతుంది మొదలైన విషయాలలో అనేక భ్రమలు కలిగిన వారు, నాస్తికులు ఎంతోమంది ఉన్నారు; కానీ మీరు, పాఠకుడిగా, పూర్తిగా చదివే వరకు, వాస్తవాలను అర్థం చేసుకోగలిగేంత వరకు మీ నిర్ణయాన్ని నిలిపి ఉంచండి, అప్పుడే యథార్థము మీ మనసు మరియు హృదయంలోకి దూసుకు వెళ్తుంది.

ప్రారంభంలో ఇది ఒక సామాన్యుని కథ అయినా, ఇది ఒక అసమాన్యుని కథ కూడా. అతను స్వయంకృషితో విజయాలను సాధించిన ఒక వ్యాపారవేత్త, గృహస్థుడు, సమాజానికి అతడు ఒక ఆధారము. ప్రేమతో స్నేహితులందరూ అతడిని దాదా(పెద్దన్నయ్య) అని పిలిచేవారు. అతని వ్యాపార వ్యవహారాలు బాగా వృద్ధి చెంది అతనికి ప్రేమ–గౌరవాలను, దాదా అన్న పేరును తెచ్చిపెట్టాయి. కానీ అతని శరీరంలో భగవంతుని దివ్య అవతరణ జరిగిన తర్వాత, వారి నూతన పాత్రకు సరితూగే ఒక విభిన్న నామము ఇవ్వడం జరిగింది – ప్రజాపిత బ్రహ్మ, లేక ఆది దేవ్, మొట్టమొదటి పురుషుడు. వారు ప్రేమగా బ్రహ్మాబాబాగా, లేదా కేవలం బాబా(తండ్రి)గా గుర్తింపబడుతున్నారు.

కోటానుకోట్ల జనాభా ఉన్న ఈ ప్రపంచంలో భగవంతుడు వీరి శరీరాన్నే తమ సాధనంగా ఎంచుకోవడము ఒక ఆకస్మిక ఘట్టం మాత్రం ఖచ్చితంగా కాదు. భగవంతుడు సర్వజ్ఞుడు, పరిపూర్ణుడు. కనుక, భగవంతుడు బ్రహ్మాబాబాను తన రథంగా ఎంచుకున్నారంటే తప్పకుండా అందుకు కారణాలు ఉండి ఉండాలి, ఎన్నో కారణాలు; ఆ కారణాలు కేవలం బ్రహ్మాబాబా యొక్క ప్రస్తుత జన్మకు మాత్రమే సంబంధించినవి కావు, పూర్తి కాల చక్రంలో వారు తీసుకున్న ఎనభై నాలుగు జన్మలకు సంబంధించినవి. వీరి ఆత్మకు సంబంధించిన భూత, భవిష్య కాలాల గురించి భగవంతుడు స్పష్టమైన జ్ఞానమును ఇచ్చారు; దీని ద్వారా వ్యక్తిగతంగా బ్రహ్మాబాబా ఎంత ఉన్నతమైనవారో అర్థమవుతుంది.

సద్గుణాలను కలిగి ఉండటమే బ్రహ్మాబాబా విశిష్టత కాదు – అన్నిటికీ మించి, వారి సహవాసంలోకి వచ్చిన వారిలో కూడా ఈ గుణాలను తీసుకురాగలగడం వారి ప్రత్యేకత. ప్రేరణాదాయకంగా వ్యవహరించడం వారికున్న సుగుణము. కేవలం వారి జీవిత చరిత్రను చదవడం ద్వారా, మనమూ మనల్ని ఆ దివ్య గుణాలతో నింపుకోవచ్చు; మన జీవితాలను ప్రశాంతంగా, పవిత్రంగా చేసుకోవచ్చు. ఎందుకంటే, బ్రహ్మాబాబా తన ప్రేరణాదాయకమైన జీవితాన్ని మానవులకు ఒక దర్పణంలా అందించారు – మానవుడు పరిపూర్ణతను సాధించవచ్చు, మనస్సు మరియు భావోద్వేగాలపై విజేతగా నిలవవచ్చు, తన విధిని తానే రచించుకోవచ్చు అని నిరూపించిన ఒక అమూల్యమైన కథ ఇది.

– బి.కె. జగదీశ్ చందర్

# ముందు మాట

విశిష్ట కృషి చేసి అనేక విజయాలను సాధించినవారి గురించి, వినూత్న శక్తులను సంపాదించిన విశిష్ట వ్యక్తులను గురించి ఎన్నో జీవిత చరిత్రలు వ్రాయబడ్డాయి. వీరందరికీ భిన్నమైన విజయాన్ని సాధించిన ఒక వ్యక్తి జీవిత చరిత్ర ఇది. ఒక మానవుడి జీవితంలో ఎన్నడూ జరగని ఒక అత్యద్భుతం చోటు చేసుకున్న కథ ఇది.

అపూర్వమైన ఘటనతో ఒక్క ఆ వ్యక్తిలోనే కాక అతని సహవాసములోకి వచ్చిన ప్రతి ఒక్కరిలోనూ సంపూర్ణ పరివర్తన కలిగింది. అతి త్వరలో యావత్ ప్రపంచంలో కూడా జరగబోతుంది. ఈ సంఘటనలోని అమితాశ్చర్యాలు, మనసును సందిగ్ధపరిచే భావాలు ఒక వ్యక్తిని కదిలించివేస్తాయి.

ఈ భౌతిక ప్రపంచంలో నిరాకారుడైన పరమాత్ముని అవతరణ జరిగిన విషయం గురించి మనం మాట్లాడుకుంటున్నాం. ఈ భువిపై అవతరించాలి అని భగవంతుడు ఎందుకు నిర్ణంచుకున్నారు, ఎప్పుడు వస్తారు, ఎక్కడ, ఎలా వారు ఇప్పటికీ నూతన స్వర్గ సామ్రాజ్య స్థాపనకు నిత్యం కార్యాన్వితులై ఉన్నారు – ఈ ప్రశ్నలకు, మరెన్నో ఇటువంటి ప్రశ్నలకు సమాధానములను చెప్పడమే ఈ 'ప్రజాపిత బ్రహ్మ గాథ, ఆది దేవ్' పుస్తక ఉద్దేశ్యము.

తన జీవితాన్ని పూర్తిగా భగవంతుడికి అర్పించడం వలన – తన తనువు, మనసు, ధనమును సమర్పించినందువలన – భగవంతుడి నుండి పొందవలసినదంతా బ్రహ్మబాబా పొందారు. దానికి సరితూగగల ఖజానా మరేదీ లేదు. భగవంతుని సంపద అనంతమైనది, వారి ఔదార్యం అసమానమైనది – కనుక తన వారసత్వం అనే బహుమతిని తనను ప్రేమించే పిల్లలకు, ఈ దైవీ బహుమతిని స్వీకరించదలచిన పిల్లలకు భగవంతుడు ఇస్తున్నారు. జ్ఞానమును, సత్యతను, సుఖసంతోషాలను భగవంతుడు బహుమతిగా తీసుకువస్తారు. మనలోని బలహీనతలను తొలగించి మనల్ని స్వరాజ్య అధికారులుగా చెయ్యడానికి వారు ఈ భువిపైకి వచ్చారు. దుఃఖంతో నిండిన ప్రపంచాన్ని భూతల స్వర్గంగా మార్చడానికి వచ్చారు. స్వయంగా భగవంతుడే విశ్వ నవ నిర్మాణానికి పూనుకున్నప్పుడు అది విఫలమయ్యే సమస్యే ఉండదు కావున మీరు నమ్మకంగా ఉండవచ్చు. ప్రపంచ చరిత్రలోనే ఇది ఒక అద్భుతమైన ఘట్టము. పూర్తి కాల చక్రంలో భగవంతుడు వచ్చే ఏకైక సమయమిదే. ఇప్పుడు భగవంతునితో ప్రేమపూర్వక సంబంధాన్ని ఏర్పరచుకునే అవకాశాన్ని చేజార్చుకుంటే ఇంతకన్నా పెద్ద దుఃఖము మరొకటి ఉండదు.

భగవంతుడు అశరీరి. అతడు జ్యోతి స్వరూపుడు. ఒక దివ్య ప్రకాశము. ఈ భౌతిక ప్రపంచ హద్దులకు దూరంగా ఉన్న పరంధామము వారి నివాస స్థానము. ఆత్మల ప్రపంచము, బ్రహ్మలోకము, నిర్వాణధామము, శాంతిధామము అని ఈ స్థానానికి అనేక పేర్లున్నాయి. ఈ ప్రపంచ నాటక రంగస్థలముపై మన పాత్రలను అభినయించటానికి పైనుండి వచ్చి ఈ దేహములో ప్రవేశించక ముందు మన నివాసస్థలముకూడా అదే. జనన మరణ చక్రమునుండి అతీతమైనవారు ఒక్క భగవంతుడు మాత్రమే. ప్రపంచమును నరకమునుండి స్వర్గముగా పరివర్తన చేసే అద్భుత కార్యము కొరకు భగవంతుడు సామాన్యరీతిలో జన్మ తీసుకోరు. భగవంతుడు ఒక శరీరాన్ని అప్పుగా తీసుకుంటారు, అది వానప్రస్థావస్థలో ఉన్న ఒక మానవ శరీరము. నిజాయితీపరుడు, ప్రభుప్రియుడు, అన్నింటికీ మించి – భగవంతుని శిక్షణలను అర్థం చేసుకోగలిగి, వాటిని ఆచరణలోకి తీసుకురాగలిగిన ఒక తెలివైన వ్యక్తి శరీరాన్ని భగవంతుడు ఎంచుకుంటారు, వినియోగిస్తారు.

కానీ భగవంతుని మాధ్యమముగా సేవలను అందించగలుగుతున్న ఈ విశేష ఆత్మ ఎవరు? ప్రపంచమంతా ఇంకా అతని గురించి ఎందుకు వినలేదు? నిజానికి, భగవంతుని స్వర్గ స్థాపనాకార్యము ప్రస్తుతం గుప్తరీతిలో, విశ్వమంతా శాంతిపూర్వకంగా, వేగవంతంగా జరుగుతుంది. తమలోని వికారీ అంశాలను తుడిచి వెయ్యడానికి కట్టుబడి ఉన్న ఆత్మలు కామము, క్రోధము, లోభము, మోహము, అహంకారాలను వదిలి తద్వారా సుఖశాంతులు నిండిన ప్రపంచ స్థాపనకు దూతలుగా అవుతున్నారు. రాబోవు ప్రపంచం కేవలం బాహ్య ప్రశాంతతకు మాత్రమే ప్రసిద్ధి చెందినది కాదు. అక్కడి వారు సహజ ఆత్మాభిమానులు, గుణ సంపన్నులు, అహింసావాదులు, సభ్యతతో ఉండువారు. ఒక్క మాటలో చెప్పాలంటే వారు దేవతలు.

5000 సంవత్సరముల క్రితం ఈ భూమి అనుభవించిన స్వర్ణిమయుగమే ఇప్పుడు రాబోతున్న ప్రపంచం ఎందుకంటే కాలము చక్రము వంటిది. ఆ స్వర్ణిమ యుగము తర్వాత, అటువంటి స్వర్గములో ఉన్న దేవీ దేవతల కథలు వివిధ సంస్కృతులలో పుట్టుకు వచ్చాయి. మనిషి పతనం కాక ముందు జరిగిన కథ అది.

సంపూర్ణ దేవతల భూమిగా ఉన్న ప్రపంచము ఇప్పుడు నరకప్రాయంగా, హింసాయుతంగా మారేసరికి కాలగమనము 5000 సంవత్సరములు గడిచింది. తమ మనస్సులో, పరస్పరంలో ఘర్షణ పడుతూ నేటి మానవుడు దుఃఖాన్ని తాళలేక ముక్తిని ప్రసాదించమని భగవంతుడిని వేడుకుంటున్నాడు. పిల్లల మొర విని భగవంతుడు స్పందించారు – ఇదిగో, ఇప్పుడే స్వర్గ ద్వారాలు తెరుచుకోవడానికి కావలసిన అంతిమ తయారీలు జరుగుతున్నాయి. పాప జ్వాలలలో ఈ నరకం దహించుకుపోతుంది.

సరిగ్గా ఇటువంటి సమయములోనే ఒక మానవుడు భగవంతుని రథముగా మారిన పాత్ర కనిపిస్తుంది. మొట్టమొదటి సద్గుణ సంపన్నుడు, అతి త్వరలో క్రొత్త ప్రపంచములో దేవతగా అడుగు పెడతాడు, వీటన్నింటికీ మనమే సాక్షులం.

నిరాకారుడైన శివ పరమాత్మ గురించి మనకు అనుగ్రహింపబడిన దివ్య జ్ఞానము అత్యద్భుతమైనది. శివ అనగా విశ్వ కళ్యాణకారి అని అర్థం. వారు పరిపూర్ణ నిస్వార్థ సేవాధారి. శివబాబా ఈ భూమి మీదకు స్వర్గ స్థాపన కొరకు వచ్చినా వారు మాత్రం ఆ స్వర్గంలోకి రారు. మానవ విశ్వ వృక్షానికి వారు బీజం వంటివారు, కానీ దాని ఫలాన్ని మాత్రం వారు ఆస్వాదించరు.

# భాగము 1

# భగవంతుని భాగ్యశాలి రథము

## సింధ్ సమాజము

మన కథ 1930 కాలములో, పశ్చిమోత్తర భారతదేశంలోని సింధ్ సమాజములోనిది. ఉన్నతమైన హిందువుల ధార్మిక ఆచారము ఆ సమయానికి పూర్తిగా దుర్దశకు చేరుకుంది. విదేశీ రాయబారుల ప్రవేశం కారణంగా భారతీయ నాగరికతపై పాశ్చాత్య సంస్కృతి ప్రభావము చాలా పడింది. అప్పటినుండి జీవన విధానంలో మార్పు ప్రారంభమయింది. మొదట్లో ఆ మార్పు అగోచరంగా ఉన్నా ఆ తర్వాత అది ఎంతో స్పష్టంగా, అతి ఘోరంగా మారింది. ఉన్నతమైన సింధ్ సమాజ సభ్యత పడిపోవడం మొదలైంది.

వారి ఆచార వ్యవహారాలు మారిపోసాగాయి. ఉదాహరణకు, ఒకప్పుడు అతి పవిత్రంగా(సాత్వికంగా) భక్తి భావనతో తయారుచేసిన తాజా శాకాహార భోజనాన్ని వారి ఆచార పద్ధతులతో దేవతల స్మృతిలో స్వీకరించడం, ఎంతమంది ఉన్నా అందరితో సన్నిహిత పారివారిక బాంధవ్యాలు కలిగి ఉండటం వంటి ఆచారాలు నెమ్మదిగా అపవిత్రమవుతూ వచ్చాయి. మనిషి మాంసాహారిగా మారాడు. హడావుడిగా, అశ్రద్ధగా, అమితంగా తినడం ఎక్కువైంది. శుద్ధమైన గుణాలు కలిగిన వారు అవివేకులుగా, పైశాచిక ప్రవృత్తి కలవారిగా మారారు.

ప్రజలు భక్తి చేసేవారు, కానీ పండుగలు పరమార్థం లేక బోసిపోయాయి. మనుషుల మనసు ఇప్పుడు ధన వ్యామోహంతో, పదవీ కాంక్షతో నిండిపోయింది. వ్యాపార వ్యవహారాలలో మోసం రివాజుగా మారింది. ప్రతి సంబంధంలోనూ క్రోధం భగ్గుమనేది. ఒకప్పుడు ఆధ్యాత్మికత, భక్తి భావనలతో నిండి ఉండే మాటలు ఇప్పుడు వారి అత్యాశలు, ప్రాపంచిక కోరికలు, ఈర్ష్యాద్వేషాలతో నిండిపోయాయి. క్రొత్త పద్ధతులు పుట్టుకు వచ్చాయి. కేవలం ఆడంబరాల కోసం అనవసరమైన, ఖరీదైన వస్తువులను కొనడం, అర్థంలేని ఖర్చులతో, అధిక ధనవ్యయంతో హంగామాలు చెయ్యడం పరిపాటి అయిపోయింది.

ప్రపంచంలోనే అతి ప్రాచీన, ధార్మిక, ధృఢమైన సంస్కృతి కలిగిన భారతదేశ సమాజాన్ని ఈ క్రొత్త పద్ధతులు తినేస్తున్నాయి. మానవవృక్షంపై మొలిచే క్రొత్త చిగుర్లు కూడా ఈ విచ్ఛేదము నుండే ప్రయాణిస్తున్నాయి అన్న విషయం తెలిసిందే. ఎందుకంటే వీరికి ఒకప్పటి సమయము, సభ్యతల ఆధారము లేదు. మానవుని కార్య సాధనకు కావలసిన పునాది ఇప్పుడు పూర్తిగా కదిలిపోయింది. గుర్తించలేకపోయినా, ప్రపంచం ఇప్పుడు అంతిమ దశకు చేరుకుందనే చెప్పాలి.

మనుష్యులను తిరిగి పరిపూర్ణత వైపుకు నడిపించేవారు ఎవరున్నారు? స్వార్థ ప్రయోజనాలే తప్ప ప్రజల ఉన్నతిని పట్టించుకోని నేతలు మార్గదర్శన చేయలేరు; జనులకు సహాయం చేయకపోగా వారిని పీడించిన ఆంగ్లేయులు చేయలేరు; భారతదేశ స్వాతంత్ర్యానికి పాటుపడినవారు కానీ, భ్రష్టాచారము మరియు వికారాలనుండి విముక్తి సాధించటానికి స్వల్ప కృషిని అందించిన అతి కొద్దిమంది సంఘ సంస్కర్తలు కానీ – వీరెవ్వరూ మార్గదర్శకులుగా వ్యవహరించలేరు.

మరి మత గురువుల మాటేమిటి? పూజారులు, పండితులు, ఉపదేశకులు ప్రజలకు మనశ్శాంతిని, మంచి

నడవడికను, పరివారంలో పవిత్ర జీవితమును కలిగించే జ్ఞాన మార్గమును బోధించడం లేదు. కేవలం శాస్త్ర పఠనం, అర్థరహిత కర్మకాండలు చెయ్యడం వరకే పరిమితమయ్యారు. ఎంతోమంది తమను తాము భగవంతునిగా చెప్పుకుంటూ, భగవంతుడు సర్వవ్యాపి అని అమాయక శిష్యులను నమ్మించారు. ఇటువంటి సిద్ధాంతాలు మనిషి వివేకాన్ని విజయవంతంగా నాశనం చేసాయి. వారి లక్ష్యాలను, జీవిత గమ్యాలను తుడిచి పెట్టేసాయి. ఒకవేళ మనం నిజంగా భగవంతుని అంశలమైతే మనం దేని కోసం పాటుపడాలి? జీవితం కేవలం ఒక భ్రమ మాత్రమే అని అనుకున్నప్పుడు పరిపూర్ణత కొరకు ఎందుకు కష్టపడాలి? ఇటువంటి ఆలోచనా విధానమే ధర్మ భ్రష్టతకు అద్దం పడుతుంది. ఇలా మనిషి జీవితం గతి తప్పింది.

భౌతికంగా సమాజము వృద్ధి చెందింది. సింధ్ సమాజములోని పురుషులు బాగా కష్టపడ్డారు. ధనవంతులుగా ఎదిగారు. కానీ శాంతి, నిబద్ధత వారి జీవితాల్లో కరువయ్యాయి. బూటకపు అభివృద్ధి కాళ్ళ క్రింద పడి పరంపరగా వస్తున్న విలువలు నలిగిపోయాయి. ప్రశాంతత రాజ్యమేలిన చోట నేడు దుఃఖము, బాధ తాండవిస్తున్నాయి. బాహ్య ఆడంబరాలతో జీవిత నాణ్యతను కొలవడం ప్రారంభించారు. సాంఘిక వాతావరణమంతా వికారమయం అయిపోయింది.

ముఖ్యంగా స్త్రీల పరిస్థితి, అదీ వివాహం తర్వాత అతి దయనీయంగా తయారయింది. గృహిణులను కేవలం ఇంటిపనిని చూసుకునే దాసీలుగా, వారి భర్తల విషయ వాసనలను తీర్చే యంత్రాలుగా మాత్రమే చూసేవారు. భర్త ఏమీ చెయ్యలేని దద్దమ్మ అయినా, తాగుబోతు అయినా, మాంసభక్షకుడు అయినా, కామవాంఛతో దిగజారి ఉన్నా, ఆచారం ప్రకారం “పతియే పరమేశ్వరుడు” గా భావించడం భార్య బాధ్యత. ఆమెకు అతడే “దైవం”. విడాకుల ప్రస్తావనే ఉండేది కాదు.

ఈ పురుషాధిక్యాన్ని మరింత బలపరుచుకోవటానికి స్త్రీలు విద్యను అభ్యసించటాన్ని అవరోధించేవారు. స్త్రీలు పెద్ద పెద్ద మేలి ముసుగులలో వారి ముఖాన్ని దాచుకోవాలి. తన కుటుంబంవారికి వండి వార్చడం, అంట్లు తోమడం, బట్టలు ఉతకడం – వీటితోనే వారి జీవితమంతా ఇంటి నాలుగు గోడల మధ్య ఖైదు అయ్యేది. ఆధిక్యమంతా పురుషులదే అని వారికి బాగా తెలుసు.

ధర్మ ప్రచారం చెయ్యడానికి స్త్రీలకు ఎటువంటి అధికారము ఉండేది కాదు. అన్ని బంధాలను త్రెంచుకొని సన్యాసుల వలె బ్రహ్మచర్య వ్రత పాలన చేసే హక్కు కూడా లేదు. వివాహము అనే జీవిత ఖైదునుండి వారికి విముక్తి లేదు.

ఇటువంటి అణచివేతకు బలి అవుతున్నది కేవలం సింధ్ సమాజ స్త్రీలు మాత్రమే కాదు. విధ్వంసాన్ని పెంచే ప్రపంచ యుద్ధాలు, అంతఃకలహాలు–అత్యాచారాలు, మైనారిటీల నరమేధము, స్వలాభాల కోసం ప్రకృతి వనరులను హరించడము – ఇటువంటివన్నీ క్యాన్సర్ వ్యాధిలా ఈ భూమిపై పెరుగుతూ ఉన్నాయి. అజ్ఞానమనే చేదు నిద్రలో మానవత్వం గాఢంగా నిద్రిస్తూ ఉండటమే ఇందుకు మూల కారణం. ఎక్కడా ఒక్క జ్ఞాన ప్రకాశ కిరణం కూడా కనిపించటం లేదు. చరిత్రకు పట్టిన కాళరాత్రి సమయము ఇది.

# సాధారణ వ్యక్తి - అసాధారణ వ్యక్తిత్వము

ఇటువంటి అస్తవ్యస్థ సమాజంలో, సింధ్ ప్రాంతంలోని హైదరాబాదు పట్టణంలో అందరిలోకీ విభిన్నమైన వ్యక్తి ఒకరు ఉండేవారు. వారిని అందరూ స్నేహంతో "దాదా" (పెద్దన్నయ్య) అని పిలిచేవారు. వారి పూర్తి పేరు "దాదా లేఖ్‌రాజ్".

వారు పుట్టుకతో సామాన్యులే అయినా, వారిలో ఎన్నో మంచి గుణాలు ఉండేవి. వందమంది వ్యక్తుల మధ్య ఉన్నాగానీ వారిని ఒక్కసారిగా గుర్తించవచ్చు. ఒక దివ్య ప్రకాశము వారిని చుట్టుముట్టి ఉండేది. వారి ప్రేమ, స్నేహము, సుహృద్భావమును ఎవ్వరైనా దూరమునుండే పసిగట్టవచ్చు. శక్తివంతమైన, అయస్కాంతమువంటి ఆకర్షణ కలిగిన వారి కళ్ళను ఎవ్వరూ మర్చిపోలేరు.

సువిశాల ముఖము, కాంతులీనే వర్చస్సు, ఉన్నత మస్తకముతో, ధవళ కాంతి కలిగిన కేశములతో వారు ఎప్పుడూ శుచి శుభ్రతలతో తాజాగా ఉండేవారు. వారు ఎక్కడ అడుగు పెట్టినాగానీ వారి శిష్టాచారము, హుందాతనము, భక్తిభావన వారికి స్నేహితులను, ప్రశంసకులను తెచ్చి పెట్టేవి. దాదాలోని విజయస్ఫూర్తి వారిని సింధ్ సమాజానికి ప్రీతిపాత్రునిగా చేసింది. అనిశ్చిత పరిస్థితులలో కూడా వారు దృఢత్వానికి, నమ్మకానికి మైలురాయిగా నిలిచారు.

మధ్య తరగతిలో జన్మించినప్పటికీ నిరంతర కృషి, నిజాయితీతో కూడిన తెలివితేటలు, సంపన్నుల మధ్య స్థానం సంపాదించాలన్న లక్ష్యం కారణంగా దాదా వ్యాపారంలో అతి త్వరగా ఎదిగి భారతదేశంలోనే సంపన్నులలో ఒకరిగా అయ్యారు. కుటుంబ సభ్యులను, స్నేహితులను, ఇరుగుపొరుగువారిని, వ్యాపార సంబంధీకులను అందరినీ సంతృప్తి పరచగలిగిన అరుదైన గుణం కలిగిన అతి కొద్దిమందిలో వీరొకరు. ప్రజలకు కేవలం పనికొచ్చేవాడిగానే కాక వారి మనసులలో చోటు సంపాదించుకుని, తమ మనసులో కూడా అందరి పట్ల ప్రేమను నింపుకున్నారు దాదా లేఖ్‌రాజ్.

దాదాతో కొద్దిపాటి పరిచయమున్న వారుకూడా దాదాతో సన్నిహితంగా మెలగాలన్న ఆశతో ఉండేవారు. మేము వారి బంధువులగానో, కుటుంబం సభ్యులగానో జన్మ తీసుకుని ఉంటే ఎంత బాగుండును అని అనుకునేవారు.

# లౌకిక కుటుంబం

1876లో సింధ్ హైదరాబాదు ప్రాంతంలో కృపలానీ కులంలో, వైష్ణవ వల్లభాచారి భక్తుని ఇంట దాదా లేఖ్‌రాజ్ జన్మ జరిగింది.

దాదా తండ్రి వృత్తిరీత్యా ప్రధానోపాధ్యాయులు. కానీ అతని కొడుకు మాత్రం వృత్తిపరంగా తన తండ్రి అడుగుజాడలలో నడవకూడదు అని ముందే నిర్ణయించుకున్నారు. దాదా, తమ జీవిత గమనాన్ని ఒక చిన్న గోధుమ వ్యాపారంతో ప్రారంభించారు. తమ స్వల్ప సంపాదననుండి వీలయినంత ధనాన్ని ఆదా చేస్తూ ఉండేవారు. మరింత ఆశాజనకమైన వ్యాపారానికి తాను ఆదా చేసింది సరిపోతుంది అని అనిపించినప్పుడు వారు వజ్రాల వ్యాపారంలో ప్రవేశించారు. స్వాభావికంగానే వజ్రాల నాణ్యతను పరిశీలించడంలో ఇంచుమించుగా గొప్ప నైపుణ్యాన్ని సంపాదించారు. అతి కొద్ది సమయంలోనే వారు వ్యాపారంలో మంచి పేరును సంపాదించి లాభాలను ఆర్జించారు. భారత దేశ రాజా–మహారాజులు, అప్పటి బ్రిటీష్ వైస్రాయ్ అందరూ వీరి వినియోగదారులుగా, స్నేహితులుగా అయ్యారు.

నేపాల్ రాజు మరియు ఉదయ్‌పూర్ రాజు వీరికి విశేష ఆతిథ్యాన్ని ఇచ్చేవారు. దాదాను రాజ దర్బారులో జరిగే సభా కార్యక్రమాలకు ఆహ్వానించి వారికి అత్యధిక గౌరవాన్ని ఇచ్చేవారు. కేవలం వారి వద్దనున్న ప్రకాశవంతమైన వజ్రాల కారణంగానే కాక వారిలో కనిపించే సుగుణాల ప్రకాశము కారణంగా కూడా వారు దాదాకు ఎంతో గౌరవాన్ని ఇచ్చేవారు. దీనిని గురించి రాజ కులానికి చెందిన రాధిక, ఆ తర్వాత బ్రహ్మాకుమారి బ్రిజింద్రగా ఈశ్వరీయ సేవలనందించిన దాదా కోడలు ఈవిధంగా చెబుతున్నారు:

"దాదాతో పరిచయమైన రాజా మహారాజులకు వారిపై ఎంతటి విశ్వాసముండేదంటే, రాజమహలులో ప్రవేశించటానికి ఎవరి అనుమతినీ దాదా తీసుకోనవసరం లేదు. ముందుగా రాజుగారికి కబురు పంపనవసరమూ లేదు. ఇతర వ్యాపారస్థులు రాజును కలవాలంటే ముందుగా వారు తమ వస్తువులను రాజుగారి సెక్రటరీకి ఇచ్చి పంపి రాజుగారి అనుమతి కోసం వేచి ఉండాల్సి వచ్చేది. కానీ దాదా వచ్చినప్పుడు మాత్రం రాజమాత స్వయంగా దాదాను లోనికి ఆహ్వానించి తమ కుమార్తెలకు, కోడళ్ళకు వజ్రాలను చూపించమని నిస్సందేహంగా కోరేవారు. రాజమహలులోని ప్రతి ఒక్కరికీ దాదాలోని ధర్మనిష్ఠ, పవిత్ర స్వభావము గురించి తెలుసు. చాలాసార్లు రాజులు ఇలా అనేవారు – 'లఖీరామ్ బాబూ, భగవంతుడు పొరపాటుగా మిమ్మల్ని కాకుండా మమ్మల్ని రాజులుగా చేసాడు. మీలో అన్ని రాజ లక్షణాలు, శక్తులు ఉన్నాయి.' కానీ నిజానికి  భగవంతుడేమీ పొరపాటు చెయ్యలేదు. ఏక కిరీటం కలిగిన ఈ రాజులు కేవలం పేరుకు మాత్రమే రాజులు. దివ్య రాజ్యాధికారిగా, ద్వికిరీటధారిగా(పవిత్రతా కిరీటం మరియు స్వర్ణ మకుటం) అవ్వాలి అని భగవంతుడు దాదాను ప్రేరేపించారు.

"రాజులు దాదాకిచ్చే గౌరవము అపూర్వమైనది. రాజ దర్బారులో ఎటువంటి ఉత్సవాలు జరిగినా దాదాకు విశేష ఆహ్వానము లభించేది. వారికోసం విశేష ఆసనాన్ని తీసిపెట్టేవారు. ఒకసారి మేమంతా(దాదా కుటుంబం) ఉదయ్‌పూర్ రాజు ఆహ్వానం మీద రాజమహలులో ఉన్నాము. ఆరోజు పెద్ద సభా కార్యక్రమం జరగాల్సి ఉంది. అది ప్రారంభమైనప్పుడు, రాజు కూర్చునే గ్యాలరీ ఎదురుగా దాదా కూర్చున్నారు. దాదా పరివారము (దాదా భార్య యశోద శ్రీనాథద్వార మందిరాన్ని దర్శించుకొని ఆతర్వాత సభకు రావాలని నిర్ణయించుకున్నారు, అందుకే మేము దాదాతో వెళ్ళలేదు) వారితో లేకపోవడాన్ని రాజు గమనించాడు. రాజుగారికి దాదాపై ఉన్న గౌరవం ఎంత అపారమైనదంటే వారు సభా కార్యక్రమాలను నిలిపివేసి, ప్రధాన మంత్రివర్యులతో దాదా పరివారమునకు విశేష ఆహ్వానమును పంపించారు. మేము సభలోనికి వచ్చినప్పుడు రాజుగారు మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి, వాయిద్యాల మధ్య మాకు తగు ఆసనమును ఇచ్చారు. మేము శ్రీనాథ

మందిరాన్ని దర్శించాలనుకున్నామని తెలుసుకున్న రాజుగారు సభా కార్యక్రమం తర్వాత మాకు ప్రత్యేకమైన రథాన్ని ఏర్పాటు చేసారు. ఇతర అతిథులెవ్వరికీ అందని ఆతిథ్యం మాకు లభించిందనీ, ఇలా సభా కార్యక్రమాలు ఎప్పుడూ ఆగలేదని రథాన్ని నడిపే వ్యక్తి అన్నాడు."

దాదాకు ప్రాథమిక విద్య ఎక్కువగా లేకపోయినా, స్వ ప్రయత్నముతో సింధీ భాషపై పూర్తి పట్టును సాధించారు. హిందీలో వ్రాయబడ్డ ధర్మ, మత గ్రంథాలను కూడా దాదా చదివేవారు. వీరు గురుముఖీ భాషలో ఉన్న గురుగ్రంథ్ సాహెబ్‌ను బాగా ఔపోసన పట్టారు. వీరు ఆంగ్లభాషను అవలీలగా చదవగలరు. అన్నిటికీ మించి, పత్ర వ్యవహారములో వీరికి ప్రత్యేక నైపుణ్యం ఉండేది. వీరి లేఖా విధానము సంక్షిప్తంగా, సమగ్రంగా, భావం కొట్టొచ్చినట్లు వ్యక్తమవుతూ పాఠకుని మనసులో సునాయాసంగా ఇమిడిపోయేది. సత్యాన్ని ఏదో ఒక రూపంలో స్మరించుకుంటూ ఉండటానికి, అనుభవాల క్షణాలను సొంతం చేసుకోవటానికి దోహదపడే సాహిత్యం మరియు కళలంటే దాదాకు విశేష అభిమానము. వ్యాపార జీవితంలోకూడా, దాదా తమ స్వానుభవంతోనే నగలలో వివిధ వైవిధ్యాలను సృష్టించేవారు. ఇతరుల పనిని వారెప్పుడూ అనుకరించలేదు.

# భక్తి - నిష్ఠ

దాదా బాల్యకాలమునుండి శ్రీ నారాయణుని అనన్య భక్తుడు. శ్రీ నారాయణుడిని స్మృతి చెయ్యడం దాదాకు ఎంత ఇష్టమంటే నారాయణుని చిత్రపటాన్ని దాదా పూజగది గోడమీద, తను పడుకునే దిండు క్రింద, ఆఫీసులోని టేబుల్ సొరుగులో, తన జేబులో పెట్టుకునేవారు. ఇలా తను ఎక్కడికి వెళ్ళినా, ఏ పని చేస్తున్నా ఆ దివ్యమూర్తిని చూస్తూ ఉండగలిగేటట్లుగా ఏర్పాటు చేసుకున్నారు.

బజారులో లభించే నారాయణుని చిత్రపటములో నారాయణుడు విశ్రమించి ఉన్నట్లు, లక్ష్మీదేవి అతని చరణదాసిలా కాళ్ళు పట్టున్నట్లుగా ఉండేది. దాదాకు ఇటువంటి చిత్రం నచ్చేది కాదు. స్త్రీకి తిరస్కార స్థానమునిచ్చిన ప్రస్తుత సమాజానికి దీనిని ప్రతీకగా దాదా భావించేవారు. ఇటువంటి విపరీత ఆలోచన దేవతల మనసుల్లోకి రావడం అసంభవం. స్త్రీలు పురుషులకు ఏమాత్రమూ తీసిపోరు, వారిని పురుషులకన్నా తక్కువగా భావించడం నేరం. ఇటువంటి ఆలోచనలు తారాస్థాయికి చేరుకొని అఖరకు దాదా ఇలాంటి చిత్రాలను తయారుచేసే చిత్రకారుడిని కనుగొని ఆ దివ్య జంట సమ హోదాలలో ఉండేటట్లుగా అతని చేత చిత్రాన్ని తిరిగి చిత్రీకరింపజేసారు.

కాలగమనంలో దాదా భక్తి భావన పెరగడమే కాక, ప్రతి పరిస్థితిలోనూ తమ భక్తి శ్రద్ధలను నిర్భయంగా ప్రదర్శించేవారు. వ్యాపార వ్యవహారాల మధ్య ఉన్నా లేక కుటుంబ కార్యక్రమాలలో ఉన్నాగానీ, నిత్య పూజకు వేళ అయినట్లయితే దానిని ఆచరించటానికి మధ్యలో లేచి వెళ్ళేవారు. ఒక్కరోజు కూడా నిత్య నియమాలను తప్పలేదు. అవసరమైతే ఇతరులకు క్షమాపణ చెప్పి తప్పుకునేవాడే కానీ పూజా నిర్వహణలో మాత్రం తనను తాను మన్నించుకునేవాడు కాదు. ప్రయాణ సమయంలోకూడా నిర్ణీత భగవద్గీత అధ్యాయమును క్రమం తప్పకుండా చదివేవారు. దాదాకు గీతపై పరిపూర్ణమైన విశ్వాసం ఉండేది. దాదా భక్తి శ్రద్ధలను వివరిస్తూ దాదా కోడలు బి.కె. బ్రిజింద్ర ఇలా వ్రాసారు:

"దాదాతో వ్యాపార సంబంధాలు ఉన్న మహారాజులు, సంపన్న వినియోగదారులు, వ్యాపారవేత్తలు తరచుగా దాదా ఇంటికి అతిథులుగా విచ్చేసేవారు. అనేకసార్లు వారు వచ్చే సమయము, దాదా పూజ వేళ ఒకటిగా ఉండేది. అయినా కానీ పూజా కార్యక్రమాన్ని వాయిదా వేయడం కానీ, కుదించి పూజను సమాప్తం చెయ్యడం కానీ చేసేవారు కాదు. అంతేకాక, దాదా తమ జీవిత విధానములో సర్దుబాట్లు చేసుకునేవారు కాదు. ఉదాహరణకు, వారి ఆహార విధానము ఎంతో సాత్వికంగా ఉండేది. దాదా ఇచ్చే విందు భోజనాలలో మద్యం, సిగరెట్లు ఉండేవి కావు. మద్యం, మాంసాహారం లేని ఇటువంటి సాదాసీదా విందులు అలవాటు లేని ధనవంతులు దాదాతో పరిహాసంగా ఇలా అనేవారు. 'దాదా, విందు చాలా చప్పగా ఉంది.' అందుకు దాదా చిరునవ్వుతో, 'మీకోసం మేము మా ధర్మాన్ని పాడు చేసుకోలేము కదా! మీరు మాకు కేవలం కాగితపు నోట్లు మాత్రమే ఇస్తారు, కానీ అందుకు బదులుగా మేము మీకు వజ్రాలను ఇస్తున్నాము" అని అనేవారు. ఇది విని అందరూ నవ్వేవారు."

దాదాకు తీర్థయాత్రలకు వెళ్ళడమంటే మక్కువ ఎక్కువ. వారు తాండూర్, అమర్‌నాథ్, ప్రయాగ, బృందావనం, కాశి మొదలగు క్షేత్రాలను దర్శించుకున్నారు. సాధు సన్యాసులకు తరుచుగా తమ ఇంట్లో ఆతిథ్యం ఇస్తూ ఉండేవారు. ఆ సాధు సన్యాసుల వద్ద ధార్మిక అవగాహన గురించి సంభాషించటంలో మిక్కిలి ఆనందాన్ని పొందేవారు. దాదా సంతృప్తిపరుడు. దాదాకు తమ గురువుల పట్ల అమితమైన విశ్వాసము. వారికోసం, వారి స్వాగతానికి, వారి సత్సంగాలను ఏర్పాటు చెయ్యటానికి, వారి ఆతిథ్యానికి వేలాది రూపాయలను దాదా వెచ్చిస్తూ ఉండేవారు. వారు గురువాజ్ఞకు ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చేవారు. దీనిని గురించి బి.కె. బ్రిజింద్రా వద్ద కనువిప్పు కలిగించే ఎన్నో సంఘటనలు ఉన్నాయి:

"దాదాకు తమ గురువుపై ఎంతో గౌరవం ఉండేది. ఒకసారి, దాదా ఇంటికి గురువుగారు తన శిష్య బృందంతో వచ్చారు. దాదా వారందరినీ ఎంతో ప్రేమతో ఆహ్వానించారు. వచ్చినవారికి పూర్తి సేవలను, సౌకర్యాలను ఏర్పాటు

చేయాలన్న ఆలోచనతో దాదా గులాబి నీటిని ఆర్డరు చేసి తెప్పించారు. ఉదయము, సాయంత్రము వారి విశ్రాంతి గదులలో ఈ గులాబి నీటిని చల్లించేవారు. గురువుగారి గదిలో దాదాయే స్వయంగా గులాబి నీటిని చల్లి అగరుబత్తి కూడా పెట్టేవారు.

“విశ్రాంతి సమయంలో గురువుకు ఏవిధమైన భంగం కలుగుకుండా ఉండేటట్లుగా దాదా పూర్తి జాగ్రత్తలు తీసుకునేవారు. కనీసం వీధి కుక్క వల్లకూడా గురువుగారి విశ్రాంతి భంగం కాకూడదు. దీనికొరకు దాదా ప్రత్యేకంగా ఒక వ్యక్తిని నియమించేవారు.

“అది మామిడికాయల కాలం కాకపోయినా గురువుకి ఇష్టమని వాటికోసం ఊరంతా వెతికించి, తెప్పించి ఇచ్చేవారు. ప్రతి పండు తనకు కొంత పుణ్యం తీసుకువస్తుందని భావించి ఎంతో ప్రేమతో వాటిని ఇచ్చేవారు.

“ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నాకానీ గురువు చెప్పే ప్రతి చిన్న ఆజ్ఞను పాటించేవారు దాదా. ఒకసారి, దాదా మనుమడి నామకరణ ఉత్సవము జరుగనున్నది. విశిష్ట వ్యక్తులందరికీ ఆ సాయంత్రం విందును ఏర్పాటు చేసారు. అప్పుడు అకస్మాత్తుగా దాదాకు తన గురువుగారినుండి టెలిగ్రాము వచ్చింది. ఒక అత్యవసర కార్యం కొరకు వెంటనే దాదాను బయలుదేరి రమ్మని దాని సారాంశం. దాదా తన భార్య యశోదతో ఇలా అన్నారు – ‘విందు కార్యక్రమాలను నిలిపివేసి నా బట్టలు సర్దు, నేను బయలుదేరాలి.’ యశోద ఈ మాటలను నమ్మలేక, ‘ఈ పరిస్థితిలో మీరెలా వెళ్తారు?’ అని అన్నది. అప్పుడు దాదా ‘గురువాజ్ఞ కాలుడి పిలుపుతో సమానం. మృత్యువు వచ్చినప్పుడు నా మనుమడి నామకరణము పూర్తి అయ్యేవరకు వేచి ఉండు అని చెప్పగలమా’ అని అంటూ లోపలకు వెళ్ళారు.

అప్పుడు యశోద, కుటుంబ సభ్యులతో జరిగిన సంగతి చెప్పింది. మేమందరమూ చేసేదేమీ లేక మా స్నేహితులకు, ఆహ్వానితులకు ఫోన్లు చేసి, దాదాకు అత్యవసరమైన పని పడటం వలన బయటకు వెళ్ళవలసి వచ్చింది అని చెప్పాము, మరి గురువు పిలిపించిన ఆ అత్యవసర కార్యమేమిటో? గురువుగారి శిష్యులలో ఒకరు జూదంలో పదివేల రూపాయలు పోగొట్టుకుంటే ఆ పైకము దాదాను ఇవ్వవలసిందిగా గురువుగారి కోరిక! దాదా గురువాజ్ఞను సంతోషంగా శిరసావహించారు.”

దాదా దానగుణాన్ని చాటే ఘటనలు ఎన్నో ఉన్నాయి. దాదా దాన గుణానికి సాటి తన కుటుంబంలోనే ఉన్న అతని పినతండ్రి మూల్‌చంద్ ఆజ్‌వాలా. అతనిది ఏనుగు దంతాల వ్యాపారము. ఎటువంటి స్వార్థం లేకుండా ఇతను పేదలకు దానం చేస్తూ ఉండేవాడు. దాదా తరచుగా తన పినతండ్రితో కలిసి పేద ప్రజలకు దానం చేస్తూ ఉండేవారు. పరోపకార కార్యములో దాదా తన పినతండ్రికి సహాయముగా ఉండేవారు.

# దాదా భక్తి

దాదాకు భక్తి భావన, ధార్మిక ప్రవృత్తి ఎంతో పరిపక్వంగా, పటిష్ఠంగా ఉండేవి. వారు ఏ కార్యము చేసినా అందులో సద్గుణాల జ్వాల ప్రజ్వరిల్లుతూ ఉండేది. వారి కుమార్తెల, మేనకోడళ్ళ పెళ్ళిళ్ళు జరిగిన సమయంలో 'పహరామణి' అనే సాంప్రదాయం ఉండేది. అందులో అత్తమామలకు వస్త్రాలను, గృహోపకరణాలను బహుమతిగా ఇవ్వటం రివాజు. కానీ దాదా మాత్రం వేలాది రూపాయల విలువైన వజ్రాలను, ఖరీదైన రాళ్ళు పొదిగిన బంగారు ఆభరణాలను ఇచ్చేవారు. నూతన వధూవరులు తమ జీవితంలో నిత్యం భక్తి భావనలను కలిగి ఉండాలన్న ఉద్దేశ్యముతో వీటితోపాటు, ఒక భగవద్గీతను, వెండితో చేసిన చిన్న మందిరమును బహుకరించేవారు. ఇటువంటి సందర్భాలలో దాదా తమ గురువును కూడా ఆహ్వానించి వివాహ సందర్భాన్ని కూడా ఒక సత్సంగముగా మార్చేవారు. వివాహఘట్టము ఒక ఆధ్యాత్మిక ప్రసంగంతో ముగిసేది.

ఇప్పుడు దాదా కోటీశ్వరుడు. ప్రసిద్ధ కృపలానీ వంశస్థుడు. ఇటువంటి హోదాకు చేరుకున్నప్పుడు, తన కుమార్తెల వివాహాన్ని తన హోదాకు సరితూగే ప్రసిద్ధ ధనాఢ్యుల కుటుంబం వారితోనే చేస్తారని భావిస్తాము. కానీ ఇందుకు భిన్నంగా, తన కూతుర్లలో ఒకరికి వివాహము చెయ్యవలసి వచ్చినప్పుడు, "పుట్టు"(ఆ కూతురును ముద్దుగా ఇంట్లో అలా పిలుస్తారు)కు ఒక సామాన్య పాఠశాలలో ముఖ్య అధ్యాపకుడిగా పని చేస్తున్న బోధరాజు అనే యువకుడితో వివాహము జరిపించారు. బోధరాజు సామాన్య కుటుంబంనుండి వచ్చాడు, దాదా కూతురు మనోహరమైనది, తెలివైనది, భక్తిపరురాలు, భోగభాగ్యాలలో పుట్టి పెరిగింది. దాదా తలుచుకుంటే భారతదేశంలోనే అతి సంపన్న కుటుంబానికి చెందిన యువకునితో వివాహము జరిపించగలరు, కానీ ధర్మపరాయణుడైన బోధరాజంటే దాదాకు వ్యక్తిగతంగా ప్రత్యేకమైన అభిమానము. పుట్టు తన తండ్రి తెలివితేటలతో పుట్టింది. ఒక ధార్మిక వ్యక్తిని పొందడం ఎంత సౌభాగ్యమో ఆమె అర్థం చేసుకుంది. నిజానికి, ఈ ప్రధానోపాధ్యాయుడు సమాజములో "యోగిరాజు" అనే పేరును సంపాదించుకున్నాడు. చిదాకాశీ మఠంలో తన ధ్యానదృష్టితో ఈ పేరును పొందాడు. అందుకే, ఎన్నో విమర్శలను ఎదుర్కోవలసి వస్తుందని తెలిసినా, దాదా ఈ నిర్ణయం తీసుకున్నారు. తన ఇల్లు విడిచినా, తన కుమార్తె మాత్రం భక్తి వాతావరణంలో ఉండాలని తలచాడు దాదా. ధనమున్నా మనశ్శాంతి లేకపోతే అది పతనానికి దారి తీస్తుంది. ధనము లేకపోయినా ప్రశాంత వాతావరణంతో స్వర్గంలోలా ఉండవచ్చు అని దాదాకు తెలుసు.

దాదా తీసుకున్న ఈ నిర్ణయం అతని కుటుంబంలో ఎంతో అలజడిని రేకెత్తించింది. అందరికీ ఇది ఒక చర్చనీయాంశంగా మారింది. తన కులాన్ని మరచి, ఒక సాధుతుల్య వ్యక్తితో దాదా తమ కూతురి వివాహము ఎందుకు నిర్ణయించారు? చివరకు, అందరూ దాదా నిర్ణయము గొప్పది అని అర్థం చేసుకున్నారు. దాదా భార్య యశోద శ్రీకృష్ణుని భక్తురాలు. దాదా కుటుంబ సభ్యులంతా దేవతా భక్తులే. అధిక ధనం వారిని పాడు చెయ్యలేదు. విలాసవంతమైన జీవితాన్ని దాదా ఏమాత్రం ఇష్టపడేవారు కాదు.

పుట్టు–బోధరాజుల వివాహఘట్టాన్ని ప్రత్యక్షంగా చూసిన బ్రహ్మాకుమారి మనోహర్ ఇంద్రాగారు ఇలా వివరిస్తున్నారు – "నేను దాదాజీని, వారి కుటుంబ సభ్యులను అనేకసార్లు చూసాను. దాదాజీకున్న ఇళ్ళలో ఒకటి మా ఇంటికి దగ్గరలోనే ఉండేది. దాదా కొడుకుల్లో ఒకరైన నారాయణ మా సోదరునితో కలిసి చదివేవాడు. పుట్టు–బోధరాజుల వివాహానికి నన్ను కూడా ఆహ్వానించారు. నేను వెళ్ళాను. ఆ వివాహంలో విశేషమేమంటే, అందులో కేకలు, అరుపులు, ఆర్భాటాలు లేవు. పైగా ఏదో దేవీదేవతల వివాహము జరుగుతుందన్న భావన నాలో కలిగింది. ఆ దృశ్యం నాపై ఎంతో ప్రభావాన్ని చూపింది. కలియుగ ఎడారిలో శాంతి అనేది ఎండమావిలా అనిపిస్తుంది. మదమాత్సర్యాలతో నిండిన సామాన్య జీవితం కాక దాదా పరివారంలోని వారిలా పవిత్ర జీవనాన్ని సాగించాలి అని నేను ఆనాడే నిర్ణయించుకున్నాను."

దాదాకు కలకత్తాలో వజ్రాల దుకాణం ఉండేది. ముంబయిలో కూడా దాదా వ్యాపార వ్యవహారాలు ఉండేవి. కలకత్తా, ముంబయిలో కాక దాదాకు హైదరాబాదు(సింధ్)లోకూడా ఇళ్ళు ఉన్నాయి. ఈ మూడు పట్టణాలలో రాజకుల పెద్దగా దాదా జీవితం సంతోషంగా సాగిపోతుంది.

దాదాకు ఉన్నంత ప్రభు నిష్ఠ భారతదేశంలో మరెవరికైనా ఉన్నట్లయితే వారు సాధారణంగా అన్నీ వదిలి అడవులకు వెళ్ళి సన్యాసం పుచ్చుకుని ఉండేవారు. భగవంతుని పట్ల అపారమైన, నిశ్చలమైన భక్తి విశ్వాసములు ఉన్నప్పటికీ, అన్నీ వదిలి వానప్రస్థంలోకి వెళ్ళాలన్న సంకల్పం దాదాకు ఎప్పుడూ కలుగలేదు.

దాదాకు అరవై సంవత్సరముల వయస్సులో, వారి భార్య యశోద ఇలా అన్నారు – "ఇక మనం ఏకాంతములోకి వెళ్ళి వానప్రస్థాన్ని స్వీకరించాలి".

కానీ దాదా ఆలోచించి ఇలా అన్నారు – "ఆగు, నేను ఎన్నో వందల వేల రూపాయలు సంపాదించాను. ఇప్పుడు ఆ ధనాన్ని రెట్టింపు చెయ్యనీ. ఆతర్వాత మనం వానప్రస్థులవుదాము". సంపాదన గురించి దాదాకు ఒక స్పష్టమైన అభిప్రాయం ఉండేది. మరో రెండు–నాలుగు సంవత్సరాలు సంపాదించిన తరువాత తమ ఆస్తినంతటినీ పేదవారికి దానమిచ్చి, తమ చివరి రోజులు భగవంతుని స్మరణలో గడపాలన్నది దాదా అభిప్రాయం.

కానీ తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచింది అన్నట్లుగా దాదా జీవితంలో అకస్మాత్తుగా ఏదో జరిగింది. అన్ని ప్రాపంచిక ఆసక్తులు తొలగిపోయాయి. వారికి ఎన్నో అద్భుత అనుభవాలు జరగడం ప్రారంభమయ్యాయి. అప్పటినుండి దాదా ఒంటరిగా ఉండటానికి ఇష్టపడేవారు. వారు తమ సమయాన్ని స్మరణలో, మననచింతనలో గడిపేవారు.

# దివ్య జ్ఞాన అనుగ్రహం

ఒకసారి దాదా ముంబయిలోని బబూల్‌నాథ్ మందిరం ఎదురుగా ఉన్న తమ బంగళాలో జరుగుతున్న సత్సంగంలో ఉన్నారు. అప్పుడు వారికి ఒక వింత ఆంతరిక అనుభవం కలగడం ప్రారంభమయింది. వారికి కలుగుతున్న ఈ ఆంతరిక భావాలు తనలో ఆధ్యాత్మిక దండయాత్రకు ఆరంభము అని గుర్తించినా, ఇవి కలగటానికి గల కారణాలు గానీ, ఉద్దేశ్యము గానీ వారికి అర్థం కాలేదు. వాస్తవాలను గ్రహించగలిగే ఆంతరిక జ్ఞానము వారిలో బాగా పెరగసాగింది. ఏకాంతము కొరకు వారు తమ అతిథులకు దూరంగా తమ గదిలోకి వెళ్ళారు. అగోచరమైన అనుభవాలలో మునిగి ఉన్న వారు అలౌకిక ఆనందాన్ని చవి చూసారు. వర్ణనాతీతమైన ఆనంద తరంగాలు వారిని చుట్టుముట్టి, పరమానందానికి గురి చేసాయి. దేహ స్మృతినుండి దూరంగా, ఆ పవిత్ర ఆత్మ ఆనందసాగరంలో మునిగి తేలుతుంది.

ఇటువంటి దివ్యస్థితిలో వారికి చతుర్భుజుడైన విష్ణువుని దివ్య సాక్షాత్కారం జరిగింది.

ఈ అనుభవం తనకు తన గురువు అనుగ్రహం వలననే కలిగిందని దాదా అనుకున్నారు. తన అనుభవం పూర్తయ్యాక దాదా ఎంతో సంతోషంగా తన గురువు వద్దకు వెళ్ళి జరిగినదంతా ఎంతో ఆసక్తిగా వివరించారు. కానీ తనకు జరిగిన ఈ అనుభవం గురించి గురువుకు ఏమీ తెలియదని, ఈ సాక్షాత్కారము తన గురువుద్వారా జరిగింది కాదు అని గురువు ముఖంలోని హావభావాల ద్వారా దాదా అర్థం చేసుకున్నారు. ఇటువంటి సాక్షాత్కారాలను కలిగించటం గురువుగారి సామర్థ్యానికి మించిన పని అని కూడా అర్థం చేసుకున్నారు.

అప్పుడు దాదా మనసు సర్వులకు తండ్రి, పరమాత్మ, నిరాకారుడు అయిన పరమాత్మ వైపుకు మరలింది. నిజమైన సద్గురువు ఒక్క భగవంతుడు మాత్రమే అన్న విషయం దాదాలో దృఢమైంది. అనుగ్రహము, దివ్యజ్ఞానము, దివ్యబుద్ధిని ప్రసాదించగలిగినవాడు ఒక్క భగవంతుడే. ఏ మానవుడైతే తనను తాను భగవంతునిగా చెప్పుకుంటాడో లేక భగవంతుడు సర్వవ్యాపి అని చెప్తాడో అతడు విధివశాత్తు వంచకుడు. విష్ణువుయొక్క దివ్య సాక్షాత్కారాన్ని దాదాకు అనుగ్రహించినది స్వయంగా భగవంతుడు. ఈ విషయం దాదాకు స్పష్టంగా అర్థమయింది. ఇక ఇప్పుడు దాదా తెలుసుకోవాల్సిన విషయము- ఎందుకు ఈ సాక్షాత్కారము జరిగింది?

# భగవంతుడు మరియు ప్రపంచ వినాశనం

ఈ సంఘటన జరిగిన కొద్ది రోజుల తర్వాత దాదా వ్యాపార నిమిత్తం వారణాసి వెళ్ళారు. అక్కడ దాదా తన మిత్రునితో గడపదలిచారు. తన స్నేహితుని బంగళాలో దాదా నడుస్తూ ఉండగా, సాధారణంగా తాను ధ్యానము చేసుకునే స్థానము వారికి గుర్తుకు వచ్చింది. స్నేహితుని ఇంట్లోని తోటలో దాదా కూర్చొని అక్కడి చల్లటి గాలిని ఆస్వాదించసాగారు. పచ్చని చెట్లమధ్య కూర్చున్న వీరు మళ్ళీ ప్రాపంచిక విషయాలనుండి దూరంగా వెళ్ళిపోసాగారు. భగవంతుని చింతనలో నిమగ్నమై ఉన్నారు. తమను తాము ఎంతో తేలికగా అనుభవం చేస్తూ దేహ స్మృతి నుండి దూరంగా వెళ్ళిపోయారు. తనకు పూర్వం జరిగిన అనుభవాలు కేవలం ఆకస్మిక ఘట్టాలు కావనీ, ఈ అనుభవాలు తనని మునుపటి జీవితాన్ని కొనసాగించనివ్వవని దాదాకు అర్థమయింది. నిజానికి, ఒక బీజం అతనిలో నాటడం జరిగింది. అది నెమ్మది నెమ్మదిగా నిరంతరం వృద్ధి చెందుతూ ఉంది. తనకు జరుగుతున్న వరుస అనుభవాలతో పరిపూర్ణ జ్ఞానాన్ని, పరమాత్మ గురించిన యథార్థ జ్ఞానమును అందుకోవడానికి దాదా తన సూక్ష్మబుద్ధితో సంసిద్ధులై ఉన్నారు. తనను నడిపిస్తున్న యజమాని అయిన పరమాత్మకే దాదా అంతా వదిలేసారు.

దాదా ఈ ప్రదేశములోనే మరికొంత సమయాన్ని గడిపారు. భగవంతుని చింతనలో గడిపిన ప్రతిసారీ దాదాకు ఏవో క్రొత్త అనుభూతులు, దివ్య సాక్షాత్కారాలు జరిగేవి. జ్ఞానసాగరంలో బంధింపబడి ఉన్న దాదా మరింత లోతుల్లోకి ప్రయాణం కొనసాగించారు.

ఈ సమయంలోనే దాదా తన ఇంటికి అత్యద్భుతమైన ఉత్తరాలు వ్రాసేవారు. ఊహించనివి, అద్భుతమైనవి వారి జీవితములో సంభవిస్తున్నాయని ఆ ఉత్తరాలద్వారా స్పష్టంగా నిరూపణ అయ్యేది. వారికేమైనా పిచ్చి పడుతుందా – అది సంభవమేనా – వారికి నిజంగానే భగవంతునిద్వారా సాక్షాత్కారాలు కలుగుతున్నాయా! బి.కె. బ్రిజింద్ర ఈ సమయమును గురించి ఇలా వ్రాస్తున్నారు:

“ఒక ఉత్తరంలో దాదా ఇలా వ్రాసారు – ‘ఖజానా ఎంతో ఉంది, ఖజానా ఎంతో ఉంది, దానిని నేను పొందటానికి ప్రయత్నిస్తున్నాను, పొందటానికి ప్రయత్నిస్తున్నాను’. దాని తర్వాతి ఉత్తరంలో ఇలా వ్రాసారు – ‘తాళము చెవి దొరికింది, ఖజానాను పొందాను, ఖజానాను పొందాను’. ఈవిధంగా దాదా మాకు అయిదు ఉత్తరాలు వ్రాసారు. ఆరోజుల్లో దాదా పొందిన దివ్యానుభూతులను దాదా వ్రాసిన ఉత్తరాలద్వారా మేము అర్థం చేసుకోగలిగాము. చివరి ఉత్తరంలో దాదా ఇలా వ్రాసారు –‘పొందాల్సినదంతా పొందాను, పొందటానికి ఇక ఏమీ మిగిలి లేదు’.

చివరకు ఆ రోజు వచ్చింది. తనకు కలిగే సాక్షాత్కారాలను గురించిన గందరగోళాన్ని పటాపంచలు చేసే రెండు దివ్య సాక్షాత్కారాలు కలిగాయి. ఒకటి, జ్యోతిర్లింగ స్వరూపుడైన శివ పరమాత్మ. రెండవది, కలియుగ ప్రపంచ మహా వినాశన దృశ్యం.

శివ పరమాత్ముని సాక్షాత్కారముతో దాదాకు తమ నిజ అస్తిత్వము అర్థమయ్యింది. పరమాత్మ జ్యోతిస్వరూపుడు. అతని పిల్లలు అతని రూపమునే కలిగి ఉంటారు. కనుక, నిజానికి మనమందరమూ కేవలం ఒక చిన్న బిందురూపులం. మెరిసే నక్షత్రాలము. కేవలం పిల్లలమైన మనం మాత్రం ఈ సాకార ప్రపంచములో పాత్రను అభినయించటానికి దేహములు అనే వస్త్రాలను ధరిస్తాము. శివ పరమాత్మ మాత్రం తన నిజ రూపంలోనే ఉంటారు. పునర్జన్మల చక్రంలో పడిపోయి మనం మన నిజరూపాలను మరిచిపోయాము. శివ పరమాత్మునికి ప్రపంచ ఆట మొత్తం తెలుసు. వారు మనల్ని గమనిస్తూనే ఉన్నారు. జన్మజన్మకూ ఆత్మలు దిగజారిపోయి, శక్తి నశించి ఒకరి పట్ల ఒకరు వికారులుగా ప్రవర్తిస్తున్నారు. అప్పుడు, అంతానికి ముందే, భగవంతుడు తన పిల్లలను తిరిగి ఉన్నతులుగా తీర్చిదిద్దటానికి వస్తారు. కానీ ఈ ప్రపంచానికి ఏవిధమైన అంతం రాబోతుంది, ఏవిధమైన ఆరంభం కలుగబోతుంది?

దాదా సాక్షాత్కారం చేసుకున్న మరో దృశ్యం – ప్రపంచ మహా వినాశనం. అతి శక్తివంతమైన బాంబులను తయారుచేసి వాటిని ఉపయోగించడం, అమెరికా–రష్యాల మధ్య యుద్ధం జరగడం దాదా చూసారు. విధ్వంసకర శక్తి ఉన్న అణుబాంబుల కారణంగా ప్రపంచమంతా ఒక్క క్షణంలో మాడి మసిగా మారిపోవడం దాదా చూసారు. అగ్ని గోళములు(బాంబులు) పడుతున్నాయి, పట్టణాలు అగ్నిలో మండిపోతున్నాయి, భరింపరాని అగ్ని జ్వాలలు ప్రతిచోటా ఎగసి పడుతున్నాయి. 5000 సంవత్సరాల క్రితం మహాభారత యుద్ధంలో ఏ అస్త్రాలనైతే ప్రయోగించారో, బ్రహ్మాస్త్రములు మరియు ముసలములు ఇవే అని, ఇప్పుడు ఆ యుద్ధమే మళ్ళీ రాబోతుందని దాదా అర్థం చేసుకున్నారు. ఈ యుద్ధం వలన యూరప్ మరియు అమెరికా పూర్తిగా నాశనమవడం దాదా చూసారు.

దాదాకు ఈ సాక్షాత్కారం కలిగిన సమయానికి అమెరికా ఇంకా తన మొదటి అణుబాంబును హిరోషిమా మరియు నాగసాకిలపై ప్రయోగించలేదు. అప్పటికి, రష్యా మరియు అమెరికా మిత్ర దేశాలు. ఈ మిత్ర దేశాలకు విరుద్ధంగా జర్మనీ, జపాను దేశాలు ఉండేవి. కానీ భగవంతుడు అనుగ్రహించిన ఈ దృశ్యంలో ఈ రెండు మిత్రదేశాలు శత్రుదేశాలుగా మారుతాయని, వారు ప్రారంభించబోయే ప్రపంచయుద్ధమే చివరి యుద్ధమని స్పష్టంగా ఉంది. ఎందుకంటే అప్పుడు కనీసం శవాన్ని పూడ్చి పెట్టడానికి ఈ భూమి మీద ఒక్కరుకూడా మిగిలి ఉండరు. శవాలతో నిండిన ప్రపంచం.

ప్రచండ వినాశనమనంతరం, అకస్మాత్తుగా శరీరాలను వదిలిపెట్టిన ఆత్మలన్నీ – చీకటిలో వెళ్ళే ఈగల గుంపులా, లక్షలాది సంఖ్యలో పైకి ఎగురుతూ, పైన ఉన్న తమ ఆత్మల ప్రపంచానికి, పరంధామానికి చేరుకుంటాయి. అతి కొద్దిమంది మాత్రమే ఈ భూమిపై జీవించి ఉంటారు. కేవలం యూరప్, రష్యా మరియు అమెరికా దేశాలే నిర్జనంగా మారడం కాక చైనా, ఆఫ్రికా, ఇండియాలోకూడా వినాశనం సంభవించడం దాదా చూసారు. అంతః కలహాలు, వరదలు, భయంకర భూకంపాలు, అగ్ని పర్వతాలు బ్రద్దలవ్వడం వంటి ప్రకృతి భీభత్సాలు ప్రపంచాన్ని భయ భ్రాంతులలో ముంచేస్తాయి. ఇంతటి భయంకర వినాశన దృశ్యాలను చూసి దాదా వణికిపోయారు. మనుష్యులు, పశువులు తమ ప్రాణాలను కాపాడుకోవటానికి, మృత్యుకోరలనుండి తప్పించుకోవటానికి వెర్రిగా అటూఇటూ పరుగెడుతున్నారు, కానీ తప్పించుకునేందుకు వేరే మార్గమే లేదు.

ఒకచోట అగ్ని మహా భయంకర రూపాన్ని ధరించి నగరాలను, జీవ జంతువులను భస్మం చేస్తుంటే, మరోచోట కుంభవృష్టిగా వర్షం కురిసి నీటి ప్రవాహంలో ఇళ్ళు, నగరాలు కొట్టుకుపోతుంటే, మరోచోట భూమి భయంకరంగా కంపించి బ్రద్దలవుతూ ఉంది. భూ ఆగ్రహంలో అందరూ స్వాహా అయిపోతున్నారు. దుఃఖము, ఆక్రోశము, రక్తపు నదులు, భయము, నిస్సహాయతల రోదన, ఆతర్వాత అంతిమ మృత్యువు. నిశ్శబ్ద కోత, తన జీవితంలో ఎప్పుడూ కంట తడిపెట్టని దాదా కళ్ళనుండి ఇప్పుడు అశ్రుధారలు ప్రవహిస్తున్నాయి. "హే ప్రభూ, ఇక చాలించండి, ఇక చాలించండి" అంటూ మొర పెట్టుకున్నారు. "ఎంతటి భయంకరమైన వినాశనం! ఇప్పుడిక మీరు మీ మనోహర రూపాన్ని చూపించండి", అని వేడుకున్నారు.

# వ్యాపారానికి స్వస్తి

ఇప్పుడు దాదా పూర్తిగా మారిపోయారు. భవిష్యత్తులో జరగబోయే మహా వినాశనాన్ని చూసిన దాదా తన మనసును వ్యాపారంపై నిలుపలేకపోయారు. వ్యాపారంపై ఆసక్తి పూర్తిగా సడలిపోయింది. తన వ్యాపార వ్యవహారాలన్నింటినీ ముగించటానికి దాదా కలకత్తా ప్రయాణమయ్యారు. అక్కడ వారికి ఎన్నో సంవత్సరాలుగా వ్యాపారముంది. కానీ ఇప్పుడు అదంతా వింతగా, నిరర్ధకంగా దాదాకు గోచరిస్తున్నాయి. ఒకసారి దాదా తన బంగారు ఆభరణాల దుకాణం వైపుగా నడుస్తూ వెళ్తున్నారు. అక్కడ కళ్ళు జిగేలుమని మెరిసే వజ్రాలు, కోట్ల విలువ చేసే మణిమాణిక్యాలు కనిపించాయి. అధిక సంపదకు అవన్నీ చిహ్నాలు. కానీ దేని కొరకైతే మనుష్యులు బ్రతుకుతున్నారో, దేని కొరకైతే మనుష్యులు చావడానికి సిద్ధపడతారో ఆ వజ్ర వైఢూర్యాలన్నీ దాదాకు ఇప్పుడు వట్టి రాళ్ళవలె కనిపించసాగాయి. ఇదంతా నిరర్ధక వ్యాపారము అని భావించారు.

దాదా తన భాగస్వామి వద్దకు వెళ్ళాడు. అతనితో, "నాకు ఈ వ్యాపారమునుండి సెలవు ఇవ్వు" అని అన్నారు.

భాగస్వామి ఖంగు తిన్నాడు. "అదెలా సాధ్యము" అని బదులిచ్చాడు. ఎందుకంటే వారి వ్యాపార విజయానికి దాదాయే ముఖ్య కారణమని భాగస్వామికి తెలుసు. తమకు చూపించినదల్లా వినియోగదారులు తీసుకోవడానికి కారణము దాదా మనసు, దాదా వ్యక్తిత్వమే. ముందు దాదా, తర్వాతే వజ్రాలు. దాదా భాగస్వామికి రాజులు, మహారాజులతో అంతగా పరిచయం లేదు. ఒకవేళ దాదా వ్యాపారాన్ని వదిలి వెళ్ళిపోతే అతడు ఎన్నో ఇబ్బందులు పడవలసి వస్తుందని భాగస్వామికి తెలుసు. దాదాకు తనపై ఏమైనా కోపం వచ్చిందేమో అని, వ్యాపారంలో ఎంత భాగం దాదా అడుగుతాడో అనికూడా భాగస్వామి ఆలోచించాడు.

దాదా అతనిని శాంత మనసుతో ఓదార్చారు. "నేను ఎటువంటి అభిప్రాయభేదముల కారణంగా విడిపోవటం లేదు. నేను స్వేచ్ఛను పొందాలని అనుకుంటున్నాను. ఈ వ్యాపారమంతా అసత్యమైనదిగా అనిపిస్తుంది. ఈ కలియుగం వినాశనం కాబోతుందన్న భగవంతుని సందేశం నేను అందుకున్నాను. కనుక, నేను నా ఈ ధనాన్నంతటినీ ఈశ్వరీయ సేవలో వినియోగించదలిచాను. నేను ఇప్పుడు మిమ్మల్ని ఏ లెక్కలూ అడగను. మీ వకీలును సంప్రదించి, మీకు సబబు అనిపించినట్లుగానే లెక్క వెయ్యండి".

వీలైనంత త్వరగా తిరిగి ధ్యానావస్థలోకి వెళ్ళాలని దాదా కోరిక. కానీ లెక్కలన్నీ ఇద్దరూ కలిసి చూడాలని భాగస్వామి కోరగా దాదా అంగీకరించారు. లెక్కలు చూస్తున్న వారిని తలుపు చప్పుడు అంతరాయపరిచింది.

మనం ముందు చెప్పుకున్నట్లుగా, దాదాకు ఒక పినతండ్రి ఉండేవారు. అతని పేరు మూల్‌చంద్ ఆజ్‌వాలా. అతను కాకా మూల్‌చంద్‌గా సుప్రసిద్ధులు. అతడు గొప్ప దాత. తన దానగుణం సదా కొనసాగుతూ ఉంటుందని దాదా తన పినతండ్రికి మాట ఇచ్చి ఉన్నారు. దాన కర్మలో దాదా అతనికి ఎంతో సహకారాన్ని అందించి ఉన్నారు. కలకత్తాలో దాదా తన వ్యాపారమునకు స్వస్తి చెప్పటానికి, తన వాటా గురించి తన భాగస్వామితో కూర్చొని లెక్కలు చూస్తున్న సమయంలో ఒక వ్యక్తి టెలిగ్రాముతో వచ్చాడు. సింధ్‌లోని కాకా మూల్‌చంద్ అనారోగ్యంతో ఉన్నాడు అని అందులోని సమాచారము. లెక్కపత్రాలన్నిటినీ దాదా పక్కన పెట్టేసి వెంటనే మూల్‌చంద్ వద్దకు ప్రయాణమయ్యారు. భాగస్వామి తరఫు వకీలు చూపించిన లెక్కలను దాదా మరో ఆలోచన లేకుండా సత్యమని నమ్మి ఒప్పుకున్నారు. దాదా తన ఇంటికి ఒక లేఖ వ్రాసారు. అందులో ఇలా వ్రాసి ఉంది – 'అలిఫ్‌కు అనగా దాదాకు అల్లా(పరమాత్మ) లభించారు, భాగస్వామికి అశాశ్వతమైన భౌతిక సంపద లభించింది'. దాదా సింధ్‌కు రైలులో ప్రయాణమయ్యారు. దాదా టెలిగ్రామును చూసిన కుటుంబసభ్యులకు ఏమీ అర్థం కాలేదు. దాదా అంత సులువుగా ఎలా వ్యాపారానికి స్వస్తి చెప్పారన్నది వారికి అంతు చిక్క లేదు. అసలు దాదాకు ఏమయ్యింది?

సింధ్‌లో తిరిగి అడుగుపెట్టేనాటికి దాదా జీవితము పూర్తిగా మారిపోయి ఉంది.

# మృత్యు దశ సాక్షాత్కారము

దాదా సింధ్‌కు చేరుకునేలోపే కాకా మూల్‌చంద్ చనిపోయాడు. కానీ కొన్నిరోజుల తర్వాత దాదాకు ఒక సాక్షాత్కారము కలిగింది. తన కుటీరములో ఏకాంతంగా కూర్చొని ఉన్న దాదా, కాకా మృత్యు ఘట్టాన్ని చూసారు. చివరి క్షణాల్లో ఆత్మ దేహమునుండి సెలవు తీసుకొని భృకుటి మధ్యనుండి బయటకు రావటం దాదా స్పష్టంగా చూసారు. థర్మామీటరులోని పాదరసం ఒక్కసారిగా పైకి ఎగసినట్లుగా శరీరంలోని ప్రాణశక్తి కాలిపాదాలనుండి పైకి ఎగసి మస్తకములో కేంద్రీకృతమైంది. మరుక్షణంలో ఆత్మ దేహాన్ని విడిచిపెట్టింది. దాదా ఇప్పుడు మృత్యు క్రమమును అర్థం చేసుకున్నారు. కేవలం దేహము మాత్రమే నిర్జీవమైనది కానీ ఆత్మ కాదు అని గుర్తించారు.

ఈ సాక్షాత్కారము జరిగిన వారంరోజుల్లోనే దాదాకు మరో సాక్షాత్కారం కలిగింది. ఈసారి మళ్ళీ విష్ణు సాక్షాత్కారం కలిగింది. అప్పుడు దాదాకు ఈ మాటలు వినిపించాయి – 'అహం చతుర్భుజం తత్ త్వమ్'. ఆతర్వాత దివ్యమూర్తులైన శ్రీ కృష్ణ జగన్నాథుడు, బద్రీనాథుడు, కేదారనాథుడు ఒకరి తర్వాత ఒకరు కనిపించి అందరూ తతత్వమ్ అనే మాటనే ఉచ్ఛరిస్తున్నారు. ఈ దివ్య సాక్షాత్కారాలతో దాదా పరమానందభరితుడయ్యాడు. కానీ వీటిని ఎలా అర్థం చేసుకోవాలి? దీనిని గురించి దాదా దీర్ఘంగా ఆలోచించసాగారు.

ఇదే సమయములో దాదా గురువుగారు అక్కడకు చేరుకున్నారు. దాదాకు తాను పొందిన దివ్యానుభూతుల వెనుక గురువుగారి పాత్ర ఎంత ఉందో స్పష్టంగా అర్థం కాకపోయినా, ఇటువంటి విషయాలలో నమ్మదగ్గ మానవ బోధకులు వీరే అని అభిప్రాయపడ్డారు, కనుక మునుపటిలాగే గురువుగారికి గౌరవ సత్కారాలను అందించారు. గురువుగారి స్వాగతం కొరకు దాదా 25,000 రూపాయలను వెచ్చించారు. ఒక పెద్ద సభను ఏర్పాటు చేసారు. ఎంతోమంది అక్కడ కూర్చొని ఉన్నారు. కానీ దాదా వారి మధ్య కూర్చోవడం, అక్కడినుండి మధ్యలో లేచి వెళ్ళిపోవడం, అన్నీ ఈసారి భిన్నంగా ఉన్నాయి. దాదా దేహము మారలేదు. కానీ వారి మనసు ఇప్పుడు మారిపోయి ఉంది అన్నది మాత్రము సత్యము. దాదా ఆత్మ ఏదో అలౌకిక శక్తిని అందుకుంటుంది.

ఆ సత్సంగము జరుగుతున్న రాత్రి ఏమి జరిగిందో బి.కె. బ్రిజేంద్ర ఇలా వివరిస్తున్నారు: –

"గురువుగారి ఉపన్యాసము జరుగుతున్న సమయములో దాదా హఠాత్తుగా లేచారు. మునుపెన్నడూ దాదా ఇలా చెయ్యలేదు(అలా మధ్యలో లేచి రావడం గురువుగారిని అగౌరవపరిచినట్లుగా దాదా భావించేవారు). నా ధ్యాసంతా దాదా వైపే ఉంది. ఏదో అద్భుత శక్తి దాదాతో ఈ పని చేయించి ఉంటుంది అని నేను అనుకున్నాను. దాదా భార్య జశోదను నేను వారి వెంట పంపించాను. వెంటనే నేనుకూడా ఆమె వెనుకనే దాదా వెళ్ళిన గదివైపుకు వెళ్ళాను. నేను వెళ్ళి దాదా దగ్గర క్రింద కూర్చున్నాను. జశోద తిరిగి సభలోకి వెళ్ళిపోయింది. అప్పుడు జరిగిన క్షణాలను నేను ఎన్నటికీ మరువలేను".

"గదిలో కూర్చొని ఉన్న దాదా విశాల నేత్రములు అత్యంత ప్రకాశముతో ఎరుపు వర్ణములోకి మారాయి. వారి శరీరమునుండి ఎర్రని కాంతి ప్రకాశిస్తుందా అన్నట్లుగా ఉంది. వారి ముఖమండలము దేదీప్యమానమై దివ్య ప్రకాశముతో ఎర్రుపు వర్ణము దాల్చింది. ఆ ఎర్రని ప్రకాశములో ఆ గదికూడా ఎరుపు వర్ణముతో అలుముకుంది. కొద్దిసేపటి తర్వాత నాలోకూడా ఏదో జరగడం ప్రారంభమైంది! దానిని నేనెలా వర్ణించను! నేను అక్కడే ఉన్నాను. కానీ అక్కడ లేను. నేను చాలా తేలికగా ఉన్నాను. నా మనసు మునుపెన్నడూ లేనంత స్పష్టంగా ఉంది. శరీర భ్రాంతినుండి అతీతంగా అనుభవము అవుతుంది. ఆ అశరీర అవస్థలో ఒక శబ్దము పైనుండి వినిపించినట్లుగా అనిపించింది. దాదా నోటినుండి వేరెవరో మాట్లాడుతున్నట్లుగా అనిపించింది. ఆ శబ్దము మొదట చిన్నగా ఉన్నా, ఆ తర్వాత అది పెద్దగా వినిపించసాగింది. ఆ శబ్దము ఆశ్చర్యం కలిగించేదిగా ఉంది కానీ భయాన్ని కలిగించేదిగా లేదు. ఆ శబ్దములోని పలుకులు ఈవిధముగా

ఉన్నాయి –

> "నిజానంద స్వరూపం, శివోహం శివోహం
> జ్ఞాన స్వరూపం, శివోహం, శివోహం
> ప్రకాశ స్వరూపం, శివోహం, శివోహం"

"తర్వాత దాదా నేత్రములు మూసుకున్నాయి, ఈనాటివరకు నేను ఆ పలుకులను, ఆ దృశ్యాన్ని మర్చిపోలేదు. అప్పటి వాతావరణం అత్యద్భుతం, అప్పటి నా దేహాతీత స్థితి చిరస్మరణీయం. దాదా కళ్ళు తెరిచిన తరువాత గది నలువైపులా ఆశ్చర్యంతో చూడసాగారు. వారు చూసిన దృశ్యము వారిని తన నిజ అస్తిత్వము వైపుకు కదిలించింది. 'బాబా, మీరు ఏమి చూస్తున్నారు' అని నేను అడిగాను. అప్పుడు బాబా, 'అదేమిటో తెలుసా! అది ఒక ప్రకాశము. అది ఒక శక్తి. మొత్తానికి అది ఒక క్రొత్త ప్రపంచము. ఈ ప్రపంచానికి దూరంగా ఎవరో ఉన్నారు. అక్కడ ఎన్నో ఉన్నాయి, అవి తారలుగా ఉన్నాయి. ఆ తారలు క్రిందకు వచ్చినప్పుడు రాజకుమారుడు, రాజకుమారీలుగా మారిపోయాయి. ఆ ప్రకాశము, ఆ శక్తి నాతో ఇలా చెప్పింది – 'ఇటువంటి ప్రపంచాన్ని నువ్వు తయారుచెయ్యాలి'. కానీ అలాంటి ప్రపంచాన్ని ఎలా తయారుచెయ్యాలో చెప్పలేదు. నేను అటువంటి ప్రపంచాన్ని ఎలా తయారుచెయ్యగలను?'

"దాదాతో ఇవన్నీ మాట్లాడింది ఎవరు? సర్వోన్నతుడైన పరమాత్మ. పరమపిత పరమాత్మ, శివుడు దాదా దేహములో ప్రవేశించడం నేను ప్రత్యక్షంగా చూసాను."

దాదా దీర్ఘాలోచనలో పడ్డారు. అసమానమైన ఈ ఘట్టం వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించటంలో దాదా నిమగ్నమయ్యారు. 'ఇటువంటి సాక్షాత్కారాలను, దివ్య జ్ఞానమును, ఆత్మ జ్ఞానమును ఇవ్వగల శక్తి ఏది?" వీటన్నిటి వెనుక ఉన్న మర్మాన్ని, సత్యాన్ని దాదా నెమ్మదిగా అర్థం చేసుకోగలిగారు. దిగ్భ్రమలో ఉన్న తన బుద్ధికి సమాధానము దొరికింది. అవును, ఇది నిజం. భగవంతుడు, శివ పరమాత్మ స్వయంగా వీరి శరీరంలో ప్రవేశించారు. రాబోవు ప్రపంచ వినాశనము మరియు స్వర్గ స్థాపన గురించి తెలియపరిచింది భగవంతుడే. దాదా తన మాధ్యమముగా ఉండి నూతన స్వర్గ స్థాపనా కార్యములో ముందుండాలి అని వివరించింది కూడా భగవంతుడే.

# సత్యమైన గీత మళ్ళీ వినిపించింది

భగవంతుడు స్వయంగా తనకు గుప్తంగా, అవ్యక్తంగా సత్య గీతా జ్ఞానమును అందిస్తున్నారని దాదాకు అనుభవం కలిగింది. భగవంతుని జ్ఞానంపట్ల దాదాకు ఉత్సుకత పెరుగుతూ వచ్చింది. వారి అంతరాత్మలో గీతా జ్ఞాన స్ఫురణ కలగనారంభించింది. ఆ జ్ఞానముయొక్క స్థితిని మరియు అనుభూతిని దాదా ఆస్వాదించసాగారు. వారి వివేకము ఇప్పుడుకూడా మరింత వేగంగా పయనమవుతూ ఉంది. భగవద్గీతలో భగవంతుడు ఉచ్చరించిన నిజమైన మహా వాక్యములు ఏవి మరియు వాటి గూఢార్థమేమిటి అని దాదా మథించసాగారు.

దాదా ప్రశ్నలన్నిటికీ సమాధానంగా వారికి దివ్య జ్ఞానము ప్రాప్తించింది. కేవలం ఒక్క గీతా శాస్త్రములోనే భగవంతుడు స్వయంగా పలికిన మహావాక్యములు ఉన్నాయని దాదాకు నిశ్చయం ఏర్పడింది. భగవంతుడు 5000 సంవత్సరాల క్రితం పలికిన గీతా జ్ఞానమునకు, ఇప్పుడు ప్రస్తుతము అందుబాటులో ఉన్న భగవద్గీతలోని జ్ఞానమునకు ఎంతో వ్యత్యాసము ఉన్నట్లుగా, కొన్ని పొరపాట్లు దొర్లినట్లుగా దాదా గుర్తించారు. గీతా జ్ఞానమును 2,500 సంవత్సరముల తర్వాత వ్రాయడం జరిగింది. అనగా భగవంతుని గీతా జ్ఞానమును విని దేవతలుగా పరివర్తన చెందినవారు తిరిగి వామమార్గములోకి వచ్చిన తర్వాత ఈ జ్ఞానము లిఖితపూర్వకముగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అయితే ఇప్పుడు శివపరమాత్మ ఆచరణయోగ్యమైన ఈ ఈశ్వరీయ జ్ఞానాన్ని భావార్థసహితంగా తిరిగి వినిపిస్తున్నారు. దాదా నిత్యం పఠించే గీతనుండి సహజముగా దూరమయ్యారు. ఇప్పుడు స్వయంగా భగవంతుడే గీతను ఆలపిస్తుంటే ఇక ఆ పాత గీత ఎందుకు! తానొక అర్జునిడిలా, భగవంతుడు తన శరీరమనే రథములో ప్రవేశించి తన జ్ఞాన పిపాసను తృప్తిపరుస్తున్నారని దాదాకు అనుభవమయ్యింది.

స్వయంగా భగవంతుడు, తను చేసిన వాగ్దానమును నెరవేర్చుకోవటానికి, తన భక్తుల ఆశలను తీర్చడానికి గుప్తరీతిలో తిరిగి అవతరించారు. తన స్వస్వరూపము గురించి, ప్రకృతి గురించి, భగవంతుడు గురించి ఇప్పుడు దాదాకు సంపూర్ణ జ్ఞానము లభించింది. దుఃఖభరితమైన ఈ కలియుగ ప్రపంచము వినాశనము చెంది సుఖసంతోషాలు నిండిన స్వర్గ స్థాపన జరుగనుంది. అక్కడ వీరు బాల కృష్ణునిగా పునర్జన్మను తీసుకుంటారు. వీరే మొట్టమొదటి పురుషుడు. ఆదిదేవ్. అల్లాహ్ పూదోటలో వీరు జన్మిస్తారు. వీరే నిజమైన ఆదమ్!

భగవంతుని గుప్త కంఠాన్ని విన్న దాదా ఈ జ్ఞానమును తన బంధుమిత్రులకు ఇవ్వడం ప్రారంభించారు. వారికికూడా ఆత్మజ్ఞానాన్ని అందించి వారిని ప్రభు స్నేహములో ముంచెత్తేవారు. దాదానుండి జ్ఞానమును విన్నవారు ప్రభుప్రేమను వారి కళ్ళనుండి పొందేవారు. ఆ అనుభవం ఎంత గొప్పదంటే వారంతా మైమరిచిపోయేవారు. దాదాకూడా స్వయంగా ఆత్మానుభూతిలో మునిగితేలుతూ ఉండేవారు. ఇతరులకుకూడా దాదా 'నీవు ఆత్మవు' అని చెప్పేవారు. ఆత్మజ్ఞానాన్ని మరచిపోకూడదు అన్న లక్ష్యముతో దాదా ఇప్పుడు ఆ విషయాన్ని వ్రాయడం ప్రారంభించారు. 'నేను ఆత్మను, జశోద ఒక ఆత్మ, రాధిక ఒక ఆత్మ...' ఇలా ఆత్మ పాఠం తమ మనసులో నాటుకునే వరకూ వ్రాసారు.

దాదా వద్దకు వచ్చినవారందరూ నిశ్చేష్టులయ్యేవారు, నర నారీమణులు, పేదలు-ధనవంతులు అందరికీ ఓ గొప్ప అనుభవం కలిగేది. వారి జీవన జ్యోతి వెలిగినట్లుగా, మనశ్శాంతిని పొందినట్లుగా అనుభవం చెందేవారు. వారి కోరికలు, వికారాలు అన్నీ మాయమయ్యాయి. వారు పవిత్ర జీవనాన్ని ప్రారంభించారు. ఆహార వ్యవహారాలలో, మాటలలో, ప్రవర్తనలో, ఆలోచనలలో అన్నింటిలో పవిత్రమార్గాన్ని అవలంబించారు. భగవంతుడు మానవజాతికి జ్ఞాన బోధను గావించడానికి దాదా శరీరములో అవతరించడం ప్రారంభించిన అతి కొద్ది సమయంలోనే తన సమీపములోకి వచ్చిన వారందరినీ భగవంతుడు అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. భగవంతుని సన్నిధికి చేరుకునేవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. భగవంతుడు అందరి పట్ల పితృ వాత్సల్యాన్ని కురిపిస్తూ అందరితో సమ ప్రేమ, ఓర్పు, దయతో జ్ఞాన బోధనను చేసారు. వారి జీవితాలను ఉన్నతంగా మార్చుకోవడానికి అవసరమైన నియమాలను, పద్ధతులను వివరించారు. శివబాబా చైతన్య వజ్రాలను తయారుచేస్తున్నారు.

# భాగము 2

# మహోన్నత వ్యక్తిత్వము

## జ్ఞాన యజ్ఞ ఆరంభము

“ప్రియమైన పిల్లలూ! స్వయాన్ని ఆత్మగా భావించి నన్ను స్మృతి చేయండి.” సర్వోన్నతుడు, భగవంతుడు అయిన శివుని శిక్షణల సారమిదే. కానీ ఈ చిన్న వాక్యము వెనుక అంతులేని అపార జ్ఞాన సంపద, అనుభవము ఉన్నాయి. అందుకే, ప్రతి రోజూ శివబాబా నిరాకారి ప్రపంచం నుండి దిగి వచ్చి ఒక క్రొత్త విషయాన్ని, ఒక నిగూఢ రహస్యాన్ని వివరిస్తున్నారు. ఉన్నతమైన జ్ఞానాన్ని ఉదాహరణల ఆధారంతో సరళంగా చేసి గూఢార్థాలను కూడా తన మధురమైన పిల్లలకు నిశితంగా, యథార్థంగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు.

భగవంతుడు ప్రేమ స్వరూపుడు అన్న విషయము సర్వ విదితమే. కానీ ఎంతమంది ఆ అనంతమైన ప్రేమను ప్రత్యక్షంగా అనుభవం చేసుకునే అనుభవాన్ని పొందగలిగారు? దాదా తనువులోకి అవతరించి ప్రియమైన తండ్రి రూపము ఎలా ఉంటుందో చవి చూపించారు. భగవంతుడు తన దివ్యమైన పరివారాన్ని ఎంతో శ్రద్ధ, ప్రేమలతో పాలన ఇచ్చారంటే అతి సామాన్య వ్యక్తికి కూడా ఇక్కడున్నది ప్రేమ సాగరుడు అన్న విషయం ఎంతో సహజంగా అర్థమయ్యేది.

శివబాబా దాదా శరీరంలో అవతరించినప్పుడు, వారికి ప్రజాపిత బ్రహ్మ(ప్రజలకు తండ్రి, బ్రహ్మ) అని నామధేయం చేసారు. బ్రహ్మముఖారవిందం నుండి జాలువారే జ్ఞానరత్నాలను విన్న వారందరూ బ్రహ్మముఖ వంశీయులుగా , బ్రాహ్మణులుగా అయ్యారు. కావున, వారి భౌతిక వయస్సు ఏదైనా, వృద్ధ మాతలు కానీ యువకులుకానీ, భగవంతుడిని యథార్థంగా గుర్తించిన వారందరూ శివబాబా ‘ప్రియ సంతానం’ అయ్యారు. బ్రహ్మ ముఖారవిందం నుండి పవిత్ర జన్మను తీసుకున్నవారు కనుక బ్రహ్మాకుమార్, బ్రహ్మాకుమారీలు అన్న పేరును పొందారు.

ఆత్మలకు పరమాత్మపై ఏర్పడిన ప్రేమ కారణంగా ఒక సంస్థ ఏర్పడింది; పవిత్ర సంస్థ, యజ్ఞము స్థాపన అయ్యింది. ఇక్కడి జ్ఞానమును వినేవారి సంఖ్య పెరుగుతున్నకొద్దీ ఈ యజ్ఞము కూడా పెరగసాగింది. వారి కళ్ళముందే ఈ ప్రపంచ స్థితిగతులు మారసాగాయి. యజ్ఞము మొదట్లో ఒక్క ప్రజాపిత బ్రహ్మతో ప్రారంభమై అతి స్వల్ప కాలంలోనే నాలుగు వందల మందికి చేరుకుంది. బ్రహ్మ మాధ్యమం ద్వారా శివబాబా జ్ఞానాన్ని విని ఆత్మ ఉన్నతికి పాటుపడేవారే నిజమైన బ్రాహ్మణులు. ఇటువంటి బ్రాహ్మణులు ఈరోజు 135 దేశాలలో విస్తరింపబడి ఉన్నారు. వీరందరూ వీరి సంస్కారాలను, అలవాట్లను మెరుగుపరుచుకుంటూ సత్యయుగ స్థాపనకు నాంది పలుకుతూ సూర్య వంశస్థులకు స్వాగతం పలుకుతున్నారు.

యజ్ఞ ప్రారంభ దశ గురించి, శివబాబా అవతరించు విధానమును ప్రత్యక్షంగా చూసిన అనుభవజ్ఞులు, ప్రాపంచిక జీవితాన్ని పరిత్యజించి భగవంతుని నామ స్మరణయే జీవిత పరమార్థంగా మార్చుకున్నవారి అనుభవాలను, పసికూనగా ఉన్న యజ్ఞం ఎదుర్కున్న అనేక సవాళ్ళను ప్రత్యక్షంగా చూసిన వారి భావాలను, అనుభవాలను తర్వాతి పేజీలలో చదువుదాం.

# అసమాన్య సత్సంగము

దివ్యమైన అలౌకిక సాక్షాత్కారము పొందిన తర్వాత కొన్ని రోజులవరకు బాబా బయటకు వెళ్ళడం మానేసారు. వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇరుగుపొరుగు వారంతా బాబా వద్ద కూర్చుని వారు వినిపించే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని శ్రద్ధతో వినేవారు. బాబా మాటల్లో ఎంతో శక్తి ఉండేది. జ్ఞానాన్ని విన్నవారు జ్ఞాన చింతన చేస్తూ పరమానందాన్ని పొందేవారు.

కొంత కాలం తర్వాత బాబా దూరపు బంధువులు కూడా బాబా వద్దకు జ్ఞానాన్ని వినడానికి రాసాగారు. ఇంట్లో అడుగు పెట్టిన వెంటేనే వారికి ఇంటిలోని వాతావరణం చాలా ప్రశాంతంగా, స్నేహయుక్తంగా అనిపించేది. స్వయంగా భగవంతుడే తన జ్ఞానాన్ని అందరికీ అందించడానికి బాబాను ఆధారంగా చేసుకున్నారని వారు అర్థం చేసుకున్నారు.

శివబాబా స్త్రీలకు ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చేవారు. ఎందుకంటే సాంఘిక దురాచారాల కారణంగా స్త్రీలను అణచివేస్తున్న కాలమది. శివబాబా వారికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చి, వారిలోని శక్తి సామర్థ్యాలను గుర్తు చేసారు. సత్సంగానికి వచ్చిన స్త్రీ పురుషులకు శ్రీ కృష్ణుడు, రాబోవు సత్యయుగము, జరగబోయే కలియుగ మహా వినాశన దృశ్యాలు సాక్షాత్కారమయ్యేవి.

ఈ సాక్షాత్కారాల విషయము నగరమంతా వ్యాపించింది. దాదా దగ్గర సత్సంగంలో కూర్చుంటే సాక్షాత్కారమును పొందవచ్చు అని అందరికీ తెలిసింది. ఈ అద్భుతాన్ని చూడటానికి ఎంతోమంది వచ్చేవారు.

సత్సంగానికి వచ్చినవారు, తమకు కలిగిన సాక్షాత్కారాలతో అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవించేవారు, ఇందుకు కారణం దాదాయే అని భావించేవారు. కానీ ఈ అద్భుత కార్యం వెనుక ఉన్నది జ్యోతి స్వరూపుడైన శివబాబా అని, దాదా ముఖారవిందం ద్వారా శివ బాబా జ్ఞానాన్ని అందిస్తున్నారన్నది క్రొత్తగా వచ్చేవారికింకా అర్థం కాలేదు. సాక్షాత్కారాల ప్రక్రియ మొదలైన ప్రారంభ దశలో దాదాకు కూడా దీని వెనుక ఉన్న ఆంతర్యం, మూల పురుషుడు ఎవరు అని అర్థం కాలేదు. కాల క్రమంలో ఇది శివ బాబా ప్రేరణలు అని అర్థమయింది.

సంపన్నుల కుటుంబానికి చెందిన రుక్మిణి అనే మహిళ సత్సంగానికి వచ్చేవారు. ఆమె మామగారు సమాజంలో మంచి పేరును గడించి ఉన్నారు. ఆ సమయంలో, భర్తను పోగొట్టుకున్న రుక్మిణి ఎంతో అసంతృప్తిగా ఉండేది. దాదా సత్సంగంలో నీకు ప్రశాంతత లభిస్తుందని ఆమె స్నేహితులు రుక్మిణికి సూచించారు. అనాసక్తంగానే రుక్మిణి సత్సంగానికి వెళ్ళి అక్కడ చెప్పేవి వినసాగింది. దాదాలోని అలౌకికత, ప్రవచనాలు ఆమెలో ఎంతో ధైర్యాన్ని నింపాయి. మనసులో ఎంతో సంతోషము, తృప్తి నిండుకున్నాయి. ఎంతో సంతోషంగా ఇంటికి తిరిగి వెళ్ళి కుటుంబ సభ్యులను కూడా సత్సంగానికి తనతో మరుసటి రోజు రమ్మని చెప్పింది. “ఓం బాబాను చూడటానికి రేపు మనమందరమూ వెళ్దాము. బాబాలో ఏదో తెలియని శక్తి ఉంది. వారి ప్రవచనాలలో అమృతం కురుస్తుంది. ఆ సత్సంగము నా మనసుకు ఎంతో ప్రశాంతతను ఇచ్చింది. వారి మస్తకంలో ఒక దివ్య తేజస్సు ప్రకాశిస్తుంది. అశాంతితో ఉన్నవారికి ఆ సత్సంగంలో ఎంతో ప్రశాంతత కలుగుతుంది.”

అప్పటివరకు మనస్తాపంతో ఉన్న రుక్మిణిలో వచ్చిన ఈ మార్పును చూసి కుటుంబ సభ్యులు ఎంతో ఆశ్చర్యానికి లోనయ్యారు. మరుసటి రోజు రుక్మిణితోపాటు ఆమె కూతురు గోపి కూడా సత్సంగానికి వెళ్ళింది. అక్కడ సత్సంగంలో ఓం బాబాను చూడగానే తాను భగవంతుడి సమక్షంలో ఉన్నట్లుగా గోపికి అనుభవమయ్యింది. బాబా శరీరంలో పరమాత్మ గుప్తరీతిలో ఉన్నారు. అయినా, నిజమైన జ్ఞాన పిపాసతో ఉన్నవారికి ఈ విషయము ఏ మాత్రము గోప్యం కాదు.

గోపికి ఎన్నో సాక్షాత్కారాలు కలిగాయి. వారు తనను తాను ఒక అతి సూక్ష్మ ఆత్మగాకూడా చూసుకుంది. నేను నిజమైన గోపికని (భగవంతుడి ప్రేయసి) అని వారికి దృఢంగా అనిపించింది. ఆమే ఆ తర్వాత కాలంలో దీదీ మన్మోహినిగా యజ్ఞంలో సుపరిచితులయ్యారు. దాదీ ప్రకాశ్‌మణితో కలిసి వీరు సహ సంచాలకులుగా తమ అంతిమ శ్వాస వరకు అనగా జులై 1983 వరకు తన సేవలను బ్రహ్మాకుమారీ సంస్థలో అందించారు.

# జ్ఞానముతో సహజ సమాధి

బాబా సత్సంగానికి వచ్చిన స్త్రీ పురుషులకు అనేక అనుభవాలు జరగసాగాయి. ఇటువంటి అనుభవాలను లెక్కించడం అసాధ్యమేనని చెప్పవచ్చు. ఈ సత్సంగాన్ని ఓం మండలి అన్న పేరుతో పిలవనారంభించారు. దాదీ హృదయ పుష్పగారి అనుభవాల సంగ్రహము మనకు ఈ దివ్యమైన అలౌకిక అనుభూతులను కళ్ళకు కట్టినట్లు చెప్తుంది –

"నా చిన్నతనంనుండి, మా బంధువులలో ఎవరికైనా పెళ్ళి కుదిరింది అని తెలియగానే ఏదో తెలియని అసంతృప్తి భావాలు నాలో కలిగేవి. నాకెందుకు అలా అనిపించేదో నాకే తెలియదు. చివరకు నా పెళ్ళి నిశ్చయమయింది. అప్పటినుండి నేను ఏడుస్తూనే ఉన్నాను. ఆధ్యాత్మిక జీవితాన్ని గడపాలని నాలో ఇంతకాలం అణగారి ఉన్న కోరిక ఇప్పుడు నిదానంగా బయటకు రావడం ప్రారంభించింది.

"చివరకు నా పెళ్ళి రోజు వచ్చింది. కానీ ఆ పెళ్ళి రోజు నా మృత్యు రోజుగా అనిపించింది. కానీ నేనేమీ చెయ్యలేని పరిస్థితి. అదృష్టవశాత్తూ, నా భర్త ధార్మిక ఆలోచనలు కలిగిన వ్యక్తి. అతనిలో కొద్దిగా కూడా కామ వాంఛ లేదు. కావున మేమిద్దరమూ ప్రశాంతంగా జీవిస్తున్నాము. అతనికి అనారోగ్యం వచ్చినప్పుడు నేను ఒక నర్సులా, ఎంతో విధేయతతో సేవలు చేసాను. నా భర్త పట్ల నాకు ఎటువంటి వికార దృష్టి లేదు.

"చక్కని వైద్యము, ప్రత్యేక శ్రద్ధను నిరంతరం అందించినప్పటికీ అతని ఆరోగ్యం మరింత క్షీణించింది. వివాహమైన ఆరు నెలలకే నా భర్త చనిపోయాడు. నా తల్లిదండ్రులు ఎంతో బాధపడ్డారు. కొంతకాలం క్రితంవరకు నేను పెళ్ళికాని, ఎటువంటి బంధనాలు లేని కన్యను. ఇప్పుడు నన్ను అందరూ ఒక వితంతువుగా చూస్తారు. నా సోదరుడు చిన్న వయస్సులోనే చనిపోయాడు. ఒక్కగానొక్క కొడుకు అకాలంలో మృతి చెందడాన్ని నా తల్లిదండ్రులు తట్టుకోలేకపోయారు. ఇంతలోనే నా భర్త చనిపోవడం వారిని మరింత కృంగదీసింది. వారిని చూసి నాకు చాలా బాధ కలిగేది. మాది ఉన్నత కులానికి చెందిన పేరు మోసిన ధనిక కుటుంబము. కనుక, మా ఈ దుఃఖము సింధ్, హైదరాబాద్‌లో చాలామందికి తెలిసిపోయింది. ఓం బాబాకు కూడా మా విషయము తెలిసింది.

"ఓం బాబా గురించి నేను ఎంతో విని ఉన్నాను. అక్కడికి వెళ్ళిన వారికి మానసిక ప్రశాంతత కలిగి సాక్షాత్కారాలను కూడా పొందుతున్నారని విన్నాను. ఒకరోజు నేను కూడా సత్సంగానికి వెళ్ళాను. అక్కడ చెప్పే విషయాలను ఎంతో శ్రద్ధతో విన్నాను. అక్కడ చెప్పే విషయాలు నిజమైనవే. బాబాలో అపారమైన శాంతి నిండి ఉంది. వారి సమక్షంలో ఉన్నంతనే నాలో కూడా సంతోషపు కెరటాలు ఎగిసాయి.

బాబా అడిగారు, 'నీవు ఎవరు? నీవు ఎవరో నీకు తెలుసా?'

నేనన్నాను, 'నేను దుఃఖంతో ఉన్న మహిళను.'

బాబా – సరే, ఈ ప్రపంచంలో సుఖము ఉందా, దుఃఖము ఉందా?

నేను – ఈ ప్రపంచము ఎంతో దుఃఖముతో ఉంది.

బాబా – ఇక్కడ కూర్చో అంటూ బాబా నన్ను తన వద్ద కూర్చోబెట్టుకుని ఒక మనిషి బొమ్మను గీసారు. రెండు కనుబొమ్మల మధ్యన ఆత్మను చూపించారు. దీనిని బాబా ఈ విధంగా వివరించారు, 'చూడు, ఈ శరీరము పంచ తత్వాలతో తయారైనది. ఇది వినాశి. దీని శరీరంలో ఉన్న ఆత్మ అవినాశి. ఆత్మలో మనసు, బుద్ధి, సంస్కారాలు అను మూడు సూక్ష్మ శక్తులుంటాయి. ఆత్మ చైతన్యమైనది, అమరమైనది, అవినాశి. శరీరము, ఆత్మ వేర్వేరు. శరీరము నశిస్తుంది, కాలుతుంది. కానీ ఆత్మ కాలదు. అది ఒక శరీరం నుండి మరో శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఇప్పుడు చెప్పు, ఈ రెండింటిలో నీవెవరు? నీవు పంచ తత్వాలతో తయారైన శరీరమా లేక ఆత్మవా?

నేనెంతో ఆశ్చర్యపోయాను. నా కళ్ళముందు ఉన్న తెర మాయమైనట్లుగా నాకు అనిపించింది. నేనన్నాను,

'బాబా, మీరు చెప్పినదాని ప్రకారంగా అయితే నేను ఆత్మను.'

"బాబా అన్నారు, 'ఆత్మ స్వధర్మము శాంతి. ప్రకృతి తత్వము అశాంతి. నిన్ను నీవు తత్వాలతో తయారైన శరీరంగా భావిస్తే అశాంతిపాలవుతావు. ఇప్పుడు చెప్పు, నీవు దుఃఖంతో ఉన్న మహిళవని ఎవరన్నారు? నీవు దుఃఖంతో ఉన్న మహిళవా లేక శాంత స్వరూప ఆత్మవా?'

"ఇది విన్న తర్వాత నాలోని అజ్ఞానపు పొరలు మాయమయ్యాయి. 'అవును, నేను శాంత స్వరూప ఆత్మను.' బాబా మాటల్లోని సత్యాన్ని నేను గ్రహించాను. బాబా అన్నారు, 'దేహ భానమునుండి నీ బుద్ధిని దూరంగా తీసుకువెళ్ళు. అశరీరిగా ఉండు. నిన్ను నీవు అవినాశి ఆత్మగా భావించు. నీ సత్య రూపాన్ని చూసుకో.

"బాబా ఇలా మాట్లాడుతూ ఉండగానే నేను ఆత్మ స్వరూపంలో స్థితి అయ్యాను. నేను నా శరీరాన్ని పూర్తిగా మర్చిపోయాను. నేను ఒక సూక్ష్మ బిందువుగా అయ్యి పై పైకి ఎగరడం నేను చేసాను. షుమారు రెండు గంటలపాటు నేను ఈ సహజ సమాధి స్థితిలో కూర్చున్నాను.

"సమాధి స్థితి నుండి క్రిందకు వచ్చాక, బాబా నన్ను పిలిచి అడిగారు, 'నీవు ఎవరు?' 'నేను ఆత్మను' అని అన్నాను. బాబా మళ్ళీ ఇలా అడిగారు, 'ఇప్పుడు నువ్వు సంతోషంగా ఉన్నావా లేదా?' 'నేను సంతోషము, శాంతితో ఉన్న ఆత్మను. నా అంత సంతోషంగా మరెవ్వరూ లేరు.' బాబా చిరునవ్వుతో, 'ఈరోజు పాఠాన్ని బాగా గుర్తుంచుకో. రేపు మరొక పాఠాన్ని నేర్పిస్తాను' అని అన్నారు.

ఆ సమయంలో నా మనసు ఇలా పాడింది:

*నీవు నాకు జ్ఞానాన్ని వినిపించావు, అజ్ఞాన నిద్రలో ఉన్న మనసును మేల్కొల్పావు*
*నీవు నాకు యోగమును నేర్పించావు, మానవునినుండి దేవతగా చేసావు*
*మేల్కొలిపి ఆత్మ నిష్ఠను నేర్పించావు!*
*ఒక్క క్షణంలో యోగిగా చేసావు, 'అహమ్' మరియు 'మమ' యొక్క రహస్యాన్ని తెలిపావు*
*అహమ్ 'ఆత్మ', మమ ప్రకృతి అన్న జ్ఞానాన్ని తెలిపి నన్ను ఉన్నత సింహాసనంపై కూర్చోబెట్టావు*
*మేల్కొలిపి పవిత్ర మార్గాన్ని చూపావు!*

"బాబా వద్దకు వచ్చేటప్పుడు నేనెంతో బాధతో ఉన్నాను, కానీ ఇప్పుడు ఇంటికి తిరిగి వెళ్ళేటప్పుడు మాత్రం ఎంతో సంతోషంతో ఉన్నాను. ఇంటికి వెళ్ళి నేను మా తల్లిగారికి జరిగినదంతా చెప్పాను. నాలో వచ్చిన మార్పును వారు గమనించారు. మా తల్లిగారి బాధను చూసి నేనిలా చెప్పాను, 'మీరెందుకు చింతిస్తున్నారు? ఆత్మ అవినాశి, అమరమైనది. నీవు శాంత స్వరూప ఆత్మవు.' ఇది విన్న మా తల్లిగారిలో కూడా తెలియని క్రొత్త ఉత్సాహం నెలకొన్నది. ఆ క్షణంలో వారి బాధ మాయమైపోయినట్లుగా అనిపించింది. నన్ను రోజూ బాబా సత్సంగానికి వెళ్ళి అక్కడ బాబా చెప్పే జ్ఞానాన్ని విని తిరిగి ఇంటికి వచ్చాక తనకూ చెప్పమని మా తల్లిగారు నాకు చెప్పారు. ఒకరోజు నేను బాబాకు మా తల్లిగారి గురించి చెప్పి ఆమె చాలా చింతలో ఉన్నారని అన్నాను. అయితే నేను వారిని చూడటానికి మీ ఇంటికి వస్తాను' అని దయాళువైన బాబా వెంటనే మా ఇంటికి వచ్చి మా తల్లిగారిని కలిసారు.

బాబాను చూసిన వెంటనే మా తల్లిగారికి తమ స్వధర్మము అనుభూతి అయింది. అంతేకాక చతుర్భుజుడైన విష్ణు సాక్షాత్కారము కూడా జరిగింది. ఇప్పుడు ఆమె ముఖంలో మానసిక శాంతి రేఖలు కనిపించసాగాయి. ఈ ధ్యానావస్థలోనే మా తల్లిగారు చాలాసేపు ఉండిపోయారు. ధ్యానావస్థ నుండి క్రిందకు వచ్చిన మా తల్లిగారు బాబాను చూసి చిరు మందహాసాన్ని చిందించారు. అప్పుడు బాబా ఆమెకు జ్ఞానాన్ని వినిపించారు."

ఈ విధంగా అనేక నరనారీమణులకు ఇక్కడ సత్యమైన మనశ్శాంతి లభించింది. దుఃఖాన్ని తొలగించి సత్యమైన ఆంతరిక శాంతిని ఇవ్వడానికి భగవంతుడే స్వయంగా అవతరించాడన్న సత్యాన్ని వారందరూ గ్రహించారు.

# సమాజ సంస్కరణ

ఆ రోజుల్లో, సింధ్ సమాజంలో ఒక ఆచారము ఉండేది. ఇంట్లో ఎవరైనా చనిపోతే ఆ ఇంట్లోని స్త్రీలు మట్టి పులిమిన నల్లని మురికిపట్టిన వస్త్రాలు ధరించి ఆచారం ప్రకారంగా రోదిస్తూ ఉండాలి. హృదయ పుష్పగారి తల్లిగారి పరిస్థితి కూడా ఇదే. మైల వస్త్రాలను ధరించి రోజంతా ఏడుస్తూ ఉండేవారు. కానీ బాబా చెప్పే జ్ఞానాన్ని విన్న తర్వాత మా తల్లిగారు అమానుషమైన సామాజిక కట్టుబాట్లనుండి బయటకు రాగలిగారు. బిడియము, అసురీ మర్యాదలు, చెడు రీతులను దాటుకుని వచ్చారు. మైల వస్త్రాలను ధరించడం మానేసి ఆత్మిక సుఖంలో జీవించడం ప్రారంభించారు.

ఓం మండలిలో బ్రహ్మా బాబా వినిపించే జ్ఞాన సందేశాన్ని విన్న అనేకమంది మహిళలు ఈ విధమైన సంస్కరణలను వారి జీవితాలలో తీసుకురాగలిగారు. కట్టుబాట్లకు కట్టుబడి ఉండే ఇటువంటి సమాజంలో ఇది కనీవినీ ఎరుగని మార్పు.

పాశ్చాత్య సభ్యతకు అలవాటుపడ్డ ధనిక మహిళలు ఫ్యాషన్ దుస్తులు, సొగసైన ఆభరణాలను ధరించేవారు. జీవితాన్ని తేలికగా గడుపుతున్న ఇటువంటి మహిళలు సమాజంలో అందరితో సభ్యతతో కూడా వ్యవహరించేవారు కాదు. అటువంటి ఎందరో మహిళలు ఓం మండలికి వచ్చేవారు. తాము నడుస్తున్న మార్గం తప్పని అర్థం చేసుకున్నారు. ఫ్యాషన్ స్వేచ్ఛకు గుర్తు కాదు, కామవాసన సుఖాన్ని ఇవ్వదు. ఇతరులతో అసభ్యత సంతృప్తిని ఇవ్వదు. బ్రహ్మాబాబా పలికే పలుకులలోని సత్యాన్ని అర్థం చేసుకున్నవారు ఆడంబరాలకు, సోమరితనానికి స్వస్తి చెప్పారు. బ్రహ్మాబాబా మార్గదర్శకత్వం మరియు ఆత్మిక సహకారముతో వారు తిరిగి నిరాడంబర జీవితాన్ని ప్రారంభించారు.

సింధ్‌లోని ప్రజలలో ఓం మండలిపై గౌరవ భావాలు మరింత పెరిగాయి. ఎందుకంటే శతాబ్దాలనుండి వస్తున్న దురాచారాలను – దురాచారాలని తెలిసినాకానీ ఎవ్వరూ ఏమీ చెయ్యలేని పరిస్థితిలో – ఓం మండలి మరియు ఓం బాబా ఆధ్యాత్మిక జ్ఞానముతో వాటి సంస్కరణను తీసుకువచ్చారు. జీవితంలో వారికి ఎదురయ్యే వ్యక్తిగత సమస్యలకు కూడా బ్రహ్మాబాబా ఆధ్యాత్మిక పరిష్కారాన్ని ఇచ్చేవారు. ఓం మండలి ఖ్యాతిని విని అనేక కుటుంబాలవారు తమ కూతుర్లను, కోడళ్ళను ఇక్కడకు పంపేవారు.

# ఓం రాధ

ఇటువంటి సుందర సత్సంగానికి వచ్చే మహిళలు, సోదరీలలో ఒక విశిష్ట కన్య ఉండేవారు. వీరు జ్ఞాన సందేశాన్ని పూర్తిగా తమలో ఆకళింపు చేసుకున్నారు. వారికున్న సంపూర్ణ సమర్పణ భావం కారణంగా ప్రపంచంలోనే వారొక ఉన్నత వ్యక్తిత్వం కలవారిగా ఎదిగారు.

వారి పేరు రాధ. సత్సంగంలో వారిని అందరూ ఓం రాధ అని పిలిచేవారు. వివేకము, ప్రేమ, సుగుణాలు అన్నీ కలబోసి ఉన్న తీక్షణ బుద్ధిగల కన్య వీరు. జ్ఞానాన్ని అర్థం చేసుకోవడంలో వారికి వారే సాటి. విన్న జ్ఞానాన్ని మననము చేసి అందులో దాగి ఉన్న భావార్థాలను వెలికి తీసేవారు.

కాలేజీ చదువులలో కూడా వారు ప్రథమ స్థానంలో నిలిచేవారు. ఇప్పుడు వీరు తమకున్న బుద్ధి కౌశలాన్నంతా భగవంతుడి సేవకే వినియోగించేవారు. సమాజ శ్రేయస్సు కోసం వారు బ్రహ్మాబాబాకు కుడి భుజంలా సహాయపడేవారు. బ్రహ్మాబాబా ముఖారవిందం నుండి జ్ఞానం విన్న మొదటిసారే జీవిత పరమార్థం ఇక్కడే ఉందన్న సత్యాన్ని వారు గ్రహించారు.

ఓం రాధ ఒక మధుర గాయని కూడా. ఓం మండలికి వచ్చిన ప్రారంభ దశలో వారి మనసు నుండి జాలువారిన అనుభవయుక్త పంక్తులు:

*"ఓ సఖులారా! ఓం మండలిలో నేనేమి చూసానో ఎలా వర్ణించను, ఏమని వర్ణించను?*
*ఓ సఖులారా! ఆ ఆనందాన్ని ఎలా వర్ణించను?*
*అక్కడి ఓంకారాలాపన నా మనసులో బాణములా గుచ్చుకున్నది*
*నా మనస్సు శీతలమై నా దుఃఖమంతా అంతరించింది"*

ఓం రాధ సత్సంగానికి రాక ముందు బాబా భార్య అయిన యశోదకు ఒక సాక్షాత్కారము కలిగింది. రాధయే భవిష్యత్తులో శ్రీలక్ష్మి అవుతుందని, రాధకు తాను రాజ్య భాగ్యమును ఇస్తున్నట్లుగా యశోదకు కనిపించింది. కానీ దీనిలోని అంతరార్థము ఆ సమయంలో యశోదకు అర్థంకాలేదు. రాధ ఎప్పుడైతే సత్సంగానికి రావడం ప్రారంభించిందో అప్పుడు యశోదకు తనకు కలిగిన సాక్షాత్కారములోని భావార్థము అర్థమయింది. ఎందుకంటే రాధ అనతి కాలంలోనే జ్ఞాన స్వరూపిణి, శక్తి స్వరూపిణిగా మారింది. అందుకే వారి పేరును జగదాంబ సరస్వతి, జ్ఞాన దేవిగా మార్చడం జరిగింది.

# కుటుంబ సభ్యులలో జ్ఞాన ప్రభావము

శివబాబా వినిపించే జ్ఞానముపట్ల తన కుటుంబ సభ్యులకు కూడా ఆసక్తి కలగడానికి బాబా ప్రయత్నించారు. 'ధర్మము ఇంటినుండి ప్రారంభమవుతుంది' అన్న సూక్తిపై బాబాకు ఎంతో విశ్వాసం ఉండేది. భగవంతుడి అవతరణను ప్రత్యక్షంగా చూసి ఆధ్యాత్మిక అనుభూతులను పొందాలన్న లక్ష్యంతో దేశంలోని నలుమూలల నుండి ఎంతోమంది ఓం మండలికి వస్తున్నారు. అటువంటప్పుడు బాబా బంధువులు ఈ జ్ఞానము నుండి ఎందుకు లాభపడకూడదు? ఇంతటి మహదవకాశాన్ని వారు జారవిడుచుకోవడం బాబాకు ఇష్టం లేదు.

బాబా భార్య మరియు కోడలు ముందునుండే ధర్మ పరాయణత కలవారు. వారికి బాబాపట్ల ఎనలేని గౌరవభావం ఉండేది. ఒక గొప్ప శక్తి బాబా శరీరంలోకి ప్రవేశించి వారి ముఖారవిందం ద్వారా జ్ఞానాన్ని వినిపిస్తుంది అని వారు నిస్సందేహంగా నమ్మారు. ఆ మహాశక్తి వెలువరించే శక్తి అపారమైనది, మార్గదర్శన ఉన్నతమైనది, భాష భవ్యమైనది, భావాలు విముక్తిదాయకమైనవి. ఇటువంటి గొప్ప జ్ఞానాన్ని అందించగలిగినవారు ఒక్క శివ పరమాత్మ తప్ప మరెవ్వరూ కాదు అని వారికి సంపూర్ణ నిశ్చయము ఉంది.

శివబాబా ఆజ్ఞలను పాటించడానికి వారు మనస్ఫూర్తిగా పురుషార్థము చేసారు. ఆత్మనిష్ఠులగుటకు కృషి చేసారు. జ్ఞానము అందించే విభిన్న అంశాలను మనసులో స్థిరపరుచుకునేందుకు నిరంతరం శ్రమ చేసారు. వారిలోని సుగుణాలను పెంచుకుని, మోహాన్ని త్రుంచుకోవడంలో నిమగ్నమైపోయారు. వీరి తపన చూసిన బ్రహ్మ బాబా సంతృప్తి చెంది తమ పెద్ద కూతురిపై దృష్టి సారించారు.

శివబాబా బ్రహ్మబాబాలోకి అవతరించక మునుపే బాబా తన పెద్ద కూతురి వివాహము ఒక సంపన్న కుటుంబంలోని వ్యక్తితో చేసారు. తన కూతురిని భవబంధాలలోకి తోసి తప్పు చేసానని జ్ఞాన ప్రాప్తి తర్వాత బాబా చింతించారు. వారికి తిరిగి జ్ఞాన మార్గాన్ని చూపాల్సిన బాధ్యత తనదే అని కూడా బాబా భావించారు.

దాదీ నిర్మల శాంతగారు తమ అనుభవాలను ఈ విధంగా పంచుకుంటున్నారు –

"భగవంతుని భాగ్యశాలి రథముగా కాకముందు బాబా జీవితము రాజరికముతో మరియు భక్తితో నిండి ఉండేది. అందుకే బాబా నా వివాహము సంపన్న కుటుంబంలోని ముఖితో చేసారు (ముఖి అనగా సమాజంలో రాజకీయ పరపతి కలిగిన వ్యక్తి).

"మా అత్తవారింట్లో భౌతిక సుఖాలకు ఎటువంటి లోటు లేదు. నాకు వివాహము కాకముందు, బాబాతో ఉన్నప్పుడు కూడా నేను సంతోషంగానే ఉన్నాను, నిశ్చింతగా ఉన్నాను. బాబా మమ్మల్ని ఏ లోటు తెలీకుండా పెంచారు. వారు మమ్మల్ని ఎంతో ప్రేమతో, శ్రద్ధతో పెంచారు. ఆ ప్రేమ ఎంత గొప్పది అని తర్వాతగానీ నాకు తెలీలేదు. నాకు భక్తి, పూజలపట్ల విశేష ఆకర్షణ ఉండేది కాదు. నాకు అన్నీ ఉన్నాయికదా, మరెందుకు భక్తి చెయ్యాలి అని అనుకునేదాన్ని. కానీ పరమపిత శివ మా తండ్రిగారి శరీరంలో ప్రవేశించిన తర్వాత నా జీవితం పూర్తిగా మారిపోయింది. బాబాకు మాపై మోహము, ఆసక్తి లేవు అని అనిపించింది. నేను వారిని కలవడానికి వెళ్ళినప్పుడు వారి ప్రేమ, ఔదార్యము మునుపటికన్నా ఎక్కువగా ఉండేవి కానీ అవి భిన్నంగా అనిపించేవి. ఇప్పుడు బాబా భగవంతుని ప్రేమలో నిమగ్నమై ఉన్నారు. ఇప్పుడు ప్రపంచమంతా వారి కుటుంబమే. మా తల్లిదండ్రులను కలుసుకోవడానికి వెళ్లినప్పుడల్లా వారు నాకు జ్ఞానాన్ని వినిపించేవారు. మొదట్లో ఇది నాకు ఇబ్బందిగా, అయిష్టంగా అనిపించేది. మా తల్లిదండ్రులతో మునుపటిలా మాట్లాడలేకపోతున్నాను. ఇదంతా వారు నా మంచి కోసమే చేస్తున్నారని గ్రహించలేకపోయాను. ఇంతటి ఉన్నత మార్గాన్ని అనుసరించే సువర్ణావకాశాన్ని నేను వదులుకోకూడదని వారి శుభ భావన. కానీ ఇదంతా నాకు అర్థం కాలేదు. వీరు మారిపోయారు, మునుపటిలా లేరు, దూరంగా అనిపిస్తున్నారు అని మాత్రమే ఆలోచించేదాన్ని. చివరకు వారి శుభ భావన ఫలరూపం

దాల్చింది.

"ఆ రోజుల్లో ఏదైనా పండుగ వస్తే బాబా నన్ను భోజనానికి పిలిచేవారు. అలా ఒక రోజు నేను అక్కడకు వెళ్ళినప్పుడు, అక్కడ ఎంతోమంది మహిళలు జ్ఞానాన్ని శ్రద్ధగా వింటున్నారు, మరికొంతమంది నాట్యం చేస్తున్నారు. అది సాధారణ నాట్యం కాదు. అది చూసిన వెంటనే నాకది నచ్చలేదు కానీ వారు ఏమి చేస్తున్నారన్నది తెలుసుకోవాలన్న కుతూహలంతో వారి వద్దకు వెళ్ళాను. వారి ముఖాలలో ఎన్నడూ చూడని ఒక అనిర్వచనీయమైన సంతృప్తి, అతీంద్రియ సుఖము కనిపించాయి. ఈ భౌతిక ప్రపంచాన్ని పూర్తిగా మర్చిపోయి వారు ధ్యానావస్థలో ఉన్నారు. వారు వారి మనో నేత్రాలతో ఏమి చూస్తున్నారు! పరస్పరంలో ఇంతటి సమతుల్యతతో కూడిన హావభావాలను వీరెలా ప్రకటించగలుగుతున్నారు!

"వీరందరూ నాకు తెలుసు. వీరెప్పుడూ నాట్యం చేసి ఎరుగరు. కానీ ఇంతటి చక్కని నాట్యాన్ని వారు ఎలా చెయ్యగలుగుతున్నారు! నాట్యంలో ప్రావీణ్యం సంపాదించిన వారు కూడా ఇంతటి ఆహ్లాదకరమైన కళను, భంగిమలను ప్రదర్శించరేమో అని నాకనిపించింది. వారెవ్వరూ సాధారణ చేతన స్థితిలో లేరు. వారు మానసికంగా సత్యయుగానికి పయనమై అక్కడ శ్రీకృష్ణునితో మహా రాస్(రాసక్రీడ) చేస్తున్నారని నాకు తెలియదు. ఆ క్షణాన వారు భవిష్యత్తులోకి వెళ్ళారు, బంగారు యుగంలో వారి రాబోవు జన్మలోకి వెళ్ళారు! భగవంతుడు ప్రసాదించిన ఈ దివ్య సాక్షాత్కారము వలననే వీరిలో ఇంతటి శక్తి కనిపిస్తుంది.

"వారి ముఖములో ప్రశాంతత, ప్రేమ, భగవంతుడిని కలుసుకున్నాము అన్న ఆనందాన్ని నేను చూడగలిగాను. వారిలోని ఈ శక్తి చుట్టుప్రక్కల వాతావరణాన్ని కూడా పవిత్ర శక్తితో నింపడాన్ని గమనించాను.

"నాట్యం పూర్తయిన తర్వాత వారికి ఎటువంటి అనుభూతి కలిగింది అని వారిలోని ఒకరిని నేను ప్రశ్నించాను. కానీ ఆ స్త్రీమూర్తి ఇంకా దివ్యానందంలోనే ఉన్నారు, ఈ భౌతిక ప్రపంచానికి దూరంగా, ఆ దివ్య స్మృతిలోనే మునిగి ఉన్నారు. నేను రేపు చెప్తాను అని ఎంతో మెల్లగా బదులిచ్చారు. మరుసటి రోజు వారు ఏమి చెప్తారా అని నాలో చాలా ఆసక్తి కలిగింది. కనుక, నేను బాబా వద్దకు వెళ్ళి నాకు రేపు కారు పంపించండి, నేను వస్తాను అని చెప్పాను. బాబా అన్నారు, 'అలాగే, రేపటి సంగతి తర్వాత చూద్దాము'. బాబా ఇలా చెప్పడము నాకు సంతోషంగా అనిపించలేదు. నేనన్నాను, 'బాబా, మీరెందుకు ఇలా మాట్లాడుతున్నారు?' బాబా అన్నారు, 'నాకు కారును పంపే ఆలోచనే ఉంది కానీ రేపు ఏమి జరుగుతుందో రేపు చూద్దాము.'

"నేను చాలా గారాబంగా పెరిగాను. నేను ఏది అడిగితే అది నాకు తెచ్చి ఇచ్చేవారు. బాబానుండి ఇటువంటి జవాబు నేను ఊహించలేదు. మునుపెన్నడూ బాబా ఈ విధంగా మాట్లాడలేదు. నా అజ్ఞానం కారణంగా దానిని నేను నా అవమానంగా భావించాను. ఇంతకముందైతే, 'బాబా, నాకు ఆకాశంలోని నక్షత్రాలు కావాలి' అంటే కూడా బాబా నాకోసం తెచ్చి ఇచ్చేవారు. కానీ ఇప్పుడు, నేను కేవలం కారును పంపమంటే కూడా బాబా సంకోచిస్తున్నారు. నాకు చాలా కోపం వచ్చి ఇంటినుండి బయటకు వచ్చేసాను. బాబా నా వెనుకనే వచ్చి నన్ను కారులో కూర్చోబెట్టి, వారు కూడా నాతోపాటు వచ్చి నన్ను మా అత్తవారింట్లో దిగబెట్టారు. అయినాకూడా వారిమీద కోపం పోలేదు. కారు దిగుతూ కోపంగా బాబాతో ఇలా అన్నాను, 'మీరు రేపు కారు పంపకపోతే నేను రాను.' అప్పుడు బాబా నాతో అన్నమాట నాకు బాగా గుర్తుంది. బాబా తమ నయనాలతో నవ్వుతూ గంభీర కంఠంతో ఇలా అన్నారు, 'రేపు ఏమి జరుగుతుందో మనం చెప్పగలమా?' నేనన్నాను, 'రేపు ఏమవుతుందో రేపే చూసుకుందాములే' అని విసురుగా లోపలకు వెళ్ళిపోయాను.

"అత్తవారింటికి చేరుకున్న ఆ రాత్రి వెంటనే నాకు నిద్రపట్టేసింది. నేను నిద్రపోయాను. రాత్రి షుమారు 2.30గం॥ల సమయంలో నాకు మెలకువ వచ్చింది. చూస్తే నా గది అంతా తేజస్సుతో నిండిన ప్రకాశముతో నిండి ఉంది. అది స్థూలమైన ప్రకాశము కాదు. ఆ ప్రకాశము మధ్యలో బాబా ఉన్నారు. నాకళ్ళను నేనే నమ్మలేకపోయాను. నెమ్మదిగా ఆ

దృశ్యం కనుమరుగయింది. ముందురోజు సాయంత్రం బాబాతో మాట్లాడిన కారణంగా నాకిలా కనిపిస్తుందేమో, ఇది ఒక కల తప్ప మరేమీ కాదులే అని నన్ను నేను సమాధానపరుచుకుని మళ్ళీ నిద్రపోవడానికి ప్రయత్నించాను. కానీ మళ్ళీ గది అంతా తేజోమయమైన ప్రకాశంతో నిండిపోయింది. నేను నమ్మలేకపోయాను. మళ్ళీ నిద్రపోవడానికి ప్రయత్నించాను. ఈ ఘటనను నేను అర్థం చేసుకోలేకపోయాను. కానీ సత్యత నుండి దూరంగా వెళ్ళలేము కదా! మూడవ సారి బాబా కనిపించారు. ఈ సారి బాబా ప్రక్కన శ్రీకృష్ణుడు నిలుచుని ఉన్నారు. నేను ఎప్పుడూ విననంత మధుర స్వరంతో బాబా నాతో ఇలా మాట్లాడారు, 'అమ్మా! మేలుకో. నీవు విశ్వ కళ్యాణ కార్యాన్ని చెయ్యవలసి ఉంది.'

"బాబా మాటలు బాణాలుగా నా మనసును హత్తుకున్నాయి. ఆ క్షణమే నాలో పరివర్తన మొదలయింది. బాబా చెప్పినదానికి జవాబు ఇస్తూ నేనిలా అన్నాను, 'బాబా, మీలో నిజంగా భగవంతుడు ఉన్నారు. నేనది ఇప్పటివరకూ గుర్తించలేదు. ఇప్పటినుండి మీరు ఏమి చెప్తే అది నేను చేస్తాను.'

"నాలో నిండిన ఆహ్లాదకరమైన భావాలతో నేను నిద్రలోకి జారుకున్నాను. ఉదయం లేచాక, రాత్రి నాకు కనిపించిన ఆ దివ్యమైన దృశ్యమును అనేకసార్లు నెమరు వేసుకున్నాను. వెంటనే బాబాను కలుసుకోవాలన్న ఆత్రుతతో ఉన్నాను. కానీ మంచం మీదనుండి లేవాలని చూస్తే నాకు ఎంతో నొప్పి కలిగి నేను లేవలేకపోయాను. 'అమ్మా, రేపు ఏమి జరుగుతుందో రేపు చూద్దాము' అన్న బాబా మాటలు అప్పుడు నాకు గుర్తుకు వచ్చాయి. వారి మాటలు నా చెవులలో మారుమ్రోగుతున్నాయి. వారికి భవిష్యత్తు తెలుసు. ఆ ఆలోచనలోనే నేను మునిగిపోయి నాకున్న నొప్పిని కూడా మర్చిపోయాను. నా బాబాలోకి భగవంతుడు ప్రవేశించారు అని నాకర్థమయింది. ఇంతకాలం వారు నాకు చెప్తున్న జ్ఞానమంతటినీ గుర్తు చేసుకుంటూ వచ్చాను. జ్ఞానముపై నేను శ్రద్ధ వహించలేదు. ఆ భగవంతుడు ఒక సాధారణ మానవ రూపంలోకి అవతరించిన కారణంగా నేను గుర్తించలేకపోయాను. ఎంతటి శక్తి, అయినాకూడా నేను ఆ శక్తిని గుర్తించలేకపోయాను...

"సాయంత్రం బాబాయే స్వయంగా నన్ను చూడటానికి వచ్చారు. బాబా గదిలోకి రాగానే నేను వారి ముందు ప్రేమతో నిండిన కన్నీళ్ళు కార్చాను. ఆ సమయంలో నన్ను నేను నియంత్రించుకోలేకపోయాను. పశ్చాత్తాపము, అవగాహనతో నా మనసు నిండిపోయింది. బాబాను కౌగిలించుకుని కన్నీళ్ళతో ఇలా అన్నాను, 'బాబా, ఇప్పుడు నేను మిమ్మల్ని గుర్తించాను. ఇప్పటినుండి మీరు చెప్పింది నేను చేస్తాను.' ఆ రోజునుండి నేను క్రొత్త జీవితంలోకి ప్రవేశించాను.

# జ్ఞానముతో అతీంద్రియ సుఖము

అనేకులలో పరివర్తనను తీసుకురావడానికి ఎంతో సేవ చేసిన బాబా కొంతకాలం ఏకాంతంలో ఉండాలని తలచారు. వారు కుటుంబాన్ని కాశ్మీరుకు తీసుకువెళ్ళారు. ఆత్మ జాగృతి కలిగిన వారు సింధ్‌లోని బాబా ఇంట్లో ప్రతిరోజూ కలుసుకుంటూ ధ్యానము చేస్తూ జ్ఞాన చింతనను కొనసాగించేవారు. వారికి బాబా రోజూ ఉత్తరాల ద్వారా జ్ఞానామృతాన్ని పంపేవారు. వారు ఆ ఉత్తరాలను సత్సంగంలో చదువుతూ దాని గురించి చింతన చేసేవారు. ఉత్తరాల ద్వారా బాబా తెలియజేసే జ్ఞానముతో సత్సంగములోని వారికి పరమానందం కలిగేది. పదాలు ఇంతటి శక్తిశాలిగా, అద్భుతంగా కూడా ఉండగలవా! ఎవరికైతే బ్రహ్మబాబా నుండి జ్ఞానము నిండిన ఉత్తరం వస్తుందో వారు దానిని ఒక గొప్ప బహుమతిగా భావించేవారు. ఆ జ్ఞానాన్ని వినేవారు అందులోని విషయాలను వ్రాసుకుని పదే పదే చదువుకునేవారు. వారి జీవితాలకు ఒక క్రొత్త అర్థం కలిగిందని సత్సంగంలోని వారు భావించేవారు.

కాశ్మీరులో ఉన్నప్పుడు, భగవంతుడు తన ద్వారా తెలియజేస్తున్న జ్ఞానాన్ని చింతన చేస్తూ ఎక్కువ సమయం ఏకాంతంలోనే గడిపేవారు. అందులోని అంతరార్థాలు, గూఢార్థాలు ఏమిటి; మనిషి తన కర్మ బంధనాలను తొలగించుకునే ఉపాయము ఏమిటి; శివబాబా వినిపిస్తున్న జ్ఞానమును సంపూర్ణంగా అనుభవం చేయాలంటే ఏమి చెయ్యాలి అన్న చింతనలో మునిగి ఉండేవారు.

స్వయము అంటే ఒక చేతనము, భౌతికమైనది కాక ప్రకాశ స్వరూపము. నా ఆలోచనలను, భావాలను, నా నిర్ణయ శక్తిని నేను నియంత్రించగలను. నన్ను నేను ఒక భౌతికమైన శరీరంగా భావించినట్లయితే అది కేవలం ఒక భ్రమ మాత్రమే. ఈ భ్రమ మనిషికి కలవరాన్ని, బాధను మిగులుస్తుంది. నేను నా శాశ్వత ఆత్మ స్వరూపాన్ని అనుభవం చెయ్యాలంటే భౌతిక ఆకర్షణలకు దూరంగా ఉండాలి. నేను నా మనసును ఆత్మల ధామమైన పరంధామానికి తీసుకువెళ్ళి అక్కడ ఉన్న శివబాబాను స్మృతి చెయ్యాలి. వారు శాంతి సాగరులు, నేను వారి సుగుణాల సాగరంలో మునిగిపోవాలి...

వర్తమానంలో జరుగుతున్న సంఘటనలను అర్థం చేసుకోవడానికి, శాశ్వత సత్యాలపై అవగాహన కలగడానికి బాబా తమ మనసును జ్ఞానముతో నింపేవారు. ఇప్పుడు బాబా సృష్టి క్రమమును స్పష్టంగా చూడగలుగుతున్నారు.

బాబా ఎన్నో ఉత్తరాలను వ్రాయడమేకాక జ్ఞానాన్ని వినాలన్న ఉత్సుకత చూపించిన వారికి జ్ఞానాన్ని కూడా వినిపించేవారు. అంతేకాక, శివబాబా వినిపించే జ్ఞాన బోధనలను స్వయంలో ధారణ చేసుకోవడానికి, ఆత్మను సంపూర్ణ పావనంగా చేసుకోవడానికి బాబా కూడా ఎంతో పురుషార్థం చేసేవారు.

బాబా లౌకిక కుమార్తె, నిర్మల శాంత దాదీగారు, కాశ్మీరులో ఉన్న సమయంలో జరిగిన సంఘటనను వివరిస్తూ ఆ సమయంలో వారికి కలిగిన దివ్య అనుభూతిని కూడా ఈ విధంగా వివరించారు:

"నేను బాబాతో అమర్‌నాథ్‌కు వెళ్ళాను. మేము గుర్రంపై స్వారీ చేస్తున్నాము. మేము ప్రయాణం చేస్తున్న సమయంలో ఒక పెద్ద తుఫాను వచ్చింది. చాలామంది ప్రయాణం చెయ్యకుండా వెనుదిరిగారు. కానీ బాబా మాత్రం 'మనం మన గమ్యాన్ని చేరుకోవాలి' అంటూ ముందుకు సాగారు. జడివాన, గాలి దుమారాలు ఉన్నప్పటికీ బాబా మాత్రం తమ సంకల్పంలో దృఢంగా ఉన్నారు. బాబా ఎప్పుడూ సాహసంతో ఉంటూ ఎన్ని కష్టాలు వచ్చినాగానీ భయపడేవారు కాదు. ఎప్పుడూ వారిలో కలవరపాటు చూడలేదు.

"చివరకు మేము అమర్‌నాథ్ చేరుకున్నాము. బాబా చాలా సాధారణ వస్త్రాలలోనే ఉన్నారు. కానీ అక్కడి యాత్రికులు వారిని ఒక మహారాజుగా భావించేవారు. ఎందుకంటే బాబా హావభావాలు ఎంతో రాజరికంగా ఉండేవి. అక్కడి పూజారులను మంచులింగం ఎలా ఉద్భవించింది అని బాబా అడిగారు. ముందు వారు చెప్పడానికి సంకోచించినా కానీ, దాదాను ఒక రాజుగా భావించిన వారు మొత్తం వివరించారు – గుహలలోని రాళ్ళనుండి వచ్చే చల్లటి నీరు చుక్క చుక్క ఎలా

క్రిందపడుతుంది, ఆ ప్రతిచుక్క మంచుగా ఎలా మారుతుంది అని పూర్తిగా వివరించారు. ఈ శివలింగం తయారవడము అద్భుతమైతే, స్వయంగా ఆ శివుడే గుప్త రూపంలో దాదా శరీరంలోకి రావడము ఇంకెంత అద్భుతమో కదా!"

అక్కడ సింధ్ హైదరాబాద్‌లో, బాబా లేకున్నాగానీ బాబా ఇంట్లో ప్రతిరోజూ సత్సంగం జరిగేది. జ్ఞానము ఎంతో ప్రభావశాలిగా, ప్రపంచంలోని అన్ని సిద్ధాంతాలు, మతాల సారాన్ని తెలియజేస్తూ మంచిని మనిషిలో పెంపొందించడానికి అవసరమైన శక్తిని ఇచ్చేదిగా ఉన్న కారణంగా జ్ఞానాన్ని విన్న ప్రతి ఒక్కరిలో ఎంతో పరివర్తన రాసాగింది. అతి కొద్ది సమయంలోనే శివబాబా సందేశము సమాజంలో పూర్తిగా వ్యాపించింది.

సత్సంగానికి వచ్చే ప్రతి ఒక్కరి జీవితాలలో పరివర్తన కనపడసాగింది. అశుద్ధ ఆహారపు అలవాట్లను త్యజించారు. సున్నిత స్వభావాన్ని, సోమరితనాన్ని, ఒకరిపై ఆధారపడి బ్రతకడాన్ని, కామ వికారాన్ని, పదవీ కాంక్షను విడిచారు. జ్ఞానాన్ని అర్థం చేసుకున్నవారు తమ ప్రస్తుత కర్మలతో రాబోవు భవిష్య 21 జన్మలకు పుణ్యాన్ని జమ చేసుకుంటున్నాము అని అర్థం చేసుకున్నారు. ఈ ఒక్క జన్మకు అవసరమైన ధనాన్ని సంపాదించడమే జీవిత పరమార్థం కాదు, భవిష్య 21 జన్మలకు కూడా ఎంతో పవిత్రమైన జీవితాన్ని ఏర్పాటు చేసుకోవడము ఎంతో ముఖ్యమని అర్థం చేసుకున్నారు. కేవలం వికారాలను త్యాగం చెయ్యడం వలన వారి భవిష్య జన్మలు సుఖవంతంగా ఉంటాయి! ఇంతటి మంచి అవకాశాన్ని ఎవరు జారవిడుచుకుంటారు!

సత్సంగానికి వచ్చేవారికి అప్రయత్నంగానే ఆత్మ సాక్షాత్కారం కలుగుతుందని, ఆ సాక్షాత్కారాన్ని భగవంతుడే ప్రసాదిస్తున్నాడని సింధ్, హైదరాబాద్‌లో ప్రచారం జరిగింది. కనుక, చాలామంది సత్సంగానికి రావడం ప్రారంభించారు. కొద్దికాలంలోనే సత్సంగము గణనీయంగా పెరిగి 200 వరకు చేరుకుంది.

సాధారణంగా సత్సంగం ఈ విధంగా జరిగేది: సత్సంగాన్ని ఒక పాట పాడి ప్రారంభించేవారు. మ్యూజిక్‌కు అనుగుణంగా ఉండే పాటలను బాబా కాశ్మీరునుండి పంపేవారు. సత్సంగంలోని మాతలందరూ కలిసి పాటను పాడేందుకు ఎంతో ఆసక్తి కనబరిచేవారు. ఆ తర్వాత జ్ఞానయుక్తమైన ఉత్తరాన్ని చదివి ఆనాటి ఉత్తరంలోని అంశంపై ప్రసంగం చేసేవారు. కాల నియమాలు, కర్మల గుహ్య రహస్యము, ఆత్మలోని శక్తులు, భగవంతుని గుణాలు, రాజయోగ విధానము, సనాతన దేవీదేవత ధర్మానికి సంబంధించిన సత్యాలు, నూతన సృష్టి స్థాపన మరియు పాత సృష్టి వినాశనము వంటి జ్ఞాన అంశాలతో మాతల మనసు ఎంతో స్థిరంగా, తేలికగా, శక్తిశాలిగా, పారదర్శకంగా తయారయ్యేది.

ఇదంతా గమనించేవారు ఎంతో ఆశ్చర్యానికి లోనయ్యేవారు. సాధారణ మాతలు ఇంత నిర్భయంగా, నిరాటంకంగా, ఇంత గొప్ప అంశాలపై ఎలా మాట్లాడగలుగుతున్నారు? గొప్ప గొప్ప విద్వాంసులు, పండితులు కూడా ఆలోచించే విషయాలను ఈ మాతలు ఇంత చక్కగా ఎలా చెప్పగలుగుతున్నారు?

ఇది భారతదేశానికి ఎంతో అవసరమైన మార్పు – పురుషాధిక్యానికి స్త్రీలు ఇప్పుడు అణిగి ఉండాల్సిన అవసరం లేదు. దాస్య శృంఖలాలు తెగి ఇప్పుడు ఒక క్రొత్త సంస్కృతి వెలువడింది. ఆరంభం నుండి బ్రహ్మా బాబా, స్త్రీలు–మాతలకే జ్ఞానాన్ని పంచే బాధ్యతను అప్పగించారు. ఇప్పుడు, ఈ అంతర్జాతీయ సంస్థలో ఉన్న స్త్రీ పురుషులు ఎంతో సమతుల్యతతో, పరస్పర గౌరవ భావాలతో తమ సేవలను అందిస్తున్నారు.

ఇవన్నీ శివబాబా సత్సంగంలోనే ప్రారంభమయ్యాయి – అహంకారము అణకువను నేర్చుకుంది, బిడియము భయాన్ని మర్చిపోయింది, లోభి సంతృప్తిని నేర్చుకున్నాడు, క్రోధి ప్రశాంతతను చవిచూసాడు, అన్నిటికన్నా ముఖ్యంగా, ఎవరి కోసమైతే అందరూ వెతుకుతున్నారో ఆ శివబాబాను అక్కడ కనుగొన్నారు.

ఇక్కడి ప్రసంగాలు అద్భుతంగా ఉన్నప్పటికీ ఇక్కడ చెప్పే అంశాలను పలు ఇతర సత్సంగాలలో కూడా చర్చిస్తూ ఉంటారు. 'కోరికలను నియంత్రించుకోవడం ఎలా', 'మనసును, కర్మేంద్రియాలను శీతలపరుచుకోవడం ఎలా' వంటి అంశాలు భారతీయులు మెచ్చే అంశాలే, భారతదేశంలో చర్చించే అంశాలే. కానీ ఈ సత్సంగంలోని విభిన్నత ఏమిటంటే

అక్కడకు వచ్చే ప్రతి ఒక్కరూ హఠాత్తుగా అశరీరులుగా, తేలికగా అయిపోయి శాంతిధామానికి (ఆత్మల గృహము) ఎగిరిపోయేవారు లేక కాల చక్రములో ముందుకాలానికి ప్రయాణించి ఆ బంగారు యుగములో దేవీదేవతలుగా కొద్ది సమయము వరకు జీవించి వచ్చేవారు. వారు పొందే అనుభవాలు ఎంత గొప్పవిగా, అద్భుతంగా ఉండేవంటే తమ అనుభవాలను ఎవరికన్నా చెప్తే నమ్ముతారో లేదో అన్న భయంతో ఎవ్వరికీ చెప్పేవారు కూడా కాదు.

బాబా కాశ్మీరునుండి తిరిగి వచ్చాక సత్సంగంలో ఇంతమందిని చూసి ఎంతగానో సంతోషించారు. బ్రహ్మా బాబాను కలుసుకోవడం సత్సంగంలోని వారందరికీ నిజంగానే ఒక గొప్ప అనుభూతి. బ్రహ్మా బాబా సమక్షంలో ఉండటమంటే శాంతి నీడలో ఉన్నట్లే. బాబా మనసులోని ప్రశాంతత, శీతలత ఇతరులను కూడా శాంతపరుస్తుంది.

బ్రహ్మాబాబా వస్త్రధారణ, జీవనశైలి సాధారణంగా ఉన్నాకానీ వారి నడత మాత్రం ఎంతో హుందాగా ఉండేది. వారు అందరికీ ఒక ఉదాహరణగా నిలిచేవారు ఎందుకంటే వారిలో ఒక శిక్షకుడినే కాక పవిత్రమైన, అర్థవంతమైన జీవితాన్ని గడిపే విధానాన్ని కూడా చూసేవారు.

బ్రహ్మా బాబా సత్సంగంలో కేవలం పెద్దవారే కాక చిన్నవారు కూడా ఎంతో పరమానందానికి లోనయ్యేవారు. అలా ఆ సమయంలో చిన్నవారిగా వచ్చిన ఎంతోమంది పిల్లలు తమకు కలిగిన అనుభవాలతో ఉప్పొంగిపోయి తమ జీవితాలను యజ్ఞంలో అర్పించి ఇప్పటికీ భగవంతుని సేవా కార్యక్రమంలో కొనసాగుతున్నారు. చిన్నతనంలోనే ఇటువంటి అనుభవాలను పొందినవారిలో, దాదీ హృదయ మోహిని (ఢిల్లీ జోన్ సంచాలకులు) కూడా ఒకరు. వీరు తమ అనుభవాలను ఈ విధంగా గుర్తు చేసుకుంటున్నారు –

"నాకు షుమారు 9 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు నేను మొదటిసారిగా బాబాను కలుసుకున్నాను. ఆ వయసులో నాకు భక్తిపరమైన అంశాల గురించి ఏమీ తెలియదు. నేను ఎంతో చురుకుగా ఉంటూ అందరి పిల్లలలాగే అల్లరి పనులు చేస్తూ ఉండేదాన్ని. కొద్దిసేపు ఒక చోట కూర్చోవడం కూడా నాకు కష్టమే.

"ఒకసారి, మా స్నేహితురాలి ఇంట్లో బాబాను ఆహ్వానించి వారింట్లో సత్సంగాన్ని జరపమని ఎవరో సలహా ఇచ్చారు. బాబా వారికి సమ్మతిని తెలిపి అక్కడ కొన్ని రోజులపాటు సత్సంగాన్ని జరిపారు. ఆ సత్సంగము పూర్తిగా పాటలు, నాట్యము మరియు ప్రసంగాలతో ఉండేది. మా తల్లిగారు భక్తిపరురాలు కనుక వారు అక్కడ ఏర్పాటు చేయబడ్డ ప్రతి సత్సంగానికీ వెళ్ళేవారు. నేను వారి వెంట రెండుమూడు సార్లు వెళ్ళాను, కానీ కేవలం అందరితో కలిసి ఆడుకుని, పాడుకుంటూ ఉండటానికే.

"కానీ ఒక రోజు చాలా ఆసక్తికరమైన విషయము జరిగింది. సత్సంగంలో కూర్చుని ఉన్నప్పుడు అకస్మాత్తుగా నేను ధ్యానావస్థలోకి వెళ్ళిపోయాను. ఏదో శక్తి నన్ను ఆ స్థితిలోకి తీసుకువెళ్ళింది. ఎంతో ఆకర్షణీయంగా, శక్తిశాలిగా, అత్యంత ప్రభావశాలిగా ఉన్న ఒక జ్యోతి నన్ను ఈ భౌతిక ప్రపంచ స్మృతుల నుండి దూరంగా అద్భుతమైన నిరాకారి ప్రపంచానికి తీసుకువెళ్ళింది.

"నా చుట్టూ కూర్చున్నవారు నేను నిద్రపోతున్నానేమో అని అనుకున్నారట. కానీ నేను అలాగే చాలా సమయం వరకు కూర్చోవడం గమనించిన వారు నేను సమాధి స్థితిలో ఉన్నానని అర్థం చేసుకున్నారు. కానీ వారికి తెలిసింది చాలా కొంచము మాత్రమే కదా! నేను మరో ప్రపంచంలోకి వెళ్ళాను. ఈ ప్రపంచానికి భిన్నమైన మరో ప్రపంచం! అది అద్భుతాలు నిండిన ప్రపంచం! భయాలు, బాధలు లేని ప్రపంచం అది.

"నేను ఒక పెద్ద గదిలో ఉన్నాను. అది ఎంత చక్కగా అలంకరింపబడి ఉందంటే దానిని వర్ణించడం నాకు సాధ్యం కాదు. ఎందుకంటే ఇప్పుడున్న ఈ ప్రపంచంలోని దేనితోటీ ఆ సుందర గదిని పోల్చలేము. బంగారం, వజ్రాలతో పొదిగినవి, అన్ని రంగులలో ఉన్న నగలు, మెరుస్తున్న ముత్యాలు, మిరుమిట్లు గొలుపుతూ తెల్లని వజ్రాలతో తారాగుచ్ఛంలా ప్రకాశిస్తున్న దీపపు స్తంభాలు, గదిలోని కిటికీనుండి చూస్తే ఆహ్లాదపరిచే రంగురంగుల పూలున్న తోటలు, చక్కని

సోయగాలతో ప్రవహిస్తున్న నీటి ప్రవాహాలు, అంతా చాలా అద్భుతంగా ఉంది.

"ఆ అందమైన గదిలో, అన్నిటికన్నా ఆకర్షణీయంగా ఉన్నది – చక్కని వస్త్రాలంకరణతో ఉన్న చిన్న రాకుమారుడుగా ఉన్న శ్రీ కృష్ణుడు. అతడు నన్ను పిలుస్తూ, 'రా! మనం ఆడుకుందాం' అని అన్నట్లుగా నాకనిపించింది.

"నేను ఈ స్థితినుండి సామాన్య స్థితికి వచ్చి కళ్ళు తెరిచేసరికి చాలామంది మాతలు నా చుట్టూ కూర్చుని ఉన్నారు. వాళ్ళు నన్నే చూస్తూ ఉండటం వలన నాకు భయమేసి ఏమీ అర్థంకాక ఏడ్చేసాను. 'నాకేమయింది? ఎందుకు నన్నందరూ ఇలా చూస్తున్నారు' అని అనుకున్నాను. కానీ మా తల్లిగారు నన్ను ప్రేమగా బుజ్జగించి నేను ఏమి చూసానో వివరించమన్నారు.

"కానీ అదంత సులభం కాదని నాకనిపించింది. ఎందుకంటే, నేను చూసిందెవరిని? నేను సాక్షాత్కారంలో చూసింది కృష్ణుడిని అని నాకు తర్వాత తెలిసింది, కానీ ఆ దివ్య అనుభవం జరుగుతున్న సమయంలో అతనెవరో నాకు తెలియలేదు. ఈ సుందరమైన రాకుమారుడు ఎవరా అని అనుకున్నాను. నేను మునుపెన్నడూ శ్రీ కృష్ణుడి విగ్రహాలను చూసింది లేదు, అతని పేరును విన్నాను కానీ ఆ విషయాలపై నేను ఎక్కువ శ్రద్ధ పెట్టలేదు. అందుకే నాకు తెలియలేదు. అందుకే నేను, 'చిత్రపటం ఒక రాకుమారుడిదని, చాలా సంతోషంగా ఉన్నాడని, ఒక మహారాజు కుమారుడని, ఒక భవ్యమైన మహలులో ఉన్నాడని' మాత్రమే చెప్పగలిగాను. ఆ బాలుడికి నేను తెలుసేమో అని నాకనిపించింది. అతడు నన్ను తనతో ఆడుకోవడానికి పిలుస్తున్నట్లుగా నాకనిపించింది.

"ఇదంతా నేను చాలా అస్పష్టంగానే వివరించాను. కానీ మా తల్లిగారు శాస్త్రాలను బాగా చదివి ఉన్నారు కనుక నేను చెప్తున్నది కృష్ణుడి గురించే అని అర్థం చేసుకున్నారు. శ్రీకృష్ణుని చిత్రాలను కొన్నిటిని నా ముందుకు తీసుకువచ్చి నీవు చూసింది వీరినేనా అని అడిగారు. కానీ, ఈ చిత్రాలను గీసిన వారెవ్వరూ దేవతలను సాక్షాత్కారాల ద్వారా చూడలేదు కనుక వారి దివ్యత్వాన్ని, అందాన్ని వారు యథావిధిగా గీయలేకపోయారు. నేను చూసిన కృష్ణుడి రూపం చాలా ఆకర్షణీయంగా, సహజత్వం ఉట్టిపడేదిలా ఉంటే ఈ చిత్రాలు జీవకళ లేకుండా ఉన్నాయి. అందుకే ఈ చిత్రాల ఆధారంగా నేను చూసింది కృష్ణుడినే అని చెప్పడం నాకు కష్టమయింది. కానీ బాహ్యంగా కొన్ని పోలికలు ఉన్నాయి. వారు వేసుకున్న వస్త్రాలు, చుట్టూ ఉన్న బంగారం, అన్నిటికీ మించి చేతిలో పట్టుకున్న వేణువు ద్వారా అతడు ఇతడే అన్న నిర్ధారాణకు వచ్చి, 'అవును, ఇతడినే నేను చూసింది' అని చెప్పగలిగాను.

ఇటువంటి సాక్షాత్కారాలను ఆ సమయంలో ఎంతోమంది పిల్లలేకాక పెద్దలు కూడా పొందారు. అది అత్యంత సంతోషకర సమయము. ఎంతోమంది ఈ విధమైన తమ అనుభవాలను పంచుకోవడం వింటూ ఉంటే మా అందరిలోని భావాలు ఉప్పెనలా ఎగసిపడేవి. ఆధ్యాత్మిక ఆలోచనలు కలిగిన వారికి, భగవంతుడి ప్రేమను చవిచూడాలన్న తపన ఉన్నవారందరికీ ఈ అద్భుత సాక్షాత్కారాలు, అనుపమ ఆధ్యాత్మిక యాత్రలు జరుగుతూ ఉండేవి. చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా ఇక్కడ భగవంతుడి శక్తి ప్రవేశించింది. అసాధ్యం అనుకున్నవి సామాన్యంగా మారాయి. అసంభవం అనుకున్నవి సంభవించాయి. ఈ భౌతిక దేహాన్ని మరచిపోయారు. అనంత లోకాలకు వెళ్ళే దారిని కాలము చూపించింది. భగవంతుడిచ్చిన జ్ఞానముతో అజ్ఞానము మటుమాయమైంది.

భగవంతుని గుణగానము చేయడం తప్ప ఈ భగవంతుని పరివారానికి ఇక ఏమి కావాలి! ఇదే వారు చేసారు. వారి మనసులోని భావాలను పలికించే అనేక శ్రావ్యమైన పాటలను పొందుపరిచారు. సంతోషపు గీతాలు, సంపూర్ణత గీతాలు, ముక్తి పాటలు, అహంకారం నశింపజేసే పాటలు, ప్రేమ సాగరుడైన శివబాబా గురించిన పాటలు.

సత్సంగము ముగిసిన తర్వాత బ్రహ్మబాబా పిల్లల మధ్యన నడుస్తూ వారికి పితృ వాత్సల్యముతో కూడిన దృష్టిని అందించేవారు. ఆ దృష్టిలో అనురాగము, ఆధ్యాత్మిక ప్రేమ ఉండేవి. సురక్షితంగా, భద్రంగా ఉన్నామన్న భావం కలిగేది. అక్కడున్న ప్రతి ఒక్కరూ, చిన్న పెద్ద, అందరూ ఒక్క విషయాన్ని మాత్రం ఖచ్చితంగా అనుభవం చేసేవారు: ఆత్మలకు

తండ్రి, జ్ఞానప్రదాత అయిన శివ పరమాత్మ మన మధ్యలోనే ఉన్నారు.

సత్సంగానికి మొదటిసారిగా వచ్చినవారు కూడా ఎంతో అద్వితీయమైన అనుభవాన్ని పొందేవారు. ఇక్కడ ఒక విభిన్నమైన జీవితం ఉంది. బాహ్య ప్రపంచంలో ఎక్కడచూసినా అభద్రతాభావాలు, భ్రమలు, నైతిక పిరికితనము. ఇక్కడ సంతోషం, శక్తి ఉన్నాయి. బాహ్య ప్రపంచంలో ఎవ్వరైనా చెయ్యగలిగినది ప్రార్థించడం మాత్రమే. కానీ ఇక్కడ మాత్రం చేసిన ప్రార్థనలకు, పూజలకు సమాధానము లభిస్తుంది. ఇక్కడ ప్రశాంతత ఉంది.

*ఈ దుఃఖ ప్రపంచంలో తిరిగి తిరిగి అలసితిమి,*
*ఈ జీవన చక్రంతో విసిగితిమి,*
*స్వస్థానానికి వెళ్ళడానికి ఎదురుచూస్తున్నాము,*
*మార్గములో కనిపించిన ఓం మండలిలో ఆగాము.*

*ఇప్పుడు నా అంతరాత్మ ఆనందంగా ఉంది,*
*ప్రకాశ ప్రపంచానికి ఎగరడానికి తయారుగా ఉంది, స్వతంత్రంగా ఉంది,*
*ఇప్పుడు నా జీవిత లక్ష్యము నాకు తెలిసింది,*
*ఇప్పుడు నా ఇంటిని తెలుసుకున్నాను*
*ఇప్పుడు, చివరకు నేను భగవంతుడిని కలుసుకున్నాను.*

*ప్రతి ఉదయము నేను శాంతి సాగరుని అలలలో మునుగుతాను,*
*సత్యమనే పాత్రనుండి నేను అమృతాన్ని సేవిస్తున్నాను,*
*నేను సంతోషమనే మార్గములో నడుస్తున్నాను,*
*కానీ నా పాదాలు మాత్రం ఈ భూమిని తాకడం లేదు.*

ఇవి, శాశ్వత పరివర్తన వచ్చినవారి భావాలు. ధనికులు, పేదలు అందరూ కలసిమెలసి సోదరభావం ఉట్టిపడే విధంగా ఉండేవారు. ఇది సాధారణ సత్సంగమే అయినా కానీ కొన్నిసార్లు ఈ సత్సంగాన్ని చూస్తే ఇది ఒక ఇంద్రసభ అన్నట్లుగా అనిపిస్తుంది.

అక్కడ అందరూ తెల్లని వస్త్రాలను ధరిస్తారు. అప్పటివరకు ఫ్యాషన్లలో మునిగితేలినవారు ఇప్పుడు ఈ సాధారణ శ్వేత వస్త్రాలలోనే వారి ఆత్మ సౌందర్యాన్ని చూసుకోగలుగుతున్నారు. వారి బాహ్య నిరాడంబరత ఆత్మ సౌందర్యానికి ప్రతీకగా నిలిచింది.

ఉన్నత ఆలోచనలు, తియ్యని మాటలు, సోదర దృష్టి, శుద్ధమైన భావాలు – ఒక జ్ఞాని వ్యక్తిత్వంలో ఉట్టిపడే లక్షణాలివి. బ్రహ్మాబాబా జీవితంతో స్ఫూర్తిని పొంది, వారి ప్రతి అడుగులో, మాటలో ప్రస్ఫుటించే పవిత్రతాశక్తిని వీరు ఆకళింపు చేసుకున్నారు.

సత్సంగం పెరుగుతూ ఉంది. పెరిగిన సంఖ్య కారణంగా ఈ సత్సంగానికి ఒక క్రమబద్ధమైన రూపాన్ని ఇవ్వాల్సిన అవసరం వచ్చింది. ఆత్మ ఉన్నతికి పాటుపడేవారు రకరకాల వర్గాల వారు కనుక వారికోసం వివిధ రకాల ఆధ్యాత్మిక ప్రసంగాలను ప్రారంభించారు. ప్రజలందరికీ ఈ ఉన్నత జ్ఞానం అందుబాటులో ఉండాలన్న ఆకాంక్షతో ఈ జ్ఞానాన్ని పుస్తకాలలో పొందుపరిచారు. దీనికంతా పరిపాలన, నాయకత్వము మరియు డబ్బు అవసరము. అందుకే, బ్రహ్మా బాబా

వారి ఆస్తినంతా ఈ ఆధ్యాత్మిక సంస్థ పురోగతికి అర్పించి, ఒకరిని ఇందుకు ముఖ్యులుగా నియమించారు.

1937 అక్టోబర్‌లో, ఓం రాధ మరియు ఎనిమిదిమంది మాతలతో ఒక ట్రస్టు ఏర్పాటయ్యింది. అప్పటినుండి ఈ సంస్థను ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయము – బ్రహ్మాకుమారీస్ వరల్డ్ స్పిరిచువల్ ట్రస్ట్ – అని పిలవడం మొదలుపెట్టారు. ఓం రాధ పరిపాలనా బాధ్యతలను స్వీకరించారు. ఆ తర్వాత, బ్రహ్మాబాబా తమ యావదాస్తిని ఈ ట్రస్టుకు అంకితం చేసేసారు. ఈ విశ్వవిద్యాలయ బాధ్యతలన్నిటినీ బ్రహ్మా బాబా మాతలకు అప్పగించారు. ఇప్పుడు వారికున్న ఏకైక బాధ్యత – భగవంతుని కార్యంలో నిమగ్నమై నిమిత్తమాత్రులుగా అయ్యి తమ బాధ్యతను పూర్తిగా నిర్వర్తిస్తూ భగవంతుని ఆజ్ఞలపై సంపూర్ణంగా నడుచుకోవడంలో ఉదాహరణగా నిలవాలి.

సంస్థ పగ్గాలను ఓం రాధ  ఎంతో సమర్థవంతంగా చేపట్టారు. పొదుపు, నిరాడంబరత అనే సిద్ధాంతాలపై సంస్థను నడిపిస్తున్నప్పటికీ, వచ్చిన ప్రతి ఒక్కరికీ తమ ఇంటికి వచ్చాము అన్న బంధుత్వ భావనను కలిగించడానికి కావలసిన ఏర్పాట్లను సమకూర్చడంలో మాత్రం ఏ లోటు రానివ్వలేదు. ఓం రాధలో స్వతహాగానే మృదుత్వము, సహకార భావాలు ఉన్నాయి. ఈ సుగుణాలతోపాటు పరిశీలన శక్తి, నిర్ణయ శక్తిని కూడా చేర్చి సంస్థ సామరస్యంగా, సమర్థవంతంగా నడిచేందుకు అహర్నిశలు కృషి చేసారు. 'భగవంతుడి కార్యాన్ని నేను నిమిత్తమై చేస్తున్నాను' అన్న భావంతోటే వారు ఎప్పుడూ ఉన్నారు కానీ నేను చేస్తున్నాను అని ఎప్పుడూ భావించలేదు. భగవంతుడిచ్చిన జ్ఞానమును విన్న కారణంగానే తనలో ఆత్మ సంతృప్తి పెరిగింది. ఆ భగవంతుడి జ్ఞానమునే నేను అందరికీ వినిపిస్తున్నానుకానీ నా జ్ఞానము, నా బుద్ధి ఇందులో ఏమీ లేదు అని తమను తాము కేవలం నిమిత్తమాత్రులుగానే భావించేవారు. భగవంతుని ఆజ్ఞల అనుసారంగా నడుచుకోవడం తన బాధ్యత అని ఓం రాధ భావించేవారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండటంలో ఓం రాధ సఫలమయ్యారు కనుక వారు అందరికీ ప్రీతిపాత్రులయ్యారు. అందరూ వారిని మమ్మా అని పిలవసాగారు – ఎంతగా అంటే ఆఖరకు వారి కన్నతల్లి కూడా ఓం రాధను మమ్మా అని పిలవసాగారు. శివబాబా వారిని జగదంబ అని సంబోధించేవారు. అంబాజీ మందిరము మొదలైన ఇటువంటి మందిరాలన్నీ కూడా మమ్మా ప్రతీకలే అని బాబా చెప్పారు.

ఈ ఆధ్యాత్మిక విశ్వ విద్యాలయము శాంతి సామరస్యాలకు నెలవు. కానీ బాహ్య ప్రపంచము ఈ విషయాన్ని గుర్తించలేదు. వ్యతిరేకత తన రెక్కలు విప్పడం ప్రారంభించింది. వారి విరోధమంతా ఇక్కడ బోధిస్తున్న పవిత్రత అనే ఒక్క అంశం మీదే. పవిత్ర జీవితాన్ని గడపాలన్న గృహిణుల ఆలోచనను భర్తలు స్వాగతించలేదు. కన్యలు పెళ్ళి వద్దు అనేసరికి తల్లిదండ్రులు కలవరపడ్డారు. ఈ విషయంపై ఎంతో కలకలం రేగింది. పురుషులు సర్వసంగ పరిత్యాగం చేయవచ్చు కానీ స్త్రీలు అలా చెయ్యాలంటే – అది చాలా అసాధారణ విషయంగా పరిగణిస్తారు. ఎంతోమంది పురుషులు ఈ విషయాన్ని జీర్ణించుకోలేకపోయారు.

ఆ రోజుల్లో ఒక వివాహిత తన భర్త అడుగులకు మడుగులొత్తుతూ పతియే పరమేశ్వరుడిగా భావించాలి. ఈ విధమైన సామాజిక కట్టుబాట్లకు అలవాటుపడ్డ భర్తలను ఈ పవిత్రత విషయం కలవర పెట్టడం ఆశ్చర్యకర విషయమేమీ కాదు. భార్యలు తమ జీవితాలను తమకు నచ్చిన ఆధ్యాత్మిక మార్గంలో మలచుకోవాలని అనుకోవడం వలన భర్తలకు తమ అధికారం చేజారిపోతుందేమో అన్న భయం మొదలయింది.

ఇదంతా బ్రహ్మా బాబా ముందే పసిగట్టారు. అందుకే సత్సంగానికి రోజూ రావాలనుకుంటే అది గృహిణి అయినా, కన్య అయినా, ఎవరైనా సరే వారి తల్లిదండ్రులు లేక భర్త లేక సంరక్షకుని నుండి స్వీకృతి పత్రమును తీసుకురమ్మని చెప్పారు. ఒకసారి స్వీకృతి ఇచ్చాక ఆ ఇంట్లోనివారు వారిచ్చిన స్వీకృతి పత్రానికి కట్టుబడి ఉంటారు కనుక సమస్యే ఉండదు.

కానీ, ఇదంతా అనుకున్నంత సులువు కాదు. ఎంతోమంది భర్తలు ఇటువంటి స్వీకృతి పత్రాలపై సంతకం పెట్టడానికి ససేమిరా అన్నారు. ఆచారం ప్రకారం భర్త యజమాని, భార్యపై అతని అజమాయిషీ జరగాల్సిందే, భార్య తన సొంత సొత్తు, కామవాసనలకు ఉపయోగపడే ఆటవస్తువు. వీటిలో ఏ మార్పుకూ వారు ఇష్టపడలేదు.

అంతేకాక, ఇక్కడకు వచ్చేవారు తెల్లని వస్త్రాలు ధరించడం, అంతస్తుకు ప్రతీకలైన నగలను ధరించకపోవడం – ఇటువంటి బాహ్య పరివర్తనలను చూసి కూడా ఎంతోమందికి నచ్చలేదు. ఒకే ఇంట్లో ఒకరు ఎంతో ఉత్తమమైన జీవన శైలిని పాటించడం, మిగతావారు అలా లేకపోవడం కూడా ఇబ్బందిని కలిగించింది.

ఈ విధంగా పరమాత్ముని సంతానం ఎంతగా పవిత్రతా మార్గాన్ని అవలంబించడం ప్రారంభించారో అంతగా సమస్యలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. అబ్బాయిలు కూడా సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. ఏ తల్లిదండ్రులైతే మనవడు, మనవరాళ్ళను ఆశించారో అది ఇప్పుడు తన కొడుకు పవిత్రత మార్గంపై ఉన్న కారణంగా వీలవ్వడం లేదు. వీరిప్పుడు తల్లి చేతివంటను ఎందుకు స్వీకరించడం లేదు? శుద్ధమైన ఆహారమే కావాలని ఎందుకు పట్టుపడ్తున్నారు? ఇంట్లోనివారు అర్థం చేసుకోలేరు, అర్థం కాలేదు. బ్రహ్మాబాబా ముఖ సంతానమైనవారు ఎంత వివరించి చెప్పినాగానీ వారికి అర్థం కాలేదు. అయినప్పటికీ వారి కుటుంబ సభ్యులలో వచ్చిన మార్పుతో వారు సంతోషపడ్డారు. బ్రహ్మాబాబా ఆజ్ఞలను అనుసరించినవారు ఎంతో చురుకుగా, నిజాయితీగా, పొదుపరులుగా, ప్రశాంతంగా, తెలివైనవారిగా, వివేకముతో కూడిన ఆలోచనలతో, క్షమాభావన కలిగి ప్రేమపూర్వకంగా మసులుకోసాగారు. నమ్మశక్యంకాని విధంగా వీరందరిలో ఎన్నో సుగుణాలు నిండిపోయాయి. మధ్యాహ్నంవరకు నిద్రపోయేవారు ఇప్పుడు ధ్యానం చెయ్యడానికి ఉదయాన్నే 4 గంటలకే లేస్తున్నారు. సోమరిగా, ఉద్యోగం లేకుండా తిరిగేవాళ్ళు ఇప్పుడు ఎంతో చురుకుగా ఉంటూ పనులు, ఉద్యోగాలు చేస్తున్నారు. ఇటువంటి మార్పులను చూసిన కుటుంబ సభ్యులు ఎంతో సంతోషించారు. ఒక వైపు ఎంతో నిరాడంబరతతో ఉంటూ అదే సమయంలో దివ్య సాక్షాత్కారాల గురించి, ప్రపంచ వినాశనము గురించి మరియు భగవంతుని కలుసుకునే విధానము గురించి ఎలా చెప్పగలరు – ఈ రెండూ కలిసి ఉండటం నిజానికి అతి అరుదు, అయినప్పటికీ వీరిలో ఈ రెండూ కూడా సఖ్యతతో ఉంటున్నాయి. ఏదో అద్భుతమే ఇక్కడ జరుగుతుంది.

కానీ ఈ సంస్థకు సమీపంగా వచ్చిన ప్రతి ఒక్కరూ ఈ విషయాలన్నీ సమంజసమే అని అర్థం చేసుకునేవారు. అంతే కాకుండా, విరోధ భావాలున్న కుటుంబ సభ్యులు బ్రహ్మాబాబాను కలిసి వ్యక్తిగతంగా మాట్లాడినప్పుడు ఎన్నో అపోహలు మటుమాయమయ్యేవి. బి.కె. హృదయ పుష్ప దాదీగారి అనుభవం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు:

"ఒకరోజు బ్రహ్మా బాబా నన్ను మా తల్లిదండ్రులనుండి స్వీకృతి పత్రాన్ని తీసుకురమ్మన్నారు. ఆ పత్రంలో ఇలా వ్రాసి ఉంటుంది, 'నా కూతురు ఓం మండలికి వెళ్ళి ఓం రాధ అందిస్తున్న జ్ఞానామృతాన్ని స్వీకరించి తిరిగి దానిని అందరికీ పంచడానికి అంగీకారం తెలుపుతున్నాము.'

"నేను మా తండ్రిగారిని ఈ పత్రంపై సంతకం చెయ్యమని అడిగాను. సత్సంగంలో ఏమి నేర్పిస్తారు అని మా తండ్రిగారు నన్ను అడిగారు. నేను చెప్పాను. మా తండ్రి మాంసాహారి, త్రాగుబోతు కూడా. వారిలో కొంత కూడా ధార్మిక ఆలోచనలు లేవు. నేను చెప్పింది విని వారికి చాలా కోపం వచ్చింది. 'నేను ఇటువంటి వాటి మీద సంతకం పెట్టను' అని అనేసారు.

"నాకు చాలా బాధ కలిగింది. నేను నా గదిలోకి వెళ్ళి ఆలోచించసాగాను. ఇప్పుడెలా? స్వీకృతి పత్రం లేనిదే బ్రహ్మా బాబా నన్ను సత్సంగానికి రానివ్వరు. మా తండ్రిగారు సంతకం పెట్టరు. జ్ఞానామృతాన్ని సేవించకుండా నేను ఉండలేను. నీటి బయట ఉన్న చేపలా అయ్యింది నా పరిస్థితి. నేను భగవంతుడిని ఎంతో ధ్యానం చేసాను.

"మరుసటి రోజు నేను బ్రహ్మాబాబా వద్దకు వెళ్ళి జరిగినదంతా చెప్పాను. వారికంతా తెలుసా అన్నట్లుగా వారు

చిరునవ్వు నవ్వి మా తండ్రిగారిని ఒకసారి తన వద్దకు తీసుకురమ్మన్నారు. ఇది నాకు చాలా సంతోషంగా అనిపించింది. నేను సంతోషంగా మా తండ్రిగారికి ఈ విషయం చెప్పడానికి పరుగు తీసాను.

'బ్రహ్మబాబా మిమ్మల్ని గుర్తు చేసారు' అని చెప్పాను. 'వారు మిమ్మల్ని చూడాలనుకుంటున్నారు'. ఇది విని మా తండ్రిగారు కొద్దిగా శాంతించారు. ఎందుకంటే దాదా లేఖ్‌రాజ్‌కు సమాజంలో ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. అంతటి ఉన్నత వ్యక్తి, సంపన్న వ్యక్తి ఇచ్చే ఆహ్వానాన్ని ఎవ్వరూ అంత తేలికగా తీసిపారేయలేరు. మా తండ్రిగారికి కూడా హైదరాబాద్‌లో ఎంతో పేరుంది అందుకే బాబా ఆహ్వానాన్ని కాదనలేకపోయారు. ఇద్దరమూ కలిసి బాబాను చూడటానికి వెళ్ళాము.

"ఇద్దరూ ఎంతో స్నేహపూర్వకంగా సంభాషించుకున్నారు. బాబా మా తండ్రిగారిని ఇలా అడిగారు, 'మీ కూతురు ఇక్కడకు ఎందుకు వస్తుందో మీకు తెలుసా? ఈ రోజు మీరు తన జీవితంలో చూస్తున్న ప్రశాంతత ఎక్కడినుండి వచ్చింది? బాబా వారికి కొంత జ్ఞానమును వినిపించి తర్వాత ఓం రాధను వివరంగా వినిపించమని చెప్పారు. 'మీరు ఒక చైతన్య ఆత్మ' అంటూ ఓం రాధ ప్రారంభించారు. ' ఈ దేహము ఒక మందిరంవంటిది. ఎవరైనా దేవాలయంలో మాంసాహారాన్ని నైవేద్యంగా అర్పిస్తారా? మీరెప్పుడైనా దేవతలకు మద్యాన్ని బహుమతిగా ఇచ్చారా?'

"మా తండ్రిగారు అంతా విన్నారు, అంతా ఒప్పుకున్నారు. వారు మాంసాహారాన్ని, మద్యాన్ని సేవించడం తప్పు అని అర్థం చేసుకుని పశ్చాత్తాపం చెందసాగారు. అంతేకాక క్రోధము మహా పాపము అని ఓం రాధ చెప్పారు. నేను ఒక చైతన్య ఆత్మను, ఉన్నతమైన ప్రాణిని, ఈ దేహమనే దేవాలయంలో ఉంటున్నాను అన్న ఈ మాటలు మా తండ్రిగారికి బాగా నచ్చాయి. ఇంటికి వచ్చేంతలోనే వారిలో ఎంతో పరివర్తన కనిపించింది.

"ఇంటికి వచ్చాక వారు మద్యం సీసాలన్నీ బయటకు విసిరేసారు. అవన్నీ ఎంతో ఖరీదైన ఫ్రెంచ్ వైన్లు. వారి సోదరుడు ఇదంతా చూసి పరిగెత్తుకుంటూ వచ్చి వారిని ఆపుతూ, 'సోదరా! ఏమి చేస్తున్నావు? నీకు వద్దకపోతే నాకు ఇవ్వు' అని అన్నారు. కానీ మా తండ్రిగారు ఇలా అన్నారు, 'నేను వదిలేసిన పాపాన్ని నీకు అంటగట్టమంటావా? ఆ పని నేను చెయ్యలేను!' ఆరోజు నుండి, మా తండ్రిగారు శుద్ధమైన శాకాహారిగా మారిపోయారు, మద్యం ఒక్క చుక్క కూడా ముట్టలేదు. కేవలం నాకు మాత్రమే స్వీకృతి పత్రాన్ని ఇవ్వడమేకాక ఇంట్లోని సభ్యులందరూ కూడా సత్సంగానికి వెళ్ళవచ్చు అని తమ అంగీకార పత్రాన్ని ఇచ్చారు. వారు వారి గురించి ఇలా వ్రాసుకున్నారు, 'నేను మద్యం సేవించడం మానేసాను, కానీ జ్ఞాన అమృతం నాకు అలవాటు అయింది.... నేను ఇందులోనే పూర్తిగా ఎందుకు ఉండకూడదు?' మా తండ్రిగారు ఎంతో సంతోషంగా ఉన్నారు. ఇదంతా శివబాబా చేసిన మాయాజాలం."

# ఓం పాఠశాల

ఎంతోమంది ఇప్పుడు తమ పరివార సహితంగా బ్రహ్మ బాబా సత్సంగంలో చేరుతున్నారు. వారు తమ పిల్లలకు సాంకేతిక విద్యతో పాటు - చదవడం, వ్రాయడం, గణితం - వంటి అంశాలతోపాటు ఆధ్యాత్మిక అంశాలను బోధించే ఒక పాఠశాల ఉండాలని ఆశించారు. కుట్టుపని, చెక్కపని వంటి పనులలో కూడా శిక్షణ అవసరమని భావించారు.

ఇటువంటి పాఠశాల ఒకటి స్థాపించాలన్న ఆలోచన బ్రహ్మబాబాకు ముందునుండే ఉంది. ఎందుకంటే, చిన్న పిల్లలు పవిత్రతను, సుగుణాలను అలవర్చుకుంటే అటువంటి పిల్లల వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని బాబా ఎంతో ప్రగాఢంగా నమ్మేవారు. కనుక, పాఠశాల ఏర్పాటు చెయ్యాలన్న సంకల్పం కార్య రూపం దాల్చింది.

'ఓం హై స్కూల్' అన్న పేరుతో ఒక బోర్డింగ్ స్కూల్ ఏర్పాటు అయ్యింది. ఇందుకు బ్రహ్మబాబా అన్ని వసతులతో ఉన్న ఒక క్రొత్త ఇంటిని ఏర్పాటు చేసారు. భిన్న వయస్సుగల పిల్లలు ఇందులో చేరారు. పెద్దవారు వచ్చి చిన్నవారికి తమ వంతు సహాయాన్ని అందించారు. ఇందుకు ముఖ్యులుగా మాతలను నియమించారు. మంచాలు, పరదాలు, యూనిఫారమ్‌లు విద్యార్థులకోసం తయారయ్యాయి. ఒక ఔషధశాల కూడా ఏర్పాటయింది. వంటగదులు, భోజనశాలలు కూడా తయారయ్యాయి. అదనపు స్నాన గదుల వసతులను ఏర్పాటు చేసారు. పిల్లలను రాకుమారుడు, రాకుమారివలె చూసుకోసాగారు. మృదుత్వము మరియు క్రమశిక్షణ రెండూ ఎంతో ఒద్దికగా కలిసిపోయాయి. పాఠశాల కార్యకలాపాలు ఎంతో ప్రేమగా, క్రమశిక్షణతో ముందుకు కొనసాగాయి.

విద్యార్థుల సంఖ్య పెరిగినప్పుడు, క్లాసులను విభజించారు. ఆరు నుండి పది సంవత్సరాలున్న పిల్లలకు ఒక తరగతి, 11 నుండి 14 సంవత్సరాలున్న పిల్లలకు మరో తరగతిని ఏర్పాటు చేసారు. వారి దినచర్య ఈ విధంగా ఉండేది:

ఉ. 5 గం॥లకు - పిల్లలు లేవడం, తేలికపాటి వ్యాయామం, శాంతిపూర్వక ఉదయపు నడక

ఉ. 6.30గం॥లకు - స్నానము, అల్పాహారము

ఉ. 8.30గం॥లకు - చదువు ప్రారంభం

ఉ. 10.30గం॥లకు - ఏకాంత సమయము, ఫలాహారము

ఉ. 11 నుండి మ. 1గంట వరకు - చదువు

మ. 1.00గంటకు - భోజనము, విరామము

మ. 3.00 గంటలకు - ఆధ్యాత్మికతలో శిక్షణ, ఆధ్యాత్మిక గీతాలాపన

సా. 5 గం॥లకు - పాలు, సాయంత్రపు నడక

రా. 7.30గం॥లకు - రాత్రి భోజనము

రా. 8.30గం॥లకు - స్వ ఉన్నతి కోసం ఏమి చెయ్యాలి, భోజన శుద్ధిలోని పవిత్రత, జీవిత సమస్యలను ఎలా పరిష్కరించాలి వంటి ఇతర జ్ఞాన అంశాలపై చర్చ

రా. 10 గం॥లకు - సమాధి స్థితి (సమాధి స్థితి అనునది మెడిటేషన్‌లో ఒక స్థితి, అందులో ఆత్మ తన ఉనికిని అనుభవం చేసుకుంటుంది.)

రా.10.30గం॥లకు - నిద్ర

ఆధ్యాత్మిక ఉన్నతితో పాటు శారీరిక ఆరోగ్యంపై కూడా ఎంతో శ్రద్ధను చూపేవారు. పిల్లలు ఎంతో చురుకుగా వ్యాయామంలో పాల్గొంటూ వారి శరీరాలను ఆరోగ్యవంతంగా చూసుకునేవారు. చక్కని సూర్య కిరణాలు, విభిన్నమైన

ఆటపాటలు వారి మనసును ఎప్పుడూ చురుకుగా ఉంచేవి. పిల్లలు యూనిఫారమ్‌ను వేసుకుని క్లిఫ్టన్ బీచ్ వద్ద ఉదయపు డ్రిల్‌ను ఎంతో ఉత్సాహంగా చేసేవారు. క్లిఫ్టన్‌కు బ్రహ్మాబాబా పిల్లలను తరచూ తీసుకువెళ్తూ ఉండేవారు. ఒకే రకమైన యూనిఫారమ్ ఉన్న కారణంగా పిల్లలు, 'మేము అమ్మాయిలము' అన్న బెరుకులేక సామాజిక బిడియాల నుండి దూరం కాగలిగారు. అన్నిటికన్నా ముఖ్యంగా, పిల్లలు తమ చదువు, ఆటపాటలను నేర్చుకుంటూ కూడా భగవంతుని స్మృతిలో ఉండటాన్ని నేర్చుకోగలిగారు.

ఒక్కోసారి బ్రహ్మా బాబా పిల్లలందరినీ బీచ్ వద్దకు డ్రిల్ చేయించడానికి కాక, కొంతసేపు ధ్యానంలో కూర్చోపెట్టడానికి తీసుకెళ్ళేవారు. ఒకరికొకరు దూరంగా, ఇసుక దిబ్బలమీద లేక రాళ్ళమీద కూర్చుని ధ్యానం చేసేవారు. ఉషాకిరణాలలో, ఏకాంతంగా శివ పరమాత్మ తలంపుతో గడిపేవారు. బాలబాలికలు తమ యథార్థమైన, శాశ్వతమైన ఉనికిని అర్థం చేసుకుని ఆ పరమాత్మునితో మనో కలయిక జరుపుకుంటూ ఎంతో సమయం అలాగే కూర్చుండిపోయేవారు.

పిల్లలు పాఠశాలనుండి తిరిగి వచ్చిన తర్వాత కర్మయోగం చేసేవారు. వారి గదులను శుభ్రం చేసుకోవడం, వారి పరుపులను సరిచేసుకోవడము, స్నానాల గదిని కడగడం, బట్టలు ఉతుక్కోవడం వంటి పనులను చేసేవారు. ప్రతి ఒక్కదానినీ ఎంతో శుభ్రంగా ఉంచేవారు. పిల్లలకు శుభ్రత, స్వచ్ఛతపై ఉన్న అవగాహన చూసి అందరూ ఆశ్చర్యచకితులయ్యేవారు.

భోజన సమయంలో అందరూ ఎంతో మౌనంగా భోజనాన్ని స్వీకరించడానికి లైన్‌గా కూర్చునేవారు. అందరికీ అన్నీ వడ్డించడం పూర్తయ్యేవరకూ ఎవ్వరూ భోజనాన్ని ప్రారంభించేవారు కాదు. భోజనం చేస్తున్న సమయంలో కూడా మౌనంలో ఉండి నిదానంగా భగవంతుని స్మృతిలో తినేవారు.

ఆటల సమయంలో అందరూ ఎంతో ఆసక్తిగా, చురుకుగా అన్ని ఆటలనూ ఆడేవారు – దాగుడుమూతలు, మ్యూజికల్ ఛైర్స్, బ్యాడ్మింటన్ – అన్నింటిలోనూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించేవారు. ఆ వాతావరణంలో ఈ సుగుణాలన్నీ వారికి సహజంగానే వచ్చేవి.

సూర్యాస్తమయ సమయం మరోసారి మెడిటేషన్ చేసే సమయము. పిల్లలు అందుకు తయారుగా ఉండేవారు. వరండాలో ప్రశాంతంగా కూర్చుని పరమాత్ముడిలో ఉన్న గుణాలను తమలో నింపుకోవడానికి ప్రయత్నించేవారు. స్పీకర్ల ద్వారా పాట వినిపించిందంటే అది పడుకునే సమయము అని అర్థము. ప్రాతఃసమయంలో మరోపాట వచ్చే వరకు హాయిగా భగవంతుని స్మృతిలో నిద్రించేవారు. పాట వచ్చాక మరో క్రొత్త రోజును ప్రారంభించేందుకు లేచేవారు.

# ఆకస్మిక తనిఖీలు

పిల్లలకోసం ఓం మండలి బోర్డింగ్ స్కూల్‌ను తెరిచిందన్న విషయం కొద్ది కాలంలోనే అందరికీ చేరుకుంది. భారతదేశంలోని అనేక విద్యా సంస్థలలో ఈ స్కూలు గురించి అనేక పుకార్లు మొదలయ్యాయి. ఓం మండలిలోని టీచర్లు అక్కడి విద్యార్థులను సన్యాసులుగా మార్చేస్తారు అని కొందరు అన్నారు.

పాఠశాల స్థితిగతులను స్వయంగా పర్యవేక్షించడానికి శిక్షణాధికారులు ఆకస్మిక తనిఖీలు చేసేవారు. ప్రధానోపాధ్యులు, అనేక విద్యా సంస్థల సంచాలకులు, అనేక పేరుగాంచిన విద్యావేత్తలు ఆకస్మిక తనిఖీలు, పర్యవేక్షణకు వచ్చేవారు. ఏదో ఒక తప్పు పట్టుకోవడానికి వారెంతో ప్రయత్నించారు. పిల్లలకిచ్చే భోజన ప్రమాణము, విద్యా విధానము, సాంకేతిక విద్యతోపాటు ఆధ్యాత్మిక చదువు, నైతిక విద్య, పరిక్ష ఫలితాలు, అన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత పరిశీలకులు ఎంతో ఆశ్చర్యానికి గురయ్యారు.

ఓం మండలిలోని ఉపాధ్యాయులు పరిశీలకులను ఎంతో సాదరంగా ఆహ్వానించి వారికి కావలసిన తనిఖీలు చేసుకోమని అనేవారు. ఇదే విధంగా పిల్లల ప్రగతిని పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీలకు ఎప్పుడు కావాలన్నా రావచ్చు అని సహృదయంతో చెప్పారు. అక్కడ వారు దాచిపెట్టేందుకు ఏమీ లేదు, అంతేకాక ఇక్కడి పద్ధతులు అందరికీ తెలుస్తాయన్న సంతోషం కూడా వారికి ఉండేది.

పాఠశాల విజయాన్ని చూసి విద్యావేత్తలు ఆశ్చర్యపోయారు. ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వం దగ్గర ఈ పాఠశాలను రిజిష్టర్ చేసుకోవలసిందిగా సూచించారు. ఎందుకంటే ఓం మండలి మాత్రమే ఈ ఖర్చును ఎంతవరకు భరించగలదు!

కానీ ఇది భగవంతుని సంస్థ, భగవంతుడు దాత. కనుక పాఠశాలకు ఎటువంటి లోటు రాదు అని అక్కడి టీచర్లు చెప్పారు. ప్రజలకు ఇది అర్థం కాలేదు. అలాగని పాఠశాల సాధించిన విజయాన్నీ వారు కాదనలేకపోయారు. కొన్నిసార్లు, ఆకస్మిక తనిఖీలు జరుగుతున్న సమయంలో పిల్లలు ధ్యానావస్థలో ఉండేవారు. అందులో కొందరైతే ట్రాన్స్‌లో ఉండేవారు. వచ్చిన అతిథులు నమ్మశక్యంకాని విషయంగా ఇదంతా గమనించేవారు. అక్కడి శక్తిశాలి మరియు ప్రశాంత వాతావరణానికి వారు కూడా ప్రభావితులై ఎంతో శాంతిగా ఉండేవారు. ట్రాన్స్ నుండి కిందకు వచ్చిన పిల్లలు తాము చూసిన అద్భుతమైన బంగారు యుగపు అనుభవాలు చెప్తూ ఉంటే అతిథులు పిల్లల అనుభవాలను కాదనలేకపోయేవారు.

పిల్లలలో ఉన్న అత్యద్భుతమైన మానసిక ఎదుగుదల అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇంత చిన్న వయసులోనే ఇంత స్వతంత్ర భావాలు, ఆత్మ నిష్ఠ కలిగి అందరితో కలిసిమెలసి ఉంటూ చదువుపై శ్రద్ధ కలిగిఉన్నారు. అన్నిటికీ మించి ఈ పిల్లలు ఇంతసేపు ధ్యానంలో ఎలా కూర్చోగలుగుతున్నారు? ఆ స్థానంలో ఏదైనా మహత్యం ఉందా లేక ఇక్కడి విద్యా విధానం అటువంటిదా? కానీ అక్కడి టీచర్లు ఉన్నత విద్యలను అభ్యసించిన వారేమీ కాదే! అయినప్పటికీ ఇక్కడి వాతావరణం ఇంత ప్రశాంతంగా ఉంటూ, అందరూ కలసిమెలసి ఎలా ఉంటున్నారు? గొడవలు లేకుండా ఉండటం సాధ్యమేనా? దీనివెనుక ఏమైనా మోసం ఉందా, వీరి విజయ రహస్యం ఏమిటి అని తనిఖీలకు వచ్చిన శిక్షణాధికారులు మరింత ఆరా తీయడం ప్రారంభించారు. పిల్లల మానసిక ఎదుగుదలకు కారణం ఏమిటి అని అడిగినప్పుడు అక్కడున్న ఒక టీచరు ఇలా జవాబిచ్చారు:

“ఇక్కడకు వచ్చే పిల్లలందరూ ఒకే విధంగా ఉండరు. కొంతమందితో మొదట్లో సమస్యలు ఎదుర్కోవలసి వచ్చింది, మరికొంతమంది చెప్పలేనంత యాక్టివ్‌గా ఉండేవారు, మరికొంతమంది చాలా ఒంటరిగా ఉంటూ ఉండేవారు. చాలామందికి ఎన్నో చెడు అలవాట్లు కూడా ఉండేవి. అప్పుడు మేము బ్రహ్మా బాబా వద్దకు వారి సలహా కోసం వెళ్ళాము. ‘బాబా, ఈ పిల్లలు మమ్మల్ని చాలా కష్టపెడ్తున్నారు, మమ్మల్ని ఏం చెయ్యమంటారు?’ అని అడిగాము.

బ్రహ్మ బాబా ఎంతో స్పష్టంగా తమ జవాబును ఇలా ఇచ్చారు, 'పిల్లలను ఎప్పుడూ కొట్టవద్దు. కొట్టడము అంటే హింస చెయ్యడమే. ఇది చాలా పెద్ద పాపం. అందుకు బదులుగా, వారు చేసే పొరపాట్ల వల్ల జరిగే నష్టాలను వారికి ప్రేమగా తెలియజేయండి. వారిలోని చెడు అలవాటును వారే గమనించుకునే విధంగా శిక్షణ ఇవ్వండి. ఈ చెడు అలవాటు నుండి దూరమైతే వారికి కలిగే లాభాలేమిటో వివరించండి. ఇదంతా ఎంతో సౌమ్యంగా, ఓర్పుగా చెయ్యాలి. వారు అడిగేవి సమంజసమైతే మీరు అవి ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలి. ప్రేమ, అవగాహన అనే సుగుణాలను మీరు మీలో పెంచుకుంటే మీరు పిల్లల మనసులను గెల్చుకోగలరు. అప్పుడు మీరు చెప్పినట్లు వారు చేస్తారు. ఆకతాయి పనులను చెయ్యడం ద్వారా అనర్థాలు జరుగుతాయని మీరు వారికి చెప్పాలి. ఈ భూమిపై చేసే ప్రతి పనికి ఫలితము ఉంటుంది. అంతిమ సమయంలో దానిని ఎవ్వరూ తప్పించుకోలేరు. కర్మ సిద్ధాంతాలు ఎంతో ఖచ్చితంగా, ఎడతెగనివిగా ఉంటాయి. ఈ సత్యాన్ని వారు గ్రహించినప్పుడు వారి ఉన్నతికి వారే పాటుపడతారు. అంతేకానీ ఎప్పుడూ వారిని కొట్టవద్దు, వారిపట్ల దురుసుగా ప్రవర్తించవద్దు. వారికి ప్రేమను అందించండి!'

"బ్రహ్మబాబా ఇంకా ఇలా అనేవారు, 'ఈ పిల్లలు వారి ఇళ్ళను వదిలిపెట్టి ఇక్కడ ఉంటున్నారు. అంటే, వారు చాలా పెద్ద త్యాగము చేసారు. ఆ త్యాగానికి గౌరవాన్ని ఇవ్వాలి. వారి బుద్ధి, వారి కర్మేంద్రియాలు ఇంకా పూర్తిగా ఎదగలేదు. అయినప్పటికీ పెద్దవారికన్నా చిన్నపిల్లలు కొన్ని విషయాలలో చాలా చురుకుగా ఉంటారు. మీరు వారిని ఆత్మలుగా చూసి ఆ భావంతోటే మాట్లాడినప్పుడు మీరు చెప్పే విషయాన్ని వారు చక్కగా అర్థం చేసుకుంటారు. అప్పటికీ వారి అల్లరి తగ్గకపోతే వారికిష్టమైన కొన్నిటిని ఇవ్వడం ఆపండి, అప్పుడు వారు మారుతారు. ఉదాహరణకు, సమస్యగా ఉన్న విద్యార్థిని అతడు బాగా ఇష్టపడే విద్యార్థితో మాట్లాడనివ్వద్దు. అతడిలో మార్పు వచ్చేవరకు అతని స్నేహితునితో మాట్లాడకూడదు అని చెప్పండి.' నిజంగానే ఈ విధానము ఎంతో మంచి పరిణామాలను తీసుకువచ్చింది; అల్లరి చేసే పిల్లలు కూడా ఎంతో త్వరగా మారారు."

# యోగులకు పరీక్షలు

ఈ ఆధ్యాత్మిక విశ్వ విద్యాలయ కార్యకలాపాలు కొనసాగుతూ వచ్చాయి; స్త్రీలు, పురుషులు, పిల్లలు అందరూ జ్ఞానామృతాన్ని సేవిస్తూ ఉన్నారు. యోగశక్తితో వారి వ్యక్తిగత జీవితాన్ని పరివర్తన చేసుకునే శక్తిని పొందారు. తమ బలహీనతలపై విజయాన్ని సాధించలేని వారి కారణంగా యోగుల జీవనశైలిపై ఆటంకాలు రాసాగాయి.

భగవంతుడు తన అవతరణకు ఎంచుకున్న క్షేత్రం ఎంతో సంపన్న సమాజం. అక్కడ ఎంతో సంపన్న వ్యాపారవేత్తలు ఉండేవారు. అంతర్జాతీయ మార్కెట్లలో వారి వ్యాపారానికున్న ప్రాముఖ్యత అంతాఇంతా కాదు. కాంట్రాక్టుపై సంతకం చెయ్యడానికి పురుషులు ఎన్నో ప్రదేశాలకు, ఎంతో కాలం వెళ్ళాల్సి వచ్చేది. సంవత్సరంలో చాలా సమయం వారు బయటనే ఉండేవారు. వారి భార్యలు ఆ సమయంలో వారికి నచ్చిన జీవనశైలిని అవలంబించేవారు. భార్య ఒకవేళ ధార్మిక ఆలోచనలతో ఉన్నట్లయితే అందుకు భర్త ఎంతో సంతోషంగా తన అంగీకారాన్ని తెలిపేవాడు ఎందుకంటే ఇటువంటి ఆలోచనా ధోరణి మంచిదని, భార్య నమ్మకంగా ఉండి, ఇంటిని జాగ్రత్తగా చూసుకుంటూ, తీరిక సమయాలలో మందిరాలకు వెళ్ళడం ద్వారా అనవసరమైన ఆకర్షణలకు దూరంగా ఉంటుందని భర్తలు భావించేవారు. కానీ ఇంతకన్నా కూడా ఎక్కువగా వారి భార్యలు చేస్తారని భర్తలు ఊహించనేలేదు. నిజమైన ధర్మాన్ని తమ జీవితాలలోకి తీసుకువచ్చి, ఆహారపు అలవాట్లు, ఫ్యాషన్లను అన్నీ మార్చివేసి పవిత్రతను వారి జీవితాలలోకి తీసుకువచ్చారు.

ఒకసారి ఒక నావలో వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు చాలామంది వారివారి ఇళ్ళకు వచ్చారు. వ్యాపార లావాదేవీలతో, పోటీలకు తగ్గట్టుగా ఆలోచించి ఆలోచించి అలిసిపోయి వచ్చినవారు వీరందరూ. కొంతమంది విజయోత్సాహంతో, వారి వస్తువులను పూర్తిగా విక్రయించి తిరిగి వచ్చారు. మరికొంతమంది కొద్దిపాటి విజయాన్ని మాత్రమే పొందారు. కానీ అందరూ వారి భార్యలను చూడాలన్న ఆశతో వచ్చారు. విశ్రాంతి, భౌతిక సుఖాలకోసం వారు ఎదురు చూస్తున్నారు.

కానీ ఇక్కడ, వీరి భార్యలు భగవంతుని కలిసి వారి ప్రేమలో మునిగిపోయారు. వారి పవిత్రత సంకల్పం చాలా దృఢంగా ఉంది.

పరిణామం ఊహించదగ్గదే. నిరాశ కారణంగా భర్తలకు కోపం కట్టలు తెంచుకు వచ్చింది. వారు వారి భార్యలను అరిచారు, కొట్టారు, బెల్టుతో కొట్టారు, సత్సంగానికి వెళ్ళనివ్వకుండా అడ్డుకున్నారు. బ్రహ్మాబాబాతోకానీ, ఓం మండలితోకానీ ఏ విధమైన సంబంధం ఉండకూడదని వారిని బంధించారు. పరమాత్ముని సాంగత్యంలో భార్యలకు కలిగిన ప్రభావాన్ని తుడిచివేయాలన్నదే భర్తల ప్రయత్నం. కానీ భార్యలు మునుపటిలా ఆటవస్తువులలా లేరు. వారు ఎంతో దృఢంగా ఉన్నారు. ఒక బలహీనమైన ఆత్మ చేసే ఆగడాలకు శక్తిశాలి ఆత్మ తల వంచుతుందా? శారీరక దారుఢ్యం ఉన్న పురుషుడు ఒక స్త్రీని, భగవంతుని శక్తిని నింపుకున్న అతివను కామ వాసనల కోసం లోబరుచుకోగలడా? అసంభవం.

ఈ విధమైన ఘర్షణ చరమసీమను దాటింది. ప్రతి స్త్రీ పోరాడుతుంది – కొందరి పోరాటం సునాయాసంగా, విజయవంతంగా ముగిస్తే మరికొంతమంది వనితలు, తాము చేస్తున్న పవిత్ర పోరాటంలో ఎన్నో చిత్రహింసలను భరించాల్సి వచ్చింది. ఎన్ని ఆటంకాలు వచ్చినాగానీ వీరంతా పరమాత్మయందు అచంచల విశ్వాసాన్ని కలిగి ఉన్నారు. వారి సహాయంతో పరిస్థితులను చక్కబెట్టుకోగలము అన్న నమ్మకము వారికి ఉంది, అందుకే సంతోషంతో ఈ విధంగా పాడేవారు:

*నేను శక్తి స్వరూపాన్ని, నేను శాంతి స్వరూపాన్ని*
*నా అడుగులు ముందుకే వెళ్తున్నాయి,*
*నాలోని భ్రమలు, మోహము నశించాయి,*

నేను జ్ఞాన మురళిని వాయిస్తున్నాను,
ఇది విని అందరూ సంతోషంగా, ఆనందంగా ఉన్నారు.
ఇటువంటి సుమధురమైన సంగీతం
దుఃఖాన్ని దూరం చేస్తుంది.
అప్పుడు ఈ ప్రపంచం ఒక పూదోటలా అవుతుంది,
ఆత్మలు విముక్తిని పొందుతాయి,
దేహమునుండి దేహాభిమానము నుండి ముక్తిని పొందుతాయి.

భర్తల అమానుష ప్రవర్తనల మధ్య కూడా ఈ స్త్రీలు ఎంతో ప్రశాంతంగా, అణకువగా ఉంటూ భగవంతుని స్మరణ చేస్తూ ఉండేవారు. వారు ఎంతో మధురంగా ఈ విధంగా జవాబు ఇచ్చేవారు:

"హే ఆత్మా! మీరు నా సోదరులు. నేను మీ కళ్యాణమునే కాంక్షిస్తున్నాను. మన ఇంటిని నేను మందిరంలా చేయాలని అనుకుంటున్నాను. మీరు మరో విధంగా ఎలా ఆలోచించగలరు? మీరు, నేను కలిసి ప్రయత్నిస్తే మనం ఈ ఇంటిని స్వర్గంలా మార్చవచ్చు. మీపై నాకున్న ప్రేమ ఏమాత్రం తగ్గలేదు. నిజానికి, మీరెవరు అన్నది నేను ఇప్పుడే తెలుసుకున్నాను. మీరు ఒక ఆత్మ. నేను, ఆత్మను ప్రేమిస్తున్నాను కానీ శరీరాన్ని కాదు. మీరు కూడా ఆత్మనే చూడండి. నేను మరో విధంగా చేస్తే మిమ్మల్ని అగౌరవపరచినట్లే.

"మీరు అవినాశి పరమాత్ముని సంతానము. నేను వారి కుమార్తెను. కనుక ఇద్దరము కలిసి మన మనసులను వారియందు ఏకాగ్రం చేద్దాము. నేను నా బాధ్యతలన్నిటినీ మరింత శ్రద్ధగా చేస్తాను. మునుపటికన్నా ఎక్కువగా పని చేస్తాను, కానీ నన్ను ఓం మండలికి వెళ్ళవద్దని చెప్పకండి. భగవంతుని పిల్లలమైన మనం మన ఆత్మలను పావనం చేసుకుని, మనలోని చెడు అలవాట్లను భస్మం చేసుకోవాలి. మా మార్గానికి అడ్డు రాకండి. ఎందుకంటే మేము భగవంతుని ఆజ్ఞలపై నడుస్తున్నాము. మా ముందు కామపూరిత సంకల్పాలను దయచేసి పెట్టకండి. మన తండ్రి అశరీరి, పవిత్రమైనవారు, మేము కూడా అలా అవ్వడానికి కృషి చేస్తున్నాము.

"సమయాన్ని గుర్తించండి. ఈ కలియుగము సమాప్తం కానుంది. సత్యయుగ స్థాపన జరుగుతుంది. అందులో మీరు కూడా మీ జన్మసిద్ధ అధికారాన్ని పొందవచ్చు. మాతో సహకరించండి, యోగి అవ్వండి, మనం మన జీవితాలను పవిత్రంగా, కమలపుష్ప సమానంగా చేసుకుందాము.

"నేను మిమ్మల్ని ఇదొక్కటే అడుగుతున్నాను. పవిత్ర జీవితాన్ని నాకు ఇవ్వండి. అనేక జన్మలనుండి మనం కామ వాసనలకు బానిసలమై ఉన్నాము. వినాశనంకన్నా ముందు, మిగిలి ఉన్న ఈ కొద్ది సంవత్సరాలలో పవిత్రంగా ఉందాము."

ఈ స్త్రీమూర్తుల మాటలు ఎంతో మధురంగా, దృఢంగా ఉండేవి. కానీ ఇదంతా బూడిదలో పోసిన పన్నీరే అయ్యింది. భర్తలు వారి మాటలను పెడచెవిన పెట్టారు. ఆచారం ప్రకారం చూస్తే భార్య మనసులో భర్త తప్ప మరొకరు కానీ, మరో విషయం కానీ ఉండటానికి వీల్లేదు. భార్యగా తన బాధ్యత భర్తను సంతోషపెట్టడం మాత్రమే. సామాజిక కట్టుబాట్ల అనుసారంగా భార్య ఈ విధంగానే ఉండాలి. కనుక, భర్తలకు ఇప్పుడు వారి భార్యల ప్రవర్తన చాలా వింతగా అనిపించింది. భర్తలకు వారి అధికారం చేజారిపోతుందేమో అని కూడా అనిపించింది. కొంతమంది భర్తలైతే భార్యలపై అమానుషంగా ప్రవర్తించారు. రక్తమోడే విధంగా భార్యలను హింసించారు. వారి కామ వాసనలను తీర్చాల్సిందే అంటూ పట్టుబట్టారు.

పవిత్రతా కంకణం కట్టుకున్న స్త్రీమూర్తులు దౌర్జన్యానికి గురైన తర్వాత మరుసటిరోజు ఓం మండలికి పారిపోయి

వచ్చేసారు. జరిగినదేమిటో వారు చెప్పాల్సిన అవసరం లేదు ఎందుకంటే వారిని చూస్తేనే అంతా అర్థమైపోతుంది.

వారి ముఖముపై, ఒంటిపై పూర్తిగా గాయాలున్నాయి. చిరిగిన వారి వస్త్రాలపై రక్తపు మరకలున్నాయి. కొన్ని గాయాలైతే ఇంకా పచ్చిగా ఉండి రక్తమోడుతూనే ఉన్నాయి. కొంతమంది స్త్రీలవద్ద ఉన్న నగలను, వస్త్రాలను, డబ్బును భర్తలు తీసేసుకుని ఇంటినుండి వెళ్ళగొట్టారు.

ఇదంతా చూసిన కన్యలు తమ జీవితంలో ఎప్పుడూ వివాహం చేసుకోకూడదు అని నిశ్చయించుకున్నారు. బాబా చెప్పిన జ్ఞానము ఎంత గొప్పది, ఎంత సత్యము అని అప్పుడు మరింత అర్థమయింది. బాబా అంటారు, "పిల్లలూ! కామ వికారము మీకు పెద్ద శత్రువు. కామము, క్రోధము, మోహము నరకానికి ద్వారాలు." ఇప్పుడు మాతలను ఈ విధంగా కామవాంఛను తీర్చలేదన్న కోపముతో గొడ్డును బాదినట్లు బాదడం చూస్తే వికారాలు ఎంత అనర్థదాయకమో అర్థమవుతుంది. ఇప్పుడు బ్రహ్మా బాబా వివాహము చేసుకోమని అనుమతించినాగానీ ఈ కన్యలు వివాహము చేసుకోకూడదు అని నిశ్చయించుకున్నారు.

# యాంటీ ఓం మండలి పార్టీ

విదేశాలనుండి తిరిగివచ్చిన సింధ్ వ్యాపారుల కామవాసనలు తీరని కారణంగా వారంతా ఒక్కటయ్యారు. మహిళలు ఈ విధమైన స్వతంత్ర్య భావాలు కలిగి ఉండటం వలన వారి సమాజ ప్రతిష్ఠ మంటగలుస్తుందని వారందరూ భావించారు. వివాహ సాంప్రదాయాలను, లైంగిక హక్కులను ఇది ఉల్లంఘించడమే అని భావించి వారందరూ ఏకమయ్యారు. వివాహము మేము చేసుకోము అని నిశ్చయించుకున్న కన్యల తండ్రులు, సోదరులు, తాతయ్యలు కూడా వీరితో చేరారు. వారి అమ్మాయిలు వివాహము చేసుకోవాలని వారు పట్టుబట్టారు. ఈ పురుషులందరూ కలిసి యాంటీ ఓం మండలి పార్టీని ఏర్పాటు చేసి బ్రహ్మబాబా తన సత్సంగంలో పవిత్రత విషయాన్ని చెప్పడం మానెయ్యాలని పోరాటం చేసారు.

ఈ పార్టీ ప్రతినిధులు బ్రహ్మబాబాను కలవడానికి వెళ్ళారు. తమ భార్యలతో తమకు లైంగిక సంబంధాలు కావాలని ముగ్గురు భర్తలు బ్రహ్మబాబాను అడిగారు. కామ వాసనల కోసం వారు తమ భార్యలను ఎంతో అమానుషంగా హింసించి ఉన్నారు. అందులోని ఒక వ్యక్తి అయితే తనకు వివాహ సంబంధ హక్కులు కావాలంటూ కోర్టులో కేసు కూడా పెట్టాడు. ఈ పవిత్రత విషయము సింధ్‌లో పెద్ద దుమారమే లేపింది. ఊరి పెద్దలు, కొంతమంది నేతలు కూడా యాంటీ ఓం మండలి పార్టీలో చేరారు. వారిలా అన్నారు, "బ్రహ్మబాబా, ఈ మహిళలు తమ భర్తలతో కామక్రియలో పాల్గొనాలని మీరు వారికి చెప్పాలి."

బ్రహ్మబాబా ఈ విధంగా జవాబిచ్చారు, "నేను కేవలం ఆధ్యాత్మిక జ్ఞానాన్ని మాత్రమే ఇస్తున్నాను. కామ వికారాలలోకి వెళ్ళండి అని నేనెలా చెప్పగలను? వారు సత్సంగానికి రాదల్చుకోకపోతే అది వారి ఇష్టము. శ్రీమద్భగవద్గీతలో కూడా కామము నరకానికి ద్వారము అని చెప్పి ఉన్నారు కదా. మరి నేను వారికి బూటకపు సలహాను ఇవ్వమంటారా? నా సొంత కూతురు కూడా బ్రహ్మచర్యాన్ని పాటిస్తుంది. ఇలా చెయ్యమని తనను ఎవరు ఆజ్ఞాపించారు? ఆ మాటకొస్తే నన్నెవరు ఆజ్ఞాపించారు? మనమందరమూ ఆ పరమపిత పరమాత్ముని విధేయులము మాత్రమే."

బ్రహ్మబాబా మరింత స్పష్టంగా వారికి తన స్థానాన్ని ఈ విధంగా వివరించారు, "ఇవి నా ఆజ్ఞలు కావు. నేను కేవలం సేవాధారిని, భగవంతుని సేవకు నిమిత్తమాత్రుడను మాత్రమే. ఇది చెయ్యండని నేను ఎవరినైనా ఎందుకు శాసిస్తాను? ఎవ్వరూ నా అధీనంలో లేరు. వారిని ఆజ్ఞాపిస్తున్నవాడే నన్ను కూడా ఆజ్ఞాపిస్తున్నాడు."

ఇది విని అప్పటికి వారు వెళ్ళిపోయారు కానీ వారి విరోధము మాత్రం ఆగలేదు. ఓం మండలికి విరుద్ధంగా ఒక ఉద్యమాన్నే ప్రారంభించారు. అమాయక ప్రజలను రెచ్చగొట్టారు. మహిళలు బ్రహ్మచర్య వ్రతాన్ని చేపడితే ఈ ప్రపంచం కొనసాగేదెలా అని విచారించారు.

యాంటీ ఓం మండలి పార్టీ ఎంతో సామర్థ్యం కలిగి ఉంది. అందులోని సభ్యులు సంపన్నవంతులు. ప్రభుత్వంతో, ఊరి పెద్దలతో తమకున్న సంబంధాలను వారు ఉపయోగించడం ప్రారంభించారు. కొంతమందికి డబ్బులిచ్చి మరీ ఇంటింటికీ వెళ్ళి తమ ఇళ్ళలోని కన్యలను, మాతలను, భార్యలను ఓం మండలికి పంపిన పక్షంలో వారిని తమ కులంనుండి బహిష్కరించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ విధంగా భయపెట్టినా కూడా ఏమీ లాభం లేకపోయేసరికి ఓం మండలికి వెళ్ళేవారిని నిందించడము, కొట్టడము చేసారు. నగర అధ్యక్షుడు, సామాజిక నేతలతో కలిసి ఓం మండలిని పట్టణ శివార్లలోనే లేకుండా చేసేందుకు ప్రయత్నించారు. యాంటీ పార్టీలోని వారికి అక్కడి ప్రాంతీయ వార్తా పత్రికలతో, ఎంతో ప్రాచుర్యాన్ని పొందిన 'సింధ్ అబ్సర్వర్' అనే వార్తా పత్రికలతో పరిచయాలు ఉన్నాయి. ఉగ్రులైన సంపాదకులు కొంతమంది బ్రహ్మబాబా మరియు సత్సంగం గురించి విరుద్ధంగా ప్రచురించారు.

ఒకప్పుడు బ్రహ్మబాబాకు అండగా నిలిచినవారు ఇప్పుడు ఈ దుమారాన్ని చూసి భయపడి గుట్టు చప్పుడు

కాకుండా వారి సహాయాన్ని విరమించుకున్నారు.

ఒకప్పుడు సత్సంగానికి ప్రతి రోజూ రావడమే కాక వారి ఇంట్లోని కూతుర్లకు, కోడళ్ళకు సత్సంగానికి వెళ్ళేందుకు సమ్మతి పత్రాన్ని రాసిచ్చిన వ్యాపారవేత్తలు, అందరిముందు బ్రహ్మాబాబా కార్యాన్ని కొనియాడిన వారు ఇప్పుడు వారి వ్యాపారం దెబ్బతింటుందేమోనని, సమాజమునుండి వెలి వేస్తారేమోనని భయపడి సత్సంగానికి దూరంగా ఉండటం ప్రారంభించారు.

అంతే కాదు, మరెంతోమంది యాంటీ ఓం మండలిలో ముఖ్యులుగా చేరారు. మంఘూరామ్ అనే వ్యక్తి సమాజంలో పేరున్న వ్యక్తి, బ్రహ్మాబాబాకు దగ్గర బంధువు. అతడు సత్సంగానికి వస్తూ ఉండటమేకాక బ్రహ్మాబాబాను బాహాటంగా ప్రశంసించేవాడు కూడా. ఈ దుమారాన్ని చూసిన అతడు సత్సంగానికి వెళ్ళడం మానేసాడు. సత్సంగం గురించి పుట్టుకొస్తున్న పుకార్లను నమ్మిన అతడు యాంటీ ఓం మండలిలో చేరాడు. అది యాంటీ పార్టీ గెలుపుగా భావించినవారు మంఘూరామ్‌ను పార్టీకి ప్రధాన కార్యదర్శిగా చేసారు.

ఈ సంఘటన జరిగిన కొద్ది రోజుల క్రితమే బ్రహ్మాబాబా మంఘూరామ్‌ను కలిసినప్పుడు అతనికి బాబా ఒక గ్రామోఫోన్‌ను బహుకరించారు. అందులో ముందుగానే ఒక చక్కని పాట రికార్డు చేయబడి ఉంది. ఆ పాటలోని కొన్ని పంక్తులు ఈ విధంగా ఉంటాయి:

*ఈ పాపపు ప్రపంచమునుండి నన్ను దూరంగా తీసుకువెళ్ళిపో*
*నా మనసు ఎక్కడ విశ్రాంతిని పొందుతుందో అక్కడకు తీసుకువెళ్ళిపో*
*మోసము, కామము, స్వార్థము నుండి నన్ను దూరంగా తీసుకువెళ్ళిపో*
*లోకుల కుటిల మాటలనుండి, అసూయనిండిన దృష్టి నుండి దూరంగా తీసుకువెళ్ళిపో*
*ఎక్కడ దేవతలు నాట్యం చేస్తారో, ఆ బంగారు యుగానికి నన్ను తీసుకువెళ్ళిపో*

భగవంతుని తలంపులు తాజాగా మనసులో నిలవడానికి ఈ పాట ఉపయోగపడుతుందన్న ఉద్దేశ్యంతో బ్రహ్మాబాబా దీనిని ముఖియాకు (మంఘూరామ్‌కు) బహుకరించారు. ఆ పాట ఎంతో అద్భుతంగా, చక్కని భావంతో ఉంది. కానీ బ్రహ్మాబాబా ఈ రికార్డును ముఖియాకు ఇచ్చాడని తెలిసిన వెంటనే లోకులు అతని మనసును పాడుచేసారు, “ఈ రికార్డులో ఏదో మాయామంత్రము ఉంది. దీనిని తాకవద్దు, దీనిలోని పాటను పెట్టవద్దు. అలా చేస్తే మీ కుటుంబం వారందరిపై ఎంతో చెడు ప్రభావము ఉంటుంది. మేము ఒక మాంత్రికుడిని పిలుచుకువస్తాము. అతడు దీనిని చూసి దీనిలో ఏ మాయ ఉందో చెప్తాడు” అని అన్నారు.

ప్రజల తప్పుడు సలహాలకు ప్రభావితమై ఇదంతా నిజమేనని నమ్మిన ముఖియా భయపడి, మాంత్రికుడిని పిలుచుకు వచ్చేందుకు సరేనన్నాడు. మాయలు, మంత్రాలతో భూతాలను పారద్రోలడంలో, తావీదులు కట్టడంలో నేర్పరి అయిన ఒక భూత వైద్యుడిని పిలిపించారు. అతడు దానిని బాగా పరీక్షించాడు.

చివరిగా అతడు ఈ విధంగా చెప్పాడు, “అవును, ఇందులో మాయమంత్రము ఉంది. దీనిని మీరెవ్వరూ తాకనందుకు చాలా అదృష్టవంతులు. లేకపోతే ఏమి జరిగేదో చెప్పలేము”.

ఇది విన్న ప్రజలు రాళ్ళు, ఇటుకలు, కర్రలతో ఆ రికార్డును వెయ్యి ముక్కలయ్యేదాకా కొట్టారు. అలా కొట్టడం వలన అందులోని మాయ పారిపోయింది అని ఆ మాంత్రికుడు చెప్పాడు.

చూడండి, ప్రపంచమంతా మూఢనమ్మకాలతో ఎలా అయిపోయిందో! నిజంగా అందరి బుద్ధి మందగించింది. ఒకప్రక్క కొందరు తమ బుద్ధిని భగవంతుని బోధనలపై నిలుపుతుంటే మరొకవైపు ఇటువంటి బుద్ధి కలిగినవారు చేసే కృత్యాలు! భగవంతుని జ్ఞానముతో చరిత్ర నిర్మాణము జరగడమే నిజమైన ఇంద్రజాలము. శివబాబా చూపే నిజమైన

మాయ ఇదే. రాబందులుగా ఉన్న మనుష్యులు హంసలుగా మారడము, కరుడుగట్టిన స్వభావముతో ఉన్న వ్యక్తులు కూడా ప్రేమపూర్వకంగా పరివర్తన చెందడమే భగవంతుడు చేసే మాయ. భగవంతుని స్మృతిని కలుగజేసే ఆ రికార్డులో ఏదో మాయ ఉందని ప్రజలు అనడం ఒక రకంగా నిజమే.  ఆధ్యాత్మిక జ్ఞానములో ఇమిడి ఉన్న అవినాశి మాయ ఇది.

రికార్డును ధ్వంసం చేయడం చూసిన ఒక వ్యక్తి ఈ విధంగా బాధపడ్డాడు, “భగవంతుడా! ఈ భారతదేశం ఎంత అభాగ్యంగా మారిపోయింది. ప్రాచీన ఈశ్వరీయ జ్ఞానము లోపించడమే కాకుండా సాధారణ లోక జ్ఞానము కూడా నశించిందా! శాస్త్రాలలో వివరించిన విషయాలలోని యథార్థ భావాలను అర్థం చేసుకోకుండా అజ్ఞానము, మూఢ నమ్మకాలకు వశమైన ప్రజలు ఓం మండలివంటి సంస్థను కూడా మాయా మంత్రాలలో ఉన్నదిగా పొరబడుతున్నారు.

ఒకవేళ ఒక వ్యక్తి నకిలీ వజ్రాలను అమ్మే దుకాణం ప్రక్కనే తన స్వచ్ఛమైన వజ్రాల దుకాణాన్ని తెరిచాడనుకోండి. చాలామంది ఇతని వజ్రాలుకూడా నకిలీవేమో అని భావిస్తారు. తన వజ్రాలు స్వచ్ఛమైనవని ఆ దుకాణదారుడు నిరూపించి చెప్పినాకానీ ప్రజలు అతడిని నమ్మరు. అతి కొద్దిమంది మాత్రమే తమ వివేకమును, విచక్షణను ఉపయోగించి అసలైన వజ్రాలను పరిశీలించి కొనగలుగుతారు. అదే విధంగా, శివ పరమాత్మ యథార్థ జ్ఞాన వజ్రాలను అందించడానికి వచ్చినప్పుడు ఆ అమూల్యమైన వజ్రాలను అసత్యమైన వజ్రాలతో పోల్చి చూసి వాటిని తీసుకునేవారు ఎంతమంది?

ముఖియా కుటుంబ సభ్యులందరూ ఎంతో ఉగ్రులై ఉన్నారు. ముఖియా బాబాకు బావమరిది. ముఖియా కోడలు బాబా యొక్క పెద్ద కూతురు. బాబా కూతురైన నిర్మల్‌శాంత, ఒక గొడవ కారణంగా తన అత్తవారింటిని విడిచి బాబా వద్దకు వచ్చేసింది.

ముఖియా మరియు బాబా మధ్య సత్సంబంధాలు లేవన్న సంగతి ఊరంతా పాకింది. దాదా లేఖ్‌రాజ్‌పై ఎంతోకాలంగా మనసులో అసూయద్వేషాలను పెట్టుకున్న వారంతా ముఖియా వైపుకు వెళ్ళారు. అటువంటి వ్యక్తులలో ఒక సంపన్న వ్యాపారవేత్త కూడా ఉన్నాడు. అతడు ఒకసారి దాదా లేఖ్‌రాజ్‌ను వ్యక్తిగత సహాయం అడిగినప్పుడు దాదా అందుకు నిరాకరించారు.

అసలేం జరిగిందంటే, ఆ వ్యాపారవేత్త కొడుకు అకస్మాత్తుగా చనిపోయాడు. ఆస్తి పంపకాలకు సంబంధించి అతడికి తన కోడలితో గొడవ జరిగింది. ఈ పెద్ద మనిషి కోడలు కూడా సత్సంగానికి వచ్చేది. ఓం మండలికి దగ్గరలోని భవనములోనే తాను నివసిస్తూ ఉండేది. తన కోడలు తిరిగి తన ఇంటికి వచ్చి ఉండవలసిందిగా, ఆస్తి పంపకం విషయమును మర్చిపోవటానికి ఒప్పించవలసిందిగా దాదాను అతడు ఒత్తిడి చేసాడు. బ్రహ్మాబాబా ఇందుకు నిరాకరించారు. ఎందుకంటే, ఒకటి, ఇది వారి వ్యక్తిగత ఇంటి సమస్య. అందులో బాబా తలదూర్చడం సమంజసం కాదని బాబా భావించారు. రెండు, చట్ట ప్రకారంగా ఆ స్త్రీకి తన హక్కు తనకు లభించాలి. దాదా తన పాత స్నేహితుడైన కారణంగా, తాను చెప్పిన దానికి బాబా అంగీకరిస్తాడనే భావించాడు. బాబా తిరస్కరిస్తాడని ఊహించలేదు. ఈ కోపం అతనిలో ఎప్పటికీ తగ్గనే లేదు.

ఇప్పుడు ముఖియా మరియు ఈ పెద్ద మనిషి కలిసి ఓం మండలి పతనం కోసం ఎంతో ధనాన్ని కూడా ఖర్చుపెట్టసాగారు. కొన్నిరోజుల ముందు వరకు ఇదే ముఖియా మరియు పెద్దమనిషి సత్సంగానికి రోజూ వచ్చి జ్ఞానామృతాన్ని స్వీకరించిన వారే. ఇప్పుడు జనాలను భయపెట్టి, బెదిరించి ఎవ్వరినీ సత్సంగానికి వెళ్ళనివ్వకుండా చేయడం, బ్రహ్మాబాబా అందిస్తున్న జ్ఞానం గురించి లేనిపోని పుకార్లను పుట్టించడం, రహస్యంగా ప్రభుత్వంతో మంతనాలు జరిపి ఓం మండలి కొనసాగకుండా చెయ్యడమే వీరి ధ్యేయము.

వీరి పన్నాగం పారింది. ఎంతోమంది తమ ఇళ్ళల్లోని వారిని సత్సంగానికి వెళ్ళనివ్వకుండా ఇంట్లోనే బంధించారు. మూఢనమ్మకాలు, అనుమానాలు ఎక్కువగా ఉన్న భర్తలు ఒక తలుపుకు ఆరేడు తాళాలు వేసి కాపలా కాసారు. ఎన్నోసార్లు వారికి తిండి కూడా పెట్టేవారు కాదు. కొంతమంది మహిళలను మంచానికి కట్టిబడేసి, బాబా సత్సంగానికి ఇక మేము వెళ్ళము అని మహిళల నోటినుండి వచ్చేవరకు ప్రతిరోజూ వారిని అమానుషంగా కొట్టేవారు. మహిళలు ఎంతో మౌనంగా అన్నిటినీ భరించారు కానీ సత్సంగానికి వెళ్ళము అని మాత్రం అంగీకరించలేదు.

# మంచి చెడుల మధ్య యుద్ధము

దేవదూతలు, పరమ భక్తులు, సాధువులు, వైజ్ఞానికులు, కళాకారులు – మహోన్నత సిద్ధాంతాలు కలిగి మానవాళికి ఉన్నత సందేశాలను అందించినవారు కూడా ఈ సృష్టిలో ఎంతో సహించవలసి వచ్చింది. ఇటువంటి అరాచక సంఘటనలు చరిత్రలో కోకొల్లలుగా ఉన్నాయి. సందేశకులు, మహాత్ములు ఈ భువిపైకి ఎప్పుడు అవతరిస్తారు? పాత సిద్ధాంతాలలో సత్యం లోపించినప్పుడు, విస్తరించి ఉన్న పద్ధతులలో ఎటువంటి సారము లేనప్పుడు, సంకుచిత దృష్టికోణం నుండి ఒక గొప్ప ఆలోచన సాకారం కావలసిన సమయంలో వారు అవతరిస్తారు. అయినప్పటికీ ఉన్నత గమ్యాలను ఆశించి అందుకు శ్రమించే వారికి గౌరవము చాలా అరుదుగానే లభిస్తుంది. ఎందుకంటే స్థిరపడిపోయిన ఆలోచనలు, హోదాలు, గౌరవాలు ఆ వ్యక్తి ఇచ్చే నూతన దృక్పథం కారణంగా మారిపోవచ్చు కదా! కనుక, ఊహించిన విధంగా అటువంటి వారికి కష్టాలు, ఆపదలు తప్పడం లేదు.

ఇప్పుడు బ్రహ్మాబాబా పరిస్థితి కూడా ఇదే. వారు బోధించేది అనేకుల మనసులలో దృఢంగా నాటుకుని ఉన్న ఆలోచన మారేదిగా ఉంది – అదే, అహంకారము. ప్రతి ఒక్కరూ ఆత్మ అభిమాని స్థితిలో జీవించడం నేర్చుకోవాలి అని బ్రహ్మాబాబా బోధించారు. కామ వికారము కూడా హింసతో సమానమే అని వారు జ్ఞానోదయం చేసారు. ఇప్పుడు మనుష్యులందరూ కామ వికారముపై విజయాన్ని సాధించి, వారిలోని బలహీనతలను, చెడు అలవాట్లన్నిటినీ సమాప్తం చేసుకుని భగవంతుడి పిల్లలుగా, ఉన్నతులుగా తయారవ్వాలన్నది భగవంతుని ఆజ్ఞ. శివబాబా రావణునిపై యుద్ధాన్ని ప్రకటించారు. రావణుడు అంటే కామ, క్రోధ, లోభ, మోహ, అహంకారాలనే పంచ వికారాలకు మానవ రూపము. రావణుడు కూడా, అతడిపై యుద్ధం ప్రకటించిన వారిపై ఎదురుదాడి చేస్తూనే ఉన్నాడు. ఈ విధంగా యుద్ధం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

వంద సంవత్సరాల క్రితం దయానంద సరస్వతిగారు నిష్కపటంగా మాట్లాడిన కారణంగా ప్రజలు వారిపై రాళ్ళు రువ్వారు. అందరూ ధర్మపరంగా, నిజాయితీగా నడుచుకోవాలని చెప్పిన కారణంగా ప్రజలు వారితో గొడవపడ్డారు, బెదిరించారు. చివరకు విషమిచ్చి చంపేసారు. అలాగే, ఏసుక్రీస్తుకు శిలువ వేసి ప్రజలు వారిని సత్కరించారు. విగ్రహారాధనను విడిచి ఒక్క భగవంతుని స్మృతిలో ఉండాలని చెప్పిన అబ్రహమ్‌కు కూడా విరోధము తప్పలేదు. కులమత భేదాలు విడిచి అందరూ సక్రమమైన నడవడిక మరియు అవగాహనతో జీవించాలని ఉపదేశించిన బుద్ధుడుకు కూడా అపహాస్యాలు, అవమానాలు తప్పలేదు. వారి సొంత బంధువులే వారిని గౌరవించలేకపోయారు.

అదే విధంగా, భారతదేశంలోని ఎంతోమంది మహానుభావులు ధర్మాన్ని బోధించిన కారణంగా, ధర్మపరాయణులుగా ఉన్న కారణంగా ఎదుర్కున్న కష్టాల కథలు పెద్దవే. గురు నానక్‌ను అరెస్ట్ చేసి వెట్టి చాకిరి చేయించారు. తేజ్ బహాదూర్ తలను నరికారు; మీరా విషాన్ని త్రాగవలసి వచ్చింది; మరో సాధువు చర్మమును వలిచారు; ప్రతి మహానుభావుడు ఎంతో సహించవలసి వచ్చింది. ఇవన్నీ చాలాకాలం క్రితం జరిగిన సంఘటనలైతే భారతదేశాన్ని స్వాతంత్ర్యం వైపుకు నడిపించి అహింస, సత్యత, బ్రహ్మచర్యాన్ని బోధించిన మహాత్ముడు కూడా మత వైషమ్యాల కారణంగా హతమార్చబడ్డాడు. మహాత్మా గాంధీ పేరు ప్రపంచ ప్రసిద్ధి చెందినది. అయినప్పటికీ హంతకుని తూటాలు గాంధీజీని బలిదీసుకున్నాయి.

ఒక క్రొత్త మార్గాన్ని చూపే ప్రతి వ్యక్తి విమర్శలు, కష్టాలు ఎదుర్కోవలసిందే. ఎందుకంటే ప్రజలు తమ విధానాలను మార్చుకోవడంలో అయిష్టతను చూపిస్తారు. గెలీలియో వంటి వైజ్ఞానికుడు కావచ్చు, సోలెనీసన్ వంటి రాజకీయవేత్త కావచ్చు, ఎవరైనా వర్తమాన ఆచారాలను మార్చాలనుకుంటే వారికి కష్టకాలమే ఎదురైంది. వారిపైకి నేరాలు నెడ్తారు, విమర్శలు విసురుతారు.

క్రొత్త ఆలోచనలకు పునాది వేసే వ్యక్తిని తన సొంత స్నేహితులే దూరం చేస్తారు. ఇది అన్నిటికన్నా గడ్డు

సమయమని చెప్పవచ్చు. సమాజానికి జ్ఞాపక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. ఒక వ్యక్తి చేసిన మంచిని సమాజం చాలా త్వరగా మర్చిపోతుంది. అతడిపై మోపబడిన అభియోగాలు లెక్కలేనన్నిగా ఉంటాయి, అంతే కాక ఆ సమయంలో చిన్న పొరపాటును కూడా చాలా పెద్ద నేరముగా పరిగణిస్తారు.

అంతకుమించిన దయనీయమైన పరిస్థితి ఏమిటంటే, ఈ సమాజంలో ఎంతోమంచి వక్తలున్నారు. వాక్చాతుర్యం కలిగినవారు, ఛాందసవాదులు తమ వాక్పటిమతో స్వార్థపూరితంగా ప్రజల మనోభావాలను మార్చేసి బూటకపు సత్యాలను నమ్మించే విధంగా చేస్తారు.

ఇటువంటి విరోధాన్నే బ్రహ్మాబాబా మరియు ఓం మండలి ఇక్కడ ఎదుర్కుంటున్నది. అయినప్పటికీ బ్రహ్మా బాబా చలించలేదు. వారికి కోపం రాలేదు. కనీసం తిరిగి పోరాడాలి అని కూడా భావించలేదు. భగవంతుని బోధనా కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతూ వచ్చాయి. శివబాబా ప్రతిరోజూ బ్రహ్మాబాబా శరీరంలోకి ప్రవేశించి వినిపించే జ్ఞాన మురళిని వినాలని ఆకాంక్షించేవారికి జ్ఞానామృతాన్ని అందిస్తూ ఉన్నారు. మునుపటిలాగే స్కూలు కొనసాగింది. సంస్థను మమ్మా మరింత దృఢత్వముతో మరియు మధురతతో నడిపించారు.

బెదిరింపులకు బ్రహ్మాబాబా ప్రతిస్పందిస్తారేమో అని సింధ్ ప్రజలు భావించారు. కానీ వారికి నిరాశే ఎదురైంది. ఈ సంస్థకు బాధ్యులు బ్రహ్మాబాబా  కాదన్న విషయము వారికి అర్థం కాలేదు. వారు కేవలం ఒక సామాన్య గృహస్థుడు మరియు వ్యాపారవేత్త మాత్రమే. వారెప్పుడూ విద్యావేత్త లేక గురువుగా అవ్వలేదు. నేను గురువును అని  బ్రహ్మాబాబా ఎప్పుడూ చెప్పలేదు. పవిత్రత మరియు సంపూర్ణ బ్రహ్మచర్య బోధనలు బ్రహ్మ నుండి వచ్చిన బోధనలు కావు. ఇటువంటి బోధనలు విని మొదటగా బ్రహ్మాయే విస్మయానికి గురయ్యారు.

ఒక సాధారణ గృహస్థుడు – వివాహిత స్త్రీ పురుషులు బ్రహ్మచర్యాన్ని పాటించాలన్న సంకల్పమును చెయ్యగలడా? ఇది ఎప్పుడూ విని ఎరుగము. గతంలో ఇటువంటి సన్యాసం పుచ్చుకోవాలనుకున్నవారు గుహలకు, అడవులకు పారిపోయారు. స్త్రీ పురుషులిద్దరూ కలిసి ఉంటూనే కామ వికారపు ఆలోచనలను పూర్తిగా తొలగించడం వీలవుతుందా? దాదా లేఖ్‌రాజ్‌కానీ లేక ఇతరులెవ్వరూ ఇది సాధ్యమని కలలో కూడా ఊహించలేదు. అలా చెయ్యాలంటే అందుకు దైవ శక్తి తోడు ఉండాలి. నిజానికి, అది ఈరోజు సాధ్యమయింది కూడా. (ఈ రోజు ఈ విశ్వ విద్యాలయంలో షుమారు 5,000మంది జంటలు కలిసి ఉంటూనే బ్రహ్మచర్య వ్రతాన్ని సంపూర్ణంగా పాటిస్తున్నారు). ఎన్నో జంటలు పవిత్ర జీవనాన్ని గడుపుతూ ఉన్నారు, మరెంతోమంది స్త్రీలు ఎన్నో ఆటంకాలు ఎదురవుతున్నా పవిత్ర జీవితాన్ని వీడటం లేదు.

మహిళలపై అత్యాచారం కొనసాగుతూనే ఉంది, అయినప్పటికీ వారి పవిత్రత ప్రతిజ్ఞను వీడలేదు. సింధ్ ప్రజల విస్మయానికి ఇది కూడా ఒక కారణము. ఎందుకంటే సింధ్ మహిళలు ఎప్పుడూ తమ భర్తలు మరియు తండ్రుల మాటకు కట్టుబడి ఉండేవారు. మేలి ముసుగులో ముఖాన్ని దాచుకోవడం, పురుషుల మధ్య మౌనంగా ఉంటూ, అణిగిమణిగి ఉండటం, ఇళ్ళల్లో పంజరంలోని పక్షిలా ఉండటం మాత్రమే తెలిసిన ఈ మహిళలు అకస్మాత్తుగా జయింపశక్యం కాకుండా, ఆధ్యాత్మిక శక్తితో నిండిపోయారు. ఏ గురువూ చెప్పలేనంత స్పష్టంగా, ఆధ్యాత్మిక జ్ఞాన గుహ్యతలను వీరు విశదీకరించగలుగుతున్నారు. ఇంతటి ఉత్సాహము, బుద్ధి, ఆత్మ స్థైర్యం వీరికి ఎక్కడ నుండి వచ్చాయి? తిట్లు, ఛీత్కారాలు, తన్నులు, ఆకలి హింసలు, నలుగురి ముందు అవమానాలు జరిగినాగానీ ఈ మహిళలు వారి సిద్ధాంతాలలో వెనుకంజ వేయలేదు. దీని వెనుక ఎవరి శక్తి ఉంది?

బాహ్యంగా, ప్రజలకు బ్రహ్మాబాబాయే కనిపిస్తున్నారు. ప్రజల బుద్ధి మందగించింది. అందుకే పరమపిత శివ పరమాత్మ బ్రహ్మాబాబా భౌతిక శరీరములో ప్రవేశించి తమ అమోఘమైన, అద్భుతమైన జ్ఞానాన్ని అందిస్తునారన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోలేకపోయారు.

కనుక, ప్రజలు తమ కఠినమైన సంస్కారాల చేతిలో నిస్సహాయులుగా అయిపోయారు. బ్రహ్మాబాబా కూడా

నిస్సహాయులుగా ఉన్నారు, కానీ వారు భగవంతుని చేతిలో నిస్సహాయులుగా ఉన్నారు. వారు ఒక సింధీ సామెతను చెప్తూ ఉంటారు, 'వాట్ వాందే బ్రాహ్మణ్ వాదో', అంటే 'తన మానాన తాను వెళ్తున్న బ్రాహ్మణుడు ఇరుక్కున్నాడు' అని అర్థం. దాదా లేఖ్‌రాజ్‌కు కూడా అదే జరిగింది. వారు తమ లౌకిక జీవితంలో సంతోషంగా సాగుతూ ఉన్నారు. విజయాన్ని సాధించిన ఒక వ్యాపారవేత్తగా, ఒక పెద్ద పరివారాన్ని కలిగిన వారుగా తన జీవితాన్ని తాను జీవిస్తూ ఉన్నారు. అప్పుడు శివబాబా వీరి శరీరంలో ప్రవేశించి పవిత్రత యొక్క గొప్పదనాన్ని బోధించడం ప్రారంభించారు. ఈవిధంగా బ్రహ్మా బాబా అనుకోకుండానే భగవంతుని రథముగా అయ్యారు.

ఇటు విరోధులు పావులు కదుపుతూనే ఉన్నారు. కొంతమంది మనుషులకు డబ్బిచ్చి సత్సంగానికి వచ్చి వెళ్ళే వారిని ఒక కంట కనిపెట్టి ఉండమన్నారు. అలా సత్సంగానికి వెళ్ళేవారిని పట్టుకుని ఇక మీదట బ్రహ్మాబాబా వద్దకు వెళితే ప్రాణాలు తీస్తామని బెదిరించారు.

ఈ విషయం బ్రహ్మాబాబా విన్నప్పుడు, వారు కేవలం నెమ్మదిగా తల ఊపారు. వారికి ఆవేశం రాలేదు, వీరు ఇంత అపకార బుద్ధితో ఎందుకు ఆలోచిస్తున్నారు అని కోపమూ రాలేదు. "వీరికి పరమపిత గురించి తెలియదు కదా, అందుకనే ఇంతటి విరోధాన్ని చూపిస్తున్నారు. ఇదంతా నేను చేయిస్తున్నానేమో అని వారి అనుమానం. నేను కూడా భగవంతుని ఆజ్ఞపై నడుస్తున్నానని వారికి తెలియదు. పరమాత్మకు తమ శరీరము లేదు కనుక సత్య మార్గాన్ని బోధించడానికి వారు ఈ శరీరమును ఉపయోగించుకుంటున్నారు. కానీ వారు ఆత్మను చూడలేక ఈ భౌతిక శరీరమునే చూస్తున్నారు. మీరు వారినెలా నిందిస్తారు? ఇందులో వారి తప్పు లేదు."

పొరపాటు శాస్త్రాలలో ఉంది. బ్రహ్మాబాబా మనకు ఈ విధంగా వివరించారు, "ఈ పుస్తకాలు కామ వికారాన్ని సమర్థించేవిగా ఉన్నాయి. ఉదాహరణకు, అందులో ఏమని ఉందంటే బ్రహ్మ సరస్వతిపై మోహితుడయ్యాడని; శంకరుడు మోహినిని రక్షించినప్పుడు అతడు ఆమె వైపుకు ఆకర్షింపబడ్డాడని; శ్రీకృష్ణుడు గోపికల వస్త్రాలు ఎత్తుకెళ్ళాడని ఉంది. ఇటువంటి అసత్య కథలను వినేటప్పుడు వాటిలో కేవలం భావార్థాన్ని మాత్రమే గ్రహించాలి – అలా కాక కామ వాసన తప్పు కాదు, అది సృష్టి ప్రారంభం నుండి ఉందని నమ్ముతూ వచ్చారు. కానీ, అన్నిటికన్నా ఉన్నతమైన భగవద్గీతలో, 'కామము అన్నిటికన్నా పెద్ద శత్రువు' అని స్పష్టంగా వ్రాసి ఉంది. ఇంతటి ముఖ్యమైన వాక్యాన్ని ప్రజలు మర్చిపోయారు. పండితులు, విద్వాంసులు దానిని పట్టించుకోలేదు.

అయినా, గురువులకు ఇది తెలుసు. అందుకే వారు స్త్రీ వ్యామోహము నుండి దూరంగా ఉండటానికి అడవులకు పారిపోయేవారు. క్రైస్తవులకు కూడా ఈ విషయం తెలుసు, అందుకే కామము మూల పాపము అని వారంటారు. అందుకే కాథలిక్ మత గురువులు కూడా పవిత్రంగా ఉంటారు. బౌద్ధులకు ఈ విషయం తెలుసు కనుకనే ఆ సన్యాసులు పవిత్రత కోసం నిరంతరం కృషి చేస్తూ ఉంటారు. యూదులు కూడా పరస్పరం కామపూరిత సంబంధాన్ని వీడాలి అని బోధిస్తారు. అందుకే వివాహమైన జంటలు కూడా పరస్పరంలో కామ వికారములేని నియమబద్ధ జీవితాన్ని గడుపుతారు. ఇదంతా చూస్తే ప్రపంచం మొత్తానికి పవిత్రత యొక్క అర్థము, దాని విలువ తెలుసనే అనిపిస్తుంది.

యాంటీ ఓం మండలి చేసే అకృత్యాల గురించి ఆవేశంతో మాట్లాడే వారితో బాబా ఇలా అనేవారు, "మన గురించి చెడుగా మాట్లాడేవారు మన నిజమైన మిత్రులు". ఆ సమయంలో ఏదీ స్పష్టంగా అర్థం కాకపోయినా బాబా పిల్లలు మాత్రం ఈ పరిస్థితితో చాలా దృఢంగా, నిర్భయులుగా తయారవుతూ వచ్చారు. ఎంత దృఢంగా అంటే ఆ తర్వాత ఇక వారు దేనికీ భయపడే స్థితిగానీ, సున్నిత మనస్తత్వంతో కానీ ఉండరు. ఈ అగ్ని పరీక్షను దాటగలిగిన వారే ధైర్యంగా నిలదొక్కుకుని భగవంతుని సందేశాన్ని ప్రపంచాన్ని చాటి చెప్పారు.

నిజానికి, ఆ అగ్ని చాలా వేడిగా ఉంటుంది. యాంటీ ఓం మండలి పార్టీ నుండి విరోధ సెగలు పెరిగాయి. కన్యలను కొట్టడమే కాక వారిచేత పంది మాంసమును కూడా బలవంతంగా తినిపించే ప్రయత్నాలు చేసారు. ఆ కన్యల

ఇళ్ళలోని పురుషులు అశుద్ధమైన మాంసాన్ని వారి గొంతులో కుక్కేవారు. మరికొంతమంది కుటుంబాలవారు మాంత్రికులను పిలిపించారు. మంత్రతంత్రాలను పోగొట్టడంలో పేరు మోసిన వ్యక్తి, మహిళను మంచం క్రింద తన కాళ్లు, చేతులను చాపి పడుకోమని చెప్పేవాడు. మంచం కాళ్ళను ఆ మహిళ అరచేతుల మీద ఉంచి అతడు ఆ మంచం మీద కూర్చుని ఆమెను చూసి బిగ్గరగా నవ్వేవాడు. ఇతర మాంత్రికులు కూడా ఇతడిని అనుసరించారు.

మాంత్రికులు ఈ విధంగా మహిళలను ఎన్నో రోజులుగా గదులలో బంధించి ఉంచి పవిత్రత మార్గాన్ని వీడమని బెదిరించేవారు. కొన్నిసార్లు బంధువులు వచ్చి కన్యల చేతి మీద నిర్దయగా రోకలితో కొట్టేవారు. ఆ కన్యల చేతి వ్రేళ్ళు రోకలి దెబ్బలకు నలిగిపోయేవి.

ఇంతటి అమానుషత్వానికి గురైనప్పటికీ భగవంతునిపై తమకున్న విశ్వాసాన్ని కన్యలు కోల్పోలేదు. వారి కన్నీళ్ళలో ఈ గాత్రం వచ్చింది:

*ఈ పూర్తి విశ్వాన్ని ఏలేది అతడే*
*ఈ విశ్వము అతడిదే*
*ఆ పరమాత్మ మనల్ని పావనంగా చెయ్యడానికి అవతరించారు*
*ఆత్మ అజ్ఞానములో మునిగి నిద్రిస్తున్నప్పుడు*
*అందరూ వికారాల వలలో చిక్కుకుని విలపిస్తున్నప్పుడు*
*మాయా ప్రభావంలోకి వచ్చి అందరూ అహంకార మదంతో ఉన్నప్పుడు*
*అప్పుడు రాజులకే రాజు అవతరించాడు*
*బాబా మస్తకంలోకి వచ్చి చేరాడు*
*ప్రకాశ ప్రపంచం దిగి వచ్చింది*
*జ్ఞాన దీపాన్ని వెలిగించింది.*

బ్రహ్మచర్య పాలనలో ఉన్న గొప్పదనము ప్రపంచంలోని అన్ని ధర్మ గ్రంథాలలో ఉన్నత స్థానాన్ని సంపాదించుకున్నప్పటికీ ఒక వ్యక్తి ఆ బ్రహ్మచర్యాన్ని పాటించాలంటే ఇంత సహించవలసి ఉంటుందా అని ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. సాధు సన్యాసులలోని పవిత్రతయే మేరీ మాతలోనూ కనబడింది కనుక వారిని అందరూ కొనియాడారు. ఆదబ్, బీబీలు ఈడెన్ తోటలో సంపూర్ణమైన పవిత్ర జీవితాన్ని గడుపుతూ ఉండేవారు, కానీ భౌతిక కోరిక అనే ఆపిల్ పండును స్వీకరించిన కారణంగా వారు స్వర్గం నుండి వెళ్ళిపోవలసి వచ్చింది. అదే విధంగా, హిందూ ధర్మానికి చెందిన దేవీదేవతలందరూ కామ చితిపై కూర్చున్న కారణంగా వామ మార్గంలోకి వెళ్ళారు అని అంటారు. ఈ విధంగా, మానవుడు తన ఇంద్రియాలపై పట్టును కోల్పోయిన కారణంగా ఈ రోజు 'మానవ పతనము' మన కళ్ళ ముందు ప్రత్యక్షంగా కనిపిస్తుంది.

భారతదేశంలో కన్యలకు పూజ జరుగుతుంది. కానీ వివాహము జరిగిన తర్వాత ఆ కన్యలనే బానిసలుగా చూస్తూ, ముఖానికి మేలి ముసుగులు తొడుగుతారు. వారిలో మునుపటి పవిత్రత లోపించింది అని దీనిద్వారా స్పష్టంగా అర్థమవుతుంది. పవిత్ర కన్యలైన జగదాంబ మరియు సరస్వతి స్థానం ఎంతో ఉన్నతంగా ఉంది. వారి పవిత్రతకు ముగ్ధులైన భక్తులు వారి పాదాలను భక్తితో కడుగుతారు.

అయినప్పటికీ, ఈ పవిత్రతను నిజ జీవితాలలోకి తెచ్చేసరికి; మేము కూడా దేవతలుగా అవ్వడానికి మనస, వాచ, కర్మణ పవిత్రులుగా ఉంటామని ఈ కన్యలు తమ ఇళ్ళల్లో చెప్పినప్పుడు వీరు బెదిరింపులు, ద్వేషాన్ని చవిచూడాల్సి వచ్చింది. వారి బంధువులు వారి చేతులపై రోకలితో కొట్టారు, వారిని సంకెళ్ళతో బంధించారు.

*ఓ మానవుడా! నీవు ఇంద్రియ రసంలో చిక్కుకున్నావు*
*నీ శక్తినంతా అన్యాయంగా కోల్పోయావు*
*తప్పొప్పులు, మంచిచెడులను పరిశీలించే విచక్షణను కోల్పోయావు*
*నీ ఈ శరీరం ఒక రోజు మట్టిలో కలిసిపోతుందని గుర్తుంచుకో*
*నీ అపవిత్ర కర్మల ఫలితాన్ని అనుభవించాల్సి ఉంటుందని గుర్తుంచుకో*
*నిస్సహాయులైన ఈ మహిళలకు ఎందుకు దుఃఖాన్ని కలిగిస్తావు?*

*ఓ మానవుడా! డబ్బు మైకంలో పడి నువ్వు ఇంద్రియ సుఖాలకు మరిగావు*
*నిరుపేదలను నువ్వు ద్వేషిస్తున్నావు*
*నిజానికి, నువ్వు వారి రక్తాన్ని త్రాగుతున్నావు*
*కానీ గుర్తుంచుకో! నీది అనుకుంటున్న ప్రతి ఒక్కటీ*
*ఏదో ఒక రోజు మట్టిలో కలిసిపోతుంది*
*– నీ ఇల్లు, నీ వస్త్రాలు, నీ బంగారం, నీ జీవితము –*
*అన్నీ మట్టిలో కలిసిపోతాయి*
*ఇంకెన్ని రోజులు మిగిలి ఉన్నాయి?*
*ఓ మానవుడా, ఆలస్యం కాకముందే నీ అంతరాత్మను అవగతం చేసుకో.*

మనిషి ఎంతగా దిగజారిపోయాడో మహిళలు ఈ పాట ద్వారా వారికి అద్దం పట్టారు. ఏదో అద్భుతము, అసాధారణ విషయము జరుగుతుంది, కానీ అదేమిటో సింధ్ ప్రజలకు బోధపడటంలేదు.

వాస్తవాలను గ్రహించడం ఇష్టంలేని చాలామంది తప్పును ఒప్పుగా చిత్రీకరించే విధంగా తమ ప్రవర్తనను సమర్థించుకోసాగారు. బ్రహ్మాబాబా మాటలు విని బ్రహ్మచర్యాన్ని పాటించేవారు పిచ్చివారు అని ఒకరికొకరు చెప్పుకునేవారు. నిజానికి, ఎవరు పిచ్చివాళ్ళు? పవిత్ర మార్గాన్ని ఎంచుకుని భగవంతుని తలంపుతో సుఖశాంతులను పొందుతున్నవారు పిచ్చివారా లేక తమ భార్యలను, కూతుళ్ళను, తమ తల్లులను సైతం కొట్టి హింసించిన వారు పిచ్చివారా?

అజ్ఞాన అంధకారంలో ఉన్నవారు జ్ఞానోదయం కలిగినవారిని పిచ్చివాళ్ళు అని అనుకుంటే జ్ఞాన ప్రకాశము లభించినవారు అంధకారంలో మగ్గుతున్నవారిని చూసి ఇదే విధంగా భావిస్తున్నారు.

ఒక యుక్త వయస్కురాలైన సోదరి, తన అనుభవాన్ని ఇలా వినిపించారు. ప్రతి రోజూ సత్సంగానికి వెళ్ళనివ్వకుండా తన కుటుంబంవారు ఆమెను రోజూ ఉదయం గదిలో బంధించేవారట. వివాహము చేసుకోను అన్న తన దృఢ నిర్ణయాన్ని గమనించిన కుటుంబంవారు ఆమెను గదిలో చాలాకాలం బంధించేవారట. ఇంత జరిగినాగానీ తాను పవిత్ర మార్గంలోనే ఉంటానని పట్టుబట్టేసరికి ఆమెను కొరడాతో కొట్టడం ప్రారంభించారట.

అప్పటివరకు తన కుటుంబాన్ని అమితంగా గౌరవించే ఆ కన్యకు ఇది నిజంగానే పెద్ద పరీక్ష. ఆమెకు తన కుటుంబాన్ని ఎదిరించాలని లేదు, కానీ భగవంతుని ఆజ్ఞలను ఉల్లంఘించాలని కూడా లేదు. ఆ కన్య తన ఇంట్లోనివారితో ఇలా చెప్పేది, "నేను తినకుండా వెళ్తాను, మీరు కావాలంటే నన్ను రోజూ కొట్టండి, కానీ నేను జ్ఞానామృతాన్ని తీసుకోకుండా ఉండలేను. కనుక దయచేసి నన్ను సత్సంగానికి మాత్రం వెళ్ళనివ్వండి." వీళ్ళు చేసే ప్రయత్నాలన్నీ వృథా అవుతున్నాయని తెలుసుకున్న కుటుంబంవారు ఒక మాంత్రికుడిని పిలిపించారు. అతడు ఆ కన్యను చూస్తూ ఏవో మంత్రాలు చదివి

మంత్రించిన నీటిని త్రాగమని ఆజ్ఞాపించాడు. కానీ ఆ కన్య ఎంతో సౌమ్యంగా నవ్వి, “నీ ఈ మానవ మాయ భగవంతుని మాయను జయించగలదని అనుకుంటున్నావా?” అని అన్నది. తాను ఓడిపోయానని ఆ మాంత్రికుడికి అర్థమయింది. ఈ కన్య తన సత్యమైన ప్రేమను ఆ పరమాత్మతో జోడించిందని అతడు అర్థం చేసుకుని తన మంత్ర విద్యను ఆమెపై ప్రయోగించడం ఆపేసాడు.

అటుతర్వాతనుండి తల్లిదండ్రులు ఆ కన్యకు కొంత స్వేచ్ఛను ఇచ్చారు. ఇప్పుడు ఇంట్లో ఆ కన్య సాధారణ జీవితాన్ని గడుపుతుంది. కానీ బంధువులు, స్నేహితులు మాత్రం ఆ కన్యను వేరే జీవిలాగా చూడటం మొదలుపెట్టారు. సాయంకాల సమయాలలో ఆ కన్య ఏకాంతంలో, ఒక చోట కూర్చుని సమాధి స్థితిని అనుభవం చేసేది. కానీ ఇది ఇంట్లోనివారికి నచ్చేదికాదు. తను మెడిటేషన్‌ను అభ్యాసం చెయ్యడానికి కూర్చునే ప్రతిసారీ ఏదో ఒక విధంగా ఆటంకాలు వెయ్యడానికి ప్రయత్నించారు – అదే సమయంలో ఏదో ఒక పని చెయ్యమని చెప్పడం, ఆమెను హింసించడం లేక ఆమె చేసే ఆధ్యాత్మిక పురుషార్థాన్ని గురించి హేళనగా మాట్లాడటము వంటివి. శివబాబా వినిపించే జ్ఞాన మురళిని చదవడానికి కూర్చున్నప్పుడు మాత్రం ఆ ఇంట్లోనివారి కోపానికి హద్దు ఉండేదికాదు. అప్పుడు మళ్ళీ ఆ కన్యను వారు కొట్టేవారు.

వీరి ప్రవర్తన చూసి ఆమె ఆశ్చర్యపోయింది. ఇదేమి ప్రపంచము! ఈ యుగము ఎలా మారిపోయింది! అని ఆశ్చర్యపోతూ ఈ విధంగా పాడింది:

*హే మాయా! నీ రంగురంగుల మరీచికతో*
*ఎంతమందిని ఆడిస్తావు!*
*వారి బుద్ధి పూర్తిగా నశించేవరకు నువ్వు వారి చేత*
*ఇంద్రియ రసాన్ని త్రాగిస్తున్నావు!*
*అయ్యో! నువ్వు వారినెందుకు కామక్రోధాలతో నింపుతున్నావు?*
*హే మాయా! నువ్వు మంచిమంచి వారిని నీ వలలో వేసుకుంటున్నావు*
*వారి నిజ అస్తిత్వాన్ని మర్చిపోయేలా చేస్తున్నావు,*
*ఈ భౌతిక శరీరమనే వస్త్రాల వలలో వారిని ఇరికిస్తున్నావు*
*వారి నిజ స్వరూపాన్ని మర్చిపోయేలా చేస్తున్నావు*
*దుఃఖపు గానుగలో వారిని నలిపేస్తున్నావు!*

శ్రీమద్భగవద్గీతలో రాకుమారుడైన శ్రీకృష్ణుడిని అనేకసార్లు భగవంతునిగా వర్ణించడం జరిగింది. వారు ‘మురళి’ని వాయిస్తున్నట్లుగా కూడా చూపిస్తారు. అతడి మురళీనాదాన్ని వినడానికి గోపికలు, మహిళలు అందరూ పరిగెత్తుకుంటూ వచ్చి ఆ మధుర నాదంలో మునిగిపోయేవారు.

ఆ కన్య ఇంకా ఈ విధంగా చెప్తున్నారు:

“ఆ సమయంలో నేను కృష్ణుని ఈ కథలన్నీ గుర్తు తెచ్చుకునేదాన్ని. వాటిని నేను నా చిన్నతనంలో చదివాను. గోపికలకు మురళి నాదం వినపడగానే పరిగెత్తుకుంటూ వెళ్ళిపోతుంటే వారి ఇంట్లోవారు వారిని మురళీధరుని వద్దకు వెళ్ళనివ్వకుండా ఆపేవారు. మురళీనాదాన్ని గోపిక వినగలగడం, తన భర్తకు మాత్రం వినబడకపోవడమేమిటా అని నేను ఆశ్చర్యపోయేదాన్ని. వారికి ఆ మురళినాదం వినడం ఇష్టంలేదా లేక వినపడకుండా ఉండటానికి వారి చెవులను మూసేసుకున్నారా? ఈ కథలో ఉన్న రహస్యం నాకు అనుకోకుండా ఇప్పుడు దొరికింది: ఈ కథ పూర్తిగా నా కథతో సమానంగా ఉంది. భగవంతుడు వాయించే మురళి ఒక భౌతికమైన వాయిద్యం కాదు. అది జ్ఞాన మురళి. అది వింటూ

ఉంటే నేను పరమానందానికి లోనయ్యాను, కానీ నా బంధువులు నన్ను వెళ్ళనివ్వకుండా ఆపుతున్నారు. ఈ జ్ఞాన మురళినాదాన్ని వారు వినలేకపోతున్నారు.

"నన్ను నేను జ్ఞాన గోపికగా చూసుకున్నాను. ఆ శాస్త్రంలో ఉన్న ఆధ్యాత్మిక రహస్యమంతా నా కళ్ళముందు కనిపించింది. శివబాబా అవతరించారు. సత్య సాగరుడు, పవిత్రత సాగరుడైన ఆ పరమాత్మపై ప్రేమను పెంచుకున్న వారి ప్రేమగాథలు ఆ శాస్త్రాలలో వ్రాసి ఉన్నాయి. ఇటువంటి అవగాహన కలిగిన తర్వాత ఎన్ని కష్టాలకైనా ఓర్చుకుని చిరునవ్వుతో ఉండగలిగే శక్తి నాకు వచ్చింది."

కానీ ఆ కన్య ఇంట్లో పరిస్థితులు చక్కబడలేదు. తన తల్లిగారు ఆమెకు వివాహము చెయ్యాలని నిశ్చయించుకున్నారు. కానీ ఈ కన్య ససేమిరా అన్నది. "వివాహములో కామ వికారము ఉంటే అది పతనానికి దారి తీస్తుంది. అటువంటి వివాహము నిరర్థకము" అని ఆ సోదరి వివరించింది. "నా దృష్టిలో నా వివాహము భగవంతుడితో ఏ రోజో జరిగిపోయింది. ఇక మానవమాత్రులకు నా మనసులో స్థానమెక్కడుంది?"

ఇది విన్న ఆమె బంధువులు కోపావేశాలలోకి వచ్చారు. ఆ కన్యను ఎంత అమానుషంగా కొట్టారంటే తను స్పృహ కోల్పోయినంత పనైంది. ఆమె ఒళ్ళంతా వాతలు తేలాయి. ఆ తర్వాత ఆమెను చీకటి కొట్టులో పడేసి ఇనుప గొలుసులతో కట్టేసారు. చివరిగా, ఆమె చేతులను రోకలితో కొట్టి గది తలుపులు మూసివేసారు.

ఆ సోదరి ఇలా చెప్తున్నారు: "కానీ ఆ చీకటి గది నాకు ప్రకాశవంతంగా అనిపించింది. రెండు మూడు రోజులు గడిచాక నాకు చాలా ఆకలిగా అనిపించింది. కానీ భగవంతునిపై నా విశ్వాసము, తపన ఎంతగా పెరిగాయంటే ఈ భౌతిక ప్రపంచ ప్రభావం నాపై పడలేదు. భగవంతుడితో నా మనసులో ఈ విధంగా మాట్లాడుకున్నాను, 'భగవంతుడా! నిన్ను కన్నయ్యాలాల్ అని అంటారు కదా, కన్యలైన మా పై జరిగే ఈ అత్యాచారాల నుండి మమ్మల్ని రక్షించడానికి నువ్వెందుకు ఆలస్యం చేస్తున్నావు? ఓ భగవంతుడా! వీరి మధ్య నువ్వు నా గౌరవాన్ని నిలుపు. ఈ బంధనాల నుండి నన్ను విముక్తురాలిని చెయ్యి."

"ఈ చీకటి గదిలో నాకు అద్భుతమైన అనుభవం కలిగింది. నేను ఈ శరీరానికి దూరంగా ఉన్నట్లుగా అనిపించింది. నెమ్మదిగా నేను చీకటిగదినుండి మరో ప్రపంచానికి వెళ్ళాను. నా ముందు శ్రీకృష్ణుడు నిల్చుని ఉన్నాడు. అతడు తన మురళిని వాయిస్తూ ఉన్నాడు. ఆ మురళి నాదం చెవులుకు ఇంపుగా ఉంది. అతడు ఎంతో హుందాగా నడుచుకుంటూ నా వద్దకు వస్తున్నాడు. ఇంతటి ఆత్మ సౌందర్యాన్ని కలిగినవారిని నేనింతవరకూ చూడనేలేదు. నేను చాలా అమితానందాన్ని పొందాను. అప్పుడు శ్రీకృష్ణుడు ఎంతో సుమధుర కంఠంతో ఇలా అన్నాడు, "అతి త్వరలో నీ బంధనాలు తెగిపోతాయి. ఇప్పుడు నిర్భయంగా ఉండు."

"ఈ అనుభవం జరిగిన వెనువెంటనే నాలోని ఆకలిదప్పికలు మాయమయ్యాయి. ఇప్పుడు నా శరీరం అస్సలు బలహీనంగా లేదు. నాలో శక్తి నిండినట్లుగా అనిపించింది."

తర్వాత కొద్ది సేపటికి ఆ కన్య యొక్క బంధువులు చీకటి గది తలుపులు తెరిచారు. ఆ గదిలో కన్యను మూడు రోజులుగా బంధించి ఉన్నారు. శారీరికంగా బలహీనంగా ఉన్న ఈ అమ్మాయి ఇక ఇప్పుడు తమ మాట కాదనదు, వివాహానికి అంగీకరిస్తుందని ఇంట్లోనివారు భావించారు. చేతిలో టార్చిలైట్లతో వారు చీకటి గదిలోకి దిగారు.

మా తండ్రిగారు ఇలా అడిగారు, "ఇప్పుడు ఏమి నిర్ణయించుకున్నావో చెప్పు! వివాహము చేసుకోవడానికి అంగీకరిస్తావు కదా?" నేను అడ్డంగా తల ఊపాను. "ఇక నీ మొండి పట్టుదల వదిలిపెట్టు. ఇకనుండి ఓం మండలికి వెళ్ళను, వివాహము చేసుకుంటాను అని ఒప్పుకో" అన్నారు.

"నేనన్నాను, "మీరేమంటున్నారు? మీరింకా నన్ను గుర్తించలేదా? నన్ను అర్థం చేసుకోలేదా? మీరు భయపెడితే నాలో ఉన్న భగవంతుని ప్రేమ తగ్గేది కాదు. నిజమైన ప్రేమను మీరు అణచలేరు. మీరు నా ప్రాణాలు తీసినా నేను

బాధపడను. నాకు స్వర్గ ప్రవేశం లభిస్తుంది. అలాంటప్పుడు నేనెందుకు భయపడాలి, బాధపడాలి? నేను శివబాబా స్మృతిలో నిమగ్నమై ఉన్నాను. కనుక, కావాలంటే నన్ను చంపేయండి, కానీ నాకు ఒక సహాయం చెయ్యండి. నా శవాన్ని మాత్రం ఓం మండలి ద్వారం దగ్గర ఉంచండి."

ఇంట్లోనివారు ఆమెను ఆశ్చర్యంగా చూసారు. వారికేమి చెయ్యాలో అర్థం కాలేదు. వారు గది బయటకు వెళ్ళి కొద్దిసేపు మాట్లాడుకున్నారు. చివరకు, అసహనంగా, ఆవేశంగా తిరిగి వచ్చారు, "నీ మనసు ఇంకా మారలేదా? మేము చెప్పిన వాటికి నువ్వు నిజంగానే అంగీకరించడం లేదా?"

ఆ సోదరి వారికి ఈ విధంగా జవాబు చెప్పారు, "మీ మాట వినడానికి నేను పిరికిదాన్ని కాదు. నేను సహనం వహించగలను, మీరు పెట్టే బాధలను తట్టుకోగలిగే శక్తి నాలో ఉంది ఎందుకంటే నేనిక్కడ ఒంటరిగా లేను. భగవంతుడు నాతో ఉన్నారు. వారు నన్ను చాలా దృఢంగా చేసారు. కానీ మీరు మాత్రం ఒక్క విషయం గుర్తుంచుకోండి! మీ ఈ ప్రవర్తనకు మీరు ఫలితం అనుభవించవలసి ఉంటుంది. నన్ను రక్షించడానికి సర్వశక్తిమంతుడైన పరమాత్మ ఉన్నారు. మీరు మాత్రం ఆ పరమాత్మను యథార్థంగా గుర్తించకుండా మీ పాప భారాన్ని మరింత పెంచుకుంటున్నారు. అందుకు నాకు మిమ్మల్ని చూస్తుంటే చాలా జాలి కలుగుతుంది."

వారు ఆమె సంకెళ్ళు విప్పి పైకి తీసుకువచ్చారు. ఆమె స్నానం చేస్తున్నప్పుడు కూడా ఇంట్లోనివారి మంతనాలు జరుగుతూనే ఉన్నాయి. యాంటీ ఓం మండలి పార్టీ నుండి కొంతమంది వీరింటికి వచ్చారు. కూతురి మాట వినవద్దు అని వారు తండ్రిగారికి నూరిపోసారు. వారు అతడి అహంకారాన్ని మరింత బలపరిచే విధంగా మాట్లాడారు. 'అందరూ నిన్ను చూసి నవ్వాలనుకుంటున్నావా? ఇతడు తన కూతురును తన అదుపులో పెట్టుకోలేకపోయాడని అందరూ నిన్ను అనే అవకాశాన్ని ఇస్తావా? నీ కూతుర్ని సత్సంగానికి వెళ్ళకుండా ఆపలేకపోతే అది మనందరి ఓటమి. అంతేకాక, బ్రహ్మాబాబా యొక్క 'మాయా శక్తి' పెరిగిపోతుంది.' ఈ విధంగా వీరంతా మాట్లాడేసరికి తండ్రిగారి పంతం మరింత బలపడింది. కూతురి భావాలు పట్టించుకోవాలి అన్న తన మనసులో మొలిచిన ఆలోచనలను అణగద్రొక్కేసాడు. తను చాలా గొప్ప పని చేస్తున్నానని అనుకుంటూ తనను తాను ఆ తండ్రి మధ్య పెట్టుకున్నాడు.

చివరకు, ఆ తండ్రిగారు మళ్ళీ వెళ్ళి వివాహము చేసుకుంటావా లేదా అని గదమాయించాడు. కూతురు ఒప్పుకోకపోతే కొట్టడానికి కూడా సిద్ధపడ్డాడు.

"సరే, నేను వివాహానికి ఒప్పుకుంటాను", అంటూ ఆ సోదరి ఈ విధంగా జవాబిచ్చింది, "కానీ ఎవరైతే ఆత్మ స్వధర్మంలో స్థితి అయి ఉంటాడో అటువంటి వాడినే నాకు భర్తగా తీసుకురండి. అతడు మాంసం తినకూడదు, మద్యం సేవించకూడదు, చెడు సావాసాలు ఉండకూడదు. అతడిలో కామపూరిత ఆలోచనలు ఉండకూడదు. సీతమ్మకు దొరికిన భర్త ఎలా ఉన్నాడో నాకూ అటువంటి భర్తను తీసుకురండి. రాముడువంటి భర్తను తీసుకురండి, అప్పుడు నేను సంతోషంగా అతడ్ని వివాహము చేసుకుంటాను."

తండ్రిగారికి ఏమి చెయ్యాలో పాలుపోలేదు. "నేను చెప్పినవాడినే నువ్వు పెళ్ళి చేసుకోవాలి" అని అరిచాడు. కూతురు ఒప్పుకోకపోయేసరికి ఆమెను పిడికిలితో కొట్టి నేలమీద పడేసాడు. తన కొడుకులను పిలిచి ఆమెను మళ్ళీ బంధించి చీకటి గదిలో బంధించమన్నాడు.

భారతదేశ నారీమణుల గురించి చాలా చక్కని పద్యం ఉంది. కూతురిని మళ్ళీ చీకటి గదిలోకి ఈడ్చుకువెళ్తూ ఉంటే, ఆ సోదరి మనసు ఈ విధంగా, ఆ పద్యంలోని చరణాలను స్మరించుకుంది:

నిజంగా, భారత నారీమణులు మహనీయులు
ప్రతి కష్టాన్ని భరిస్తూ కూడా ఒక్క మాటను కూడా మాట్లాడదు
అన్ని భారములను మోస్తుంది
భూమాతవలె అన్నీ సహిస్తుంది
గంగవలె నిర్మల మనసు కలవారు
యమునవలె దృఢమైన శరీరం కలవారు
అంతేకాదు, ఇతరుల పొరపాట్లను తన మీద వేసుకోగల గొప్ప మనసు కలది స్త్రీ
తనవారి కష్టాలను తీర్చగల మాతృమూర్తి స్త్రీ
నిజంగా, భారత నారీమణులు
త్యాగానికి మారుపేరు
స్త్రీమూర్తి త్యాగం ముందు ప్రపంచమంతా ఓటమిని ఒప్పుకోవలసిందే.

ఈసారి ఆ సోదరిని రెండు నెలల వరకు చీకటి గదిలోనే ఖైదు చేసారు. తను బ్రతకడానికి కావలసినంత భోజనమును మాత్రమే అందించేవారు. అంతేకాక ప్రతిరోజూ చిత్రహింసలు పెట్టేవారు. ఒకరోజు, ఇంగ్లండులో చదువుకుంటున్న ఆమె పెద్దక్కయ్య చాలా సంవత్సరాల తర్వాత ఇంటికి వచ్చింది. అప్పుడు తన సోదరికి పట్టిన గతి చూసి బాధపడి వెంటనే ఆమెను విడిపించింది. కానీ తర్వాత కూడా ఆ కుటుంబంవారు ఆ సోదరితో అమానుషంగానే ప్రవర్తించేవారు.

భారతదేశంలోని మరో పండుగ వెనుక ఉన్న రహస్యాన్ని ఈ కన్య చాలా చక్కగా అర్థం చేసుకుంది. భక్తులు దేవీదేవతల విగ్రహాలను తయారుచేసి, వాటికి పూజ చేసి, కొన్ని రోజుల తర్వాత ఆ విగ్రహాలను నిమజ్జనం చేసేస్తారు. అంటే, ప్రజలు పవిత్రతకు నమస్కరించినాకానీ అది ఎక్కువకాలం వారి ముందుంటే తట్టుకోలేరు. ఎందుకంటే, ఆ విగ్రహము ఒక అద్దంలా వారి దుర్దశను నిరంతరం చూపిస్తూ ఉంటుంది కదా. పవిత్ర దేవతలను పూజిస్తూ ఉంటారు కానీ మేము స్వయంగా వారివలె అవ్వడానికి పురుషార్థం చేస్తామంటే మాపై అత్యాచారాలు చేస్తున్నారు.

ఇటువంటి ఘటనలు చరిత్రలో చాలా జరిగాయి. సన్యాస ధర్మాన్ని స్థాపించిన శంకరాచార్యులు వివాహము వద్దు అని ఒప్పించడానికి ఎంతో పోరాడాల్సి వచ్చింది. తన తల్లిగారిని గందరగోళపరచి ఆ సమయంలో తన పవిత్ర జీవితం కోసం తల్లిగారి నుండి అనుమతి తీసుకున్నారు. ఒకసారి శంకరాచార్యులు తమ చిన్నతనంలో నీటిలో ఈదుతూ ఉన్నప్పుడు వారి తల్లిగారు ఒడ్డు దగ్గర కూర్చుని ఉన్నారు. నదిలోని మొసలి తన కాలిని పట్టుకుందని తన తల్లిగారిని నమ్మించారు. భగవంతుడా, నా కొడుకును రక్షించు అని తల్లిగారు భగవంతునితో మొరపెట్టుకుంటున్న సమయంలో శంకరాచార్యులు ఈ విధంగా అన్నారు, “నాకు భగవంతుడి మాటలు వినిపిస్తున్నాయి. మీరు నన్ను పవిత్ర జీవితాన్ని గడపడానికి అంగీకరిస్తేనే భగవంతుడు నన్ను రక్షిస్తానంటున్నారు. త్వరగా చెప్పు!” వెంటనే ఆ తల్లిగారు ఇందుకు ఒప్పుకున్నారు. అప్పటినుండి శంకరాచార్యులు బంధనం నుండి విముక్తి పొందారు.

ఇటువంటి ఒత్తిడే గౌతమ బుద్ధుడు కూడా ఎదుర్కోవలసి వచ్చింది. అతడు రాజమహలులోనే ఉండాలని, రాజ భోగాలను విడిచిపెట్టకూడదని అతని తండ్రి ఎంతో ప్రయత్నించాడు. కానీ ఆ తండ్రిగారు బుద్ధుని ఆధ్యాత్మిక దిశను మరల్చలేకపోయాడు. ఒకరోజు, గౌతముడు ఎవ్వరికీ చెప్పకుండా ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. మళ్ళీ తిరిగి రాలేదు.

అలాగే, ఇక్కడ కూడా జరుగుతుంది. ఈ కూతురు ఎక్కువ కాలం ఇంట్లో ఉండలేకపోయింది. చేతిలో ఏమీ తీసుకోకుండా, ఒక్క సూట్‌కేసు కూడా లేకుండా కట్టుబట్టలతో బ్రహ్మాబాబా వద్దకు వచ్చేసింది. ఇంట్లో చెప్పకుండా

రావడాన్ని బ్రహ్మాబాబా ప్రోత్సహించకపోయినా అటువంటి పరిస్థితులలో వారు ఆమెను తిరిగి పంపలేరు కదా! వారు ఆమెకు నీడను కల్పించి ఒక రాణిలాగా ఆహ్వానించారు.

ఇదే విధంగా మరికొంత మంది మహిళలు కూడా వచ్చేసారు. ఎంతోమంది భర్తలు తమ భార్యలను ఇళ్ళనుండి వెళ్ళగొట్టారు. ఇటువంటి వారందరినీ బ్రహ్మాబాబా అక్కున చేర్చుకుని వారికి రక్షణ కల్పిస్తూ మనశ్శాంతిని కలిగించారు. భగవంతుని పరివారంలోకి వచ్చాము అన్న సంతృప్తి ఆ మహిళలలో సంపూర్ణంగా కనిపించింది.

ఒక పాత సామెత ఉంది కదా, 'ఎవ్వరూ లేని వారికి దేవుడే దిక్కు' అన్నట్లుగా శివబాబా ఈ సత్యాన్ని ప్రత్యక్షంగా చేసి చూపిస్తున్నారు.

ఈ మహిళలు బ్రహ్మాబాబా పాలనలో వికసించసాగారు. వారు భగవంతుని జ్ఞానాన్ని బోధించే శిక్షకులుగా, నిజమైన విశ్వ సేవాధారులుగా మారిపోయారు; ఆ పవిత్రమైన, ప్రేమపూర్వక వాతావరణంలో పునీతులయ్యారు.

# అగ్ని - లక్క భవన దహనము

కాలము చక్ర సమానమైనది, సినిమా రీలువలె తిరుగుతూ ఉంటుంది. ఈ సృష్టి అనే సినిమా 5,000 సంవత్సరాలది. ఆత్మలమైన మనము ఈ సృష్టి నాటకంలో పాత్రధారులము కూడా, ప్రేక్షకులము కూడా. సృష్టి అనే ఈ సినిమాలో ముఖ్యంగా నాలుగు భాగాలుంటాయి. ఈ కథ అత్యంత సంతోషమునుండి అత్యంత బాధ వైపుకు కదులుతుంది. ఈ ప్రపంచం ఒక అద్భుత ప్రపంచంలా మొదలవుతుంది, మన ప్రతి కల నెరవేరినట్లుగా అక్కడ ఉంటుంది. బంగారం, వజ్రాలు పొదిగిన మహళ్ళు, పూదోటలు, ఆటలు-పాటలు, సంతోషాలతో కూడిన ప్రపంచము. పవిత్ర మానవులు నివసించే ప్రపంచము. వికారము, అవగుణమును ఎరుగని వారు. నిజంగా, అది బంగారు ప్రపంచము.

అక్కడ జనాభా చాలా కొద్దిగా ఉంటుంది, పది లక్షలకంటే కూడా తక్కువగా ఉంటుంది. ఆ సమయంలో మనమే దానిని పరిపాలించే రాజులము. మనము తప్ప మరెవ్వరూ ఉండరు. మన వయస్సు పెరుగుతున్నాకానీ రోగం, దుఃఖం అంటే ఏమిటో తెలియకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారు. వంద లేక నూట యాభై సంవత్సరాల పరిపూర్ణ వయస్సులో శరీరాన్ని వదిలే సమయంలో మనకు రాబోయే భవిష్య జన్మ మన కళ్ళముందు కనిపించి ఆ క్రొత్త జన్మలో ఉన్న సంతోషాన్ని అనుభవిస్తూ క్రొత్త సాహసం చెయ్యడానికి ఉరకలేస్తూ ఈ శరీరాన్ని ఎంతో సంతోషంగా, ప్రశాంతంగా విడిచిపెడ్తాము.

క్రమక్రమముగా, కాలచక్రము తిరుగుతూ ఉంది. జనాభా పెరగసాగింది. సూర్యవంశీయుల తర్వాత చంద్రవంశీయుల రాజ్యం ప్రారంభమయింది. లక్షీనారాయణుల తర్వాత సీతారాములు సింహాసనాన్ని అధిష్ఠిస్తారు. 8 తరాలు, 1250 సంవత్సరాలు గడిచిన తర్వాత బంగారు యుగము ప్రశాంతంగా ముగిసి చంద్రవంశస్థులతో కూడిన వెండి యుగం ప్రారంభమవుతుంది.

ఈ సమయంలోని రాజ్యం ఎంతో విస్తరించి ఉన్నాకానీ అంతా ఐక్యతతో ఉండేవారు. అందులో ఎన్నో చిన్న చిన్న రాజ్యాలున్నప్పటికీ చిన్న రాజులు మహారాజుకు వారి పూర్తి సహకారాన్ని అందించేవారు. వెండి యుగంలో కూడా సంతోషం మెండుగా ఉండేది. గొడవలు లేవు, రోగాలు లేవు, దురదృష్టము లేదు. అయితే కాలచక్ర గమనంలో పవిత్రతా శాతంలో కొంత తేడా కనిపించింది. ఈ విధంగా 12 తరాలు గడిచి, మరో 1250 సంవత్సరాలు గడిచాయి.

అప్పుడు జరగరానిది జరిగింది. ఆత్మలమైన మనము మనలోని దివ్యతను, పవిత్రతను కోల్పోయాము. మనలో భౌతిక ఆకర్షణ మొదలయింది. మనం ఆత్మలమన్న విషయాన్ని మర్చిపోయి వికారాలలో మునిగిపోయాము.

ఒకప్పుడు దేవతలుగా ఉన్న మనము పతన దశ వైపుకు మరలుతుంటే ఆ ప్రభావము ఈ భూమిపై తీవ్రంగా పడింది. భూకంపాలు, వరదలు రాజ్యాలను నాశనం చేసాయి. ప్రజలందరూ చెల్లాచెదరుగా అయిపోయారు. తిరిగి కోలుకుని మళ్ళీ ఇళ్ళను నిర్మించుకోవడానికి ఎంతో సమయం పట్టింది. అయినాగానీ తిరిగి ఆ బంగారు ప్రపంచాన్ని తీసుకురాలేకపోయారు ఎందుకంటే ఆత్మలోని జ్ఞానము, కళలు, పవిత్రత అన్నీ లోపించాయి.

ఆ క్రమములో, గత జన్మలలో జరిగిన విషయాలను మర్చిపోయిన మనము తపస్సు చేసి అసలు ఎక్కడ తప్పు జరిగింది, దానిని ఎలా సరిదిద్దుకోవాలో తెలుసుకునే ప్రయత్నం చేసాము. ఆ తపస్సులో, అంతరాత్మలో నిక్షిప్తమైన ఉన్న స్మృతుల కారణంగా దైవీ ప్రపంచానికి సృష్టికర్త భగవంతుడనీ, అతడు నిరాకార శివ పరమాత్మ అని తెలుసుకున్నాము. కనుక, వారికి మందిరాలు కట్టి తిరిగి మన స్వర్గాన్ని స్థాపించమని వారిని ఈ భువిపైకి ఆహ్వానించాము.

కానీ అశరీరి అయిన పరమాత్మను పూజించడం చాలా కష్టం. అందుకే నిరాకారుని మందిరాలతోపాటు లక్ష్మీనారాయణులు, తర్వాత సీతారాముల మందిరాలను కూడా నిర్మించాము. అటు తర్వాత ఎంతోమంది దేవతల మందిరాలనూ నిర్మించాము. సమయం గడుస్తున్నకొలది భక్తి విస్తారం పెరిగిపోయింది. ఇది రాగియుగము. ఇప్పటికీ,

ఇంతటి పతనము జరిగినప్పటికీ భారతదేశము ఎంతో సంపన్న దేశముగా తులతూగుతూ ఉంది. కానీ ఒకప్పుడు బంగారుయుగంలో ఉన్నదానితో పోలిస్తే ఇప్పుడు ఏమీ లేనట్లే అని చెప్పవచ్చు. ఒకప్రక్క ఆచారాలు ఎక్కువయ్యాయి, మరోప్రక్క విదేశీ దండయాత్రలు మొదలయ్యాయి. సన్యాస ధర్మం సాంప్రదాయాలను, పవిత్రత విలువలను కాపాడుతూ వచ్చింది. పురాణాలు, శాస్త్రాలు మనిషి వ్యవహారము, ఆహారమును సాత్వికంగా ఉంచుతూ ధ్యానమును నేర్పిస్తూ వచ్చాయి. కానీ భగవంతుని యాథార్థ జ్ఞానం లోపించిన కారణంగా పతనము జరుగుతూనే వచ్చింది.

ఇప్పుడు ఇతరమైనవి చిగురించి ప్రపంచ నాటక రంగంలో ముఖ్య పాత్రను పోషించే సమయమిది. రాగి యుగం చివరిలో జరిగిన వినాశనములో భూమి ఖండాలుగా విడిపోయి అనేక తెగలు వృద్ధి చెందాయి. ప్రతి జాతివారికి ఈ సృష్టి నాటక పహేళి గురించి కొంతమాత్రమే తెలుసు. సముద్ర గర్భంనుండి ఉత్తర అమెరికా పుట్టుకొచ్చింది.

మొట్టమొదటి దూత అబ్రహమ్, ఈ సమయంలోనే వచ్చారు. భారతవాసులు దేవతలను, విగ్రహారాధనను చేయడం చూసి అది తప్పు అని భావించాడు. ఎందుకంటే ఒక్క భగవంతుడు మాత్రమే పూజింపబడాలి, మరెవ్వరూ కాదు అన్నది వారి అభిప్రాయము. అందుకే, తనకంటూ అనుకూలమైన స్థానముండాలని అబ్రహమ్ ఉత్తర దిశగా ప్రయాణించాడు. అక్కడినుండి యూదియా మరియు ఇస్లాం ధర్మాలు వెలువడ్డాయి. మక్కాలో అబ్రహమ్ నిరాకారుడైన శివుని మందిరం నిర్మించగా పిమ్మట అక్కడ మహమ్మద్ పూజలు జరిపాడు. కెనాన్ దేశముపై ఆధిపత్యాన్ని పొందాక అది యూదుల దేశమయింది. వారు దేవతలను 'ఎలోహిమ్' అని సంబోధించేవారు; కానీ ఇప్పుడు ఆ పదము యొక్క బహువచనములోని అర్థము కేవలం ఒక్క భగవంతుడినే సంబోధిస్తుంది.

ఈజిప్టుల సంస్కృతి కూడా ప్రాచీన దేవతల వంశాన్ని స్ఫురిస్తుంది. నిజానికి, వారు కూడా తమను తాము సూర్య వంశీయులమని చెప్పుకుంటారు. రాతితో తయారుచేయబడ్డ వారి పిరమిడ్లు జ్యోతి స్వరూపుడు తన శక్తిని క్రిందకు ప్రవర్తిస్తున్నాడు అనే దానికి సంకేతంగా నిలుస్తాయి.

గ్రీకు రాష్ట్రాలు కూడా నెమ్మదిగా మొదలయ్యాయి. వాస్తవ తత్వాన్ని అక్కడి గొప్ప గొప్ప తత్త్వవేతలు చర్చించుకోసాగారు. అవును, ఈ భూమిపై ఒకప్పుడు దేవతల రాజ్యం ఉండేది. ఇది వారికి అర్థమయింది. గ్రీకులు ఆ దేవతలను కూడా పూజించడం ప్రారంభించారు. ఈ దేవతల గురించి వారెన్నో కథలు అల్లుకున్నారు, వారిని ఒలంపస్ దేవతలు అని పిలుచుకోసాగారు. ఆత్మ, సృష్టి మరియు పరమాత్మ గురించి గ్రీకు తత్వజ్ఞులు ఎన్నో సిద్ధాంతాలను కనుగొన్నారు. కొన్ని యథార్థానికి దగ్గరగా ఉంటే మరికొన్నింటిలో వాస్తవాల జాడయే లేదు. ఇప్పటికీ పవిత్రతకు గొప్ప గుర్తింపే ఉంది. కేవలం అతి కొద్ది మంది, తెలివైనవారు మాత్రమే పవిత్ర స్థితిలో ఉండగలరు అన్న నిర్ధారణ ప్లాటో సమయానికే జరిగింది.

కానీ ఆత్మ శక్తి తగ్గుతూనే వచ్చింది. గ్రీకులు పతనమై వారి స్థానాన్ని రోమన్లు ఆక్రమించారు. హిబ్రూలు ఎంతోమంది దూతలను తయారుచేసి అల్పకాలమైనాగానీ ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన రాజ్యాన్ని స్థాపించారు. కానీ పతనము జరుగుతూనే ఉన్న కారణంగా యుద్ధాలు జరిగాయి. వారి ధర్మము న్యాయశాస్త్రముగా మారింది.

మరో దూత, క్రీస్తు దిగి వచ్చారు. వారు తమ ఆధ్యాత్మిక ప్రవచనాలతో ఎంతోమందిలో నూతన ఉత్సాహాన్ని నింపారు. కాల క్రమములో, పతనమవుతున్న రోమన్ రాజ్యాన్ని ఈ ధర్మము కాపాడి, చివరకు యూరప్ ఆధిపత్యానికి కారణమయింది. భారతవాసులు ఎలా అయితే దేవతలనే నిరాకార పరమాత్మగా పొరబడ్డారో అలాగే ఈ ధర్మంవారు కూడా ఒక దేహధారిని భగవంతుడిగా పొరబడ్డారు. కానీ క్రైస్తవులు చెప్పిన వినాశనము మరియు స్వర్గ స్థాపన విషయాలు మాత్రం యాథార్థంగా ఉన్నాయి. క్రీస్తు తిరిగి వస్తాడని క్రైస్తవులు ఎంతో నమ్మకంతో ఎదురుచూస్తూ ఉన్నారు. కానీ 'భగవంతుని కుమారుడు' అయిన క్రీస్తు పాత్ర అయిపోయిందని, ఇప్పుడు స్వయంగా భగవంతుని పాత్రయే ప్రారంభమయిందని వారు అర్థం చేసుకోవడం లేదు.

సమయము గడుస్తున్న కొద్దీ ప్రపంచంలోని అందరి దూతలు వచ్చేసారు. జనాభా అనూహ్యంగా పెరిగింది. మతం ముసుగులో ప్రజలను తమ ఆధిపత్యానికి అణిగి మణిగి ఉండమన్నారు. దేశాలనే కొల్లగొట్టి అక్కడివారిని బలవంతంగా మత మార్పిడి చేసారు.

ఈ విధంగా ఇనుపయుగం ప్రారంభమయింది. కొన్ని మంచి సంఘటనలూ జరిగాయి. ఇంగ్లాండు యొక్క సాంస్కృతిక పునరుజ్జీవము, కళ మరియు విజ్ఞానము ఊపందుకోవడము, ప్రపంచ విస్తరణవంటివి జరిగాయి. కానీ లాభాపేక్ష, లోభముతో వృద్ధి జరిగిన కారణంగా అహంకారము, కోపము కూడా మానవుడిలో పెరిగాయి. పరాజయం పొందిన వారి పట్ల అమానుషంగా ప్రవర్తించారు.

విజ్ఞానము తన విజయ కేతనాన్ని ఎగురవేసింది. కానీ అందులో ఆత్మజ్ఞానం పూర్తిగా లోపించింది. భౌతిక ప్రపంచ జ్ఞానము మాత్రం శిఖరాగ్ర స్థితికి చేరుకుంది. మందుగుండు సామాన్లు, ఆయుధాలు ఆధునీకరించబడ్డాయి. పారిశ్రామీకరణ తర్వాత నగరీకరణ జరిగింది; ప్రజలపై ప్రజల రాజ్యం పోయింది, ప్రజాస్వామ్య రాజ్యం పోయి దుర్మార్గము రాజ్యమేలింది.

భారతదేశంపై మొదటగా ముస్లింలు దాడి చేసారు, తర్వాత బ్రిటీషర్లు దాడి చేసారు. ఆఖరకు ఈ ప్రాచీన దేశం మేల్కొంది. మహాత్మ గాంధీజీ భారతీయులను స్వతంత్ర్య పోరాటం వైపుకు మార్గదర్శన చేసారు కానీ వికారాలనుండి స్వతంత్ర్యం ఇంకా రాలేదు. ఆ కార్యం కోసం భగవంతుని ప్రమేయం తప్పనిసరి.

సమయం గడుస్తున్నకొద్దీ యుద్ధాలు పెరిగిపోయాయి, వాటి తీవ్రత కూడా పెరిగిపోయింది. అదే సమయంలో మేము పురోగమిస్తున్నాము అని ప్రజలు బాహాటంగా చెప్పుకున్నారు. వాస్తవమేమిటంటే, షుమారు 2500 సంవత్సరాలనుండి ప్రపంచం పతనం వైపుకే ప్రయాణిస్తుంది. ఎంతగా అంటే ప్రపంచానికి ఇక నిప్పంటుకునేదుంది.

అణ్వాయుధాలు తయారయ్యాయి. ప్రపంచ దేశాలు విధ్వంసకరమైనటువంటి ఆయుధాలను పెట్టుకోసాగారు. చెడు తన అంతిమ దశకు చేరుకుంటుంది. ఇక్కడ మరో వైపు భగవంతుని శక్తి గుప్తంగా తన కార్యం చేసుకుపోతుంది. ఇటువంటి ఘోరమైన పరిస్థితులలో భగవంతుడు గుప్తంగా అవతరించి అందరికీ పవిత్ర బోధనలు చేస్తున్నారని ఎవరైనా ఊహించగలరా? ఆ శిక్షణలు ప్రపంచాన్నే మార్చగల శక్తి కలవి అని ఎవరైనా ఊహించారా? కానీ ఇది నిజం.

**అగ్ని! లక్క భవన దహనము**

ప్రపంచానికి నిప్పంటించే పనిలో ఉన్న ప్రజలు పనిలో పనిగా సింధ్ హైదరాబాద్‌లో భగవంతుని ఇంటికి కూడా నిప్పంటించారు. వారు ఎన్ని ప్రయత్నాలు చేసినాకానీ సత్సంగానికి వెళ్ళే వారిని ఆపలేక పోయేసరికి హింసాత్మక చర్యలు కూడా మొదలుపెట్టారు. వారు ఇంటికి నిప్పంటించారు.

హాస్యాస్పదమైన విషయమేమిటంటే, నిజమైన సుఖసంతోషాలను తీసుకురాగలిగిన ఏకైక సంస్థకు చెందిన భగవంతుని ఇంటిని యాంటీ ఓం మండలి పార్టీవారు తగులబెట్టారు. ఈ యుద్ధభూమిలో భగవంతుడు శాంతి మార్గాన్ని ఉపదేశిస్తున్నారు. కానీ అందులోని అంతరార్థాన్ని అర్థం చేసుకోలేని ప్రజలు దానిని తగులబెట్టారు. బ్రహ్మాబాబా ఎక్కడైతే సత్సంగాన్ని జరుపుతున్నారో ఆ సత్సంగ భవనానికి నిప్పంటించాలని వారి ఆలోచన. మహిళలను సత్సంగానికి వెళ్ళనివ్వకుండా ఆపడంలో విఫలమైన కారణంగా చివరకు ఆ ఇంటినే కాలుద్దామనుకున్నారు.

అయినా, వారికి బ్రహ్మాబాబా పట్ల భయం కూడా ఉంది. వారొక ఆధ్యాత్మిక శక్తి అని వారి అంతరాత్మకు తెలుసు. అందుకే బ్రహ్మాబాబా లేని సమయంలో ఈ పని చెయ్యాలనుకున్నారు. చివరకు ఆ రోజు రానే వచ్చింది. యాంటీ ఓం మండలివారు తమ బలగాన్నంతా పిలిపించారు. చాలామంది ఆ సత్సంగ భవనాన్ని చుట్టుముట్టారు. వారు ఆ భవన కిటికీలు, తలుపులు విరగ్గొట్టారు.

క్షణక్షణానికి ఆ గుంపు మరింత హింసాత్మకంగా మారుతూ వచ్చింది. వారు పూర్తిగా అదుపు తప్పారు. మరింతమంది

వీరితో చేతులు కలిపారు. కర్రలు, ఆయుధాలతో ప్రజలు అక్కడకు వచ్చి ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. కానీ శివుని శక్తి పొందిన శక్తి సైన్యము, మాతలు ధైర్యముగా ద్వారాలవద్ద అడ్డంగా నిల్చుని వారినెవరినీ లోపలకు రానివ్వలేదు. ఒక్క మూర్ఖుడు కూడా లోపలకు ప్రవేశించలేకపోయారు. ఈ మహిళల కళ్ళల్లో ఎంతో తేజస్సు కనిపించింది.

లోపలకు ప్రవేశించడం కుదరకపోయేసరికి ఆ భవనానికి నిప్పంటించారు. కిటికీలలోనుండి కాగడాలు లోపలకు విసిరేసారు.

ఆ భవనంలో ఉన్నది తమ కూతుర్లు, భార్యలు, కోడళ్ళు అని, భవనాన్ని దహనం చేస్తే తమ కుటుంబంవారే సజీవంగా దహించుకుపోతారన్న విషయాన్ని కూడా వీరు మర్చిపోయారు. వారి మనసు కోపానికి వశమై ఉంది. ఈ ఘటనకు ప్రేరేపించిన ముఖ్యులు చివరి నిమిషంలో ఈ ఉపద్రవాన్ని ఆపాలని ప్రయత్నంచినా కానీ ఆపలేకపోయారు. ఆ మూక పూర్తిగా మాయావశులై, క్రోధావేశముతో అదుపు తప్పి ఉన్నారు.

అదృష్టవశాత్తూ ఇదంతా గమనించిన ఒక వ్యక్తి పోలీసులకు ఫోన్ చేసాడు. వెంటనే పోలీసులు వచ్చి ఆ మూకను చెల్లాచెదరు చేసారు. అగ్నిమాపక దళంవారు అగ్ని చల్లార్చే ప్రయత్నంలో పడ్డారు. లోకులు చేసిన వేల ప్రయత్నాల వలన భౌతిక నష్టం జరిగినాగానీ ఆధ్యాత్మికపరంగా ఈ సంస్థ మరింత శక్తిని పుంజుకుంది. లాఖా భవనమును అగ్నికి ఆహుతి చేసిన వృత్తాంతము మహాభారతంలో కౌరవుల ద్వారా లక్క భవన దహనము అన్న వృత్తాంతరూపములో వర్ణింపబడింది.

ఈ సంఘటనలన్నింటిలోనూ బ్రహ్మాబాబాలో అణువంతైనా కలవరం కలగలేదు. వారెప్పుడూ ఉపరామ స్థితిలో ఉన్నారు. "మనమంతా భగవంతుని సేవకులము. అన్నిటినీ చక్కబెట్టడానికి ఆ భగవంతుడు ఉన్నాడు. ధర్మ మార్గంలో అనేక పరీక్షలు వస్తాయి కానీ మనం శివబాబా, డ్రామా మరియు ఆత్మజ్ఞానమందు సంపూర్ణ విశ్వాసము పెట్టుకున్నట్లయితే మనం విజయాన్ని సాధించగలుగుతాము. సత్యమైన నావ ఊగిసలాడవచ్చు కానీ ఎప్పటికీ మునగదు."

బ్రహ్మాబాబాలోని ఈ దివ్య జ్ఞానము, స్థితప్రజ్ఞతను చూసి ప్రేరణ పొందిన అనేక సోదరసోదరీలు, యువకులు ఈ ప్రపంచం నుండి ఉపరామంగా అవ్వసాగారు. నిజ జీవితంలో బాబా శిక్షణలకున్న ప్రాముఖ్యతను వారు గుర్తించారు. లోకులు లఖీరాజ్ భవనముపై రాళ్ళు విసిరారు. కిటికీ అద్దాలను పగులగొట్టారు. ద్వారబంధాలను పెకిలించి వేసారు. ఎంతో ఉపద్రవాన్నే సృష్టించారు. కానీ మన సోదరసోదరీలు భయభ్రాంతులు కాలేదు. పైగా ఆ సంఘటన ఫలితంగా వారిలో ఈ ప్రపంచంపై ఉన్న కాస్త మమకారము కూడా నశించింది.

# పాండవులు మరియు కౌరవులు – ఓం నివాస్ బయట పికెటింగ్

సత్సంగ భవనములోని మెడిటేషన్ హాలు పూర్తిగా ధ్వంసమైంది. కనుక, సత్సంగాన్ని కరాచీలోని 'ఓం నివాస్' అనే భవనానికి మార్చడం జరిగింది. అక్కడ సంస్థ కార్యక్రమాలు మునుపటివలె కొనసాగాయి.

ఓం నివాస్ చాలా పెద్ద భవనము. ఇప్పుడక్కడ కేవలం సత్సంగం మాత్రమే కాక పిల్లల స్కూలు కూడా జరుగుతుంది. అక్కడే ఓం బాబా(బ్రహ్మబాబా) కూడా నివసించేవారు. అందుకే దానికి ఓం నివాస్ అన్న పేరు వచ్చింది. అక్కడి వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంది. ఆధ్యాత్మిక చదువు మరియు జ్ఞాన ధారణ మరింత వేగంగా కొనసాగాయి.

ఒకరోజు ఉదయం 5.30 ని॥లకు ఓం నివాస్‌లో నివసిస్తున్న కన్యలు తమ టీచర్లతో కలిసి బస్సులో షికారుకు బయటకు వచ్చారు. ఇటువంటి చిన్న చిన్న విహార యాత్రలు స్కూలువారికి సాధారణమే. కానీ ఈసారి, ఈ కన్యలంతా బయటకు వచ్చినప్పుడు యాంటీ ఓం మండలి పార్టీవారు భవనాన్ని ముట్టడించారు.

దురుద్దేశముతో లాఖా భవనమును కాగడాలతో ముట్టడించి ధ్వంసం చేసిన ఘటనను హైదరాబాద్ ప్రజలు హర్షించలేదు. అది విఫలమవ్వడంతో అప్పటినుండి ఏ పన్నాగంతో సత్సంగాన్ని దెబ్బ తీయవచ్చని ఆలోచించసాగారు. అప్పుడు వారు మహాత్మగాంధీని అనుసరించాలనుకున్నారు. ఆ సమయంలో ఆంగ్లేయుల పరిపాలన నుండి భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చే ప్రయత్నంలో గాంధీజీ అహింసా మార్గాన్ని ఎంచుకున్నారు. కానీ, ఇక్కడ ఇటువంటి సందర్భంలో ఈ పికెటింగ్ చెయ్యడము, ఒక ఆధ్యాత్మిక సత్సంగానికి విరుద్ధంగా; ఎవ్వరికీ కీడు తలపెట్టని ఉన్నత ఆధ్యాత్మిక శిక్షణలను అందిస్తున్న ఇటువంటి సంస్థ వద్ద పికెటింగ్ చెయ్యడమన్నది ఆశ్చర్యకరమే. ఇటువంటి పని చెయ్యడం ద్వారా వారికి సమాజం నుండి మంచి మద్దతు లభించస్తుందని ఆశించారు.

పికెటింగ్ ప్రభావం ఏమాత్రం తగ్గకూడదని పంచాయతి ముఖ్యులను, ప్రభుత్వ అధికారుల సహకారాన్ని తీసుకున్నారు. ఈ విషయం వార్తాపత్రికల్లో కూడా వచ్చే విధంగా ఏర్పాట్లు చేసారు.

ఈ పికెటింగ్ సంఘటన ఆగస్టు7, 1938న జరిగింది. ఆరోజు ఉదయం 7.00గం॥లకు సోదరసోదరీలు మురళి వినడానికి వచ్చినప్పుడు అక్కడున్న వారంతా అక్కడున్న పెద్ద గుంపును చూసి ఆశ్చర్యపోయారు. ఆందోళనకారులు ఓం నివాస్‌ను నాలుగు వైపులా ఆక్రమించుకుని నాలుగు ముఖద్వారాల వద్ద పదిపదిహేనుమంది వ్యక్తులు అడ్డుగా పడుకున్నారు. ఆ గుంపులో ముందుగా పంచాయతి ముఖ్యులు, యాంటీ పార్టీ ముఖ్యులు ఉన్నారు. ఆ గుంపులో అనేకమంది వ్యాపారస్తులు, కొందరు మహిళలు కూడా ఉన్నారు.

ఉదయం 7.00గం॥లకు సత్సంగానికి వచ్చినవారిలో మహిళలు, పురుషులు ఉన్నారు. వారు శాంతియుతంగా ఒక పంక్తిలో ఆందోళనకారుల ఎదురుగా నిల్చున్నారు. ఆందళనకారులను విరోధంచే ప్రయత్నంకానీ, వారిని రెచ్చగొట్టే ప్రయత్నంగానీ ఏ మాత్రం ఓం మండలివారు చెయ్యలేదు. అహింసను అహింసతోటే జయించాలి.

ఈ మొదటి గ్రూపుతో రెండవ గ్రూపువారు కూడా వచ్చి చేరారు. షికారుకు వెళ్ళిన స్కూలు విద్యార్థులు కూడా ఓం నివాస్ భవనం వద్దకు చేరుకున్నారు. ఉపద్రవకారులను బస్సులోనుండి చూసిన వీరు కూడా ప్రశాంతంగా వచ్చి తమ సోదరసోదరీలతో వరుస కట్టారు. ఆందళనకారులను వీరెంతో ప్రేమపూర్వకంగా చూస్తూ వారికి శాంతి, సామరస్యపు వైబ్రేషన్లను ఇచ్చారు. వారికి కావలసినదల్లా లోపలకు వెళ్ళి జ్ఞానామృతాన్ని సేవించడము మాత్రమే.

ఆందోళనకారులు వారిని లోనికి వెళ్ళనివ్వకుండా ఇంటికి తిరిగి వెళ్ళిపోవలసిందిగా గదమాయించారు. ఇది భగవద్గీతలోని దృశ్యమే: ఒకవైపు కామవికారము కొరకు ఆగ్రహముతో ఉపద్రవాన్ని సృష్టిస్తున్న ఆందోళనకారులు. మరోవైపు ధర్మము, పవిత్రత మరియు గీతాజ్ఞానమును ఆధారంగా చేసుకుని జీవిస్తున్నటువంటి మాతలు మరియు సోదరులు. మరో విధంగా చెప్పాలంటే, ఒకవైపు ధర్మ విముఖులు, అన్యాయకారులు, ఈశ్వర విముఖులు, కౌరవసేన.

మరోవైపు పాండవ సైన్యం, శివశక్తిసేన. భవనము లోపలనుండి ఇరు పక్షాలవారిని గమనిస్తూ ఉన్న అర్జునుడు – వారే బ్రహ్మబాబా. వారిలో పరమపిత అయిన శివబాబా కూడా ఉన్నారు. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఇటువంటి యుద్ధాలు జరుగవలసిందే, చెడు ఓడిపోవలసిందే అని శివబాబా ఆదేశించారు.

యుద్ధము ఏకపక్షముగా కనిపిస్తుంది. కానీ ఓం నివాస్ భవనమునుండి పూర్తి సహకారము లభిస్తుంది. ఓం నివాస్‌లో కూర్చుని ఉన్న కొందరు మహిళలు ఈ విధంగా ఆలపించారు:

*ఓ మానవుడా! నీకున్న సమయంతో నీవేమి చేస్తున్నావు?*
*నువ్వు ఎక్కడకు వెళ్ళాలనుకుంటున్నావు?*
*నువ్వు ఇచటకు ఏ దేశము నుండి వచ్చావు?*
*ఈ భూమిపైకి రాకముందు నువ్వు ఎక్కడ ఉన్నావు?*

*నీ బాల్యము సమాప్తమైంది, యవ్వనము వేగముగా పరుగెట్టింది,*
*వృద్ధాప్యము నిన్ను చరమ దశకు తీసుకువస్తుంది –*
*ఆ తర్వాత ఏమి జరుగుతుందో నీకు తెలుసా?*

*నువ్వు ఎక్కడకు వెళ్తున్నావో నీకు తెలుసా?*
*నువ్వు ఎచటనుండి వచ్చావో నీకు తెలుసా?*
*నువ్వు ప్రస్తుతం ఇక్కడ నిల్చుని ఏమి ఆలోచిస్తున్నావు?*

*సత్యత గురించి అంశమాత్రం కూడా తెలియని నువ్వు*
*ఈశ్వరీయ జ్ఞానాన్ని ఎందుకు విరోధిస్తున్నావు?*
*నీవు ధనము, సంపదలతో గర్విగా ఉన్నావు*
*నిజానికి నీ వద్ద ఈ రెండూ లేవు.*

*నిజమైన మార్గాన్ని ఒక్కరు మాత్రమే చూపించగలరు,*
*కనుక, నీవు చేస్తున్న ప్రతి పని వెనుక ఉన్న అర్థాన్ని గ్రహించుకో*
*నీ సమయాన్ని వ్యర్థం చేసుకోకు*

*ఓ మానవుడా! ఎటువంటి భవిష్యత్తును నువ్వు కోరుకుంటున్నావు?*
*ఎటువంటి సంపాదనను నువ్వు చేసుకుంటున్నావు?*

*ఓ మానవుడా! నీ బుద్ధిని భగవంతునితో జోడించు*
*నీ తండ్రి ఇస్తున్న అపారమైన ఖజానాను పొందు*
*అసత్యమైన మాయలోపడి పరమానందాన్ని పోగొట్టుకోకు*

ఆందోళనకారులు ఈ పాటను విన్నారు కానీ ఏమీ అనలేదు. మహిళలు ఎంత మధురమైన కంఠంతో వారి మనోభావాలను ఈ పాట రూపంలో ఉంచారంటే ఎంతటి కఠిన హృదయాలైనా కరిగిపోవలసిందే. చిన్న చిన్న పిల్లలు యూనిఫారమ్ వేసుకుని యోగ శక్తితో మెరిసిపోతూ అందరూ వరుసకట్టి నిల్చుంటే వారిని ఎవరైనా శత్రువులుగా చూడగలరా? ఈ మహిళల కళ్ళల్లోకి చూసిన ఎవరైనా వారు తీసుకున్న పవిత్రతా ప్రతిజ్ఞ సమంజసం కాదని అనగలరా? ఆందోళన చేస్తున్న వీరికి పవిత్రంగా ఉండటం తప్పుకాదు అని ఎవరు చెప్పాలి?

ఇరు పక్షాలు వారి వారి వాదనలతో నిల్చుని ఉన్నాయి: ఆందోళనకారులు తమ అభ్యంతరాలతో నిల్చుని ఉన్నారు లేక డబ్బు తీసుకుని ఉన్నారు కనుక మరికొంతమంది ఆందళనలో నిల్చుని ఉన్నారు. ఓం మండలిలోని సోదరసోదరీలు భగవంతుని నుండి దూరంగా ఉండలేక నిల్చుని ఉన్నారు.

సమయం గడుస్తూ వచ్చింది. ఈ విషయం పూర్తి పట్టణమంతా పాకింది. ఎంతోమంది ఆసక్తిగా ఏమి జరుగుతుందోనని అక్కడకు చేరుకున్నారు. అందరి మనసులలో ఒకే ప్రశ్న – ఈ యుద్ధంలో ఎవరు గెలుస్తారు?

పట్టణమంతా ఈ పికెటింగ్ విషయం పాకేసరికి, ఏ కన్యలు, మాతలైతే సత్సంగానికి వెళ్తూ ఉండేవారో వారిని ఆ ఇంట్లోనివారు గదిలో బంధించి పది, పన్నెండు తాళాలు గదికి వేసారు. అలా గదిలో 10, 12 తాళాలతో బంధింపబడిన వారిలో కూడా కొంతమంది ఏదో ఒక విధంగా తప్పించుకుని ఓం నివాస్‌కు పరిగెత్తుకుంటూ వచ్చారు. అలా తప్పించుకుని వచ్చినవారిలో ఒక సోదరి పేరు గోపి. వీరు ఒక ప్రసిద్ధ వ్యాపారవేత్త మనువరాలు. ఇప్పుడు ఈ గోపి తన సోదరీల వద్దకు తన వంతు సహాయాన్ని అందించడానికి వెళ్ళారు.

గోపి అక్కడకు చేరుకునేసరికి వారి తాతగారు ఆందోళనకారుల గుంపును ఉద్దేశించి ఉపన్యసిస్తున్నారు. చూడటానికి కఠినంగా అనిపించినాగానీ ఆందోళనకారులు తమ ఇళ్ళలోని మహిళలను బంధించడం ఎంతో సాహస కృత్యమని, ఇదంతా వారి మంచికే మనం చేస్తున్నామని ఆందోళనకారులను ప్రశంసిస్తూ అన్నాడు. నేను కూడా నా ఇంట్లోని నా ఇద్దరు కూతుర్లను, నా మనుమరాలిని నా ఇంట్లోని ఒక గదిలో 13 తాళాలు వేసి బంధించానని గర్వంగా చెప్పుకోసాగాడు. ఆ గదినుండి వారు బయటకు రావడమన్నది అసంభవం అని ప్రగల్భాలు పలికాడు. ఈ ప్రగల్భాల మధ్యన అతని మనుమరాలు ప్రత్యక్షమయింది. గోపి మధురంగా చిరునవ్వు నవ్వింది. గోపిని చూసి ఆ సేఠ్‌కు నోట మాట రాలేదు. ఈ విషయాన్ని అతడు భరించలేకపోయాడు. అక్కడున్న ప్రేక్షకులు గోపిని గుర్తించి ఇతని ప్రగల్భాలకు నవ్వుకున్నారు.

ఎండ తీవ్రత పెరగసాగింది. సమయం గడుస్తున్నకొద్దీ ఆందోళనకారులు అలసిపోయారు. కొంతమంది వెళ్ళి సోడా, టీ తీసుకున్నారు. మరికొంతమంది బీరు తీసుకున్నారు. మధ్యలో ఒక వ్యక్తి ఒక రకమైన పానీయాన్ని ముందు వరుసలో నిల్చుని ఉన్న చిన్న పిల్లలకు ఇవ్వబోయాడు. అక్కడ నిల్చున్న కన్యలలో చాలామంది 12 సంవత్సరాలలోపు వయసుగల చిరు ప్రాయము కలవారే. ఇంతటి తీవ్రమైన ఎండలో అన్ని గంటలనుండి నిల్చుని ఉండటమన్నది ఆ చిన్న శరీరాలకు కష్టమైన విషయమే. కానీ ఆ కన్యలు ఒక అపవిత్ర వ్యక్తి ఇచ్చే పానీయాన్ని నిరాకరించారు. వీరు ఎంతో దృఢంగా మెడిటేషన్‌లో ఉన్నారు. చివరకు, కౌరవుల కఠిన సంస్కారం కరిగింది.

ఈ కన్యలు లోపలకు వెళ్ళవచ్చని ఆందోళనకారులు చెప్పారు. కానీ ఆ చిన్న కన్యలు వారితో ఈవిధంగా చెప్పారు, "ఆందోళనకారులు పూర్తిగా ఆ స్థానాన్ని ఖాళీ చేసేదాకా మేము లోపలకు వెళ్ళము, మిగిలిన సోదరసోదరీలు కూడా లోపలకు వస్తేనే మేమూ వెళ్తాము లేకపోతే మేము కూడా ఈ ఎండలో, ఆకలిదప్పికలతో నిల్చుని ఉంటాము. మేము భూమి బద్ధలైనా, పడిపోయినాకానీ మా ధర్మమును విడిచిపెట్టము" అన్నారు. అవసరమైతే ఈ కన్యలు రాత్రంతా కూడా నిల్చుని ఉంటారన్న విషయము వారికి అర్థమయింది. ఆ సాహసవంతులైన కన్యలను చూసి వారు కూడా ముగ్ధులయ్యారు. ధర్నా చేసేవారి సంఖ్య నెమ్మది నెమ్మదిగా తగ్గసాగింది. యాంటీ పార్టీ నాయకులు అందరినీ ఇళ్ళకు వెళ్ళిపోమని చెప్పారు. ఆ రోజుకు యుద్ధం ముగిసింది.

ఇది పాండవులు/శక్తి సైన్యం సాధించిన విజయము. కానీ దీర్ఘకాలిక యుద్ధములో ఇది చిన్న భాగము మాత్రమే. మరుసటి రోజు కూడా ఆందోళనకారులు ఓం నివాస్‌కు చేరుకున్నారు. ఈరోజు ఏది ఏమైనాకానీ ఎవ్వరినీ లోనికి పోనివ్వకూడదని వారు దృఢంగా అనుకున్నారు. ఆసక్తితో ఎన్నో వేలమంది దీనిని చూడటానికి అక్కడకు చేరుకున్నారు. కానీ ఆ రోజు కూడా మొదటిరోజులాగే జరిగింది. సాయంత్రం 6 గంటల వరకు నిల్చుని ధర్నా చేసేవారు తిరిగి వెళ్లిపోయారు. ఒకవైపు ఆందోళనకారులు, మరోవైపు బ్రహ్మ సంతానమైన శ్వేత వస్త్రధారులు.

ముఖి మరియు అతని అనుచరులు ఎలాగైనా ఈ పవిత్ర సైన్యాన్ని ఓడించాలని కంకణం కట్టుకున్నారు. అందుకే మూడవ రోజు హింస చెయ్యడానికి సిద్ధమై వచ్చారు. రోజులు గడుస్తున్న కొద్దీ ఒత్తిడి పెరగసాగింది. ఆందోళనకారులు నల్లని వస్త్రాలు ధరించి వస్తే పాండవులు శ్వేత వస్త్రాలలో ఉన్నారు. పాండవులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే వారు రెచ్చిపోయి ఏమైనా చేస్తే అది పట్టుకుని ధర్నాను మరింత తీవ్రతరం చెయ్యాలని ఆందోళనకారులు ఆశించారు. కానీ బ్రహ్మ సంతానం కొంచెం కూడా ఆవేశంలోకి రాలేదు.

యాంటీ పార్టీ ఆజ్ఞల మేరకు సమ్మె చేసేవారు ఈశ్వరీయ సైన్యానికి మద్దతునిచ్చే ప్రేక్షకులను కూడా భయపెట్టారు. చివరకు, సింధ్ ప్రభుత్వ అధికారి ఒకరు కలుగజేసుకుని పికెటింగ్‌ను ఆపివేసారు, (దీనిని వారు మూడు రోజుల క్రితమే చేసి ఉండాల్సింది.)

సింధ్ సమాజంలోని కొంతమంది తెలివైన పెద్ద మనుషులు యాంటీ ఓం మండలి చేసిన ఈ అకృత్యాన్ని తీవ్రంగా ఖండించారు. చిన్న పిల్లలను ఇంతగా హింసించి ఉండకూడదు అని అభిప్రాయపడ్డారు. మరి కొంతమంది ఈ పార్టీ చేసిన దురాగతాలను, కుయుక్తులను ఎండగడుతూ వ్యాసాలను కూడా వ్రాసారు.

జిల్లా మేజిస్ట్రేట్ వారు సెక్షన్ 112 మరియు 107 ప్రకారము ఆందోళనకారుల మీద కేసును నమోదు చేసారు. కానీ ఇదే సెక్షన్‌ను ఆధారం చేసుకుని ఓం మండలిలోని ఐదుగురు వ్యక్తులకు నోటీసును పంపారు. ఆ ఐదుగురు వ్యక్తులలో బ్రహ్మబాబా కూడా ఉన్నారు.

ఆ ఐదుగురు మీద శాంతి భద్రతల విరుద్ధముగా కేసును నమోదు చేసారు. ఇది ఎంతటి విపరీతమైన విషయము. ఉద్యమము లేవదీసింది, భవనమును ధ్వంసం చేసింది, రాళ్ళు రువ్వి ఘనకార్యము చేసింది 'యాంటీ ఓం మండలి' వారు. ఓం మండలి సభ్యులలో ఏ ఒక్కరూ కనీసం ఆవేశంగా కూడా ప్రవర్తించలేదు. వారు కేవలం తమ భవనాన్ని కాపాడుకోవడానికి ప్రశాంతంగా ద్వారాలవద్ద నిల్చున్నారు.

కలియుగంలో జరిగే అన్యాయానికి ఇదే తార్కాణం. ఆందోళనకారులతో పాటు నిర్దోషులు, శాంతి దూతలు కూడా శిక్షింపబడుతున్నారు.

ఓం మండలివారు ఈ కేసును ఉన్నత న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. ఉన్నత న్యాయాలయములోని జ్యుడిషియల్ కమిషనర్ మరియు అన్య న్యాయాధీశులు జిల్లా మేజిస్ట్రేట్ ద్వారా న్యాయ విచారణను చేపట్టారు. జిల్లా మేజిస్ట్రేట్‌గారు ఓం మండలిపై నమోదు చేసిన కేసు, అందులో వినిపించిన వాదనలను ఉన్నత న్యాయస్థానం కొట్టిపారేసింది. చట్టాన్ని తప్పుగా ఉపయోగించారని న్యాయాధీశులు అభి్రాయపడ్డారు.

ఓం మండలివారు తమ ధార్మిక విచారణలతో శాంతి పూర్వకమైన సత్సంగాన్ని చేసుకుంటున్నారు. ఇతరులు మాత్రం సత్సంగాన్ని భంగపరిచే ప్రయత్నంలో శాంతిభద్రతలను కూడా భంగపరిచారు. దిగువ కోర్టువారి నిర్ణయానికి ఏకీభవిస్తే సంఘ సేవకులందరినీ అవకాశవాదులు అణచివేసే ప్రమాదం ఉంది. కనుక, ఓం మండలి చేసిన అపరాధము ఏమీ లేదని, వీరిపై అనుచితమైన, హానికరమైన వ్యవహారము జరిగిందని వ్రాసారు. ఈ తీర్పు నవంబరు 21, 1938న

ఇవ్వడం జరిగింది.

ఫోటోలు – 1. ప్రకాశ్‌మణిగారితో కలిసి టోలీని పంచుతున్న బాబా

2. రతన్ మోహిని దాదీ మరియు ముంబయి నుండి వచ్చిన గ్రూపుతో బాబా

3. కన్యలతో మమ్మా మరియు బాబా

4. ఢిల్లీలో, ఉదయం క్లాసు తర్వాత కన్యలు పాడుతున్న పాటను వింటున్న బాబా

5. మధువనానికి బాబాను చూడటానికి వచ్చన ఢిల్లీ గ్రూపు

6. మధువనంలోని తమ గది వద్ద పిల్లలకు వీడ్కోలు పలుకుతున్న బాబా

7. కరాచీలోని క్లిఫ్టన్ బీచ్ వద్ద పిల్లలతో బాబా

8. పూదోటలో మమ్మా (కుడి వైపు) మరియు మోహిని అక్కయ్య (మధువనం)తో బాబా

# భగవంతుడు: విఘ్న వినాశకుడు

శాంతిని పునఃస్థాపించడానికి బ్రహ్మబాబా సత్సంగాన్ని కరాచీకి మార్చారు. కరాచీలోని ఆ క్రొత్త స్థానంలో ఉండదల్చుకున్నవారు తమ ఇంటి పెద్ద నుండి సమ్మతి పత్రాన్ని తీసుకురావలసిందిగా ఓం మండలి తన సభ్యులకు చెప్పింది. కొంతమంది సోదరసోదరీలు తమ ఇంటి పెద్దల నుండి సమ్మతి పత్రాలను తీసుకువచ్చి బాబాతోపాటు కరాచీలో ఉండటం ప్రారంభించారు. చివరకు, ఎంతోమంది బాబా పిల్లలకు కరాచీకి వెళ్ళేందుకు మార్గం సుగమమైంది.

వారందరూ కరాచీలో ఉండటానికి బ్రహ్మబాబా తగు ఏర్పాట్లను చేసారు. ప్రశాంతమైన, ఏకాంత స్థానాలలో ఉన్న ఐదు బంగళాలను బాబా కొన్నారు. వాటికి బేబీ భవన్ (కన్యల భవనము), బాయిస్ భవన్ (కుమారుల భవనము), ప్రేమ్ భవన్, రాధా భవన్ మరియు ఓం నివాస్ అని పేరు పెట్టారు.

బోర్డింగ్ స్కూలును మళ్ళీ తెరిచి అందుకు ఎటువంటి అవాంతరము రాకుండా మునుపటివలె వారి దినచర్యను కొనసాగించారు. పిల్లలు ఎప్పటివలె ఉదయం 3.30గం॥లకు లేచి ఒక గంటసేపు సమాధి స్థితిలో ఉండేవారు. తర్వాత ఈశ్వరీయ జ్ఞాన చర్చ జరిగేది. అల్పాహారమును స్వీకరించిన తర్వాత ప్రాపంచిక జ్ఞానాన్ని బోధించేవారు.

ఒకరోజు, ఒక ప్రమాదము పిల్లల యోగశక్తికి పరీక్షగా నిలిచింది. చాలామంది కన్యలు బస్సులో ప్రయాణిస్తుండగా దాని టైరు పంక్చర్ అయింది. అదుపు తప్పిన బస్సు బోల్తాపడింది. ఇంచుమించు పిల్లలందరికీ గాయాలయ్యాయి.

చుట్టుప్రక్కల ఉన్నవారు పరుగుపరుగున అక్కడకు చేరుకున్నారు. కానీ అక్కడి దృశ్యం చూసి ఎంతో ఆశ్చర్యపోయారు. చిన్న పిల్లలు బాధతో తమ తల్లిదండ్రుల కోసం ఏడవడము, బాధపడటము వంటి దృశ్యాలుంటాయేమో అని అనుకున్నారంతా. కానీ అక్కడ ఏ ఒక్కరూ బాధపడటం లేదు, ఏడవడమూ లేదు. ఎవరి ముఖాలలోనూ కలవరం లేదు.

ఎలా ఉంది అని పిల్లలను అక్కడివారు అడిగితే, “నేను ఆత్మను, శాంత స్వరూపాన్ని” అని జవాబిస్తున్నారు. వారిని ఆసుపత్రిలో చేర్చారు. కొందరికి ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి పంపేసారు. బాగా దెబ్బలు తగిలినవారిని మాత్రం ఆసుపత్రిలో చేర్చుకున్నారు. ఒక కన్యకు, దుర్ఘటనలో చేతివద్ద చాలా దెబ్బ తగిలింది. కానీ ఎంతో ప్రశాంతంగా ఉంది. పిల్లల ఇటువంటి అద్భుతమైన మానసిక స్థితిని చూసి డాక్టర్లు, నర్సులు సైతం ఆశ్చర్యపోయారు. ఎవ్వరి ముఖంలోనూ బాధ కనిపించడంలేదు.

ఎవరికైతే తక్కువ దెబ్బలు తగిలాయో ఆ కన్య బాబా వద్దకు వెళ్ళి సంగతిని వివరించింది. అది వినగానే బాబా కూడా చాలా ప్రశాంతంగా, ఉపరామ స్థితిలో ఇలా అన్నారు, “విధిలో ఉన్నదే జరిగింది. నేను ఆసుపత్రికి వస్తాను, పద వెళ్దాము”.

బాబా మొదట, దుర్ఘటన జరిగిన స్థలాన్ని చూసి తర్వాత ఆసుపత్రికి వెళ్ళారు. బాబా తమ సుమధుర మందహాసముతో, మధుర దృష్టితో అందరినీ సంతోషపెట్టారు. పిల్లలందరూ శాంతస్వరూపులుగా, సహనశీలురై ఆత్మస్మృతిలో ఉండటాన్ని బాబా చూసారు. అతి కొద్ది సమయములోనే ఈ పిల్లలు తమలో యోగశక్తిని బాగా నింపుకున్నారు.

ఈ విషయము వార్తాపత్రికల్లో కూడా వచ్చింది. చిన్న పిల్లలైనాగానీ రాజయోగ అభ్యాసముతో సహనశీలతతో బాధను కూడా అధిగమించగలిగారని ప్రచురించారు.

# వ్యతిరేకత మళ్ళీ మొదలయింది

బ్రహ్మబాబాతో పాటు కరాచీకి రాలేని మహిళలు ఇక్కడ హైదరాబాద్‌లో కృశించిపోయారు. సత్సంగానికి దూరంగా ఉండటం వారి వల్లకాలేదు. కొద్ది సమయం కోసమైనా కరాచీలోని ఓం మండలికి వెళ్ళి వస్తామన్నాకానీ ఇంట్లోనివారు అనుమతించలేదు.

హైదరాబాద్‌లోని ఈ గోపికలందరూ ఒకచోట కలుసుకుని మెడిటేషన్ చేసుకుని జ్ఞాన చర్చ చేసుకునేవారు. బ్రహ్మబాబా నుండి వీరికి జ్ఞానముతో నిండిన ఉత్తరాలు తరచూ వచ్చేవి. అందరూ కలిసి బాబా ఉత్తరాలను చదువుకుంటూ ధైర్యాన్ని కూడగట్టుకునేవారు. ఏ భగవంతుడి కోసమైతే 5,000 సంవత్సరాలనుండి వేచి ఉన్నామో ఆ భగవంతుడిని కలుసుకోవడానికి అజ్ఞానులైన తమ బంధువులు అడ్డుగా నిలవడాన్ని వారు చాలా బాధాకరంగా భావించారు.

చివరకు ఒకరోజు వారు ఆగలేకపోయారు. పదిహేనుమంది మహిళలు తమ బంధాలను తెంచుకోవాలని నిర్ణయించుకున్నారు. హుటాహుటిన వారందరూ తమ బట్టలను సర్దుకుని కరాచీకి ప్రయాణమయ్యారు.

కరాచీకి చేరుకున్న మహిళలు వారి ఇంటివారికి ఈ విధంగా ఉత్తరం వ్రాసారు, "మేమందరమూ క్షేమంగా చేరుకున్నాము, మా గురించి చింతించకండి".

కానీ 'యాంటీ పార్టీ' వారు ఇది సహించలేకపోయారు. ఎలాగైనా దీనిని ఆపాలని నిర్ణయించుకున్నారు. ఏ ఇంటి కూతుర్లు, భార్యలైతే బ్రహ్మబాబా వద్దకు వెళ్ళారో ఆ ఇంటివారు యాంటీ పార్టీ ముఖ్యులను కలిసి సత్వర చర్యను తీసుకోవాలన్నారు. వారు చేయబోయే దాడికి అవసరమైన రాజకీయ మద్దతుకోసం కావలసిన ధనాన్ని వారు ముందుగా సమకూర్చుకున్నారు.

ఈ మహిళలు ఇళ్ళు విడిచి వెళ్ళడం సబబే అని ఆ ఇంట్లోని వారి హృదయాలకు బహుశా తెలిసి ఉండవచ్చు కానీ దానిని వారు ఒప్పుకోలేకపోతున్నారు. ఎన్నో నెలలుగా వీరు ఎన్నో నిందలను భరిస్తూ వచ్చారు కానీ ఒక్క మాట కూడా తిరిగి మాట్లాడలేదు. వారిలోని జ్ఞాన పిపాస, పవిత్ర జీవితంపై అభిలాష, భగవంతునిపై భక్తిశ్రద్ధలు ఏ మాత్రం తగ్గలేదు. ఇప్పుడు వారు విముక్తులయ్యారు. కానీ ఇంట్లోవారి అనుమతి లేకుండా వారు వెళ్ళారు. ఇంటి పెద్దకు ఇది ఒక పెద్ద దెబ్బ.

యాంటీ పార్టీలోని ముఖ్యులు సింధ్ పట్టణములోని మంత్రిమండలిపై ఒత్తిడి తీసుకువచ్చారు. సింధ్ మంత్రిమండలిలో హిందువు మరియు ముస్లిం నేతలు ఇరువురూ ఉన్నారు. ఆ సమయంలో ఉన్న అల్లాబక్ష్ మంత్రిమండలిలోని హిందూ మంత్రులపై ఈ బాధ్యతను పెట్టారు. ముఖ్యమంత్రి ఒకవేళ ఓం మండలికి అడ్డుకట్ట వేయకపోతే వారు రాజీనామాలు చేస్తామని, అప్పుడు మంత్రిమండలి విచ్ఛిన్నమవుతుందని మంత్రులు బెదిరించారు.

కానీ ముఖ్యమంత్రి అటువంటి నిషేధాన్ని అమలుపరచలేదు, ఎందుకంటే, అది సబబు కాదని, అలా చేస్తే అది వారికే బెడిసికొడ్తుందని అతనికి తెలుసు. కానీ 'యాంటీ పార్టీ' వారు ఓం మండలి కార్యాలను నిషేధించేందుకు తమ ప్రయత్నాలు చేస్తూనే ఉండటాన్ని అల్లాబక్ష్ గమనించారు.

'యాంటీ పార్టీ' వారు కరాచీలోని వార్తాపత్రికల సంపాదకులను కలిసారు. వారిని డబ్బుతో ప్రలోభపరిచి, 'యాంటీ పార్టీ'కి మద్దతుగా తమ వార్తాపత్రికల్లో ప్రచురించకపోతే వారికి ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయానికి గండి కొడతామని బెదిరించారు కూడా.

ఓం మండలి గురించి తప్పుడు ప్రచారాలు చేస్తూ అనేక వ్యాసాలను ప్రచురించారు. ఇటువంటి సంస్థలను బహిష్కరించాలని, వారిపై తగిన కేసువేసి న్యాయాన్యాయాలను విచారించాలని కేసు వేసారు.

ఓం మండలిలోని మాతలు, కన్యలను ఎక్కడ కనిపిస్తే అక్కడ అల్లరి చెయ్యమని రౌడీలకు డబ్బులిచ్చారు. కేవలం

డబ్బుకు మాత్రమే పనిచేసే ఇటువంటి దుండగుల వలన ఎన్నో దెబ్బలు కూడా తిన్నారు. కానీ ఈశ్వరీయ సోదరసోదరీలు ఏ విధంగానూ ఆవేశపడలేదు.

ఆవేశపరుడైన ఒక భర్త తనకు 'వివాహ హక్కులు' (Conjugal rights) ఇప్పించవలసిందిగా న్యాయస్థానంలో కేసు వేసాడు. ఇందుకు లోకమంతా మద్దతు పలికింది.

'యాంటీ పార్టీ' వారు తమ తరఫున వాదించడానికి ఒక మంచి వకీలును నియమించుకున్నారు. కోర్టులో ఓం మండలిని పూర్తిగా భంగపరచాలని వారు ధ్యేయంగా పెట్టుకున్నారు. ఓం మండలికి ప్రధాన వ్యవస్థాపకురాలు, యుక్త వయస్కురాలైన ఓం రాధయే వారి లక్ష్యం. ఆమెను చెడుగా లేక తెలివితక్కువదిగా నిరూపించగలిగితే వారనుకున్నది నెరవేరినట్లే అనుకున్నారు.

ఓం రాధ యుక్త వయసుకలది, అనుభవం తక్కువ, నలుగురిలో మాట్లాడే అలవాటు లేదు. కానీ ఆవిడ ఉక్కు మనిషి, సద్గుణశీలి, భగవంతునికి మరియు వారి మాధ్యమముగా ఉన్న బ్రహ్మాబాబాకు సంపూర్ణ నిజాయతిగా ఉన్నారు. ఇప్పుడు వీరు జ్ఞానము యొక్క ప్రత్యక్ష లాభాన్ని ప్రదర్శించబోతున్నారు.

వాదోపవాదాలు జరిగే సమయంలో ఆమె తడబడుతుందా? ఆమె అనుకోని విషయాలను కూడా వీరు చెప్పిస్తారా? వీరు సంస్థను చెడుగా చూపించి అనుకున్నది సాధిస్తారా? ఇటువంటి అనేక సందేహాల నివృత్తి కోసం అందరూ ఆసక్తిగా ఉన్నారు.

**కోర్టు దృశ్యము**

ఆరోజు న్యాయస్థానంలో జరిగిన వాదన ఎంతో ఆసక్తిగా జరిగింది. ప్రేక్షకులుగానీ, అక్కడి అధికారులుగానీ అక్కడ జరిగిన దృశ్యాన్ని అస్సలు ఊహించలేదు. ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి రెండవ ముఖ్య ప్రశాసకురాలిగా వ్యవహరించిన దాదీ ప్రకాశ్ మణిగారు ఈ కోర్టు దృశ్యాన్ని వివరించారు.

ఓం రాధతో సహా ఐదుగురు సోదరీలకు కోర్టులోనికి ప్రవేశించడానికి ప్రవేశపత్రాలు లభించాయి. కరాచీనుండి హైదరాబాద్ కోర్టుకు చేరుకున్న వీరి కారు న్యాయస్థానం వెలుపల ఆగింది. అక్కడకు చేరుకున్న ప్రజలను అదుపులో పెట్టడానికి పోలీసు రక్షణ అవసరమైంది. జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఇక్కడే ఉన్నారా అన్నట్లుగా కోర్టు కిటకిటలాడిపోయింది. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మరియు అక్కడి కొంతమంది ముఖ్యులు కూడా అక్కడ ఉన్నారు.

ఈశ్వరీయ సోదరీలను పోలీసు రక్షణతో కోర్టుగదిలోకి తీసుకువెళ్ళారు. ఆ కోర్టు గది చాలా పెద్దగా ఉంది. ఆ హాలంతా జనంతో కిక్కిరిసి పోయింది. అక్కడ నిల్చోడానికి కూడా స్థలం లేదు. బయట ఉన్న జనానికి కనీసం లోపల ఏమి జరుగతుందని తెలిసే అవకాశం కూడా లేదు. కోర్టు సెషన్స్ సమయం ఇంకా అవ్వనందున హాలులో అంతా చాలా గోలగా ఉంది.

అయితేనేమి, హాలులోకి ఓం రాధ మరియు ఇతర సోదరీలు ప్రవేశించగానే హాలులో అంతా నిశ్శబ్దం అలుముకుంది. అందరి దృష్టి శ్వేతవస్త్రాలు ధరించిన వీరిపైనే. ఈశ్వరీయ సోదరీలు మాత్రం మౌనంగా కోర్టు గదిలో వారి స్థానం వైపుకు వెళ్ళి కూర్చున్నారు.

వారి ప్రతి కదలికను అందరూ గమనిస్తున్నారు. భగవంతుడే మాకు శిక్షకుడై చదివిస్తున్నాడని చెప్పుకునే వీరు ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో ఎలా వ్యవహరిస్తారు? వీరి శక్తి ఎంత గొప్పది? సోదరీల ముఖములో కనిపించే ప్రశాంతతను చూసి అందరూ ఆశ్చర్యపోయారు: వీరు చెప్పింది నిజమయ్యే అవకాశముందా? నిజంగానే, శివ భగవానుడు బ్రహ్మాబాబా శరీరంలో ప్రవేశించారా? అదే నిజమైతే, ఈ ఆపత్కాల సమయంలో ఆ భగవంతుడు వీరిని ఎలా రక్షిస్తాడు?

ఈశ్వరీయ సోదరీలు మాత్రం ఎంతో ప్రశాంతంగా ఉండి కోర్టు దృశ్యం కోసం ఎదురుచూస్తున్నారు. ఇదంతా ఒక నాటకమని వారికి తెలుసు. ఈ ప్రపంచము గెలుపు ఓటమిలతో తయారు చేయబడ్డది. ఈ సృష్టి నాటక ఆది

మధ్యాంతాలు వారికి తెలుసు. ఐదు వేల సంవత్సరాల ఈ నాటక చక్రము తిరుగుతూనే ఉంటుంది. భగవంతుని జ్ఞానమును రక్షణ కవచంగా ధరించిన వీరు, వీరి ముందు జరిగే సంఘటనలను నాటకంలోని దృశ్యాలుగా మాత్రమే చూడగలుగుతున్నారు.

కోర్టులో హాజరైన సోదరీలలో దాదీ ప్రకాశ్ మణిగారు కూడా ఉన్నారు. వారు ఈ విధంగా చెప్తున్నారు, "మేమెందుకు భయపడాలి? మాకు ఎవరియందూ చెడు భావము లేదు. ఎవ్వరూ పొందలేని గొప్ప బహుమతిని మేము పొందాము. మేము కేవలం అతడి సేవలో మాత్రమే ఉన్నాము. మేము కోర్టు గదిలో పూర్తిగా శాంతి ప్రకంపనాలను వెదజల్లాము."

న్యాయమూర్తి సోదరీలకు ప్రత్యేక ఆసనాలను చూపించి అక్కడ కూర్చోమన్నారు. ఓం రాధను చూడగానే న్యాయమూర్తికి తెలియని ఆనందం కలిగినట్లుగా అనిపించింది. నిజానికి కూడా, రాధ నడవడిక ఎంతో హుందాగా ఉండేది. తెల్లని చీరలో రాధ మరింత నిష్కల్మషంగా, ఉన్నతంగా, కోర్టు గదిలో ఒక ప్రత్యేక వ్యక్తిగా కనిపించారు.

కేసు వాదోపవాదాలు ప్రారంభమయ్యాయి. 'యాంటీ పార్టీ' తరఫు న్యాయవాదులు తమ వాదనలను వినిపించారు. కేసుకు సంబంధించి వారివద్ద ఉన్న వివిధ సమాచారాన్ని, చిల్లరమల్లర లాంఛనాలను కోర్టుముందు ప్రవేశపెట్టారు. కానీ వారి వాదనల్లో ఏమాత్రమూ వాస్తవము లేదు. కోర్టు వాతావరణం చాలా గంభీరంగా ఉంది. ఓం రాధను బోనులోకి ప్రవేశపెట్టారు. అప్పుడు ఈ విధంగా వాదనలు జరిగాయి –

**న్యాయమూర్తి:**

"ముందుగా భగవద్గీత మీద చెయ్యి పెట్టి అంతా నిజమే చెప్తాను అని ప్రమాణము చెయ్యండి."

**రాధ :**

"ఏమని ప్రమాణము చెయ్యాలి? ఏమి మాట్లాడాలి?

**న్యాయమూర్తి:**

"భగవద్గీతను చేతుల్లోకి తీసుకుని ఇలా చెప్పండి : భగవంతుడిని సర్వవ్యాపిగా నమ్ముతూ నేనంతా నిజమే చెప్తాను."

**రాధ :**

"జడ్జిగారూ, మీరు ఉన్నట్లుగా నేను చూస్తున్నాను. కానీ భగవంతుడు ఇక్కడ ఉన్నాడో లేడో నాకు తెలియదు. నేను నా ఈ స్థూల నేత్రాలతో భగవంతుడిని చూడటం లేదు. అలాంటప్పుడు మీ సమక్షంలో నేను భగవంతుడిని ఇక్కడ సర్వవ్యాపిగా చూస్తున్నాను అని ఎలా చెప్పగలను? నేను కేవలం మీ ఆత్మ జడ్జి రూపంలో ఉండటాన్ని చూస్తున్నాను. కనుక, మీరు అనుమతిస్తే, జడ్జి రూపంలో నా ఎదుట ఉన్న మీ ఆత్మ సమక్షంలో నేనంతా నిజమే చెప్తాను అని ప్రమాణం చేస్తాను."

ఈ వింత సమాధానమును విని గదిలోని వారంతా ఆశ్చర్యపోయారు. కొందరు పరిహాసంగా నవ్వారు. మరికొందరు ఓం రాధ మాటలకు మద్దతుగా చప్పట్లు కొట్టారు. మరికొంతమంది 'నిజమే, ఆమె నిజమే చెప్పింది' అని అన్నారు.

ఇటువంటి పరిస్థితి న్యాయమూర్తికి మునుపెన్నడూ రాలేదు. అతడికి కొంచెం కోపం వచ్చింది. "ఆర్డర్!ఆర్డర్!" అన్నాడు. గదిలోని వారంతా మౌనం వహించారు.

**న్యాయమూర్తి:** (రాధను చూస్తూ)

"నేను భగవంతుడిని కాను, మీరు నా పేరు మీద ప్రమాణం చేయనవసరం లేదు. దేవుని పేరు మీద ప్రమాణం చెయ్యడం కోర్టు మర్యాద. దానిని మార్చలేము."

**రాధ :** (వినయంగా మరియు ప్రశాంతంగా)

"న్యాయమూర్తిగారూ, నిజము చెప్పమని మీరే కదా చెప్పారు. నిజానికి, భగవంతుడిని నేను సర్వవ్యాపిగా చూడటం లేదు. అసలు అందరి మనసులలో నాకు కామ క్రోధ లోభాలు కనిపిస్తున్నాయి. నేను అంతటా భగవంతుడిని చూడలేనప్పుడు

తప్పుడు ప్రమాణమును ఎలా చెయ్యను?"

**న్యాయమూర్తి:**

"ఇది కోర్టు, సత్సంగం కాదు. ఇక్కడ మీరు జ్ఞానాన్ని వినిపించనవసరం లేదు. ఇక్కడ కొన్ని చట్టాలుంటాయి. దానిని ఉల్లంఘిస్తే కోర్టును అవమానపరిచినట్లుగా పరిగణించవలసి ఉంటుంది."

**రాధ :** (నిర్భయంగా)

"కోర్టును అవమానపరిస్తే మీరు సహించలేనట్లుగానే ప్రపంచానికే పరమపిత అయిన భగవంతుని అవమానం జరుగుతుంటే నేను కూడా సహించలేకపోతున్నాను. "ధర్మగ్లాని జరిగినప్పుడు నేను ఈ భూమిపైన అవతరిస్తాను" అని భగవంతుడు చెప్పినట్లుగా భగవద్గీతలోనే ఉంది. అలాంటప్పుడు భగవంతుడు ఈ ప్రపంచంలో సర్వవ్యాపిగా ఎలా ఉండగలడు? భగవంతుడు జ్ఞానము, ప్రేమ, ఆనంద స్వరూపులు. వారు శాంతి సాగరులు. కానీ ఈ ప్రపంచంలోని ప్రతి ఒక్కరిలో పంచ వికారాలు, అస్థిరత్వము నిండి ఉన్నాయి. అందరిలోనూ అశాంతి, అజ్ఞానము ఉన్నాయి. అలాంటప్పుడు అటువంటి వారందరిలో భగవంతుడు ఉన్నాడని ఎలా చెప్పగలము?"

ఇందుకు ఎలా బదులివ్వాలో న్యాయమూర్తికి అర్థం కాలేదు. కోర్టు గదిలో అంతా మౌనం రాజ్యమేలింది. ఓం రాధ ఎంత నిర్భయంగా మాట్లాడారంటే వారి మాటల్లో స్పష్టత, భగవంతునిపై తమకున్న అపారమైన ప్రేమ కనిపించాయి. అందుకే ఎవ్వరూ రాధను అడ్డుకోలేదు. 'యాంటీ పార్టీ' వారు కూడా రాధ మాటలకు ప్రభావితులైనట్లుగా ఉంది. కానీ న్యాయమూర్తి చట్టానికి కట్టుబడి ఉండాలి కనుక వారు దాని అనుసారంగా ప్రవర్తించవలసి వచ్చింది. చివరకు న్యాయమూర్తి ఇలా అన్నారు, –

**న్యాయమూర్తి:**

"మీ నమ్మకాలతో ఇక్కడ పని లేదు. కోర్టు ఆజ్ఞలను పాటించవలసిందే. ఇందులో ఏ విధమైన మార్పులు ఉండవు."

**రాధ :**

"న్యాయమూర్తిగారూ, ఎట్టి పరిస్థితిలోనూ నేను తప్పుడు ప్రమాణమును చెయ్యను."

**న్యాయమూర్తి:**

"ఇప్పటికీ మించిపోయింది లేదు. కొంత సమయాన్ని ఇస్తాను, ఆలోచించుకోండి. అప్పుడు మళ్ళీ మిమ్మల్ని అడుగుతాను."

**రాధ :**

"నేను ఇక ఇందులో ఆలోచించుకునేదేమీ లేదు."

న్యాయమూర్తిగారు సందిగ్ధములో పడ్డారు. తనముందు ఉన్న యువతిని చూసి న్యాయమూర్తి తక్కువగా అంచనా వేసారు. భయపెట్టి, బెదిరించైనా ప్రమాణమును తీసుకోవాలనుకున్నాడు న్యాయమూర్తి. ఓం రాధకు సంకెళ్ళు వేయవలసిందిగా ఆజ్ఞాపించాడు. అధికారి సంకెళ్ళతో రాధ వద్దకు చేరుకున్నాడు. రాధ మాత్రం నిర్భయంగా నిలబడి ఉంది. కోర్టు హాలులోని జనాలంతా ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. నిజంగా ఇటువంటి వారికి బేడీలు తప్పవా?

చివరి క్షణంలో, సంకెళ్ళను తీసుకువచ్చిన అధికారిని న్యాయమూర్తి ఆగమన్నారు. భయపెట్టడం వలన ఏమీ ఉపయోగం లేదని వారికి అర్థమయింది. అధికారి వెనుదిరిగి వెళ్ళిపోతుంటే అక్కడి జనమంతా సంతోషంతో చప్పట్లు కొట్టారు.

ఓం రాధతో ప్రమాణం చేయించాలన్న ఆలోచనను న్యాయమూర్తి మానుకున్నారు. కౌరవ సభలో భగవంతుడు ద్రౌపది గౌరవాన్ని కాపాడారు.

ఇప్పుడిక కేసుకు సంబంధించిన వాదోపవాదాలు మొదలయ్యాయి, న్యాయమూర్తియే స్వయంగా రాధను ప్రశ్నించడం మొదలుపెట్టారు.

**న్యాయమూర్తి:**

"ఎంతోమంది అమ్మాయిలు తమ ఇళ్ళను విడిచి ఎవరు ఎంత ఆపినా ఆగక దాదా వద్దకు ఎందుకు వెళ్ళారు?"

**రాధ :**

"న్యాయమూర్తిగారూ, మీరు ఎప్పుడైనా శ్రీమద్భగవద్గీతను చదివారా? కృష్ణుడు మురళి వాయిస్తుంటే గోపికలు ఎందుకు ఆనందంతో అక్కడకు పరిగెత్తుకుని వెళ్ళేవారు? వారిమీద కోర్టులో ఎందుకు కేసులు నమోదు కాలేదు? అక్కడ వర్ణించిన మురళీనాదం నిజానికి, ఇప్పుడు బ్రహ్మాబాబా ముఖారవిందం ద్వారా భగవంతుడు వినిపిస్తున్న జ్ఞాన మురళి. ఇది అసమానమైన జ్ఞానము."

"న్యాయమూర్తిగారూ, నన్ను ఒక్క ప్రశ్నను అడగనివ్వండి. ఒక పురుషుడు తన కుటుంబాన్ని విడిచి సన్యాసం పుచ్చుకుంటే వారిమీద ఎందుకు మీరు కేసులు నమోదు చెయ్యడం లేదు? భగవంతుని దృష్టిలో స్త్రీ పురుషులిద్దరూ సమానమే. జ్ఞాన కలశాన్ని భగవంతుడు ఇప్పుడు స్త్రీల మీద పెట్టారు. మహిళలమైన మాకు ఇప్పుడు పవిత్రత, జ్ఞానాన్ని పొందే అవకాశం వచ్చినప్పుడు మేమెందుకు దానిని తిరస్కరించాలి? ఇటువంటి పవిత్రత, ఉన్నత మార్గాన్ని చూసి అందరూ ఎందుకు సంతోషపడకూడదు? మమ్మల్నే ఎందుకు ఈ ప్రశ్నలు అడుగుతున్నారు? జవాబు చాలా స్పష్టంగా ఉంది న్యాయమూర్తిగారూ. మా మార్గంలో ఎన్ని కష్టాలు వచ్చినా, మా బంధువులు, స్నేహితులు మాపై ఎన్ని అత్యాచారాలు, నిందలు వేసినాకానీ ఇదంతా మేము ఎంచుకున్న పవిత్ర జీవన మార్గానికి ప్రతిచర్య మాత్రమే."

న్యాయమూర్తి తనకు తోచిన పదునైన ప్రశ్నలను రాధపై సంధిస్తూనే వచ్చారు. కానీ అన్ని ప్రశ్నలకు రాధ ఖరాఖండిగా, జ్ఞానయుక్తంగా జవాబిచ్చారు.

**న్యాయమూర్తి:**

"మీ కళ్ళకు దాదా ఏ కాటుకను పెట్టారు?"

**రాధ :**

"న్యాయమూర్తిగారూ, మీరు వేదాలు చదివారా?"

**న్యాయమూర్తి:**

"కొన్ని చదివాను."

**రాధ :**

"అయితే జ్ఞానమును వేదాలలో ఆ పదముతోటే పోల్చడాన్ని మీరు చదివే ఉంటారు. జ్ఞాన కాటుకను సద్గురువు ఇవ్వగా అజ్ఞాన అంధకారము తొలగిపోయింది అని అంటారు. అటువంటి జ్ఞాన కాటుకనే ఇప్పుడు భగవంతుడు మాకు ఇస్తున్నారు."

**న్యాయమూర్తి:**

"దాదాకు ఎంతమంది పిల్లలున్నారు?"

**రాధ :**

"న్యాయమూర్తిగారూ, మేము దాదాను చూడటం లేదు. మాకు కలిగిన జ్ఞానోదయమంతా స్వయంగా భగవంతుడి ద్వారానే జరిగింది. ఆ భగవంతుడు దాదా శరీరంలో ప్రవేశించారు. ఇప్పుడు మీరు చెప్పండి, భగవంతుడికి ఎంతమంది పిల్లలున్నారు? ఎవరైనా లెక్కపెట్టగలరా? అతడు మూడు లోకాలకు అధిపతి. సర్వాత్మలూ వారి సంతానమే. కేవలం నేను, లేక సత్సంగానికి వస్తున్నవారు మాత్రమే భగవంతుని సంతానము కాదు, నిజానికి, న్యాయమూర్తిగారు, మీరు కూడా వారి సంతానమే."

న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలన్నిటికీ వచ్చిన సమాధానాలను అతడు వ్రాసుకున్నాడు. చివరకు, అతడు ఏమీ మాట్లాడలేదు. సాక్షి ఇక వెళ్ళవచ్చు అని చెప్పాడు. రాధ బోను దిగి వస్తుంటే గదంతా చప్పట్లతో మారుమ్రోగిపోయింది.

కోర్టుగదిని విడిచి వెళ్ళేముందు, ఈశ్వరీయ సోదరీలందరూ న్యాయమూర్తి వద్ద గౌరవంగా సెలవు తీసుకుని, న్యాయమూర్తిని ఒకసారి బ్రహ్మబాబా వద్దకు రమ్మని ఆహ్వానించారు.

హాలు వెలుపలకు రాగానే పత్రిక రిపోర్టర్లందరూ సోదరీలను చుట్టిముట్టి అనేక ప్రశ్నలు వేసారు. అందరికీ ఎంతో ఓపికగా సోదరీలు సమాధానమును ఇచ్చారు. తర్వాత వారికోసం వేచి ఉన్న కారులో కూర్చుని వారు వెళ్ళిపోగా అంతటితో కోర్టు దృశ్యం ముగిసింది.

దాదీ ప్రకాశ్‌మణి ఈ విధంగా నెమరువేసుకున్నారు, "మరుసటి రోజు మేము కరాచీకి చేరుకున్నాము. అక్కడ మేము జరిగినదంతా బ్రహ్మబాబాకు వివరించాము. కానీ మేము అక్కడకు చేరుకోకముందే వార్తాపత్రికల ద్వారా జరిగినదంతా బ్రహ్మబాబాకు తెలిసింది. ఇప్పుడు వారు పూర్తిగా మౌనంగా, సాక్షి స్థితిలో ఉన్నారు. ఒక చిరునవ్వు నవ్వారు. ఆ చిరు మందహాసంలోనే మేము ఎలా చేసాము, ఇక మీదట ఎలా చెయ్యాలన్న నిగూఢత దాగి ఉంది."

# ఒక సాధువు తీసుకున్న అవివేక నిర్ణయం

బాబా పిల్లలు ఆత్మిక పుష్పాలవలె వికసిస్తూ ఉన్నారు. భగవంతుడి సేవ చెయ్యడానికి, బాబా జ్ఞానాన్ని ఇతరులకు అందించడానికి వారు మొదటిసారిగా బయటకు అడుగుపెట్టారు.

కానీ ఓం మండలి శత్రువులు మాత్రం వారి వైరాన్ని వీడలేదు. వారికున్న ఆవేశం కారణంగా బాబా సందేశాన్ని అందరికీ అందించే ప్రయత్నంలో కూడా అడ్డుగా నిలిచారు. టి.ఎల్.వాస్వాని అనే సాధువును యాంటీ పార్టీవారు మాయమాటలతో ప్రలోభపరుచుకుని వారి పార్టీలో చేర్చుకున్నారు. ఈ కథ కరాచీలో జరిగింది.

టి.ఎల్.వాస్వాని బాగా పేరున్న సాధువు. అతడికి 'మీరాసాక్షి' అనే పేరుతో ఒక స్కూలు కూడా ఉంది. అక్కడ అతడు ప్రతిరోజూ సత్సంగాన్ని జరిపేవాడు. యాంటీ పార్టీవారు అనేకసార్లు ఈ సాధువును కలిసి అతడికి ఓం మండలి గురించి లేనిపోనివన్నీ వినిపించారు. యాంటీ పార్టీవారు సమాజంలో పేరున్నవారు కనుక ఆ సాధువు వారి మాటలను నమ్మాడు. నిందలను నిజాలుగా నమ్మిన సాధువు యాంటీ పార్టీతో కలిసి బాబా పిల్లలకు విరుద్ధంగా పికెటింగ్ చెయ్యడానికి సమ్మతించాడు.

ఈ విషయం తెలిసిన బ్రహ్మాబాబా ఒకరోజు దాదీ చంద్రమణిగారిని పిలిచి, సాధువును కలిసి వారికి ఇక్కడున్న ఆధ్యాత్మిక విషయాలను తెలియజేసి రమ్మన్నారు. దాదీ చంద్రమణిగారు సాధువును కలిసి ఒకసారి ఓం మండలికి రావలసిందిగా, పికెటింగ్ చేసేముందు వారే స్వయంగా వచ్చి అక్కడి సంగతులను అవగతం చేసుకోవలసిందిగా కోరారు.

దాదీ ఇలా అన్నారు, "సత్సంగానికి వచ్చేవారి అనుభవాన్ని అడిగి తెలుసుకోండి. పక్షపాత బుద్ధితో చెప్పినవారి మాటలను విని అదే నిజమని నమ్మకండి. నిజానిజాలు తెలుసుకోకుండా కలకలం సృష్టించడం భావ్యం కాదు."

దాదీగారు చెప్పినదంతా అతడు శ్రద్ధగా విని నిజమేనని భావించాడు. ఈ మహిళల ప్రవర్తనకు ఆ సాధువు ముగ్ధుడయ్యాడు. నిర్భయంగా, సత్యంగా, నమ్మకంగా మాట్లాడుతున్న తీరు చూస్తే వారు పొందే శిక్షణ ఎటువంటిదో అర్థమవుతుంది, అంతటి గొప్ప శిక్షణ కేవలం ధర్మబద్ధమైనదే అని కూడా బోధపడుతుంది. ఈ మహిళలు ధర్మాన్ని పాటిస్తున్నారు, వీరు అనుసరించే మార్గం న్యాయబద్ధమైనది. కానీ వారి నమ్మకాల విషయమేమిటి? దాదీ చంద్రమణిగారిని సాధువు వారు వినే జ్ఞానము గురించి అడిగాడు.

హిందూ ధర్మములో అగమ్యగోచరంగా ఉన్న అనేక విషయాలను దాదీ ఎంతో స్పష్టంగా వివరించారు. శాస్త్రాల సారాన్ని వివరించడమే కాక వాస్తవాన్ని ధర్మపరంగానూ, తర్కపరంగానూ విశదీకరించారు. వాస్వాని నిశ్చేష్టుడయ్యాడు.

దాదీగారితో ఉన్న ఇతర సోదరీలు ఓం మండలిద్వారా తమకు కలిగిన అనుభూతులు, సాక్షాత్కారాలు, పవిత్ర జీవితం గురించి చెప్పారు. భగవంతుడు వినిపించే జ్ఞానములోగల ఉన్నత లక్ష్యాన్ని, ప్రపంచ పరివర్తన గురించి తెలిపారు.

సాధువు ఇదంతా విని చాలా సంతోషించాడు. బ్రహ్మాబాబా సాధువును ఓం మండలికి ఆహ్వానించారని వినగానే అతడి సంతోషానికి పట్టపగ్గాల్లేవు. వెంటనే అతను, "సరే, నేనిప్పుడే మీతోటి ఓం మండలికి వస్తాను!" అని అన్నాడు.

సోదరీలు వచ్చిన కారులోనే అతడు కూడా బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. అతడి అనుచరులకు అతడు ఎక్కడకు వెళ్తున్నాడనే సమాచారాన్ని ఇచ్చాడు. కానీ వారిలో కూడా కొంతమంది యాంటీ పార్టీకు చెందినవారు ఉన్నందున ఆ సాధువు ఓం మండలికి వెళ్ళడానికి అభ్యంతరం చెప్పారు. అయినాకానీ ఆ సాధువు, సోదరీలు వేచి ఉన్న కారు వైపుకు నడిచాడు. అతని శిష్యులు వెంటనే కలకలం సృష్టించారు. వారంతా కారు బయలుదేరక మునుపే దానిని చుట్టుముట్టారు. అదేదో వాస్వాని శిష్యుడిలా, వారు గురువుగా ఆ దృశ్యంలో కనిపించింది.

"ఎవ్వరూ భయపడకండి. నేను ఒక గంటలో తిరిగి వస్తాను" అని సాధువు చెప్పాడు.

కానీ అక్కడ శిష్యులు భయపడ్డారు. సాధువు ఓం మండలికి వెళ్ళి అక్కడ అతడు బ్రహ్మాబాబాను చూసి ముగ్ధుడై అక్కడే సత్సంగంలో చేరితే వారి పరిస్థితి ఏమిటి అని భయపడ్డారు. వారికి పరిస్థితి సందిగ్ధంగా తోచింది. కారును కదలనివ్వలేదు. చివరకు శిష్యులు వాస్వాని మనసును మార్చడంలో సఫలమయ్యారు. శిష్యులను సమాధానపరచడానికి వాస్వాని కారు దిగాడు. తన ఇంటిలోపలకు వెళ్ళేముందు అతడు సోదరీలతో ఈ విధంగా చెప్పాడు, “బాబాకు చెప్పండి, నేను వారిని కలవడానికి చాలా ఉత్సుకతతో ఉన్నానని. కానీ ఇప్పుడు కలవడం కుదరదు. వీలైనంత త్వరగా తప్పకుండా వారినొకసారి కలుస్తాను.”

కానీ అతని శిష్యులు మరియు యాంటీ పార్టీవారు మళ్లీ అతనికి లేనిపోనివన్నీ వినిపించారు. సాధువును మళ్ళీ ఓం మండలి గురించి పాత అపోహలు చుట్టుముట్టాయి. అతనికి వినిపించిన నిందలనే నిజాలుగా అతను మళ్ళీ భావించసాగాడు. బ్రహ్మకుమారీల సమక్షంలో అతడు పొందిన ఆనందాన్ని, వారి ఉన్నత లక్ష్యాలను, విలక్షణమైన జ్ఞానాన్ని మర్చిపోయాడు.

వాస్వాని సాధువు మంచి వ్యక్తియే కానీ బలహీనమైన వ్యక్తిత్వం ఉన్నవాడు. అతని స్నేహితులు అతడిని ఎంతగా రెచ్చగొట్టారంటే మరుసటి వారం ఓం మండలికి విరుద్ధంగా జరుగుతున్న ధర్నాలో వాస్వాని కూడా పాల్గొన్నాడు. ఓం నివాస్ బయట వేలమంది గుమిగూడారు. వారందరూ ఆస్తులను ధ్వంసం చేస్తూ, తోటను చిందరవందరగా చేస్తూ, కిటికీలను పగలగొడ్తూ, ఇంటి గోడను పడగొట్టే యంత్రంతో గోడను పగులగొట్టారు. ఆ గోడ పగులునుండి లోపలకు చొచ్చుకుని వచ్చారు. వెంటనే పోలీసులు వచ్చి వారిని పారద్రోలారు. చాలామందిని అరెస్టు చేసారు. అందులో వాస్వాని కూడా ఉన్నాడు. పోలీసులు అతడిని పోలీసు వ్యానులో తీసుకువెళ్ళారు.

# ధర్మాసనము

వాస్వాని శ్రీకృష్ణుని పరమ భక్తుడు. గీతపై అతనికి ఎనలేని శ్రద్ధ ఉండేది. ప్రజలు అతడికి తప్పుడు అభిప్రాయాలను కలుగజేసి రెచ్చగొట్టారు లేదంటే అతడు ఒక్కసారి బాబాను కలిసి, బాబా చెప్పే జ్ఞానాన్ని విని ఉంటే ఎప్పుడూ పికెటింగ్‌లో సాయపడేవాడు కాదు. బ్రహ్మాబాబా చేస్తున్న కార్యాన్ని చూసి అమితానందాన్ని పొందేవాడు.

కానీ ఇప్పుడు ధర్నా మరియు అరెస్టుల కారణంగా వాతావరణం మరింత వేడెక్కింది. ఇదే అదునుగా చేసుకుని 'యాంటీ పార్టీ' వారు ప్రతీకార జ్వాలలను మరింత రాజుకునేలా చేసారు.

ఓం మండలిపై నిషేధాన్ని అమలు చేయాలని సింధ్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు. ప్రభుత్వ మండలిలోని హిందూ మంత్రులు వారి విరోధాన్ని తెలుపుతూ నిషేధాజ్ఞలను ప్రకటించాలని, లేని పక్షంలో రాజీనామాలు చేస్తామని బెదిరించారు. ఒకవేళ వారు రాజీనామాలు చేస్తే ప్రభుత్వమే పడిపోతుంది.

కానీ అప్పటి ముఖ్యమంత్రి ఎంతో ధైర్యంగా ఈ పరిస్థితిని గురించి విధానసభలో మాట్లాడారు. వారు చాలా సత్యపూర్వకముగా ఈ విషయాన్ని అక్కడ ప్రస్తావించారు, "మంత్రిమండలిలోని హిందూ సభ్యులు రాజీనామాలు చేస్తామని నోటీసు ఇచ్చారు కానీ మేము ఇటువంటి బెదిరింపులకు లొంగేది లేదు. ప్రతి ఒక్కరికీ తమ ధార్మిక సూత్రముల అనుసారంగా సత్సంగము లేక సాధన చేసేందుకు చట్టపరమైన అధికారము ఉంది. ఏ చట్టం ఆధారంతో ఓం మండలిపై నిషేధాన్ని విధించాలి?

వారు హజరత్ మహమ్మద్ ఉదాహరణను ఇస్తూ మరియు ఇతర సమాజోద్ధారకులను గుర్తు చేస్తూ ఈ విధంగా చెప్పారు, "గొప్ప గొప్ప ఆధ్యాత్మిక ఉద్యమాలన్నీ ప్రారంభంలో అతి కొద్దిమందితో మొదలైనవే. ఆ గొప్ప నేతలను తరచూ అణగద్రొక్కే ప్రయత్నమే జరిగింది. ఇప్పుడు బాబా పరిస్థితి కూడా ఇదే. బాబాకు ఎన్ని పరిస్థితులు వచ్చినాకానీ వాటన్నింటినీ వారు ప్రశాంతంగా ఎదుర్కొన్నారు. ఒకవేళ నిషేధించాల్సి వస్తే ద్వేషపూరితమైన యాంటీ ఓం మండలి కమిటీని నిషేధించాలి. ఈ విధంగా, 24 మార్చి, 1939న ముఖ్యమంత్రి సింధ్ విధానసభలో తమ భాషణను వినిపించారు.

కానీ, ఈ విషయం కారణంగా తన మంత్రిమండలి విచ్ఛిన్నమవుతుందన్న భయము అతడిని ఊగిసలాడేలా చేసింది. వారి మాటలకు విలువ ఇవ్వవలసి వచ్చింది. సత్యశోధనకు ఒక ధర్మాసనాన్ని నియమించారు.

ధర్మాసనంలోని సభ్యులను వెల్లడించిన తర్వాత ఈ ప్రపంచంలో న్యాయం ఎంతగా కొరవడిందో బోధపడింది. 'యాంటీ పార్టీ' సభ్యుల స్నేహితులే ఆ ధర్మాసనంలో ఉన్నారు.

సింధ్ అబ్జర్వర్ అనే సమాచార పత్రికకు ఛైర్మన్‌గా ఉంటూ ఆరంభంనుండి 'యాంటీ పార్టీ'కి మద్దతునిస్తున్న వ్యక్తి ఈ ధర్మాసనంలో ఉన్నాడు. ఇతరులు కూడా 'యాంటీ పార్టీ' పక్షపాతులే.

ధర్మాసనంలో నిష్పక్షమైనవారిని నియమించాలని బాబా పిల్లలు విన్నవించుకున్నారు. పికెటింగ్ కారణంగా గంభీరంగా తయారైన వాతావరణాన్ని సరి చెయ్యడానికి ఓం మండలివారిపై విధించిన 144 సెక్షన్‌ను ఎత్తివేయాలని, తద్వారా ఓం మండలి సభ్యులు మునుపటివలె కలుసుకోగలిగే వెసులుబాటును కలిగించమని కోరారు.

ఓం మండలిలోని సోదరీలకు చట్టపరమైన అంశాలు తెలియనందున ప్రాథమిక విచారణ జరిగే సమయంలో ధర్మాసనం ముందు ఓం మండలి తరఫున ఒక న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే అనుమతిని కోరారు. సాక్ష్యులను పిలిచి విచారించే అధికారం ధర్మాసనానికి ఉండాలని, ధర్మాసనం యొక్క కార్య పద్ధతులను ముందుగానే తెలిపి ఏ విషయాలపైన వాదోపవాదాలు జరుగుతాయో వాటి గురించి ముందుగానే ఓం మండలికి తెలపాలని కోరారు.

కానీ ఓం మండలి విన్నవించుకున్న ఏ ఒక్క విషయానికీ ప్రభుత్వం స్పందించలేదు. అన్నిటినీ తిరస్కరించింది. సోదరీలకు తమ తరఫున న్యాయవాదిని ఏర్పాటు చేసునేందుకు అనుమతిని ఇవ్వలేదు. ఓం మండలి సభ్యులు స్వతంత్రంగా

కలుసుకునే ఉచిత వాతావరణాన్ని కలిపించలేదు. ధర్మాసనం సమావేశమైనప్పుడు ఓం మండలి సభ్యులు అక్కడ ఉండడానికి తిరస్కరించారు.

ఓం మండలిలోని అనేక సభ్యులు ధర్మాసనానికి వ్యక్తిగతంగా ఉత్తరాలు వ్రాసారు. వారు ధర్మాసనం ఎదుట ఓం మండలిలో జరిగే కార్యకలాపాలను వివరించదల్చుకున్నామని చెప్పారు. వారందరూ గొప్ప కుటుంబాలనుంచి వచ్చినవారైనాకానీ వారెవ్వరినీ ధర్మాసనం సాక్ష్యులుగా పిలవలేదు.

చివరకు, ఓం మండలి తరఫు నుండి ఏమీ వినకుండానే, ఓం మండలికి మద్దతునిచ్చే వారి సాక్ష్యాలను పరిగణలోకి తీసుకోకుండానే ధర్మాసనం ఏక పక్ష నిర్ణయాన్ని వినిపించింది: ఓం మండలి సభ్యులు ఇకమీదట కలిసి ఉండకూడదు. ఎట్టి పరిస్థితిలోనూ ఓం మండలి సభ్యులు విడిపోవాలని తీర్పు చెప్పింది.

ఇటువంటి వింత నిర్ణయంతో ఎంతో అలజడి చెలరేగింది. ఇటువంటి పరిణామాన్ని ప్రభుత్వం ఊహించలేదు. ఓం మండలిలోని వారంతా ఒక పెద్ద పరివారంలా కలిసిమెలసి ఉండటం ఒక విషయం. ఇంతకుమించి మరో విషయమేమిటంటే ఓం మండలిలోని వారంతా చాలావరకు కుటుంబ సభ్యులే. భార్య-భర్త, కూతురు-కొడుకు మొదలైన కుటుంబ సభ్యులు ఓం మండలిలో ఉన్నారు. ఎన్నో కుటుంబాలు ప్రతిరోజూ సత్సంగానికి వచ్చేవి. మరి ఈ పరివారాలు ఇప్పుడు విడిపోవాలా? భార్య తన భర్తనుండి విడిపోవాలా? ఒక కొడుకు తన తల్లిదండ్రులకు దూరంగా పెరగాలా? ఇటువంటి కనీస మానవీయ వాస్తవాలను కూడా ధర్మాసనం దృష్టిలో పెట్టుకోలేదు. ఓం మండలి సభ్యులకు ఉండవలసిన ప్రాథమిక హక్కులను హరించే విధంగా ధర్మాసన తీర్పు పక్షపాత వైఖరితో ఉంది.

వార్తాపత్రికలవారు కూడా ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పును పరుషంగా విమర్శించారు. విద్యావంతులు ఈ అన్యాయాన్ని ఖండిస్తూ సంపాదకులకు ఉత్తరాలు వ్రాసారు. "ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన ధర్మ మార్గాన్ని ఎంచుకునే హక్కు ఉంది" అన్న మాటలతో ఒక స్థానిక పెద్ద మనిషి వ్రాసిన ఉత్తరం మొదలైంది. ఆ ఉత్తరాన్ని గవర్నర్‌కు పంపారు. ఏ చట్టం కింద అయితే ఓం మండలి సభ్యులు విడిపోవాలని చెప్పారో ఆ చట్టం నిజానికి ఓం మండలివంటి ఆధ్యాత్మిక సంస్థకు వర్తించదు, అది కేవలం ఉపద్రవం సృష్టించే పార్టీలకు మాత్రమే వర్తిస్తుంది. నిజానికి కూడా, ఓం మండలి సభ్యులు శాంతి కాముకులు, ధర్మ-సమాజ ఉద్ధారకులు. "వారిని ప్రోత్సహించాలే కానీ విడదీయకూడదు" అన్న వాక్యాలతో ఆ ఉత్తరం ముగిసింది. కానీ ఈ ప్రపంచంలో న్యాయం ఎక్కడుంది? తమ మంత్రి పదవిని కాపాడుకునే ప్రయత్నంలో మంత్రులు హై కోర్టు అభిప్రాయాన్ని కూడా పెడచెవిన పెట్టి సత్సంగాన్ని అణచివేసే ప్రయత్నం చేసారు.

ధర్మాసనం చేపట్టిన వాదనాంశాలను ఓం మండలికి చెప్పలేదు. వాదోపవాదాల వివరాలుగానీ, దాని లిఖితపూర్వక సారాన్నిగానీ అందించలేదు. ఎవరిని సాక్ష్యులుగా పిలిచారో, వారిచ్చిన సాక్ష్యాలేమిటో కూడా ఓం మండలికి తెలియదు. ఇటువంటి తీర్పును ఇవ్వడానికిగల కారణాలనుగానీ, విచారణ కోసం తీసుకున్న ఆధారాలు, ఋజువులుగానీ తెలియవు. క్లుప్తంగా చెప్పాలంటే, న్యాయ విచారణ హర్షనీయంగా లేదు.

ఈవిధమైన వ్యతిరేకత ఉన్నప్పటికీ పరిస్థితి చక్కబడసాగింది. 'యాంటీ పార్టీ' వారి ప్రయత్నాలను నెమ్మదిపరచడానికి ముఖ్యమంత్రి తమవంతు కృషి చేసారు. ఓం మండలివారు తమ ఐదు బంగళాలను ఉపయోగించుకోవచ్చునని, సాధారణతను పాటిస్తే వారు తమ సత్సంగాన్ని నడిపించుకోవచ్చునని చెప్పారు. ఇలా దగ్గర దగ్గరగా ఉన్న బంగళాలలో ఓం మండలివారు వేరువేరుగా ఉంటూ ఉంటే కొద్ది రోజుల్లో ఈ గొడవలన్నీ సద్దుమణుగుతాయని నచ్చ చెప్పారు. ఓం మండలికి విరుద్ధంగా ఏ చర్యను తీసుకునే ఉద్దేశ్యము ప్రభుత్వానికి లేదని స్పష్టం చేసారు.

తండ్రి కర్తవ్యాలు తన పిల్లలను సంతోషపెట్టేవిగానే ఉంటాయి. మరోసారి పిల్లలు తమ తమ కార్యాలలో నిమగ్నమైపోయారు. శివబాబా, తాను మాధ్యమంగా ఎంచుకున్న బ్రహ్మ శరీరంలోకి ప్రతిరోజూ వచ్చి జ్ఞానాన్ని వినిపిస్తున్నారు. ప్రతి ఒక్కటీ సజావుగా కొనసాగుతూ ఉంది. మునుపటివలె ఉదయాన్నే బస్సు పిల్లలను క్లిఫ్టన్ బీచ్‌కు తీసుకువెళ్తుంది.

హైదరాబాద్ నుండి కరాచీకి వచ్చినాగానీ 'యాంటీ పార్టీ' వారు చల్లబడలేదు. ఓం మండలిని నాశనం చెయ్యడానికి చెయ్యగలిగిన సర్వ ప్రయత్నాలను ఇంకా చేస్తూనే ఉన్నారు.

ధర్మాసనం ద్వారా వారు చెయ్యగలిగినదంతా చేసారు, అయినా పని జరగలేదు. వారి శక్తి క్షీణిస్తుంది. జ్ఞానము, పవిత్రత మరియు ప్రపంచ ఉద్ధరణ కోసం చేసే సేవా కార్యక్రమాలపట్ల బ్రహ్మాబాబా పిల్లలలో నిండి ఉన్న అచంచల ప్రేమను వారు ఏమీ చెయ్యలేకపోయారు. విరోధులు విసుగుచెంది ఒక్కొక్కరుగా హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

వారి సమయాన్ని, ధనాన్ని అనవసరంగా వెచ్చించడం తప్ప వారు సాధించినదేమీ లేదు. కానీ, వారనుకున్నారు, ఏదో ఒకరోజు బాబా డబ్బులు పూర్తిగా ఖర్చయిపోతాయి కదా. "అతను ఈ మహిళలను, పిల్లలను పోషించడానికి ఖర్చు పెడుతూనే ఉండలేడు కదా", అంటూ ఒకరికొకరు చర్చించుకున్నారు, "అప్పుడు వీరంతా సిగ్గులేకుండా ఇళ్ళకు తిరిగివస్తారులే" అని అనుకున్నారు. దీనినిబట్టి వారిలోని అజ్ఞానం ఇంకా అలాగే ఉందని అర్థమవుతుంది. ఓం మండలిని స్థాపించినది, పోషిస్తున్నది ఒక మానవమాత్రుడు కాదు అని వారికి అర్థం కావడం లేదు. మిగతా వాటిలా ఇది కూడా ఒక భక్తి మండలి లేక ధార్మిక సంస్థ కాదు. ఇది భగవంతుని సొంత విశ్వ విద్యాలయము, స్వయంగా పరమపిత పరమాత్మ అయిన భగవంతుడే దీనిని స్థాపించారు.

ఏదో ఒక రోజు ఓం మండలి ఆస్తులు కరిగిపోతాయి, ఇప్పుడు కాకపోయినా కొంత సమయం తర్వాత అయినా అది జరిగి తీరుతుంది, మేము చెయ్యవలసినదంతా చేసాము అన్న అభిప్రాయంలోనే విరోధులు ఉన్నారు. ఓం మండలికి ఎవ్వరూ దానం చెయ్యకూడదు అని వార్తాపత్రికలో వేయించారు. ఓం మండలి ఎప్పుడూ ఎవ్వరినుండి ఏమీ అడగలేదని ముందుగా వారు అర్థం చేసుకోవాలి. భగవంతుని కార్యం యోగబలం మరియు విశ్వాసము ఆధారంతో జరుగుతుంది. ఆర్థిక బహిష్కరణ దానిపై ఎలా ప్రభావం చూపగలదు? ఓం మండలి కార్యకలాపాలు ఇప్పుడు ప్రశాంతంగా జరుగుతున్నాయి.

ఈలోపల, యుక్త వయసుకు చేరుకోని కన్యలను కోర్టు ఆర్డరు చేత లేక బలవంతంగా ఏ తల్లిదండ్రులైతే తీసుకువెళ్ళారో, ఆ తల్లిదండ్రుల కాఠిన్యం కరిగింది. మాంసం తినడము, ఖరీదైన వస్త్రాలను ధరించడము, సినిమాలు, వివాహము వంటి విషయాలలో ఈ కన్యలను ఏ మాత్రం ఒప్పించలేకపోతున్నామని వారికి అర్థమయింది. కన్యలు భగవంతుని స్మృతిలో తమ జీవితాన్ని కొనసాగిస్తూ అపవిత్ర, వ్యర్థ విషయాలలో పాలుపంచుకునేవారు కాదు.

చివరకు, ప్రేమ గెలిచింది. తల్లిదండ్రులు ఆత్మ పరిశీలన చేసుకున్నారు – ఆధ్యాత్మిక మార్గంలోనే తమ జీవితాలను గడపాలని నిర్ణయించుకున్న మా పిల్లలను ఉన్నతమైన ఆధ్యాత్మిక శిక్షణనుండి ఎందుకు వంచితం చెయ్యాలి? క్రమక్రమంగా, వారి ప్లిలలకు వారు ఓం మండలికి వెళ్ళవచ్చునని అనుమతిని ఇవ్వసాగారు.

బ్రహ్మాబాబా వారందరికీ మనస్ఫూర్తిగా స్వాగతం పలికి మునుపటివలె ఎటువంటి రుసుము లేకుండా వారిని చూసుకోసాగారు. ఎందుకంటే, బ్రహ్మాబాబా వీరి తండ్రి కదా! అదృష్టవంతులైన ఈ పిల్లలకు ముగ్గురు తండ్రులున్నారు – శారీరిక పిత, ఆధ్యాత్మిక పిత (బ్రహ్మాబాబా) మరియు పరమపిత (శివబాబా).

కానీ, ఇప్పటికీ, 'యాంటీ పార్టీ' వారు తమ విరోధాన్ని తెలుపుతూనే ఉన్నారు. ఒక రోజు, ఓం మండలిపై ఒత్తిడిని తీసుకువస్తూ ధర్నాను చేపట్టారు. బ్రహ్మాబాబా వద్ద ఉంటున్న కన్యల తల్లుల వద్దకు వెళ్ళి వారికి లేనిపోని మాయమాటలను వినిపించారు. ఇది విన్న అమాయక తల్లులు తమ కూతుర్ల భవిష్యత్తు ఏమవుతుందోనని 'యాంటీ పార్టీ'తో చేతులు కలిపారు. కల్లబొల్లి మాటలు నమ్మనివారిని బెదిరించారు – మేము చెప్పినట్లుగా చెయ్యకపోతే కుల బహిష్కరణ, శారీరక హింస లేక వ్యాపారాన్ని దెబ్బతీయడం వంటివి జరుగుతాయన్నారు.

మీ పిల్లలను మీరు తిరిగి మీ వద్దకు పిలవండి అని తల్లులకు చెప్పారు. "కానీ మేము మా అనుమతిని పత్రము ద్వారా ముందుగానే తెలిపి ఉన్నాము కదా, వారు ఆ ఉత్తరాలను కోర్టులో ప్రవేశపెట్టవచ్చు కదా" అని మాతలు అన్నారు.

"యాంటీ పార్టీ వారు దీనిని గురించి ఆలోచించారు. మా వద్ద మరో ఆలోచన ఉంది. కానీ మేము చెప్పినట్లు

చెయ్యకపోతే మీరు చాలా బాధపడవలసి ఉంటుంది" అన్నారు. బెదిరింపులు పని చేసాయి.

కొద్ది రోజుల్లోనే ఆ మాతలను 'యాంటీ పార్టీ' వారు కరాచీలో సంపన్నుడు, ప్రసిద్ధుడు అయిన శివ రత్న మెహతాగారి ఇంటిముందు నిలిపారు. అతని ఇంటి ముందు కూర్చుని నిరాహార దీక్షను ప్రారంభించాలని, అతడు తమ కన్యలను రక్షిస్తానని మాట ఇచ్చే వరకు ఈ దీక్షను కొనసాగించమని చెప్పారు.

తన ఇంటి ముందు జరుగుతున్న ఈ విషయాన్ని గమనించిన శివ రత్నగారు ఆ మాతలను లోపలకు పిలిపించి వారి కథంతా విన్నాడు. ఆ మాతలు ఎంతో వినయంగా, యాంటీ పార్టీ వారు చెప్పినట్లుగానే తమ కథనంతా చెప్పారు. ఆ మాతలలోనే ఉన్న ఒక యాంటీ పార్టీ సభ్యురాలు ఓం మండలి గురించి అవాస్తవ విషయాలను వినిపించింది. ఎలా అయినా శివరత్నగారు తమ పిల్లలను అక్కడినుండి విడిపించి తమకు అప్పగించాలని వేడుకున్నారు. మరి శివ రత్నగారు బాబాను పిలిపించి కన్యలను వారి తల్లులతో పంపుతారా?

శివరత్నగారు మాతలను నమ్మారు. అతడు అప్పుడే, ఆ క్షణమే బాబాను పిలిపించాడు. బాబా ఎంతో స్నేహంగా వ్యవహరించి ఇప్పుడే నేను ఆ పిల్లలను పంపించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

దాదీ మనోహర్ ఇంద్ర గారు వారి అనుభవాలను ఈ విధంగా పంచుకుంటున్నారు, "బాబా చెప్పారు కనుక మేము వెళ్ళాము. శివరత్నగారి ఇల్లు ఒక పెద్ద మహలులా ఉంది. అతని కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి. అతడు మమ్మల్ని ఏమీ ప్రశ్నించకుండా తమ తల్లులతో కలిసి ఇళ్ళకు వెళ్ళాలని ఆజ్ఞాపించాడు."

హాలులో ఇతరులు కూడా ఉన్న సమయంలో శివరత్నగారు చిన్న పిల్లలను చూపిస్తూ, "ఈ పిల్లలు వారి తల్లిదండ్రులను ఎంతో బాధపెట్టారు" అని వారితో అన్నారు.

దాదీ మనోహర్ ఇంద్ర ఇలా గుర్తు చేసుకుంటున్నారు, "ఒక రాక్షసుడు మాపై రాళ్ళను విసురుతున్నట్లుగా మాకనిపించింది. వారి కోపాన్ని చూసి మేము ఏమీ అనకుండా కారులో కూర్చున్నాము. కానీ ఆ సమయంలో మాకు మా అంతరాత్మ నుండి దివ్యమైన పలుకులు వినిపించాయి, "హే శక్తుల్లారా! వీరిని చూసి భయపడకండి. వీరికి పరమాత్మ జ్ఞానాన్ని అందించండి. వీరిని ఉద్ధరించడానికి నిమిత్తమైనవారు మీరు."

వెంటనే ఆ కన్యలు తిరిగి ఇంటిలోపలకు వెళ్ళి శివరత్నాగారు ముందుకు వెళ్ళి నిల్చున్నారు. "మేము మీతో మాట్లాడాలనుకుంటున్నాము" అని చిన్నారి బి.కె.మనోహర్ ఇంద్ర అన్నారు.

"ఏం మాట్లాడాలనుకుంటున్నారు" అని విసురుగా అడిగారు.

ఆ చిన్నారి ఈ విధంగా చెప్పింది, "బాబాజీ, మీరు మమ్మల్ని ఎక్కడకు పంపిస్తున్నారో మీకు తెలుసా? ఓం మండలిలో మేము ఎటువంటి జీవితాన్ని గడుపుతున్నామో, మేము మా ఇళ్ళకు ఎందుకు వెళ్ళదల్చుకోలేదో మీకు వివరించదల్చాము. మేము మిమ్మల్ని ఒకే విషయమును అడుగుతాము, మీరు దానిని తీర్చాలి. మేము వెండి, బంగారం, నగలు, ప్రపంచ వైభవాలను వేటినీ మీనుండి ఆశించడంలేదు. మేము పవిత్రమైన బ్రహ్మచర్య జీవితాన్ని గడపాలని ఆశిస్తున్నాము. మా బంధువులు మమ్మల్ని సత్సంగానికి వెళ్ళనివ్వకుండా అడ్డుకుంటారు. ఆధ్యాత్మిక మూల సారమైన పవిత్రతలోనే వారు అభ్యంతరం చెప్తారు. మేము జీవితంలో తీసుకున్న ఇటువంటి ఉన్నత లక్ష్యాలను సాధించడానికి వారు ప్రోత్సహించకపోగా ప్రతి అడుగులోనూ వారు మమ్మల్ని వేధిస్తూనే వచ్చారు."

"ఒకసారి వారు మమ్మల్ని ఓం మండలినుండి తీసుకువెళ్ళాక మమ్మల్ని నిర్దయగా కొడ్తారు. ఇంట్లోని ఇతర పెద్దవారు కూడా ఇందులో చేరుతారు. ఇలా మునుపు ఎన్నోసార్లు జరిగింది. అప్పుడు మీరు సహించగలరా? మీకు మేము ఏ హానీ కలిగించలేదు బాబాజీ. వీరు మాపై నిందలు మోపి అశుద్ధమైన తమో భోజనాన్ని మా ముఖాన కొడ్తారు. బలవంతంగా మాచేత సినిమాలను చూసేలా చేస్తారు. మా మనసులను పాడు చేస్తారు. మేము ప్రశాంతంగా భగవంతుని స్మృతిలో కూర్చుంటే వెనుకనుండి తోస్తారు, మా సంబంధీకులు మా జుట్టు పట్టుకు ఈడుస్తారు."

ఇదంతా విన్న మెహతా ఆలోచించసాగాడు. మెల్లని, మృదువైన స్వరముతో ఇలా అడిగాడు, “సరే, నేను మిమ్మల్ని ఒకటి అడుగుతాను, అందుకు జవాబు చెప్పండి. మీరు వివాహమును తిరస్కరిస్తున్నారని విన్నాను, ఇది నిజమేనా?”

సోదరి మనోహర్ ఇంద్రగారు చిరు మందహాసంతో ఇలా చెప్పారు, “బాబాజీ, అటువంటిదేమీ లేదు. మేము వివాహమును వద్దు అనలేదు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడంతటి వాళ్ళే వివాహము చేసుకున్నారు. ‘విల్లును విరిచినవాడు’ అనగా దేహాభిమానాన్ని తెంచి ఆత్మ అవగాహనతో ఉన్నవాడు, ఇంద్రియాలపై నిగ్రహం ఉన్నవాడు మాకు కావాలి.”

ఇటువంటి జవాబును విని మెహతాజీ నిశ్చేష్టుడయ్యాడు. “ఏమి విల్లు? ఆత్మ సాక్షాత్కార విల్లా” అని అడిగాడు.

“అవునండీ” అని తల ఊపింది.

ఇది విన్న మెహతాజీ మొఖము సంతోషంతో వెలిగిపోయింది. భగవంతునిపై వీరికున్న భక్తిశ్రద్ధలు అతడ్ని మంత్రముగ్ధుడిని చేసాయి. వీరు చేసేది ఆటలు లేక బాల్యపు చిలిపి చేష్ఠలు కాదు. మానవుడు కోరుకునే అత్యుత్తమ జీవితాన్ని వీరు గడుపుతున్నారు.

“ఇప్పుడు నాకర్థమయింది”, అంటూ మోహతాజీ ఇలా అన్నాడు, “మీ లక్ష్యము ఎంతో గొప్పగా ఉంది. అది నెరవేర్చుకోవాలన్న మీ అభిలాష ఎంతో ప్రశంసనీయం. మీవంటి ఉన్నత భావాలు, గొప్ప వ్యక్తిత్వం కలిగిన పిల్లలను కలుసుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. మీవంటి వారిపై ఇంతటి అత్యాచారమా? ఇప్పుడు నాకు నిజాలు అర్థమయ్యాయి. మీరు నిర్భయంగా ఉండండి.”

మెహతాజీ మాతలవైపుకు తిరిగి ఇలా అన్నాడు, “ఇటువంటి యోగి, తపస్వి పిల్లలున్న మీరు చాలా అదృష్టవంతులు. మీరు నిజంగా ఇటువంటి పవిత్ర ఆత్మలను కొడ్తారా? వారికి ఇష్టం లేకపోయినా వారితో అశుద్ధ భోజనాన్ని బలవంతంగా తినిపిస్తారా? వీరు పవిత్రమైన కన్యలు. కానీ వారికి ఏ హాని జరగకూడదు. మీరు వీరిని మీతో తీసుకువెళ్ళవచ్చు, కానీ వారు ఎప్పుడు సత్సంగానికి వెళ్ళాలనుకుంటే అప్పుడు మీరు అందుకు అనుమతినివ్వాలి.”

అక్కడ మాతల మనసులలో భయం మొదలయింది. వీరు ఇదివరకే అనుమతి పత్రాన్ని వ్రాసిచ్చి ఉన్నారని పిల్లలు ఎక్కడ చెప్పేస్తారో అని భయపడ్డారు. ఎందుకంటే ఈ పిల్లలు తమ అనుమతి లేకుండా ఓం మండలికి పారిపోయి వచ్చారు అని మెహతాజీకు అబద్ధాలు చెప్పారు. కానీ కన్యలు మౌనాన్ని వహించారు. వారు వాస్తవాన్ని ప్రస్తావించలేదు.

యుక్త వయసున్న ఈ యోగులు వారి  వారి ఇళ్ళకు, కరాచీ నుండి తిరుగు ప్రయాణమయ్యారు. కానీ పరిస్థితులు మునుపటిలా లేవు. ఇప్పుడు ఈ కన్యలలో ఎంతో యోగశక్తి నిండి ఉంది. వారు, ఆహార నియమాలు మరియు ఇతర నియమాలను పాటిస్తూ బంధుమిత్రులకు జ్ఞానాన్ని వినిపిస్తూ సమయాన్ని గడిపేవారు. రాజయోగములో క్రొత్త పద్ధతిని నేర్చుకోవడమేకాక అందులో అత్యద్భుతమైన అనుభవాలను కూడా వీరు చవిచూసారు.

ఇంటి పనులలో కూడా ఈ కన్యలు పూర్తిగా సహకరించేవారు. ఇంట్లోనివారు ఏ విషయంలోనూ ఫిర్యాదు చేసే అవకాశమును ఇవ్వకుండా ఎంతో చక్కగా ఉన్నారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరూ వారిని చూసి ఆశ్చర్యపోయారు. “చివరకు, వారు సంతోషంతో మాకు సెలవు ఇచ్చారు. మీరు చక్కగా బ్రహ్మవిద్యను, అవినాశి జ్ఞానమును ప్రాప్తించుకుని మీ భవిష్యత్తును ఉజ్జ్వలముగా చేసుకోండి అని దీవించారు.” ఈ కన్యలు తమ తల్లిదండ్రుల శుభాశీస్సులను స్వీకరించి తిరిగి కరాచీలోని బోర్డింగ్‌లో చేరారు.

– – –

అపోహలు, పుకార్ల కారణంగా ఓం మండలిపై ప్రజలకు కలిగిన తప్పుడు అభిప్రాయాన్ని తొలగించి, ప్రజలలో చైతన్యాన్ని తీసుకురావాలని, ధర్మాసన ఘట్టంతో సహా అన్ని ముఖ్య అంశాలను పొందుపరుస్తూ “ఈజ్ దిస్ జస్టిస్” (ఇది న్యాయమేనా!) అన్న పేరుతో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. అందులో ముఖ్య ఘట్టాలు తిథి తారీఖులతో సహా వ్రాసారు.

ఓం మండలిలోని ముఖ్యమైన జ్ఞానోపదేశాలు మాకు తెలియవు అనే అవకాశాన్ని ఎవ్వరికీ ఇవ్వకుండా ఉండేందుకు ఓం మండలిలో బోధించే ముఖ్యమైన జ్ఞాన అంశాలను కూడా ఆ పుస్తకంలో ప్రచురించారు.

ఇతర ఆధ్యాత్మిక సాహిత్యంతోపాటు ఈ పుస్తకాన్ని కూడా వందలాది విశిష్ట వ్యక్తులకు అందేట్లుగా చేసారు. పుకార్లను నమ్మి ఏక పక్షంతో ఒక నిర్ణయానికి రావద్దని అందులో వ్రాసి ఉంది. కానీ మనిషి మనసులో పేరుకుపోయిన అభిప్రాయాలను మార్చడం అంత సులువైన పని కాదు. అందునా, భయాలు, మూఢ నమ్మకాలు రాజ్యమేలుతున్న సమయంలో యాంటీ పార్టీ వారు అసత్యాలతో వాతావరణాన్ని కలుషితం చేస్తున్న సమయంలో ఇది మరింత కష్టతరమైన పనే.

భగవద్గీతలో చెప్పినట్లుగా :

*"యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారతః*
*అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్"*

ఈ సృష్టి నాటకరంగంపైకి భగవంతుడు పిలిచినంతనే అవతరించి తన పిల్లలకు తమ ఉనికిని, తన లక్ష్యాన్ని తెలియజేస్తున్నారు, కానీ ఇందుకు వారు ఒక సాధారణ శరీరాన్ని మాధ్యమంగా ఎంచుకున్నారు. కానీ ఇందులో ఎటువంటి మాయలు మంత్రాలు లేని కారణంగా కోట్లలో అతి కొద్దిమంది మాత్రమే భగవంతుడిని యథార్థంగా గుర్తించారు. కానీ అంతిమ విజయం సత్యమే పొందుతుంది. భగవంతుని వాక్కులు, భగవంతుని కార్యము సమయం గడిచేకొద్దీ అందరికీ స్పష్టమవుతాయి.

# విశ్వములోనే అత్యుత్తమ విద్య

పరిస్థితులన్నీ చక్కబడుతున్న కొద్దీ ఈ ఆధ్యాత్మిక విశ్వ విద్యాలయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. పెరుగుతున్న బ్రాహ్మణ పరివారానికి బ్రహ్మాబాబా ఆత్మ జ్ఞానాన్ని బోధించేవారు. నిశ్చయబుద్ధి ఉన్న పిల్లలు తమ యోగశక్తితో అనూహ్యంగా ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నతిని పొందుతూ ప్రతి పరీక్ష, ప్రతి పరిస్థితినుండి మానసిక సంతులతను పొందుతూ వచ్చారు.

"మీరు మరుజీవ జన్మను పొందారు," అంటూ మాకు బ్రహ్మాబాబా బోధించేవారు, "ఆత్మ ఉన్నతికి ఇది తొలి మెట్టు. మీ లౌకిక బంధువులు మిమ్మల్ని పూర్తిగా మర్చిపోయారు. వారికి సంబంధించినంత వరకు మీరు మరణించారు. ఆత్మ క్రొత్త జన్మ తీసుకున్నప్పుడు తన పాత బంధాలను గుర్తు చేసుకోదు. అదే విధంగా, మీరు ఈ పాత శరీరంలోనే ఉన్నప్పటికీ మనసు ద్వారా మీరు భౌతిక భవబంధాలతో మరణించినట్లే. ఇక్కడ మీరు ఒక క్రొత్త జన్మను పొందారు."

"కనుక, పాత బంధాలను గుర్తు చేసుకోవద్దు. ఇప్పుడు భగవంతుని శరణులో ఉన్నారు. మీరు భగవంతుని డైరెక్టు సంతానము. కనుక వారిని గుర్తించండి. మీరు ద్విజులు. మీరు బ్రహ్మ ముఖ వంశీయులు, బ్రాహ్మణులు. కనుక, మీ బుద్ధి భగవంతునియందు జోడింపబడి ఉండాలి. మోహానికి వశమైతే మీ జన్మసిద్ధ అధికారాన్ని పొందలేరు, జీవన్ముక్తిని కూడా పొందలేరు."

తల్లిదండ్రులు తమ సొంత పిల్లలను కూడా ఆత్మ రూపంలో ఉన్న సోదరసోదరీలుగా చూడటం ప్రారంభించారు. పిల్లలు తమ శారీరక తల్లిదండ్రులపై ఉన్న మోహాన్ని నశింపజేసుకుంటూ ఒక్క శివబాబా వైపే మనసును నిలిపారు. పురుషులు స్త్రీలను మహిళలుగా కాక ఆత్మ రూపంలో ఉన్న పురుషునిగా చూసారు. ఎందుకంటే నిజానికి మనమందరమూ ఆత్మలమే, ఒక ఆత్మ ఒక రకమైన వస్త్రాన్ని ధరిస్తే మరొక ఆత్మ మరో రకమైన వస్త్రాన్ని ధరిస్తుంది. (ఒక జన్మలో మీరు పురుషునిగా ఉండవచ్చు, మరో జన్మలో మీరు స్త్రీగా ఉండవచ్చు). ఇటువంటి జ్ఞానముతో సోదర భావం కలగడంతో పాటు ఇంద్రియ ఆకర్షణలపై నిగ్రహాన్ని సాధించవచ్చు, అప్పుడే మనసు ప్రశాంతంగా భగవంతుని స్మరణలో నిమగ్నం కాగలదు.

కొంతమందికి ఈ అభ్యాసము కొంత కష్టంగా ఉండేది. అటువంటివారికి కూడా బాబా ఇచ్చే పాలన ఎంతో నమ్మకాన్ని కలిగించేదిగా ఉండేది. బాబా ఈ విధంగా చెప్పేవారు, "పిల్లలూ! మొదటగా మీరు మీ ఇంద్రియాలపై విజయాన్ని సాధించండి. చాలాసార్లు మనసులో ఉత్పన్నమయ్యే చెడు, వ్యర్థ ఆలోచనలకు మనలోని పాత వికార సంస్కారాలే కారణము. కానీ ఇప్పటినుండి ఎటువంటి చెడు కర్మలను చెయ్యకూడదు. జ్ఞానానికి విరుద్ధంగా చేసే పనివలన వంద రెట్లు దాని ఫలితాన్ని అనుభవించవలసి వస్తుంది. మునుపు, మీరు అజ్ఞానంలో ఉన్నారు, కానీ ఇప్పుడు మీకు ఆత్మ పరిచయము లభించింది, మీ కర్తవ్యము కూడా మీకు బోధపడింది. మీ ముందు సత్యమైన లక్ష్యము, దాన్ని సాధించడానికి అవసరమైన పురుషార్థము ఉన్నాయి. కనుక ఇందులో లాభాలెంతో అంతే అపాయాలు కూడా ఉన్నాయి.

"ఎవ్వరినీ మోహానికి వశమై చూడకండి. ఎవ్వరితోటీ పరుషంగా మాట్లాడవద్దు, అసత్యమైన విషయాలను వినవద్దు. ఉపరామ స్థితిలో కర్మలను చెయ్యండి. స్వయాన్ని భగవంతుని స్మృతిలో స్థితి చేసుకోండి. శుద్ధమైన భోజనాన్నే స్వీకరిస్తూ చిరునవ్వుతో కూడిన ముఖము, ప్రశాంతమైన మనసును కలిగి ఉండండి."

జీవితంలోని ప్రతి అడుగులో ఆంతరిక హుందాతనాన్ని ధారణ చేసుకోమని బ్రహ్మాబాబా నేర్పించేవారు. ఇతర ధర్మాలకు, వీరి అభ్యాసానికి ఇక్కడే తేడా వచ్చింది. ఓం మండలివారు భగవంతుడిని పూజించడంలేదు, కానీ పూజ్యనీయులుగా అవ్వడానికి పురుషార్థం చేస్తున్నారు. బాబా ఇలా గుర్తు చేసేవారు, "ధర్మములో శక్తి ఉంటుంది. ఒక రోజు మనలోని ఆంతరిక శక్తి అనగా సైలెన్స్ శక్తి – బాహ్య శక్తిని అనగా సైన్స్ శక్తిని అధిగమిస్తుంది. అప్పుడు మనం అఖండమైన సుఖ, శాంతి, సంపదలతో కూడిన ప్రపంచాన్ని పరిపాలిస్తాము. ఆ సమయం ఆసన్నమయింది, ఇది

అందరికీ అర్థమవుతుంది కూడా."

పవిత్ర సాధనకు జీవితంలోని ప్రతి అంశముపై దృష్టి సారించడం జరిగింది. ప్రతి కర్మ గురించి బ్రహ్మాబాబా బోధించేవారు. నిద్ర గురించి చెప్తూతూ, ఉదాహరణకు, కలలు పవిత్రమైనవిగా, నిద్ర ప్రశాంతమైనదిగా ఉండాలంటే నిద్రించే ముందు భగవంతుని స్మృతి చేసి పడుకోవాలని బ్రహ్మాబాబా నేర్పించేవారు.

చాలాసార్లు, బ్రహ్మాబాబా ఉదయం 2గం॥లకే బంగళాలలోకి వచ్చేవారు. అప్పుడు యజ్ఞ వత్సలు నిద్రలో ఉండేవారు. నిద్రించేవారి ముఖాలను చూసి బాబా ఈ విధంగా చెప్పేవారు, "చూడండి, వీరి ముఖము చూసి వీరు భగవంతుడిని స్మృతి చేసిన తర్వాత పడుకున్నారని చెప్పవచ్చు, వీరి నిద్ర సాత్వికంగా ఉంది కానీ గాఢనిద్రలో అనగా తమోనిద్రలో ఉన్న ఇతరుల ముఖాలు చూడండి" అని అనేవారు.

ఇంద్రియ నిగ్రహము, వస్తు వైభవాల ఆకర్షణ నుండి దూరంగా ఉండటం, చెడు అలవాట్లను మానుకునేందుకు అవసరమైన యుక్తులను యజ్ఞ వత్సలకు బ్రహ్మాబాబా నేర్పించడం ద్వారా సంపూర్ణ పవిత్రతకు అవసరమైన పురుషార్థానికి బాబా దోహదపడ్డారు.

బాబా ఇలా బోధించేవారు, "ఒకవేళ మీలో సంకల్ప శుద్ధి లేనట్లయితే కర్మేంద్రియాల ద్వారా చెడు కర్మలు జరుగుతాయి. కనుక, మీ మనసును సంపూర్ణ పవిత్రంగా చేసుకోండి. ఎంత ఎక్కువగా భగవంతుని స్మృతిలో నిమగ్నమై ఉంటారో, ఎంతగా ఆ ప్రేమపూర్వక స్మృతిలో గడుపుతారో అంతగా ఆత్మ పవిత్రమవుతుంది. ఒకవేళ, ప్రపంచ వినాశనంకంటే ముందుగానే మీరు మీ మనసును పవిత్రంగా చేసుకోకపోతే మీరు బంగారు యుగంలోకి రావడానికి బదులుగా వెండి యుగంలోకి వెళ్తారు."

యజ్ఞ వత్సలకు బ్రహ్మాబాబా నిరంతర ప్రేరణాస్తోత్రంలా, జ్ఞాన సాగరంలా నిలిచారు. ఆత్మ పరిశీలన, ప్రశాంతమైన మనసు, సమతుల్యత, సహనము, అణకువ, ఓర్పు, పట్టుదల, ఆత్మ విశ్వాసము వంటి దివ్య గుణ ధారణ కోసం అవసరమైన సూక్ష్మ జ్ఞాన రహస్యాలను బ్రహ్మాబాబా విశదీకరించేవారు. ఇటువంటి జ్ఞాన బోధనతో, నిత్య రాజయోగ అభ్యాసముతో అక్కడివారంతా అనునిత్యము అమూల్యమైన శక్తిని జమ చేసుకుంటున్నారు.

బాబా మరియు ఓం రాధ, వారినే యజ్ఞ పిత మరియు యజ్ఞ మాత అని కూడా పిలిచేవారు, అక్కడ నివసించేవారికి అవసరమైన భోజన, విడిది ఏర్పాట్లు చేసారు. ప్రతి అవసరాన్ని తీర్చడం జరిగింది.

యజ్ఞంలో నివసిస్తున్న వారు, మునుపెన్నడూ చరిత్రలో ఎవ్వరూ పొందనంత అద్భుతమైన అవకాశాన్ని పొందారు. గతంలో, అతి కొద్దిమందికి క్రీస్తు ప్రక్కన ఉండే అదృష్టం లభించింది. మరికొంతమంది బుద్ధునితో కలిసి భారతదేశమంతా తిరిగే సౌభాగ్యాన్ని పొందారు. అబ్రహమ్ వంటి ఇతర గురువులను ప్రజలు గుర్తించి వారితో ఉండే అవకాశం కోసం వేచి ఉన్నారు. కానీ ఇక్కడ, ఓం మండలిలో, ఈ యజ్ఞ వత్సలు భగవంతుడినే తమ తండ్రిగా చేసుకుని వారి పాలనలో పెరగసాగారు. శివబాబా, ఒక్క పాత్రను కాదు, మూడు పాత్రలను పోషించారు, ఇప్పటికీ పోషిస్తూ ఉన్నారు – వారు తండ్రి, టీచరు మరియు సద్గురువు. శివబాబా మరియు బ్రహ్మాబాబా ఇద్దరు తండ్రులూ పిల్లలను ఎంతో ప్రేమగా, చక్కని మార్గదర్శనతో చూసుకున్నారు. ఆ అదృష్టము యజ్ఞములో నివసిస్తున్నవారు మాత్రమే అర్థం చేసుకోగలిగారు.

బ్రహ్మాబాబా, పిల్లలను తరచూ సముద్రపు ఒడ్డుకు షికారుకు తీసుకువెళ్ళేవారు. అక్కడెంతో సరదాగా గడిపేవారు. వారికోసం బాబా ఎప్పుడూ క్రొత్త క్రొత్త ఆటలను ఆలోచించేవారు. ఆటలలో ఎవరైనా గాయపడితే వారికి సంపూర్ణ వైద్యం లభించే విధంగా బాబా జాగ్రత్త పడ్డారు. బ్రహ్మా బాబా ఒక తండ్రిగానే కాక తల్లిగాకూడా తమ పాత్రను పోషించారు.

ఓ నా సఖులారా! శాంతి సాగరం వద్దకు
వచ్చినప్పటినుండి
ప్రేమ, సుఖముతో నిండిన చల్లని
గాలులు వీస్తున్నాయి

ఓ నా సఖులారా! ఓం మండలి ద్వారానికి
వచ్చినప్పటినుండి
నేను ఒక్క భగవంతుడినే
నా సహవాసిగా చేసుకున్నాను

ఇప్పుడు, నేనెంత ధనవంతురాలిని!
నా మనసును నియంత్రించుకునే మర్మ రహస్యం నాకు తెలిసింది
ఇప్పుడు నేను యజమానిగా ఉన్నాను

దివ్యదృష్టిని కలిగించే మూడవ నేత్రం నాకున్నది
ఒక్క క్షణంలో నేను స్వర్గంలోకి చేరుకోగలుగుతున్నాను

ఓహో, నా సఖులారా! నేను శ్రీకృష్ణునితో కలిసి నాట్యం చేసాను
ఆ అరుదైన అదృష్టాన్ని పొంది నేను ఉబ్బితబ్బిబ్బయ్యాను
అసత్యపు సుఖాలు, అసత్యపు దుఃఖాలు నన్ను వీడాయి,
ఇప్పుడు మధురమైన, సమతుల్యమైన
ప్రశాంతమైన మనసు నాతో ఉంది
జ్ఞానామృతం క్రొత్త జీవితాన్ని ఇస్తుంది
ప్రతి క్షణం. ఇది లేకుండా ఎవరు జీవించగలరు?

ఓ సఖులారా! నేను భగవంతుని చేతలకు
అమ్ముడుపోయాను
నేను వారికి చెందినదాన్ని
నా మనసు, తనువు ఆయనవే, నావి కావు.

ఓహో, ఓం మండలికి వచ్చినప్పటి నుండి
ఈ ప్రపంచ భోగాలను విస్మరించాను
మునుపెన్నడూ జీవించని విధంగా ఇప్పుడు జీవిస్తున్నాను
నా సంతోష క్షణాలివే.

# "బ్రహ్మను హతమార్చు!"

ఓం రాధ, సంస్థ ప్రశాసకురాలు, తమలో ఎన్నో దివ్య గుణాలను ధారణ చేసుకోవడమే కాక ఇతరులలో కూడా నింపేవారు. ఎవరైనా పొరపాటు చేస్తే మమ్మా ఆ పొరపాటును గమనించనట్లుగానే వ్యవహరించేవారు. "ఒక్క పొరపాటు వారి వ్యక్తిత్వాన్ని నిర్దేశించదు. పొరపాటును తలుచుకుంటూ బాధపడటమే పెద్ద పొరపాటు." అని మమ్మా అనేవారు.

కొంతమంది పిల్లలు తమలోని బలహీనతలను చూసుకుంటూ దిగులు చెందేవారు. మమ్మా ఇలా అనేవారు, "మీలోని బలహీనతలను పదే పదే ఆలోచించుకోవడం కూడా దేహాభిమానమే. చింతించకండి. బలహీనతలను గమనించండి, వాటిని తొలగించుకునే ప్రయత్నం చెయ్యండి. ఎప్పుడూ స్వయాన్ని ఇతరులతో పోల్చుకోవద్దు, ఒక్క బ్రహ్మాబాబాతో తప్ప. బాబాను చూసినప్పుడు మనలో ఉన్నతి వేగంగా ఉంటుంది, పురుషార్థం బాధతోనో, అహంకారంతోనో చెయ్యము."

మమ్మాలోని ముఖ్యమైన దివ్య గుణము – అంతర్ముఖత. శివబాబా చెప్పిన ప్రతి విషయాన్ని మమ్మా ఎంతో శ్రద్ధగా వినేవారు. "అంతర్ముఖులుగా అవ్వండి, మీ పాపాలు భస్మమవుతాయి." అని శివబాబా అన్నారు.

మమ్మాను విశ్వ విద్యాలయంలో అనేక ప్రియమైన పేర్లతో పిలుస్తారు. స్వయంగా శివబాబాయే మమ్మాను సరస్వతి, జగదాంబ అన్నారు. ఇతరులు మమ్మాను మాతేశ్వరి, యజ్ఞ మాతగా పిలిచారు. ఇన్ని పేర్లలోనూ మన మనసులలో నాటుకుపోయిన పేరు, 'మమ్మా'.

బ్రహ్మాబాబా మరియు మమ్మా వ్యక్తిత్వాలు చాలా పవిత్రంగా, శక్తివంతంగా ఉండేవి. ఎంత శక్తివంతంగా అంటే వారిని ఎవ్వరూ నేరుగా ఎదిరించలేరు. కానీ 'యాంటీ పార్టీ' వారి ఆవేశం తగ్గలేదు. యజ్ఞాన్ని సమూలంగా నాశనం చెయ్యడానికి చివరి ప్రయత్నంగా వారు ఒక కుట్ర పన్నారు... 'బ్రహ్మాబాబాను చంపించడం'.

'యాంటీ పార్టీ' కమిటీలోని కొంతమంది సభ్యులు భారతదేశంలోని ఒక పర్వత ప్రాంతంలో పేరుమోసిన ఒక హంతకుడి కోసం వెళ్ళారు. ఒక సిక్కు బందిపోటు పేరును వారు పదే పదే విన్నారు. అనేక రాష్ట్రాలలో అతని కోసం గాలింపు జరుగుతుంది.

అతి కష్టంమీద యాంటీ పార్టీ వారు అతడిని కనుగొన్నారు. ఆ వ్యక్తి నల్లగా, ఎత్తుగా, సన్నగా ఉన్నాడు. హిమాలయ పర్వత ప్రాంతాలలో ఎటువంటి వాతావరణంలోనైనా కాలిబాటలో తిరిగి తిరిగి ఉన్నందున ఆ వ్యక్తి మంచి శరీర దారుఢ్యంతో ఉన్నాడు. కత్తి, ఖడ్గము, శూలమువంటి ఆయుధాలతో అతడు అక్కడ యుద్ధము చేస్తాడు. అతడు కేవలం నడుముకు ఒక వస్త్రాన్ని కట్టుకుని, తలపాగాతో, పొడవాటి కండువాతో కనిపిస్తాడు.

'యాంటీ పార్టీ' వారు చెప్పిన దానికి ఆ బందిపోటు ఒప్పుకున్నాడు. అతడు వారితో కలిసి కరాచీకి వచ్చాడు. కరాచీలో అతడికి బ్రహ్మాబాబా ఫోటోను చూపించి, బాబా ఉండే ఇంటి ప్లానును గీసి అందులో ఎర్రని సిరాతో బ్రహ్మాబాబా గదిని గుండ్రంగా మార్క్ చేసి ఇచ్చారు. బందిపోటు ఇంట్లోకి చొచ్చుకునిపోయి, బ్రహ్మాబాబా గదిలోకి వెళ్ళి తను చెయ్యవలసిన పాడు పనిని చేసి అందుకు ఋజువును తీసుకువస్తే అప్పుడు ఆ బందిపోటుకు ఇవ్వాల్సిన డబ్బును ఇవ్వడం జరుగుతుంది. పనంతా అయ్యాక ఒక కారులో ఆ బందిపోటును తన స్థానానికి, పర్వత ప్రాంతానికి చేర్చడం జరుగుతుంది.

విశ్వ విద్యాలయం తమ భద్రత కోసం అవసరమైన చర్యలు ముందునుండే తీసుకుంది. ఒక సోదరుడు బంగళా చుట్టూ కాపలా కాస్తూ అనుమానాస్పద వ్యక్తులను ఓ కంట కనిపెడుతూ ఉంటాడు. ప్రతి ద్వారం వద్ద ఒక సోదరి కూర్చుని ఉంటుంది. రెండవ అంతస్థులో కూడా ఒక గార్డు ఉంటారు. అంతేకాక, బ్రహ్మాబాబా ఎప్పుడూ ఒంటరిగా కనిపించరు. పిల్లలకు ప్రతి రోజూ ఉత్తరాలు వ్రాస్తూ చీకటి పడేవరకు మేలుకుని ఉండేవారు. బాబాకు సహాయం చెయ్యడానికి కనీసం ఒక్కరైనా బాబాతో ఉండేవారు.

కానీ, ఒకరోజు రాత్రి అనుకోని సంఘటనల కారణంగా యజ్ఞ భద్రతలో తేడా వచ్చింది. బోర్డింగ్ స్కూలుకు సంబంధించిన ఒక కారు టైరు పాడయినందున కాపలగా ఉన్న సోదరుడు కారును రిపేరు చేస్తూ ఉండిపోయాడు. ద్వారం వద్ద కూర్చునే సోదరిని వంటగదిలోకి సహాయం కోసం పిలవడం జరిగింది. రెండవ అంతస్థులో కాపలాగా ఉన్న సోదరి బ్రహ్మబాబా భోజనం తీసుకురావడానికి వెళ్ళింది. ఆరోజు రాత్రి బ్రహ్మబాబా తమ గదిలో ఒంటరిగానే ఉన్నారు.

ఇదే అదనుగా ఆ బందిపోటు ఇంటిలోకి దూకాడు. తోటను దాటి ముందువైపు ఉన్న కిటికీ ద్వారా లోపలకు దూకి నిశ్శబ్దంగా లోపలకు దూరాడు.

ఆ బందిపోటు ఎంతో వేగంగా తను వెళ్ళవలసిన దారిని కనుగొన్నాడు. మెట్లను కనుగొని, రెండో అంతస్థుకు పరుగుతీసాడు. అక్కడ అతడు కుడి వైపుకు తిరిగి బ్రహ్మబాబా గది ద్వారం వద్దకు వచ్చి చేరుకున్నాడు. తన వద్ద ఉన్న కత్తిని తీసి ఆవేశంగా లోపలకు ప్రవేశించాడు.

పేపర్లు చూస్తున్న బ్రహ్మబాబా బందిపోటును గమనించారు. జ్ఞానానికి సంబంధించిన ఒక పుస్తకంలో ప్రచురించడానికి పవిత్రతా శక్తి గురించి బాబా పాయింట్లను పరిశీలిస్తున్నారు. ఉదయం క్లాసులో శివబాబా చెప్పిన మహా వాక్యాల నుండి బ్రహ్మబాబా ఎంచుకుంటున్నారు. ఊహించని ఈ అతిథిని చూసిన వెంటనే బ్రహ్మబాబాకు విషయమంతా అర్థమైపోయింది. అయినా కూడా బాబా నిర్భయంగానే ఉన్నారు.

తనకేమవుతుందోనన్న బాధ బాబాలో కొంచం కూడా కనిపించలేదు. “ఈ పాత శరీరం శివబాబాకు మాధ్యమంగా కావాలంటే, ఈ పాత వాహనము కాపాడబడుతుంది. ఇది అతని బాధ్యత, నాది కాదు” అని అనుకున్నారు. ఈ సంకల్పంతో బ్రహ్మబాబా బందిపోటును చూసి చిరునవ్వు నవ్వారు.

కానీ బందిపోతు నవ్వలేదు. నిజానికి, అసలు బందిపోటు బ్రహ్మబాబా చూడలేదు. వారిద్దరి మధ్య 5 అడుగుల దూరమే ఉన్నాకానీ అతడు బ్రహ్మను చూడలేదు. ఎందుకంటే గదిలోకి ప్రవేశించగానే అతడు అద్భుతమైన ఆనందంలో మునిగిపోయాడు.

ఏదో తెలియని ఆనందంలో మునిగిన బందిపోటు తత్తరపడ్డాడు. చంపాలన్న అతని ఆలోచన సన్నగిల్లింది. అతడు తన శరీరాన్నే నెమ్మది నెమ్మదిగా మర్చిపోసాగాడు. మరణం తర్వాత నిర్యాణం పొందినంత అనుభూతి అతనికి కలిగింది. అతడు అక్కడకు వచ్చిన కారణాన్ని పూర్తిగా మర్చిపోయాడు. అతనికి తెలియకుండానే అతని చేతి నుండి కత్తి కిందకు జారిపడిపోయింది.

మిక్కిలి ప్రకాశవంతమైన ప్రకాశాన్ని చూస్తున్న అతని కళ్ళు చీకటిగా ఉన్న ఆ ప్రాంతంలో దారిని వెతుక్కుంటూ గది బయట ఉన్న హాలువద్దకు వచ్చాడు. చివరకు, బాబాకు భోజనాన్ని తీసుకురావడానికి వెళ్ళిన సోదరి తిరిగి వస్తుండగా ఈ ఆగంతకుడిని చూసి గమనించి వెంటనే అలారమ్‌ను మ్రోగించింది. ఆ బందిపోటును త్వరత్వరగా క్రింది అంతస్థుకు తీసుకువచ్చారు. కానీ బ్రహ్మబాబా మాత్రం అతడిని చక్కగా చూసుకోమని చెప్పాడు. అతడు వచ్చినది అతని తండ్రి ఇంటికేనని చెప్పారు. సాత్విక జీవితాన్ని అవలంబించడం ద్వారా అతడు గతంలో చేసిన పాప కర్మలనుండి విముక్తి పొందవచ్చని ఆ ఆగంతకుడికి తెలియజేసారు. ఇది విన్న ఆ సిక్కు చాలా సంతోషించి చిన్న పిల్లవాడిలా నవ్వాడు. అతడికి భోజనాన్ని పెట్టి ఇకమీదట ఇటువంటి హింస చెయ్యకుండా భగవంతుని స్మృతిలో గడపమని చెప్పి పంపారు. తప్పకుండా తన జీవిత విధానాన్ని మార్చుకుంటానని అతడు ప్రతిజ్ఞ చేసాడు.

మరుసటి రోజు ‘యాంటీ పార్టీ’వారు జరిగిన విషయాన్ని తెలుసుకుని అవాక్కయ్యారు. ఇటువంటి ప్రయత్నాలు ఇంకెప్పుడూ చెయ్యలేదు.

# విశ్వ సేవ ప్రారంభం

పరమపిత శివ పరమాత్మ ప్రతి రోజూ నిరాకార ప్రపంచంనుండి దిగివచ్చి సాకార ప్రపంచంలోని బ్రహ్మ శరీరంలో ప్రవేశించి వారి ముఖారవిందం ద్వారా జ్ఞానాన్ని వినిపిస్తూనే ఉన్నారు. జ్ఞానములోని గుహ్య రహస్యాలను తెలియజేస్తూనే ఉన్నారు. అందరూ స్వయాన్ని ఆత్మలుగా భావించాలని, సంపూర్ణ ఫరిశ్తా స్థితిని పొందాలని, అందుకు అవసరమైన విధానాన్ని తెలియజేసారు.

కానీ ఈ భువిపై జరిగిన భగవంతుని అవతరణ కేవలం కొంతమందిని ఉద్ధరించడానికో లేక భారతదేశంలోని ఒక ప్రాంతాన్ని మాత్రమే ఉద్ధరించడానికో కాదు. వారు పూర్తి ప్రపంచంకోసం వచ్చారు. కావున, ప్రారంభంలో ఉన్న పిల్లలు దృఢంగా అయ్యారన్న విశ్వాసము కలిగిన పిమ్మట భగవంతుని సందేశాన్ని అందరికీ అందించడానికి బాబా వారిని బయటకు పంపసాగారు. క్రమక్రమంగా, భగవంతుని అవతరణ జరిగిందన్న విషయము అందరికీ తెలియాలి, ఎందుకంటే ఆత్మలన్నీ పరమాత్ముని సంతానము, ఆ తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకునే అర్హత అందరికీ ఉంది.

అయినాకానీ, భగవంతుడు చెప్పినదాన్ని అనేకమంది తిరస్కరించారు కూడా ఎందుకంటే సర్వశక్తిమంతుడైన పరమాత్మ ప్రెసిడెంటు, రాజు లేక సాధుసన్యాసుల శరీరాన్ని ఆధారం చేసుకోకుండా ఒక సాధారణ శరీరాన్ని ఎంచుకున్నారు కదా. యథార్థాన్ని గుర్తించలేని మందబుద్ధివారు బ్రహ్మయే ఈ సంస్థను స్థాపించారనుకున్నారు. బ్రహ్మకుమారీ సంస్థకు బ్రహ్మబాబాయే గురువని అనుకున్నారు. భగవంతుడు ప్రతిరోజు అవతరించి బ్రహ్మ శరీరం ద్వారా తన పిల్లలతో ప్రత్యక్షంగా మాట్లాడుతున్నప్పటికీ శివబాబా భౌతికంగా కనిపించని కారణంగా భగవంతుని ఉనికిని నమ్మలేకపోయారు.

అజ్ఞానం కారణంగా బ్రహ్మబాబాపై నిందలు మోపారు. ఇంత జరుగుతున్నప్పటికీ భగవంతుని కార్యం కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు పిల్లలు కూడా భగవంతుని కార్యంలో బాధ్యత వహించసాగారు, సత్యయుగాన్ని స్థాపించి అక్కడకు వెళ్ళి జీవించాలన్న తపన వారిలో నిండిపోయింది.

యజ్ఞ స్థాపన అయిన ఐదారు సంవత్సరాలలోనే బయటకు వెళ్ళి సేవను చేయడం ప్రారంభించారు. ఒకరోజు బ్రహ్మబాబా ముఖారవిందం ద్వారా శివబాబా అక్కడున్న మాతలకు, సోదరీలకు ఈ విధంగా చెప్పారు, "ఇప్పుడు మీరు పరిపక్వ స్థితిని చేరుకున్నారు. మీలో భగవంతుని శక్తి నిండింది. ఇప్పుడు మీరు లౌకిక తల్లిదండ్రులు, బంధువుల వద్దకు తిరిగి వెళ్ళి వారిపట్ల మీకున్న బాధ్యతను నెరవేర్చాలి. "ఛారిటీ బిగిన్స్ ఎట్ హోమ్" (ధర్మము ఇంటినుండి ప్రారంభమవుతుంది) అని మీకు తెలుసు కదా."

సేవార్థమై ఉన్నప్పుడు ఆరు విషయాలపై బాబా శ్రద్ధ వహించమని చెప్పారు:

"మీ స్థితి ఎంతో పరిపక్వంగా ఉండాలి. మీరు ఎంతగా ఆత్మ నిష్ఠలో ఉండాలంటే మీరు మీ లౌకిక బంధుమిత్రుల ఎదురుగా నిల్చున్నప్పుడు వారికి మిమ్మల్ని చూడగానే వీరు నా కుమార్తె, సోదరి అని గుర్తుకురాకూడదు. ఒక శక్తి, ఒక దేవత నిల్చుని ఉంది అని అనిపించాలి."

"మీరు కనిపించగానే మోహముతో మిమ్మల్ని దగ్గరకు తీసుకోకూడదు."

"మీరు వారి వద్ద ఫలాలు, పండ్లు, ఇతర శుద్ధమైన భోజనాన్ని స్వీకరించవచ్చు, ఇతరమైనవేవీ స్వీకరించకూడదు."

"మీరు ఈశ్వరీయ కులానికి చెందినవారు, కనుక, మీకోసం మీరు వారివద్ద నుండి డబ్బును తీసుకోవద్దు. ఇతరుల భోజనము, ధనము మన మనసుపై ఎంతో ప్రభావాన్ని చూపుతాయి."

"మీరు వారికి ఈశ్వరీయ జ్ఞానాన్ని ఇచ్చి వారి దృష్టికోణాన్ని మార్చాలి. మీరు మీ జీవితాన్ని ఈ జ్ఞానంద్వారా ఎంత ఉన్నతంగా చేసుకున్నారో వివరించి వారు కూడా ఇటువంటి దివ్యమైన, పవిత్రమైన జీవితాన్ని గడపడానికి కావలసిన ప్రేరణను ఇవ్వండి."

"ఈశ్వరీయ జ్ఞానాన్ని అందించే సమయంలో మీలో ఉన్న తపన, నిష్ఠ, మీ కృషిని చూసి లాభాన్ని పొంది జిజ్ఞాసతో అలౌకిక అనుభవాన్ని పొందడానికి మీతోపాటే వారూ సత్సంగానికి రావాలి."

# లౌకిక ఇంటివైపు యాత్ర

శ్వేత వస్త్రాలతో ఉన్న సోదరీలు భగవంతుని సందేశంతో కరాచీనుండి హైదరాబాద్‌లోని తమ ఇళ్ళకు పయనమయ్యారు. అందరూ తమ తమ ఇళ్ళకు వెళ్ళారు.

ఆరు సంవత్సరాలు ఇంటికి దూరంగా ఉండటమన్నది చాలా ఎక్కువ సమయమే. బాబా శిక్షణలను ఇంటివారికి తెలియజేసే ఉద్దేశ్యంతో అప్పుడప్పుడూ బాబా మహావాక్యాలను ఉత్తరాలద్వారా వ్రాసి పంపడమే తప్ప ఇతర పత్ర వ్యవహారమేమీ లేదు. ఇప్పుడు వీరు ఇంటికి వస్తున్న సంగతి కూడా ఇంట్లోనివారికి తెలియదు.

ఈ కన్యలిక ఇంటికి రారనే అనుకున్నారు బంధుమిత్రులంతా. ఇప్పుడు వారిని తిరిగి చూసాక ఎంతో ఆశ్చర్యపోయారు.

సోదరి మనోహర్ ఇంద్ర, తన ఇంటికి నడుచుకుంటూ వస్తున్న సంగతిని ఆమె చిన్న చెల్లెలు గమనించి ఇంట్లోకి పరిగెత్తుకుంటూ వెళ్ళి ఈ విధంగా చెప్పింది, "ఇంతకముందు ఇక్కడే ఉండేది కదా, అదే, ఓం మండలికి వెళ్ళేది కదా, వెళ్ళిపోయింది కదా, తను వస్తుంది." చిన్న చెల్లెలికి వీరి పేరు గుర్తు లేదు. ఎందుకంటే సోదరి మనోహర్ ఇంద్ర ఇల్లు విడిచి వెళ్ళే సమయానికి తను చాలా చిన్న పిల్ల.

కుటుంబ సభ్యులు ఆశ్చర్యపోయారు. ఇంట్లో అంతా కలకలం చెలరేగింది. ఆమె తల్లిగారైన లక్ష్మి వంట గదినుండి బయటకు వచ్చింది. వస్తున్నదెవరో తెలుసుకున్న వెంటనే తన కూతురుని కలుసుకోవడానికి బయటకు పరిగెత్తుకుంటూ వచ్చింది. ప్రేమ బంధాలు కట్టలు తెంచుకున్నాయి.

సోదరి మనోహర్ ఆ క్షణాలను ఈవిధంగా గుర్తు చేసుకున్నారు, "నేను మౌనంగా నిల్చున్నాను. ఒక్క నిమిషము తర్వాత అనుకుంటాను, మా తల్లిగారి కంటినుండి కన్నీళ్ళు వచ్చాయి. తన కూతుర్ని హత్తుకోవాలని ఆమెకు అనిపించింది, కానీ నియంత్రించుకుంది. నేను శాంతిగా నిల్చుని ఉన్నాను."

"మీ ఇంటిముందు నిల్చున్నదెరో మీరు గుర్తించారా?" అని నేను (సోదరి మనోహర్) మా తల్లిగారిని ప్రశ్నించాను. "మమ్మల్ని గుర్తుపట్టారా? మేము శివ శక్తులము. నేను బ్రహ్మ సంతానంగా అయ్యాను. నేనిప్పుడు మీ కూతుర్ని కాదు. మనిద్దరమూ ఇప్పుడు సోదరీలము, ఒకే భగవంతుని సంతానము."

"తన ఇతర పిల్లలను ఈ సందేశాన్ని అందించమన్నారు బాబా. మరికొద్ది సమయంలో ఈ కలియుగం అంతమై స్వర్గ రాజ్యం స్థాపన కానుంది."

"మానవుడు ఈరోజు తాను చేసిన చెడు కర్మలు మరియు అపవిత్ర ఆలోచనల కారణంగానే దుఃఖాన్ని పొందుతున్నాడు. ఇప్పుడు సుఖధామంలో జన్మ తీసుకోవాలంటే పరివర్తన కోసం పురుషార్థం చెయ్యాలి. మరి మీరు జ్ఞానామృతాన్ని త్రాగుతారా? అమరపదవిని పొందే పురుషార్థం చేస్తారా? స్వర్గ మార్గంలో వెళ్ళాలనుకుంటున్నారా? "

లక్ష్మి ఆశ్చర్యపోయింది. ఈలోపు ఇంట్లోని మిగతా వారందరూ ఇంటి గుమ్మంవద్దకు వచ్చి అంతా వింటున్నారు. తన కూతురిలో వచ్చిన ఈ అమోఘమైన మార్పును చూసి అందరూ నిశ్చేష్టులయ్యారు. ఒక యోగిని, ఒక శివ శక్తిలా తిరిగివచ్చింది. వీరు మాట్లాడిన మాటలలో సత్యముంది అని పరివారంలోని వారు అర్థం చేసుకున్నారు. నిద్రిస్తున్న ఆత్మలు ఒక్కసారిగా మేల్కున్నట్లుగా అయింది.

"నేను తప్పకుండా స్వర్గ వారసత్వాన్ని తీసుకుంటాను, నన్ను నువ్వు నీతో తీసుకువెళ్ళాలి" అని మా తల్లిగారు అన్నారు. "ఆమె నెమ్మదిగా నన్ను ఇంట్లోకి తీసుకుని వెళ్ళారు. ముందు మా తల్లిగారు వెళ్తుంటే నేను వారి వెనుక నడుస్తూ లోపలకు వెళ్ళాను. మధ్యమధ్యలో ఆమె వెనక్కు తిరిగి చూస్తూ నా నడవడిక, నడతను గమనిస్తూ అందులో నిండి ఉన్న హుందాతనాన్ని గుర్తించింది. నన్ను ఎక్కడ కూర్చోపెట్టాలా అని చూసి ముందుగా ఒక దుప్పటి క్రింద పరిచి

అక్కడ కూర్చోమన్నది, వెంటనే కుర్చీలో ఒక దిండు పెట్టి అక్కడ కూర్చోమన్నది. నన్ను కూర్చోబెట్టడానికి మా తల్లిగారికి ఎక్కడా సరైన స్థానం కనిపించడంలేదు. కానీ నేను మాత్రం క్రింద కూర్చుని ఆత్మ నిష్ఠలో స్థితి అయ్యాను.

కొద్ది క్షణాలలోనే మా వీధిలోనివారు, మా బంధువులంతా నా చుట్టూ చేరారు. నేను వారందరిపై షుమారు గంటసేపు జ్ఞాన వర్షాన్ని కురిపించాను. జ్ఞానాన్ని విన్న తర్వాత వారిలోని భావాలు మారాయి. వారి హృదయాలలో బాబా వినిపించిన గుహ్యమైన జ్ఞాన రహస్యాలు మారుమ్రోగాయి. ఇంకా ఇంకా వారు నా నుండి వినాలని ఆశించారు.

నేను ఇంట్లోని వారితో అనేక రోజులు గడిపాను. ఆ సమయంలో ఎంతోమంది బంధువుల, స్నేహితులు వచ్చి జ్ఞానాన్ని వినేవారు. అక్కడి వాతావరణము సత్సంగంలా మారిపోయింది. వారడిగిన ప్రశ్నలకు లభించిన జవాబులు వారి మనసుకు హత్తుకున్నాయి. యజ్ఞం పట్ల వారికున్న భ్రాంతులు కూడా నివృత్తి అవ్వసాగాయి.

“చాలామంది నన్ను వ్యక్తిగతంగా కలుసుకోవడానికి కూడా వచ్చారు. వారు కూడా మంచి మంచి అనుభవాలతో తిరిగి వెళ్ళారు. వారితో మాట్లాడుతున్న సమయంలో నేను నా మనసును జ్ఞానయోగాలలో నిమగ్నం చేసుకుని వారి బుద్ధికి వేయబడిన తాళమును తెరవడంలో విజయాన్ని పొందాను. నేను వారిని జ్ఞానంతో ప్రభావితం చెయ్యాలి అని బాబా చెప్పిన రెండవ షరతు కూడా పూర్తి చెయ్యగలిగాను. నేను కేవలం ఫలాహారాన్ని మాత్రమే స్వీకరిస్తూ ఇంటి డబ్బును నాకోసం ఖర్చుపెట్టకుండా యజ్ఞంనుండి తెచ్చుకున్న డబ్బులను మాత్రమే ఉపయోగించేదాన్ని.”

ఇలా ఏడు రోజులు పూర్తయ్యాక, ఒకరోజు, తన కూతురిలో వచ్చిన ఈ గొప్ప మార్పుకు ప్రభావితమైన లక్ష్మి నాతో ఈ విధంగా అన్నారు, “నేను కూడా సత్సంగానికి వస్తాను. నేను మీ ఆశ్రమాన్ని చూస్తాను. బాబానుండి జ్ఞానమును విని చక్కని అనుభవాలను పొందాలని ఆశిస్తున్నాను.”

ఇది విన్న నాకు ఎంతో ఆశ్చర్యము, సంతోషము కూడా కలిగాయి. ఆశ్చర్యము ఎందుకంటే ఒకప్పుడు నేను సత్సంగానికి వెళ్తానంటే నన్ను కఠినంగా అడ్డుకున్నది వీరే. ఈరోజు వీరి మానసిక స్థితిలో ఎంత పరివర్తన వచ్చిందంటే అదే సత్సంగానికి వీరు వస్తానని అంటున్నారు. సంతోషము ఎందుకు కలిగిందంటే నేను నా కర్తవ్యాన్ని నిర్వహించడంలో సఫలమయ్యాను, ఈశ్వరుని నుండి లభించిన ఆదేశ-నిర్దేశాలను నేను పూర్తి చేసానన్న సంతోషము.

- - - - -

సత్సంగానికి వెళ్తున్న దారిలో మా తల్లిగారు నాతో తనకున్న ఒక కోరికను చెప్పారు, “నేనెంతో భక్తి చేసాను, కానీ నాకు ఇప్పటివరకు భగవంతుని సాక్షాత్కారము జరగలేదు. మీ సంస్థకు వచ్చినవారికి చాలా త్వరగా సాక్షాత్కారాలు అవుతాయని విన్నాను. పరమాత్ముని దివ్య సాక్షాత్కారము అయినప్పుడే నాకు విశ్వాసం కలుగుతుంది.”

నేనిలా చెప్పాను, “పరమాత్మ సాక్షాత్కారమును కలిగించే సామర్థ్యము మానవాత్మలెవ్వరిలోనూ లేదు. వారే దివ్య దృష్టి దాత. మీ భాగ్యములో అటువంటిది ఉంటే తప్పక జరుగుతుంది. మీ పూర్వజన్మలలో మీరు ఒకవేళ ఉత్తమమైన భక్తి చేసి ఉంటే, ఉన్నతమైన కర్మలు చేసి ఉంటే, మీ గుణం గొప్పగా ఉంటే మీకు తప్పకుండా సాక్షాత్కారము కలుగుతుంది.”

సత్సంగంలో మా తల్లిగారికి జ్ఞానాన్ని మరింత స్పష్టంగా విశదీకరించడం జరిగింది. రెండు రోజులోనే వారికి కలిగిన ఒక అనుభవం కారణంగా ఎంతో సంతోషాన్ని పొందారు. యజ్ఞంలో ‘ధ్యానేశ్వరి’ అని ఒక మాత ఉండేవారు. వారు ఎంతో యోగీ ఆత్మ. వారు మా తల్లిగారికి ఆధ్యాత్మిక జ్ఞానంలోని మొదటి పాఠాన్ని వివరిస్తున్నారు:

“మీరు ఒక అనాది, అవినాశి ఆత్మ. మీరు ఈ శరీరము కాదు. ఈ భౌతిక శరీరాన్ని మర్చిపోండి. దేహాభిమానంలోకి వచ్చిన కారణంగానే మనో వికారాలు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు మీరు వికారాలను విడిచి నిర్వికారిగా అయినప్పుడే సుఖధామంలోకి రాగలరు...”ఇలా చెప్పిన తర్వాత ధ్యాని సోదరి ఈ విధంగా అడిగారు, “మీ శరీరం పేరు ఏమిటి?

“నా శరీరం పేరు లక్ష్మి.”

“ఓహో! ఒకప్పుడు మీరు సత్యమైన లక్ష్మి”, అంటూ ధ్యాని సోదరి ఈ విధంగా వివరించారు, “కానీ తర్వాత మీ

నిజ స్వరూపాన్ని మీరు మర్చిపోయారు. ఇప్పుడు మళ్ళీ సత్యమైన లక్ష్మిగా అయ్యే సమయం ఆసన్నమయింది. ఇప్పుడు మేలుకోండి, మిమ్మల్ని మీరు తెలుసుకోండి, సత్యమైన లక్ష్మిగా అవ్వండి.”

ఇంతటి శక్తిమంతమైన మాటలు వినగానే ఆ స్త్రీమూర్తి ఎంతో శక్తిని అనుభవం చేసుకుంది. విదేహి స్థితిని అనుభవం చేసుకుంది. విదేహిస్థితిలో స్థితి అయిఉన్న సమయంలో వారికి ఒక దివ్య సాక్షాత్కారము కలిగింది, తన పూర్వ జన్మల ఫలితము లభించింది.

క్షీర సముద్రం మధ్యలో ఒక రాజ మహలు కనిపించింది. అందులో ఒక దర్బారు ఉంది. దర్బారులో సర్వాంగ సుందరి శ్రీ లక్ష్మి, సర్వాంగ సుందరుడైన శ్రీ నారాయణుడు కూర్చుని ఉన్నారు.

తన తల్లిగారి అనుభవాలను పంచుకుంటూ సోదరి మనోహర్ ఈ విధంగా వివరించారు, “నాకు దర్బారులోకి వెళ్ళాలనిపించింది కానీ అందుకు సాహసించలేకపోయాను ఎందుకంటే నేను అపవిత్రురాలిని, వికారిని కదా అని అనిపించింది.”

ఈ సాక్షాత్కారము ద్వారా మా తల్లిగారికి ఈ విశ్వ విద్యాలయ బోధనలపై విశ్వాసం ఏర్పడింది. విద్యాలయ ప్రాంగణంలో వారంరోజుల పాటు ఉన్న మా తల్లిగారు తమ మిగిలిన జీవితమంతా ఈ సత్సంగంలోనే గడపాలనుకుంటున్నాని చెప్పారు. “ఇక్కడి వాతావరణం ఎంతో సాత్వికంగా ఉంది. ఆత్మకు ఎంతో శాంతి లభించింది.” అని అన్నారు. కానీ బ్రహ్మాబాబా అందుకు అనుమతించలేదు.

కారణం తెలుకోవాలని సోదరి మనోహర్ బాబా వద్దకు వెళ్ళి అడిగారు. బాబా ఇలా చెప్పారు, “మీపట్ల కఠినంగా వ్యవహరించి మిమ్మల్ని ఇళ్ళనుండి పంపేసారు, లేకపోతే ఇల్లు విడిచి ఉండాల్సిన అవసరము ఏముంది? మీరు చిన్నవారు కనుక వారి పైనే మీరు ఆధారపడవలసి ఉంది. మీకు నచ్చిన జీవితాన్ని గడపడానికి మీ ఇంట్లోనివారు అనుమతి ఇవ్వని కారణంగా మీరు ఇక్కడకు వచ్చారు. కానీ మీ తల్లిగారు ఇంట్లో పెద్దవారు. వారికి కావలసినట్లుగా వారు ఇంట్లో ఉండవచ్చు. వారిని అడ్డుకునేవారు ఎవ్వరూ ఉండరు. ఇంటికి వెళ్ళి అక్కడ అందరికీ జ్ఞానాన్ని ఇచ్చి తమ ఇంటిని కూడా ఆశ్రమంలా చేసుకునే అవకాశం తనకు ఉంది.”

ఇంటి వాతావరణాన్ని సాత్వికంగా చేయాలన్న దృఢ నిశ్చయంతో మా తల్లిగారు ఇంటికి తిరిగి వచ్చారు.

ఇటువంటి అనేక వాస్తవ గాథలు బ్రహ్మాబాబా పిల్లలకు జరిగాయి. అది సాక్షాత్కారాల సమయము. శివబాబా ఎంతోమందికి దివ్య దృష్టిని కలిగిస్తున్నారు.

ఈ విధంగా, విద్యార్థుల సంఖ్య పెరగసాగింది.

– – – – –

# భాగము 3

# యజ్ఞములో జీవితము

షుమారు 300మంది యజ్ఞ వత్సలు నియమపూర్వకంగా ఈశ్వరీయ విద్యను అభ్యసిస్తూ ఆ ఐదు భవనాలలో నివసించసాగారు. వారందరూ వివిధ జాతులు, వయస్సు, ఆర్థిక స్తోమతలు కలిగినవారు. ఇంతటి విభిన్న వ్యక్తిత్వాలున్న ఇంతమంది కలిసి ఉండటము – రోజులు, సంవత్సరాలు – మామూలు విషయము కాదు. ఈ ఘోర కలియుగంలో ఒక కుటుంబంలో ఉండే ముగ్గురు, నలుగురు కూడా ప్రశాంతంగా జీవించలేని రోజులివి. కానీ శివ పరమాత్మ బ్రహ్మ ద్వారా స్థాపించిన ఈ జ్ఞాన యజ్ఞంలోని పిల్లలు మాత్రం యజ్ఞ పిత, యజ్ఞ మాత ఇచ్చే అలౌకిక శిక్షణలను ధారణ చేస్తూ పరస్పరం స్నేహపూర్వకంగా ఉంటూ, ఎటువంటి ఘర్షణ, గొడవలు లేకుండా కలిసిమెలిసి జీవించారు.

'యాంటీ పార్టీ' వారు బ్రహ్మబాబా ధనం ఖాళీ అయిన వెంటనే ఈ ఐకమత్యములో చీలికలు వస్తాయని నమ్ముతూ వచ్చారు. కానీ వారనుకున్నది తప్పు. ధనం తక్కువగా ఉన్న రోజులలో కూడా పిల్లలకు, బాబాకు మధ్య ఉన్న విశ్వాస బంధం ఏమాత్రం తగ్గలేదు. ఓం మండలి సమాజము అన్ని కష్టాలను ఎదుర్కుంది ఎందుకంటే దీనిని స్థాపించింది ఒక మానమాత్రుడు కాదు కదా, దాని ఉనికి ఒక మానవుని స్వార్థం కోసం కూడా కాదు. స్వయంగా భగవంతుడే ఈ యజ్ఞాన్ని స్థాపించారు, వారి శక్తే దీనిని సంరక్షిస్తూ ఉంది.

శివబాబా యొక్క ప్రేమపూర్వక ఛత్రఛాయలో యజ్ఞ వత్సలు తమ పాత సంస్కారాలను పరివర్తన చేసుకుంటూ క్రొత్త ఆత్మిక భావాలను, సంస్కారాలను అలవర్చుకోసాగారు. బాబా మరియు మమ్మా తమ ఆదర్శ జీవితాలతో ఉదాహరణగా నిలుస్తూ అందరికీ అజేయమైన ఉత్సాహాన్ని, ప్రబలమైన ప్రేరణలను, స్పష్టమైన మార్గదర్శనను నిరంతరం అందిస్తూ ఉన్నారు.

# దివ్య దృష్టి

ఈ సృష్టిలో మూడు లోకాలు ఉంటాయని భగవంతుడు మానవాళికి బోధించారు. ఈ భౌతిక ప్రపంచానికి దూరంగా ప్రకాశవంతమైన సూక్ష్మ లోకము ఉంటుంది. ఇందులో మళ్ళీ మూడు భాగాలుంటాయి. ఇక్కడే అనేకమందికి అనేక సాక్షాత్కారాలు జరిగాయి. శివబాబా తమ నిరాకారీ ప్రపంచమునుండి క్రిందకు అవతరించిన తర్వాత ఈ సూక్ష్మ లోకాన్ని వారు సందేశాలను అందించడానికి ఉపయోగిస్తున్నారు.

ఈ సూక్ష్మ లోకానికి పైన అనంతమైన నిరాకారీ ప్రపంచము ఉంటుంది. అందులోనే బ్రహ్మతత్త్వము ఉంటుంది. దీనినే బౌద్ధులు నిర్వాణము అని అంటారు. బంగారు ఎరుపు వర్ణంలో ఉండే ఈ పరంధామంలోనే మన శివబాబా ఉంటారు. సృష్టికాలంలోని అత్యధిక సమయము శివబాబా ఇక్కడే ఉంటారు. ఇదే ఆత్మల నిజధామము. మనం జన్మ తీసుకోకముందు అక్కడే ఉండేవారము. ఇప్పుడు మనమందరమూ మళ్ళీ తిరిగి వెళ్ళవలసినది ఆ శాంతిధామానికే. ఈ పరంధామానికి మనం మన మనసులతో ప్రయాణం చెయ్యడం ఎలాగో శివబాబా మనకు నేర్పించారు. ఇదే రాజయోగము. ప్రతి రాజయోగి తనను తాను ఒక చైతన్య శక్తిగా, ఆత్మగా భావించి ఆ ప్రేమ సాగరంలో, ఆనంద సాగరంలో మునిగిపోతాడు.

కొంతమంది యజ్ఞ వత్సలు ధ్యానావస్థలో, శివబాబా నుండి ప్రత్యేకమైన సందేశాన్ని సూక్ష్మ లోకానికి వెళ్ళి తీసుకువచ్చే వరదానాన్ని పొందారు. ఇటువంటి పాత్రను వహించే సోదరీలను 'సందేశి పుత్రికలు' అని పిలవసాగారు. శివబాబా వీరికి, రాబోయే పావన, దైవీ సత్యయుగపు అలౌకిక పద్ధతులు, వారి జీవనశైలి, రాజ్య భాగ్యము, రాజ దర్బారు, రత్నాలు పొదిగిన దేవతల వస్త్రాలు, వినోదపు దృశ్యాలను చూపించారు. దివ్యదృష్టిలో చూసిన విధంగా అటువంటి వస్త్రాలను తయారు చేసి వాటిని ధరించి ప్రాక్టికల్‌గా చూపించమనేవారు, అప్పుడు ఇతర యజ్ఞ వత్సలకు కూడా ఆ దృశ్యాలు అర్థమవుతాయి అని శివబాబా అనేవారు. ఈ విధంగా యజ్ఞ వత్సలలో జ్ఞాన వికాసము జరిగేది, మనోరంజనము కూడా జరిగేది, అలాగే వారి నిశ్చయమనే పునాది ఆధ్యాత్మికలో పటిష్టమవుతూ వచ్చింది. సత్యాన్ని అర్థం చేసుకునే వారి మనసు ఎంతో పరిపక్వతను సాధించింది.

దివ్య దృష్టి ప్రదాత అయిన శివబాబా ఒక్కోసారి కొంతమంది యజ్ఞవత్సల కర్మలను కూడా సందేశి పుత్రికలకు సాక్షాత్కారము చేయించేవారు. ఏ పిల్లలైతే ఇంకా తమలో చెడు సంస్కారాలతో ఉన్నారో, వాటిని వారు దాచిపెట్టే ప్రయత్నం చేస్తూ ఉన్నారో, వారు తమలోని ఈ అశుద్ధ సంకల్పాలు ఎవ్వరికీ తెలియవు కదా అని అనుకుంటే అప్పుడు సందేశి పుత్రికలకు శివబాబా అటువంటి పిల్లల స్థితిని సాక్షాత్కారము చేయించేవారు. అప్పుడు ఆ సందేశి పుత్రికలు ఈ విషయాన్ని ఆ యజ్ఞ వత్సలకు విడిగా వినిపించేవారు. ఇది విన్న ఆ వత్సలు శివబాబాకు తమ కర్మలన్నీ తెలుసునని జాగ్రత్త వహించేవారు.

సందేశి పుత్రికలు ధ్యానావస్థలో యమధర్మరాజపురిలో వికర్మలకు పర్యవసానంగా లభించే కఠినమైన దండనలను కూడా చూసేవారు. యమధర్మరాజపురిలో శిక్షలు ఎలా ఉంటాయనే విషయాన్ని వారు వర్ణించేవారు, అభినయం చేసి వివరించేవారు. ఇది చూసిన యజ్ఞ వత్సలు, ఇటువంటి కఠినమైన శిక్షలు పొందకుండా ఉండేందుకు చెడు కర్మలనుండి స్వయాన్ని రక్షించుకునేవారు. సందేశి పుత్రికలకు శివ బాబా, పితాశ్రీ బ్రహ్మ యొక్క అనేక జన్మల సాక్షాత్కారాన్ని కలిగించారు. అంతే కాకుండా బ్రహ్మ యొక్క 'సంపూర్ణ రూపము'ను కూడా చూపించారు. ఈ మమ్మా, బాబాయే 'ప్రజాపిత బ్రహ్మ' మరియు 'జగదాంబ సరస్వతి' అని, వీరి సర్వస్వ త్యాగము, అవిశ్రాంత సేవ, దివ్య గుణాల పరాకాష్ఠ, నిర్వికారీ జీవితము మరియు రాజయోగ విశేష అభ్యాసము చేసినందుకు ఫల స్వరూపంగా వీరు ఈ అవ్యక్త స్థితులను ధారణ చేస్తారు అని వివరించారు. వీరినే శాస్త్రాలలో ఆది దేవ్, ఆది దేవి, ఆదమ్ బీబీగా వ్యవహరిస్తున్నారు.

# మరో బ్రహ్మలోని నిగూఢ రహస్యము

సాక్షాత్కారాల వలన ఆత్మపై ఉన్న పాప భారము ఏ మాత్రమూ తగ్గదని, అది యోగ స్థితికి దర్పణం కాదని, అది భగవంతుని సాన్నిహిత్యానికి తార్కాణం కాదని శివబాబా వివరించినాగానీ అనేకమంది యజ్ఞ వత్సలకు సాక్షాత్కారాలపై ఎంతో శ్రద్ధ కలిగింది. వర్తమానంలోకానీ, గతంలోకానీ సంస్థ ప్రశాసకులుగా వ్యవహరించిన వారెవరూ సందేశి పుత్రికల పాత్రను వహించలేదు.

కానీ క్రొత్త సమాచారాన్ని ఇవ్వాలనుకున్న కొన్ని సందర్భాలలో, మాటలకన్నా ఎక్కువగా దృశ్యాల ద్వారా సమాచారము స్పష్టంగా అర్థం చేయించాల్సిన సందర్భాలలో సందేశి పుత్రికల సహాయాన్ని తీసుకునేవారు. మరో బ్రహ్మను అనగా సంపూర్ణ బ్రహ్మను గురించి సందేశిపుత్రిక అయిన దాదీ హృదయమోహినిగారు తమ అనుభవాలను ఈవిధంగా నెమరువేసుకుంటున్నారు:

"ఒక రోజు, పితాశ్రీ బ్రహ్మబాబా, పిల్లలైన మా అందరి ఉన్నతి కోసం ఒక క్రొత్త పురుషార్థాన్ని చెప్పారు. ఒక వారమంతా, మేమంతా సంపూర్ణ మౌనంలో ఉండాలి – ఆంతరిక మరియు బాహ్య మౌనము – (ఆంతరిక మౌనము అనగా మనసులో ఎటువంటి వ్యర్థ సంకల్పాలు లేకుండుట. బాహ్య మౌనము అనగా నోటి ద్వారా మాటల మౌనము).

"మేమందరమూ బాబా చెప్పిన వెంటనే మౌనములో ఉండటం ఆరంభించాము. షుమారు 300 మంది యజ్ఞ వత్సలము కలిసి ఉండేవారము. యజ్ఞంలోని ప్రతి కార్యము మునుపటివలె యథావిధిగా జరుగుతూ ఉంది కానీ మౌనము, అంతర్ముఖత కారణంగా వాతావరణము, దృశ్యము ఎంతగా అవ్యక్తంగా, అలౌకికంగా అనిపించిందంటే పిల్లలందరూ నడుస్తూ తిరుగుతూ ఉన్న ఫరిశ్తాలుగా, శాంతి పవిత్రతల ప్రకాశముతో నిండి ఉన్నట్లుగా కనిపించారు.

"అంతర్ముఖత నిండిన ఇటువంటి దినచర్య ప్రారంభమై రెండుమూడు రోజులు అయ్యింది. ఒక రోజు సాయంత్రం నేను ఒక సోదరితో కలిసి ఏకాంతంలో ఆత్మ స్థితిని అభ్యాసం చేస్తున్నాను. అనుకోకుండా ఆ సమయంలో ప్రియమైన శివబాబా ద్వారా నాకు దివ్యదృష్టి యొక్క అనుగ్రహము లభించింది.

"నేను ఈ ప్రపంచము, దేహ స్మృతులనుండి దూరంగా సూక్ష్మ లోకానికి వెళ్ళాను. అక్కడ, ఇక్కడున్న పితాశ్రీ బ్రహ్మ అవ్యక్తంగా, సూక్ష్మంగా, ప్రకాశమయ శరీరధారిగా కనిపించారు. ఈ చర్మచక్షువులతో పితాశ్రీని ఏ వ్యక్త శరీరంతో అయితే చూసానో అదే నయనాలు, హావభావాలతో ఉన్న మరో బ్రహ్మను ప్రకాశమయ శరీరంలో సూక్ష్మ లోకంలో చూసాను. ఎంతో మధురమైన చిరునవ్వుతో ఆ అవ్యక్తమూర్తి, ఆకర్షణమూర్తి నా వైపు చూస్తున్నారు. అంతే, ఇది చూసిన తర్వాత నేను ధ్యానావస్థ నుండి క్రిందకు వచ్చేసాను. బ్రహ్మబాబా యొక్క ఈ క్రొత్త, ప్రకాశమయ రూపాన్ని చూసి వచ్చిన నేను ఎంతో సంతోషంగానూ, ఆశ్చర్యంగానూ ఉన్నాను. సంతోషం ఎందుకంటే ఇప్పటివరకు సందేశి పుత్రికలందరికీ దివ్యదృష్టిలో శ్రీ కృష్ణుడు, సీతారాములు, లక్ష్మీ నారాయణుల వంటి దేవీదేవతల సాక్షాత్కారాలు మాత్రమే జరిగాయి. కానీ ఇటువంటి క్రొత్త సాక్షాత్కారము వలన నాకు ఎంతో ఆశ్చర్యము కూడా కలిగింది ఎందుకంటే ఇక్కడ ప్రత్యక్షంగా, సాకార రూపంలో పితాశ్రీ బ్రహ్మ విరాజమానమై ఉండగా సూక్ష్మ రూపంలో మరో బ్రహ్మను చూపించడంలోని రహస్యమేమిటి?

"ఇందుకు నా వద్ద సమాధానము లేదు. అందుకే నేను మమ్మా వద్దకు వెళ్ళాను. దీనిలోని రహస్యమేమిటో మమ్మాకు కూడా తెలియదన్నారు. ఈ విషయాన్ని బాబాకు చెప్పమన్నారు. కానీ ఆశ్చర్యమేమిటంటే బ్రహ్మబాబాకు కూడా దీనిలోని రహస్యం తెలీలేదు. 'శివబాబా మనకు ఏదో రహస్యాన్ని తెలియజేస్తున్నారు. ఈసారి దివ్యదృష్టిలో మళ్ళీ ఈ దృశ్యం కనిపిస్తే మీరెవరు అని నువ్వు వారినే అడుగు' అని పితాశ్రీ బ్రహ్మ చెప్పారు.

“ఆ రోజు గడిచింది. మరుసటి రోజు సాయంత్రం, నేను మళ్ళీ ఆత్మ స్థితిని అభ్యాసం చేస్తున్నాను. అప్పుడు నా ఆత్మను ఎవరో అవ్యక్తంగా ఆకర్షిస్తున్నట్లుగా అనిపించింది. అప్పుడు మళ్ళీ నేను ధ్యానావస్థలోకి వెళ్ళాను. ఈసారి నాకు ఏడు రోజులు వరుసగా సాక్షాత్కారాలు జరిగాయి.

“మరో బ్రహ్మ కనిపించినప్పుడు పితాశ్రీ వారి పరిచయం అడగమన్నారు కదా. సాక్షాత్కారంలో ఆ మరో బ్రహ్మ మళ్ళీ కనిపించినప్పుడు వారి పరిచయాన్ని అడిగేందుకు సాహసించాను, ‘మీ పూర్తి పరిచయమును తెలుసుకునే సౌభాగ్యము నాకు ప్రాప్తించగలదా?’ వారు అవ్యక్తంగా ఈ విధంగా చెప్పారు, ‘నేను ఆ సాకార బ్రహ్మ యొక్క సంపూర్ణ మూర్తిని, అవ్యక్త బ్రహ్మను.’

“ఆ అవ్యక్త బ్రహ్మను అలా నేను అనేకసార్లు కలిసాను. ఆ అవ్యక్తమూర్తి అనేక జ్ఞాన రహస్యాలను విశదీకరించారు. ఈ మనుష్య సృష్టికి చెందిన సూర్య, చంద్ర తారాగణానికి దూరంగా ఉన్న సూక్ష్మ వతనాన్ని పూర్తిగా అర్థం చేయించి సాక్షాత్కారము చేయించారు. ఒక పవిత్రమైన సంకల్పంతో అది సృష్టింపబడ్డదని నాకు అర్థమయింది. నిరాకారీ ప్రపంచము, అక్కడున్న నిరాకార పరమాత్మ, ఆ అఖండ జ్యోతి సాక్షాత్కారము జరిగాయి. ఆ తర్వాత నేను సాకార సృష్టి యొక్క మహా వినాశన దృశ్యాలను చూసాను. వినాశనము తర్వాత సత్యయుగ స్థాపనను కూడా చూసాను. అక్కడ వారు మాట్లాడే భాషను నేను విన్నాను, వారు ధరించే వస్త్రాల తళుకు బెళుకులను చూసాను, వారి దినచర్యను గమనించాను, రాజ దర్బారులో ఉండే ఆచారాలను వీక్షించాను.

“నేను మళ్ళీ అవ్యక్త బ్రహ్మను చూడటానికి వెళ్ళినప్పుడు వీరు ఎలా సంపూర్ణ బ్రహ్మగా అయ్యారో అర్థమయింది. శివబాబా కూడా తప్పకుండా వారితో ఉన్నారని అనిపించింది.”

ఈ అవ్యక్త బ్రహ్మ ద్వారానే శివబాబా యజ్ఞ వత్సలందరికీ క్రొత్త పేర్లను ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఆ విధంగా క్రొత్త పేర్లను పిల్లలకు ఇవ్వడం లేదుగానీ సందేశిపుత్రికల ద్వారా సందేశాన్ని మాత్రం ఇస్తున్నారు. అటువంటి సందేశాలలో ఈ క్రిందిది ఒకటి –

### *అవ్యక్త బాప్‌దాదా నుండి వచ్చిన అలౌకి దివ్య సందేశము*
### *(దాదీ గుల్జార్ ద్వారా సూక్ష్మ వతనం నుండి జూన్ 6, 1980న వచ్చినది)*

ప్రాతఃకాల సమయంలో అనగా అమృతవేళలో నేను సూక్ష్మ లోకంలో అడుగు పెట్టాను. అక్కడి దృశ్యము ఎంతో అద్భుతంగా ఉంది! ఆల్‌మైటీ బాబా ఎంతో మధురమైన చిరునవ్వుతో, ఆకర్షణీయంగా కనిపించారు. వారు శక్తిశాలి వైబ్రేషన్ల మధ్యలో ఉన్నారు. దూరంనుండి నాకు బాబా ఆ విధంగా కనిపించారు. నేను బాబాను సమీపిస్తున్నకొద్దీ అశరీరి స్థితిని అనుభవం చేస్తున్నాను. నేను బాబా వద్దకు చేరుకునేసరికి శివశక్తిగా, నా తండ్రివలె శక్తి స్వరూపిణిగా అనుభవం చేసుకున్నాను!

కొద్ది సమయము నేను ఈ శక్తిశాలి స్థితిలోనే ఉండిపోయాను. ఇప్పటికీ నేను ఆ అత్యద్భుతమైన క్షణాలను తలుచుకుంటే ఆ శక్తిశాలి స్థితిని నేను అనుభవం చేసుకోగలుగుతాను.

కొద్ది సేపటి తర్వాత బాబా చిరునవ్వు నవ్వి తమ మధురమైన వాక్యాలను పలికారు, “ప్రియమైన బిడ్డా! ఈ కొన్ని క్షణాల అనుభవం కూడా మిమ్మల్ని సూక్ష్మ స్థితిలో ఉంచేందుకు సహాయ పడుతుంది.” నేనిలా అన్నాను, “నిజమే బాబా, సాకార రూపంలోని అంతిమ రూపాన్ని అనుభవం చేసుకుంటున్నట్లుగా నాకనిపిస్తుంది. మాస్టర్ ఆల్‌మైటీ స్థితిలో ఉన్నాను. ఈ అనుభవం అత్యద్భుతంగా ఉంది.”

బాబా ఇలా అన్నారు, “ఈ శక్తిశాలి స్థితిని మీరు కొనసాగించాలి. అతి కొద్ది సమయంలో ఈ సాకార ప్రపంచంలో ఎన్నో అలజడులు ప్రారంభం కానున్నాయి. ఆ సమయంలో, మీరు ఈ స్థితిని అభ్యాసం చేసి అలజడులను తొలగించే

సేవను చెయ్యాలి. అలజడుల కారణంగా ధరలు ఆకాశాన్ని అంటుకుంటాయి. అది ఎన్నో మానసిక వ్యధలకు, శారీరిక బాధలకు కారణమవుతుంది. మనుషులలో, ప్రకృతిలో ఎంతో అశాంతి నెలకొంటుంది. అజ్ఞానముతో అంధులుగా అయ్యిన మనుష్యులు తమ అల్పకాలికమైన కోరికలను తీర్చుకోవడంలో ఎంతగా మునిగిపోతారంటే అందులో నిజమైన సంతోషముందని భావిస్తారు. కానీ పాపం, చివరకు అది మృగతృష్ణ మాత్రమే అని తెలుసుకుని ప్రతి రంగంలో – రాజకీయంగా, నైతికంగా, భౌతికంగా అసంతృప్తితో మిగిలిపోతారు.

బాబా అన్నారు, “కానీ, దీని పరిణామంగా ఒక పెద్ద విప్లవమే జరుగుతుంది. ఒక్క దెబ్బతో పూర్తి విశ్వమే పరివర్తన చెందుతుంది. అదెలా జరుగుతుంది? భౌతిక సుఖాలను పొందడానికి మనిషి వికారాలకు వశమై, నిజాయితీకి దూరంగా బ్రతుకుతున్నాడు. భౌతిక సుఖాలకోసం మనిషి తన వ్యక్తిత్వాన్ని అమ్ముకున్నాడు, సిద్ధాంతాలకు నీళ్ళు వదిలాడు. అతనిలోని అత్యాశలను గర్తించలేక చివరకు నిస్సత్తువగా, కష్టాల సుడిగుండంలో మునిగిపోతున్నాను అని బాధపడ్తాడు.

“అప్పుడు ఆత్మ జాగృతి కలిగి భౌతిక సుఖాలనుండి ముఖం తిప్పుకుంటాడు. భగవంతుడివైపు ఆశగా చూస్తాడు. కానీ భగవంతుడివైపు మరలడమన్నది అకస్మాత్తుగా జరగదు. తన మునుపటి ప్రయత్నాల వలన సుఖాన్ని పొందడంలో విఫలమయ్యానని అర్థం చేసుకున్న మానవుడు సుఖ సాధనకు మరింత సులభమైన మార్గాన్ని అన్వేషిస్తాడు. ‘సుఖసంతోషాలను పొందడానికి మరేదైనా మార్గముండి తీరాలి. మనశ్శాంతిని పొందే మార్గమేమిటి’ అని ఆలోచిస్తాడు. చివరకు, ఆ ప్రయత్నాలు కూడా విఫలమైనప్పుడు, వారి మనసులు భగవంతుడిని గుర్తిస్తాయి, ‘ఓ భగవంతుడా! నీవు మాత్రమే మాకు ఆధారము, నీవే ముక్తిని ప్రసాదించగలవు, నీవే మా అంతిమ గమ్యము, లక్ష్యము.’ అని తెలుసుకుంటారు. అదే సంధి సమయము.

“ఒక వైపు, భగవంతుడే మా సమస్యలను పరిష్కరించగలడు, వారే మా నిజమైన ఆధారము అని అర్థం చేసుకుంటారు, మరొక వైపు, ఈ వికారీ ప్రపంచంపై తాము పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలు అయినప్పుడు విశ్వ వ్యాప్తంగా వైరాగ్యము, త్యాగ భావనలు వెల్లువెత్తుతాయి.

“భౌతిక కోరికల కారణంగా వచ్చిన అలజడులను సద్దుమణిగేలా చేయగలిగింది ఈ ఒక్క పరివర్తన మాత్రమే. విశ్వంలోని అందరి దృష్టి భగవంతుని వైపే ఉంటుంది. వికారాల త్యాగము మరియు భగవంతునిపై పెరిగిన భక్తిశ్రద్ధల కారణంగా ఆత్మల ఆలోచనలు సున్నితంగా తయారవుతాయి. అటువంటి సమయంలో పిల్లలైన మీరు వారి మనసులలో భగవంతుని పరిచయ జ్ఞాన బీజాలను నాటేందుకు నిమిత్తమవ్వాలి. ఆత్మ ధరిణిలో నాటిన ఆ జ్ఞాన బీజములకు ఫలితాన్ని భగవంతుడు అనుగ్రహిస్తాడు. సర్వశక్తిమంతుడైన భగవంతుని సమానంగా మీరు ఈ సమయంలో మీ స్థితిని తయారు చేసుకుని ఉండాలి. అలా సంసిద్ధులుగా ఉన్నప్పుడే మీ వద్దకు వచ్చిన వారికి వారి నమ్మకానికి ప్రతిఫలంగా వరదానాలను, శక్తిని అందించగలరు.”

ఇలా చెప్తూ బాబా అకస్మాత్తుగా ఆలోచనల సాగరంలో మునిగిపోయారు. ఏదో విషయం గురించి బాబా ఆలోచిస్తున్నారని అనిపించింది. కొద్ది సేపటి తర్వాత నేనిలా అడిగాను, “బాబా, ఇప్పుడు మీరెక్కడికైనా వెళ్ళారా?” “అవును” అని బాబా ఇలా జవాబిచ్చారు–

“పిల్లల వర్తమాన స్థితి మరియు అంతిమ స్థితి గురించి బాబా ఆలోచిస్తున్నారు. కొంతమంది పిల్లలు ఇంకా ‘టెన్షన్’ మరియు ‘అటెన్షన్’ మధ్యన ఊగిసలాడుతూ ఉన్నారు.

“మధురమైన పిల్లలకు నీవు నా ఈ సందేశాన్ని అందించాలి, ‘శివబాబాను ప్రత్యక్ష్యం చెయ్యడానికి ఫిబ్రవరి 1981లో మీరు చేపట్టబోయే ‘మహా యజ్ఞము’ అను కార్యక్రమం కోసం మీరందరూ మీ సంపూర్ణ స్థితి ద్వారా శివబాబాను ప్రత్యక్షం చేయాలనుకుంటున్నారు. దీనితోపాటు విశ్వంలోని వాతావరణాన్ని పరివర్తన చేసి అందరిలో లోతైన అవగాహన తీసుకురావాలి అని కూడా మనసా సేవను చేయండి.”

పిల్లలలోని ఉల్లాస ఉత్సాహాలను చూసి బాప్‌దాదా చాలా సంతోషిస్తున్నారు. బాప్‌దాదా ఇంకా ఇలా చెప్పారు, "భవిష్యత్తు కోసం కూడా నిరంతరం సంతోషము మరియు భాగ్యపు స్మృతులతో ఉండండి. అంతేకాక ఇతరులకు కూడా సంతోష ఖజానాలను పంచుతూ ముందుకు సాగుతూ ఉండండి. ఈ విధంగా మీరు పురుషార్థంలో ముందుకు వెళ్ళగలరు."

# యోగాగ్ని

మౌనంలో ఉండే ఆ రోజులలో యజ్ఞ వత్సలు ఫలాహారాన్ని మాత్రమే స్వీకరించేవారు. ఉదయం 3 గం॥ల నుండి రాత్రి 10.30 గం॥ల వరకు రోజంతా యోగంలో నిమగ్నమై ఉండేవారు. ఉదయం 6 గంటలకు శివబాబా పరంధామం నుండి బ్రహ్మ ముఖారవిందం ద్వారా మురళిని వినిపించడానికి వచ్చేవారు. ఆ తర్వాత, విన్న మురళి గురించి వత్సలు రోజంతా చింతన చేసేవారు. దీనిని భట్టీ అని అనేవారు. భట్టీ అని ఎందుకన్నారంటే, ఎలా అయితే భట్టీలో ప్రజ్వలితమైన అగ్నిలో పచ్చి మట్టితో తయారైన మట్టి పాత్రలు లేక ఇటుకలను వేసి కాల్చి వాటిని గట్టిపరుస్తారో, ఎలాగైతే ఎర్రటి నిప్పులో వేసిన ఇనుమును కంసాలి తనకు నచ్చిన ఆకారానికి తెచ్చుకుంటాడో అలాగే రాజయోగులు కూడా తమ మనసులోని మలినాలను యోగ అగ్నిలో వేసి శుద్ధి చేసుకుంటారు. ఇటువంటి శక్తిశాలి, లోతైన, నిరంతర భగవంతుని స్మృతి ద్వారా యజ్ఞ వత్సలు దేహ అభిమానమును త్రెంచి ఆత్మిక స్థితిలో స్థితి అవ్వగలుగుతారు. గాలికంటే తేలికగా, స్వయాన్ని ఒక చైతన్య శక్తిలా వత్సలు అనుభవం చేసేవారు. వారు మౌన శక్తిని ప్రాప్తి చేసుకున్నారు.

# కర్మ యోగము

ఈ విధంగా యజ్ఞ వత్సలందరూ ఎంతో తపనతో ఈశ్వరీయ స్మృతిలో ఉండే అభ్యాసమును చేస్తూ ఈశ్వరీయ విద్యను అధ్యయనం చేస్తూ ఉండేవారు. నియమితమైన దినచర్య వారికి మరింత శక్తిని చేకూర్చింది. 'ప్రేయసులారా మేల్కొనండి, నవయుగం వచ్చేస్తుంది' అన్న పాటను ఉదయాన్నే లౌడ్ స్పీకర్ ద్వారా వినిపించేవారు. ఈ పాట వింటూ భగవంతుని తలంపుతో మొదటి సంకల్పాన్ని చేస్తూ ఆ రోజును ప్రారంభించేవారు.

ఈ పాటలోని ఆధ్యాత్మిక రహస్యాన్ని తల్చుకుంటూ యజ్ఞ వత్సలందరూ మేల్కునేవారు – 'ఇప్పుడు సత్యయుగము లేక నవ యుగము రానుంది. ఇప్పుడు మనం అజ్ఞాన నిద్రనుండి మేల్కుని ఆత్మ జాగృతి చేసుకోవాలి, అంతే కాకుండా ఇప్పుడు ఈ నిద్ర నుండి కూడా లేవాలి.' అందరూ తమ తమ మంచాలపైనే కొద్దిసేపు కూర్చుని పరమాత్ముని స్మృతిలో ఉండేవారు. ఆ తర్వాత కొంత వ్యాయామం చేసేవారు. తర్వాత నిత్య కర్మలు, స్నానాదులు ముగించుకుని ఉదయం 5.30 గంటలకల్లా క్లాసులో యోగాభ్యాసానికి చేరుకునేవారు. యోగాభ్యాసం తర్వాత జ్ఞాన మురళిని వినేవారు. తర్వాత అందరూ అల్పాహారాన్ని సేవించి యజ్ఞ సేవలో మునిగిపోయేవారు. యజ్ఞంలోని ప్రతి సోదరి, సోదరుడికి యజ్ఞంలో ఏదో ఒక బాధ్యతను ఇచ్చేవారు. కొంతమంది కలిసి అందరి బట్టలు ఉతికేవారు. మరికొంతమంది కలిసి భోజనం వండేవారు. కొందరు ఆఫీసు కార్యాలను చూసుకునేవారు. యజ్ఞంలో ఉండే కార్లు, సైకిళ్ళను శుభ్రపరుచుకోవడం, బాగుచేసుకోవడం వంటివి కూడా యజ్ఞ వత్సలే చూసుకునేవారు. ధాన్యం శుభ్రం చెయ్యడము, కూరగాయలు కొయ్యడము, బట్టలు కుట్టడము, చదవడము-వ్రాయడము వంటి అనేక సేవా కార్యక్రమాలు ఉండేవి. ప్రతి కార్యము పరమాత్ముని మధుర స్మృతిలోనే చేసేవారు.

ఈశ్వరీయ జ్ఞాన సాహిత్యాన్ని వేలాదిమందికి పోస్టు ద్వారా పంపించేవారు. ఇందుకోసం కొంతమంది యజ్ఞ

వత్సలు సాహిత్యాన్ని వ్రాయడంలో, అచ్చు వేయడంలో మునిగి ఉండేవారు. సాహిత్యానికి సంబంధించిన ప్రతి కార్యముకూడా యజ్ఞ వత్సలే మనస్ఫూర్తిగా, అలసట లేకుండా సేవాభావంతో చేసేవారు.

ఇంతలో భోజన సమయం అవుతుంది. భోజన సమయంలో వత్సలందరూ పంక్తిలో కూర్చుని సామూహికంగా, యోగయుక్త అవస్థలో భోజనం చేసేవారు. భోజనం తర్వాత కొంత సమయం విశ్రాంతి లేక వ్యక్తిగత అవసరాల కోసం లభించేది. విశ్రాంతి తర్వాత మళ్ళీ అందరూ తమ తమ సేవలలో మునిగిపోయేవారు. రాత్రి భోజనానికి ముందు అందరూ హాలులో కూర్చుని సామూహిక యోగాన్ని చేసేవారు. అప్పుడు సందేశి పుత్రికలు భగవంతుడికి భోజనాన్ని నైవేద్యంగా(భోగ్) అర్పించేవారు. ఆ తర్వాతే అందరూ భోజనం చేసేవారు. రాత్రి భోజనం తర్వాత యజ్ఞ మాత మరియు యజ్ఞ పిత ఉదయం శివబాబా వినిపించిన మురళి గురించి తమకు జరిగిన చింతనను, జ్ఞానములో ఇతర లోతైన విషయాలను తెలియజేసేవారు. చివరగా అందరూ మరోసారి యోగనిష్ఠలో కూర్చునేవారు.

యోగము పూర్తయ్యాక అందరూ యోగ స్థితిలో, మౌనంగా లేచి క్లాసు నుండి తమ పడకగదికి చేరుకుని తమ తమ మంచాలపై కూర్చుని రోజంతా తమ దినచర్య ఎలా సాగింది, రేపటి రోజున ఏ విషయంపై శ్రద్ధ వహించాలి అని ఆత్మ పరిశీలన చేసుకుని ఈశ్వరీయ స్మృతిలో, సతోగుణ నిద్రలోకి జారుకుని విశ్రాంతి తీసుకునేవారు.

# ఈశ్వరీయ కచేరీ (దర్బారు)

కొన్నిసార్లు రాత్రిపూట కచేరీ జరిగేది. ఇటువంటి సంఘటన బహుశా మరే ఇతర సత్సంగాలలోనూ విజయవంతంగా జరిగి ఉండకపోవచ్చు. ఎందుకంటే వ్యక్తిత్వ పరివర్తన కోసం ఉపయోగించే ఈ సాధనము ఎంతో గొప్పది. ఇందులో యజ్ఞ వత్సలకు మధ్యవర్తిగా వ్యవహరించి కచేరీని నడిపించే బ్రహ్మపై సంపూర్ణ విశ్వాసం ఉండాలి, అంతేకాక మధ్యవర్తిగా ఉన్న బ్రహ్మ ఎంతో నిజాయితీగా, నిర్లిప్తంగా వ్యవహరించాలి. మధ్యవర్తి ద్వారా ఈ ఈశ్వరీయ కచేరీని నడిపించేది స్వయంగా భగవంతుడే.

ఈశ్వరీయ కచేరీ అనగా రోజంతటిలో ఒకవేళ ఏదైనా జ్ఞాన విరుద్ధమైన కర్మ జరిగితే, ఏదైనా పొరపాటు జరిగితే, వారు అందరి ఎదుట మమ్మా-బాబాకు వినిపించేవారు. కేవలం చేసిన తప్పును వినిపించడమే కాకుండా ఇక మీదట ఆ పొరపాటు జరగదు అని దృఢ సంకల్పం చేసేవారు. ఎవరైనా ఇతరులలో ఏదైనా పొరపాటును గమనిస్తే వారి మంచి కోసం, వారి ఉన్నతి కోసం కూడా ఆ పొరపాటును ప్రస్తావించడం జరిగేది. ఈ పొరపాట్లను సరిదిద్దుకోవడానికి అవసరమైన ఉపాయాలను కూడా మమ్మా, బాబా అందరికీ చెప్పేవారు. అందరూ సంపూర్ణంగా అవ్వాలి అన్న ఒకే ఒక్క శుద్ధమైన భావనతోటే ఈ కచేరీ జరిగేది.

మమ్మా, బాబా పిల్లల ఉన్నతిని మనస్ఫూర్తిగా కోరుకునేవారు. పొరపాట్లను చెయ్యకుండా ఉండేందుకు, చెడు స్వభావ సంస్కారాలను తొలగించుకునేందుకు యుక్తులను తెలియజేసేవారు. అందరి అవసరాలను కూడా గమనించుకుంటూ ఉండేవారు. ఎవరికైనా ఏదైనా వస్తువు అవసరమైనా, ఏ విధమైన సౌకర్యం కావలసి వచ్చినాగానీ ఈ కచేరీలో సంకోచం లేకుండా మమ్మా బాబాను అడగవచ్చు. వారు వారికి స్నేహపూర్వకంగా కావలసినవి సమకూర్చేవారు. అందరి ముందు వారికి కావలసినవి అడగడం ద్వారా, చేసిన తప్పును చెప్పుకోవడం ద్వారా అందరి మనసుల్లోని సంకోచము మరియు దేహాభిమానము తొలగిపోయేవి.

ప్రేమపూర్వకమైన ఇంటి వాతావరణం నెలకొనేది. తద్వారా కచేరీ అంటే భయమనిపించేది కాదు. కచేరీ ద్వారా ఎంతో నేర్చుకోవడానికి లభిస్తుందని అందరూ ఎంతో సంతోషించేవారు. 'సత్య క్షణాలు' తొణికిసలాడే సమయము ఈ కచేరీ. ఇటువంటి పద్ధతి ఉండి ఉండకపోతే అపరాధ భావంతో, చెడు సంస్కారాలతో కొనసాగే మనసే మిగిలిపోయేది. కానీ ఇప్పుడు మనసు ఎంతో తేలికగా అవుతుంది.

ఈ సందర్భంలో ఒక యజ్ఞ వత్స వ్రాసిన పాట ఈ విధంగా ఉంది:

*ప్రస్తుత ఘోర అంధకార సమయాన,*
*ప్రకాశ ప్రపంచం నుండి నీ అవతరణ జరిగేను,*
*ప్రపంచంలోని పాపాన్ని తరిమి కొట్టడానికి.*

*ఈ సంగమ సమయము సుందరము,*
*ఈ సృష్టి నాటకములో ఉన్నది ఉత్థాన పతనము,*
*ఈ కలియుగ తీరాన్ని నీ సహాయముతో దాటుతాము.*

*ఇప్పుడు మాకున్నది మహా భాగ్యము,*
*మీ మాటలే మాకు తియ్యని భోజనము,*
*మీ శిక్షణలు మాకు దైవత్వాన్ని ఇస్తున్నాయి.*

హే భగవంతుడా! మీరు సర్వోన్నతులు,
పవిత్ర నూతన సృష్టికి మీరు సృష్టికర్తలు.

శివబాబా, మీరు భారతావనిపై అవతరించారు,
మా జీవితాలను మార్చి
మీరు సృష్టి చక్రాన్ని త్రిప్పుతున్నారు.

# బ్రహ్మాబాబాగారి స్ఫూర్తిదాయకమైన, ఆదర్శమయ జీవితము

పిల్లలకు అన్ని రకాల వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చెయ్యడమే కాక బ్రహ్మాబాబా తమ ఉన్నతమైన వ్యక్తిత్వంతో పురుషార్థంలో అందరికీ ప్రేరణగా నిలిచేవారు. వారి ముఖంలో సదా కన్పించే హర్షితము, అలసట లేని సేవను చూసి అందరూ తమలో విశేషమైన ఉత్సాహమును నింపుకునేవారు. వారందరిదీ ఉన్నత గమ్యమే అయినా, అనేక రకాల ఆటంకాలు ఎదురొచ్చినాగానీ ఎవ్వరిలో కూడా నిరాశ, భయాందోళనలు కనిపించలేదు.

బ్రహ్మాబాబా సదా సఖుని రూపంలో, ఒక స్నేహితునిగా అందరి మనసులను ఎరిగి వ్యవహరించేవారు. వయసులో పెద్దవారైనా కానీ యజ్ఞ వత్సలతో కలిసిపోయి ఆటపాటలలో ఉత్సాహంగా పాలుపంచుకునేవారు. నేను మీ సహాధ్యాయినే అంటూ అందరితో కలిసిపోయేవారు. ప్రతి యజ్ఞ సేవలో వారే ముందుగా చేయి వేసేవారు. వారిలోని సేవా స్ఫూర్తి, వినయము, అంకిత భావము అందరికీ ఆదర్శంగా నిలిచాయి. సహకార భావమును ఎలా పెంచుకోవాలో బాబా వత్సలకు బోధించేవారు. కర్మ చేస్తూ కూడా వారి బుద్ధి ఈశ్వరీయ జ్ఞానాన్ని చింతన చేస్తూ నిరంతరం శివబాబా స్మృతిలో ఉండేది. సంపూర్ణ ఆత్మిక స్థితిని అభ్యాసం చేసే విధానాన్ని బాబా ప్రాక్టికల్‌గా తమ కర్మలద్వారా చూపించేవారు.

ఓం శాంతి

# కర్మయోగ పాఠాలు బ్రహ్మా ఎలా నేర్పించేవారు!

కొన్నిసార్లు బ్రహ్మాబాబా వంటగదికి వెళ్ళి అక్కడ సేవ చేస్తున్న పిల్లలకు సహకరించేవారు. యోగ దృష్టిని (మూడవ నేత్రముతో శక్తిని ప్రదానం చేస్తూ ఎదుటివారిని ఆత్మిక స్థితిలో చూడటము) ఇచ్చి జ్ఞానపు తియ్యని మాటలు మాట్లాడుతూ ఇలా చెప్పేవారు, "శివబాబా స్మృతిలో వంట చేసినప్పుడు ఆ భోజనంలో శక్తి నిండుతుంది. మధురమైన పిల్లలూ! ఇది శివబాబా యొక్క అవినాశి యజ్ఞము. వారికోసమే మీరు వండుతున్నారన్నది మర్చిపోకండి. నిమిత్తంగా అయ్యి అన్ని కార్యాలు చెయ్యండి."

ఎవరైనా కుట్టు పని చేస్తుంటే వారి వద్దకు వెళ్ళి మధురమైన చిరునవ్వును చిందించి సంతోషాల వాతావరణాన్ని వెదజల్లేవారు. జ్ఞాన రత్నాలను పంచకుండా వారెప్పుడూ ఉండలేదు. బాబా ఇలా అనేవారు, "ప్రియమైన పిల్లలూ! కర్మేంద్రియాలతో పని చేస్తున్నప్పుడు కూడా బుద్ధి ద్వారా భగవంతుడిని స్మృతి చేస్తూ వారిచ్చే అవినాశీ సంపాదనను గుర్తు చేసుకోండి. శివబాబాను గుర్తు చేయడం ద్వారా భవిష్య సత్యయుగంలో రాజ్య దుస్తులు ధరించేందుకు అధికారులుగా అవుతారు. కనుక, వస్త్రాలను కుడుతున్న సమయంలో కూడా బాబాను గుర్తు చేసే పురుషార్థం చేయండి."

ఎవరైనా బట్టలు ఉతుకుంటే బ్రహ్మా బాబా వారి వద్దకు వెళ్ళి ఇలా చెప్పేవారు, "మీరు దైహిక వస్త్రాలను ఉతుకుతున్నారు. శివబాబా అయితే అనంతమైన చాకలివాడు. పతితమైన ఆత్మలను వారు శుభ్రపరిచి పావనంగా చేసే కార్యాన్ని చేస్తున్నారు. గుర్తుంచుకోండి, ఈ హద్దు యొక్క వస్త్రాలను ఉతుకుతూ కూడా మీ ఆత్మను కూడా శుభ్రపరుచుకుంటూ ఉండండి." వారందరూ అదృష్టానికి అధికారులుగా ఉన్నారని, భాగ్య సితారలని బ్రహ్మా బాబా అర్థం చేయించేవారు. "అనంతమైన ప్రాప్తులనిచ్చే ఆ పరమాత్మ స్థాపించిన యజ్ఞంలో మీరందరూ యజ్ఞ సేవను చేస్తున్నారు. మునుపెన్నడూ కనీసం ఊహించని విషయాలు కూడా ఇక్కడ పరమాత్ముని స్మృతితో సంభవిస్తున్నాయని గుర్తుంచుకోండి."

యజ్ఞ వత్సలను బాబా షికారుకు తీసుకువెళ్ళినప్పుడు ఇలా అనేవారు, "చూడండి, ఇది స్థూలమైన యాత్ర. ఇది చేస్తూ కూడా సూక్ష్మంగా స్మృతి యాత్రను చేయాలి. పరంధామాన్ని గుర్తు చేసుకోండి. ఓ నా అమూల్యమైన రత్నాల్లారా! మీకు మాత్రమే విలువైన ఈ సూక్ష్మ స్మృతి యాత్ర గురించి తెలుసు."

ఆ సమయంలోనే శివబాబా యజ్ఞ వత్సలకు భారతదేశ సేవను చెయ్యమని ఆజ్ఞాపించారు. వత్సలకు ఇదొక పరీక్షయే!

# భగవంతుని ఆజ్ఞ:
# భారతదేశ సేవను చేయండి

ఆగస్టు, 1947. భారతదేశ విభజన జరుగుతుందని ప్రకటన జరిగింది. ముస్లింలు అత్యధిక సంఖ్యలో ఉన్న క్రొత్త పాకిస్థాన్‌నుండి ఎంతోమంది హిందువులు భారతదేశానికి స్థానాంతరం చెందారు. బాబా ఇలా అనేవారు, 'మహాత్మ గాంధీ మరియు కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యం కోసం, రామరాజ్య స్థాపన కోసం పోరాడుతున్నారు కానీ, నిజానికి, సమాజంలోని ప్రతి స్త్రీ మరియు పురుషుడు సీతారాములవలె పవిత్రంగా అయినప్పుడే నిజమైన రామరాజ్యం వస్తుందని, మానవులు ఉన్నతమైన మర్యాదలను అవలంబించినప్పుడే ఇది సాధ్యమని శివబాబా చెప్పారు.'

కాంగ్రెస్ మరియు ఇతర పార్టీలు రాజకీయ స్వాతంత్ర్యాన్ని తీసుకురావచ్చును కానీ సంతోషాన్ని, సమృద్ధిన్ని తీసుకురాలేవు ఎందుకంటే మనిషిలోని సంస్కార పరివర్తనకు, పవిత్రతకు అవసరమైన పురుషార్థాన్ని ఎవ్వరూ చెయ్యడం లేదని బ్రహ్మబాబా చెప్పేవారు. మత ఘర్షణల కారణంగా హిందూ ముస్లింలు పరస్పరం కొట్టుకుని, చంపుకుంటారని బ్రహ్మబాబా ముందుగానే చెప్పి ఉన్నారు.

అల్లర్లు ప్రారంభం కాక ముందే బ్రహ్మబాబా, సమాజ శ్రేయస్సు కొరకు తీసుకోవలసిన తగు జాగ్రత్తలను వ్రాసి ఒక పుస్తకంగా అచ్చు వేసి అప్పటి రాజులకు, సమాజంలోని పెద్ద మనుషులకు పంపించారు. అయినాకానీ ఎవ్వరూ ఆ జాగ్రత్తలను పట్టించుకోలేదు. వార్తాపత్రికల్లో కూడా అచ్చు వేయించారు. కానీ ముందు చూపుతో సూచించిన ఈ జాగ్రత్తలను నమ్మలేదు. విభజన కారణంగా జరుగుతున్న మారణహోమం చూసి యజ్ఞ వత్సలకు క్రొత్తగా ఏమీ అనిపించలేదు ఎందుకంటే ఇదంతా వారికి బ్రహ్మబాబా ముందునుండే చెప్తూ వచ్చారు. చాలామంది హిందువులు విభజన తర్వాత పాకిస్తాన్‌ను వదిలి భారతదేశానికి వెళ్ళిపోయారు. కానీ యజ్ఞము మాత్రం కరాచీలోనే ఉంది. ముస్లింలు ఎప్పుడూ యజ్ఞానికి హాని తలపెట్టలేదు. కొంతమంది ముస్లిం అధికారులు అప్పుడప్పుడూ వచ్చి కొన్ని ప్రశ్నలు అడిగి వెళ్ళేవారు, కానీ వారెప్పుడూ హాని కలిగించలేదు. అల్లాహ్‌తో నిజమైన పరిచయం ఏర్పడుతున్నందుకు వారు సంతోషపడేవారు.

వారడిగిన అనేక ప్రశ్నల్లో ఒకటేమిటంటే, "ఈ సంస్థ కార్యాలేమిటి?" ఇక్కడ అందరూ భగవంతుని సేవాధారులే, భగవంతుని స్మృతితో ఉపరామ స్థితిని, పవిత్రతను ఆచరిస్తున్నారు అని వారికి జవాబు చెప్పడం జరిగింది. యజ్ఞ వత్సలు ఇలా చెప్పారు, "ముస్లింలు భగవంతుడిని పాక్ పర్‌వర్‌డిగార్ (పవిత్రమైన జ్యోతి) అంటారు కానీ మీరు మాత్రం పాక్ (పవిత్రం)గా అవ్వడం లేదు, మీరు కేవలం పాకిస్థాన్ (పవిత్ర స్థానము) అని పేరు పెట్టుకున్నారు. ఇప్పుడు మీరు పవిత్రులుగా అవ్వండి అని భగవంతుని ఆజ్ఞ." ఇటువంటి మాటలు విన్నవారు వారి అంగీకారాన్ని తెలుపుతూ చిరునవ్వు నవ్వేవారు. వారిలా అన్నారు, "మేము మీకు ఏ సేవను చెయ్యగలమో చెప్పండి. మీరు మంచివారు. మీకు సేవలను అందించడము మా బాధ్యత ఎందుకంటే మీరు భగవంతుడిని ప్రార్థించి పాక్‌గా అనగా పవిత్రంగా అవుతున్నారు."

# భారతదేశానికి ప్రయాణం

యజ్ఞ వత్సల బంధువులు దాదాపుగా భారతదేశానికి స్థానాంతరం చెంది షుమారు రెండు మూడు సంవత్సరాలు గడిచిపోయింది. ఓం మండలి ఎక్కడుందో వారెవరికీ తెలియదు. ఈ సంస్థ ముస్లింల ద్వారా మూసివేయబడ్డదని, సంస్థలోని సభ్యులంతా చెల్లాచెదురైపోయారని వారు విన్నారు.

కానీ పాకిస్థాన్‌లో ఓం మండలి ఉందని చివరకు తెలుసుకుని యజ్ఞాన్ని భారతదేశానికి తీసుకురావాలని ఉత్తరాలు వ్రాసారు. పాకిస్థాన్‌లోని ముస్లింలు సంస్థకు ఏదైనా హాని తలపెడ్తారేమోనని వారు భయపడ్డారు. కానీ ఇందుకు విరుద్ధంగా, ముస్లిం పాకిస్థానీలు సంస్థను పవిత్రమైనదిగా భావించి కాపాడుతూ వచ్చారు. కొంతమంది యజ్ఞ వత్సల బంధువులు సంస్థను భారతదేశానికి స్థానాంతరం చేయాలని పట్టుబట్టారు. ఒకరోజు, శివబాబా బ్రహ్మాబాబా ద్వారా మరియు తర్వాత సందేశి పుత్రిక ద్వారా యజ్ఞమును తిరిగి భారతదేశానికి స్థానాంతరం చేయ్యాలని, ఎందుకంటే భారతదేశ ప్రజలు అత్యధిక సంఖ్యలో దీనినుండి లాభాన్ని పొందగలరని చెప్పారు. సేవకు అక్కడ ఎక్కువ అవకాశం ఉందని శివబాబా వత్సలకు చెప్పారు.

చివరకు, 1950లో, యజ్ఞ వత్సలు కరాచీని విడిచిపెట్టడానికి సిద్ధమయ్యారు. ఇది విన్న సింధ్ ముస్లింలు ఈ ప్రయత్నాన్ని విరమించుకోమని ఎంతగానో చెప్పారు. వారిలా అన్నారు, “మీకు మేము మెరుగైన సౌకర్యాలను కల్పిస్తాము, ఇక్కడ మీకు ఎటువంటి కష్టమూ రాదు, అటువంటప్పుడు మీరు ఈ స్థానాన్ని విడిచి ఎందుకు వెళ్ళాలి? మీరు ఇక్కడ ఉంటే మా దేశంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగవు. మేము మిమ్మల్ని అన్ని విధాలుగా చూసుకుంటాము. మీరు భగవంతుని మనష్యులు. హిందూ ముస్లింల గొడవలకూ మీకూ ఎటువంటి సంబంధము లేదు.”

కానీ శివబాబా ఆజ్ఞానుసారంగా యజ్ఞ వత్సలు భారతదేశానికి వెళ్ళడానికే నిశ్చయించుకున్నారు. కరాచీ నుండి ఓడలో ఓఖాకు వెళ్ళారు. కరాచీలో వారు నివసించిన భవనాలను అమ్మేసారు.

అయినప్పటికీ, సమాజంలోని పెద్దలు ఈ ప్రయాణాన్ని మాన్పించడానికి ప్రయత్నాలు చేసారు. అల్లా భక్ష్ మరియు బులామ్ హుస్సేన్‌జీ (గత ముఖ్యమంత్రి), డా॥ చోపట్‌రామ్ దిగ్వానీ అందులో ఉన్నారు. వారికి ఈశ్వరీయ జ్ఞానంపై ఎంతో మంచి అభిప్రాయం ఉంది. వారిలా అన్నారు, “మీరిక్కడే ఉండండి, మేమందరమూ మీకు సహాయం చేస్తాము.” కానీ ఇది భగవంతుని ఆజ్ఞ అని, భారతదేశ సేవ కోసం ప్రయాణమవుతున్నామని వారికి చెప్పడం జరిగింది.

ఆ రోజుల్లో 400మంది యజ్ఞ వత్సలు ఉన్నారు. కరాచీ రేవు వద్ద వత్సలు సామాన్లతో ఉన్నారు. ఆ సమయంలో ఎంతోమంది అక్కడకు గుంపుగా వచ్చారు. ముస్లింలు మరియు పఠాన్లు శ్వేత వస్త్ర ధారులైన యజ్ఞ వత్సలకు తమ సామాన్లను లోపలకు చేర్చడంలో ఎంతో సహాయం చేసారు. ఎంతోమంది పాకిస్థానీ వాసులు వత్సలపై ప్రేమతో పూల వర్షాన్ని కురిపించారు. వత్సలు కూడా వారి ప్రేమ పుష్పాలతో అందరి నుండి వీడ్కోలు తీసుకుంటూ ఓడనుండి చేయి ఊపుతూ ఉండగా ఓడ కదిలింది.

ఈ దృశ్యం హృదయాన్ని కలచివేసింది. సంసారమనే సాగరమును వీరు సత్యమనే ఓడలో ప్రయాణం చేస్తూ దాటుతున్నారు అని ఒక బ్రాహ్మణుడు అభివర్ణించాడు. ప్రయాణ సమయంలో కూడా ఓడ నాయకుడు, ఇతరులు కూడా ఎంతో సహకరించారు. “మేము మీకు ఎలా సహాయపడగలమో చెప్పండి” అని వారంటూ ఉండేవారు. ఆధ్యాత్మిక సత్సంగాలు ఎప్పటిలాగే కొనసాగాయి. ఓడలో కూడా మురళీనాదం వినిపించింది. ఓడ నాయకుడు కూడా ఆ మురళిని విని తరించాడు.

# యుద్ధ భూమిలో పాండవులు

చివరకు, ఓఖా రేవులో యజ్ఞ వత్సలు దిగారు. అక్కడినుండి వారు రైలులో మౌంట్ ఆబూకి వెళ్ళారు. ఆ పర్వత ప్రాంతమంతా సాధుసన్యాసులకు ప్రసిద్ధి చెందింది. అక్కడే బ్రహ్మాబాబా మరియు యజ్ఞ వత్సల గుప్త స్మృతి చిహ్నమైన దిల్వాడా మందిరముంది. ఈ మందిరంలో ఆది దేవ్ యొక్క రెండు విగ్రహాలున్నాయి. ఒక విగ్రహం నల్లగా మరొకటి తెల్లగా ఉంటుంది. అపవిత్రత నుండి పవిత్రత వైపుకు ప్రయాణం చేసిన బ్రహ్మాబాబా స్థితికి ఈ రెండు విగ్రహాలు ప్రతీక. మందిరంలోని లోపల భాగంలో 108 గూళ్ళున్నాయి. ప్రతిదానిలో యోగులు తపస్యాముద్రలో కనిపిస్తారు. అక్కడ వాతావరణంలో ఏకాంతము, ప్రశాంతత వెల్లివిరిసి ఉంటాయి.

వారు సాధించిన ఆత్మిక స్థితికి గుర్తుగా ఆ యోగులను నగ్నంగా చూపిస్తారు. ప్రతి ఒక్కరి హృదయాలలో ఒక పెద్ద వజ్రం కనిపిస్తుంది. శివబాబాపై వారికున్న ప్రేమకు అది ప్రతీక. ప్రతి ఒక్కరికీ తెరుచుకుని ఉన్న మూడవ నేత్రాన్ని చూపిస్తారు. ఈశ్వరీయ జ్ఞానాన్ని పొందినందుకు ఈ మూడవ నేత్రాన్ని చూపించారు. అక్కడ 108మంది యోగులనే చూపించడానికి కారణమేమిటంటే ఈ ప్రపంచంలోని ఆత్మలందరిలోకి కేవలం 108మంది మాత్రమే వారిలోని దేహాభిమానాన్ని సంపూర్ణంగా తెంచుకుని మృత్యువుపై విజయాన్ని సాధించారు కనుక. ఆశ్చర్యకరమైన సత్యమేమిటంటే దిల్వాలా (అనగా మనసును దోచేవాడు అని అర్థం) మందిరమంతా, ప్రస్తుతం యజ్ఞంలో జరుగుతున్న ఘట్టాలను ప్రతిబింబిస్తుంది. యజ్ఞ వత్సలు తమకు గుర్తుగా నిలిచిన ఈ మందిరాన్ని చూసి ఎంతో ఆనందపడ్డారు. పాలరాయిలో తమ స్మృతిచిహ్నాలను చూసుకోవడము నిజంగా అద్భుతమే కదా! ఇంతటి గొప్ప ఆధ్యాత్మిక రహస్యము మరెవ్వరికీ అర్థం కాకపోవచ్చు.

మౌంట్ ఆబూలో శివుని అవతరణ జరిగిందని శాస్త్రాలలో ఉంది. కానీ ఇప్పుడు నిజంగా, ప్రత్యక్షంగా శివబాబా అవతరించి ఉన్నారని ఎవరు నమ్ముతారు! భగవంతుని ఆజ్ఞ మేరకు, ఈశ్వరీయ సేవార్థం యజ్ఞము ఇక్కడ స్థిరపడింది.

శుక్లాగారు, ఒక పెద్ద కవి. బ్రహ్మాబాబా మౌంట్ ఆబూకు వచ్చిన కొద్ది రోజులకే వారు కలిసారు, ఈ క్రింది కవిత ద్వారా వారి భావాన్ని ఇలా వ్యక్తిపరిచారు:

*ఆబూ మహిమ విశాలమైనది*
*నిజంగా ఈ ఆబూ అద్భుతమైనది*
*ఇక్కడే జ్ఞాన జ్యోతి వెలిగింది*
*అజ్ఞాన చీకటి పారిపోయింది*
*ఆబూ శివుని అవతరణ భూమి*
*ప్రతి ఆత్మకు ముచ్చటైన భూమి*
*సత్యధర్మకు ప్రచార భూమి*
*సత్యయుగపు ఆధార భూమి*
*కల్పకల్పము బ్రహ్మ తనువులో*
*శివ అవతరణ జరిగింది*
*కల్పకల్పము ఆబూ పర్వతము నుండి*
*సత్య గీతా జ్ఞానము ప్రసారమవుతుంది*
*శివబాబా గురించి తెలుసుకోలేనివారు*
*ఆత్మ జ్ఞానమును కూడా అర్థం చేసుకోలేరు*

సృష్టి చక్ర రహస్యములను ఎరుగలేరు
వారి జీవితము నిరర్థకము
ఇది నా అనుభవపూర్వకమైన లేఖ
నేను ఏది విన్నానో అది వినిపిస్తున్నాను
నేను ఏది చూసానో
అదే వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఆబూలో పరమపిత శివ పరమాత్మ ప్రజాపిత బ్రహ్మ తనువు ద్వారా సేవా కార్యక్రమాలను తీవ్రతరం చేసారు. మహాభారతంలో పాండవులు 12 సంవత్సరాలు వనవాసము చేసారని, ఒక సంవత్సరము అజ్ఞాతవాసము చేసారని వ్రాసి ఉంది. యజ్ఞము సింధ్‌లో13 సంవత్సరముల ఉంది (1936 నుండి 1950 వరకు). అందులో 12 సంవత్సరాలు లోకులకు దూరంగా ఏకాంతంలో, మరొక సంవత్సరము లోకుల దృష్టినుండి దూరంగా ఈ అహింసకులైన పాండవులు మరియు శివశక్తులు తపస్సు చేసారు. ఈ విధంగా వారు తమ మానసిక అవస్థను ఉన్నతంగా చేసుకున్నారు. యోగములో ఉన్నతస్థాయిని ప్రాప్తి చేసుకున్నారు. చివరకు, యోగశక్తితో సంసిద్ధులైన పాండవులు మాయను ఓడించడానికి యుద్ధమైదానములోకి దిగారు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ జ్ఞాన గంగలై భారతదేశమును పతితము నుండి పావనముగా చేయడానికి బయలుదేరారు. అప్పుడు వారి మనసు ఉల్లాసంగా ఈ పాటను పాడింది:

విశ్వ పరివర్తకులము మేము,
రాజయోగమును నేర్పించెదము
గతంలో నా వతనము బంగారు లోకము
ఒకే రాజ్యము ఒకే ధర్మము ఉండేది
ఆ ప్రపంచ పునఃస్థాపనలో సహాయం చెయ్యండి
ఆత్మ పరివర్తకులము మేము
రాజయోగమును నేర్పించెదము

# ఈశ్వరీయ విశ్వ విద్యాలయము

సంస్థను కరాచీనుండి మౌంట్ ఆబూకు స్థానాంతరం చెయ్యడం మామూలు విషయమేమీ కాదు. క్రొత్త స్థానాన్ని ఎలా నిర్ణయించుకున్నారు? దీనికి సంబంధించి ఒక ఆసక్తికరమైన ఘటన ఉంది. బి.కె.మన్‌మోహిని (దీదీ) ఈ విధంగా వివరిస్తున్నారు:

"భారతదేశంలో మాకు సుసంపన్నులైన బంధువులున్నారు. వారు నన్ను పాకిస్థాన్‌ను విడిచి రమ్మన్నారు. బాబా కూడా నన్ను భారతదేశానికి వెళ్ళి సేవ చేయమన్నారు. కనుక, విమాన టిక్కెట్టు తీసుకుని నేను, మరికొంత మంది సోదరీలు కలిసి ముంబయికి వెళ్ళాము.

"మా బంధువులు విమానాశ్రయంలో మా స్వాగతం కోసం పూలదండలతో వేచి ఉన్నారు. కానీ బ్రహ్మాబాబా ఏమి చెప్పి ఉన్నారంటే ఏ విధమైన పూజలుకానీ, దండలుకానీ స్వీకరించవద్దు ఎందుకంటే వాటిని సంపూర్ణ పవిత్రులైన దేవీదేవతలకే అర్పించాలి. మనం అలా అవ్వడానికి ఖచ్చితంగా పురుషార్థం  చేస్తున్నాము కానీ ఇంకా సంపూర్ణతను పొందలేదు కనుక పుష్పాలను స్వీకరించవద్దని అన్నారు. అందుకే, మా భందువులు తీసుకువచ్చిన పూలదండలను స్వీకరించకపోవడానికి గల కారణాన్ని వారికి వివరించాము. ప్రతి అడుగులోనూ బ్రహ్మాబాబా ఇచ్చిన సూచనలను పాటించడంలో ఎంతో జాగ్రత్త వహిస్తూ వచ్చాము. చివరకు మేము వారి ఇంటికి చేరుకున్నాము. మా కోసం వారు రెండు మంచి గదులను తయారు చేసి ఉంచారు. వీటితోపాటు మరో గదిని కూడా సిద్ధం చేసి ఉంచారు. అందులో జ్ఞాన చర్చ కోసం, వచ్చిన వారిని కలవడం కోసం ఏర్పాట్లు చేసి పెట్టారు.

"మేము అక్కడకు వెళ్ళిన రోజునుండే మా లౌకిక బంధువులు మరియు ఇతరులు జ్ఞానాన్ని వినడానికి వచ్చేవారు. కొన్ని సంవత్సరాల క్రితం ఓం మండలికి వెళ్ళవద్దని మమ్మల్ని తిట్టి, చిత్రహింసలు పెట్టిన వారే ఈ రోజు మా వద్దకు వచ్చి జ్ఞానాన్ని వింటూ ఉండటాన్ని చూసి నాకు చాలా సంతోషంగా ఉండేది. ఇప్పుడు మా జీవనశైలిని చూసి వారు ముగ్ధులైపోయారు. జ్ఞానాన్ని వినిపిస్తూ ఉంటే, ప్రత్యేకంగా మా బంధువులకు వినిపిస్తూ ఉంటే చాలా సంతోషంగా ఉండేది ఎందుకంటే 'దానము ఇంటి నుండే ప్రారంభమవుతుంది కనుక ఈ నీతి వచనం అనుసారంగా వత్సలైన మీరు కూడా మీ బంధువులకు జ్ఞాన సేవను చెయ్యాలి' అని బ్రహ్మాబాబా చెప్తూ ఉండేవారు. 'ఎవరైతే తమ అత్తింటిని, పుట్టింటిని ఉద్ధరిస్తుందో తానే నిజమైన బ్రహ్మా కుమారి.' అనగా  ఒక బ్రహ్మా పుత్రిక ఈశ్వరీయ జ్ఞానాన్ని ప్రాప్తి చేసుకోక ముందు వివాహిత అయితే ఇప్పుడు కుమారి వ్రతాన్ని ధారణ చేసి తన అత్తింటి వారికి మరియు పుట్టింటి వారికి ఈశ్వరీయ జ్ఞానాన్ని వినిపించి అతీంద్రియ సుఖాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తుంది. అందుకే మా బంధువులు జ్ఞానము వింటూ ఉంటే ఎంతో సంతృప్తిగా ఉండేది.

"మేము అక్కడ రెండు నెలలు ఉన్నాము. పూర్తి సమయము సేవలోనే గడిచిపోయింది. ఈ రెండు నెలల సమయంలో మేము మాకిచ్చిన గదులను దాటి ఎప్పుడూ బయటకు రాలేదు. మా బంధువులు మా కోసం కారు తీసుకుని వచ్చి, 'ముంబయి చాలా మంచి పట్టణము. చూడాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయి. రండి, మీకు పట్టణమంతా చూపిస్తాము' అని అనేవారు. కానీ మేము అందుకు నిరాకరించాము. ఇందుకు రెండు కారణాలు, ఒకటి, అవన్నీ చూసే ఆసక్తి మాలో లేదు. రెండు, ఇదంతా మాయా నగరము. నిస్సారమైన ప్రపంచము. అందుకే వారికిలా చెప్పాము, 'మేము మా షికారును డైరెక్టుగా స్వర్గంలో చేస్తాము. దేవ భూమి, ధర్మ భూమిగా ఉన్నప్పటి ఆ కృతయుగ భారతదేశాన్ని మేము చూసాము. అక్కడ బంగారం-వజ్రాలు పొదిగిన మహళ్ళు ఉంటాయి. రాజు రాణి, ప్రజలు అందరూ సంతోషంగా ఉండేవారు. దానితో పోల్చి చూస్తే ఈనాటి భారతదేశంలోని ముంబయిలో ఏమున్నాయి! ఇదంతా మాయావి నగరము. ఇటువంటి క్రూర నగరాన్ని మేమెందుకు చూడాలి! అందుకే ఒక కవి ఇలా అన్నాడు:

*ధర్మ భూమి ఇప్పుడు క్రూర ఖండమైనది*
*పూజ్యులుగా ఉండేవారు పూజారీలుగా మారిపోయారు*
*నిర్వికారము ఒక కలగానే మిగిలిపోయింది*
*అందరూ బికారులుగా అయిపోయారు*

*భోగాలు పెరిగిపోయాయి*
*మాయా సర్పము అందరినీ కాటేసింది*
*ఒక్క కాటుతో అందరూ చంచలమైపోయారు*
*స్వయాన్ని దేహముగా భావించడం మొదలుపెట్టారు*

*కొందరు అంటారు అందరూ ఈశ్వరులే అని*
*కొందరు భగవంతుడే లేడని అంటారు*
*ఎన్ని నోరులున్నాయో అన్ని మాటలు వినిపిస్తున్నాయి*
*కానీ ఏ ఒక్కరూ సత్య ప్రమాణులుగా లేరు.*

"శివబాబా వచ్చి జ్ఞాన నేత్రాలను ఇచ్చేవరకు ఎవ్వరికీ ఏమీ తెలియదు" అంటూ దీదీ ఇలా కొనసాగించారు, "శివబాబా ప్రసాదించిన దివ్యబుద్ధితో స్వర్గాన్ని చూసిన మేము ఈ మాయా నగరాన్ని ఏమి చూస్తాము!"

"మా ఈ మాటలు విని వారు మమ్మల్ని అడగటం మానేసారు. మా బంధువులు మాకు అనేకసార్లు విలువైన బహుమతులను, వైభవాలను బహుకరించడానికి ప్రయత్నించారు. రకరకాల వంటకాలను తీసుకువచ్చేవారు. కానీ మేము మాత్రం మా స్వహస్తాలతో ఒక కూర, రెండు రొట్టెలను చేసుకుని తినేవారము.

"రాత్రి భోజనము తర్వాత భగవంతుని గీతాలను పాడుకునేవారము. ఈ విధంగా మేము ఎవరి వద్ద అయితే ఉంటున్నామో వారి ఎదుట మేము ఒక చక్కని ఉదాహరణగా నిలిచాము. 'బ్రహ్మా వత్సులు తమ జీవితాన్ని ఎంతో ఉన్నతంగా తయారు చేసుకున్నారు. వీరికి షికారుకు వెళ్ళాలన్న ఆసక్తి లేదు, మంచి మంచి రుచులను ఆస్వాదించాలన్న తపన లేదు. వీరి జీవితాలలో త్యాగము ప్రస్ఫుటంగా ఉట్టిపడుతుంది. మేమిచ్చే ఖరీదైన వస్తువుల పట్ల ఆకర్షణ కూడా లేదు' అని వారు ఆశ్చర్యపోయేవారు. ఒక వైపు ముంబయిలోని భోగభాగ్యాల జీవితము, మరోవైపు మా శ్వేత వస్త్రాలు మరియు సాదా భోజనము చూసి వారెంతో ప్రభావితులయ్యారు. మేమెప్పుడూ వారితోటే ఉండాలని ఆశించారు. కానీ కరాచీకి తిరిగి వెళ్ళవలసిన రోజు వచ్చింది. మేమక్కడ ఉన్నంత సమయము వారికి ఈశ్వరీయ జ్ఞాన సందేశాన్ని అందిస్తూ భగవంతుని స్మృతిలో కూడా కూర్చోపెట్టాము. వారందరికీ మా ఈ సందేశాన్ని విడిచి వచ్చాము:

*ఓ ప్రకాశ ఆత్మా! ఇప్పుడు శివబాబాను గుర్తు చెయ్యి*
*మీ జన్మ సిద్ధ అధికారాన్ని పొందు*
*నీ పురుషార్థ బలంతో*
*నీవు సత్యయుగానికి రావాలి*

*ఇది సంగమ స్వర్ణిమ యుగము*
*శివబాబా మరలా వచ్చిన సమయము*

బ్రహ్మ ముఖారవిందం ద్వారా
శివబాబా మరల అదే గీతా జ్ఞానమును వినిపిస్తున్నారు

సృష్టి అంతిమ సమయము ఇప్పుడు వచ్చింది
వికారాల వినాశనము ఎదురుగా నిల్చుని ఉంది
ఇప్పుడు అందరి అంతిమ సమయము వచ్చింది
శివబాబా మనకు సందేశాన్ని ఇస్తున్నారు

పాండవ శివశక్తి సేనల
రణభేరి ఇప్పుడు మరల మ్రోగుతుంది
శివబాబా నేతృత్వంలో
మాయను మరల ఓడించాలి

బలహీనతలకు మరణము
వికారాలకు మరణము
మరణానికే మరణము ఇప్పుడు
చెడు నాశనమవుతుంది
పవిత్ర ప్రపంచము తిరిగి స్థాపన అవుతుంది

"ముంబయిలోని ఎంతోమందితో సత్సంబంధాలు ఏర్పరచుకుని మేము కరాచీకి తిరిగి వెళ్ళాము. కొంతకాలం తర్వాత, మా బంధువులు మాకొక ఆహ్వానాన్ని పంపారు. యజ్ఞమును పూర్తిగా భారతదేశానికి స్థానాంతరం చెయ్యాలని, అందుకు అవసరమైన ఖర్చును పూర్తిగా తామే భరిస్తామని అందులో వ్రాయబడి ఉంది. అందుకు జవాబు ఇస్తూ బాబా ఈ విధమైన ఉత్తరాన్ని వ్రాసారు, 'జ్ఞాన పిపాస ఉన్నవారు, భగవంతుని నియమాలపై నడవదల్చుకున్న వారి ఆహ్వానాన్ని మాత్రమే స్వీకరించబడుతుంది.'

"అందుకు వారు ఒప్పుకున్నారు. బ్రహ్మాకుమారి లీలావతిగారి బంధువులు ద్వారా యజ్ఞమునకు ఆహ్వానాన్ని మరల పంపారు. భారతదేశంలో మేము ఎక్కడ అనుకూలమనుకుంటే అక్కడే భవనమును వెదకమని కూడా వారు చెప్పారు. కనుక, నేను, బ్రహ్మాకుమారి లీలావతి కలిసి పూణె, అహ్మదాబాదు  మరియు ముంబయిలో అనేక భవనాలను చూసి వచ్చాము. కానీ షుమారు 400మంది యజ్ఞ వత్సలు కలిసి ఉండగలిగే సదుపాయాలున్న భవనాలు మాకు కనిపించలేదు. నివాసమును వెదుకుటలో మాకు అహ్మదాబాద్‌లోని సర్వానంద్‌గారు, గంగేశ్వరానంద్‌గారు (ప్రసిద్ధ సన్యాసులు, ప్రచారకులు. వీరిని సింధ్ ప్రజలు గురువులుగా గౌరవిస్తారు) చాలా సహకరించారు. వారు తమ శిష్యుడైన సిద్ధానందగారిని కూడా పంపారు. మౌంట్ ఆబూలో యజ్ఞము స్థిరపడిన తర్వాత కూడా వారు అక్కడకు విచ్చేసారు. వారు ఆబూ నుండి వెళుతూ ఇలా అన్నారు, 'స్త్రీ పురుషులు ఇరువురూ కలిసి ఉంటూ పవిత్రంగా ఉండటం అసంభవమని నేను అనుకున్నాను. కానీ మొదటిసారిగా నా జీవితంలో ఇది సాధ్యమని నమ్ముతున్నాను. ఎందుకంటే నేనిక్కడ ఉన్నన్ని రోజులు నాకు స్త్రీ పురుషుల స్మృతి కలుగలేదు. నేను ఆత్మనే చూసి ఆత్మిక స్థితిలోనే ఉండగలిగాను. కర్మ సన్యాసినులతో ఉన్నాకానీ నా మనోనేత్రము పవిత్రంగా ఉండేది కాదు.'

“ఆఖరకు మేము ఆబూ పర్వతముపై ఏదైనా అనుకూల భవనము ఉందేమోనని వెళ్ళాము. మా బంధువులు కొంతమంది కూడా మాతో ఉన్నారు. నేను, మరో దైవీ సోదరి, రుక్మిణిగారు కలిసి వెళ్ళాము. (సోదరి రుక్మిణి ఎంతో సంపన్న కుటుంబం నుండి వచ్చినాకానీ వారి జీవితం ఎంతో త్యాగముతో కూడుకున్నది.) ఖాళీగా ఉన్న రాజుల నివాస బంగళాలను చూసుకుంటూ వెళ్ళాము. నాకు ఒక బంగళా నచ్చింది. ఆ స్థానాన్ని బ్రిజ్‌కోఠి అని అంటారు. భరత్‌పూర్ మహారాజు గారిది. చూడటానికి అది అంత అందంగా లేకపోయినాకానీ వెంటనే నాకు బాబా మహావాక్యాలు గుర్తుకు వచ్చి బ్రిజ్‌కోఠి తీసుకోవడమే ఉచితమనిపించింది. కొన్ని సంవత్సరాల క్రితం సింధ్‌లో ఉండేటప్పుడు బాబా చాలా సార్లు ఏమనేవారంటే, ‘పిల్లలూ! అంతిమంలో యజ్ఞ వత్సలైన మీరు పర్వతాలపైకి వెళ్ళి తపస్సు చేసుకుంటారు. మహారాజుల భవనాలలో ఉంటారు.’ బాబా చెప్పిన ఈ మాటలు నా మనసులో పదే పదే గుర్తుకు వచ్చాయి. ఈ ఆబూయే ఆ పర్వతము, బ్రిజ్‌కోఠి ఎలాగూ రాజ భవనమే అని నా బుద్ధి నాకు చెప్పింది. బాబా చెప్పారు, ‘అంతిమ సమయంలో పాండవులైన మీరు తపస్సు చేస్తూ చేస్తూ ప్రాణాలు వదులుతారు’.

“నేను వెంటనే అహ్మదాబాద్‌కు వెళ్ళి కరాచీలో ఉన్న బ్రహ్మాబాబాకు టెలిఫోను ద్వారా బ్రిజ్‌కోఠి గురించి చెప్పి వారి సలహాను అడిగాను. బాబా వెంటనే అనుమతిని ఇచ్చి దానిని తీసుకోమని చెప్పారు. బాబా మనసులో ముందుగానే ఈ ఆలోచన ఉన్నట్లుగా, మాకు కేవలం అనుకూల స్థానాన్ని వెతికే సేవా అవకాశాన్ని కల్పించారేమో అని అనిపించింది ఎందుకంటే వారికి మా యోగశక్తిపై విశ్వాసము ఉంది. మాకు చాలా సంతోషం కలిగింది. అంతా డ్రామా అనుసారంగా జరుగుతూ వచ్చింది.

“విశ్వ కిశోర్ అనే విశిష్ట సేవాధారుడైన సోదరుడిని బ్రహ్మాబాబా ఆబూకు పంపించారు. ఈశ్వరీయ జ్ఞానంలోకి రాకముందు కలకత్తాలో వీరు సుప్రసిద్ధ నగల వ్యాపారి. ఆబూలోని బ్రిజ్‌కోఠిని తీసుకుని యజ్ఞ వత్సల ఆవాస నివాసములకు అనుకూలమైన ఏర్పాట్లు చెయ్యడానికి బ్రహ్మాబాబా విశ్వకిశోర్‌గారిని పంపించారు. పేరుకు తగ్గట్టుగానే వీరి పురుషార్థము ఉండేది. భవిష్యత్తులో విశ్వానికి యజమానిగా అయ్యే పురుషార్థమును చేసేవారు. లౌకిక సంబంధ రీత్యా వీరు బాబాకు అన్న కొడుకు. వీరంటే బాబాకు అమితమైన గౌరవాభిమానాలు. బ్రహ్మాబాబాయే విశ్వ కిశోర్‌గారికి నగల వ్యాపారంలోని కిటుకులను, నైపుణ్యాలను నేర్పించి నగల వ్యాపారిగా తయారుచేసారు.

ఎప్పుడైతే బాబాకు ఈశ్వరీయ సాక్షాత్కారములు జరిగి వజ్రాల వ్యాపారానికి స్వస్తి చెప్పారో అప్పుడు విశ్వ కిశోర్ సోదరుని మనసులో తాను కూడా బాబాను అనుసరించాలని సంకల్పించారు. తనలోని ఆలోచనను బాబాకు వినిపించినప్పుడు బాబా ఇలా అన్నారు, “కొంత సమయం ఆగండి. సరైన సమయం వచ్చినప్పుడు భగవంతునికి సంపూర్ణంగా సమర్పణ అయ్యేందుకు సలహా ఇవ్వబడుతుంది.”

సర్వదా, సర్వ పరిస్థితుల యందు సంతోషంగా ఉండేవారు విశ్వ కిశోర్. బ్రహ్మాబాబా చెప్పినవాటిని పాటించడం వారికి ఇష్టము. కొన్ని సంవత్సరముల తర్వాత యజ్ఞములో సంపూర్ణంగా సమర్పణ అయ్యేందుకు ఆదేశము లభించింది. అప్పటినుండి, వారు, వారి కుటుంబమంతా యజ్ఞంలో సమర్పితమయ్యారు.

విశ్వ కిశోర్ సోదరుడు అనుభవజ్ఞుడు, ఆలోచనాపరుడు, నిజాయితీపరుడు, నమ్మకస్థుడు, నిశ్చయబుద్ధి, త్యాగబుద్ధి కలిగినవాడు. ఒక్కోసారి యజ్ఞ సేవార్థము ఎవరినైనా కలిసినప్పుడు వారు సోదరుడిని ఇలా అడిగేవారు, ‘ఈ సంస్థలో మీ స్థానమేంటి? మీరు ఇందులో సెక్రెటరీయా?” అప్పుడు విశ్వ కిశోర్ సోదరుడు ఇలా అనేవారు, “లేదు, నేను మాతలు, సోదరీలకు ఒక చిన్న సేవకుడను మాత్రమే. నేను కేవలం ఒక మామూలు ఈశ్వరీయ సేవకుడను.” పత్ర వ్యవహారం జరిపేటప్పుడు కూడా వారు స్వయాన్ని ‘ఈశ్వరీయ సేవకుడను’ అని వ్రాసుకుని సంతకం చేసేవారు. నిజానికి వీరు ఈ సంస్థలో ఒక మేనేజర్.

వారు భారతదేశముకు వచ్చి బ్రిజ్‌కోఠిని తీసుకోవడానికి విజయవంతంగా సంప్రదింపులు జరిపారు. యజ్ఞ

వత్సల విద్య– అధ్యయనము, నివాసముల కోసం భవనాన్ని తీసుకున్నారు. బృజ్‌కోఠిని 1950వ సంవత్సరంలో తీసుకోవడం జరిగింది. అప్పుడు యజ్ఞ పిత, యజ్ఞ మాత మరియు యజ్ఞ వత్సలు అందరూ ఆబూకు వచ్చారు.

# మధువనం!

బ్రహ్మాకుమారి దీదీ మన్‌మోహినిగారు ఈ విధంగా చెప్తున్నారు, "బాబా, మమ్మా మరియు యజ్ఞ వత్సలకు స్వాగతం పలకడానికి ఓఖా ఓడరేవుకు వెళ్ళడానికి తయారై బృజ్‌కోఠి నుండి బయలుదేరుతున్న సమయంలో పైన ఉన్న ఒక గదిలో నాకు ఒక పెద్ద పాము కనిపించింది. ఇది చూసిన నేను యజ్ఞ వత్సలకు సరైన స్థానాన్ని ఎంచుకోలేదేమో అని అనిపించింది. తర్వాత ఓఖా ఓడరేవు వద్ద బాబాను కలిసి నేను వారి చెవిలో నెమ్మదిగా అన్నాను, 'బాబా! మనం తీసుకున్న స్థానంలో పాములున్నాయి.' జరిగిన విషయం బాబాకు చెప్పడం నా కర్తవ్యంగా భావించాను.

"నేను చెప్పిన విషయాన్ని విన్న బాబా చిరునవ్వుతో ఇలా అన్నారు, "ఏమీ ఫర్వాలేదు. పాములు మనల్ని ఏమి చేయగలవు? మనం పాములతోనే కదా యుద్ధం చేయవలసింది. పాములు అంటే, కామము, క్రోధము వంటి వికారాలని బాబా అర్థం. బాబా చెప్పిన ఈ మాటలు విని నాకు చాలా సంతోషం కలిగింది. శివబాబాయే ఈ స్థానాన్ని ఎంచుకున్నారని అప్పుడు అర్థమయింది నాకు."

కానీ ఎందుకు? యజ్ఞము కోసం బాబా మౌంట్ ఆబూనే ఎందుకు ఎంచుకున్నారు అని బ్రహ్మాబాబా కూడా ఆలోచించారు. కాల గమనంలో శివబాబా జ్ఞాన మురళీల ద్వారా ఈ విషయాన్ని వివరించారు. 5000 సంవత్సరాల క్రితం కూడా ఇక్కడే ఆదిదేవ్ బ్రహ్మ మరియు ఆదిదేవి సరస్వతి తమ వత్సలతో సహా తపస్సు చేసారు. ఇందుకు స్మృతిచిహ్నంగానే ఇక్కడ అతి సుందరమైన దిల్వారా మందిర కట్టడము ఉంది. అంతేకాక అంబాజీ మందిరము, అధర్ దేవీ మందిరము, కన్యాకుమారి మందిరము, అచల్‌గఢ్ వంటి మందిరాలూ ఉన్నాయి. వీరోచితులైన యోగులు భగవంతుని స్మృతి ద్వారా మృత్యువుపై విజయాన్ని సాధించిన వైనము, యోగ గుహ నుండి పవిత్రమైన, సంపూర్ణమైన ఆత్మలుగా బయటకు వచ్చిన వీరు తమ మరుజన్మలో సూర్యవంశీ దేవీదేవతలుగా జన్మ తీసుకోవడాన్ని చలువరాతితో చెక్కబడి ఉన్నాయి.

కల్ప క్రితం వలె ఆబూలో యజ్ఞానికి సంబంధించిన స్మృతిచిహ్నాలు ప్రత్యక్షమయ్యాయి. ఈ పర్వతంపై మరోసారి అందరమూ సూర్యవంశీయులుగా, విష్ణు వంశస్థులుగా జన్మ తీసుకోవచ్చు.

యజ్ఞ వత్సలు బృజ్‌కోఠిలో చక్కగా స్థిరపడ్డారు. దానిని వారందరూ కలిసి 'మధుబన్' అని పిలుచుకోసాగారు.

ప్రతిరోజూ, భగవంతుని జ్ఞాన మురళి వినిపించేది. అది విన్న వత్సలు మానసికంగా ఎదగసాగారు. సమయమున్నప్పుడల్లా బ్రహ్మ బాబా పిల్లలను పర్వతాలపైకి షికారుకు తీసుకువెళ్ళేవారు. యజ్ఞ వత్సలు శ్వేత వస్త్రాలలో సామూహికంగా కదిలి డామ్ లేక్, నక్కీ లేక్ మొదలైన స్థానాలకు వెళ్తుంటే అక్కడి స్థానికులు నిశ్చేష్టులయ్యేవారు. ఎవరీ శక్తి దళము అని అనుకునేవారు. ఇది కలయా లేక సాక్షాత్కారమా అని నివ్వెరపోయేవారు! మహిళలు ఎంతో శక్తితో, ఉత్సాహంగా పర్వతాలపైకి వెళ్ళడాన్ని మునుపెన్నడూ వారు చూసి ఎరుగరు.

బ్రహ్మాబాబాకు 70 సంవత్సరాలు పైనే ఉంటాయి. అయినాకానీ అందరికన్నా బ్రహ్మ బాబాయే వేగంగా నడిచేవారు. పర్వత శిఖరంపై చేరుకున్న తర్వాత బ్రహ్మాబాబా కొన్ని జ్ఞాన ముత్యాలను వినిపించేవారు. వారి దృష్టి పడగానే వత్సలు ట్రాన్స్‌లోకి వెళ్ళిపోయేవారు.

కొన్నిసార్లు, సాక్షాత్కారంలో శ్రీకృష్ణునితో నాట్యం చేస్తున్న దృశ్యాన్ని చూస్తున్న పిల్లలు ఇక్కడ పర్వతంపై కూడా నాట్యం చేస్తూ గుట్ట చివరకు వెళ్ళిపోయేవారు. చూసేవారికి చాలా భయమేసేది, కానీ భగవంతుని ఆధారమును పొందిన వారికి ఏమి జరుగగలదు? నిజానికి కూడా, ఎటువంటి ఆపద ఎప్పుడూ జరుగలేదు. వారి సంతోషాలు రోజురోజుకూ పెరగసాగాయి.

చాలాసార్లు బాబా పిల్లలతో ఇలా చెప్పేవారు, "ఇద్దరు ముగ్గురు కలిసి వెళ్ళి వేర్వేరు గుట్టలమీద యోగం

చెయ్యండి. జ్ఞాన చింతన చెయ్యండి. ఆవులు తమ ఆహారాన్ని నెమరు వేసుకున్నట్లుగా మీరు విన్న జ్ఞానాన్ని మనన చింతన చేయండి.” శ్వేత వస్త్రాలతో బ్రహ్మకుమార్ కుమారీలు పర్వత శిఖరాలపై కూర్చుని యోగం చేసుకుంటూ ఉంటే క్రిందినుండి ఆ దృశ్యం చూస్తే తెల్లని మబ్బులు పర్వత శిఖరాలను కప్పేసాయా అన్నట్లుగా అనిపించేది. అందరూ వరుసగా పర్వతాలను ఎక్కుతూ ఉంటే తెల్లని పక్షులు ఆకాశంలో ఎగురుతున్నట్లుగా ఉండేది.

ఆధ్యాత్మిక జీవితము అంటే సన్యాస జీవితం జీవించాలి అని అందరూ భావిస్తారు. కానీ తమలోని అనవసరమైన చెత్తను మాత్రమే పారవేసి క్రొత్త సంతోషాలను నింపుకున్నామని బాబా పిల్లలకు తెలుసు. నిజానికి, వీరు ఒక సదాకాలిక సెలవులలో ఉన్నారని చెప్పవచ్చు. చాలాసార్లు, ఉదయం మురళి క్లాసు అయ్యాక పిల్లలను బాబా షికారుకు తీసుకువెళ్ళేవారు.

అప్పుడు బ్రహ్మబాబా ఇలా అనేవారు, “మధురమైన పిల్లలూ! ఈరోజు మనం పర్వతాలపైకి వెళ్ళి అక్కడ ఏకాంతంలో శివబాబా స్మృతిలో కూర్చుందాము. మనం గుహ్యమైన, రమణీయమైన జ్ఞానయుక్తమైన కథలను కూడా చెప్పుకుందాము. తర్వాత, శివబాబా స్వయంగా పిల్లలకు టోలీ ఇస్తారు. పిల్లలూ! ఇది ఒక కుటుంబ సత్సంగము, అంతేకాక ఒక విశ్వవిద్యాలయము కూడా. ఎంతోకాలం నుండి పరమాత్మకు దూరంగా ఉన్న ఆత్మలమైన మనము ఇప్పుడు భగవంతుడిని కలుసుకున్నాము. కావున ప్రేమ సాగరుడైన పరమాత్మయే స్వయంగా పాలన ఇస్తారు. వారు నిరాకారుడు. వారికి వారి శరీరము లేదు. అందుకే వారు ఈ బ్రహ్మ తనువును అప్పుగా తీసుకున్నారు. వారు ఈ చేతులతో యజ్ఞ ప్రసాదాన్ని ఎంతో ప్రేమగా అందరికీ పంచుతారు. దేవతలు కూడా యజ్ఞ ప్రసాదం కోసం తపిస్తారని అందుకే అంటారు.

“పిల్లలూ! మీరు చాలా అదృష్టవంతులు. స్వయంగా భగవంతుడే మీకు చదువు చెప్తున్నారు. త్రికాలపతి అయిన పరమాత్మ దూరంగా ఉన్న పరంధామం నుండి వచ్చి చదివిస్తున్నారు. ఎవరిని పొందడానికి సన్యాసులు అడవులలో వెతుకుతున్నారో, ఎవరి కోసమైతే తపస్వీలు గుహలలో గంటలకొలది ఆసనంపై కూర్చుని తపస్సు చేస్తున్నారో, భక్తులు మథుర–కాశీవంటి తీర్థ క్షేత్రాలకు వెళ్తున్నారో, క్రీస్తుకు తండ్రి, మోసస్‌కు ప్రేరణస్తోత అయిన ఆ పరమాత్మ దర్శన భాగ్యం ఒక్క క్షణమైనా కలగాలని వారి శిరస్సులను సైతం ఖండించుకోవడానికి తయారవుతున్నారో, ఏ పరమాత్మ కోసమైతే రాజులు తమ రాజ్యభాగ్యాన్ని త్యాగం చెయ్యడానికి కూడా సంకోచించడంలేదో అటువంటి ప్రియమైన పరమపిత మీ వద్దకు వచ్చి పిల్లలైన మిమ్మల్ని చదివిస్తున్నారు, ప్రేమగా పాలన ఇస్తున్నారు, మీ స్నేహితుడై మీతో ఆడుకుంటున్నారు! ప్రభు మిలనము గురించి శాస్త్రాలలో ఎంతగానో వర్ణించబడింది. కానీ ప్రపంచంలోనివారు, గుప్తంగా, సాధారణంగా ఉన్న మిమ్మల్నీ గుర్తించలేకపోతుంది, పరమాత్మను కూడా గుర్తించలేకపోతున్నారు. ఎందుకంటే మానవుని కళ్ళకు ఒక పెద్ద తెర అడ్డుగా నిలుస్తుంది, దాని కారణంగా వారు కేవలం భౌతిక విషయాలనే చూడగలుగుతున్నారు.”

ఒక్కోసారి బాబా మమ్మల్ని పిక్‌నిక్‌కు తీసుకువెళ్ళేవారు. బాబా ఎంతో వేగంగా వేగాన్ని పుంజుకునేవారు. అప్పుడు బాబా ఇలా అనేవారు, “పిల్లలూ! మీరు శివబాబాను గుర్తు చేస్తున్నారా? మీరు ఎవరి వెనుక నడుస్తున్నారు? మీరు పరమాత్మని స్మృతిలో ప్రతి అడుగూ వేస్తే, ఒక్క అడుగుకు అనేకరెట్ల పుణ్యాన్ని సంపాదించుకోవచ్చు!”

ఒక్కోసారి ముందు వెళ్తున్న బాబా ఆగిపోయేవారు. ఆగి వెనక్కు తిరిగి పిల్లలతో ఇలా అనేవారు, “పిల్లలూ! మీరు ముందు నడవండి. నేను మీ వెనకగా వస్తాను. ఆవులు అటూ ఇటూ వెళ్ళిపోకుండా ఉండటానికి గొల్లవాడు ఎప్పుడూ ఆవుల వెనకే నడుస్తాడు. అలాగే నేనూ మిమ్మల్ని వెనక ఉండి చూసుకుంటాను.”

మరోసారి బాబా మా ముందు నడిచేవారు. “మార్గదర్శకుడు ముందు నడుస్తూ మార్గాన్ని చూపిస్తాడు. నేను మీకు మార్గాన్ని చూపిస్తాను. యాత్రికులు వెనక నడుస్తారు.”

ఒకసారి పిల్లల చేయి పట్టుకుని ఇలా అనేవారు, “మీరు ఎవరి చేతిని పట్టుకున్నారు? ఈ చేయి శివబాబాదా లేక బ్రహ్మబాబాదా? ఎప్పుడూ ఈ చేతిని వదిలిపెట్టవద్దు! ఈ చేతిని పట్టుకోవడం వలన ఎక్కడకు చేరుకుంటారో తెలుసా?”

వెంటనే మరొకరిని ఇలా అడిగేవారు, “మీరు ఎవరితో నడుస్తున్నారు?” “బాబాతో” అని పిల్లలు జవాబిచ్చారు.

అప్పుడు మళ్ళీ బాబా అన్నారు, "అవును! బాబా నుండి ఎటువంటి వారసత్వము లభిస్తుందో గుర్తుంది కదా! ఆ వారసత్వ సంతోషంలో నడవండి. చూడండి, శివబాబా మీకు రాజయోగాన్ని నేర్పించి రాజులకే రాజుగా, రారాజులుగా చేస్తున్నారు."

మళ్ళీ బ్రహ్మబాబా తీవ్ర వేగంతో ముందుకు నడుచుకుంటూ వెళ్ళేవారు. అలా కొంత దూరం ముందుకు వెళ్ళాక ఇలా అనేవారు, "చూడండి, ఇది ఎటువంటి శక్తి దళము! మీరు ఇంకా వెనకనే ఉన్నారు. ముసలివాడు యువకుడయ్యాడు, యువకులు ముసలివారయ్యారు!" ఆ తర్వాత ఇలా వివరించేవారు, "ఈ శరీరంలో రెండు ఇంజన్లు ఉన్నాయి. ఒకటి బ్రహ్మబాబా ఆత్మ, మరొకటి శివ పరమాత్మ. అందుకే ఈ బ్రహ్మ వేగంగా నడవగలుగుతున్నారు."

ఒక్కోసారి బాబా పిల్లలను కఠినమైన మార్గం ద్వారా పర్వతాలపైకి తీసుకువెళ్ళేవారు. వృద్ధులైన మాతలు కొంతమంది ఆ దారిలోని రాళ్ళను ఎక్కలేక మధ్యలోనే ఆగిపోయి బాబాతో ఇలా అనేవారు,"బాబా, ఆగండి బాబా! మీరు ఈ దారిలో ఎందుకు తీసుకువచ్చారు? ఎక్కడానికి సరైన స్థానం కూడా ఇక్కడ లేదు. ఈ రాయి నున్నగా, గుండ్రంగా ఉంది. ఎక్కడ పట్టుకోవాలి, ఎక్కడ కాలు పెట్టి పైకి రావాలి?" అప్పుడు పై రాయి మీదున్న బాబా తమ చేతిని అందించి వారు పైకి రావడానికి సహాయం చేసేవారు.

ఆ మాతలు బాబా, బాబా అంటూ ఆ రాయిని ఎక్కేవారు. చూసారా, ప్రతి చిన్న విషయంలోనూ బాబా స్మృతిని కలిగించి అందరికీ అండగా పరమాత్మను నిలిపారు. పర్వతాన్ని ఎక్కుతూ, ఎక్కుతూ ఆయాసం వస్తే మాతలు కొందరు ఆగిపోయి బాబాతో ఇలా అనేవారు, "బాబా, ఇక చాలు బాబా! ఇంకా ముందుకు వెళ్ళకండి." సరేనని బాబా ఆగిపోతే బాబా మా మాట విన్నారన్న సంతోషం ఆ మాతల ముఖంలో కనిపించేది. ఒకసారి ఎప్పుడైనా బాబా ఆగకుండా ముందుకు వెళ్తే, "బాబా మన మాట వినడం లేదు" అంటూ మధురమైన ఫిర్యాదుతో ఉండేవారు. ఈ విధంగా బాబా చేసే ప్రతి కర్మలో దివ్యమైన స్నేహము, సర్వులపట్ల కళ్యాణ భావన నిండుకుని ఉండేవి.

జ్ఞానము, యోగము, ధారణ, సేవ – అన్నీ ఆత్మ ఉన్నతి కోసమే. ఎన్నో పరీక్షలను కూడా యజ్ఞంలో ఎదుర్కోవలసి వచ్చింది. ఈ విషయం గురించి బి.కె. విశ్వ రతన్‌గారు, మధుబన్ నివాసి, ఈ విధంగా చెప్తున్నారు:

"బృక్ కోఠి ఊరి శివార్లలో, అడవికి దగ్గరగా, ఏకాంత స్థానంలో, స్మశానానికి దగ్గరగా ఉంది. చుట్టు ప్రక్కల ఎన్నో పాములు, ఇతర జీవ జంతువులు ఉండేవి. యజ్ఞ వత్సలు ఇందులో నివసించక ముందు చాలాకాలం వరకు ఇది ఖాళీగానే ఉండింది. మౌంట్ ఆబూ వాసులు కొంతమంది ఇందులో దెయ్యాలున్నాయి అని చెప్పారు.

"ఈ మాటలు మాలో భయాన్ని కలిగించలేదు. ఒకవేళ పాము అటుగా వెళ్తున్నా కానీ మేము చాలా ప్రశాంతంగా ఉపరామంగా ఉండేవాళ్ళము. 'మేము శివ బాబా సంతానము. మేము ఆ ప్రాణికి హాని కలిగించనప్పుడు అది మనకి ఎందుకు హాని తలపెడుతుంది' అని అనుకునేవాళ్ళము. చాలాసార్లు దెయ్యాలు కూడా వచ్చాయి. కానీ యోగ శక్తి, పవిత్రత బలం కారణంగా అవి నిలువలేదు. చివరకు, ఆ దెయ్యాలన్నీ ఆ స్థానాన్ని విడిచి వెళ్ళిపోయాయి. ఇది నిజం. ఏ యజ్ఞ వత్సలైతే ప్రస్తుతం విశ్వ వ్యాప్తంగా ఉన్న కామ క్రోధాది మహా భూతాల్ని జయించడానికి తీవ్ర పురుషార్థం చేస్తున్నారో, ఎవరైతే తమ మనసులను ఒక్క పరమాత్మయందు నిలిపారో, విష సర్పాలకన్నా భయంకరంగా మారి వికారభరితుడైన మానవుని ఎదుటే ఓటమిని అంగీకరించని ఈ శివశక్తులు ఈ పాములను, భూతాలను చూసి భయపడగలరా? నిజానికి, ఈ ఏకాంత స్థానము యోగానికి అనుకూల స్థానంగా అందరికీ అనిపించింది.

"యుద్ధం తర్వాత, ఆ రోజుల్లో, ఆబూలో గోధుమ పిండి నియమిత పరిమాణంలోనే లభించేది. కావలసినంత గోధుమ పిండి లభించేది కాదు. మొక్కజొన్న పిండి మరియు సజ్జ పిండి కూడా దానితోపాటు తీసుకోవలసి ఉంటుంది. అది కూడా సరిపడినంత లభించేది కాదు. ఇక్కడ తక్కువ నాణ్యత కలిగిన బియ్యం దొరికేది. ఇక్కడి నీటిలో లవణము, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడి గాలిలో పొడిబారినతనం ఉంటుంది. ఇలా ఆహార విషయంలో, నీరు, గాలిలో

ఎంతో మార్పు ఉంది. మాలో చాలామంది సంపన్న కుటుంబాల నుండి వచ్చారు. వారికి ఏ విధమైన భౌతిక అసౌకర్యము గురించీ తెలియదు. ఇప్పుడు సహనము, పొదుపు, పరిస్థితులకు అనుగుణంగా స్వయాన్ని మల్చుకోవడం వంటివి ఇక్కడ నేర్చుకుంటున్నాము."

"మేము ఆకలి, దప్పిక, ప్రతికూలమైన నీరు-గాలి వలన వచ్చిన పరీక్షలను దాటివేసాము. మేము ఇప్పటికే మితాహారులుగా మారిపోయాము. కానీ ఒకరోజు అసలైన పరీక్ష ఎదురైంది. ఒకసారి శివబాబా యజ్ఞ వత్సలకు 15 రోజులు పూర్తిగా సజ్జ రొట్టె, మజ్జిగ మాత్రమే తీసుకోవాలని ఆదేశించారు. అనారోగ్యంతో ఉన్నవారి ఆహారం కూడా ఇదే అన్నారు. అనారోగ్యంతో ఉన్నవారికి ఇదెలా సరిపోతుంది? అది వారిని మరింత బలహీనంగా చేస్తుంది కదా అని కొంతమంది అడిగారు. కానీ అనారోగ్యంతో ఉన్నవారు మాత్రం నిస్సంకల్పంగా, నిస్సంకోచంగా, పరమాత్మపై సంపూర్ణ నిశ్చయంతో బాబా ద్వారా ఆదేశింపబడిన ఆ భోజనాన్నే, ఆ 'బ్రహ్మ భోజనాన్ని' అమృతంలా, ఔషధంలా భావించి స్వీకరించారు. అతి కొద్ది సమయంలోనే వారి ఆరోగ్యం మెరుగుపడింది. శివబాబా కళ్యాణకారి. వారి ప్రతి ఆజ్ఞలో కళ్యాణము ఇమిడి ఉంటుంది. సంపూర్ణ నిశ్చయంతో వారి ఆజ్ఞలను పాటించడంలోనే మనకు మేలు అన్న పాఠము ఈ పరీక్ష ద్వారా అందరి మనసులలో నాటుకుపోయింది. భగవంతుడు చెప్పింది చెయ్యడం వలన ఏమైనా నష్టపోతామేమో అని అనుకుంటే అది పెద్ద పొరపాటే అవుతుంది. అప్పటినుండి, ఎటువంటి కఠినమైన పరిస్థితులు వచ్చినాగానీ మాకు అందులో మంచి, లాభమే కనిపించ సాగాయి."

నింద-స్తుతి, గెలుపు-ఓటమి, లాభము-నష్టము, ఆకలి-దప్పిక, ఎండ-చలి, పేదరికం-సంపన్నత, మొదలైనవి యోగి జీవితంలో ఒక పరీక్షగా వచ్చాయి. కానీ సత్యమైన యోగులై, ప్రభు ఆశ్రితులై, ఒక్క భగవంతుని బలము-నమ్మకంతో వాటన్నిటినీ చిరునవ్వుతో దాటివేయవచ్చు.

# విభిన్న ప్రకారాల ఆసక్తుల త్యాగము

మనిషికి అనేక రకాల ఆసక్తులు ఉంటాయి. సాధారణంగా, అతడు పుట్టిన ఊరు, స్థానము, ఆహారపు అలవాట్లు, ఆచార–వ్యవహారాలు, భౌతిక వస్తువులను  విడిచి పెట్టడానికి ఇష్టపడడు.

కానీ, సర్వ ఆసక్తులను త్యాగం చేసి, అడుగడుగులో జీవిత పాఠాలను నేర్చుకుంటూ, జీవితాన్ని తన ఉన్నత లక్ష్యం వైపుకు మరల్చుకోవడము, ముందుకు వెళ్ళడమే ఒక యోగి లక్షణము. భగవంతుడిని స్మృతి చేస్తూ అన్ని చింతల నుండి దూరంగా ఉండాలంటే ఇదొక్కటే మార్గము. తమలోని చెడు అలవాట్లు, సంస్కారాల పరివర్తననే లక్ష్యంగా పెట్టుకుని ఈశ్వరీయ జ్ఞానయోగ సాధనతో దైవీ సంస్కారాలను అలవాటు చేసుకోవాలన్న లక్ష్యంతో ఉన్న యజ్ఞవత్సలు శీఘ్రంగానే క్రొత్త ఆహారపు అలవాట్లకు, నీరు–గాలికి అలవాటు పడ్డారు. కొద్దిమంది మాత్రం వెళ్ళిపోయారు. యజ్ఞంలో ఇది 'బెగ్గరీ' సమయము. (పేదరిక సమయము).

కొంతకాలం యజ్ఞంలో బెగ్గరీ సమయము కొనసాగింది. శ్రీమద్భగవద్గీతలో ఒక వృత్తాంతం ఉంది – అది పాండవులు వనవాసం చేస్తున్న రోజులు. ఒకరోజు ద్రౌపది వద్ద అక్షయ పాత్రలో ఒకే ఒక్క మెతుకు మిగిలింది. అప్పుడు భగవంతుడే అద్భుతాన్ని చేసాడు. క్షణకాలం కోసం కష్టాల స్థితికి పంపి మళ్ళీ అద్భుతాన్ని చేసి చూపించారు. ఇటువంటి పరిస్థితినే యజ్ఞ వత్సలు ఎదుర్కున్నారు. యజ్ఞ వత్సలను అన్ని విధాలుగా అనుభవీమూర్తులుగా చెయ్యడానికి, ఏకరస స్థితిలో స్థితులవ్వడానికి, పరమాత్మతో అతి సమీపంగా ఉన్నట్లు అనుభవం చెయ్యడానికి అల్పకాలం కోసం మాత్రమే ఈ కష్టాలు వచ్చాయని వారికి అర్థమయింది. కానీ బలహీనమైన వారు యజ్ఞాన్ని విడిచి వెళ్ళిపోయారు.

సముద్రంలోని నౌక తుఫాను వచ్చినప్పుడు ఊగిసలాడుతుంది. ఊగిసలాడుతున్న నావ నుండి పిరికివారు, భయస్థులు క్రిందకు దూకేస్తారు. అలాగే ఈ జ్ఞానమనే స్టీమర్‌ను భగవంతుడు ఒక్కసారి గట్టిగా ఊపారు. ఆ సత్యమైన నావలో లక్ష్యం లేకుండా, భౌతిక ఆకర్షణలతో ఉన్నవారు ఈ ఊగిసలాటకు భయపడి క్రిందకు దూకేసారు. యజ్ఞం నుండి వెళ్ళిపోయారు. సత్యమైన ఈ నావకు భగవంతుడే కెప్టెన్. ఈ స్టీమర్‌లోని యాత్రికులను నవ్విస్తూ–ఆహ్లాదపరుస్తూ, అనుభవిగా చేస్తూ, మధ్యమధ్యలో స్టీమర్‌ను ఊపుతూ, సుడిగుండాలు, అలలు–తుఫాన్లగుండా భవ సాగరమును దాటిస్తూ లక్ష్యం వైపుకు తీసుకువెళ్తున్నారు.

*బుద్ధియోగము ఈశ్వరునితో ఉన్నవారు,*
*వికారాలతో ఎప్పుడూ ఓడిపోరు,*
*ఆత్మ జ్యోతిని ఆ శివుడు వెలిగించారు,*
*ఏ తుఫాన్లు ఈ జ్యోతిని ఆర్పలేవు.*

# భారతదేశంలో విజయభేరి

ఈశ్వరీయ విద్య-అధ్యయనంతో కూడిన ఈ అలౌకిక జీవితంలో యజ్ఞ వత్సలు ప్రభు ప్రేమను పొందారు. "మాకు భగవంతుడు లభించారు, మా సంస్కారాలను సానపెట్టుకుంటున్నాము. మాకు పరమానందం లభిస్తుంది. ఇక ఈ ప్రపంచంలో మేము చెయ్యవలసిందేమీ లేదు" అని యజ్ఞ వత్సలు భావించారు. ఈ సందర్భంలో బి.కె. చంద్రమణిగారు, ఈ విధంగా వివరిస్తున్నారు. బి.కె.చంద్రమణిగారు తమ తుది శ్వాస వరకు పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఈశ్వరీయ సేవలను అందించారు:

ఆబూకు వచ్చిన తర్వాత మాకు భగవంతుని దివ్యమైన లీలలలో కొన్ని క్రొత్త సూచనలు కనిపించాయి. అత్యద్భుతమైన అలౌకిక క్రొత్త దృశ్యాలకు తెర లేవనుందని అర్థమయింది.

"డాక్టర్లు, లాయర్లు, వ్యాపారవేత్తలు, న్యాయమూర్తులు మొదలగు వృత్తుల వారికి ఈ జ్ఞానాన్ని ఎలా అర్థం చేయించాలో బ్రహ్మాబాబా మాకు నేర్పించేవారు. యజ్ఞంలో అయితే న్యాయమూర్తులుగానీ, వకీళ్ళుగానీ లేరు. జన సేవ కోసం బాబా వత్సలను యజ్ఞం నుండి బయటకు సేవార్థం పంపుతారని అర్థమయింది. బాబా ఇలా అనేవారు, 'పిల్లలూ! మీరు పొందిన ఈ జ్ఞానము ఎంతో అద్భుతమైనది, అమూల్యమైనది కూడా. ఈ జ్ఞానము ఎంతోకాలం నుండి లోపించి ఉంది. మీరు ఈ జ్ఞానాన్ని అందరికీ వినిపించినప్పుడు వారెంతో ఆనందించి భగవంతునికి సమర్పణ అవుతారు.'

'పిల్లలూ! చిన్న చిన్న కన్యలైన మీరు యోగ శక్తితో ఈ జ్ఞానాన్ని పెద్ద పెద్ద దిగ్గజాలకు, విద్వాంసులకు ఇవ్వగలరు. ఎవరైతే స్వయాన్నే పరమాత్మగా భావిస్తూ ఉన్నారో, ఆత్మయే పరమాత్మ అని చెప్తున్నారో వారికి కూడా మీరు ఈ జ్ఞానాన్ని వినిపించి భగవంతుడిని యథార్థంగా అర్థం చేసుకునే విధంగా చెయ్యగలరు. ఘోరమైన అజ్ఞాన నిద్రలో నిద్రిస్తున్న నరనారీమణులను మేల్కొల్పేందుకు మీరే నిమిత్తులు. పిల్లలూ! భక్తుల మొర మీకు వినిపించడం లేదా: *హే జగన్మాతా! హే అంబా! మీ పిల్లలమైన మేము చిరకాలం నుండి మిమ్మల్ని పిలుస్తున్నాము. హే జ్వాలాముఖి దేవీ! ఆరిపోయి ఉన్న మా జ్యోతులను ఇప్పుడు వెలిగించి అంధకారాన్ని తొలగించు! తల్లీ! మాయతో ఓడిపోయి నీ విగ్రహాల వద్దకు, నీ ద్వారానికి నీ కరుణ కోసమై వచ్చాము. మాకు సాక్షాత్కారాన్ని ప్రసాదించు. మమ్ము కనికరించు. అమ్మా! ఈ పాపపు కూపంలో పడిపోకుండా మమ్మల్ని పట్టుకో తల్లీ! నీ చేయిని అందించి మమ్మల్ని పైకి తీసుకు రా! మా మొర ఆలకించి మమ్మల్ని ఆదుకో, మా బలిని స్వీకరించు!"*

బాబా చెప్పే ఈ విధమైన మహా వాక్యాలను విన్న వత్సలకు తాము ఏమి చెయ్యాలో అర్థమయ్యింది - యజ్ఞ స్థలాన్ని విడిచి వీధి వీధిలో, గ్రామ గ్రామాలలో, నగర నగరాలలో, భగవంతుని కోసం తపిస్తున్న వారికి జ్ఞాన సందేశాన్ని ఇవ్వాలి.

**ప్రేమకు, జ్ఞానానికి మధ్య యుద్ధం మొదలైంది.**

"మేము నిజంగా మా ప్రియమైన బ్రహ్మాబాబా మరియు శివబాబాను విడిచి ఉండాలా? మేమైతే జ్ఞాన సాగరుడైన శివబాబాపై బలిహారమై ఇక్కడకు వచ్చాము. ఎవరి కోసమైతే మేము ఈ ప్రపంచాన్ని విడిచి వచ్చామో, బంధువుల వైపు విముఖత చూపామో, తనువు-జనుల నుండి వచ్చిన విఘ్నాలను సహించామో, అత్యాచారాలను ఎదుర్కున్నామో, రుచులు-అభిరుచులను వదులుకున్నామో, అటువంటి మేము ఇప్పుడు ఆ జ్ఞాన మురళిని భగవంతుని సమక్షంలో కూర్చుని వినే భాగ్యం నుండి వంచితులమవ్వాలా? అతి ప్రియమైన బ్రహ్మాబాబాను విడిచి రోజులు, నెలలు, సంవత్సరాలు దూరంగా ఉండాలా? లేదు, లేదు! ఎట్టి పరిస్థితుల్లోనూ మేము ఇందుకు ఒప్పుకోము."

మరుక్షణమే వారిలో ఉన్న ఈశ్వరీయ జ్ఞానము వారికి ఈ విధంగా తమ కర్తవ్యాన్ని గుర్తు చేసింది, "ఓ గోపికా! నిస్సందేహంగా నీవు ప్రభు ప్రేమలో పాలన పొందావు. నీవు నీదంతా ఆ ప్రభువుకు అర్పించావు. నీవు ఆ ప్రభువు నుండి,

వృద్ధ పితాశ్రీ తనువు ద్వారా ఎంతో సేవను తీసుకున్నావు. ఇన్ని సంవత్సరాలు శిక్షణ-ప్రశిక్షణ, లాలన-పాలన పొందావు, భగవంతుడి నుండి పొందిన ఈ అలౌకిక ఆనందాన్ని నీవరకే పరిమితం చేసుకుంటావా? జ్ఞాన సాగరుడి నుండి పొందిన జ్ఞాన ఖజానాలను నీవు ఇతరులకు కొంతైనా దానం చెయ్యవా? భగవంతుడు పిల్లల ఎదురుగా ప్రత్యక్షమయ్యారు, మరి గుప్తంగా ఉన్న భగవంతుడిని జనుల ఎదుట ప్రత్యక్షం చెయ్యవా? భగవంతుడు వృద్ధ శరీరంలోకి వచ్చి వీధి-వీధికి, వాడ-వాడలకు వెళ్ళి నిద్రిస్తున్న ఆత్మలను మేల్కొల్పవా? నువ్వు భగవంతుడిని గుర్తించావు. మరి ఇతరులకు ఆ ప్రియతముని పరిచయము ఇవ్వవా? ప్రభు ప్రేమలో మునిగి ఉంటానంటావు కానీ విశ్వంలో దుఃఖంతో అలమటిస్తున్న నరనారీమణులకు ఆ భగవంతుడి పరిచయమును ఇవ్వనంటావా? ........." ఈ విధంగా గోపగోపికల మనసు అనే మైదానంలో ప్రేమ మరియు జ్ఞానానికి మధ్య సంగ్రామం జరిగింది.

మరో వైపు బాబా ప్రతి రోజూ మురళిలో ఈ విధమైన శిక్షణ, ప్రేరణ ఇచ్చేవారు - "పిల్లలూ! నిస్సారవంతంగా మారిన ఈ భారతావనిలో మీరు జ్ఞాన గంగలై ప్రవహించండి. మీ యోగ శక్తిని చూపించే సమయం ఆసన్నమయింది. ఇప్పటివరకు నేర్చుకున్నవాటిని ఉపయోగించే సమయమిది. ఎవరైతే ఈ జ్ఞానాన్ని స్పష్టంగా నేర్చుకున్నారో వారు ఈ జ్ఞానాన్ని ఇతరులకు కూడా స్పష్టంగా చెప్పగలరు. అజ్ఞాతవాసంలో, అరణ్యవాసంలో ఉండే సమయము పూర్తయింది. హాస్టల్‌లో ఉండే సమయం కూడా పూర్తయింది. ఇప్పుడు మీరు నిద్రిస్తున్నవారిని మేల్కొల్పండి.

"పిల్లలూ! ఇది అవినాశి అశ్వమేధ రుద్ర జ్ఞాన యజ్ఞము. ఈ అశ్వమేధ యజ్ఞం నుండి గుర్రాలు వెలువడి అవి విశ్వ పరిక్రమణ చేస్తాయి. శాస్త్రాలలో అశ్వమేధ యజ్ఞం గురించిన ప్రస్తావన ఉంది. మీ కర్తవ్యానికి గాయనమే ఇది. అశ్వము అనగా ఇంద్రియాలతో కూడిన శరీరము. జ్ఞాన యజ్ఞము నుండి వెలువడిన అశ్వాలైన మీరు వెళ్ళి శంఖానాదం చేయండి. నలువైపుల విజయభేరిని మ్రోగించండి. మీ జ్ఞాన గర్జనతో భారతవాసులు అజ్ఞాన నిద్రనుండి మేల్కుంటారు. మీ ఉన్నతమైన ధారణలను చూసి జనులు జయ జయ గానాలు చేసే రోజు కూడా వస్తుంది."

ఇంకా, బాబా ఇలా అనేవారు, "పిల్లలూ! దైవీ రాజ్యాన్ని పునఃస్థాపన చెయ్యడానికి బాబా వచ్చారు. ఇతర ధర్మ స్థాపకులు తమ తమ ధర్మాలను స్థాపించినప్పుడు పరంధామంలోని ఆ ఆ ధర్మాలకు చెందిన ఆత్మలు క్రిందకు దిగి వస్తాయి. ఈ విధంగా ఆ ధర్మస్థుల సంఖ్య పెరుగుతుంది. కానీ దైవీ ధర్మ పునః స్థాపనా కార్యము ఇందుకు భిన్నంగా ఉంటుంది. మీ దైవీ పరివారానికి చెందిన దేవాత్మలు ఈ భువిపైనే ఉన్నారు. కానీ స్వయాన్ని మర్చిపోయి వికారులుగా, పతితులుగా అయిపోయారు. కావున వారికి వారి నిజ ధర్మమును గుర్తు చేసే కర్తవ్యాన్ని మీరు చేసి మళ్ళీ తిరిగి దేవీదేవతలుగా అవ్వాలన్న లక్ష్యాన్ని ఇవ్వాలి. ఎందుకంటే దైవీ రాజ్యం ఇప్పుడు స్థాపన అవ్వబోతున్నది.

"పిల్లలూ! రాబోవు దైవీ స్వరాజ్యంలో రాజులు, ప్రజలుగా అందరూ దేవీదేవతలే ఉంటారు. ఎవరైతే ఇతరులకు జ్ఞానాన్ని వినిపించి పతితులను పావనంగా, మనుష్యులను దేవతలుగా చేసే సేవను చేస్తారో వారే మహారాజులుగా అవుతారు...." ఈ విధమైన యుక్తితో కూడిన తియ్యని మురళీల ద్వారా బాబా పిల్లలకు ఈశ్వరీయ సేవార్థం వెళ్ళడానికి ప్రేరణను కలిగించేవారు. ఇది విన్న పిల్లల హృదయం సేవ చెయ్యాలని తపించేది. ఈశ్వరీయ ప్రేమ అనే తియ్యని బంధనాన్ని ఇష్టం లేకపోయినా ఇప్పుడు వదులుగా చేసి ఇక కర్తవ్య క్షేత్రంలోకి దిగవలసిందే అని పిల్లలకు అర్థమయింది. క్షణకాలమైనా బాబా నుండి దూరంగా ఉండటం సహించలేని పిల్లల అంతర్మాత ఈ విధంగా పలికింది - "మన అతి ప్రియమైన భగవంతుడు, తండ్రిని ఈ ప్రపంచంలో ప్రత్యక్షం చేసాకే మనకు విశ్రాంతి. ఆ సుఖదాత ఇచ్చిన సందేశాన్ని అందరికీ అందిద్దాము:-

*మనోవికారాల ఆటలో పోయింది మా ఆనందము*
*ప్రభువు ఈ భువిపైకి వచ్చేవరకు దుఃఖములో మునిగి ఉన్నాము*
*కర్మబంధనాలను తీర్చుకోవలసిన సమయమిది*

మృత్యుఘంటికలు మ్రోగుతున్న సమయమిది
దిక్కు తోచని మానవుడికి చూపాడు భగవంతుడు మార్గాన్ని
చూపాడు గృహస్థ జీవితాన్ని కమల పుష్పంలా మార్చుకునే మార్గాన్ని
ఆత్మ స్థితిలో ఉండు, నీవు శరీరము కాదు
భగవంతుని స్మృతిలో ఉండు, అతనిచ్చిన విద్యను మరువద్దు
నిత్య సంతోషంలో ఉండు
కల్ప వృక్షానికి సుమధురమైన పుష్పాలు మీరు.

# జనుల ఆత్మిక సేవకై వత్సల పయనం

బీజము బాగా నాటుకుని ఒక ఆరోగ్యకరమైన మొక్కగా ఎదిగింది. ఒకప్పుడు మొగ్గలుగా ఉన్నవి ఇప్పుడు పుష్పాలుగా వికసించాయి. ఆ పూలనుండి ఫలాలు వచ్చే సమయమిది. అలమటిస్తున్న ప్రపంచానికి సేవ చేసేందుకు ఒక సజీవమైన, ఆత్మిక ఫలము యజ్ఞంనుండి వచ్చింది. అంబాలా సేవాకేంద్రంలో సేవలనందించిన బి.కె. దాదీ ధ్యానిగారు ఈ విధంగా వివరిస్తున్నారు:

"ఈశ్వరీయ జ్ఞానాన్ని అధ్యయనం చేసిన తర్వాత అణకువ, ప్రేమ, పవిత్రత, ఆనందము, అహింస, దయ, కరుణవంటి భావాలు సహజంగానే మనిషిలో నెలకొంటాయి. ఇవన్నీ ఇప్పుడు యజ్ఞ వత్సలలో పుష్కలంగా కనిపిస్తున్నాయి.

"సుగుణాల రుచి మర్చిపోలేనిది. బ్రహ్మాకుమారీ కుమారులను కలిసినవారంతా ఇంద్రియ నిగ్రహ జీవితాన్నే కోరుకుంటున్నారు. బాబా పిల్లలు ఎంతో అనాసక్తతతో ఉన్నారు. ప్రాపంచిక ఆకర్షణలేవీ వారినిప్పుడు వెనుకకు లాగలేవు. వారిలోని సాధారణత కేవలం శ్వేత వస్త్రాలలో, సాధారణ జీవితంలో మాత్రమే లేదు, వారి మనసు మరియు శరీరం కూడా నిరాడంబరంగా ఉన్నాయి. కోరికలు మనసును చలింపజేయడం లేదు. వారి మనసు అనే దర్పణంపై వికారపు ధూళి లేదు. షుమారుగా 400మంది కన్యలు మరియు మాతలు, సోదరులు ఇన్ని సంవత్సరాలు కలిసిమెలిసి ఉంటూ భావ- స్వభావాలు, ఆవేశ-ద్వేషములకు దూరంగా, స్వచ్ఛంగా అయ్యారు. వారికిప్పుడు ఒక్క పరమాత్మ తప్ప మరెవ్వరూ లేరు."

సూర్యుని తాపము సముద్రంలోని నీటిని ఆవిరిగా మారుస్తుంది. ఆవిరిగా మారిన ఆ నీటి బిందువులు పై పైకి వెళ్ళి మబ్బుల రూపాన్ని దాలుస్తాయి. ఆ మబ్బులు పర్వతాలను ఢీకొని పొలాలమీద వర్షించి భూమిని పచ్చగా ఉంచుతూ అన్ని జీవజంతువులకు పాలన ఇస్తాయి. అదే విధంగా, జ్ఞాన సూర్యుడైన శివబాబా కరాచీలో సముద్రపు ఒడ్డున జ్ఞాన సాగరుడై జ్ఞాన వత్సలను తయారు చేసారు. జ్ఞాన మబ్బులుగా మారిన ఆ వత్సలు ఇప్పుడు ఆబూ పర్వతానికి వచ్చారు. ఈ మబ్బులు వర్షించి వికారమయంగా ఉన్న భారతావనిని జ్ఞాన వర్షంతో శీతలంగా, ఆనందమయంగా చేస్తున్నాయి.

సోదరీలు నలుగురి మధ్యన భాషణ ఇవ్వడాన్ని, వ్రాయడాన్ని, డ్రామా వెయ్యడాన్ని నేర్చుకున్నారు. వెనువెంటనే కర పత్రాలు, చిన్న పుస్తకాలను తయారు చేసి పెద్ద ఎత్తున అందరికీ పంచారు. ముఖ్యమైన వారికి ఉత్తరాలను కూడా పంపారు. ఉన్నతమైన ఈ వ్యక్తుల ఉనికి నెమ్మదిగా విశ్వమంతా తెలుసుకుంది.

నిజానికి, వ్రాతపూర్వక సేవలు ఎంతో కాలం పూర్వమే ఆరంభమయ్యాయి. ఉదాహరణకు, భర్తలు మరియు కుటుంబాల ద్వారా అమానుషత్వానికి గురవుతున్న మహిళల కోసం బాబా ప్రభుత్వానికి లేఖలు వ్రాసేవారు. ఎంతోమంది అధికారులకు బాబా ఉత్తరాలు వ్రాసారు. అందులో ఒక ఉత్తరం పశువులపై జరిగే అత్యాచారాలను అవరోధించే సంస్థకు వ్రాసిన ఉత్తరం (State Commission for Prevention of Cruelty on Animals). ఆ కమిషన్‌కు ముఖ్యులైన ఆర్. పిగ్గట్ గారికి 23 జులై, 1938న ఈ ఉత్తరాన్ని బ్రహ్మా బాబా వ్రాసారు. 15 సంవత్సరాల అమ్మాయిని ఆమె ఇంటివారు, బంధువులు నాలుగు రోజులు ఒక గదిలో బంధించడాన్ని, ఆమె సోదరుడు అమానుషంగా కొట్టడాన్ని ఆ ఉత్తరంలో వివరించడం జరిగింది. మంత్రి పిగ్గట్ గారికి ఇలా వ్రాసారు, "కేవలం మీరు పశువులపై జరిగే అమానుషాన్నే పట్టించుకుంటానంటే మరి మనష్యులపై జరిగే అత్యాచారాన్ని అరికట్టేది ఎవరు? అందుకు ప్రత్యేకమైన కనిషన్‌ను వెయ్యవలసిందే."

మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్, చక్రవర్తి రాజగోపాలాచారి వీరందరికీ ఉత్తరాలు, టెలిగ్రాములు పంపారు. కొన్ని మురళీలను కూడా పంపడం జరిగింది. మహాత్మా గాంధీజీకి మే 5, 1939న టెలిగ్రామ్ పంపడం జరిగింది.

మహాత్మా గాంధీ నిరాహార దీక్షలో ఉన్నప్పుడు బాబా ఈ టెలిగ్రామును పంపారు. అందులో ఈ విధంగా ఉంది,

"గాంధీగారూ! నిరాహార దీక్షలు, సహాయ నిరాకరణ చర్యలు ఇవన్నీ హఠయోగ రూపాలు. సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని మీరు కేవలం ఒక్క ఈశ్వరీయ జ్ఞానం ద్వారా, ఆత్మానుభూతి ద్వారానే పొందగలరు. విజ్ఞాన బలాన్ని ఆత్మ బలంతో జయించవచ్చు. ప్రస్తుతం ధర్మపరంగా అజ్ఞాన చీకటి సమయము అని చెప్పవచ్చు. ఇప్పుడు భగవంతుడు దేవీదేవతల రాజ్యాన్ని పునః స్థాపన చేస్తున్నారు. మహాభారతంలో వర్ణింపబడిన సమయమిదే."

భగవంతుని అవతరణ, సత్యయుగ స్థాపన మరియు కలియుగ వినాశనము గురించిన సందేశమును బ్రహ్మాబాబా రాజకీయవేత్తలకు, విద్వాంసులకు, సామాన్య జనులకు కూడా ఇచ్చారు. బ్రిటీష్ ప్రభుత్వంలోని అధికారులకు కూడా బాబా సందేశాన్ని అందించారు. బాబా ఒక ఉత్తరాన్ని ఎలిజిబెత్ రాణి, ఇంగ్లాడ్ రాజు అయిన కింగ్ జార్జ్ గారికి కూడా వ్రాసారు.

ఆ ఉత్తరంలో శివబాబా యొక్క దివ్యమైన సందేశం స్పష్టంగా ఇవ్వడం జరిగింది –

*"ప్రియ సోదరీ,*

*ఈ ఉత్తరంతో పాటు మేము మీకు ఆత్మానుభూతి గురించిన వ్యాసాన్ని కూడా పంపుతున్నాము. ఎంతోమంది స్త్రీ పురుషులకు ఆత్మానుభూతి, సాక్షాత్కారాలు కలిగాయి. సమీప భవిష్యత్తులో ఈ భూమికి అతి పెద్ద ఆపద పొంచి ఉన్నట్లుగా సాక్షాత్కారాలలో చూసారు. ఆ సమయంలో ఎవరైతే ఆత్మిక స్థితిలో ఉంటారో వారే ఆ పెను ఆపదనుండి తమను తాము రక్షించుకోగలరు.*

*విజ్ఞాన సత్తాకన్నా, భౌతిక సాధనాల సత్తాకన్నా కూడా ఆధ్యాత్మిక సత్తా మిన్నది. అది సర్వదా మనకు విజయాన్ని చేకూరుస్తుంది. ఆత్మానుభూతిని పొందని వారు రాబోవు ప్రపంచ యుద్ధంలో ఎంతో దుఃఖాన్ని చూడాల్సి ఉంటుంది.*

*ఈ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని తెలుసుకోండి, ఆత్మకు నిజమైన స్వాతంత్ర్యం అతి కొద్ది సమయంలోనే రాబోతుందని తెలుసుకోండి.*

*అహింసాయుతంగా ఉన్న మా ఈ ఆధ్యాత్మిక సైన్యం ఎదురుగా ఎంతోమంది బారులు తీరి ఉన్నారు.*

*ప్రియ సోదరీ, మీరు ఆత్మానుభూతిని పొందాలి, నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందాలి..."*

ఈ విధంగా బ్రహ్మాబాబా పరమాత్మ సందేశాన్ని విశ్వ వ్యాప్తంగా పంపారు. "ఆత్మావగాహన పొందండి, పవిత్రులు కండి." మాతలపై బాబా ప్రత్యేకమైన శ్రద్ధను వహించేవారు ఎందుకంటే ఈ సమాజంలో మహిళలకు ఎంతగానో సామాజిక అన్యాయం జరుగుతుంది. అయినప్పటికీ వీరు త్యాగం చెయ్యడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఒక కన్యకు వివాహమై అత్తవారింటికి వెళ్తే అది నిజంగా మరోజన్మలాగే ఉంటుంది అని బ్రహ్మాబాబా అనేవారు. తన పాత బంధువులను మర్చిపోయి క్రొత్త బంధాలతో ముడిపడుతుంది. తన భర్త మరియు అత్తమామలు చెప్పిందే చెయ్యాలి."

అదే విధంగా, జ్ఞానాన్ని ధారణ చేసుకోవాలంటే ఆ వ్యక్తి తనలోని పాత, చెడు అలవాట్ల నుండి మరణించాలి. భగవంతునితో క్రొత్త బంధాన్ని ఏర్పరుచుకుని అతని ఆజ్ఞల అనుసారంగానే నడుచుకోవాలి. కావున కన్యలకు, మాతలకు ఈ జ్ఞానాన్ని ధారణ చెయ్యడం చాలా సులువు ఎందుకంటే వారికి ధనము, హోదాల గర్వము లేదు. ఒక కుటుంబం నుండి బంధాలను త్రెంచుకుని మరొక కుటుంబంతో ఏర్పరచుకోవడం వారికి తెలుసు.

సమాజము, సన్యాసులు మహిళలకు ఎప్పుడూ తక్కువ స్థానాన్నే ఇచ్చాయి అని బ్రహ్మాబాబా అంటూ ఉండేవారు. వారు తమ ముఖాలను ముసుగు వెనుక దాచుకోవాలి. పురుషుడు ఎప్పుడూ స్త్రీని తనకన్నా బలహీనురాలిగానే భావిస్తాడు. భర్త తలుచుకుంటే భార్యను కొట్టవచ్చు, ఇంటినుండి గెంటేయవచ్చు. అతడు మళ్ళీ వివాహము చేసుకోవచ్చు, (భార్య మరణించినా కానీ మరో వివాహము చేసుకోవచ్చు). కానీ మహిళ ఇవన్నీ చెయ్యడానికి వీలులేదు. ఒక విధవ పరిస్థితి మరీ దయనీయంగా ఉంటుంది. పూర్వం అయితే, భర్త చనిపోతే భార్య సజీవంగా భర్త చితి మంటలలో

దహించుకుపోవలసిందే.

సన్యాసులు తమ భార్యా పిల్లలను విడిచి అడవులకు పారిపోతారు. ఆమె ఒంటరిగా జీవించవలసిందే. అయినాకానీ పతియే పరమేశ్వరుడు అని నేర్పిస్తారు. కనుకనే, మహిళల దీనస్థితిని ఉద్ధరించే కార్యం బ్రహ్మబాబా చేపట్టారు. అందుకే గ్వాలియర్ రాష్ట్ర మంత్రి అయిన రాణి రజ్వాడే గారికి బాబా ఉత్తరాన్ని వ్రాసారు. వారు అఖిల భారతీయ మహిళా సంస్థకు అధ్యక్షురాలు కూడా.

"ప్రియమైన సఖీ!

స్త్రీకి పతియే గురువు, ప్రత్యక్ష దైవము. కానీ భగవంతుడు నిర్వికారుడు, పరమ పవిత్రుడు. నేటి పురుషుడు నిర్వికారిగా ఉన్నాడా? పరమాత్మను సాక్షాత్కరింపజేసి ఆత్మానుభూతిని కలిగించేవాడే గురువు. కానీ నేటి పురుషుడు దేహాభిమానంలో మునిగి ఉన్నాడు. కనుక, నేటి పరిస్థితుల అనుసారంగా పురుషుడిని, పతిని పరమేశ్వరుడు అనడం వీలుకాదు అని స్పష్టమవుతుంది. మీరు మాత కదా! ఇప్పుడు మీరు శ్రీ లక్ష్మిగా అవ్వండి, నరనారీమణులకు జ్ఞానామృతాన్ని పంచండి. ప్రియ సఖీ, ఇప్పుడు మేల్కొనండి. స్వయాన్ని తెలుసుకోండి. ఆత్మ జ్ఞానం లేని జీవితం అంధకారమయంగా ఉంటుంది..."

1939వ సంవత్సరంలో కొలంబోలో ఒక అంతర్జాతీయ ధార్మిక సమ్మేళనము జరిగింది. అన్ని ధర్మాల ప్రతినిధులు అందులో పాల్గొన్నారు. 'విశ్వంలో శాంతిని ఎలా స్థాపన చెయ్యాలి' అన్న అంశంపై ఈ సమ్మేళన ఉద్దేశింపబడింది. అక్కడకు వచ్చిన ధర్మ ప్రచారకులకు బాబా ఉత్తరాన్ని వ్రాసారు. ఆ ఉత్తర సారాంశం ఈ విధంగా ఉంది –

*"... ఎప్పటి వరకైతే విశ్వంలోని ప్రతి వ్యక్తి స్వయాన్ని ఆత్మగా భావించడో, ఆత్మానుభూతి చేసుకోడో, అప్పటివరకు విశ్వంలో శాంతిని స్థాపన చెయ్యడం అసంభవం. వాస్తవానికి, ఉన్నది ఒకే ధర్మము. అదే ఆత్మ ధర్మము లేక స్వధర్మము. పవిత్రత మరియు శాంతియే ఆత్మ స్వధర్మములు. అనేక మతాల కారణంగానే ఈ రోజు ఇన్ని గొడవలు మొదలయ్యాయి... మనిషి ఆత్మానుభూతి చేసుకోనంత వరకు, నిజానికి, అతడు మానవమాత్రుడే కాదు, మానవుని రూపంలో ఉన్న భూతము అని చెప్పవచ్చు. ఆ భూతం ఉన్నంతవరకు శాంతి నెలకొనగలదా? మేము మీకు ఈశ్వరీయ జ్ఞాన రత్నాల ఖజానాను పంపుతున్నాము. దీనిని అధ్యయనం చేయండి..."*

జామ్‌నగర్, జోధ్‌పూర్ మరియు మాండవి మహారాజులకు కూడా బాబా ఉత్తరాలను పంపారు. బ్రహ్మాకుమారీ విశ్వవిద్యాలయం అందించే సాప్తాహిక కోర్సుకు రావలసిందిగా వారికి ఆహ్వానాన్ని పంపారు. పుస్తకాలను పంపించడం జరిగింది. కానీ వేలాదిమందిలో అతి కొద్దిమంది మాత్రమే ఈ జ్ఞానాన్ని అర్థం చేసుకుని ధారణ చేస్తారు. భగవద్గీతలో కూడా ఇది ప్రస్తావించబడ్డది. చాలామంది శివబాబా చెప్పిన విషయాలను నమ్మకపోవచ్చు, అర్థం చేసుకోకపోవచ్చు, ఎందుకంటే గత కల్పంలో సత్యయుగంలో వచ్చిన ఆత్మలే ఈ జ్ఞానాన్ని అర్థం చేసుకోగలవు. అయినప్పటికీ బ్రహ్మబాబా ఉత్తరాలను వ్రాస్తూనే ఉన్నారు ఎందుకంటే, అంతిమ తెర పడే లోపల ప్రతి ఆత్మకు భగవంతుని సందేశమును అందుకునే అధికారమైతే ఉంది.

విశ్వ విద్యాలయాన్ని సందర్శించమని ప్రపంచంలోని అన్ని ధర్మాలవారికి ఆహ్వానం అందింది. అందులోని ఒక ఉత్తరం ఇలా ఉంది –

"ప్రియ ఆత్మా,

*ఈ ఉత్తరంతో జత చేసి పంపుతున్న సాహిత్యాన్ని చదవడం ద్వారా మీరు భగవంతుని అవతరణ ఈ భువిపై 'ప్రజాపిత బ్రహ్మ' అను నామధేయంగల ఒక సాధారణ మానవుని ద్వారా జరిగిందని అర్థం చేసుకుంటారు. బ్రహ్మ ద్వారా పరమాత్మ ప్రపంచంలోని వికారాలను పారద్రోలుతున్నారు. 5,000 సంవత్సరాల క్రితం లాగే భగవంతుడు ఈ సృష్టిపై సుఖశాంతులు నిండిన దైవీ ప్రపంచాన్ని పునఃస్థాపన చేస్తున్నారు. గీతా యుగము మళ్ళీ పునరావృతమవుతుంది.*

*అతి త్వరలోనే అణు యుద్ధంతో విశ్వ వినాశనం జరుగబోతుంది. దీనినే మహాభారత గ్రంథంలో ప్రస్తావించారు.*

*మీరు ఈ ఈశ్వరీయ సాహిత్యాన్ని శ్రద్ధగా చదివినట్లయితే మీరు సృష్టి యొక్క ఆది మధ్యాంత రహస్యాలను అర్థం చేసుకోగలరు. మీ తండ్రి అయిన పరమపిత పరమాత్మను కూడా అర్థం చేసుకోగలరు. ఈ విశ్వము ఒక నాటక రంగ స్థలమని, ఇది ప్రతి ఐదు వేల సంవత్సరాలకు ఒకసారి పునరావృతమవుతుందని మీరు గుర్తుంచుకోవాలి. ఈ విశ్వ నాటకంలో మీరూ పాత్రధారులే.*

*ఈ విశ్వ విద్యాలయంలో అవినాశి జ్ఞాన రత్నాలను ఉచితంగా అందించడం జరుగుతుంది. అమూల్యమైన ఈ జ్ఞాన రత్నాలను పొంది దీని నుండి లాభం పొందండి.”*

ఇటువంటి ఉత్తరాలు గవర్నర్, ముఖ్యమంత్రి మరియు సింధ్‌లోని ఇతర మంత్రులకు, కరాచీ మేయర్‌కు కూడా పంపడం జరిగింది. ‘మహాభారత యుద్ధము’ అను పుస్తకాన్ని మరియు సృష్టి చక్రము యొక్క చిత్ర పటాన్ని కూడా ఉత్తరాలతోపాటు పంపారు.

లార్డ్ వేవల్, ఇండియా వైస్‌రాయ్ మరియు అతని భార్య కూడా ఈ సాహిత్యాన్ని అందుకున్నారు. లార్డ్ వేవల్ భార్య తిరిగి జవాబు ఇలా వ్రాసారు, “మీ పవిత్ర ఆలోచనలకు మా ధన్యవాదాలు”. వాషింగ్‌టన్, లండన్ మరియు ఇతర రాజధానులకు కూడా ఇటువంటి వాటినే పంపారు.

2 మే, 1947 నాడు ఎలిజిబెత్ రాణి మరియు కింగ్ జార్జ్ VII కు కూడా ఉత్తరాలతో పాటు కల్పవృక్ష చిత్రాన్ని కూడా పంపారు.

*“కింగ్ జార్జ్ రూపంలో ఉన్న హే ఆత్మా,*

*ఈ విశ్వము ఒక అనంతమైన నాటక రంగస్థలము. ఇది ప్రతి ఐదు వేల సంవత్సరాలకు పునరావృతమవుతుంది. ఈ విశ్వ నాటకంలో మీరు ఒక గొప్ప పాత్రధారి. ఐదు వేల సంవత్సరాల క్రితం మీరు ఇదే విధంగా ఇంగ్లండ్‌కు రాజుగా, ఇదే శరీరంతో, ఇదే సమయంలో ఇదే పేరుతో ఉన్నారని మీకు తెలుసా? మళ్ళీ తిరిగి ఐదు వేల సంవత్సరాల తర్వాత ఇదే పాత్రను పోషించబోతున్నారని మీకు తెలుసా?*

*ఈ అవినాశి, అనాది డ్రామాలో ప్రసుత యుగం అంతం కానుంది. దేవీ దేవతల యుగం రానుంది. మనం ఇప్పుడు సంగమ యుగంలో ఉన్నాము. ఈ సమయంలో కొన్ని ఆత్మలు తమ సంపూర్ణ స్థితికి చేరుకోవడానికి పురుషార్థం చేస్తున్నాయి. స్వర్గ రాజ్యము అతి త్వరలో ఈ భువిలో స్థాపన కాబోతుంది. పాశ్చాత్య దేశాలు అణు బాంబులతో యుద్ధం చేసి ప్రపంచంపై ఆధిపత్యాన్ని సాధించవచ్చని భావిస్తున్నాయి, కానీ ఇది వారి భ్రాంతి మాత్రమే. నిజానికి వారి వినాశనాన్ని వారే కొనితెచ్చుకుంటున్నారు. విశ్వ వినాశనము తర్వాత సత్యయుగ స్థాపన జరిగి శ్రీకృష్ణుని జన్మ జరుగుతుంది.*

*వర్తమానంలో, భగవంతుడు భారతదేశంలో అవతరించారు కానీ గుప్త రూపంలో అవతరించారు. వారు సాధారణ మానవుని శరీరాన్ని ఆధారంగా చేసుకుని వారి ద్వారా పవిత్ర జ్ఞాన యజ్ఞాన్ని రచించారు. ఆ మానవునికి ‘ప్రజాపిత బ్రహ్మ’ అని నామధేయం చేయడం జరిగింది. జ్ఞాన యజ్ఞంలోని అమోఘమైన శక్తి ద్వారా ఈ విశ్వంలో శాంతి నెలకొంటుంది.*

*భారతదేశ విభజనకు కారణమైన ఆంగ్లేయులు ఇప్పటికే శత్రుత్వ భావాలను అందరి మనసులలో నాటారు. రెండు పిల్లుల మధ్య యుద్ధం జరిగితే చూడాలన్నదే వారి ఉద్దేశ్యం. ఇందుకు ఎవ్వరినీ నిందించడం లేదు. ఎందుకంటే ఈ డ్రామా 5,000 సంవత్సరాల క్రితం వలె పునరావృతమవుతుంది. భారతదేశంలోని అనైక్యత తొలగాలి. పాశ్చాత్య దేశాలలో కూడా ఐక్యత రావాలి. ఆ తర్వాత సంపూర్ణ పవిత్రత, సంతోషము, శాంతి ఈ ప్రపంచంలో నిండుగా ఉంటాయి. మీకు మేము కొంత సాహిత్యాన్ని పంపుతున్నాము, వీటిని చదివితే ఈ విషయాలను మరింత స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.”*

కింగ్ జార్జ్ మరియు ఎలిజిబెత్ రాణిగారికి బంగారు వర్ణాక్షరాలతో, బంగారు కాగితంపై, చిత్రాలతో సహా

వ్రాయడం జరిగింది. ఈ ఉత్తరాలన్నీ ఎంతో స్పష్టంగా, అంశాన్ని విశదీకరిస్తూ ఉన్నాయి. కానీ కలియుగ మహారాజులకు భగవంతుని కలుసుకునే ఆసక్తి కలగలేదు.

మరిన్ని ఉత్తరాలను ముహమ్మద్ అలీ జినాకు, వలైపూర్ మరియు నేపాల్ మహారాజులకు పంపడం జరిగింది. ట్రుమన్ ప్రెసిడెంట్‌కు కూడా ఒక ఉత్తరాన్ని పంపారు. ఉత్తరంతోపాటు  ఎంతో సాహిత్యాన్ని, విశ్వ విద్యాలయానికి ఆహ్వానాన్ని పంపారు.

విదేశాలలోని పుస్తకాలయాలకు కూడా ఈశ్వరీయ సాహిత్యాన్ని పంపారు. ఈ కృషి అంతా వృధా అయిందేమో అని అనుకుంటే అది పొరపాటే.

# భాగము 4

# కుమార్తెల విజయము

## ఒక్క జీవితంలోనే నాలుగు జన్మలు

"నేను ఈ జీవితంలో నాలుగు జన్మలు తీసుకున్నాను", అని అంటున్నారు సోదరి సుందరిగారు. "ఒకటి, అందరూ తీసుకునే భౌతిక జన్మ. మా తల్లిదండ్రులు నన్ను పెంచి పెద్ద చేసారు. తర్వాత నాకు వివాహము జరిగింది. ఇది రెండవ జన్మగా భావిస్తాను. ఎందుకంటే ఒక కన్యకు వివాహము జరగడమంటే ఒక ఇంట్లో మరణించి మరో ఇంట్లో జన్మ తీసుకోవడమే. క్రొత్త బంధాలు ఏర్పడతాయి. ఒక రకంగా పుట్టింటి నుండి, తల్లిదండ్రుల నుండి బంధాన్ని త్రెంచుకుని అత్తింటితో క్రొత్త బంధాన్ని ఏర్పరచుకోవడం జరుగుతుంది. ఇల్లు, వాతావరణము, బాధ్యతలు అన్నీ మారుతాయి. కన్యగా ఉన్నప్పటి నిశ్చింతత, పవిత్రత, స్వతంత్రత అన్నీ ముగిసిపోయి పరాధీన-పరతంత్ర జీవితాన్ని, చింతలతో నిండిన జీవితాన్ని, బాధ్యతల జీవితాన్ని గడపవలసివస్తుంది. ఆమె ఎంతో త్యాగం చెయ్యవలసి వస్తుంది. సాధారణంగా ప్రతి మహిళ ఈ రెండు జన్మలనూ తీసుకుంటుంది. కానీ నాకు మరో రెండు జన్మలు కూడా జరిగాయి.

"మొదటిది(అనగా మూడవ జన్మ), నేను ఈ ఈశ్వరీయ జ్ఞానంలో మరో జన్మను తీసుకున్నాను. ఎందుకంటే పరమాత్ముడినే నా తల్లిగా, తండ్రిగా భావించాను. మీరా వలె ప్రాపంచిక వికారీ ఆచారాలను వదిలి పెట్టాను. 'నాకు ఒక్క భగవంతుడు తప్ప మరెవ్వరూ లేరు.' ఒక పతివ్రతలా నా మనసులో ఒక్క శివబాబానే నా ఆత్మిక పతిగా భావించాను. ఇలా మనసులో కేవలం పరమాత్మనే నిలుపుకుని ప్రాపంచిక బంధాలను, కర్మల ఖాతాలను మరువవలసి ఉంటుంది.

"ఇలా మరణించడం కూడా సామాన్య విషయం కాదు. పాత జన్మలోని అనగా ఈశ్వరీయ జ్ఞానంలోకి రాకముందున్న చెడు అలవాట్లు, సంస్కారాలను తొలగించి పవిత్రతను, సుగుణాలను ధారణ చెయ్యడము చాలా, చాలా కష్టము. ఈ ప్రపంచంలోనే ఉంటూ దీనిని బుద్ధి ద్వారా మర్చిపోవాలి. ఇది చిన్న విషయమేమీ కాదు. అందుకే దీనిని 'జీవిస్తూనే మరణించడము' అని అంటారు. అనేక జన్మల కారణంగా కఠినంగా అయిపోయిన సంస్కారాలను ఒక్క క్షణంలో ఈ జన్మలోనే కూకటి వ్రేళ్ళతో తీసివేయాలి. నిజమే, ఇందులో సహించవలసి వస్తుంది కానీ పురుషార్థం వలన వచ్చే మానసిక పవిత్రత, స్వచ్ఛతను చూసి పురుషార్థంలో కష్టపడినా ఫర్వాలేదు అని అనిపిస్తుంది. ప్రతి బ్రాహ్మణ ఆత్మ ఈ ఆత్మిక ఆనందాన్ని పొందుతుంది. కానీ నేను తీసుకున్న నాల్గవ జన్మ ఎవ్వరూ తీసుకుని ఉండకపోవచ్చు.

"అది నిజంగా దివ్యానుభూతి. దివ్య బుద్ధి విధాత, దివ్య దృష్టి విధాత అయిన శివబాబా నాకు ఒక గొప్ప అనుభవాన్ని కలిగించారు.

"అనుకోకుండా ఒకరోజు శివబాబా నాకు ఒక ప్రత్యేకమైన ప్రోగ్రాముని ఇచ్చారు. ఆ ప్రోగ్రాము అనుసారంగా నేను విడిగా ఒక గదిలో కొద్ది రోజులవరకు యోగ తపస్సులో ఉండాలి. భోజనం కాకుండా పండ్లు, పాలు మాత్రమే తీసుకోవాలి. ఎవ్వరితో మాట్లాడకుండా శక్తిశాలీ యోగ స్థితిలో ఉండాలి. ఈ విధంగా నిరంతర యోగాభ్యసములో ఉండాలన్న ఆజ్ఞ నాకు లభించింది.

"కనుక, నేను ఒక చోట కూర్చుని జ్ఞాన సూర్యుని స్మృతిలో ఉంటూ అనగా అతని వైపుకు మరలి కూర్చుని సూర్యముఖి పుష్పంలా వికసించాను. శివబాబా స్మృతి మాత్రమే నాకున్న ఏకైక పని. వారే నా సర్వస్వం అయ్యారు. ఈ నిరంతర స్మృతి కారణంగా నాలో ఉన్న పాత సంస్కారాలన్నీ అంతర్థానమయ్యాయి. ఈ ప్రాపంచిక స్మృతులన్నిటినీ

మర్చిపోయాను. నేను జీవించే ఉన్నాను, కానీ పేరు, వయస్సు, రూపము అన్నీ మర్చిపోయాను. ఒక్క శివబాబా తప్ప మరెవ్వరూ గుర్తుకు రాలేదు. అప్పుడు పరివర్తన ఆరంభమయింది.

"నన్ను నేను భవిష్య సత్యయుగ సృష్టిలో ఒక దైవీ రాజకులానికి చెందిన చిన్న రాకుమారిగా అనుభవం చేసుకున్నాను. అక్కడి భాష, మాట, తీరు నెమ్మదిగా నా నోటినుండి వినిపిస్తున్నాయి. అక్కడున్న దేవీదేవతల సతోప్రధాన సంస్కారాలే నాలోనూ ఉద్భవించాయి. నేనక్కడ సంపూర్ణ పవిత్రత కలిగిన ఆత్మను. కోరిక అంటే ఏమిటో తెలియని 'ఇచ్ఛా మాత్రమ్ అవిద్యా' స్థితిలో ఉన్నాను. క్రోధము, లోభము మొదలగు వాటి అర్థాలే తెలియవు. సత్యయుగంలోని ప్రతి ఆత్మలోనూ సంపూర్ణ పవిత్రత ఉట్టిపడుతుంది.

"నా కళ్ళు ఇవే, చూసే మనసు మారిపోయింది. నేను దివ్య దృష్టితో అంతా చూస్తున్నాను. నేను దివ్య దృష్టితో అందరినీ చూస్తున్నాను. త్రికాలదర్శి అయిన పరమాత్మ తన శక్తితో నాకు కొంత సమయము యజ్ఞ వత్సల భవిష్య దైవీ స్వరూపాలను చూపించారు. నా ముందుకు వచ్చిన వత్సల భవిష్య నామము, రూపము అన్నీ చెప్పేదాన్ని. "మరి భవిష్యత్తులో మీరెవరు" అని నన్ను అడిగినప్పుడు నా భవిష్యత్తు నాకు తెలుసు. నేనొక రాకుమారిని. నా ఇల్లు, వయసు అన్నీ చెప్పాను.

"అప్పటి రాజు గురించి, ఆ రాజ్య విశేషాలను గురించి నేను నా తోటి వత్సలకు వివరించాను. వారి గురించి నన్ను అడిగినప్పుడు నాకు కనిపించిన వారి భవిష్య రూపాన్ని నేను చెప్పాను. వారు రాకుమారుడు, రాకుమారి, స్నేహితుడు, దాసులు ఇలా ఏ విధమైన జన్మ వారికుంటుందనే దానిని నేను నాకు కలిగిన దివ్య దృష్టి ద్వారా చెప్పాను. షుమారు ఒకటిన్నర నెల ఈ విధమైన పాత్ర జరిగింది.

"ఆ సమయంలో నేను పూర్తిగా ఒక చిన్న రాకుమారిగా మారిపోయాను. రోజుకు రెండు మూడు చెంచాల పాలను మాత్రమే తీసుకునేదాన్ని .ఇంతటి అల్ప భోజనంతో ఎలా జీవిస్తుందని అందరూ అనుకున్నారు. కానీ నాకు ఏ విధమైన బలహీనత అనిపించలేదు.

"ఆ రోజుల్లోనే మా బంధువులు నన్ను కలవడానికి వచ్చారు. కానీ నేను గుర్తు పట్టలేకపోయాను. నా ఈ పాత్ర పూర్తయ్యాక కూడా చాలా రోజుల వరకు నాకు నా పేరుగానీ, యజ్ఞంలోని ఇతర సోదరసోదరీల పేర్లుగానీ, బంధుమిత్రులుగానీ ఎవ్వరూ గుర్తుకురాలేదు. చాలారోజుల వరకు నాకు అందరి పేర్లను గుర్తు చేయిస్తూ వచ్చారు. చివరకు, నాకు ఈ జన్మకు సంబంధించిన స్మృతులు తిరిగి వచ్చాయి. దివ్యదృష్టిపై ఆధారమైన నా భవిష్య జన్మ స్మృతులు ఇప్పుడు నెమ్మదిగా తొలగాయి. నేను ఒక నెలన్నరపాటు పూర్తిగా భవిష్య దైవీ రాకుమారిలా ఉన్నానని సోదరసోదరీలు చెప్పినప్పుడు నాకు అదేమీ గుర్తుకు లేదు. ఈ నెలన్నర రోజులు నేనెక్కడ ఉన్నానో నాకే తెలియదు. దీనిని, నేను నా అద్భుతమైన నాల్గవ జన్మగా భావిస్తాను. స్వయంగా శివబాబాయే తమ దివ్యదృష్టి శక్తితో అతి కొద్ది కాలంపాటు నాకు క్రొత్త జన్మను ఇచ్చారు.

"ఇలా నాలుగు జన్మలు తీసుకున్న తర్వాత, ఎంతో కాలం పవిత్ర వాతావరణంలో జీవించిన తర్వాత నరకమయమైన ప్రపంచంలోకి వెళ్ళడానికి మనసొప్పలేదు. ఈ ప్రపంచము, దేహాభిమానముతో నిండిన ప్రపంచము చాలా వింతగా అనిపించింది. వారి ముఖాలలో నాకు దుఃఖము, బాధ స్పష్టంగా కనిపించాయి. మౌంట్ ఆబూలోని బస్ స్టాండ్ నుండి బస్‌లో ఆబూ రోడ్డు వరకు చేరుకునేసరికి నాకు ఈ ప్రపంచం వింతగా గోచరించింది. ప్రియమైన బాబాను విడిచి నేను మొదటి సారిగా బయటకు వచ్చాను. అందుకే యజ్ఞ స్మృతులు నన్ను వెంటాడుతున్నాయి. బాబా ఒడిలోకి తిరిగి వెళ్ళిపోవాలని అనిపించింది. కానీ సేవార్థం వెళ్ళాలని కూడా నాకు తెలుసు."

అందుకే ఒక కవి ఇలా అన్నాడు,

*"ఓ భగవంతుడా! ఈ ప్రపంచ గతి ఏమయిందో చూడు*

సూర్యుడు మారలేదు, చంద్రుడు మారలేదు, ఆకాశమూ మారలేదు
కానీ మానవుడు ఎంత మారిపోయాడు!
మోసము, కపటముతో స్వాభిమానాన్ని అమ్ముకున్నాడు
రాముడి భక్తులు, రహీమ్ శిష్యులు
అందరూ మాయా ముసుగులోనే ఉన్నారు
ఇతని చీకటి బతుకులు భారతావనిని అథోగతిలోకి నెట్టేసాయి
భారతదేశము స్మశానంలా మారిపోయింది
ఓ భగవంతుడా! మనిషి ఎంతగా మారిపోయాడో చూసావా!
మేము కలహించుకోకుండా ఉండి ఉంటే,
మేము యుద్ధాలు చేసుకుని ఉండకపోతే,
ఈ సుందరమైన భారతావని పాడయ్యేది కాదు
వేలాదిమంది నిరాశ్రయులుగా అయ్యేవారు కాదు
ఎంతోమంది అనాథలుగా అయ్యేవారు కాదు
ఓ భగవంతుడా! మనిషి ఎంత మారిపోయాడో చూసావా!
నీ సుందర సృష్టి ఎంత మారిపోయిందో చూసావా!
ఎలా అయిపోయాం మేము!

# సంపూర్ణ త్యాగము

ఇప్పుడు బ్రహ్మాకుమారీలు సేవా రంగంలోకి దిగారు. భగవంతుని దివ్యమైన సేవ చెయ్యడానికి ప్రతి రాష్ట్రానికి, ప్రతి దేశానికి వెళ్ళారు.

ఒకసారి, ఒక సందర్భంలో, ప్రవచనాలకు ముగ్ధుడైన ఒక వ్యక్తి ఒక సోదరి వద్దకు వచ్చి కొంత ధనాన్ని ఇవ్వబోయాడు. కానీ ఆ సోదరి ఆ ధనాన్ని తిరస్కరించింది. ఆ సోదరి ఇలా అన్నారు, "బయటివారి ధనాన్ని మేము స్వీకరించలేము. మీరు ముందు పవిత్రంగా అయ్యే పురుషార్థం చెయ్యండి." ఈరోజుల్లో ధనాన్ని ఎవరు వద్దంటారు. ఆ వ్యక్తికి చాలా ఆశ్చర్యమేసింది. ఈ సోదరీల మనసులు నిజంగానే ఉపరామంగా ఉన్నాయి అని అతడు అర్థం చేసుకున్నాడు. వారు త్యాగాన్ని సంపూర్ణం చేసారు. వీరు ఎంతో ఉన్నతమైన ఆత్మలు. శ్వేత వస్త్రాలతో ఉన్న వీరి జీవితాలను చూసి అతడు ముగ్ధుడయ్యాడు. అహ్మదాబాద్‌లోని తన ఇంటికి తిరిగి వచ్చాక అతడు ధన్యవాదాలు తెలుపుకుంటూ యజ్ఞానికి ఒక ఉత్తరాన్ని వ్రాసాడు. అహ్మదాబాద్‌లో సేవ చెయ్యడానికి సోదరీలకు ఆహ్వానాన్ని కూడా పంపాడు. ఆ ఆహ్వానాన్ని మన్నించి దాదీ ప్రకాశ్ మణిగారు అహ్మదాబాద్‌కు వెళ్ళారు.

బంధువులు, స్నేహితుల ఆహ్వానం మేరకు దీదీ మన్‌మోహిని, రుక్మిణి సోదరి ఖండాలా వెళ్ళారు. దాదీ సంతరీ, దాదీ సతి, దాదీ ప్రకాశ్ మణిగారు మరియు సోదరులు ఆనంద కిషోర్‌గారు, చంద్రహాస్‌గారు ఒక పిలుపు మేరకు కలకత్తా వెళ్ళారు. దాదీ మనోహర్ ఇంద్ర, దాదీ గంగ ఢిల్లీకు వెళ్ళారు. దాదీ కమల్ సుందరిగారు పూణె వెళ్ళారు. ఈ విధంగా యజ్ఞ వత్సలు భారతదేశ నలుమూలలకు వెళ్ళారు. 14 సం॥ల తర్వాత ఆత్మిక సైన్యం సేవా క్షేత్రంలోకి దిగి అత్యద్భుతమైన అనుభవాలను ప్రోగు చేసుకుంది.

# నెహ్రూ మరియు ఇందిరాగాంధీని కలుసుకోవడము

సోదరి సీతగారు తమ సేవా అనుభవాలను ఇలా నెమరువేసుకున్నారు:

“చాలాకాలం వరకు యజ్ఞంలో ఉన్న కారణంగా మాకు బయట ప్రపంచం గురించి ఏ మాత్రం తెలియదు. కనీసం మాకు ఆ సమయంలో చలామణిలో ఉన్న డబ్బు (నోట్లు, నాణెములు) గురించి కూడా తెలియదు. నేను యజ్ఞంలో ఉన్నప్పుడు ఎప్పుడూ నా చేతిలో ధనాన్ని పెట్టుకోలేదు. ఎందుకంటే నేను ఏ కొనుగోలునూ చేసేదాన్ని కాదు. మాకు ఈశ్వరీయ యజ్ఞం నుండే అన్నీ అడగకుండానే లభించేవి. యజ్ఞ వత్సల అవసరాలు ఎంతో సహజంగా తీరిపోవాలి, వారు అడిగాల్సిన అవసరం కూడా రాకూడదు అన్నది బాబా ఆజ్ఞ. బాబా అనేవారు, ‘సత్యయుగంలోని దేవీదేవతలు ఎప్పుడూ ఎవరినీ ఏమీ అడగరు. కావున, ఇప్పుడు యజ్ఞ వత్సలు దేవతలుగా అయ్యే పురుషార్థం చేస్తున్నారు కనుక వారు ఏదీ అడగాల్సిన అవసరం రాకూడదు.’ ఓహో! ప్రభు పాలనలో ఉన్న అద్భుతమైన రీతులను నేనెలా మీకు వర్ణించను! ఆ నిశ్చింత జీవితపు క్షణాలు అత్యంత సుఖమయమైనవి. అందుకే అంటారు, ‘నీవే తల్లివి తండ్రివి, నీ బాలకులుగా మాకు సుఖపు గనులు లభించాయి’ అని. నేనేమి చెప్తున్నానంటే చలామణిలో ఉన్న నాణెముల గురించి కూడా మాకు తెలియదు.

“నాకు బాగా గుర్తు. ఒకసారి ఇద్దరు సోదరీలు ఈశ్వరీయ సేవ చెయ్యడానికి ఒక ప్రదేశానికి వెళ్ళారు. అప్పుడు వారికి ఒక చిన్న సమస్య ఎదురైంది. టాంగావాడికి ఎనిమిది అణాలు ఇవ్వవలసి ఉంది. అతడికి ఏ నాణెములు ఇవ్వాలో ఆ సోదరీలకు అర్థం కాలేదు. ఎందుకంటే ఆ రోజుల్లో క్రొత్తగా ఒక రూపాయి నాణెము వెలువడింది. ఎనిమిదణాల నాణెము ముందునుండే చలామణిలో ఉంది. రెండూ ఇంచుమించు ఒకే విధంగా ఉన్నాయి. ఆ రెండు నాణెములను ఒకదానిపై మరొకటి పెట్టి ఏదైతే కొద్దిగా పల్చగా ఉందో దానినే ఎనిమిదణాల నాణెముగా భావించి టాంగావాడికి ఇచ్చారు. ఇవన్నీ మాకు వింతగా అనిపించాయి. కానీ ఆ సందిగ్ధ పరిస్థితి మమ్మల్ని కలిచివేసేదానికన్నా ముందే మేమే ఆ ప్రపంచాన్ని గమనించడం నేర్చుకున్నాము.

“అత్యంత ఆధ్యాత్మిక ప్రదేశాన్ని విడిచి కొన్ని సంవత్సరాల తర్వాత మేము బయట ప్రపంచంలో అడుగు పెట్టినప్పుడు మా పరిస్థితి ఎలా ఉండిందో మీరు ఊహించవచ్చు. ఎవరైనా వచ్చి మేము మాలోని వికారాలను జయించలేకపోతున్నాము అనంటే మాకు చాలా ఆశ్చర్యం కలిగేది. ఎందుకంటే బాబా మాపై ఎంతగా జ్ఞాన వర్షాన్ని కురిపించారంటే ఎంతో సహజంగా మా స్వభావాలను నిర్మలంగా చేసుకునే అవకాశం లభించింది.

తమ మొదటి రైలు ప్రయాణం గురించి దాదీ గంగ గారు వివరిస్తున్నారు:

“రైలులో కూర్చున్నాకనీ యజ్ఞ స్మృతులే నన్ను వెంటాడుతున్నాయి. బాబా వైపు మనసు పరిగెడుతుంది. చివరకు ఎలాగోలాగా మనసును నియంత్రించుకుని ప్రక్కన కూర్చుని ఉన్న మాతలకు జ్ఞానాన్ని వినిపించడం మొదలుపెట్టాను. జ్ఞానాన్ని విన్న వారికి ఎంతగానో ప్రశాంతత అనుభవమయ్యి వారు నన్ను వారింటికి ఆహ్వానించారు. వారిపై జ్ఞాన ప్రభావము ఎంతగానో పడింది. అప్పుడు బాబా మహావాక్యాలు గుర్తొచ్చాయి – పిల్లలూ! మీరు జ్ఞానాన్ని వినిపించినప్పుడు విన్నవారికి ఎంతో సంతోషము కలుగుతుంది, మీకు వారెంతో గౌరవాన్ని ఇస్తారు.’

“తర్వాత, నేను దాదీ మనోహర్ ఇంద్రగారి బంధువుల ఇంట్లో ఉన్నాను. ‘మీ 14 సం॥ల తపస్సు, ఆధ్యాత్మిక అనుభవాలను మాకూ పంచండి, మమ్మల్ని మేల్కొల్పండి’ అని వారు పంపిన ఆహ్వానం మేరకు నేనక్కడకు వెళ్ళాను. నేను వారికిలా చెప్పాను, ‘నేను ఉదయాన్నే చాలా తొందరగా లేచి స్నానాదులు ముగించుకుని భగవంతుని స్మృతిలో లీనమవుతాను. కనుక, ధ్యానం చేసుకోవడానికి అనువుగా మాకు విడిగా ఒక గది ఉంటే బాగుంటుంది. నేను అశుద్ధమైన, తామసిక భోజనాన్ని స్వీకరించను. కనుక, నేనున్న అన్ని రోజులు మీరు ఇంట్లో ఉల్లి, వెల్లుల్లి వంటి తామసిక పదార్థాలను

వండకుండా ఉండాలి.' నేను చెప్పిన వాటికి వారు అంగీకరించి అందుకు అనువైన వాతావరణాన్ని కలిగించారు.

"నేనక్కడ ఈశ్వరీయ నియమాల అనుసారంగానే నడుచుకున్నాను. వారిని కూడా సాత్విక భోజనాన్ని స్వీకరించమని, భగవంతుడికి నైవేద్యం పెట్టి తర్వాత భుజించమని సూచించాను. నా జీవితమును చూసి వారు తమ జీవితాలను మెరుగుపరుచుకోగలిగారు. పవిత్రతా మార్గానికి ఉపయోగపడే ఇటువంటి ఎన్నో ఉపాయాలను నేను వారికి సూచించాను. వారికీ ఈ జ్ఞాన మార్గం ఎంతగానో నచ్చింది కానీ ఒకే ఒక ఆలోచన వారిలో ఉండిపోయింది – వీటన్నిటినీ నిత్యం ఆచరించడం కష్టము.

"నేను వారింట్లో ఉన్న సమయంలో పండిత్ జవహర్‌లాల్ నెహ్రూగారిని కలుసుకోవాలన్న నా సేవా ఆధారిత కోరికను వినిపించాను. అది విని వారంతా నవ్వారు. 'నెహ్రూను కలవడం ఎలా సాధ్యమవుతుంది? ఎంతో ముఖ్యమైన వారికే నెహ్రూ సమయాన్ని ఇస్తాడు. లేకపోతే ఎవ్వరినీ కలవడు. అతడికి ఎన్నో బాధ్యతలు ఉంటాయి. అతడు భారతదేశ ప్రధాన మంత్రి. అతడు మకుటంలేని మహారాజు. ఇలా అందరినీ కలుస్తూ వెళ్తే అతడి పని ఎవరు చేస్తారు?' అంటూ నా అసాధ్య కోరికను ప్రక్కన పెట్టేసారు.

"నేను ఢిల్లీకి రావడం ఇదే మొదటిసారి. అక్కడి దారులేవీ నాకు తెలియవు. ప్రభువును ఆసరాగా చేసుకుని నేను ఒంటరిగానే నెహ్రూను కలవడానికి బయలుదేరాను. ఒక గ్రామోఫోను మరియు కొంత సాహిత్యాన్ని ఈశ్వరీయ కానుకగా నెహ్రూకి ఇమ్మని బాబా నాకిచ్చారు. కనుక, నేను ఈశ్వరీయ సందేశాన్ని అందించడానికి ప్రభు ప్రేరణలను, ఆదేశాలను పాటిస్తున్నాను. భగవంతుని ఆజ్ఞ అయినప్పుడు ఇది అసంభవమెలా అవుతుంది!

"చివరకు నేను తీన్‌మూర్తి భవనానికి చేరుకున్నాను. అక్కడ ఏ ఇబ్బంది లేకుండా నెహ్రూగారిని కలవడానికి నాకు సమయాన్ని ఇచ్చారు. మొదటగా నేను ఇందిరా గాంధీని కలుసుకున్నాను. ఈ ఈశ్వరీయ యజ్ఞము భారతదేశానికి ఎటువంటి సేవలను అందిస్తుంది, అక్కడ ఎంతమంది మాతలు నివసిస్తూ ఉంటారు, ఎటువంటి జ్ఞానాన్ని చెప్తారు అని ఇందిరా గాంధీ అడిగారు. నేను వారికి జ్ఞానాన్ని వినిపించి మౌంట్ ఆబూకు రావలసిందిగా ఆహ్వానించాను. ఆ తర్వాత, నెహ్రూగారిని కలుసుకున్నాను. నేను వారికి గ్రామోఫోన్ మరియు సాహిత్యాన్ని ఈశ్వరీయ కానుకగా ఇచ్చి ఆబూకి వచ్చి బాబాను ఒకసారి కలవవలసిందిగా కోరాను. అంతేకాక, ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు, మహా వినాశనము, పవిత్రతలోని మహత్త్యము అన్నీ వివరించాను.

"ఢిల్లీలో ఎర్ర కోట వద్ద ఉన్న చాందినీ చౌక్ వద్ద సుప్రసిద్ధ 'గౌరీశంకర మందిరము' ఉంది. అక్కడ నేను రెండు మూడు ప్రసంగాలు చేసాను. మందిరం సెక్రెటరీ మందిరంపైన మాకు ఒక గదిని విడిగా ఇచ్చి, జిజ్ఞాసువులకు జ్ఞానాన్ని వినిపించేందుకు వీలుగా మరో గదినీ ఇచ్చారు. నేను అక్కడున్న రోజుల్లో గుడికి పూజలకు వచ్చిన మాతలు పూజలు ముగించుకుని నా వద్దకు వచ్చేవారు. వారికి ఈశ్వరీయ జ్ఞానాన్ని వినిపించేసరికి ఎంతో సంతోషించేవారు. పురుషులు కూడా వచ్చేవారు. అందరికీ యోగాభ్యాసం చేయించినప్పుడు శివబాబా వారికి మంచి మంచి అనుభవాలను కలిగించడాన్ని నేను చూసాను. కొంతమంది మాతలకు సాక్షాత్కారాలు కూడా జరిగాయి. వారు వెళ్ళి వాళ్ళ ఇళ్ళల్లో వాళ్ళకు కలిగిన సాక్షాత్కారాల గురించి చెప్పినప్పుడు ఇంట్లోనివారు ఇలా అన్నారు, "నువ్వొట్టి అమాయకురాలివి. నిన్నెవరో మాయ చేసారు. భగవంతుని సాక్షాత్కారము జరగడం అంత సులువు అనుకున్నావా? ఎంతో తపస్సు చేసిన సాధుసన్యాసులకు కూడా సాక్షాత్కారాలు కలగడం లేదు.'

నేను చాలాకాలం ఉదయాన్నే యమునా తీరానికి స్నానం చెయ్యడానికి వచ్చే భక్తులకు ఈశ్వరీయ సందేశాన్ని ఇచ్చేదాన్ని. అలాగే సాయంకాలం గౌరీశంకర మందిరంలో ప్రసంగించేదాన్ని. కొన్ని రోజులు నా కార్యక్రమం ఈ విధంగా కొనసాగింది.

# అశాంతిమయ శాంతి సమ్మేళనము

అదే సంవత్సరం విశ్వ శాంతి సమ్మేళనములో పాలుపంచుకోవలసిందిగా ఆబూలో ఉన్న యజ్ఞ మాత మమ్మా వద్దకు ఆహ్వానం వచ్చింది. ఋషికేశ్‌లోని శివానంద స్వామిగారు ఈ ఆహ్వానాన్ని పంపారు. వారే ఈ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసారు. సోదరీలు మన్‌మోహిని, సంతరీ, గంగ మరియు సోదరులు ఆనంద కిషోర్‌గార్లను అందులో పాలుపంచుకోవలసిందిగా అక్కడకు పంపడం జరిగింది.

సోదరి సంతరీ ఈ విధంగా వ్రాస్తున్నారు:

ఎంతోమంది విదేశీ ప్రతినిధులు కూడా వచ్చారు. ఈశ్వరీయ విశ్వ విద్యాలయం తరఫు ప్రతినిధులుగా మేము కూడా ప్రసంగించాము. కానీ రెండు రోజుల తర్వాత అక్కడకు వచ్చిన ప్రతినిధుల మధ్య ఒక గొడవ మొదలయింది. విదేశీ ప్రతినిధులు పర భాషలో అనగా ఆంగ్లంలో మాట్లాడిన కారణంగా హిందీ భాషవారు దీనిని తీవ్రంగా ఖండించారు. ప్రసంగాలు హిందీలో జరగాలా లేక ఆంగ్లంలో జరగాలా అన్న విషయమై ఎంతో పెద్ద గొడవే జరిగింది. ధార్మి కనేతలు అని చెప్పుకోబడే వీరే ఈ చిన్న చిన్న విషయాలకు ఇంతగా గొడవ పడితే, కుర్చీలు విసిరేసుకునేదాకా వచ్చారంటే ఇది ధర్మ గ్లానికి చిహ్నం కాకపోతే మరేమిటి?

"ఈరోజు, పవిత్రత మరియు శాంతి అనే ధర్మాలను కోల్పోయి అందరూ కోపము, ఈర్ష్యా ద్వేషాలకు వశమయ్యారు. ధర్మము నేర్పే మొదటి పాఠము – నేను ఆత్మను, మనమందరమూ ఆత్మలమే. ఆత్మ స్వధర్మము శాంతి. మానవుడు తన నిజమైన ధర్మాన్ని కోల్పోయాడు అనడానికి ఈ గొడవే ఒక నిదర్శనం. అందుకే స్వయంగా భగవంతుడే అవతరించవలసి వచ్చింది.

"స్వామి శివానంద, ఈ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసినవారు స్వాభావికంగా చాలా శాంతమూర్తులు. గొడవ జరిగినప్పుడు వారక్కడ లేరు. తర్వాత, ఒకరోజు శివానందగారు మాతో చర్చించారు. యజ్ఞ పిత అయిన బ్రహ్మాబాబా గురించి కుశల ప్రశ్నలు వేసి ఇలా అన్నారు, 'ఇంతమంది కన్యలు, మాతలను ఉద్ధరించి వారి జీవితాలను ఇంత ఉన్నతంగా చేసిన బ్రహ్మాబాబా ధన్యుడు!' తర్వాత వారడిగారు, 'ఆబూలో నివసించే యజ్ఞ వత్సల మధ్య ఎప్పుడూ గొడవ జరగదా?' నేనన్నాను, 'ఆత్మిక దృష్టిని అలవరుచుకుని, దివ్య గుణ ధారణతో గుణగ్రాహకులుగా అవ్వాలన్న శిక్షణ మాకు లభించింది. సహనము, ఓర్పుతో మసలుకోవడం నేర్చుకున్నాము. మేము ఇతరుల దుర్గుణాలను కాక సుగుణాలనే చూస్తాము. అందుకే 400మందిమి ఆబూలో కలిసి ఉండగలుగుతున్నాము.'

"శివానంద అన్నారు, 'అద్భుతం! నేను కూడా మాతల ఉన్నతి కోసం పాటుపడుతూ ఆధ్యాత్మిక లాభాన్ని చేకూర్చాలని ఎంతో యత్నించాను. నేను వారికి ప్రత్యేకమైన ఏర్పాట్లు కూడా చేసాను. కానీ అందులో సఫలమవ్వలేకపోయాను. ఆ మాతలు పరస్పరం ఎంతో గొడవ పడుతూ ఉండేవారు. అటువంటిది మీరంతా 400మంది కన్యలు, మాతలు కలిసికట్టుగా 14 సం॥లు ఉన్నారంటే ఇది నిజంగా చాలా గొప్ప విషయము. మా కార్యానికి సహకరించడానికి మాకు మరింతమంది మాతలను పంపమని దాదాకు చెప్పండి. అప్పుడు నేనిక్కడ క్లాసులను ఏర్పాటు చెయ్యగలను.' అప్పుడు నేనన్నాను, 'మా కార్యమంతా శివబాబా ఆదేశాల మేరకే జరుగుతాయి. బ్రహ్మాబాబా కేవలం నిమిత్తమాత్రుడు. భగవంతుడు తప్ప మరెవ్వరూ మానవుని జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దలేరు."

ఈ సమయంలోనే ఢిల్లీలో సేవలు ఊపందుకున్నాయి. సత్సంగము దినదినాభివృద్ధి చెందింది. కానీ రెండు నెలల తర్వాత, సోదరీలకు ఇల్లు అనగా ఆబూ గుర్తుకు వచ్చింది. చిన్న పిల్లలు ఇల్లు విడిచి ఎక్కువ కాలం బయట ఉండటాన్ని ఇష్టపడనట్లుగా ఈ సోదరీలకు కూడా యజ్ఞాన్ని, బాబాను విడిచి ఉండటం అస్సలు ఇష్టం లేదు. కానీ విశ్వ కళ్యాణం ఎంత మహత్వపూర్ణమయిందో బాబా వారి మనసులలో మళ్లీ నింపారు. బ్రహ్మాబాబా అన్నారు, "పిల్లలూ!

ప్రపంచంలోని ఆత్మలంతా మీ సోదరులు. నిరాశ్రయులకు మీరు ఆధారంగా నిలవాలి. మీరు పూర్తి భారతదేశాన్ని స్వర్గంగా మార్చాలి. నదులు ఒక చోటనే ఆగిపోవు. అవి ఒక నగరం నుండి మరో నగరానికి ప్రవహిస్తూనే ఉంటాయి. మీరు జ్ఞాన నదులుగా మారి సుఖశాంతుల కోసం అలమటిస్తున్న వారికి వాటినిచ్చి వారి దాహార్తిని తీర్చండి."

బ్రహ్మబాబా ఇచ్చిన ఈ గొప్ప ప్రసంగం విని సోదరీలు సేవ కోసం ప్లాన్ వేసారు. బాబా దృష్టి ముఖ్యంగా భారతదేశ రాజధానిపైనే ఉంది. ఢిల్లీనుండే సత్యయుగ ధర్మము ప్రారంభమవుతుందని అనేవారు.

ఈలోపు, ఢిల్లీ సత్సంగానికి విచ్చేసే కొందరు సోదరసోదరీలు యజ్ఞమాత మరియు యజ్ఞ పితకు ఉత్తరం వ్రాసారు, "... మేము సత్సంగం కోసం ఇక్కడ తపిస్తున్నాము, కానీ బ్రహ్మకుమారీ సోదరీలు మమ్మల్ని విడిచి వెళ్ళిపోయారు." బ్రహ్మకుమారీలను తిరిగి పంపించాలని వారు కోరారు. కనుక, బ్రహ్మబాబా పిల్లలను ఉత్సాహపరచి మళ్ళీ సేవకు పంపారు. ఈసారి ఉదయం, సాయంకాల క్లాసులు శాశ్వత రూపంలో మొదలవడమే కాక అనేక చోట్ల ప్రసంగాలను కూడా ఏర్పాటు చేసారు.

"మేము కుంభమేళాకు వెళ్ళి అక్కడ కూడా ప్రసంగించాము. (కుంభమేళ సమయంలో అనేక హిందువులు ఒకచోట చేరి పునీతులవ్వాలన్న ఆశతో గంగా స్నానాలు ఆచరిస్తారు). సోదరి గంగ ఇలా అంటున్నారు, "గంగలో స్నానమాచరిస్తే పునీతులవుతారని భావిస్తారు. కానీ ఆత్మను జ్ఞాన గంగలో ముంచినప్పుడే అది పవిత్రమవుతుందని ఎవ్వరికీ అర్థం కావడం లేదు. ఆత్మ దివ్య గుణాలలో మునక వేయాలి. కేవలం గంగా స్నానంతోటే ఆత్మ పవిత్రమైపోతుందనుకుంటే అది కేవలం మూఢ నమ్మకం మాత్రమే.

"కానీ ఆచారం కొనసాగుతూనే ఉంది. స్నానం చెయ్యడానికి వచ్చినవారి సంఖ్య పెరగిపోగా అక్కడి ఒక వంతెన విరిగిపోయి అనేకమంది మునిగిపోయారు. అయినాకానీ ఎవ్వరికీ ఏమీ అర్థం కాలేదు. అర్థంలేని మూఢాచారాలు కొనసాగుతూనే ఉన్నాయి.

"ఆత్మ నిర్లేపి అని, దానికి పాపపుణ్యాలు అంటవని వీరు భావిస్తున్నారు. పాపం! ఎంతటి అమాయకత్వము! అందుకే మానవుడు తన సంస్కారాలను పరివర్తన చేసే పనిని గంగకే అప్పజెప్పేసాడు.

"అమాయకులైన భారతవాసులను చూసి, వారి నిరాధారమైన మనసులను చూసి మాకెంతో జాలి కలిగింది. మూఢాచారాలకు వశమై ఉన్న మానవుడిని ఎలా బయటకు తీసుకురావాలి? ఈ అంధత్వంతో తమను తాము నాశనం చేసుకుంటున్నారు. ఇటువంటి అర్థరహితమైన నమ్మకాల వలన ఎంతో ధనము, శక్తి అనవసరంగా ఖర్చవుతున్నాయి. మరోవైపు చూస్తే కోట్లాది మంది జనులకు సరైన తిండి కూడా దొరకడం లేదు. భారతదేశ ప్రభుత్వం కూడా దీనిని ప్రోత్సహిస్తుంది ఎందుకంటే ఇటువంటి వాటి కారణంగా వారికి పన్ను రూపంలో సొమ్ము వస్తుంది. ఎవ్వరూ వీరికి సత్యాన్ని స్పష్టంగా వివరించడం లేదు. మన సేవలు వీరికెంత అవసరమో అప్పుడు అర్థమయింది. ఇటువంటి ఆత్మిక సేవను చేసేవారు మనము తప్ప మరెవ్వరూ లేరు.

ధర్మము వ్యాపారంగా మారిపోయింది. దొంగ స్వాముల కారణంగా భక్తులు వంచితులవుతున్నారు. ప్రతి ఒక్కరి హృదయాలలో దుఃఖ పర్వతాలున్నాయి. వారి దుఃఖాలను తొలగించగలిగే సామర్థ్యము ఒక్క భగవంతుడికి తప్ప మరే మానవమాత్రుడికీ లేదు."

# ఈశ్వరీయ సేవాకేంద్రముల స్థాపన

ఇప్పుడు ఢిల్లీలోని కమలా నగర్‌లో ఒక సేవా కేంద్రాన్ని స్థాపించడం జరిగింది. అలహాబాద్‌కు వెళ్ళిన సోదరీలు అక్కడ కాన్పూర్‌లో ఒక సేవాకేంద్రాన్ని స్థాపించారు. అక్కడ ప్రముఖ పారిశ్రామికవేత్త అయిన బాబా హరివిలాస్‌రాయ్ ఆర్య సమాజము, గురుద్వార్, ఆహ్లా వాలియా సమాజము వంటి అనేక ధార్మిక సంస్థలలో సభ్యుడు. అతడెంతో శ్రద్ధతో జ్ఞానాన్ని వినేందుకు వచ్చేవాడు. అతని బంగళాలోని ఒక భాగాన్ని సోదరీలకు ఇచ్చి సేవా కార్యక్రమాలకు సహకరించారు.

ఇందుకు పూర్వం, దాదీ హృదయ మోహిని మరియు దాదీ శాంతమణిగార్లు లక్నో వెళ్ళారు. అక్కడ కూడా సేవాకేంద్రాన్ని ప్రారంభించారు. ఇలా, జిజ్ఞాసువుల ఆహ్వానం మేరకు అనేక చోట్ల సేవలు ఆరంభమై పలు సేవాకేంద్రాలు స్థాపించబడ్డాయి. అక్కడకు వచ్చే జిజ్ఞాసువులే సేవాకేంద్రాలకు మనస్ఫూర్తిగా, అన్ని విధాలుగా అండగా నిలిచారు. సత్సంగాలు పెరిగాయి.

# విలువైన పరమాత్ముని మిలనము

బ్రహ్మాకుమారి దాదీ జానకి, ప్రస్తుత సంస్థ సంచాలకులు, ఈ విధంగా వ్రాస్తున్నారు–

"ఎవరైతే ఈశ్వరీయ సేవాకేంద్రాలలో నిత్యం జ్ఞానమును తీసుకుంటూ యోగాభ్యాసమును చేస్తున్నారో వారు తమ జీవితాలలో అలౌకిక ఆనందాలను చవిచూసారు. ఇప్పుడు వారి మనసులలో తమ తండ్రి, శివ పరమాత్మను కలుసుకోవాలన్న తపన ప్రారంభమయింది. "మేము వారిని ఆబూకి వెళ్ళి కలుసుకోలేమా" అని క్రొత్తగా వస్తున్న జిజ్ఞాసువులు అడిగారు. బ్రహ్మాబాబా యొక్క సాధారణ వృద్ధ తనువులో శివబాబా వస్తున్నారు, బ్రహ్మా ముఖారవిందం ద్వారా జ్ఞానాన్ని ఇచ్చి మళ్ళీ తిరిగి పరంధామానికి వెళ్ళిపోతున్నారు. ఈ అద్భుతమైతే తప్పకుండా చూడవలసిందే. ప్రపంచంలో ఇంతకు మించి మరో అద్భుతమేదైనా ఉండగలదా? త్రిలోకనాథుడు, సర్వశక్తిమంతుడు అయిన శివ పరమాత్మ పరంధామంనుండి ఆత్మలమైన మాకు జ్ఞానాన్ని వినిపించి పావనంగా చేసే కర్తవ్యాన్ని చెయ్యడానికి నిత్యం వస్తూనే ఉన్నారు, కానీ మేము వారికి కలుసుకోవడానికి ఒక నగరం నుండి ఆబూకి వెళ్ళేంత దూరంలో ఆగిపోతున్నామా! ఏ భగవంతుడి కోసమైతే మేము జన్మజన్మాంతరాలనుండి వేచి ఉన్నామో, ఎవరికైతే మొర పెట్టుకుంటున్నామో ఆ భగవంతుడు ఈ భువిపై అవతరించినపుడు ఇక ఒక్క క్షణం కూడా మేమాగలేము!

కానీ సోదరీలు ఆ జిజ్ఞాసువులకు ఈ విధంగా చెప్పారు, "మీరిప్పుడు బాబాను చూడలేరు. ఎవరైతే బ్రహ్మాచర్యాన్ని పాటిస్తారో; ఎవరైతే బైట హోటళ్ళలో తినరో; శాకాహారిగా ఉంటూ ఉల్లి వెల్లుల్లి, గ్రుడ్లు మానేస్తారో; ఎవరైతే తమ దృష్టి వృత్తిని పవిత్రంగా చేసుకుంటారో; ఎవరైతే పరమాత్మపై సంపూర్ణ నిశ్చయంతో ఉంటారో వారు మాత్రమే కలవగలరు. ఎవరైతే సుపుత్రులుగా అయ్యి ఆత్మిక తండ్రిని గుర్తిస్తారో వారిని మాత్రమే తీసుకురావాలని మాకు ఆజ్ఞ."

జిజ్ఞాసువులు అడిగేవారు, "అక్కయ్యగారూ! సుపుత్రులు అని ఎవరిని అంటారు? నిశ్చయబుద్ధిగలవారి లక్షణాలు ఏమిటి?

సోదరీలు అన్నారు, "ఎవరైతే శివబాబా ఆజ్ఞలపై నడుచుకుంటారో వారే సుపుత్రులు. వారి ఆజ్ఞలేమిటంటే, 'మనసా–వాచ–కర్మణలో పవిత్రులుగా అవ్వండి. పవిత్రతలో బ్రహ్మాచర్యానికి అగ్రస్థానము ఉంది. ఎందుకంటే పవిత్రతా బలంతో ఇతర మనో వికారాలపై కూడా విజయాన్ని సాధించగలరు. పవిత్రతా బలంతోటే ఆత్మ యోగము పరమాత్మతో కుదురుతుంది. ఎవరైతే ఈ మొదటి నియమాన్ని పాటిస్తూ తమ ఆహార వ్యవహారాలను సాత్వికంగా ఉంచుకుంటారో వారే శివబాబాకు ఆజ్ఞాకారులు, సుపుత్రులు. నిశ్చయానికి గుర్తు – ఆచరణ. అటువంటి వారి జీవితాలలో తప్పకుండా పరివర్తన వస్తుంది. వారు తమ తమోగుణ స్వభావాలను మార్చుకోగలుగుతారు. చెడు అలవాట్లను వదులుతారు."

జిజ్ఞాసువులు ఇంకా ఇలా అడిగేవారు, "అక్కయ్యగారూ! మాకు అనేక విషయాలలో నిశ్చయం ఏర్పడింది. కొన్నింటిలో ఇంకా కలుగలేదు. బహుశా ఆబూ వెళ్ళాక వాటిల్లో కూడా నిశ్చయం ఏర్పడవచ్చు కదా! మా జీవితాలలో కొంత పరివర్తన అయితే వచ్చింది. మాకూ పవిత్రత, బ్రహ్మాచర్యమంటే ఇష్టమే. కానీ కఠినమైన సంస్కారాలు బహుశా ఆబూలోని బాబాను కలిసాక మారుతాయేమో!"

సోదరీలు ఇలా జవాబిచ్చారు, "కేవలం జ్ఞానము ద్వారానే దృఢ సంకల్పం చేయగలము. బ్రహ్మాచర్య పాలన మరియు ఆహార శుద్ధితోటే జ్ఞానము బుద్ధిలో నిలుస్తుంది. కనుక ముందు ఈ నియమాలను పాటించండి. శివ పరమాత్మతో మనో మిలనము చేసుకుని, ఆ మిలనము నుండి పరమానందాన్ని, వర్ణనాతీత అతీంద్రియ సుఖాన్ని పొందడానికి ఈ మాత్రం కూడా త్యాగము చెయ్యలేకపోతే, వికారాలనే విషాన్ని విడిచి పెట్టలేకపోతే, మిమ్మల్ని బాప్‌దాదా వద్దకు మేము తీసుకువెళ్ళలేము. మీరు ఇంతటి అమూల్యమైన మిలనము జరుపుకోవాలనుకుంటున్నారు కానీ దుఃఖాన్నిచ్చే కామ వికారాన్ని వదలలేమంటున్నారు! అంటే మీరింకా జ్ఞానాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదు. హంసల మధ్య కొంగలు

కూర్చోవడం బాగుండదు. అక్కడి శుద్ధమైన వాతావరణాన్ని పాడు చేసేందుకు మీరు బాధ్యులవ్వడం మాకిష్టం లేదు. మీరు ముందుగా మీ బుద్ధి రూపీ కలశాన్ని జ్ఞానామృతంతో నింపుకోండి, అప్పుడు మేము మిమ్మల్ని సర్వోన్నతుడైన పరమాత్మ వద్దకు తీసుకువెళ్తాము. లేకపోతే మాకు కూడా దండన ఉంటుంది. త్వరగా హంసలుగా అయిపోయి జ్ఞాన ముత్యాలనే ఏరుకోండి, తర్వాత బాబాను కలవడానికి ఎగిరిపోండి.”

ఈ విధంగా పవిత్రంగా అవ్వాలన్న ప్రేరణ కూడా జిజ్ఞాసువులకు లభించేది. అంతేగాక ఈ సత్సంగంలో కొన్ని నియమాలుంటాయని, ఆ నియమాల పాలనలో బ్రహ్మాకుమారీలు దృఢంగా ఉంటారని కూడా అర్థమయింది. కొంతమంది జిజ్ఞాసువులు పురుషార్థం చేసారు, మరికొంత మంది నిరాశతో వెనుదిరిగారు. ఇది చాలా పెద్ద లక్ష్యము, ఇవన్నీ చాలా కష్టమైన నియమాలు, మేము వీటిని పాటించలేము అని అనేవారు. కొంతమందైతే, “ఈ జన్మలో ప్రభువును పొందడానికి మేము ఏమైనా చెయ్యడానికి సిద్ధమే. కామ వికారము నరకానికి ద్వారము. దీనిని విడిచి పెడ్తే భగవంతుడు మాకు లభిస్తాడు అనంటే ఈ క్షణమే కామ వికారాన్ని విడిచిపెట్టడానికి మేము తయారుగా ఉన్నాము” అని అన్నారు.

“మరికొంత మంది జిజ్ఞాసువులు ఇలా అన్నారు, “అక్కయ్యగారూ! మాకు సంపూర్ణ నిశ్చయముంది. మా ఆహారపు అలవాట్లు శుద్ధంగా ఉన్నాయి. మా సంస్కారాలలో పరివర్తన వచ్చింది. మా బంధు మిత్రులు కూడా మాలోని పరివర్తనను గుర్తించారు. బ్రహ్మచర్యాన్ని కూడా పాటిస్తున్నాము. మాకు సంపూర్ణ నిశ్చయముంది. అవసరమైతే వ్రాతపూర్వకంగా కూడా వ్రాసి ఇస్తాము. ఇప్పుడు ఆ తండ్రిని కలవడానికి మనసు తపిస్తుంది. మమ్మల్ని ఆక్కడకు తీసుకువెళ్ళండి.”

అటువంటి భగవంతుని ప్రేమికులను, నిశ్చయు బుద్ధి కలవారిని సోదరీలు బాప్‌దాదా మరియు యజ్ఞ మాత వద్దకు తీసుకువెళ్ళేవారు.

# ఆత్మిక సంబంధము

తమ తమ నగరాల నుండి జిజ్ఞాసువులు రైలు బండిలో ఆబూకు ప్రయాణం చేస్తూ ఎంతో అమితానందాన్ని పొందేవారు. శివ బాబాను, బ్రహ్మాబాబాను, మమ్మాను కలవబోతున్నామన్న సంతోషం వారిని ఉక్కిరి బిక్కిరి చేసేది. రైలు ఆబూకు సమీపిస్తున్న కొద్దీ వారిలో ఉత్కంఠ పెరగసాగింది.

ఆబూ స్టేషన్‌లో దిగగానే కనిపించే ఆబూ పర్వతాన్ని చూసి, 'ఆహా, అబూ వచ్చేసాము. ఆ కొండ ఎక్కితే అక్కడే బాబా మనకోసం వేచి ఉంటారు' అని భావించేవారు. బాబాను కలవకముందే వారి మనో మిలనము బాబాతో జరిగిపోయింది. వారిలో ఎంతో ఆనందం కనిపించేది. చివరకు, వారు ఆబూ పర్వతంపైకి, 'యజ్ఞము'నకు చేరుకున్నారు. పిల్లలు వస్తున్నారు, వారికి కావలసిన వసతులు ఏర్పాటు చేసిపెట్టమని బ్రహ్మా బాబా ముందుగానే మధుబన్ వాసులకు చెప్పి పెట్టారు. శివబాబా ఇలా అన్నారు, "ఎంతోకాలం నుండి శివబాబాకు దూరంగా ఉన్న బాబా పిల్లలు వచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోండి. మాయ వీరిని జన్మజన్మాంతరాలు ఎంతో కష్టపెట్టింది. అందుకే వీరంతా అలసిపోయి ఉన్నారు. ఆత్మలోని అలసటను దూరం చేసుకోవడానికి ఇప్పుడు తండ్రి ఇంటికి వచ్చారు. కనుక వీరికి స్థూల మరియు సూక్ష్మ సౌకర్యాలను ఏర్పాటు చేయండి."

జిజ్ఞాసువులను బ్రహ్మాబాబా మరియు శివబాబా ఎదుటకు తీసుకువచ్చే శుభ ఘడియ రానే వచ్చింది. యజ్ఞ వత్సలందరూ ఒక చోట కూర్చున్నప్పుడు పరస్పరం కూర్చుని తమ ఈశ్వరీయ సోదరసోదరీలను చూసి ఆనందపడ్డారు. ఇక్కడకు రాకముందు వారి మనసులలో ప్రశ్నల వర్షం, సంతోషాల వర్షం కురిసింది. అసలు శివబాబా బ్రహ్మా తనువులో ఎలా వస్తారు; వారి అవతరణను ఎలా గుర్తించాలి; శివబాబాతో మా మిలనము ఎలా జరుగుతుంది....!" ఎన్నో ప్రశ్నలతో వచ్చిన వీరు ఇప్పుడిక్కడ ఆత్మ నిశ్చయముతో కూర్చున్నారు. బ్రహ్మా స్థూల నేత్రాలను శివ పరమాత్మ కిటికీలుగా చేసుకుని వాటి ద్వారా శివబాబా ఆత్మిక దృష్టిని ఇస్తూ తన పిల్లలందరినీ తరింపజేస్తున్న ఆ క్షణాలలో పిల్లలంతా వారి పావన దృష్టితో తరించిపోయారు. కొంతమంది పిల్లలైతే బాబా, మమ్మా వద్దకు లేచి వెళ్ళిపోయేవారు. "పిల్లలూ! మధురమైన పిల్లలూ! అంటూ బాబా జ్ఞాన మురళిని వినిపిస్తుంటే ఆత్మలోని జన్మజన్మల అలసట తీరిపోయేది. దేహ భానాన్ని పూర్తిగా మర్చిపోయారు. అప్పుడు ఆత్మ పరమాత్మునితో నిజమైన మిలనాన్ని జరుపుకుంది. అది మాటలకు అలవికాని అనుభవం! ఆ సుఖమయ క్షణాలతో ఆత్మ పులకరించిపోయింది. వారంతా భూమి, ఆకాశాన్ని కూడా మర్చిపోయారు. అనంతమైన ప్రేమలో కేవలం ఆత్మ మరియు పరమాత్మ మాత్రమే ఉన్నారు.

కొద్ది సమయం తర్వాత ఆత్మ నెమ్మదిగా ఈ స్థితినుండి సాధారణ స్థితికి వస్తుంది. కానీ ఆ మధుర క్షణాల స్మృతి ఆత్మలో ముద్ర పడిపోయింది. ఆ స్థితిలోనే ఎప్పటికీ ఉండాలన్న ఒక్క కోరిక మాత్రం వారికి ఉండేది. 'కానీ ఇప్పుడు ఇతర సోదరసోదరీలు కూడా కలవాలి' అన్న ఆలోచన వారిని నియంత్రించింది.

మిలనము సమయంలో వారికి కలిగిన అనుభవాలను వినిపిస్తూ చాలామంది పిల్లలు ఇలా అన్నారు:

"ఆత్మకు శాంతి స్పర్శ లోలోతుగా కలిగింది. బాబా కళ్ళల్లో భగవంతుని శక్తి అనుభవమయింది. అది విద్యుచ్ఛక్తిలా ఉంది. కానీ ఈ కరెంటుతో ఆత్మకు ఎంతో ప్రేమ అనుభవం అయింది. ప్రకాశవంతమైన జల్లు మాపై వర్షిస్తున్నట్లుగా అనిపించింది. మనసులోని మాలిన్యాలన్నీ తుడిచిపెట్టుకుపోయి ఆత్మ తేలికతనాన్ని, దివ్యతను, ఉల్లాసాన్ని, ధైర్యాన్ని అనుభవం చేసింది. పరమాత్ముని హృదయ సింహాసనంపై ఆత్మ సేద తీరింది. ఆహా! ఈ జీవితమంతా ఇక్కడే, ఇలాగే ఉండాలనిపించింది!"

# భగవంతుని గీత

ప్రతిరోజూ ప్రాతఃసమయాన బ్రహ్మాకుమారులు, బ్రహ్మాకుమారీలకు (బ్రాహ్మణులందరికీ) బాబా తమ మురళిని వినిపిస్తారు. నిజమైన జ్ఞాన మురళీనాదం ఆత్మను స్వచ్ఛంగా చేసి బుద్ధిని శుభ్రపరుస్తుంది. ఆత్మ పరమాత్మల స్వధర్మము గురించి మురళిలో వివరిస్తారు బాబా. మూడు కాలాలు, మూడు లోకాల గురించి బాబా చెప్తారు. సాధుసన్యాసులు, మహాత్ములు, జగద్గురువులు, ఋషులు, మునులు, లామాలు, రాజకీయ వేత్తలు, రాజులు మొదలగువారికన్నా ఎక్కువ హుందాతనము మరియు అధికారము భగవంతుడిలో (శివబాబా) కనిపిస్తాయి. ఎందుకంటే శివబాబా ఎంతో నిర్మలుడు, సర్వశక్తిమంతుడు, జ్ఞాన సాగరుడు. వారిచ్చే జ్ఞానం ఒక ధర్మానికి చెందినదిగా ఉండదు. వారు అనంతమైనవారు. వారి ప్రతి వాక్కులో సత్యము ఇమిడి ఉంటుంది. వారి ప్రతి మాట లోకకళ్యాణం కోసమే, మన ఉన్నతి కోసమే ఉంటుంది. మనం సంపూర్ణమయ్యే వరకూ భగవంతుని గీత అలా కొనసాగుతూనే ఉంటుంది. అప్పుడు మనల్ని శివబాబా పరంధామానికి తీసుకువెళ్తారు.

శివబాబా మానవమాత్రుడు కాదు. 'నా పిల్లలూ! నా మధురమైన పిల్లలూ! అని శివబాబా అనగానే ఆత్మకు పరమాత్మతో ఉన్న అవినాశి బంధం అనుభవమవుతుంది. వారి దృష్టి, వారి గళం, వారి మహావాక్యాలు అన్నీ ఆత్మను ప్రేమతో నింపేస్తాయి. మనం ఎప్పుడైనా భగవంతునిపై అలిగినాగానీ వారే మనల్ని బుజ్జగిస్తారు. మనం నిద్రపోతే వెలిగే జ్యోతిగా అయ్యి వారే మనల్ని లేపుతారు. మనం కర్తవ్య విముఖులమైతే వారే మనల్ని కర్తవ్యపరాయణులుగా తీర్చుదిద్దుతారు తమ జ్ఞాన మురళీల ద్వారా. మనకు ఆత్మిక ప్రేమను అందించడానికి, మనకు ఉన్నతిని కలిగించడానికి, మనల్ని సుఖసంతోషాలతో నింపడానికి, అడుగడుగునా మన జీవిత బాధ్యతలను స్వీకరించడానికే శివబాబా ఈ భువిపై అవతరించారు.

శివబాబాకు ఎవ్వరితోనూ వైరం లేదు, వారు నిర్భయులు, మృత్యుంజయులు, నిరాకారి. శివబాబా బ్రహ్మాబాబాకు పూర్తిగా భిన్నంగా ఉంటారు. బ్రహ్మాబాబా హావభావాలు, మాట, తీరు, అన్నీ ప్రత్యేకంగా ఉంటాయి. శివబాబా కర్తవ్యాలు, మహావాక్యాలు నిర్ద్వందంగా ఆ నిరాకారుడి ఉనికిని చాటి చెప్తాయి.

# రాత్రి క్లాసు

బ్రహ్మా కుమారీ పుష్పశాంతగారు రాత్రి క్లాసు గురించి ఇలా వివరిస్తున్నారు –

“రాత్రి క్లాసులో బాబా మరియు మమ్మా ఇద్దరూ వత్సలందరి ఎదుటకు వచ్చి కూర్చుంటే ఆ దృశ్యం కనుల పండుగగా ఉండేది. ఇద్దరూ దివ్యమూర్తులే, ఇద్దరి ముఖమండలంపై ఒక విచిత్రమైన ప్రకాశము కనిపించేది. వారి మస్తక మధ్యలో ఆత్మ ప్రకాశము. ఇద్దరూ మధురమైన చిరునవ్వుతో, స్నేహమునిండిన నయనాలతో మా అందరికీ దృష్టినిచ్చేవారు. ఓహో! పృథ్విపై అద్భుతమైన ఘట్టం జరుగుతుంది కానీ కోట్లాది జనాభాకు ఇంకా ఈ విషయము తెలియదే!

అందుకే అంటారు,

‘భగవంతుడు సృష్టిపైకి వచ్చి అందరికీ అదృష్టాన్ని పంచుతూ ఉంటే చాలామంది అక్కడకు ఆలస్యంగా చేరుకున్నారు, ఇంకా చాలా మంది అజ్ఞానమనే గాఢ నిద్రలో ఉంటారు.’

అది ఎంత నిజం!

ఇద్దరు దివ్యమూర్తులు క్లాసులోకి వచ్చినప్పుడు వారు వచ్చే విధానము, కూర్చునే విధానము, వారు చూపించే ప్రీతి, పాలన ఇచ్చే పద్ధతి ఎంత విభిన్నంగా, ప్రేమమయంగా ఉంటాయి! ముందుగా మమ్మా, క్లాసులోని వారిని ఇలా అడిగేవారు, “అందరూ మంచిగా ఉన్నారా?” మంచిగా అంటే మనసా, వాచ, కర్మణ మూడు విధాలుగానూ మంచిగా ఉన్నారా అని అర్థం. ఏ రకమైన సంకల్ప వికల్పాలు మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం లేదు కదా? చూడండి, ఇంత గొప్ప తండ్రి దగ్గరకు వచ్చి సంకల్పాలలో ఇరుక్కుని నష్టపోకుండా మిమ్మల్ని మీరు గమనించుకోండి. ఈ జీవితం చాలా విలువైనది. వ్యర్థ సంకల్పాలలో మీ సమయాన్ని పోగొట్టుకోవద్దు. మీకు ఏదైనా కావాలంటే, స్థూల–సూక్ష్మమైనవి, మాకు చెప్పండి. ఎవరికైనా ఏమైనా కావాలంటే వారు చేతులెత్తండి.”

ఇటువంటి విషయాల చర్చ జరిగిన తర్వాత మమ్మా అనేవారు, “రోజంతటిలో ఏదైనా పొరపాటు చేసి ఉంటే, మనసు తినే పనులు చేసి ఉంటే వాటిని వినిపించండి. చెప్పి మనసును తేలికపరుచుకోండి. దానిని సరిదిద్దుకునే ఉపాయాన్ని చెప్పి మరోసారి అలా జరగకుండా జాగ్రత్త పడే విధానమును చెప్తాము. చెప్పకుండా లోపలే దాచుకుంటే అది లోలోపలే ముదిరిపోయి భయంకరంగా తయారవుతుంది...”

ఆ తర్వాత బాప్‌దాదా వచ్చినప్పుడు అందరి దృష్టి వారిపైనే ఉంటుంది. వారి ప్రతి కర్మ శిక్షణాయోగ్యంగా ఉండేది. క్లాసులో సంతోషంతో పాటు నిశ్శబ్దం రాజ్యమేలేది. బాబా తమ స్థానంలో ఆసీనులై పిల్లలను చూస్తూ మమ్మాను ఇలా అడిగేవారు, “మమ్మా, మీరు పిల్లల బాగోగులను అడిగి తెలుసుకున్నారా? చూడండి పిల్లలూ! బాప్‌దాదా ఇంటికి సుఖసంతోషాలను వెతుక్కుకుంటూ వచ్చారు. అడగటానికి మొహమాటపడకండి. ఇక్కడ శివబాబా భండారా అంతా పిల్లలదే. మీ ఆహారపు అలవాట్ల అనుసారంగా, మీ ఆరోగ్యం అనుసారంగా మీకు కావలసినవి చేయించుకోవచ్చు. ఈ శరీరం ఎంతో అమూల్యమైనది ఎందుకంటే దీని ద్వారానే మనం శివబాబాను గుర్తు చేసి జన్మజన్మాంతరాల పాపాలను దగ్ధం చేసుకోగలము. దీని ద్వారా అవినాశి సంపాదనను ఎంతగానో చేసుకోగలము. దీనిని జాగ్రత్తగా చూసుకోండి. కానీ దానిపై మోహమును పెంచుకోవద్దు. ఒకవైపు శరీరాన్ని మర్చిపోయే పురుషార్థాన్ని చేస్తూ మరోవైపు దీనిని జాగ్రత్తగా కాపాడుకుంటూ కూడా ఉండాలి.”

పిల్లలకు ఇక్కడ ఏ విధమైన కష్టం కలగకూడదు. శివబాబా కేవలం ఒక్క కష్టాన్ని ఇస్తారు: నిరంతరం నన్ను స్మృతి చేయండి మరియు దివ్య గుణాలను ధారణ చేయండి. జ్యోతిస్వరూపుడైన శివబాబాను స్మృతి చేయడం కష్టమే కానీ వాస్తవానికి అందులో కూడా కష్టమేమీ లేదు. ఎందుకంటే శివబాబా మనల్ని ఎప్పుడూ స్మృతిలో ఉండటానికి

విశేషమైన ఆసనంపై హఠంతో కూర్చోమనీ చెప్పరు, ఉపవాస ప్రాణాయామాలు చేసే కష్టమూ ఇవ్వరు. కేవలం బుద్ధి ద్వారా నన్ను గుర్తు చేయండి దానితో మీ జన్మజన్మాంతరాల పాపాలు దగ్ధమైపోతాయి అని అంటారు."

*సంగమ యుగమిది!*
*ఎంతో సుందర సమయమిది!*
*తండ్రులకే తండ్రి పరమపిత పరమాత్ముని*
*కలిసే అద్భుత తరుణమిది*

*గగనసీమన అంచులు దాటి*
*భూమ్యాకాశాలు సూర్యచంద్రులు తారలపైన*
*సూక్ష్మరూపులై గాలి అలలలో*
*పూలలా తేలియాడుతూ*

*సుదూర తీరము ప్రకాశవంతము*
*అనంత లోకము ఆత్మల వతనము*
*పరమాత్ముని ధామము పరంధామమునకు*
*విహరించే అద్భుత పయనమిది*

"మమ్మా, పిల్లలను అడిగారా, ఏమీ తప్పు చేయలేదు కదా? పిల్లలూ! ఇప్పుడు పొరపాట్లను తొలగిస్తూ ఉండండి. జన్మజన్మాంతరాలూ జ్ఞానము లేని కారణంగా ఎన్నో తప్పులు చేసాము. ఇప్పుడు జ్ఞానము లభించింది. వెలుగులోకి వచ్చాము. ఇప్పుడు తెలిసి కూడా తప్పులు చేస్తే వందరెట్ల శిక్ష అనుభవించవలసి వస్తుంది. ఉన్నతమైన తండ్రి ఆజ్ఞలను ఉల్లంఘించకండి. పిల్లలూ! మీరందరూ చాలా అదృష్టవంతులు. అందుకే మిమ్మల్ని అదృష్ట సితారలని అంటారు. ఎందుకంటే ఆత్మ సితారలైన మనము జ్ఞానము ద్వారా మన అదృష్టాన్ని ఉన్నతంగా తయారుచేసుకుంటున్నాము..."

ఆహా! బాబా ఇలా మాట్లాడుతూ ఉంటే వత్సల ఆత్మలు ఎంతో తాజాగా అయ్యి తాజా మనసులతో, తేలికైన హృదయాలతో ప్రశాంతంగా నిద్రించేవారు.

రోజులు ఎలా గడిచిపోయాయో ఎవరికీ అర్థమయ్యేది కాదు. ఆబూ వచ్చిన జిజ్ఞాసువులు సెలవు తీసుకునే సమయం ఆసన్నమయింది. బాబా మరియు మమ్మా హాలులోకి వచ్చేవారు. అందరూ బాబానుండి టోలీ (మిఠాయి) తీసుకుని బాబానుండి సెలవు తీసుకుంటున్నారు. ఒక పాటను ఆ సమయంలో వినిపించేవారు –

*"బాల్యపు రోజులను మరువకు*
*ఈరోజు నవ్వి రేపు ఏడవకు"*

బాబా అనేవారు, పాటను వింటున్నారా? పాటలో ఏముంది? మీరు మళ్ళీ బాల్యములోకి వచ్చారు ఎందుకంటే మీరిప్పుడు ఈశ్వరీయ విద్యార్థులు. విద్యార్థి జీవితము అత్యుత్తమ జీవితము కదా! 'మర్చిపోవద్దు...' అని పాట చెప్తుంది. ఒక ప్రక్క జ్ఞానము తీసుకుంటూనే మాయలో పడిపోయి శివబాబాను విడిచి పెట్టవద్దు. కోరికల ఊబిలో కూరుకుపోవద్దు."

# వీడ్కోలు తీసుకునే సున్నిత దృశ్యం

బ్రహ్మా కుమారి శీలింద్రగారు వీడ్కోలు తీసుకునే సమయం గురించి చెప్తూ ఇలా అంటున్నారు, "మధువనాన్ని విడిచి వెళ్ళడం అతి కష్టంగా ఉండేది. ఒక్కోసారి బాబా పిల్లలకు వ్యక్తిగతంగా చక్కని ప్రేరణలను ఇస్తే మరోసారి సభాముఖంగా అందరికీ ప్రేరణలు ఇచ్చేవారు. మమ్మా సోదరీలను ఆలింగనం చేసుకుంటే బాబా సోదరుల వెన్ను తట్టి, 'పిల్లలూ! వెళ్తున్నారా?' అని అడిగేవారు. అది విన్న వత్సల కళ్ళు చెమ్మగిల్లేవి.

"వయసులో పెద్దవారైన జిజ్ఞాసువులకే కాక చిన్న పిల్లలకు కూడా బ్రహ్మాబాబాపై ఎంతటి అమితమైన ప్రేమంటే తిరిగి వెళ్ళే సమయము వచ్చినప్పుడు ఆ పిల్లలు వెళ్ళడానికి ఇష్టపడక బండి సమయమైపోయేదాకా ఎక్కడో వెళ్ళి దాక్కునేవారు. వారిని వెతికి తీసుకువెళ్తుంటే, 'మేము రాము, మేమిక్కిడే ఉంటాము...' అని అనేవారు. ఆ పిల్లలకు బాబా కనిపిస్తే పరిగెత్తుకుంటూ వెళ్ళి బాబా చేతిని పట్టుకుని మేము వెళ్ళము అని చెప్పేవారు. బాబాపై ఎంతటి స్నేహము ఏర్పడేదంటే లౌకిక తల్లిదండ్రులపై ఉన్న మోహ మమతలు వారిని ఆకర్షించేవి కావు.

అప్పుడు బాబా నవ్వుతూ ఇలా అనేవారు, "ప్రియమైన పిల్లలూ! మీరు బాబా పిల్లలు. బాబాయే మిమ్మల్ని సేవ కోసం పంపారు. మీరు మీ తోటి పిల్లలకు బాబా పరిచయాన్ని ఇవ్వాలి కదా! మీరు ఈ పెద్దవారికన్నా ఎంతో గొప్ప సేవ చెయ్యాలి. చూడండి, కోపం తెచ్చుకోవద్దు, గొడవ పడద్దు. వీరు నిజంగానే భగవంతుని సంతానము అనేవిధంగా దైవీ నడవడికను అలవర్చుకోండి. తొందరగా మార్గదర్శకులుగా అయి తిరిగి రండి. మీరు నిజమైన మహాత్ములు. ఎందుకంటే మనసు నిష్కల్మషంగా మరియు పవిత్రంగా ఉంటుంది. మీ ప్రభావం ఇతరులపై వేసి వారికి కూడా పవిత్రంగా అవ్వాలన్న ప్రేరణను ఇవ్వండి.'

"బాబా చెప్పిన ఈ మాటలు విని పిల్లల ముఖాలు సంతోషంతో వెలిగిపోయేవి. బాబా మాటలకు అడ్డు చెప్పలేము, అందుకే బాబా చెప్పిన వాటితో సంతోషంగా ఇళ్ళకు వెళ్ళడానికి అంగీకరించేవాళ్ళము. మమ్మా మరియు బాబా మాకు చేతిగుడ్డతో వీడ్కోలు పలికేవారు. అందరూ సంతోషంగా తిరుగు ప్రయాణమయ్యేవారు. కొంతదూరం వెళ్ళాక మాకనిపించేది, 'అసలెలా వదిలి వచ్చాము' అని?

# ఆహ్వానాలు

1953లో అమృత్‌సర్‌లో నిర్మల్ స్వామీజీ అనే సన్యాసి అక్కడ జరుగబోయే వేదాంత సమ్మేళనంలో పాల్గొనవలసిందిగా ఆహ్వానం పంపించారు. అందుకు దాదీ జానకి మరియు దాదీ రుక్మిణిగార్లు వెళ్ళారు. ఆ సమ్మేళనం గురించి వివరిస్తూ దాదీ రుక్మిణిగారు ఈ విధంగా చెప్తున్నారు –

"మేము ఆ సమ్మేళనంలో పాల్గొనడానికి రైలులో బయలుదేరాము. మేము ప్రయాణం చేస్తున్న రైలు వివరాలు వారికి ముందుగానే తెలియజేసాము. ఇతరులందరూ ఫస్ట్ క్లాసు బోగీలో సమ్మేళనానికి వచ్చారు. కనుక, నిర్వాహకులు మాకోసం కూడా మొదటి శ్రేణి బోగీవద్దే వేచి చూడసాగారు. కానీ మేము మూడవ శ్రేణి బోగీలో ప్రయాణం చేసాము. మాకు ఆహ్వానం పలకడానికి వచ్చినవారు చివరకు మమ్మల్ని చూసి మా వద్దకు వచ్చారు. ఇతర సన్యాసుల కోసం వారు టెంట్ వేసారు. మాతలు, కన్యల కోసం దగ్గరలోని ఒక పెద్ద ఇంటిని తీసుకున్నారు. అక్కడకు చేరుకున్న తర్వాత వారు మాకు ఎంతో ఖరీదైన భోజనాన్ని ఇచ్చారు. కానీ మేము కేవలం పాలు, కొన్ని పండ్లు మాత్రమే తీసుకున్నాము. ఇది వారిపై ఎంతో మంచి ప్రభావాన్ని చూపింది. మా బట్టలను ఉతికి పంపిస్తామని నిర్వాహకులు అంటే అందుకు మేము ఒప్పుకోలేదు. మా పనులు మేమే చేసుకుంటామని వారితో చెప్పాము."

"సమ్మేళనలో మా ఇద్దరినీ స్టేజ్‌పైన కూర్చోబెట్టారు. ప్రేక్షకులు ఆశ్చర్యంగా మమ్మల్ని చూడసాగారు. వీరెవరు, వీరేమి చెప్తారు అని అనుకున్నారు. చివరకు దాదీ జానకిగారు మాట్లాడే సమయం ఆసన్నమయింది. అప్పటివరకు జరిగిన సాధుసన్యాసుల ప్రసంగంలో అందరూ అద్వైత ధర్మాన్ని వ్యాఖ్యానించారు. "బ్రహ్మమొక్కటే సత్యము, జగత్తు మిథ్య". ఈ వాదాన్ని ఆధారంగా చేసుకునే వివిధ వక్తలు ప్రసంగించారు. కానీ జానకి దాదీగారు ఆత్మ పరమాత్మలో గల తేడాను వివరించారు. పరమాత్మ జనన మరణాలకు అతీతుడు, సుఖదుఃఖాలతు అతీతుడు, అతడే పతిత పావనుడు, వారియందు మనసును నిలపగలిగితేనే సద్గతి లభిస్తుంది. ధర్మగ్లాని సమయంలో వారే స్వయంగా అవతరించి గీతా జ్ఞానాన్ని వినిపిస్తారు. ఆత్మయే పరమాత్మ అని భావించడమే ఒక పెద్ద మిథ్య. భగవంతుడు జ్ఞాన సాగరుడు, గుణాలలో సింధువు కానీ అందుకు అతడి రూపం కూడా స్థూలంగా, పెద్దగా ఉండాల్సిన అవసరం లేదు అని ఎంతో చక్కగా, స్పష్టమైన పదాలతో ప్రసంగించారు.

"ఇది విన్న ప్రేక్షకులలో స్తబ్ధత. నివ్వెరపోయారు. కానీ నిర్వాహకులు మాత్రం భయపడ్డారు. అద్వైతవాదాన్ని ప్రసంగించాల్సిన స్టేజ్‌పైనుండి ఆత్మ పరమాత్మ వేరని, ఆత్మ పుత్రుడైతే పరమాత్మ తండ్రి అవుతాడని దాదీ జానకి చెప్పేసరికి వారికది సరైనదిగా అనిపించలేదు. ఇది వారు అవమానంగా భావించారు.

"నిజానికి, దాదీ జానకి తర్వాత మా ప్రసంగం కూడా ఉంది. కానీ వారు మా ప్రసంగానికి అవకాశం ఇవ్వలేదు. సమయాభావం వలన రుక్మిణి సోదరి గారి ప్రసంగానికి అవకాశం ఇవ్వలేకపోతున్నాము, ఇందుకు మన్నించాలి అని ఆ రోజు రాత్రి కార్యక్రమ ముగింపులో నిర్వాహకులు ప్రకటించారు. ఇది విన్న ప్రేక్షకులు హర్షించలేదు.

"మేము బస చేసిన ఇంటివద్దకు చాలామంది సోదరసోదరీలు వచ్చి చేరుకున్నారు. వారందరికీ రోజంతా జ్ఞానమును వినిపిస్తూ వచ్చాము. అక్కడ మరో సమ్మేళనమే జరిగింది. ఎంతోమంది బాబా పిల్లలు అక్కడ జన్మ తీసుకున్నారు."

దాదీ జానకి మరియు దాదీ రుక్మిణి గార్లను ఎంతోమంది స్థానికులు వారి వద్ద ఉండి సేవ చెయ్యమని ఆహ్వానాన్ని పలికారు. ఇద్దరూ విడివిడిగా సేవా కార్యక్రమాలను చేపట్టి సేవను రెట్టింపు చేసారు. అత్యంత విరోధమును ఎదుర్కోవలసి వచ్చినప్పటికీ అతి కొద్ది సమయంలోనే శాశ్వతమైన సేవాకేంద్రాన్ని ఏర్పాటు చెయ్యడం జరిగింది.

# ఉదయించే సూర్యుడు

1954లో జపాన్ సేవలు ఆరంభమయ్యాయి. విశ్వ ధర్మ సమ్మేళనంలో పాల్గొనవలసిందిగా యజ్ఞ మాత వద్దకు ఆహ్వానం వచ్చింది. అందుకు సోదరుడు ఆనంద కిశోర్, దాదీప్రకాశ్‌మణి మరియు దాదీ రతన్ మోహిని గారిని పంపడం జరిగింది. 'భగవంతుని అవతరణ' అన్న అంశం ఆ సమ్మేళనంలోని అనేక అంశాలలో ఒకటి. సమ్మేళన కార్య పట్టికలో 'విశ్వ శాంతి' అన్న అంశం కూడా ఉంది.

"విశ్వ శాంతిని స్థాపించాలంటే ముందుగా మనిషి మనసులో శాంతి నెలకొనాలి. ఒక వ్యక్తియే సమాజానికి కొలమానం. మనిషి సత్కర్మలు చేసినప్పుడే అతడు మనఃశాంతిని పొందగలడు. ఎందుకంటే సుఖదుఃఖాలకు అతడు చేసే కర్మలే ఆధారము. కర్మలకు ఆధారము మనిషి మనసు. ఆత్మ ఇప్పుడు వికారాలలో కొట్టుమిట్టాడుతుంది. ఆత్మలో తిరిగి సుగుణాలను వికసింపజేయాలి. దీనిని రాజయోగము అంటారు. రాజయోగము ద్వారా ఆత్మ ఒక ఉన్నత లక్ష్యం వైపుగా వెళ్తుంది – దివ్యగుణాలున్న దేవతలుగా అవ్వాలన్న లక్ష్యం.

"ఈ లక్ష్యం ఉన్నప్పుడు మనసు సహజంగానే ప్రాపంచిక ఆకర్షణలకు దూరంగా ఉంటుంది. కలత చెందిన మనసు శాంతిస్తుంది, భౌతిక కోరికలపై ఆసక్తి ఉండదు. రాజయోగము ద్వారా భగవంతునితో ఏర్పడిన సంబంధంతో ఆత్మలో శక్తి నిండి చెడు అలవాట్లను తొలగించుకోగల ధైర్యము మనసుకు కలుగుతుంది. భగవంతునిపై ఉన్న ప్రేమలో మునిగి, విజయం తథ్యం అన్న నమ్మకంతో ఆత్మ ఎన్ని పరీక్షలనైనా ఎంతో సులువుగా దాటేస్తుంది. చివరకు, వారిని ఎవ్వరూ చలింపచెయ్యలేరు."

ఇదంతా విశ్వ శాంతిని ఎలా తీసుకువస్తుందని అనుకుంటున్నారా? అంటూ దాదీ ఇంకా ఇలా అన్నారు–

"విశ్వ శాంతి కోసం చింతించకండి. అది భగవంతుని బాధ్యత. మనం చెయ్యవలసిందల్లా మనలో శాంతిని స్థాపించుకోవడమే. మన నుండి భగవంతుడు కోరుకునే ఒకే ఒక్క సహాయము – మనం పవిత్రులుగా అవ్వడము. భగవంతుని స్మృతిలో ఉన్నప్పుడే ఇది సాధ్యపడుతుంది. అతడిని స్మృతి చెయ్యాలంటే అతని గురించి ముందు తెలుసుకోవాలి. అందుకే వారు ఈ భూమిపై అవతరించి వారి సత్య పరిచయాన్ని మనకు అందించాలి. ఇప్పుడు అదే జరిగింది."

ప్రేక్షకులంతా ఆశ్చర్యచకితులయ్యారు. దాదీ ప్రకాశ్ మణిగారు భగవంతుని అవతరణ గురించి, బ్రహ్మాబాబా పాత్రను గురించి, కాల చక్ర గతిని గురించి, ఆత్మల ప్రపంచం గురించి కూడా క్లుప్తంగా వివరించారు.

తర్వాత, సోదరుడు ఆనంద కిశోర్ గారు మాట్లాడారు. వారన్నారు, 'అణు బాంబులు, హైడ్రోజన్ బాంబులు విశ్వ నాశనానికి తయారు చేసారు. మూడవ ప్రపంచ యుద్ధము ఎవ్వరు ఆపినా ఆగదు. ఎందుకంటే ఆ ప్రపంచ యుద్ధంతోటే రోగగ్రస్థంగా ఉన్న ప్రపంచం అంతమవుతుంది. అప్పుడు, ఆత్మలందరి శాంతి కోరికను తీర్చడానికి పరమాత్మ ఆత్మలను తిరిగి శాంతిధామానికి తీసుకువెళ్తారు.

అప్పుడే నవ యుగం ప్రారంభమవుతుంది. సతోప్రధాన సంస్కారాలున్న ఆత్మల ప్రపంచం అది. అక్కడ అత్యంత సుఖశాంతులు ఉంటాయి. 2,500 సంవత్సరాల వరకు ఏ గొడవా ఉండదు. రోగాలు, ప్రమాదాలూ ఏమీ ఉండవు. ఇక్కడ ఇప్పుడు ఎంత దుఃఖముందో అక్కడ అంతకంటే ఎక్కువ సుఖశాంతులు ఉంటాయి. ఆ కృతయుగం భగవంతుని మహాద్భుత సృష్టి. అందుకే ఆ భగవంతుని పూజ నిత్యం జరుగుతూ ఉంటుంది.

ప్రేక్షకులలో చాలామంది చదువుకున్నవారు, తెలివైనవారు ఉన్నారు. సోదరుడు ఆనంద కిషోర్‌గారి మాటలలో ధైర్యము, ముఖములో తేజస్సు చూసి వారి ప్రసంగం విన్నవారి నోటవెంట ఒక్క మాట కూడా రాలేదు. భారతదేశంనుండి వచ్చిన వీరు ఎంతో అర్థవంతంగా మాట్లాడారు అని అనుకున్నారు.

బ్రహ్మాకుమార్ ఆనంద్ కిషోర్‌గారు ఇలా అన్నారు, "జపాన్‌లోని 'అనునాయకో' అనే ధార్మిక సంస్థ ఈ విశ్వ ధర్మ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసింది. ఒకసారి మేము ఆ ధార్మిక సంస్థకు ముఖ్యులైన కొందరితో కూర్చుని జ్ఞాన చర్చను

చేసాము.

“మీరు శుద్ధమైన శాకాహారులా?” అని వారిలోని ఒక ప్రధాన వ్యక్తి అడిగాడు.

నేనన్నాను, “అవును! మేము శుద్ధమైన భోజనాన్ని, భగవంతుని స్మృతిలో తయారు చేయబడ్డ భోజనాన్ని మాత్రమే స్వీకరిస్తాము. మాంసము మొదలగు తామసిక భోజనము మనిషికి నిషిద్ధము.”

వారన్నారు, “మాంసము ఎందుకు నిషిద్ధము? ఈరోజు పశుపక్ష్యాదుల సంఖ్య ఎంత పెరిగిపోతుంది. మనిషి వాటిని తినకపోతే వాటి సంఖ్య ఎంతో పెరిగిపోతుంది కదా?”

నేనన్నాను, “మనుష్యుల జనాభా కూడా పెరిగిపోతుంది కదా. అంతమాత్రాన మనం ఇతర జీవజంతువులను చంపి తినాలా? మనిషి, మనిషిని చంపి తినడు ఎందుకంటే అతడిలో ప్రాణముంది, శ్వాస ఉంది, చంపడం వలన అతడికి బాధ కలుగుతుందని తెలుసు. ఒక మనిషిని చంపుతుంటే అతడు తనలోని ఆవేదనను వ్యక్తపరచగలుగుతాడు, కానీ పశుపక్ష్యాదులు కూడా మనిషి భాషలో వాటి బాధను చెప్పుకోగలిగితే ‘మమ్మల్ని ఎందుకు చంపి తింటున్నారు’ అని అవీ అడుగుతాయి. అందుకు మన దగ్గర ఏం సమాధానముంది? వాటికి నోరు లేదు కాబట్టి మీరు వాటిని తింటున్నారు. నోరులేని జీవాలను చంపి తినడం అన్యాయము, అపరాధము, పాపము. ఎవరికైనా దుఃఖాన్నివ్వడమంటే పాపము చెయ్యడమే. కర్మ సిద్ధాంతానుసారంగా ఎవరినైనా చంపడమంటే పాపము చెయ్యడమే. ప్రభుత్వం ఇందుకు దండన విధించకపోయినా కానీ ఇది మాత్రం ఖచ్చితంగా నేరము, పాపమే.”

అందరూ మౌనంగా వింటూ ఉండిపోయారు. చివరకు ఒక వ్యక్తి ఇలా ప్రశ్నించాడు,

“సరేమరి, జంతువుల గురించి మీరు చెప్తున్నది ఒప్పుకుంటాము. కానీ చేపల మాటేమిటి? వాటిని కేవలం సముద్రంలోని ఫలాలుగా భావిస్తారు. భూమిమీద ఎలా అయితే పండ్లు ఉన్నాయో అలాగే చేపలు నీటిలోని ఫలాలు కదా.

నేనన్నాను, “చేప చనిపోయే సమయంలో పడే ఆవేదన, దాని ఊపిరి, దాని బాధ మీకు స్పష్టంగా కనిపిస్తాయి. కానీ మనిషి దానిని తినడానికి అనేక సాకులు వెతుక్కున్నాడు. చేప నీటి ఫలంలాంటిది అని అనుకోవడము కేవలం ఒక సాకు మాత్రమే. మనిషి తినడానికి ప్రపంచంలో ఎన్నో మంచిమంచివి ఉన్నాయి...”

సోదరసోదరీలు జపాన్‌లో ఎంతో సేవను చేసారు. ‘అనునాయకా’ అను ఈ ధార్మిక సంస్థ ఒక అండాకారంలో ఉండే ఆకారాన్ని పెట్టి ధ్యానం చేస్తారు. ఆ ఆకారానికిగల మహత్వము ఆ ధర్మస్థులకు కూడా తెలియదు. ఆ ఆకారాన్ని పవిత్రమైనదిగా భావిస్తారు. మోకాళ్ళపై కూర్చుని ఒక స్టాండుమీద ఆ ఆకారాన్ని ఉంచి దానిని చూస్తూ వారు ధ్యానం చేస్తారు. ఇలా సాధన చెయ్యడం ద్వారా ఆత్మ పరమాత్మల మధ్య ఒక వంతెన ఏర్పడుతుందని వారి నమ్మకం. వారు ఈ ఆకారాన్నే ఎందుకు ఎంచుకున్నారని దాదీ రతన్ మోహినిగారు అడిగారు. కానీ అది వారికి తెలియదు. ఈ రీతి పరంపర నుండి వస్తుందని మాత్రమే వారు చెప్పగలిగారు. అండాకారాన్ని చూసిన బ్రహ్మాకుమార్ కుమారీలు ఎంతో ఆశ్చర్యపోయారు ఎందుకంటే హిందూధర్మంలోని అన్ని మందిరాలలో శివుడిని లింగాకారుడిగా పూజిస్తారు కదా! భగవంతుని రాతి విగ్రహానికి వంతెన వేసే బదులుగా స్వయంగా భగవంతునికే వంతెన వేసుకోగలిగితే బాగుంటుందని దాదీ రతన్ మోహిని గారు చెప్పారు. ఇటువంటి మాటలు వారికెంతో తృప్తిని కలిగించాయి.

“జపనీయులు మా కోసం ఎన్నో మీటింగులు పెట్టి ప్రసంగాలకు అవకాశాలను కల్పించారు. కొన్ని ఈశ్వరీయ చిత్రాలను మరియు కొంత సాహిత్యాన్ని కూడా అచ్చు వేయించి ఇచ్చారు. వార్తాపత్రికలవారు మన సందేశాన్ని చక్కగా పత్రికల్లో వేసారు.

బ్రహ్మాకుమార్ ఆనంద కిషోర్‌గారు అన్నారు, “మేము హాంకాంగ్, సింగపూర్, మలేషియా, జకార్తావంటి దేశాలలో కూడా సేవ చేసాము. మేము తిరిగి భారతదేశానికి వచ్చినప్పుడు ముంబయి మరియు మద్రాసు వార్తాపత్రికల్లో విదేశీ సేవా సమాచారాన్ని ప్రచురించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో ప్రతి ఆదివారం వచ్చే ‘సండే స్టాండర్డ్స్’లో ‘విదేశీ

సేవలను ముగించుకుని బ్రహ్మాకుమారీల స్వదేశ ఆగమనము' అన్న శీర్షికలో సేవ సమచారాన్ని ఫోటోలతో సహా ప్రచురించారు. జపాన్‌లో జరిగిన విశ్వ ధర్మ సమ్మేళనంలో ప్రసంగించిన ప్రసంగ సారాన్ని కూడా ప్రచురించారు. చివరకు, బ్రహ్మాకుమారీలు తమ సొంత గడ్డపై విజయ కేతనాన్ని ఎగురవేసారు.

# కమ్యూనిస్టులకూ ఈశ్వరీయ జ్ఞాన సందేశము

బుల్గానిన్, రష్యా తత్కాలీన ప్రధాన మంత్రికి మరియు క్రుశ్చేవ్ (ఒకప్పటి ప్రధాన మంత్రి) భారతదేశ పర్యటనలో రాష్ట్రపతి భవన్‌లో ఉంటున్న సమయంలో వారికి ఉత్తరాన్ని, సాహిత్యాన్ని పంపడం జరిగింది. ఇతర కమ్యూనిస్టు నేతలకు కూడా ఆహ్వానాన్ని పంపడం జరిగింది. అదే సమయంలో సౌదీ అరేబియా అధ్యక్షుడికి ఇదే విధంగా సందేశాన్ని పంపడం జరిగింది.

1955లో ఢిల్లీలో ఒక పారిశ్రామిక మేళాను నిర్వహించారు. అటువంటి మేళాను నిర్వహించడం అదే మొదటిసారి. అక్కడ ఒక టెలివిజన్ స్టూడియోను కూడా ఏర్పాటు చేసారు. యజ్ఞంలోని ఒక అనుభవీ సోదరి కాల చక్రం గురించి టెలివిజన్‌లో ప్రసంగించారు. వేలాది మంది ఈ కార్యక్రమాన్ని చూసి ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఆ మేళాలో ఆధ్యాత్మిక విశ్వ విద్యాలయంవారు ఒక స్టాలును ఏర్పాటు చేసారు. అక్కడ ఈశ్వరీయ జ్ఞాన చిత్రాలను ఏర్పాటు చేసారు. అనుభవజ్ఞులైన సోదరసోదరీలు అక్కడ ఉండి ఆ చిత్రాల వివరణను వచ్చినవారికి అర్థం చేయించారు. ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చెయ్యడం ఇదే మొదటిసారి. అది విజయవంతంగా ముగిసింది.

సోదరుడు రమేష్ (ఈ చిత్ర ప్రదర్శని ఏర్పాటు చెయ్యాలన్న ఆలోచన వారిదే) ఇలా అంటున్నారు –

“ప్రపంచ జనాభా ఈ విధంగా పెరుగుతూ ఉంటే నిరుద్యోగ సమస్యని నిర్మూలించడానికి మీరు చేసే ప్రయత్నాలన్నీ వృథా అవుతాయని ప్రభుత్వానికి సూచించాము. ఇందుకు కుటుంబ నియంత్రణను పాటించాలని, పవిత్రతను పాటించాలని సలహా ఇచ్చాము. బ్రహ్మచర్యంపై అవగాహన కలిగించడానికి ప్రభుత్వంవారు ఆధ్యాత్మిక విద్యను స్కూళ్ళు, కాలేజీల నుండే నేర్పించడం ప్రారంభించాలి. ఈ విధంగా చేయడం ద్వారా నేటి పిల్లలు భవిష్యత్తులో బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ మనస్ఫూర్తిగా వారి ప్రవర్తన, నడవడికను ఉన్నతంగా చేసుకోగలుగుతారు. అప్పుడు భారతదేశంలో అవినీతి, హింస, దొంగతనము, పేదరికము ఉండనే ఉండవు. ఒక సామరస్య సమాజాన్ని నిర్మించవచ్చు.

“కుటుంబ నియంత్రణ మరియు పవిత్రత గురించిన ప్రాముఖ్యాన్ని తెలిపింది మొదటగా బ్రహ్మకుమారీ సంస్థయే. నేరాలను నిరోధించడానికి ఎంత ధనాన్ని ఖర్చు పెడుతున్నాము అయినాకానీ జైళ్ళు ఎప్పుడూ నిందితులతో నిండుగా ఉంటుంది. అవినీతి ఎంత వేగంగా పెరిగిపోతుందంటే వకీళ్ళ సంఖ్య కూడా పెరిగిపోయింది, కోర్టులు కేసులతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాయి. మనుషులలో కేవలం సహనము, సుగుణాలు, పవిత్రతను తీసుకురాగలిగితే, అంటే దైవీ గుణాలను తీసుకురాగలిగితే, మనం ఎంతగానో సమాజాన్ని అభివృద్ధి చెయ్యవచ్చు. అప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ కూడా బాగుపడుతుంది.

“అదే విధంగా, మద్యాన్ని నిషేధించాలని ప్రభుత్వానికి ఉంది అని ప్రభుత్వం చెప్పుకుంటుంది. కానీ అందుకు వారు చేసే ప్రయత్నాలతో మనిషి పొట్ట నిండుతుందేమోకానీ ఆత్మ మాత్రం దప్పికతోనే ఉంటుంది. సంపన్నులు తమకు అన్ని సౌకర్యాలూ కావలసిందే అని అనుకున్నంత కాలం ఈ అన్యాయం జరుగుతూనే ఉంటుంది. పేదవారు కూడా ఆత్మలే, అందరూ భగవంతుని సంతానము. భగవంతుని ఎదుట అందరూ సమానమే. కర్మ సిద్ధాంతము అందరికీ వర్తిస్తుంది అని సంపన్నులు అర్థం చేసుకున్నప్పుడు వారి మనసులో కలిగిన ఈ జాగృతి సమాజానికి ఎంతో మేలు చేస్తుంది. సోదర భావంతో ఈ సమాజంలో సమైక్యతను తిరిగి తీసుకురాగలము.

“ఇలా, ఎన్నో విధాలుగా మేము ఆధ్యాత్మిక జ్ఞాన ప్రాముఖ్యతను చాటి చెప్పాము. నిజానికి, అన్ని జాతులవారు, అన్ని వర్గాలవారు మంచి మంచి సిద్ధాంతాలను గౌరవిస్తున్నారు. ఆధ్యాత్మిక సైన్యంలా, మేము చేస్తున్నది కేవలం మరో అడుగు ముందుకు వేసి ఆ సిద్ధాంతాలను ఆచరణలోకి తీసుకురావడమే.

“నిజానికి, ధర్మము ఒక్కటే. ధర్మములో సోదర ప్రేమ, అహింస, ఆత్మ నియంత్రణ, బ్రహ్మచర్యము, భగవంతునితో తండ్రి పిల్లల సంబంధము ఉంటాయి. సత్య ధర్మాన్ని ప్రభుత్వం మర్చిపోయింది. ఇదే పెద్ద పొరపాటు. రాజకీయ

స్వాతంత్ర్యానికి భగవద్గీతను ఆధారంగా చేసుకుని అహింసా మార్గంలో వెళ్ళడం ఎంత ముఖ్యమో మహాత్మా గాంధీజీకి తెలుసు. ఈరోజు, ఆత్మ తన స్వరాజ్యమును పొందాలంటే ప్రభుత్వంవారు గీతను మించి ఇంకా ముందుకు వెళ్ళాల్సి ఉంటుంది. భగవద్గీత ఒక పవిత్ర గ్రంథము. అన్ని ధర్మాలవారికి ఇది భగవంతుని ఉవాచను అందిస్తుంది. ఇది స్వయంగా భగవంతుని మహావాక్యాలే అని ఋజువు చేసినప్పుడు అన్ని ధర్మాలవారు దీనిని మనస్ఫూర్తిగా స్వీకరిస్తారు. అప్పుడు ఒక ఆమోదయోగ్యమైన ఆధ్యాత్మిక విద్యా విధానాన్ని ప్రభుత్వం సులువుగా అమలు చేయగలుగుతుంది. దీనిని కొనసాగించడానికి అవసరమైతే నిష్పాక్షికమైన కమిషన్‌ను కూడా ఏర్పాటు చెయ్యవచ్చు అని ప్రభుత్వానికి విన్నవించాము. మేము నిస్సందేహంగా, నిస్సంకోచంగా, భగవంతుడే గీతను మానవాళికి వినిపించాడు అని చెప్పగలము."

ఈ విధంగా భగవంతుని సందేశము నలువైపులకు వ్యాపించింది. "వీరు బుద్ధిశాలురు. వీరు గుడ్డిగా నమ్మడం లేదు." వ్యాపారవేత్తలు, వృత్తిపరులు అనేకమంది రాజయోగులుగా మారారు. డాక్టర్లు రోగాన్ని తగ్గించుకోవడానికి రాజయోగాన్ని కూడా అభ్యసించవలసిందిగా రోగులకు సూచిస్తున్నారు. రాజస్థాన్ పర్వత శిఖరంనుండి జాలువారుతున్న ఈ జ్ఞాన ప్రభంజనం గురించి రాజకీయ వేత్తలు కూడా చర్చించుకోసాగారు. కానీ ఎంతమంది నిజంగా ఆచరిస్తారు?

సేవాకేంద్రాలు పెరుగుతూ వచ్చాయి. అనేక స్థానాల నుండి మాతేశ్వంరి సరస్వతిని ఆహ్వానిస్తూ ఎన్నో ఉత్తరాలు వచ్చాయి. బాప్‌దాదా శిక్షణలను పూర్తిగా ఆకళింపు చేసుకున్నదెవరు? మమ్మా. ఎంతోమంది జిజ్ఞాసువులు వినయంతో, ఆదరాభిమానాలతో మమ్మాకు ఇలా నివేదించుకున్నారు, 'మమ్మా! ప్రియమైన మమ్మా! అతి మధురమైన మమ్మా! ఈ నగరంలో మీ పిల్లలమైన మేము చిరకాలం నుండి మీకోసం వేచి ఉన్నాము. అమ్మా! శీతలా దేవీ! మీ రాకతో వికారాల అగ్నిలో కాలిపోతున్న ఈ నగర వాసులకు శీతలత లభిస్తుంది. మీ జ్ఞాన వీణావాదనతో అనేక సుషుప్త ఆత్మలు మేలుకుంటాయి. మమ్మా! జ్ఞాన సితారలమైన మేము జ్ఞానచంద్రులైన మీరులేక బోసిపోతున్నాము."

చివరకు, నవంబర్ 1956లో జగదాంబ సరస్వతి మధువనం నుండి కాన్పూర్ వెళ్ళారు.

మమ్మా కాన్పూర్ వెళ్ళినప్పుడు మమ్మాను ఎంతో ఘనంగా ఆహ్వానించారు. మమ్మా అక్కడున్న రోజులలో ఈశ్వరీయ నియమాలను పాటించే సోదరసోదరీలు అధిక సంఖ్యలో ఉదయం క్లాసుకు చేరుకునేవారు. క్రొత్త విద్యార్థులను మమ్మా ఉత్తేజపరిచారు. ప్రెస్ కాన్ఫెరెన్సులలో ఎన్నో ప్రశ్నలకు సమాధానాలను ఇచ్చారు. ఎన్నో సభలలో ప్రసంగించారు. మమ్మా యొక్క వాత్సల్యపూర్వక వాణిని విని ఎందరో లాభాన్వితులయ్యారు.

మమ్మా ప్రసంగాల సారాన్ని అనేక దిన పత్రికల్లో ప్రచురించారు. అందులోని కొన్ని శీర్షికలు ఈ విధంగా ఉండేవి, 'విశ్వ శాంతి మరియు వ్యక్తిగత శాంతి', 'పృథ్విపై స్వర్గం రాబోతుంది', 'జగదాంబ సరస్వతి గారి ప్రవచనాలు', 'సుఖశాంతుల ప్రాప్తి కోసం సహజమైన ఉపాయాలు' మొదలైనవి.

ఈ క్రింది పద్యము మమ్మాపై ఉన్న అభిమానానికి నిదర్శనము –

*"హే జగదాంబా! హే విశ్వ జననీ!*
*ఈశ్వరీయ జ్ఞాన కలశ ధారిణి*
*సతత అక్షయ మంగళకారిణి*
*అసుర పంచ వికార విదారిణి*
*సంకట హారిణి సంతోష ప్రదాయిణి*
*మీ చిరు మందహాస ఆగమనము*
*ధన్య ధన్య శుభదే జగదాంబికే!*

*విమల సంచారిణి*
*సహజ యోగమయి*
*ప్రభు ప్రియ ఆత్మా, హే విజయీ*
*బ్రహ్మ పగలుకు జాగృతి ప్రదాయణి*

*సంగమ యుగంలోని ఆత్మల నాట్యం*
*ప్రజాపతి వత్స సరస్వతి*
*బ్రహ్మ పుత్రీ! హే సరస్వతి!*
*నీ నయనాలలో ప్రకాశము*
*జ్ఞానామృత శోధిని*

*నీవు స్వర్గ ద్వారాలు తెరిచావు!*

*వందే జగదాంబ*

*స్మృతి విహీనులైన మానవులు లేచారు*

*విమల దృష్టి ప్రదాయణి*

*సకల వందిత వందేమాతరమ్*

మమ్మా మాటలకన్నా వారి మౌనం మరింత శక్తిశాలిగా ఉండేది. ఒకసారి ఏమి జరిగిందంటే, ఒక సభలో మమ్మా ప్రసంగించాల్సి ఉంది. నిర్వాహకులలో ఒకరు సభా వేదిక పీఠము వద్ద నిల్చుని మమ్మా పరిచయాన్ని ఇస్తున్నారు. మమ్మా వేదికపైకి వస్తూ ఉండగా ఆ వ్యక్తి మమ్మాను చూసి, వారిలోని తేజస్సు చూసి ముగ్ధుడైపోయాడు. తాను చెప్పాల్సిన మాటలను కూడా ఆపేసి మమ్మాను, ఆ దివ్యమూర్తినే చూస్తూ ఉండిపోయాడు. మమ్మా వేదిక మధ్యకు వెళ్ళి ఎంతో తేజోవంతమైన మౌనంలో కొద్దిసేపు నిల్చున్నారు. వారి దృష్టి సభలోని ప్రతి ఆత్మను చూసాయి. మాటల్లో చెప్పలేని అనేక విషయాలను మమ్మా భగవంతుని స్మృతితో కూడిన మౌనంతో చెప్పారు. వారికి కలుగుతున్న అనుభవాన్ని చూసి జనాలు ఎంతో ఆశ్చర్యపోయారు. మమ్మా ఉనికి ఆ ఆడిటోరియమును ఒక మందిరంలా మార్చేసింది. అవి మర్చిపోలేని క్షణాలు.

మమ్మా తమ మధుర స్వర లహరిని ప్రారంభించారు. ఆ మధుర జ్ఞానం ఎడారిలో శీతల నది ప్రవహిస్తున్నట్లుగా అనిపించింది.

శ్రోతల మనసులు సంతోషంతో నిండిపోయాయి. ఆ తేజోమయ కళ్ళు, ఆ గంభీర స్వరం, ప్రతి ఒక్కటీ అవిస్మరణీయ ముద్రను మనసులో వేసాయి. ఆరోజు సాయంత్రం సభలో జరిగిన ఈ అద్భుత విషయం పూర్తి భారతదేశమంతా వ్యాపించింది. ఆ తర్వాత, మమ్మాకు దేశమంతటి నుండి అనేక ఆహ్వానాలు వచ్చాయి. ఆ విధంగా మమ్మా సేవార్థము ఢిల్లీ బయలుదేరారు.

మమ్మా ఢిల్లీకి రైలులో వచ్చారు. అనేకమంది రాజయోగులు శ్వేత వస్త్రధారులై స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లోని ఇతర వ్యక్తులంతా ఈ శ్వేత హంసల గుంపును చూసి ఆశ్చర్యపోతూ రాబోయే ఆ మహా వ్యక్తి ఎవరా అని అంతా ఆత్రంగా అక్కడున్న బ్రహ్మాకుమార్ సోదరసోదరీలను అడిగారు. అందుకు జవాబుగా సోదరులు వారి చేతికి కరపత్రాలను ఇచ్చి రాజయోగము గురించి వివరిస్తూ మమ్మాలోని విశేషతలను గూర్చి చెప్పారు. రాజయోగుల ప్రసన్నవదనము అంతటా వ్యాపించి స్టేషన్‌లో ఉన్న ఇతర వ్యక్తుల వరకు పాకింది. వారి ముఖాలలో కూడా చిరునవ్వు కనిపించింది. వారందరూ కూడా ఆ విశిష్టమైన మమ్మా కోసం ఎదురు చూస్తున్నారు.

చుక్ చుక్‌మంటూ రైలు రానే వచ్చింది. అందరూ గుంపుగా దగ్గరకు చేరుకుంటున్నారు. మమ్మాను చూడాలన్న తపన అది.

మమ్మా రైలు దిగారు. వారి ముఖమండలం తేజస్సుతో ప్రకాశిస్తుంది. స్టేషన్‌లో ఉన్న ఇతర వ్యక్తులకు నిరాశ కలగలేదు. ఆ దివ్యమూర్తిని చూడగానే వారూ ఎంతో తృప్తి చెందారు.

వద్దని మమ్మా వారించినా కూడా వత్సలు తమ ఆదరాభిమానాలను వ్యక్తపరచడానికి పూలమాలలు తీసుకువచ్చారు.

మమ్మా అన్నారు, "అదేమిటి? నాకు ఈ పూలమాలలు వద్దు. నాకు చైతన్య పూలమాలలు కావాలి. మీరందరూ చైతన్య పుష్పాలు. ముళ్ళలా ఉన్నవారు పుష్పాలుగా వికసించాలి. దివ్యగుణాలను ధారణ చెయ్యాలి. బాబా పూదోటలో మీరందరూ చైతన్య పుష్పాలు. ఇప్పుడు చెప్పండి, మీరు సదా సుగంధభరితంగా ఉన్నారా?"

వారంతా అన్నారు, "ఉన్నాము మమ్మా! బాబా మమ్మల్ని పుష్పాలుగా చేసారు." ఇది విన్న మమ్మా తృప్తిచెందారు.

ఢిల్లీలో మమ్మా ఉన్నంతకాలం ఎంతోమంది జిజ్ఞాసువులు జ్ఞానాన్ని ఆస్వాదించడానికి వచ్చారు. ఉదయం నుండి రాత్రి వరకు అందరూ ఎంతో దూరదూరాల నుండి నిర్ధారిత సమయాలలో వచ్చి జ్ఞానాన్ని వినేవారు. రోజంతా మమ్మా అవిశ్రామంగా మానవ మనసుకు ప్రశాంతతను చేకూర్చే జ్ఞాన ఖజానాను పంచుతూ ఉన్నారు. మమ్మా చెప్పే అతి కొద్ది జ్ఞాన వచనాలు అనేక ప్రశ్నలను సమాధానపరిచేవి. వారికెంతో ధైర్యాన్ని ఇచ్చేవారు మమ్మా. మమ్మా వారికి టోలీ పంచుతున్నప్పుడు వారి బాల్యం తిరిగి వచ్చినట్లుగా, తల్లి ఒడిలో సేదదీరుతున్నట్లుగా అనిపించేది.

చిన్న చిన్న పిల్లలు కూడా మమ్మా వద్దకు వచ్చేవారు. నిత్యం మమ్మా జ్ఞాన వీణ కొత్త స్వరాలనే పలికిస్తూ ఉండేది. మమ్మా అనేవారు, 'చూడండి, దూరదేశం నుండి పరాయి దేశంలోకి ఒక యాత్రికుడు వచ్చాడు. ఆ యాత్రికుడిని ఈ కళ్ళు చూడలేవు కానీ హృదయం గుర్తిస్తుంది. ఆ యాత్రికుడు కొద్ది రోజులకోసమే ఇక్కడకు వచ్చారు..." ఈ విధంగా ఉత్సాహాన్ని నింపుతూ అనేవారు, 'ఆ యాత్రికుడు పరమాత్మ. బ్రహ్మలోకం నుండి ఈ మాయా నగరానికి వచ్చారు. వారిని మనం ఈ చర్మ చక్షువులతో చూడలేము. మనోనేత్రంతో చూడగలము. వారు త్రికాలదర్శి, త్రినేత్రి. వారు త్రిలోకనాథుడు. అతడే శివబాబా.

మమ్మా ఇంకా ఇలా అనేవారు, "చూడండి, అందరూ భగవంతుడిని సాగరుడు అని అంటారు. (జ్ఞాన సాగరుడు, ప్రేమ సాగరుడు...) కానీ భగవంతుడు పెద్ద వ్యాపారవేత్త కూడా అని వారికి తెలియదు. వారివంటి వ్యాపారవేత్త మరొకరు లేరు. వారు భోలానాథుడు. అన్నీ నిండుగా ఇస్తాడు. ఎవ్వరూ ఇవ్వనంత నిండుగా ఇస్తాడు. కానీ తెలివైనవాడు కూడా. ఇవన్నీ ఊరికే ఇవ్వడు. వారు అసలైన వ్యాపారి.

"భగవంతుడు అంటారు, 'మీరు నాకు మీలోని వికారాలను ఇవ్వండి, మీ మనసును ఇవ్వండి, అప్పుడు నేను మీ మనసు అనే జోలెను వరదానాలతో నింపుతాను. కానీ ఈ యాత్రికుడు ఇక్కడ కొంత సమయమే ఉంటాడు. మళ్ళీ తిరిగి తన ఇంటికి వెళ్ళిపోతాడు. ఆలోపే ఇచ్చేయాలి. ఇక కొద్ది రోజులు మాత్రమే ఉన్నాయి. తర్వాత ఈ కలియుగ ప్రపంచం వినాశనం కాబోతుంది. మరి హానికరమైన వికారాలను బాబాకిచ్చేసి అనంతమైన ఆనందాన్ని కలుగజేసే బాబా ఖజానాలను ఎందుకు పొందకూడదు? ఇంకెక్కడా ఇటువంటి ఆఫర్ లభించదు. అటువంటి వ్యారవేత్తతో వ్యాపారాన్ని ఇప్పుడు చెయ్యకపోతే ఇంకెప్పటికీ చెయ్యలేరు.

జిజ్ఞాసువులలో మమ్మా నిత్యం నూతన ఉత్సాహాన్ని నింపేవారు. మమ్మా తిరిగి వెళ్ళే రోజు వచ్చేసింది. అందరూ, 'మమ్మా! మీరు వెళ్ళద్దు! అని అన్నారు. ఢిల్లీ వత్సలు ఎంత మంచి పురుషార్థులో బాబాకు తప్పకుండా చెప్పాలికదా అని మమ్మా అన్నారు. ఎవరికి తెలుసు, బ్రహ్మబాబాయే స్వయంగా రావచ్చునేమో. ఆ ఆశతోటే అందరూ మమ్మాకు వీడ్కోలు పలికారు.

ఢిల్లీలోని బాబా పిల్లలు బ్రహ్మబాబాకు ఉత్తరాల మీద ఉత్తరాలు వ్రాస్తూ బాబాను ఆహ్వానిస్తూ ఉన్నారు. చివరకు, శివబాబా, వారి మాధ్యమమైన బ్రహ్మబాబా ఢిల్లీ వత్సల ఆహ్వానాన్ని మన్నించారు. ఈ విషయం తెలిసిన ఢిల్లీ వత్సలు సంతోషం పట్టలేకపోయారు.

ఢిల్లీకి రాకముందు బ్రహ్మబాబా వారికి ఈ విధంగా ఉత్తరం వ్రాసారు –

"మధురాతి మధురమైన, చాలాకాలం తర్వాత కలిసిన ముద్దు పిల్లలకు,

శివబాబాకు తన పిల్లలపై ఉన్న ప్రేమ కారణంగా పరంధామాన్ని విడిచి ఈ మాయా నగరానికి రావలసి వచ్చింది. జ్ఞానంతో మనల్ని సుసంపన్నులుగా చేయడానికి వచ్చారు. పిల్లల ఆహ్వానాన్ని తిరస్కరించలేరు, ఢిల్లీని రాతినగరం నుండి బంగారునగరంలా మార్చడానికి వస్తున్నారు. శివబాబా ఈ రథాన్ని కూడా ఆదేశించారు. బాబా (శివబాబాను) రావాలంటే వారిని దాదా (బ్రహ్మబాబా) తీసుకురావాలి కదా. మీరు మీ అతిథిగా ఎవరిని ఆహ్వానిస్తున్నారు అనేది

గుర్తుంచుకోండి. వారిని మీరు యథార్థంగా గుర్తించారు కనుక వారి నీడలో, అంకిత భావంతో పవిత్రులుగా ఉండవలసి ఉంటుంది. బాబా వచ్చిందే ఈ ఛీ-ఛీ ప్రపంచాన్ని పుష్పాల తోటలా మార్చడానికి. కనుక, పూర్తి నియమాలను పాటించవలసి ఉంటుంది. మానసిక అవస్థను జ్ఞానముతో యోగయుక్తంగా ఉంచుకోవాలి...'

బాబా ఇంకా ఇలా అన్నారు, 'పిల్లలూ! స్టేషన్‌కు పూలను తీసుకురావద్దు. ఎక్కువమంది కూడా స్టేషన్‌కు రానవసరం లేదు. మీరు మీ ధనాన్ని వృధాగా ఖర్చు చేయవద్దు. ఆ ధనాన్నంతా ప్రపంచ ఉద్ధరణకు ఉపయోగించండి. శివబాబా ఇచ్చే వారసత్వాన్ని అందరికీ పంచే సేవా కార్యక్రమాలలో వినియోగించండి.

పిల్లలూ! నేను సాధువును కాను, మహాత్మను కాను. కేవలం మీ బ్రహ్మాబాబాను. కనుక పుష్పాలను తీసుకురావలసిన అవసరమేముంది? బాబా తన పిల్లలను చైతన్య పుష్పాలుగా చూడాలని ఆశిస్తున్నారు. మాయ ఎప్పుడూ మీ జీవితంలో నిస్సారాన్ని తీసుకురాకూడదు. సుగుణాలు మీ ప్రవర్తనలో ప్రత్యక్షం కావాలి. అప్పుడే ఇతరులు వీరెవరి సంతానము అని ఆలోచిస్తారు."

కేవలం బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్న వారినే బ్రహ్మాబాబాను కలుసుకోవడానికి అనుమతించారు. అంతేకాక వారు ఆహార శుద్ధిని కూడా పాటిస్తూ, నిశ్చయ బుద్ధి కలవారై ఉండాలి. నిజానికి, ఈ నియమము పిల్లల కోసమే పెట్టడం జరిగింది. పవిత్ర మనసు మాత్రమే భగవంతుడిని గుర్తించగలుగుతుంది. శివబాబా గుప్తమైనవారు. ఈ చర్మ చక్షువులతో భగవంతుడిని చూడటం అసాధ్యం. జ్ఞాన మనో నేత్రాన్ని తెరుచుకొనని వారు ఆ సాధారణ వృద్ధతనువులో శివుని అవతరణ జరిగిందని అర్థం చేసుకోలేరు.

**బాబా శుభాగమనము**

ఆఖరకు, ఆరోజు రానే వచ్చింది. బ్రహ్మాబాబా ఎంతో సాధారణ వస్త్రాలలో, శ్వేత వస్త్రాలలో వచ్చారు. మరే ఇతర అలంకారమూ లేదు. అయినా, విశ్వ అధిపతినే తనలో దాచుకున్న బ్రహ్మాబాబాకు అలంకారం అవసరమా?

నిత్యం, అమృతవేళ, బ్రహ్మ వత్సలు శివబాబా మధుర జ్ఞాన మురళిని వినడానికి వచ్చేవారు. బాబా నిత్యం నూతన, గుహ్యమైన, రమణీయమైన జ్ఞాన రత్నాలు జిజ్ఞాసువులకు వినిపించేవారు. వారినుండి వచ్చే ఓజస్సుతో అందరూ స్వయాన్ని తేలికగా అనుభవం చేసుకున్నారు. వారి మనో భారాలన్నీ తొలగిపోయి తేలికగా అయిపోయినట్లుగా అనిపించేది. మనసు స్థిరంగా, ఉపరామంగా, ప్రశాంతంగా ఉంది. కోరికలు అనే కాగితం పులులు మాడి మసి అయిపోయాయి. జీవితంలోని ముఖ్య స్థానంలోకి వారు ప్రవేశించారు. "ఆహా! ఇది ఎప్పటికీ ఇలాగే ఉండాలి. పవిత్రమైన ఉన్నతమైన స్థానంనుండి అసలు ఎందుకు క్రిందకు వచ్చాను నేను?! భగవంతుడిచ్చే జ్ఞానామృతంతో సరి తూగగలిగింది మరేదీ లేదు!" అని జిజ్ఞాసువులు అనుకునేవారు.

నిజానికి, ఇటువంటి పరమానందాన్ని ప్రపంచంలోని ప్రతి వ్యక్తీ పొందవచ్చు. అందుకు అతడు ఇల్లువాకిలి వదిలి అడవులకు, గుహలకు వెళ్ళనవసరం లేదు. బాబా ఒకసారి తమ దివ్య ప్రవచనాలలో ఇలా అన్నారు, 'కర్మ సన్యాసులు తమ ఇల్లు, బాధ్యతలను విడిచి అడవులలో నివసిస్తూ ఉంటారు ఎందుకంటే గృహస్థంలో ఉంటూ స్త్రీ సహవాసంలో ఉంటూ కామ వికారాన్ని జయించడం అసాధ్యమని భావిస్తారు. కానీ ఇది నిజం కాదు. భగవంతుని జ్ఞానామృతాన్ని రుచి చూసినవారు విషయ సుఖాల కోసం దానిని ఎట్టి పరిస్థితిల్లోనూ విడిచిపెట్టరు. మనం క్రొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నాము – పారిపోవడం లేదు. మీరు గృహస్థంలో ఉంటూనే యోగశక్తితో మీ జీవితాన్ని పవిత్రంగా చేసుకోవాలి."

బాబా ఇంకా అన్నారు, "ఈ ప్రపంచంలో ఉంటూనే మీరు పవిత్రులుగా అవ్వండి. అప్పుడు ఈ జనలు మీకు జోహారు పలుకుతారు. భగవంతుడు శుద్ధమైన ప్రవృత్తి మార్గాన్ని స్థాపించడానికి వచ్చారు. ఇల్లు వాకిళ్ళనుండి దూరంగా తీసుకువెళ్ళడానికి రాలేదు. ఇంటిని స్వర్గంలా మార్చడానికి వచ్చారు. ఏ పరమ్మాతనైతే మీరు 'హే పరమాత్మా! ఇప్పుడు

మీరు వచ్చి పతితులైన మమ్మల్ని పావనంగా చెయ్యండి' అని పిలిచారో ఆ భగవంతుడు మీ మొర ఆలకించి చివరకు ఈ భూమి మీదకు దిగి వచ్చారు. ఇప్పుడు ఈ వికారాలను విడిచిపెట్టండి. అశుద్ధ కార్యాలకు స్వస్తి చెప్పండి. మీరు ఆత్మలు. సృష్టి ఆరంభంలో మీరు పవిత్రులుగా ఉన్నారు. కావున మీ స్వధర్మము పవిత్రత. మీ స్వధర్మంలో స్థితులవ్వడానికి కష్టంగా ఎందుకుంది? ఆత్మిక స్థితిలో ఉండనంత వరకు అది వీలు కాదు. కనుక, స్వయాన్ని ఆత్మగా భావించి ఒక్క తండ్రిని మాత్రమే గుర్తు చెయ్యండి. అప్పుడు పవిత్రంగా ఉండేందుకు అవసరమైన శక్తి మీకు పరమాత్మ నుండి స్వతహాగా లభిస్తుంది.'

# కుమార్తెల విజయము

యజ్ఞం ఆరంభంలో అధిక సంఖ్యలో మహిళలే ఉండటం అనుకోకుండా జరిగిందా? మహిళలనే భగవంతుడు ఈ సంస్థకు అధిపతులుగా ఎందుకు పెట్టారు? నిజానికి, భగవంతుడు ఏదీ కారణం లేకుండా చెయ్యడు. దీనివెనుక ఎన్నో కారణాలను మనం ఊహించవచ్చు. ఒకటి, భౌతిక భద్రత. ఒకవేళ సోదరులు ప్రపంచంలో ఈశ్వరీయ సందేశాన్ని అందించడానికి వెళ్ళి ఉంటే వారిపై దాడి జరిగి ఉండేది. యుక్త వయస్సులో ఉన్న కన్యల నోటి నుండి వచ్చే జ్ఞానము కొంత ఆలోచనను రేకెత్తించిందనే చెప్పాలి. బాబా శత్రువులు కూడా ఈ కన్యలను చూసి కొంచెం వెనక్కు తగ్గిన సందర్భాలూ లేకపోలేదు.

సోదరులు ముందు ఉంటే ఎంత వైరుధ్యము ఎదుర్కోవలసి వచ్చేదని ఖచ్చితంగా చెప్పలేము కానీ అది జరిగి ఉండేది. ఎందుకంటే భగవంతుడు సత్య విషయాలను వినిపిస్తారు. ప్రస్తుత భారతదేశము ఎంతటి దయనీయ పరిస్థితిలో ఉంది, మానవుని జీవితము ఎంత దుర్భరంగా మారింది, అవినీతి ఎంతగా పెరిగిపోయింది అన్నీ బాబా వివరిస్తారు. నిజమెప్పుడూ చేదుగా ఉంటుంది.

అంతేగాక, బాబా తన పిల్లలను పవిత్రంగా ఉండమని చెప్పడం వలన – చరిత్రలో ఇప్పటివరకు ఏ ధర్మమూ తీసుకురాని గొప్ప మార్పును బాబా తీసుకువచ్చే ప్రయత్నంలో – వికారాలకు వశమై, అది లేకపోతే జీవితంలో అర్థమే లేదనుకుంటున్న మనల్ని శరీరాలుగా కాక ఆత్మలుగా చూసుకోమని బాబా చెప్పాడు. అసత్యమైన అహంకారంలో పడి కొట్టుమిట్టాడుతున్న ఆత్మను అహంకారాన్ని త్యజించమన్నాడు. స్త్రీకన్నా పురుషుని అహంకారం మరింత భయంకరమైనదన్నాడు.

అన్నిటికన్నా ముఖ్యంగా, శివబాబా తన ఉనికి ద్వారా ప్రపంచంలోని ప్రతి గురువునూ సవాలు చేసారు – విద్వాంసులు, పూజారులు, సిద్ధాంతపరులు, వైజ్ఞానికులు ఇలా ప్రపంచంలోని అందరినీ బాబా సవాలు చేస్తూ తాను సర్వశక్తిమంతుడనని చెప్పుకున్నారు.

వారు కేవలం మహాన్ ఆత్మ మాత్రమే కాదు. వారు పరమాత్మ, వారొక భగవంతుడు. ఇప్పటి వరకు ఈ సత్యాన్ని ఎవ్వరూ చెప్పలేదు. భగవంతుడు సర్వవ్యాపి అని చెప్తున్న గురువులు తామే భగవంతుని స్వరూపులుగా చెప్పుకుంటున్నారు. వారందరూ చెప్పింది తప్పేనా? భారతీయ శాస్త్రాలన్నిటినీ తీసి పారేయవలసిందేనా? ఇటువంటి విషయాన్ని అందరికీ చెప్పడానికి ఎవరు సాహసం చేస్తారు? ఒక కన్య, ప్రశాంతంగా కూర్చుని శ్వేత వస్త్రాలతో తియ్యతియ్యగా మాట్లాడుతూ ఉంటే అందరూ ఆశ్చర్యపోయి చూడవలసిందే.

శివబాబా ప్రపంచంలోకెల్లా అందరికన్నా సౌజన్యమూర్తి. కానీ ఇప్పుడు వారిని యథార్థంగా తెలుసుకోవాలి. యజ్ఞ వత్సలంతా తమ జీవితాలలో అతి కీలకమైన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకంజ వేయడం లేదు. ఒకవేళ శివబాబా భగవంతుడే అయితే ఆత్మలు వారిపై బలిహారం కావలసిందే. ఒకవేళ శివబాబా భగవంతుడు కాకపోతే తనను తాను భగవంతుడిగా చెప్పుకుని బాబా చాలా పెద్ద పాపం చేస్తున్నాడు. కావున భగవంతుని అవతరణ మానవాళిని రెండు వర్గాలుగా చేసింది – భగవంతుని ప్రియులు, నిశ్చయబుద్ధులు మరియు భగవంతునిపై సంశయం కలిగినవారు, సంశయబుద్ధులు.

అనేక సందర్భాలలో శివబాబా తన సంతానమైన క్రీస్తు గురించి ప్రస్తావిస్తూ ఉంటారు. క్రీస్తు తన పాత్రను సంపూర్ణ పవిత్రతో చేసారు. జ్యోతి స్వరూపుడైన తన తండ్రిలోని సుగుణాలను క్రీస్తు తనలో ఇముడ్చుకున్నాడు. 'ఆ ఒక్క భగవంతుడినే అందరూ ప్రార్థించండి' అని అతని ధర్మస్థులకు కూడా క్రీస్తు చెప్పేవాడు. క్రీస్తు పాత్రకు, బాబా పాత్రకు తేడా ఉంది. క్రీస్తు ఒక ధర్మ స్థాపకుడిగా క్రీస్తు ధర్మాన్ని స్థాపించి ఆత్మల లోకంలో ఉన్న ఆ ధర్మాన్ని చెందిన మరిన్ని

ఆత్మలను క్రిందకు తీసుకువచ్చి వారివారి పాత్రలను పోషింపజేసారు. ఎలాగైతే శివబాబా బ్రహ్మ తనువును ఆధారంగా చేసుకుని వారి శరీరంలో ప్రవేశించారో అదే విధంగా ఏసు శరీరంలో క్రీస్తు ప్రవేశించారు. శిలువపై బాధలు పడ్డది ఏసుయే కానీ క్రీస్తు కాదు. ఆ పవిత్రమైన సంతానం ఎప్పుడో శరీరాన్ని విడిచి మరోచోట జన్మ తీసుకుని తన ధర్మానికి అవసరమైన మార్గదర్శనను ఇవ్వడానికి పూనుకుంది. క్రీస్తు మరియు ఇతర ధర్మ స్థాపకుల గురించిన అనేక రహస్యాలను శివబాబా విశదీకరించారు.

చరిత్ర ప్రకారంగా, ధర్మ విషయాలలోకానీ, ప్రాపంచిక విషయాలలోకానీ పురుషులు స్త్రీలను ఎంతో అణగార్చారు. అటువంటి స్థితిని మార్చడానికి బాబా వచ్చారు. అందుకే తన యజ్ఞ సంభాళనను యోగ్యులైన మహిళల చేతిలో పెట్టారు. ఇది కుమార్తెల విజయము. పాత్రలలో ఇటువంటి మార్పు బాబా పిల్లల్లో ఎంతో పరివర్తనను తీసుకువచ్చింది. మహిళలు ముందుండగా పురుషులు ఎంతో సహకార భావంతో వెన్నెముకగా నిలిచారు. పరస్పర గౌరవ భావాలు వెల్లువెత్తాయి. పవిత్రత అతి సహజంగా నెలకొన్నది.

కుమార్తెలు ప్రసంగాలు చెయ్యడము నేర్చుకున్నారు. గద్దెపై (గురువు ఆసనంపై) కూర్చుని రాజయోగాన్ని నేర్పించారు. విశ్వవ్యాప్తంగా ఉన్న సేవాకేంద్రాలలో సోదరీలకు భగవంతుని మురళిని చదివి వినిపించే అధికారాన్ని ఇవ్వబడింది. సూక్ష్మలోకంలోని బాబా వద్దకు వెళ్ళి సందేశాలను తీసుకువచ్చేది సందేశి పుత్రికలే.

ఈ మహిళలు అనేక ప్రతికూల సంఘటనలను ఎదుర్కొని సహనాన్ని ఆభరణంగా ధరించారు. అందరూ పొగుడుతూ ఉంటే పొగడ్తలకు ప్రభావితం కాకుండా ఉండటాన్ని కూడా నేర్చుకున్నారు. ఇది ఇంకా కష్టమైన పని. వారి కార్యదక్షత ఎంత అద్భుతంగా ఉందంటే 5,000 సంవత్సరాల క్రితం వారు చేసిన ఈ మహత్కార్యానికి గుర్తుగా ఎన్నో స్మృతిచిహ్నాలు వెలిసాయి. వారిని దేవతలుగా, శక్తులుగా పూజిస్తున్నారు.

పూర్వం, విగ్రహారాధన చేసేవారి ఆచారాలలో కన్యలను బలివ్వడం ఒక ఆచారంగా ఉండేది. ఇప్పుడు సంగమయుగంలో మహిళలు చేసిన బలిదానానికి గుర్తుగా ఈ కన్యల బలిదానం జరుగుతుంది.

పాశ్చాత్య దేశాలలో కూడా, ఆచారాలపై విలువ ఉన్న మహిళలు ఎంతోమంది మానవీయ విలువలను కాపాడుతూ వచ్చారు. పవిత్రత, పాతివ్రత్యము, వినయము వారి ముఖ్య గుణాలుగా ఉండేవి. కానీ కాలం మారుతున్నకొద్దీ స్త్రీ కూడా కామ వికారమనే ఊబిలో పడిపోయి తనలోని విలువలను కోల్పోయింది. ఈరోజుల్లో కామమును ఒక వికారముగా కూడా పరిగణించడం లేదు. మనిషి ఎంతగా దిగజారిపోయాడన్న దానికి ఇదే నిదర్శనము. ఇప్పుడు మళ్ళీ మహిళలే పూనుకుని విలువలను తిరిగి తీసుకువచ్చే ప్రయత్నంలో పడ్డారు.

సోదరులు కూడా ఎంతో గొప్ప మనసుతో సహకరించారు. అందుకే వారి కర్తవ్యానికి గుర్తుగా వారిని కూడా శాస్త్రాలలో కొనియాడారు. వారు తమలోని దుర్గుణాలతో కోతివలె చంచలమైన మనసును కలిగి వాటిని త్యజించిన కారణంగా భగవంతుడిని సేవించుకున్న హనుమంతుని రూపంలో గుర్తిస్తాము. దుష్టుడైన రావణుడిని సంహరించడానికి భగవంతుడికి వానర సైన్యం నుండి సహాయాన్ని తీసుకోవలసి వచ్చింది. మహాభారతంలో పంచ పాండవుల వ్యాఖ్యానం ఉంది. వారు కొద్దిమందే అయినాగానీ వారు తమ శత్రువులను భగవంతుని సహాయంతో జయించారు. ఇప్పుడు సంగమయుగంలో నిజమైన పాండవులు వికారాలనే సైన్యాన్ని జయించి తద్వారా విశ్వాన్ని పరివర్తన చేస్తున్నారు.

ఒక సోదరుడు బాబా జ్ఞానాన్ని తెలుసుకున్న తర్వాత వివాహము చేసుకోనని ఇంట్లో చెప్పేసాడు. అది నచ్చని ఇంట్లోనివారు అతడిని ఎలుకలు తిరిగే గదిలో ఎన్నో రోజులు బంధించారు. కానీ ఆ సోదరుడు మాత్రం తన మనసును మార్చుకోకుండా దృఢంగా ఉన్నాడు.

ఒక చిన్న గ్రామంలో ఉండే మరొక సోదరుడు జ్ఞానాన్ని వినిపించాడని స్థానికులు అతడిని అందరి ముందు ఎంతో హింసించారు. అతడి చేతులను కట్టివేసి, కళ్ళకు గంతలు కట్టి గాడిద వెనుక కట్టేసారు. అతడి ముఖమంతా

నల్లగా చేసి ఆ గ్రామంలో అతడి పరువును తీసారు. ఎన్ని జరుగుతున్నా కానీ శివబాబా తన పిల్లలతోటే ఉంటారు కదా. శివబాబా స్మృతిలో ఆ సోదరుడు ఉన్నాడు. కళ్ళకు కట్టిన గంతలు తీసిన తర్వాత కూడా ఆ సోదరుడు చిరునవ్వుతోనే ఉన్నాడు.

నిర్వైర్ అనే సోదరుడు, యజ్ఞానికి ఆదిరత్నం అయిన ఆ సోదరుడు సిక్కు ధర్మస్థుడిగా పెరిగారు. వారు బాబాను గుర్తించిన సమయంలో నౌకా దళంలో ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. అటువంటి హింసాత్మక జీవితంనుండి వారు దూరమవ్వాలనుకున్నారు. కానీ అందుకు వారికి అనుమతి లభించలేదు. ఆ సమయంలో సరిహద్దులో యుద్ధం జరుగుతుంది. వీరిని ముందుండి అన్నీ చూసుకోమన్నారు. వెళ్ళేముందు, బాబా ఆ సోదరునితో అన్నారు, 'ఏమీ అవ్వదు, మీకేమీ కాదు.'

నిర్వైర్ సోదరునికి బాబాపై అచంచలమైన విశ్వాసము. యుద్ధ సమయంలో ఒకసారి వారు ఒకవైపుకు వంగి ఉంటే వారి ప్రక్కనుండే బుల్లెట్ల వర్షం కురిసింది కానీ ఒక్కటీ వారిని తాకలేదు. నిర్వైర్ సోదరునికి కొంతకాలం తర్వాత ఆ ఉద్యోగం నుండి విముక్తి లభించింది. ఇంతమంచి ఉద్యోగాన్ని వదులుకుంటున్నందుకు వారి ఆఫీసర్లు వీరిని పిచ్చివాడిలా చూసారు.

---

శివబాబా పిల్లలుగా, విశ్వంలోని వారందరూ ఆత్మ రూపంలో సోదరులే. ఆత్మ శరీరంలోకి ప్రవేశించిన తర్వాతనే వారిని స్త్రీ అని, పురుషుడని గుర్తించడం జరుగుతుంది. జన్మజన్మలలో మనం ఈ స్త్రీ పురుష వస్త్రాలను ధరిస్తూనే ఉంటాము.

శివబాబాను పురుషునిగా సంభోదించినప్పటికీ, ఒక్క శివబాబా మాత్రమే జనన మరణ రహితుడు కనుక వారిని స్త్రీయని, పురుషుడనీ కానీ చెప్పలేము. అందుకే శివబాబా అంటారు నేనే మీ తల్లిని, తండ్రిని కూడా. కొన్నిసార్లు నేను మీ అందరికీ పతిని, పతులకే పతిని అని అంటారు. ఆత్మ శివ బాబాను సంతోషంగా పతిగా భావిస్తుంది.

గతంలో, ధర్మ సంబంధిత కార్యక్రమాలన్నీ పురుషులే చేపట్టేవారు. పూజారులు, మత నాయకులు, గురువులు, సన్యాసులు, పోప్ , అందరూ పురుషులే. అనుకోకుండా బాబా పుత్రికలు తయారై వందలాదిగా ఉన్నవారు వేలాది సంఖ్యలోకి మారి ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడుతూఉంటే అది అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. శక్తిశాలి మహిళలు మొదటిసారిగా ధైర్యంగా నిల్చుని ఉన్నతమైన భగవంతుని శిక్షణలను బోధిస్తూ భగవంతుని సహకారంతో సేవా కార్యక్రమాలు ఆరంభించారు.

భారతీయ శాస్త్రాలలో శ్రీకృష్ణుడికి పదహారు వేలమంది పట్టపురాణులు అని అంటారు. నిజానికి అది ఒక దేహధారిని ఉద్దేశించి చెప్పినది కాదు. జ్యోతి స్వరూపుడైన శివ పరమాత్మ వైపుకు శక్తులు, మాతలు ఆకర్షితమవడాన్ని శాస్త్రాలలో ఈ విధంగా చూపించారు. వారిని భగవంతుడు యోగ్యులుగా తీర్చిదిద్ది భవిష్యత్తులో మహారాణులుగా చేస్తున్నారు.

ఈ పవిత్రమైన కుమార్తెల ద్వారా సమతుల్య జీవితాన్ని, సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు.

# భాగము 5
# భగవంతుని మహా వాక్యాలు

## భగవంతుని మహావాక్యాలు

బాబా అంటారు,

"జన్మజన్మల నుండి భౌతిక కోరికల కారణంగా మనిషి దుఃఖంలో మునిగిపోయి ఉన్నాడు. ఇది మంచిదేనా? వీటి వల్ల దుఃఖాన్ని పొందుతున్నప్పుడు వాటిని వదలడం ఎందుకు కష్టమనిపిస్తుంది? మీ ఇళ్ళలోని దుమ్మును తీసేస్తారు కదా. ఈ వికారాలనే మట్టిని మీ మనసులో ఎందుకు పెట్టుకుంటారు! ఈ వికారాలు ఏమైనా ఒక పెద్ద ఖజానానా? పిల్లలూ! ఇటువంటివన్నీ నాకిచ్చేయండి. అప్పుడు నేను స్వర్గాన్ని మీ అరచేతుల్లో పెడ్తాను. పిల్లలూ! మీనుండి నాకింకేమీ వద్దు. మీరు కేవలం మీలోని మలినాలను ఇస్తే చాలు. వాటిని పట్టుకుని కూర్చోవద్దు. ఒకప్పుడు స్వర్గంలా ఉన్న ప్రపంచం ఇప్పుడు నరకమయంగా అయింది..."

శివబాబా జ్ఞానమురళి ప్రారంభమయింది. కానీ ఇంకా అజ్ఞానంలో ఉన్నవారు శ్రీకృష్ణుడే వెదురుతో చేసిన మురళిని వాయించాడని అంటారు. భగవంతుని జ్ఞానమురళిలోని మహత్వాన్ని వారు గుర్తించలేకపోతున్నారు. అందుకే ప్రజలింకా భగవంతుడిని వెతుకుతూనే ఉన్నారు. భగవంతుడి అవతరణ జరిగినాగానీ ఇంకా వారిని వెతుకుతూనే ఉన్నారు. వారు ఒక సాధారణ వృద్ధ మానవుని తనువులో అవతరించి నూతన సృష్టిని పునఃస్థాపించడము అనే తన మహా కర్తవ్యాన్ని ప్రారంభించారు. బ్రహ్మబాబా ఆ నూతన సృష్టిలో శ్రీకృష్ణునిగా పునర్జన్మ తీసుకుంటారు. అందుకే శ్రీకృష్ణుడిని భగవంతుడిగా భావిస్తూ పొరపాటు చేస్తున్నారు.

భగవంతుని మహావాక్యాల గురించి ఒకరు ఈ విధంగా వ్రాసారు –

భగవంతుని మహావాక్యాలు
ఈ మధురమైన మహావాక్యాలలో,
ప్రపంచ సత్యాలన్నీ ఇమిడి ఉన్నాయి.
మనసులోని శక్తి మరోసారి జాగృతి అయింది
సర్వాత్మల తండ్రి వాక్కులో
ఎంతో అంతరార్థాలు దాగి ఉన్నాయి
జన్మజన్మలు మానవాళి చేసిన ఎదురుచూపులకు
ఇప్పుడు సమాధానం లభించింది

బుద్ధి ఉన్నతంగా ఎదిగింది
పవిత్ర ఆలోచనలు కలిగిన శివబాబా
పెద్ద మనసును ఇచ్చాడు
మనసులోని అనేక భ్రమల భారము తగ్గింది
ఆత్మ ఆనందాల ఊయలలో ఊగింది

*పరమాత్ముని వాక్కులతో నిండింది.*

ఎంతోమంది బాబాను ఇలా అడిగేవారు, "బాబా, అసలు ఈ సృష్టి ఎందుకు ఉంది?" బాబా అన్నారు, "అది మనకు సంతోషాన్ని కలిగించడానికి ఉంది. నా పిల్లలు మళ్ళీ కష్టాలలో కొట్టుకుపోతూ ఉంటే నేను మళ్ళీ అవతరించి నా పిల్లలను కాపాడుతాను. బాబా అతి పెద్ద మనో వైజ్ఞానికుడు. కష్టతరంగా ఉన్న మానవుని ఆలోచనా విధానాన్ని మరోసారి సరళంగా చేసి మనసులోని అనవసర భయాలను నిర్మూలిస్తారు.

గంభీరంగా ఉండే విద్వాంసులు బాబా వద్దకు వచ్చి సంతోషంతో గీతాలను ఆలపించేవారు. వృద్ధులు యువకులుగా అయ్యి ఆనందంతో నాట్యం చేసేవారు. మునుపెన్నడూ కవిత్వాన్ని వ్రాయనివారు భగవంతుని కలుసుకున్న మహా అనుభూతితో కలం పట్టుకుని పద్యాలను వ్రాసారు. ఈ కవిత్వం నిరాశ, ప్రశ్నలకు సంబంధించినది కాదు, అంతిమ విజయానికి తార్కాణము.

*నేను విమానం ఎక్కాను*
*నేను ప్రపంచపు అంచులు దాటి వెళ్తున్నాను*
*ఆకర్షణ తగ్గిపోతుంది*
*మబ్బులను కూడా దాటి వెళ్తున్నాను*
*అక్కడంతా స్వచ్ఛంగా, నిశ్శబ్దంగా ఉంది*
*అతీంద్రియ ఆనందము.*

*జ్ఞాన సూర్యుడు నా ఎదుట ప్రకాశించాడు*
*అన్ని సమస్యలు తీరిపోయాయి*
*ప్రేమాంబుధిలో ఈదుతున్నాను*
*నేను భగవంతుని సమీపంగా వెళ్తున్నాను*

ఎవరు వీటిని వ్రాస్తున్నారు, ఎవరు పాడుతున్నారు, ఎవరు ఇంత చిద్విలాసంగా ఉంటున్నారు? సామాన్య జనులు, సాంప్రదాయులు, వకీళ్ళు, డాక్టర్లు, వ్యాపారవేత్తలు, ఇంజినీర్లు, వైజ్ఞానికులు భగవంతుని మహావాక్యాలను విని వారి ముఖాలలో చిరునవ్వును నింపుకున్నారు. వారి స్నేహితులకు కూడా "భగవంతుని దివ్య అవతరణ" గురించి వివరించేవారు.

బాబా నావారు. వారు అత్యుత్తమ శక్తి. ప్రపంచంలోని భౌతిక శక్తులన్నీ ఖర్చయిపోయినాగానీ బాబా శక్తి మాత్రం అవినాశిగా నిలిచి ఉంటుంది. ఎన్ని అలజడులలో కూడా బాబా ఒక అవినాశి కాగడా వలె నిలిచి ఉండి ఇలా అంటారు, "పిల్లలూ! రండి, నా ఒడిలో కూర్చోండి."

పిల్లలు ఆ జ్యోతి స్వరూపుని హృదయపు ఒడిలో కూర్చోవడానికి పరుగులు తీసేవారు.

# విశ్వ నవ నిర్మాణము

బాబా పిల్లలు ఈశ్వరీయ జ్ఞానాన్ని వ్రాత పూర్వకంగా పెట్టుకుని చదువుకోవాలని తపించారు. రాజయోగ విధానముపై వారికి పుస్తకాలు కావాలి. భౌగోళంలో, కాల పరిమితిలో, మెదడుకు సంబంధించిన వివరణలో విజ్ఞానము ఎలా తప్పుత్రోవ పట్టిందో తెలిపే సాహిత్యము ఇప్పుడు పిల్లలకు కావాలి.

నీతికి సంబంధించిన సాహిత్యము, చెడు అలవాట్లను తొలగించడానికి అవసరమైన ఉపాయాలు తెలిపే ఈశ్వరీయ జ్ఞానం కావాలి. నూతన జ్ఞానము ద్వారా శివబాబా అన్ని సమస్యలకు జ్ఞానపరంగా  సమాధానాలను ఇచ్చారు. కేవలం, అవసరమైన జ్ఞానాన్ని అనువైన చోట ఉపయోగించడం మాత్రమే ఇందులో అవసరం.

మాస పత్రికను ప్రచురించవలసిందిగా బాబా సూచించారు. అందుకే 'త్రిమూర్తి' అన్న పేరుతో ఒక పత్రికను ప్రారంభించారు. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, శంకరులకు అధిపతి శివబాబా కనుక త్రిమూర్తి అన్న పేరును పెట్టడం జరిగింది.

ఆ తర్వాత, 'వరల్డ్ రెన్యూవల్' అనే మరో మాస పత్రిక ప్రచురణ జరిగింది. తెలుగులో 'జ్ఞానామృతం' అనే మాసపత్రిక ప్రారంభమయింది. ఇవి అనేక భాషలలో, విశ్వ వ్యాప్తంగా ప్రచురింపబడుతున్నాయి. పర్యావరణ కాలుష్యానికి ఆధ్యాత్మిక కారణాలు, నివారణలు వంటి అంశాలతో ఈ పత్రిక ప్రచురితమవుతుంది.

వాతావరణంలో సంక్షోభం మొదలైంది. కొద్దిగా శ్రమిస్తే ఆ వాస్తవాన్ని అందరికీ అర్థం చేయించవచ్చు. ఇప్పటికే ఎంతో అవగాహన దీనిపై ఇస్తున్నారు.

ఒకప్పటి సత్యయుగములో ప్రకృతి సతోప్రధానంగా ఉండేది. ప్రకృతి వైపరీత్యాలు ఉండేవి కావు. ఇది కల కాదు. కానీ నిజం కాబోతున్న వాస్తవం. అటువంటి ప్రపంచంలోకి వెళ్ళే అధికారము మనకందరికీ ఉంది. మనం చెయ్యాల్సిందల్లా మళ్ళీ మన ఆత్మిక తండ్రిలా అవ్వడమే. ఇదే రాజయోగము. విశ్వ పరివర్తనకు ఇదే మూలం.

# భగవంతునితో కలయిక

పరమాత్మతో మనసును లగ్నం చేసే విధానాన్ని స్వయంగా భగవంతుడే వివరించారు. ఈ రాజయోగంలో మధ్యవర్తుల అవసరమేమీ లేదు... ప్రతి ఒక్కరూ స్వయంగా, నేరుగా పరమాత్మను తమ మనసు ద్వారా చేరుకోవచ్చు... ఆత్మ పరమాత్మతో కలయిక జరుపుకోవడమే రాజయోగము.

**మెడిటేషన్ చేయు విధానము –** నేను రాజయోగము చేసేటప్పుడు మంత్రాన్ని జపించనవసరం లేదు, చేతిలో మాలను పట్టుకోనవసరం లేదు. నేను విగ్రహాలను చూడాల్సిన అవసరం లేదు. నేను చెయ్యవలసిందల్లా అమితమైన ప్రేమతో నా బుద్ధిని పరమాత్మయందు సంలగ్నం చెయ్యడమే. ఒక విధంగా చూస్తే ఇది అన్ని యోగాలలోకీ సహజమైన యోగము. భౌతికమైనవేవీ ఇందులో ఉండవు. నేను ఆసనాలు వేయనవసరం లేదు, ప్రాణాయామాలు చేయనవసరం లేదు. ఇది నిజంగా చాలా సులువైన పద్ధతి. నేను చెయ్యవలసిందల్లా ఒక చోట అనుకూలమైన స్థానంలో కూర్చుని, లేదా నిల్చున్నప్పుడు, లేదా కర్మలు చేస్తున్నప్పుడు, ఏమి చేస్తున్నాకానీ నా మనసు శివ పరమాత్మ తలంపులో ఉండాలి. కనుక, రాజయోగానికి కావలసింది  మనసును ఏకాగ్రతతో, స్థిరత్వంతో పరమాత్మయందు నిలపడమే.

ప్రస్తుత సమయానుసారంగా, రాజయోగ అభ్యాసం కొరకు పరమాత్మ రెండు ముఖ్య విషయాలను అర్థం చేయిస్తున్నారు. మొదటిది, 'నేను ఎవరిని?'

'నేను' మరియు 'పరమాత్మ'

'నేను' సూక్ష్మమైన బిందువును. 'నేను' కనిపిస్తున్న ఈ స్థూల శరీరమును కాను. 'నేను' ఒక ప్రకాశమును, మెరిసే నక్షత్రాన్ని, బిందువును. 'నేను' ఆత్మను. భృకుటి మధ్య స్థానంలో ఉన్నాను. ఇప్పుడు నేను ఈ ఆత్మిక స్థితిలో కూర్చుంటాను. ఆత్మయే జీవశక్తి, ఈ మానవ శరీరమనే యంత్రాన్ని నియంత్రించేది, నడిపించేది, మార్గదర్శన చేసేది, ఉత్తేజపరిచేది ఆత్మయే.

నన్ను నేను తెలుసుకున్నప్పుడు, ఈ శరీరం నుండి వేరుగా ఉన్నాను అని అర్థం చేసుకున్నప్పుడు ఈ స్థితిని ఆత్మిక స్థితి అని అంటారు. అప్పుడు నేను పరమాత్మ ఉనికిని అర్థం చేసుకోగలను. నా తండ్రి, పరమాత్మ కూడా జ్యోతి స్వరూపుడే. ఇప్పుడు నా ఆలోచనలన్నిటినీ నేను పరమాత్మపై కేంద్రీకరిస్తున్నాను. వారు అతిసూక్ష్మమైనవారు, బిందు స్వరూపుడు. ఈ బిందువులోనే అపారమైన గుణసంపద ఉంది. వీరు రూపములో బిందువు, గుణాలలో సింధువు.

ఆ పరంజ్యోతితో కలయిక జరుపుకోవడమే రాజయోగ లక్ష్యము. ఎన్నో సంవత్సరాల నుండి, ఎన్నో జన్మల నుండి మానవ మాత్రులతో నా బంధం ఏర్పడి ఉంది. ఆత్మ శరీరంలో ఉంది. కనుక ఆత్మ శరీరాన్ని తన కర్మలకు ఉపయోగిస్తుంది. కానీ ఇప్పుడు నేను అశరీరి అయిన పరమాత్మతో కలయిక జరుపుకోవాలనుకున్నప్పుడు నా ఈ భౌతిక ఇంద్రియాలు నాకు సహకరించలేవు. నిజానికి, ఈ భౌతిక శరీరానికి దూరంగా నేను నా స్మృతిని తీసుకువెళ్ళినప్పుడే పరమత్ముని స్మృతి నాలో కలుగుతుంది.

**నేను ఆత్మను** అన్న సత్యాన్ని గ్రహించినప్పుడు నాలోని అపారమైన శక్తిని నేను గుర్తించగలుగుతాను. నాలో సంకల్ప శక్తి ఉంది. నా సంకల్పాలను శాసించగల శక్తి నాలో ఉంది. నా ఆలోచనా ప్రవాహానికి ఒక దిశను నిర్దేశించి వాటిని పరమాత్మ వైపుకు పయనింప చేయగల శక్తి నాలో ఉంది. నా ఆత్మ శక్తిని, నాలోని అమితమైన శక్తిని నేను అనుభవం చెయ్యాలి.

నా మనసు ఇతర భౌతిక పదార్థాలనుండి దూరంగా పెట్టుకుంటున్నాను. నేను గతాన్ని మర్చిపోతున్నాను, నేను చేసిన పొరపాట్లు, నేను పొందిన విజయాలను అన్నిటినీ మర్చిపోతున్నాను. ఈ క్షణం నేను మానవ మాత్రుల సంబంధాల గురించి ఆసక్తిగా లేను. సాధువులు, గురువులు ఎవ్వరూ నాకు గుర్తుకు రావడం లేదు. ఆత్మ కేవలం ఒక్క పరమ్మాతనే

గుర్తు చేస్తుంది. నేను పరమాత్ముని స్వరూపాన్ని చూస్తున్నాను. నా మనో ఫలకంపై భగవంతుని జ్యోతి స్వరూపం కనిపిస్తుంది. ఆ దివ్యమూర్తినుండి వెలువడుతున్న గుణాలను నేను అనుభవం చేసుకుంటున్నాను. అనంతమైన శాంతి, అచంచలమైన శాంతి, ప్రశాంతత...

**సర్వోన్నత సంబంధం**

నా తండ్రియైన పరమాత్మనుండి వెలువడుతున్న ప్రశాంత కిరణాలవైపే నా మనసు ఏకాగ్రమై ఉంది. శివ పరమాత్మ కేవలం నా తండ్రి మాత్రమే కాదు, నా తల్లి కూడా. కావున, పరమాత్మ నుండి అనంతమైన ప్రేమను కూడా నేను అనుభవం చేస్తున్నాను. భగవంతుడు ఎంత ప్రేమసాగరుడంటే వారు ఎటువంటి ఆత్మనూ తిరస్కరించరు. వర్తమాన కలియుగ ప్రపంచంలో ఆత్మ యొక్క దుస్థితి, ఆత్మలోని వికారాలు, మలినము, కల్మషము అన్నిటినీ చూస్తూ కూడా పరమాత్మ ఒక తల్లివలె తన ప్రేమనంతా ఆత్మలకు అందిస్తున్నారు. నేను ఆ ప్రేమ సాగరుని ప్రేమను అనుభవం చేసుకుంటున్నాను.

నా మనసులో వస్తున్న ఇతర ఆలోచనలను నేను అడ్డుకోవలసిన అవసరం లేదు. కేవలం, సౌమ్యంగా, వాటి దిశను మార్చి పరమాత్మ వైపుకు పంపించాలి. రాజయోగములో ఇది చాలా ముఖ్యమైన అంశము. ఒక్కసారి బుద్ధిలో పరమాత్మ జ్ఞానం నిండుకున్నప్పుడు వెలువడే ఆలోచనలు ఈ అవగాహన ఆధారంగానే ఉంటాయి. ఇతర వ్యర్థమైన ఆలోచనలు నా శక్తిశాలీ ఆలోచనలను కప్పివేస్తే నేను నిదానంగా నా మనసు యొక్క దిశను మార్చి వాటిని పరమాత్మ వైపుకు మళ్ళిస్తాను.

కొన్నిసార్లు, నేను నా మనసును పవిత్రతా శక్తిపై ఏకాగ్రం చేస్తాను. పరమాత్మ సాన్నిధ్యంలో కలిగే పరమానందాన్ని అనుభవం చేసుకుంటాను. ఏ గుణాన్ని అనుభవం చేయాలనుకుంటానో దానిని ముందుగా నా మనసులో నింపుకుంటాను. ఈ విధంగా ఆత్మ ప్రతి గుణాన్ని, భగవంతునితో ప్రతి సంబంధాన్ని రుచి చూస్తుంది. భగవంతుడు కేవలం నాకు తండ్రి మాత్రమే కాదు, వారు నాకు తల్లి, తండ్రి, శిక్షకుడు, గురువు, స్నేహితుడు, సహచరుడు.

రాజయోగానికి ఆధారము ఈశ్వరీయ జ్ఞానము. జ్ఞానమును పొందిన ఆత్మనుండి వచ్చే ఆలోచనలు పరమాత్మ వైపుకే సహజంగా పయనిస్తాయి. ఈ భౌతిక కార్యాలకు దూరంగా ఆ ఆలోచనలు ఉంటాయి. ఎన్నో ఎన్నెన్నో ఆలోచనలు మనసులో వస్తూనే ఉంటాయి అంటే మనసు ఎప్పుడూ నిస్సంకల్ప స్థితిలో ఉండదు అని అర్థం. మనసు అనే యంత్రం ఎప్పుడూ వేగంగా, ఒక దిశలో పని చేస్తూనే ఉంటుంది. ఈ విధమైన మెడిటేషన్ మనలను సహజంగానే ఏకాగ్ర స్థితికి చేరుస్తుంది.

ఈ ఏకాగ్ర స్థితిలో ఆలోచనలు ఇప్పుడు పూర్తిగా పరమాత్మయందే లగ్నమై ఉంటాయి. బాహ్య శబ్దాలకు మనసు విచలితం కాదు. ఆంతరికంగా, ఆత్మ పరమాత్మ కలయిక జరుపుకుంటూ ఉంది. రాజయోగము చెయ్యడము నా లక్ష్యము. దీని పరిణామంగా నాలో ఏకాగ్రత శక్తి పెరిగింది. కానీ ఇప్పటికీ నాలో ఇంకా కొన్ని అనవసరమైన ఆలోచనలు వస్తూనే ఉన్నాయి కానీ మునుపటిలా తీవ్రంగా కాదు. కానీ ఇప్పుడు అవి నన్ను కదిలించలేవు ఎందుకంటే ఇప్పుడు నేను మరింత లోతుగా, భగవంతుని గుణాలను అనుభవం చేసుకోవడానికి ప్రయాణం చేస్తున్నాను. అలా ప్రయాణం చేస్తూ చేస్తూ నేను నెమ్మదిగా అనుభూతి అనే స్థితిలోకి వెళ్తున్నాను. భగవంతుని గుణాలను అనుభవం చేసుకుంటున్నాను. ఇప్పుడు ఆత్మ తన స్వధర్మంలో స్థితి అయ్యింది. బీజరూప స్థితిలో స్థితి అయి ఉంది. ఈ స్థితిలో నేను పరమాత్మ ప్రేమను అనుభవం చేస్తున్నాను. ఆ సంపూర్ణ ప్రేమలో ఆత్మ మునిగి ఉంది. 'ఇది ప్రేమ' అన్న ఆలోచన కూడా ఆత్మకు కలగడం లేదు, అంతగా ప్రేమలో మునిగిపోయింది.

**పవిత్రంగా మరియు శక్తిశాలీగా అవ్వడము**

ఆ తర్వాత, నేను నా అనుభవం గురించి మాట్లాడినప్పుడు నేను ప్రేమను అనుభవం చేసుకున్నాను అని

అనుకుంటాను. ఈ ప్రేమ కోసమే నేను ఇన్ని జన్మలు తపిస్తూ వచ్చాను. ఇటువంటి అనుబంధం కోసమే నేను పరితపించాను. ఇటువంటి స్థితినే యోగులు నిస్సంకల్ప సమాధి స్థితి అని అన్నారు. నిజానికి, మనసు నిస్సంకల్ప స్థితిలో ఉండదు కానీ పరమాత్ముని ప్రేమలో మునిగినప్పుడు చేతనమైన ఆలోచనలు కూడా అందులో ఇమిడిపోతాయి. ఇంతటి ఉన్నతమైన స్థితిని నేను ఎంతో సహజంగానే పొందాను.

ఆత్మపై ఒత్తిడి తీసుకువచ్చినప్పుడు ఇటువంటి స్థితిని ఆత్మ అనుభవం చేసుకుంటుందని కొందరంటారు, కానీ అటువంటి కృత్రిమ ఒత్తిడుల ద్వారా ఆత్మ పరమాత్ముని ప్రేమను అనుభవం చేసుకోలేదు. ఆత్మపై ఒత్తిడి చేయడం ద్వారా కొంతసేపటి వరకు దాని పనితీరును నియంత్రించవచ్చునేమో కానీ ఎప్పటికీ అది కుదరదు. ఆత్మనైన నేను నా అవినాశి స్థితిలో స్థితి అయ్యి భగవంతుని స్మృతిలో ఉన్నప్పుడే పరమాత్మునితో నాకుగల సంబంధాన్ని అనుభవం చేసుకోగలను.

రాజయోగ ఆరంభ దశలో, ఏకాగ్ర స్థితిని చేరుకోవడానికి శ్రమించవలసి ఉంటుంది. కానీ ఒక దశకు చేరుకున్న తర్వాత అతి సహజంగానే భగవంతుని ప్రేమకు నేను ఆకర్షింపబడతాను. అప్పుడు వేగంగా పరిగెత్తే మనసు స్థిరంగా, ఏకాగ్రంగా నడుచుకుంటుంది. ఇటువంటి స్థితిలో మనసు స్థిరత్వాన్ని అనుభవం చెయ్యడమే కాక పరమాత్ముని సర్వోన్నత గుణాలను కూడా అనుభవం చేసుకుంటుంది. కలత చెందిన మనసు నిదానంగా కలత నుండి దూరంగా వచ్చి మనసులో స్థిరత్వాన్ని ఏర్పరచుకున్నప్పుడే పరమాత్మలోని గుణాలను అనుభవం చేసుకోగలుగుతుంది.

సాధారణంగా, రాజయోగము ద్వారా కలిగే మొదటి అనుభవం 'శాంతి.' శాంతి తర్వాత అనుభవమయ్యేది భగవంతుని ప్రేమ. భగవంతుడు తన ప్రేమను అందించని క్షణం ఉండదు. కానీ నేనెందుకు ఆ ప్రేమను నిరంతరం అనుభవం చేసుకోలేకపోతున్నాను! నా మనసు భౌతికత వైపుకు అలవాటు పడింది కాబట్టా? ఇప్పుడు నేను పొందిన ఆధ్యాత్మికత మరియు మనఃశ్శాంతి ద్వారా నేను ముందుగా పరమాత్మ ప్రేమను పొందుతాను. నా అవినాశి తండ్రినుండి ముందు నేను ప్రేమను పొందినప్పుడు ఆ ప్రేమ నాలో సద్భావాలను ఉత్పన్నము చేస్తుంది. ప్రేమను అనుభవం చేసుకున్న తర్వాత, ఆత్మ శుద్ధి అనుభవం అవుతుంది. ఆత్మ తాను చేసిన జన్మజన్మల పాప భారంనుండి తేలికవుతూ ఉంటుంది. ప్రేమ జ్వాలలో అనగా యోగాగ్నిలో ఆత్మ శుద్ధమవుతూ ఉంటుంది.

ఈ అనుభవంతో ఆత్మకు సంతోషం అనుభవం అవుతుంది. ఎందుకంటే ఎలా ఉండాలో అలా నేను ఉన్నాను. అంతే కాకుండా ఏ సంబంధం కోసమైతే జన్మజన్మలు వేచి ఉన్నానో ఆ పరమాత్మ సంబంధం లభించిన కారణంగా ఆత్మలోని ధైర్యము, శక్తి పెరుగుతాయి. నా తండ్రి, పరమాత్మ అయిన శివబాబా కళ్యాణకారి. నేను ఆ పరమాత్మ నుండి శక్తిని పొందుతున్నాను. ఆత్మ రూపీ బ్యాటరీ ఛార్జ్ అవుతుంది. బాబాతో నాకున్న సంబంధం బలపడుతున్న కారణంగా బాబా ప్రభావం నాపై పడుతుంది. నాలో పరివర్తన మొదలవుతుంది. బాబా గుణాలే నా గుణాలుగా అవుతాయి. ఇప్పుడు నేను వారి సమానంగా అవుతున్నాను.

దయగల మహారాజులకు యోగము

రాజయోగము అనగా పతితమైన ఆత్మ తన సంపూర్ణ స్థితికి పరివర్తన చెందడము. ఆ పరివర్తనను నరుని నుండి నారాయణుడిగా, మనిషి నుండి దేవతగా అవ్వడము అని అంటారు. కనుక, ఉన్నతమైన రాజయోగము అంటే పరమాత్మతో కలయిక జరుపుకోవడం. ఆత్మ రాజుగా అవుతుంది. రాయల్ యోగి, రాజు. అన్నిటికన్నా ముందుగా నేను దివ్య గుణాలను నాలో నింపుకోవాలి.

ఆత్మ రాజయోగమును అభ్యాసము చెయ్యడం వలన, భగవంతుని గుణాలను అనుభవం చెయ్యడం వలన పూర్తి విశ్వంలో కూడా ఆ గుణాలను వ్యాపింపజేసేందుకు నిమిత్తమవుతుంది. అవి ప్రకృతిలోకికూడా పయనించి పంచ తత్త్వాలను కూడా శుద్ధపరుస్తాయి. నాలోని సుగుణాల ప్రకంపనాలు అంతటా వ్యాపించి విశ్వంలో పవిత్రత, సుఖశాంతులను

తిరిగి నెలకొల్పుతాయి.

రాజయోగములో ఆత్మ అనుభవించే వివిధ స్థితుల గురించిన వివరణ ఇది. రాజయోగము అంటే కేవలం ఈ విధంగానే, వ్రాసినట్లుగా జరగాలి అని ఉండదు. ఎందుకంటే రాజయోగము అంటే పరమాత్మతో మాట్లడటము, వారితో మనసును కేంద్రీకృతం చెయ్యడం. రాజయోగమును రోజంతా కర్మలు చేసుకుంటూ కూడా అనుభవం చేసుకోవచ్చు. ఎంతసేపు మెడిటేషన్‌లో కూర్చోవచ్చు అన్న ప్రశ్నకన్నా ఎంతసేవు వ్యక్తి మెడిటేషన్ చెయ్యకుండా ఉంటున్నాడన్నది చూసుకోవాలి. నేను ఇంతటి మధురమైన సంబంధాన్ని మరువగలనా? నేను నడస్తున్నా, తింటున్నా, మాట్లాడుతున్నా, నా కర్మలు చేసుకుంటున్నాగానీ, నేను నిజంగా ఒక రాజయోగినైతే, నేను పరమాత్ముని సంతానమైతే, నాలో పరమాత్ముని గుణాలు ప్రస్ఫుటించాలి. నేను యోగి జీవితాన్ని గడుపుతున్నాను. నా ప్రతి అడుగులో, ప్రతి కర్మలో నేను పరమాత్మను ప్రత్యక్ష్యం చెయ్యాలి.

# నూతన ఆరంభం

భగవంతుడు ఒక మానవ శరీరం ద్వారా దివ్యజన్మను తీసుకుని విశ్వ పరివర్తన కోసం స్థాపించిన జ్ఞాన యజ్ఞము గురించి, ఈశ్వరీయ విశ్వ విద్యాలయ స్థాపన గురించిన దివ్యగాథను మీకు వివరించాము. ఇది వ్రాయడానికిగల ముఖ్య కారణమేమిటంటే ప్రస్తుతం జరుగుతున్న భగవంతుని అవతరణ అనే చారిత్రకఘట్టాన్ని విశ్వంలోని సోదరసోదరీలందరూ తెలుసుకుని, భగవంతుని కర్తవ్యాన్ని అర్థం చేసుకుని పూర్తి లాభాన్ని పొందుతారన్న ఆశ. తర్వాత మళ్ళీ ఎవ్వరూ ఈ విధంగా బాధపడకూడదు, “ఓ భగవంతుడా! మీరు సాధారణ తనువులో ప్రవేశించారు, మీరు మమ్మల్ని పిలిచారు, మీరు వచ్చి మీరు చెయ్యాల్సిన దివ్య కర్తవ్యాలను కూడా చేసారు, అయినా మేము మిమ్మల్ని గుర్తించలేకపోయాము! అయ్యో భగవంతుడా! మీ కర్తవ్యాలు అమోఘమైనవి. మీరు భారతదేశ మాతలకు యోగశక్తినిచ్చి వారిని శివశక్తులుగా చేసారు. మమ్మల్ని మేల్కొల్పడానికి మీరు ఎన్నో విధాలుగా ప్రయత్నించారు అయినాకానీ మేము అజ్ఞాన నిద్రనుండి మేలుకోలేదు!”

బాబా మరియు బ్రహ్మాకుమారీల అద్భుతమైన కథలో మొదటి ఘట్టం ముగిసింది. 1957నుండి సేవలు ప్రారంభమైనప్పటినుండి రెండవ ఘట్టంగా చెప్పుకోవచ్చు.

1971లో లండన్‌లో ఒక సేవాకేంద్రం ఆరంభమయింది. అక్కడకు దాదీ జానకి వెళ్ళారు. వారి యోగశక్తితో ఆ దేశంలో ఎంతో శక్తిశాలీ ఆధ్యాత్మిక బీజాలను నాటారు. ఈనాటికి లండన్‌లో ఎన్నో పెద్ద సెంటర్లు ఏర్పాటయ్యాయి.

దేశదేశాలలో కూడా సేవాకేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఐక్యరాజ్య సమితిలో బ్రహ్మాకుమారీ సంస్థ ప్రభుత్వేతర సంస్థగా గుర్తింపు పొందింది.

బాబా ఎంతో నైపుణ్యం ఉన్న పిల్లలను ఎంచుకున్నారు. బాబా జ్ఞానాన్ని అన్ని వర్గాల వారికి, అన్ని దేశాల వారికి అర్థమయ్యే విధంగా వారు దానిని సులభతరం చేసారు. చక్కని చిత్రాలను కొందరు చిత్రీకరించారు, రాజయోగ అభ్యాస సమయంలో ఉపయోగపడే మంచి గీతాలను వ్రాసారు. చక్కని డ్రామాలు, హాస్యము, అద్భుతమైన నాట్యంతో వారు జ్ఞానాన్ని అందిస్తున్నారు.

భగవంతుని కార్యం కొనసాగుతూ ఉంది. షుమారుగా ప్రతి వారం ఎక్కడో ఒక చోట ఒక క్రొత్త సేవాకేంద్రం తెరవబడుతుంది. బాబా జెండా షుమారు 135 దేశాలలో, 8,500 శాఖలలో ఎగురుతూ ఉంది.

# ప్రపంచంలోకెల్లా అతి స్థిరమైన మనసుగల మహిళ

పాశ్చాత్య దేశపు వైజ్ఞానికులు రాజయోగములోని శక్తిని పరీక్షించాలనుకున్నారు. ఎన్నో ప్రయోగాలు చేసారు. లాంగ్లీ పోర్టర్ సంస్థలో మరియు ఇతర ప్రయోగశాలలలో దాదీ జానకిపై ఈఈజీ అను యంత్రం ద్వారా పదేపదే ప్రయోగాలు చేసారు. దాదీ జానకి ప్రస్తుతం బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ సంస్థకు ముఖ్య సంచాలకులు. వివిధ కర్మలు చేస్తున్నప్పటికీ, ఒత్తిడి కలిగించే పరిస్థితులలో కూడా దాదీ జానకిగారి మనసునుండి డెల్టా తరంగాలు రావడం వలన వారిని 'ప్రపంచంలోకల్లా అతి స్థిరమైన మనసు కలిగిన మహిళ' అని అన్నారు.

భగవంతుని కర్తవ్యంలో ఇప్పుడు చివరి దశ జరుగుతుంది. దేశాలమధ్య రాజుకుంటున్న నిత్య వైరము, ఆత్మహత్యలకు దారి తీస్తున్న మూర్ఖత్వము రాజ్యమేలుతున్న ఈ సమయంలో బాబా పిల్లలు తమను తాము దేవతలుగా తీర్చుదిద్దుకుంటూ, అంతిమ రోజుకోసం అనగా మహాకాలుడు వచ్చే సమయం కోసం ఎదురు చూస్తున్నారు.

మీరు ఎక్కడున్నా, మీరు ఎవరైనా, మీరు ఏది నమ్ముతున్నా ఏదన్నాకానీ, అందరూ ఒకరోజు భగవంతుడిని కలవవలసిందే. ఇక్కడ ఈ భూమిపై వారిని యథార్థంగా కలుసుకోలేకపోతే పాపభారాన్ని సమాప్తం చేసుకోవడానికి భగవంతుడు యమ ధర్మరాజుగా మారినప్పుడు కలుసుకోవలసి ఉంటుంది. భగవంతుడిని ఇప్పుడు కలుసుకోండి. వారు మనల్ని ఉన్నత స్థానాలకు తీసుకువెళ్తారు.

***సమాప్తము మరియు నూతన ఆరంభము***

# ముగింపు

18, జనవరి, 1969న బ్రహ్మాబాబా తన సంపూర్ణతా స్థితిని సాధించారు. సంపూర్ణంగా అయిన మొదటి వ్యక్తి – ఆది దేవుడు – సర్వ గుణాలలో, భగవంతునివలె తయారయ్యారు. సాకార ప్రపంచ ఆకర్షణలేవీ బ్రహ్మాబాబాకు లేవు. బ్రహ్మాబాబా మొట్టమొదటి సూక్ష్మ దేవతగా తన స్థానాన్ని తీసుకోవడానికి సూక్ష్మ వతనానికేగారు. అప్పటినుండి నెమ్మదిగా ఒక్కొక్కరు తమ పురుషార్థం అనుసారంగా సంపూర్ణ స్థితిని పొందుతూ ఉన్నారు. మహా వినాశనము జరిగేవరకు ఈ విధంగా ఫరిశ్తాల సైన్యం క్రమక్రమంగా సంపూర్ణతను పొందుతూనే ఉంటారు. అప్పటివరకు, శివబాబా మరియు బ్రహ్మాబాబా ఇద్దరూ కలిసి మరొక మాధ్యమమును ఎంచుకుని వారి ద్వారా విశ్వ సేవాకార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

బ్రహ్మాబాబా, ప్రజాపిత బ్రహ్మ అనే పేరును సంపాదించారు. బాహ్యంగా మరియు ఆంతరికంగా వారు అన్ని ఆటంకాలను అధిగమించారు – ఆ విజయము ద్వారా పూర్తి మానవాళికి సతోప్రధాన పునర్జన్మను కలిగిస్తున్నారు.

భగవంతుని మహిమను మనం ఏంతని చెప్పగలం? శివ పరమాత్మ సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, అయినప్పటికీ వారు కూడా సృష్టి ధర్మాలకు కట్టుబడి ఉంటారు.

*ముగింపు చేసేముందు, శివబాబా చెప్పిన రెండు మురళీలను ఇక్కడ ఉంచుతున్నాము. రెండు మురళీలు కూడా రెండు వేర్వేరు జ్ఞాన అంశాలను విశదీకరిస్తాయి. ఈ మహావాక్యాలను చదివినప్పుడు భగవంతుడి వ్యక్తిత్వము ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు. అంతేకాక మానవాళికి భగవంతుడు ఇస్తున్న అమూల్యమైన కానుకలేమిటో కూడా మనకు ఈ మురళీల ద్వారా అర్థమవుతుంది.*

*నిరాకార శివ పరమాత్ముని మహావాక్యాలు*
*బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ సంస్థ ముఖ్యాలయంలో పలికినవి*
*పలికిన తేదీ – 2 జనవరి, 1980*

### రాబోవు ప్రపంచ చిత్రము

బాప్‌దాదా ఎటువంటి సభను చూస్తున్నారు? భవిష్యత్తులో కిరీటధారులుగా కాబోతున్న బాబా పిల్లల సమూహము ఇది. ఇది భవిష్య రాకుమారి రాకుమారుల సభ. మీరందరూ ఆ సత్యమైన తండ్రి పిల్లలే కదా? మీకు సదా ఈ నషా ఉంటుందా? మీ వర్తమాన సంగమయుగ జీవితము రాకుమారి రాకుమారుల భవిష్య జీవితాలకన్నా ఎంతో ఉన్నతమైనది. మీరెంత ఉన్నతమైనవారో మీకు తెలుసా? మరి సదా ఆ నషాలో ఉంటున్నారా? భగవంతుని సంతానంగా అవ్వడం ఎంతో శ్రేష్ఠమైనది కదా అని ఈ రోజు బాబా (శివబాబా) మరియు దాదా (బ్రహ్మాబాబా) చర్చించుకున్నారు. మీ భవిష్య సంస్కారాలన్నీ ఈ జన్మనుండే ప్రారంభమవుతాయి. మీరు రాజ్య వంశీయులుగా ఉన్న కారణంగా, రాజ్యాధికారులుగా ఉన్న కారణంగా మీరు ప్రతి విషయంలోనూ సంపూర్ణంగా, సంపన్నంగా ఉంటారు. భవిష్యత్తులో మీ ప్రతి జన్మ ఎంతో హుందాగా ఉంటుంది. సర్వ ప్రాప్తులు సదా మీ చుట్టూ మీ సేవ చేయడానికై హాజరై ఉంటాయి. ప్రాప్తులను పొందాలన్న కోరిక మీలో ఉండదు ఎందుకంటే సర్వ ప్రాప్తులు మీ దాసిగా అయ్యి 'నా యజమాని నన్ను వినియోగిస్తే బాగుండు' అని అనుకుంటాయి. నలువైపుల వైభవాల గనులు నిండుగా ఉంటాయి. ప్రతి వైభవము తమ వంతు సహాయాన్ని, సుఖాన్ని మీకు అందించడానికి ఎవర్‌రెడీగా ఉంటాయి. సంతోషపు సన్నాయిలు అక్కడ స్వతహాగానే మ్రోగుతూ ఉంటాయి. మ్రోగించవలసిన అవసరమే లేదు. విశ్వపతి అయిన మీరు మీ రచన అయిన వనస్పతి (ప్రకృతి) లోని చెట్ల ఆకులను

కదిలించగానే వివిధ రకాల సంగీతం వస్తుంది. వృక్షాల ఆకులు ఊగినప్పుడు, కదిలినప్పుడు సహజసిద్ధమైన సంగీతం వస్తుంది. ఈ కలియుగంలో ఎలా అయితే రకరకాల సంగీత వాయిద్యాలు ఉన్నాయో, వాటిని పలికించడం ద్వారా వివిధ ధ్వనులు వచ్చినట్లుగా అక్కడ కూడా చెట్ల ఆకులను కదిలించగానే వీనులవిందుగా సహజ సంగీతం వినిపిస్తుంది. పక్షుల కిలకిల రావాలు కూడా చక్కని సంగీతంలా అనిపిస్తుంది. ప్రాణమున్న బొమ్మలతో అనగా పశుపక్ష్యాదులతో మీరు అనేక రకాలుగా ఆడుకుంటారు. ఇక్కడి మనుష్యులు ఇతరులను ఆనందపర్చడానికి రకరకాల భాషలు నేర్చుకున్నట్లుగా, అక్కడ మీరు సైగ చెయ్యగానే పక్షులు మిమ్మల్ని రకరకాల శబ్దాలతో ఆనందపరుస్తాయి. పండ్లు, పూలు కూడా ఇదే విధంగా మీకు సంతోషాన్ని కలిగిస్తాయి. అక్కడి పండ్లు అనేక రకాల రుచులతో ఉంటాయి. ఇక్కడ మీరు ఎలాగైతే ఉప్పు, పంచదార, వివిధ మసాలాలు కలిపి రకరకాల రుచులను తయారుచేస్తారో అలాగే అక్కడి పండ్లలో రకరకాల రుచులు ఉంటాయి. అక్కడ చక్కెర మిల్లులు ఉండవు. అక్కడ చక్కెర పండ్లు ఉంటాయి. మీకు కావలసిన రుచులను సహజసిద్ధమైన పండ్లతోనే మీరు తయారు చేసుకుంటారు. మీరు ఆకు కూరలను వండుకోరు, పండ్లు పూలతో కూరలను వండుకుంటారు. అక్కడ పాలనదులు ఉంటాయి (అనగా అన్నీ సమృద్ధిగా ఉంటాయని భావం). వివిధ రుచులతో పండ్ల రసాలు ఉంటాయి. తినే పండ్లు వేరుగా ఉంటాయి, రసాల కోసం పండ్లు వేరుగా ఉంటాయి. రసం తియ్యడానికి అక్కడ మీరు కష్టపడనవసరం లేదు. అక్కడ ప్రతి పండు ఇక్కడి కొబ్బరి కాయంత ఉంటాయి. మీరు పండును ఇలా తీసుకుని, నెమ్మదిగా దానిని వత్తితే చాలు, పండ్లనుండి రసం వచ్చేస్తుంది. మీరు స్నానంచేసే నీరు గంగానదిలా (అనగా శుద్ధమైనవిగా, పవిత్రమైనవిగా ఉంటాయి) ఉంటాయి. ప్రస్తుత గంగా నది పర్వత శ్రేణులమీదుగా ప్రవహిస్తుంది, అది ప్రవహించు ప్రాంతం ఔషధ గుణాలను కలిగి ఉన్న కారణంగా దానికి అంత ప్రాముఖ్యం ఉంది. ఆ నీటిలో పురుగులు ఉండవు. అక్కడ, నీరు ఎంతో సుగంధభరితమైన వనమూలికల మీదుగా ప్రవహిస్తుంది. ఆ నీరు క్రిందకు ప్రవహించినప్పుడు అందులో సహజమైన సుగంధము ఉంటుంది. మీరు ప్రత్యేకంగా ఎటువంటి సుగంధాలనూ ఉపయోగించనవసరం లేదు.

మీరు ఉదయాన్నే లేవడానికి మీకు ఏ టేప్ రికార్డర్ అవసరం లేదు. పక్షుల సహజమైన కిలకిలారావాలే మిమ్మల్ని లేపుతాయి. మీరు ఉదయాన్నే నిద్ర లేస్తారు. అక్కడ మీరెప్పుడూ అలసిపోరు. ఎందుకంటే చైతన్యమైన దేవతలుగా ఉన్నప్పుడు ఉదయాన్నే లేచిన కారణంగానే భక్తులు కూడా ఉదయాన్నే లేస్తారు. అక్కడ ఎప్పుడూ వెలిగే జ్యోతిగా ఉంటారు. మీ బుద్ధికి ఎటువంటి శ్రమ ఉండదు, మీ మనసులలో ఎటువంటి భారమూ ఉండదు. కనుక మీరు పడుకోవడము, లేవడము రెండూ సమానంగా ఉంటాయి. ఇక్కడ, 'నేను ఉదయాన్నే లేవాలి' అని అనుకుంటారు. అక్కడ అలా సంకల్పం చెయ్యనవసరం లేదు. అచ్చా, అక్కడ మీరు ఏమి చదువుకుంటారు? లేక చదువులు లేకుండా ఉంటే బాగుంటుందని అనుకుంటున్నారా? అక్కడ చదువు కూడా ఒక ఆటలా ఉంటుంది. ఆటలాడుకుంటున్నట్లుగా మీరక్కడ చదువుకుంటారు. మీ రాజ్యము గురించి అయితే మీకు అవగాహన కావాలి కదా. కనుక, మీ చదువు మీ రాజ్యము గురించే ఉంటుంది. అక్కడ, ముఖ్యమైన సబ్జెక్టు 'చిత్రలేఖనము.' యువకులు, వృద్ధులు అందరూ అక్కడ చిత్రకారులే. అక్కడ సంగీతం, చిత్రలేఖనం మరియు ఆటలు ఉంటాయి. గాత్రము అంటే అందులో పాడుతారు, ఆడుతారు. ఆటపాటల రూపంలో మీ చదువు ఉంటుంది. అక్కడ 'చరిత్ర' సబ్జెక్టు కూడా సంగీతం, కవిత్వంతో ఉంటుంది. బోరు కొట్టే విధంగా ఉండదు. నాట్యం కూడా ఒక ఆటయే. అక్కడ నాటకాలు ఉంటాయి కానీ సినిమాలు ఉండవు. నాటకాలు ఎంతో ఆనందభరితంగా ఉంటాయి. ఎన్నో నాటకశాలలు ఉంటాయి. మీ మహలు లోపల కూడా ఎన్నో పుష్పక విమానాలు ఉంటాయి. ఈ విమానాలను నడపడము చాలా సులువు. అక్కడంతా అటామిక్ ఎనర్జీ (అణు శక్తి) ఆధారంతో నడుస్తాయి. మీ కొరకు సృష్టింపబడ్డ చివరి ఇన్వెన్షన్ ఇదే.

అక్కడ మీ కరెన్సీగా బంగారు నాణెములు ఉంటాయి. అయినా అవి ఇప్పటి నాణెములుగా ఉండవు. వాటి రూపము, రంగు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. అవి ఎంతో సుందరమైన డిజైన్లతో ఉంటాయి. ధనాన్ని ఇచ్చిపుచ్చుకోవడం

కేవలం ఒక నామమాత్రమే. ఇక్కడ మధువనంలో, డిపార్టుమెంట్లు ఉన్నాయి. ప్రతి డిపార్టుమెంటుకు ఇన్‌ఛార్జ్ ఒకరు ఉంటారు. ఇదంతా కుటుంబమే అయినప్పటికీ మీకు ఏదైనా కావాలంటే డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జ్ వద్దకు వెళ్ళి అడిగి తీసుకుంటారు కదా. ఒకర ఇస్తారు, మరొకరు తీసుకుంటారు. అక్కడ కూడా ఫ్యామిలీ సిస్టమ్ (కుటుంబ వ్యవస్థ) ఉంటుంది. అక్కడ దుకాణదారుడు, కొనుగోలుదారుడు అన్న భావన ఉండదు. 'యజమాని' అన్న భావన ఉంటుంది. మీరు ఒకటిచ్చి అందుకు బదులుగా మరొకటి తీసుకుంటారు. ఎవ్వరికీ ఏ లోటూ ఉండదు. ప్రజలు కూడా సంపన్నంగా ఉంటారు. ప్రజలు కూడా తమ శరీర నిర్వహణ ద్వారా పదమారెట్లు సంపన్నంగా ఉంటారు. అందుకే అక్కడ, "నేను కొనుగాలుదారుడను, ఇతడు యజమాని' అన్న భావన ఎవ్వరిలోనూ ఉండదు. అక్కడ కేవలం ప్రేమపూర్వక ఇచ్చిపుచ్చుకోవడాలు ఉంటాయి. అక్కడ డబ్బులకు లెక్కను ఉంచనవసరం లేదు. అందుకు రిజిస్టర్ కూడా అవసరం లేదు.

మీ సంగీత వాయిద్యాలు వజ్రాలతో పొదగబడి ఉంటాయి. మీ సంగీతం సహజసిద్ధంగా ఉంటుంది. వాయిద్యాలను వాయించడానికి మీరు శ్రమించనవసరం లేదు. మీ వ్రేళ్ళను వాటిపై పెట్టగానే అవి మ్రోగుతాయి. మీరక్కడ సుందరమైన వస్త్రాలను ధరిస్తారు. మీరు చేసే పనులను బట్టి, స్థానాన్ని బట్టి మీ వస్త్రధారణ ఉంటుంది. అనేక రకాల నగలు ఉంటాయి. మీ వద్ద వివిధ రకాల కిరీటాలు, నగలు ఉంటాయి. కానీ అవి బరువుగా ఉండవు. దూది వలె తేలికగా ఉంటాయి. అవి స్వచ్ఛమైన బంగారంతో తయారుచేయబడతాయి. వాటిలో వజ్రాలను పొదుగుతారు. ప్రతి వజ్రం వివిధ రంగుల కిరణాలను విరజిమ్ముతూ ఉంటుంది. ప్రతి వజ్రంలో మీరు ఏడు రంగులనూ చూస్తారు. ఇక్కడ, మీరు ఒక్కొక్క రంగుకు ఒక్కొక్క ట్యూబ్‌లైట్‌ను వాడుతారు కదా. కానీ అక్కడ, ఒక్కొక్క వజ్రం వివిధ రంగులతో మెరిసిపోవడాన్ని మీరు చూస్తారు. ప్రతి మహలు రంగు రంగుల లైట్లతో అలంకరింపబడి ఉంటుంది. ఇక్కడ, ఎలాగైతే మీరు అనేక రకాల అద్దాలను పెట్టి ఒక వస్తువును రకరకాలుగా చూపిస్తారో అలాగే మీ మహలు పైకప్పు ముత్యాలు, రత్నాలతో వివిధ ఆకృతులతో కనిపిస్తుంది. మీ మహళ్ళు బంగారు, వజ్రాలతో ధగధగలాడిపోతూ ఉంటాయి. సూర్య కిరణాలతో బంగారు, వజ్రాల మెరుపులు ఎంతగా మిరుమిట్లు కొలుపుతాయంటే వేలాది లైట్లతో ప్రకాశిస్తుందా అన్నట్లు ఉంటుంది. ఇన్ని వైర్ల అవసరం కూడా ఉండదు. అక్కడన్నీ సుందరంగా ఉంటాయి. ఇక్కడ, రాజమహళ్ళలో, రాజకుటుంబాలలో అనేక రకాల దీపాలతో మహళ్ళను కాంతివంతం చేస్తారు. అక్కడ, నిజమైన వజ్రాలున్న కారణంగా ఒక్క దీపము ఇక్కడి అనేక దీపాల కాంతిని ఇస్తుంది. అక్కడ మీరు ఏమీ కష్టపడనవసరం లేదు. అక్కడంతా సహజసిద్ధంగా ఉంటుంది.

అక్కడ శుద్ధమైన హిందీ భాష ఉంటుంది. ప్రతి మాటను మీరు అర్థం చేసుకోగలరు (విదేశీయులతో మాట్లాడుతూ) ఇంగ్లండు మరియు అమెరికా ఏమవుతాయి? విదేశాలలో మీరు మహళ్ళు నిర్మించవద్దు. మీ మహళ్ళు భారతదేశంలోనే తయారు నిర్మించుకోండి. అవి పిక్‌నిక్ స్థానాలుగా, షికారుకు వెళ్ళే స్థానాలుగా మాత్రమే ఉంటాయి. కొన్ని మాత్రమే షికారు ప్రాంతాలుగా ఉంటాయి, అన్నీ కాదు. మీ విమానాలు ఎంత వేగంగా ఉంటాయంటే మీరు వాటిని స్టార్ట్ చేసిన వెంటనే ధ్వనికన్నా వేగంగా మీరనుకున్న స్థానానికి మిమ్మల్ని చేర్చుతాయి. అంత వేగవంతమైన విమానాలుంటాయి. ఇతరులతో మాట్లాడటానికి ఫోన్ కలిపినంత వేగంగా, అంతకంటే ఎక్కువ వేగంగానే మీ విమానం చేరుకుంటుంది. అందుకే అక్కడ ఫోన్లు చేసుకోనవసరం లేదు. అక్కడ ఫ్యామిలీ విమానాలు, ఒక్కరిగా వెళ్ళే విమానాలూ ఉంటాయి. ఎప్పుడు ఏ విమానం కావాలంటే అది వాడండి. ఇప్పుడు విమానంలో కూర్చున్నారా!

ఇప్పుడు సత్యయుగ విమానాన్ని విడిచి మీ బుద్ధిరూపీ విమానంలోకి రండి. బుద్ధి రూపీ విమానం కూడా అంతే వేగంగా ఉందా? సంకల్ప వేగము ఉందా? సంకల్పం చెయ్యగానే చంద్రుడు, నక్షత్రాలు అన్నిటినీ దాటుకుని ఇంటికి చేరుకుంటారు. ఇలా మీ బుద్ధి రూపీ విమానము సదా ఎవర్‌రెడీగా ఉందా? సదా విఘ్నాలకు దూరంగా ఉందా? ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా ఉండే విధంగా ఉందా? పరంధామానికి వెళ్ళాలనుకున్నారు కానీ భూమిని కూడా

దాటలేకపోతున్నారా లేక ఏదైనా కొండకు గుద్దుకుని క్రింద పడిపోతున్నారా? మరి ప్రమాదాలు జరగని ఎవరెడీగా మీ బుద్ధి రూపీ విమానం ఉన్నదా? ముందు ఈ విమానం ఎక్కగలిగితేనే తర్వాత ఆ విమానం ఎక్కగలుగుతారు. స్వర్గం గురించి చెప్తున్నప్పుడు అవును, అవును అంటూ వింటున్నారు. మరి ఇప్పుడు అవును అంటూ వినడం లేదే?

ఈరోజు బాబా వతనంలో స్వర్గం యొక్క చిత్రాన్ని చూసారు. అందుకే మీకు కూడా వినిపించడం జరిగింది. స్వర్గంలోకి వెళ్ళడానికి బ్రహ్మాబాబా తయారుగా ఉన్నారు కదా అందుకే స్వర్గ చిత్రం చూడటం జరిగింది. మీరందరూ కూడా తయారుగా ఉన్నారా? ఎందులో తయారుగా ఉండాలో తెలుసు కదా? బాబాతో కలిసి ఎవరు స్వర్గ ద్వారం నుండి పాస్ అవుతారు? అందుకోసం పాస్ తీసుకున్నారా? గేట్ పాస్ అయితే తీసుకున్నారు కానీ బాబాతో కలిసి వెళ్ళడానికి పాస్ అవ్వాలి కదా(ఉత్తీర్ణులవ్వాలి కదా). ఒక వి.ఐ.పి. గేట్ పాస్ ఉంటుంది, రాష్ట్రపతికి కూడా పాస్ ఉంటుంది. ఇది విశ్వపతి గేట్ పాస్. ఏ గేట్‌పాస్ తీసుకున్నారు? మీ పాస్ పరిశీలించుకోండి.

ఇటువంటి వర్తమాన ప్రభు సంతానమునకు, ప్రకృతి యజమానియే విశ్వ యజమాని, మాయాజీతులే జగత్‌జీతులు, ఒక్క సంకల్ప విధి ద్వారా సిద్ధిని పొందేవారు, ఇటువంటి సిద్ధిస్వరూపులు, సదా పాస్(దగ్గరగా) ఉంటూ, పాస్ (ఉత్తీర్ణులై) అయ్యి, పాస్(గేట్‌నుండి వెళ్ళడము) అయ్యేవారు, ఇటువంటి శ్రేష్ఠ ఆత్మలకు బాప్‌దాదా ప్రియస్మృతులు మరియు నమస్తే.

*నిరాకార శివ పరమాత్ముని మహావాక్యాలు*
*బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ సంస్థ యొక్క ముఖ్యాలయంలో పలికినవి*
*పలికిన తేదీ – 17 డిసెంబరు, 1984*

# వ్యర్థ సంకల్పాలను సమాప్తం చేసుకునేందుకు సాధనము - సమర్థ సంకల్పాలకు ఖజానా - జ్ఞాన మురళి

ఈరోజు బాప్‌దాదా సంగమయుగ అలౌకిక ఆత్మిక సభలో మిలనము జరుపుకోవడానికి వచ్చారు. ఈ ఆత్మిక సభ, ఆత్మిక మిలనము పూర్తి కల్పములో ఇప్పుడే జరుగుతుంది. ఆత్మలతో పరమాత్మ మిలనము! ఇటువంటి శ్రేష్ఠ మిలనము సత్యయుగ సృష్టిలో కూడా ఉండదు. అందుకే ఈ యుగము గొప్ప యుగము, మహా మిలన యుగము, సర్వ ప్రాప్తుల యుగము, అసంభవాలు సంభవమయ్యే యుగము, సహజమైన మరియు శ్రేష్ఠ అనుభూతుల యుగము, విశేష పరివర్తన యుగము, విశ్వ కళ్యాణ యుగము, సహజ వరదానాల యుగము అని అనబడుతుంది. ఇటువంటి యుగములో మీరు గొప్ప పాత్రధారులు. ఇంతటి గొప్ప నషా సదా ఉంటుందా? విశ్వమంతా ఎవరి క్షణకాలిక దర్శనభాగ్యం కోసం చాతకులై తపిస్తున్నారో ఆ తండ్రికే మనం సెకండులో అధికారులుగా అయ్యిన శ్రేష్ఠ ఆత్మలము. ఇది స్మృతిలో ఉంటుందా? ఈ స్మృతి స్వతహాగానే సమర్థవంతంగా చేస్తుంది. ఇటువంటి సమర్థ ఆత్మలుగా అయ్యారా? సమర్థత అనగా వ్యర్థాన్ని సమాప్తం చెయ్యగలగడము. వ్యర్థము ఉంటే సమర్థము లేనట్లే. ఒకవేళ మనసులో వ్యర్థం ఉంటే సమర్థ సంకల్పాలు నిలువలేవు. వ్యర్థము పదే పదే క్రిందకు తీసుకువెళ్తుంది. సమర్థ సంకల్పాలు సమర్థుడైన తండ్రితో కలయిక చేయిస్తాయి. మాయాజీతునిగా చేస్తాయి. సఫలతా స్వరూప సేవాధారిగా చేస్తుంది. వ్యర్థ సంకల్పాలు సదా ఉల్లాస ఉత్సాహాలను సమాప్తం చేస్తాయి. వారు సదా ఎందుకు, ఏమిటి అనే చిక్కులోనే ఉంటారు. అందుకే చిన్న చిన్న విషయాలలో స్వయాన్ని

చూసుకుని నిరాశగా ఉంటారు. వ్యర్థ సంకల్పాలు ఎప్పుడూ సర్వ ప్రాప్తుల అనుభవం నుండి వంచితం చేస్తాయి. వ్యర్థ సంకల్పాలున్న వారి మనసులో ఆశలు, కోరికలు చాలా ఎక్కువగా ఉంటాయి. ఇది చేస్తాను, అది చేస్తాను అంటూ ప్లాన్‌ను చాలా వేగంగా చేస్తారు అనగా తీవ్రగతితో చేస్తారు. ఎందుకంటే వ్యర్థ సంకల్పాల గతి చాలా వేగంగా ఉంటుంది. అందుకే చాలా చాలా గొప్ప విషయాలు ఆలోచిస్తారు కానీ సమర్థత లేని కారణంగా ప్లాన్ మరియు ప్రాక్టికల్‌లో చాలా తేడా కనిపిస్తుంది. అందుకే స్వయంతో నిరాశ చెందుతారు.

సమర్థసంకల్పాల వారు సదా ఏది ఆలోచిస్తారో అదే చేస్తారు. ఆలోచించడము మరియు చెయ్యడము రెండూ సమానంగా ఉంటాయి. సదా ధైర్యమైన గతితో సంకల్పము మరియు కర్మలో సఫలతను పొందుతారు. వ్యర్థ సంకల్పాలు వేగవంతమైన తుఫానులా అలజడిలోకి తీసుకువస్తాయి. సమర్థ సంకల్పాలు సదా వసంత ఋతువు సమానంగా ఆహ్లాదకరంగా ఉంటాయి. వ్యర్థ సంకల్పాలు ఎనర్జీ అనగా ఆత్మిక శక్తి మరియు సమయము వ్యర్థంగా పోవడానికి నిమిత్తమవుతాయి. సమర్థ సంకల్పాలు సదా ఆత్మిక శక్తి అనగా ఎనర్జీని జమ చేస్తాయి. సమయాన్ని సఫలం చేస్తాయి. మీ రచన అయిన ఈ వ్యర్థము, రచయిత అయిన మీ ఆత్మను ఇబ్బంది పెడతాయి అనగా మాస్టర్ సర్వశక్తిమంతుడను, సమర్థ ఆత్మను అన్న నషా నుండి క్రిందకు తీసుకువస్తాయి. సమర్థ సంకల్పాలతో సదా శ్రేష్ఠ నషా యొక్క స్మృతి స్వరూపులుగా ఉంటారు. ఈ తేడా మీకు తెలుసు కూడా, అయినప్పటికీ కొంతమంది పిల్లలు వ్యర్థ సంకల్పాలున్నాయని ఇప్పటికీ చెప్తూ ఉంటారు. ఇప్పటి వరకు కూడా వ్యర్థ సంకల్పాలు ఎందుకు వస్తున్నాయి, ఇందుకు కారణమేమిటి? బాప్‌దాదా సమర్థ సంకల్పాలకు ఖజానాను ఇచ్చారు – అదే జ్ఞాన మురళి. మురళిలోని ఒక్కొక్క మహావాక్యము సమర్థవంతమైన ఖజానా అని చెప్పవచ్చు. ఈ సమర్థ సంకల్పాల ఖజానాపై శ్రద్ధ తగ్గిన కారణంగా సమర్థ సంకల్పాలు ధారణ కావు. అందుకే వ్యర్థానికి అవకాశం దొరుకుతుంది. ప్రతి సమయము ఒక్కొక్క మహావాక్యాన్ని మననం చేసుకుంటూ ఉంటే వ్యర్థం రాదు. బుద్ధి ఖాళీగా ఉన్నప్పుడు ఖాళీ స్థానం ఉన్న కారణంగా వ్యర్థం వచ్చేస్తుంది. వచ్చేందుకు మార్జినే లేకపోతే వ్యర్థం ఎలా వస్తుంది? సమర్థ సంకల్పాలతో బుద్ధిని బిజీగా పెట్టుకునే ఉపాయము రాదు అంటే వ్యర్థ సంకల్పాలను ఆహ్వానించడమే.

బిజీగా ఉండే బిజినెస్‌మెన్‌గా అవ్వండి. రాత్రింబగళ్ళు ఈ జ్ఞాన రత్నాలతో వ్యాపారం చెయ్యండి. అప్పుడు ఖాళీ సమయమూ ఉండదు, వ్యర్థం రావడానికి అవకాశమూ ఉండదు. కావున విశేషమైన మాట, 'బుద్ధిని సమర్థ సంకల్పాలతో సదా నిండుగా పెట్టుకోండి." అందుకు ఆధారము – రోజూ మురళిని వినడము, నింపుకోవడము మరియు స్వరూపులుగా అవ్వడము. ఈ మూడు స్టేజెస్ ఉన్నాయి. వినడము చాలా మంచిగా అనిపిస్తుంది. వినకుండా ఉండలేరు. ఇది ఒక స్టేజ్. ఇటువంటివారికి వినేంతవరకే వినాలన్న కోరిక ఉంటుంది. వినాలన్న అభిరుచి ఉంది కనుక ఆ సమయం వరకు ఆ రసాస్వాదనలో ఉంటారు. వినడం వలన ఆనందంలో కూడా ఉంటారు. చాలా మంచిది! వీరు సంతోషంలో పాటలు కూడా పాడుతారు. కానీ వినడం సమాప్తం అవ్వగానే ఆ రసాస్వాదన కూడా సమాప్తమవుతుంది. ఎందుకంటే లోపల నింపుకోలేదు కనుక. నింపుకునే శక్తి ద్వారా బుద్ధిని సమర్థ సంకల్పాలతో సంపన్నంగా చేసుకోని కారణంగా వ్యర్థము వస్తుంది. నింపుకునేవారు సదా నిండుగా ఉంటారు. అందుకే వ్యర్థ సంకల్పాలకు దూరంగా ఉంటారు.

కానీ స్వరూపులుగా అయ్యి, శక్తిశాలిగా అయ్యి ఇతరులను కూడా శక్తిశాలిగా చెయ్యడంలో లోపము కనిపిస్తుంది. వ్యర్థంనుండైతే రక్షింపబడతారు, శుద్ధ సంకల్పాలలో ఉంటారు కానీ శక్తి స్వరూపులుగా కాలేరు. స్వరూపులుగా అయ్యేవారు సదా సంపన్నంగా, సదా సమర్థంగా, సదా శక్తిశాలి కిరణాల ద్వారా ఇతరుల వ్యర్థాన్ని కూడా సమాప్తం చేసేవారిగా ఉంటారు. మరి 'నేనెవరిని' అని స్వయాన్ని ప్రశ్నించుకోండి. వినేవారా, నింపుకునేవారా లేక స్వరూపులుగా అయ్యేవారా? శక్తిశాలి ఆత్మ సెకండులో వ్యర్థాన్ని సమర్థంలోకి పరివర్తన చేస్తుంది. మరి మీరు శక్తిశాలి ఆత్మలే కదా? కనుక, వ్యర్థాన్ని పరివర్తన చెయ్యండి. ఇప్పటివరకు వ్యర్థంలో శక్తి మరియు సమయాన్ని వృథా చేస్తూ వచ్చారు. మరి సమర్థంగా ఎప్పుడు

అవుతారు? బహుకాలపు సమర్థత కలిగిన వారే బహుకాలం సంపన్న రాజ్యాన్ని చెయ్యగలరు. అర్థమయిందా!

ఇప్పుడు మీ సమర్థ స్వరూపం ద్వారా ఇతరులను కూడా సమర్థులుగా తయారు చేసే సమయమిది. స్వయంలోని వ్యర్థాన్ని సమాప్తం చెయ్యండి. ధైర్యముంది కదా? మరి మీ ధైర్యం కూడా గొప్పగా ఉంది కదా? గొప్ప సంకల్పాలు చేసేవారు కదా? బలహీన సంకల్పాలు చేసేవారు కాదు. సంకల్పం చేయగానే జరిగిపోవాలి. అప్పుడే గొప్ప సంకల్పం అని అనబడుతుంది. ఇటువంటి ఉన్నతమైన ఆత్మలే కదా మీరు! మాయా శక్తి ఉన్నవారు ప్రభుత్వాన్ని సవాలు చేస్తున్నారు. ఈశ్వరీయ శక్తి ఉన్న మీరు మాయను సవాలు చేస్తున్నారు. మాయను సవాలు చేసేవారు కదా! గాబరా పడేవారు కాదు కదా? మీరు ఎంతో గొప్ప భావన కలిగినవారు. భావన కారణంగా భావనకు ఫలితం సహజంగా లభిస్తుంది. భావన ద్వారా గొప్ప ఫలితాన్ని తీసుకునేవారు. అందుకే సదా సంతోషంలో నాట్యం చేస్తుంటారు. సంతోషమనే ఫలితాన్ని పొందే అదృష్ట ఆత్మలు మీరు. కావున మీరు గొప్పవారు కదా!

మీ సంకల్పం గొప్పది. మీ కర్మలు గొప్పవి. సేవ గొప్పది. అన్నింటిలో గొప్పగా ఉన్నారు. మహా నదుల సంగమం (ఆత్మలు) మహా సాగరముతో (పరమాత్మతో) జరిగింది. అందుకే మిలన్ సభకు వచ్చారు. ఈరోజు ఈ సభలో పండుగ కూడా జరుపుకోవాలి కదా! అచ్చా – ఇటువంటి సదా సమర్థులు, సదా ప్రతి మహావాక్యానికి స్వరూపులుగా అయ్యేవారికి, బహుకాలపు సమర్థులకు, ఆత్మలను సమర్థవంతులుగా చేసే బాప్‌దాదా సర్వసమర్థ ప్రియస్మృతులు మరియు నమస్తే.

మీరందరూ నిర్భయులుగా ఉన్నారా? ఎందుకంటే మీరు సదా నిర్వైరులు. మీకు ఎవ్వరితోనూ వైరము లేదు. ఆత్మలందరి పట్ల సోదరత్వ శుభ భావన, శుభ కామన ఉంది. ఇటువంటి శుభ భావన, శుభ కామన కలిగినవారు నిర్భయంగా ఉంటారు. భయపడరు. స్వయం యోగయుక్త స్థితిలో స్థితులై ఉంటే ఎటువంటి పరిస్థితిలోనైనా తప్పకుండా సురక్షితంగా ఉంటారు. మరి సదా సురక్షితంగా ఉండేవారే కదా? బాబా ఛత్రఛాయలో ఉండేవారు సదా సురక్షితంగా ఉంటారు. ఛత్రఛాయనుండి బయటకు వస్తే మళ్ళీ భయంగా ఉంటుంది. ఛత్రఛాయ క్రింద నిర్భయంగా ఉంటారు. ఎవరేమి చేసినాగానీ బాబా స్మృతి అన్నది ఒక కోటవంటిది. ఎలా అయితే కోట లోపలకు ఎవ్వరూ రాలేరో అలాగే స్మృతి అనే కోట లోపల సురక్షితంగా ఉంటారు. అలజడిలో కూడా అచలంగా ఉంటారు. గాబరా పడేవారు కాదు. ప్రపంచ అల్లర్లను ఇప్పుడింకా మీరు ఏమీ చూడలేదు. ఇది రిహార్సల్ మాత్రమే. రియల్‌గా జరిగేది ఇంకా ఉంది. దృఢంగా అవ్వడానికి రిహార్సల్ చెయ్యడం జరుగుతుంది. మరి పక్కా అయ్యారా? ధైర్యవంతులుగా ఉన్నారా? బాబాపై ప్రేమ ఉన్న కారణంగా ఎన్ని సమస్యలున్నా మధువనానికి అయితే చేరుకున్నారు కదా. సమస్యాజీతులుగా అయ్యారు. ప్రేమ నిర్విఘ్నంగా అయ్యే శక్తిని ఇస్తుంది. కేవలం 'నా బాబా' అన్న మంత్రం గుర్తుంచుకుంటే చాలు. ఈ ఒక్కటి గుర్తున్నాకానీ సదా సురక్షితంగా ఉంటారు.

సదా స్వయాన్ని దృఢమైన, నిశ్చలమైన ఆత్మలుగా భావిస్తారా? ఏ విధమైన అలజడి దృఢమైన నిశ్చల స్థితిలో విఘ్నం వెయ్యకూడదు. ఇటువంటి విఘ్న వినాశక, దృఢమైన నిశ్చలమైన ఆత్మలుగా అయ్యారా? విఘ్న వినాశక ఆత్మలు విఘ్నాలను విఘ్నాలుగా కాక ఆటగా భావించి దాటుతారు. ఆటల్లో సదా ఆనందం ఉంటుంది కదా. ఏదైనా పరిస్థితిని దాటడానికి, ఆడుకోవడానికి తేడా ఉంది కదా. ఒకవేళ విఘ్న వినాశక ఆత్మలుగా ఉన్నట్లయితే పరిస్థితి ఆట సమానంగా అనిపిస్తుంది. పర్వతం వంటి పరిస్థితి కూడా ఆవగింజలా కనిపిస్తుంది. ఇటువంటి విఘ్న వినాశకులుగా ఉన్నారు కదా, గాబరా పడేవారు కాదు కదా! జ్ఞానీ ఆత్మలకు ఇవన్నీ జరుగుతాయని ముందుగానే తెలుసు. ముందుగానే తెలిసినప్పుడు ఏ విషయమూ పెద్ద విషయంగా అనిపించదు. అకస్మాత్తుగా ఏదైనా జరిగినప్పుడు చిన్న విషయము కూడా పెద్ద విషయంగా కనిపిస్తుంది. మీరందరూ నాలెడ్జ్‌ఫుల్ ఆత్మలే కదా. అసలైతే నాలెడ్జ్‌ఫుల్ ఆత్మలే. కానీ పరిస్థితుల సమయంలో నాలెడ్జ్‌ఫుల్ స్థితిని మర్చిపోకూడదు. అనేకసార్లు జరిగింది ఇప్పుడు కేవలం రిపీట్ అవుతుంది. ఎప్పుడైతే నథింగ్ న్యూ

అని తెలుసో అప్పుడు అన్నీ సహజంగా కనిపిస్తాయి. మీరందరూ కోటలోని దృఢమైన ఇటుకల వంటివారు. ఒక్కొక్క ఇటుకకు దాని మహత్వము ఉంది. ఒక్క ఇటుక కదిలినా కానీ గోడ మొత్తాన్నీ కదిలించేస్తుంది. మరి మీరు అచలమైన ఇటుకలు కదా. ఎవరు ఎంతగా కదిలించాలని ప్రయత్నించినాగానీ కదిలించేవారు కదిలిపోవాలి కానీ మీరు మాత్రం కదలకూడదు. అటువంటి అచల ఆత్మలకు, విఘ్న వినాశక ఆత్మలకు బాప్‌దాదా ప్రతి రోజూ అభినందనలు తెలుపుతారు. అటువంటి పిల్లలే బాప్‌దాదా అభినందనలకు అధికారులు. ఇటువంటి అచలమైన, నిశ్చలమైన పిల్లలను చూసి బాబా మరియు పూర్తి పరివారము హర్షిస్తుంది. అచ్ఛా.

## ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ సంస్థ - సంక్షిప్త పరిచయము

ఒక అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థగా, ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సమాజంలో సకారాత్మక పరివర్తన కోసం పాటుపడుతుంది. ఇందుకోసం సమాజంలోని అన్ని వర్గాలవారికి స్వచ్ఛందంగా తన సేవలను అందిస్తూ ఉంటుంది. ఈ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతుంది. ఈ సంస్థ నేర్పించిన రాజయోగ విధానము మరియు జీవనసిద్ధాంతమును నేర్చుకుని కోట్లాదిమంది తమ జీవితాలలో సకారాత్మకతను పెంపొందించుకున్నారు. ఈ సంస్థ 1937లో స్థాపించబడి, మౌంట్ ఆబూను తన ముఖ్యాలయంగా చేసుకుని ఇప్పుడు 135 దేశాలలో షుమారు 8,500శాఖలతో విస్తరించి ఉంది.

స్థానిక సేవాకేంద్రాలలో రాజయోగము గురించిన కోర్సులు మరియు ప్రసంగాలు ఇవ్వబడతాయి. జీవన విలువలు, స్వశక్తిని అర్థం చేసుకోవడము వంటి అంశాలపై కూడా ప్రసంగాలు ఉంటాయి.

రిజిస్టర్డ్ ఛారిటబుల్ ట్రస్ట్‌గా (ఛారిటీ నం.269971), బ్రహ్మాకుమారీలు కోర్సులను, సెమినార్లను ఉచితంగానే నిర్వహిస్తారు. సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాలతో లాభపడిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భగవంతుని సేవలో తమ వంతు సహకారాన్ని అందిస్తూ ఉంటారు.